శ్రీవైష్ణవ ఆచార నిర్ణయము

పరతత్త్వ నిర్ణయమను మొదటి ప్రకరణము

సమ్య జ్ఞాన స్వరూపము

శ్రీశైలేశ దయాపాత్రం ధీభక్త్యాది గుణార్ణవమ్ ।
యతీంద్ర ప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్ ॥
శ్రీరామానుజ గోపాల కృపాపాత్రం మహామతిమ్ ।
శ్రీమన్నారాయణాభిఖ్య రామానుజయతిం భజే
అస్మద్గురూ న్పరగురూ నఖిలా న్గురూంశ్చ
రామానుజం చ సగురుం శుభ యామునేయమ్ ॥
శ్రీరామమిశ్ర సరసీరుహ నేత్ర నాథాన్ ।
వందే శఠారి గురు సైన్యప మారమేశాన్ ॥
అస్యేశానా జగతే విష్ణుపత్నీ అనియు
వైకుంఠేతు పరే లోకే శ్రియా సార్థం జగత్పతిః అనియు

శ్రుతి స్మృతులు చెప్పినట్లు శ్రియః పతియు శ్రీవైకుంఠ నిలయుడును నిత్యముక్తులచేత ననుభవింప బడుచుండువాడును తనకంటె భిన్నమగు వస్తువులు కంటే విలక్షణమైన జ్ఞానానన్దములే స్వరూపముగా గలవాడునై వేంచేసియుండు సర్వేశ్వరుడు

మాతా పితా భ్రాతా నివాస శ్శరణం సుహృద్గతి ర్నారాయణః అనియు

సర్వేషా మేవ లోకానాం పితా మాతా చ మాధవః అనియుచెప్పినట్లు నిరుపాధికమగు తండ్రియు తల్లియు నగుట వలన అనాదియగు ప్రకృతి సంబంధము చేత తెలివి యుడిగి అట్టి త్రిగుణాత్మక ప్రకృతి సంబంధము నుండి తొలగింపజాలక సదా తాము గూడ నా ప్రకృతిలో సమానముగా జ్ఞాన శూన్యులై పడియుండు జీవులు కండ్లు మొదలు మనస్సు వరకు నుండు కరణములు లేనివారై

ప్రకృతి చక్రస్థ భ్రామ్యమాణే ... విష్ణోః కృపా కాప్యుపజాయతే

అని చెప్పినట్లు సర్వ వ్యాపకుడగుట వలన వారి క్లేశముల నెఱిగి కృపా పరవశుడై తానే వారినొద్దునకు చేర్చి తన శ్రీపాదముల సన్నిధికి చేరుకొనుటకుగాను వారికి కరణ కళేబరముల నిచ్చి లేపును మరియు అందులకు వలయ ప్రమాణ జ్ఞానము ననుగ్రహించును. తత్ఫలమగు కైంకర్య మొనర్చి తరించుటకు అవకాశము కల్పించును. మట్టి గింజలోని మట్టిచెట్టువలెను ఓంకారము లోని ఇతర వాగ్జాలమువలెను ఇమిడియుండునది తదీయ శేషత్వము. అది సిద్ధించినపుడే సమస్త ప్రయోజనములు సిద్ధించును అనియెడి నానుడిని బట్టియు.

వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరః పుమాన్ ।
విష్ణు రారాధ్యతేతేన నాన్య స్తతోష కారకః

అనగా ప్రతివ్యక్తియును తమ తమ వర్ణాశ్రమములకు నియతములైన ఆచార అనుష్టానముల ద్వారా మాత్రమే పరమపురుషుడైన మహావిష్ణువును ఆరాధించవలయునేగాక యింతకు మించి మరేవిధముగా

ఆరాధించినను ఆ మహావిష్ణువు తృప్తి చెందదు. గావున స్వరూపాను రూపమగు వర్ణాశ్రమాచారముల నిష్కర్షమును తెలిసి ఆయన పాదముల నాశ్రయించినచో సుఖింతురు.

శ్రుతి స్మృతీ ఉభే నేత్రే పురాణం హృదయం స్మృతమ్ ।

శ్రుతి-స్మృతి పురాణైశ్చ విప్రాణాం జ్ఞానవర్ధనమ్ ॥

ఏకేన హీనః కాణ స్స్యా స్తస్తా దేతాన్వి లోకయేత్ ।

వేదములు స్మృతులు విప్రునికి నేత్రములు, పురాణములు హృదయము వానిలో శ్రుతినెఱుగనిచో నొకకన్నులేని గ్రుడ్డి వాడగును. శ్రుతి స్మృతులు రెండును నెఱుగనిచో రెండు కండ్లు లేని పూర్తి గ్రుడ్డియగును. పురాణములు నెఱుగనిచో మతిలేనివాడగును అని చెప్పినట్లు వానిని మూడిటిని యెఱిగియుండవలెను, గాన వానిని జీవులను కటాక్షించి పరమపద స్వరూపమును దెలిపి, వారి నందు చేర్చి తాను నిత్య సూరులతో బాటు వారి వలన కైంకర్యమునను విషయమే. శ్రీవైష్ణవాచారము యొక్క నిర్ణయము. దానిని చేతనులు తెలిసికొని వాని నాచరణములో బెట్టుకొనుటయే సమ్య జ్ఞానమని చెప్పబడును.

దేవతాంతర భజన నిషేధము

శ్రీ వైష్ణవుడనువాడు మనోవాక్కాయముల చేత దేవతాంతర సంబంధమును వదలి విష్ణు భక్తుడై యుండు వాడే అని శాస్త్రము చెప్పుచున్నది.

బ్రహ్మాణం శితికంఠం చ యా శ్చాన్యాదేవతా స్మృతాః ।

ప్రతిబుద్ధా న సేవన్తే యస్మా త్పరిమితం ఫలమ్. మహాభారతము

చతుర్ముఖ బ్రహ్మను నీలకంఠుని ఇంకా ననేక దేవతాంతరములను వారిచ్చు ఫలము ఫలవంతమగుట చేత సమ్యజ్ఞాన సంపన్నులగు శ్రీవైష్ణవులు సేవింపరు అనియు

నాన్యం దేవం నమస్కుర్యా న్నాన్యం దేవం ప్రపూజయేత్

నాన్యం దేవం స్మరే నిత్యం విష్ణుపాదాబ్జ సంశ్రయః

విష్ణు భక్తుడగువాడు ఎప్పుడైనను కూడా ఇతరులకు నమస్కరింపరాదు. ఇతర దేవతలను పూజింపరాదు, ఇతర దేవతలను స్మరింపరాదు అని పంచమవేదమని చెప్పబడు భారతసచ్ఛాస్త్రమందు చెప్పబడియున్నది. దీనిని బట్టి శ్రీవైష్ణవులకు కరణత్రయము చేతను దేవతాంతర భజనము నిషిద్ధమని తెలియుచున్నది. సర్వ ప్రమాణములుని విష్ణుపరత్వమునే బోధించుచున్నది. అయితే దీనిపై ఒక శంక కలుగుచున్నది. అదేమనగా రుద్రుడు సర్వసేవ్యుడని నమక చమక ప్రభృతి వేదభాగములో ప్రసిద్ధమై యున్నది. అట్టి రుద్రుడే బ్రహ్మ విష్ణువులకు కారణ భూతుడగుచున్నాడు మరియు

యువాం సంభూత గాత్రేభ్యోః మమ పూర్వం సనాతనౌ ।

అయం మే దక్షిణే పార్శ్వేః బ్రహ్మలోక పితామహః

వామే పార్శ్వే చ మే విష్ణుః ర్విశ్వాత్మా హృదయోద్భవః

అని లైంగ పురాణములో రుద్రుడు బ్రహ్మ విష్ణువులతో మీరిద్దరు నా శరీర భాగముల నుండి పుట్టి సనాతనులని పేరుపడిరి. లోకములకు పితామహుడవగు నో బ్రహ్మ! నీవు నా దక్షిణ పార్శ్వమునుండి పుట్టితివి. విశ్వాత్మయని పేరుపడిన యీ విష్ణువు నాహృదయ వామభాగము నుండి పుట్టెను అని చెప్పినట్లుండెను.

ఇట్లు వేదములో పరతత్త్వముగాను చెప్పబడిన రుద్రుడే సర్వోపాస్యుడుగా నిర్ణయించి ఆ రుద్రుని ఉపాసనములోనే కొందఱు విప్రాదులు నిమగ్నులై యుండగా తన్నమస్కారాలను పరిత్యజించి విష్ణు పాదాశ్రయణము చేయుమని చెప్పుట యెట్లు పొసగును. అని శైవమతస్థుల అభిప్రాయమైనచో, అట్టి నమక చమకములు ఆయా ఘట్టములలో ఆయాకర్మల యొక్క ప్రాశస్త్యమును మాత్రము బోధించుననే గాని అవి పరతత్త్వ నిర్ణాయకములు కాజాలవు. **సర్వే వేదాః యత్పద యామవంతి** అన్ని వేదములు ఎట్టి తత్త్వమును చెప్పుచున్నచో అనియు

వచసాం వాచ్యముత్తమమ్

సమస్త శబ్ద ప్రపంచమునకు నుత్తమ వాచ్య భూతుడు అనియు

వేదైశ్చసర్వై రహ మేవ వేద్యః

వేదాక్షరాణి యావన్తి పఠితాని ద్విజోత్తమైః

తావంతి హరినామాని కీర్తితాని న సంశయః

వేదములన్నిటి చేతను నేనే చెప్పబడుదునను శ్రీకృష్ణ భగవానుని గీతా వాక్యము, వేదమందలి యెన్ని అక్షరములు గలవో అవి యన్నియును హరినామమునే ప్రకాశింపచేయుచున్నవని పురాణవాక్యము చెప్పుచుండుట చేతను పూర్తిగా వేదము శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని చెప్పుట చేత అట్టి శ్రుతి స్మృత్యాదులు దేవతాంతర పరములని చెప్ప వీలు లేదు. అందువలన రుద్ర పరత్వ ప్రతిపాదక ప్రమాణములన్నియు శరీర శరీరి భావ నిబంధనములుగా చెప్పబడినదై

యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధ యార్చితు మిచ్ఛతి

తస్య తస్యాచలాం శ్రద్ధాం తా మేవ విదధా మ్యహమ్

ఎవ్వడెవ్వడేయే శరీరముతో నున్న నన్ను శ్రద్ధతో అర్చింప నిచ్చగించునో వాని వాని కాయా శ్రద్ధనే ప్రోత్సాహపరచెదను. అను గీతా వచనమును దానికనుకూలమగు శ్రుతి స్మృతులను చెప్పెడి విధముగా సర్వాత్మలకు స్వామియై, ధారకుడై, నియామకుడై యుండి సకల సచ్ఛాస్త్రములచేతను ప్రతిపాద్యుడైన నారాయణ కృష్ణాది శబ్దవాచ్యుడగు విష్ణువొక్కడే అయియుండుట చేత ఆనారాయణుని యందే సమస్త వేద శాస్త్రములును విశ్రాంతములగుచున్నవి. కావున ఆయా ఘట్టములలో ఆయాకర్మలకు ప్రాశస్త్యమును తాత్కాలికముగా స్తుతిమాత్ర రూపేణ చెప్పబడిన అర్ధవాద వాక్యములచే పర తత్త్వమును నిర్ణయించుకొనగూడదు.

పురాణ బలాబల విచారణము

అయితే లైంగ పురాణము భారతాదులు కూడ ఋషి ప్రోక్తములే అగుటచేత భారతాది పురాణముల కంటె లైంగపురాణమున ప్రబలమని చెప్పగూడదా? అని శంక కలుగవచ్చును. దానికి సమాధాన మేమనగా

లైంగ పురాణములో నానామ పార్శ్వము నందు విష్ణువు పుట్టె నని తన అతిశయమును చెప్పుకొనిన రుద్రుడే. బ్రహ్మయు నేనును నీ శరీర భాగములందు జన్మించితిమని చెప్పినట్లు భారతాదులలో చెప్పబడుట చేత లైంగాది పురాణములు పైని వివరింపబోవు రీతిని తామసములగుట చేత సాత్త్విక పురాణవచనముల దృష్ట్యా దుర్బలములగుటచేతను, మహాభారతము సాత్త్వికమగుటవలన ప్రబలమగుట చేతను అటు లైంగపురాణమును ప్రాబల్యము చెప్పుటకు వీలుండదు. ఇంకను లైంగ పురాణ వచనము శ్రీ విష్ణువు పురాణములో వలె సామాన్యముగా జగత్కారణ మేది? అను ప్రశ్నకు విశేషరూపమైన ఉత్తరముగా నుండుట కాక లింగ

పురాణ వచనము. లింగరూపుడగు రుద్రునికే అతిశయమును బోధించుటయే తాత్పర్యముగా విశేష ప్రశ్నకు విశేషోత్తర రూపముగా చెప్పబడుట చేత రుద్రపారమ్య వచనము కేవల స్తుతి రూపముగాని యధార్ధము కాదనుటలో సంశయము లేదు. సామాన్య ప్రశ్నకు విశేషోత్తరమనగా చెప్పబడుట చేత రుద్రపారమ్య వచనము కేవల స్తుతిరూపముగాని యధార్ధము కాదనుటలో సంశయము లేదు. సామాన్య ప్రశ్నకు విశేషోత్తరమనగా

సోఽహ మిచ్ఛామి ధర్మజ్ఞ శ్రోతుం త్వత్తో యథా జగత్ ।

బభూవ భూయ శ్చ యధా మహాభాగ భవిష్యతి ।

యన్మయం చ జగ త్సర్వం యత శ్చైత చ్చరాచరమ్ ।

లీన మాసీ ద్యథా యత్రః లయ మేష్యతి యత్ర చః

అనగా ఈ జగత్తంతయు దేనితో నిండియున్నది? దేనివలన నీ చరాచర ప్రపంచము పుట్టినది. ఎందులీనమైనది? తిరిగి యెంస్త్ర లీనము కాగలదు? అని సామాన్యముగా జగ జన్మ స్థితి లయకారణ మెద్ది యని ప్రశ్నము చేయగా

విష్ణోః స్సకాశా దుద్భూతం జగ త్తత్రైవచ స్థితమ్ ।

స్థితి సంయమ కర్తాసౌ జగతోఽస్య జగచ్చసః

అనగా విష్ణువు నుండి పుట్టిన ఈ జగత్తు ఆయన యందే ఆధారపడి యున్నది. జగత్తు యొక్క స్థితికి లయమునకు ఆయనే కర్త. జగత్తు ఆయన స్వరూపమే అను మొదలగు వాక్యముల వలన విశేష వ్యక్త బోధకముగా నుత్తర మిచ్చుట. ఇట్టి యుత్తరము వలన ప్రశ్న చేసిన వారికి కలిగిన జ్ఞానము కూడ నీ విధముగా స్పష్ట పరుపబడెను. ఎట్లనగా

జ్ఞాత మేతన్మయా త్వత్తో యథా సర్వ మిదం జగత్ ।

విష్ణో ర్విష్ణౌ విష్ణుతశ్చ న పరం విద్యతే తతః

అనగా తమ ఉపదేశము వలన నాకు ఈ జగత్తు విష్ణు స్వరూపమనియు విష్ణువు నందే ఆధారపడియున్నదనియు విష్ణువు నుండియే పుట్టుచున్నదనియు అంతకు మించిన కారణ వస్తువు లేదనియు తెలిసినది. అని ఇట్లు సామాన్య ప్రశ్నమునకు విశేషోత్తరమగుట చేతనే ఇట్టి పురాణ వచనములు మాత్రమే యదార్ధమనదగును. ప్రమాణ శ్రేష్టమైన విష్ణు ధర్మము అను గ్రంధమందు

సృష్టిం తతః కరిష్యామి త్వామావిశ్య ప్రజాపతేః

కల్పాంతే రుద్ర మావిశ్య సంహరామి స్వయం ప్రభుః

అనగా ఓ ప్రజాపతీ! జగల్లయానంతరమున నీలో నేను ఆవేశించి ఉండి సృష్టిని చేయుదును. కల్పాంతమందు తిరిగి రుద్రుని యందు ఆవేశించి యుండి జగత్సంహారమును నేనే చేయుదును. అనియున్న విష్ణువు యొక్క వచనమును బట్టి సృష్టి స్థితి లయములు శ్రీవిష్ణు కృతములని తెలియుచున్నది. అందువలన ఇతరపురాణాదులలో చెప్పబడిన దేవతాంతర పారమ్యమును బోధించు వచనములన్నియు యదార్ధములుగావని తేలుచున్నది. కనుకనే గదా! సాక్షాత్తుగా విష్ణు నుద్దేశించి శంకరుడు ఆవాం తవాంగే సంభూతౌ అని యధార్ధమును చెప్పుట కిచ్చగించెను.

రుద్రపారమ్య భ్రమ నిరాకరణము

అట్లయినచో **అహ మేకః ప్రథమమాసమ్ ।**

వర్తామి భవిష్యామి చ నాన్యః క శ్చిన్మత్తోవ్యతిరిక్తః

అనగా నేనొక్కడనే మొదట నుంటిని, ఇప్పుడుంటున్నాను. ఇక మీదను కద నుండబోవుచున్నాను. నా కంటె వేఱుగా నెవ్వడును లేడు. అనెడి రుద్రవాక్యమును,

స నన్న చాస చ్ఛివ ఏవ కేవలః

సృష్టికి పూర్వము సచ్ఛబ్దవాచ్యములగు జీవకోటులు గాని ఆసచ్ఛబ్ధవాచ్యమగు ప్రకృతిగాని లేవు. శివుడు మాత్రమే కలడు అనియు **ఏక ఏవ రుద్రః** రుద్రుడొక్కడే అనియు

సర్వైశ్వర్య సంపన్న శ్శంభు రాకాశ మధ్యే ధ్యేయః

సకలైశ్వర్యములతో గూడిన శంభుడే హృదయాకాశ మధ్యమున ధ్యానింపదగిన వాడు అనియు నుండుటచే శ్రుతులు పురాణ వచనముల కంటె విరోదాధికరణ న్యాయము చేత ప్రబలములనుటచేత రుద్రుడే సర్వోసామ్యడనుటలో నేను కొరత యుండును? అనినచో ఆ శ్రుతి వచనములలో చెప్పబడి యుండును? అనినచో ఆ శ్రుతి వచనములలో చెప్పబడిన దేవతాంతరసారమ్యవచనము ఇంకొక వ్యక్తి లేదని ఆ వాక్యములలోనే చెప్పబడుట చేత ఒకే వస్తువు జగత్తునకు కారణము కాని అనేకములు కావను తాత్పర్యము నిచ్చుచు

జగత్కారణత్వ మేకవస్తుగతమని మాత్రము వచ్చుచున్నది. కాబట్టి వాని వలన రుద్రపారమ్యము బోధింపబడదు.

ఆ శ్రుతి వాక్యములో **అహమ్ అని రుద్రుడు** చెప్పినది.

మత్త స్సర్వ మహం సర్వమహం విష్ణు స్సనాతనః

అని ప్రహ్లాదుడు సర్వము భగవదాత్మకమను భావముతో నా వలననే ప్రపంచము పుట్టెను. నేనే ప్రపంచమును, నేనే సనాతనుడను విష్ణువును. అని చెప్పిన రీతి నున్నదని తెలియవలెను. కాబట్టి రుద్రపారమ్యము దాని వలన బోధింపబడు ననుట అజ్ఞానకృతమే అగును.

ఇక న సన్న చాసత్ ఇత్యాది శ్రుతిలో రుద్రుడే ఉపాస్య వస్తువుగా చెప్పబడే జనులలో

అవాం తవారాణ్ సంభూతౌ ఇత్యాది రుద్రవచనమును.

నారాయణః పరం బ్రహ్మ అను మొదలగు విశేష శ్రుతిత్వము చెప్పవలసియున్నది అని తెలియవలెను. ఉపాస్య వస్తువుగా చెప్పబడే ననుటలో

ఆవాం తవాం సంభూతౌ ఇత్యాది రుద్ర వచనమును.

నారాయణః పరం బ్రహ్మ అను మొదలగు విశేష శ్రుతియు విరోధించును.

కాబట్టి వెనుక చెప్పబడిన శ్రుతులకు రుద్రపారమ్యములో తాత్పర్యముండదు. సామాన్య విశేష న్యాయము చేత శివ శంభు శబ్దములకు యౌగికముగా నారాయణార్థ పర్యవసానము చెప్ప వీలుండుట చేతను నారాయణ శబ్దమున కట్టి యౌగికార్థము చెప్పుటకు వీలు లేకుండుట చేతను **నారాయణః పరం బ్రహ్మ** అను శ్రుతికి విశేష శ్రుతిత్వము చెప్పవలసియున్నది అని తెలియవలెను.

సింహావలోకనము

శ్రీవైష్ణవ సిద్ధాంతము శైవ సిద్ధాంతము వలెనే దేవతాంతర పారమ్యమును నిరసించునది యనునట్టియు తత్రాపి రుద్ర పరత్వమును సుతరాము సహింపదనునట్టియు సామాన్య లోకనిందను బాపుటకు వెనుకటి దేవతాంతర భజన నిషేధము అను శీర్షిక మొదలుకొని ఇంతవరకు సమాధానరపముగా నిరూపింపబడెను. వేదప్రామాణ్యము నొప్పిన యే సిద్ధాంతకారులును బ్రహ్మ స్వరప విషయములో మతభేదమున్నను పరతత్త్వమును చెప్పియుండలేదు. అని పై గ్రంధము వలన స్పష్టపడగలదు.

అదియును గాక **శ్రీవైష్ణవాసిద్ధాన్త ప్రవర్తకులగు ఆళ్వార్లను ఎంబెరుమానార్లు** (రామానుజులు మొదలైన మత నిర్వాహకులును శ్రీవిష్ణువే పరతత్త్వ మనియును, అతడే జగత్కారణుడనియును మోక్షప్రదుడనియును ఇతర దేవతలు అతని శరీరభూతులై పరిమితాధికారమును పరిమిత ఫలదాయిత్వమును కలవారనియు ఘంటాపదముగా చెప్పియుండిరి. అదియును గాక పరదేవతారాథము సద్వారకమనియు అద్వారకమనియు రెండు విధములు. సాక్షాత్తుగా పరబ్రహ్మము నారాధించుట ఆ ద్వారకమనబడును. దేవతాంతర శరీరకునిగా నారాధించుట సద్వారక మనబడును.

శ్రీవైష్ణవ సిద్ధాంతములో సాక్షాత్తు పరబ్రహ్మము నారాయణుడే అనియు మిగిలిన బ్రహ్మ రుద్రేందాదులాయణ శరీర భూతులనియు ఆయనకు శేషభూతులనియు నిరపింపబడి దానికి ప్రమాణములుగా శ్రుతి స్మృతి పురాణేతిహాసాదులను కనబరచి సిద్ధాంతీకరింపబడినది.

కాబట్టి **ప్రతిబుద్ధా స సేవంతేః యస్మాత్పరిమిత్ ఫలమ్**

అని చెప్పినట్లు బ్రహ్మ యాథార్థ్యము నెఱిగినవారు పరిమిత ఫలప్రదాశక్తి గల దేవతాంతర శరీరయగు పరబ్రహ్మమును సద్వారకముగా నారాధింపక **సకల ఫలప్రదో హి విష్ణుః** అనురీతిని సకల ఫలప్రదమగు శ్రీమన్నారాయణునే ఆ ద్వారకముగా నారాధింతురనునది పూర్తిగా యుక్తియుక్తమై యున్నది.

వేద ప్రామాణ్య నిరూపణము

ఒకరు జగత్తునకు ప్రాప్య వస్తువగునప్పుడు అతని స్వరూపాదులు ప్రమాణ ప్రసిద్ధములై యుండవలెను. జగదుపాప్యమగు వస్తువు ప్రత్యక్షాదిప్రమాణములకు గోచరింపదు. గాన శబ్ద ప్రమాణమే అందు శరణ్యము. అట్టి శబ్ద ప్రమాణములలో ఆగమాది తంత్ర గ్రంధములు పురుష నిర్మతములగుట చేత భ్రమ విప్రలంభాది దోష జుష్టముల కాబోవును. అందువలన నిర్ధుష్టమై అపౌరుషేయమని వేదవ్యాసాది ఋషుల చేత నిరూపింపబడినట్టియు, భ్రమ విప్రలంభాది దోష శూన్యమగు నట్టియు సకల విద్యామలమగునట్టియు సాత్విక పురాణేతిహాసాద్యుపబృంహితమై నట్టియు వేదాఖ్య ప్రమాణమునే ఉత్కృష్ట ప్రమాణముగా స్వీకరింపవలసి యున్నది.

పురాణములలో సాత్వికాది విచారము

వేదోపబృంహణరూపములైన పురాణములను రాజసములనియు సాత్వికములనియు తామసములనియు సంకీర్ణములనియు నాలుగు విధములుగా విభజించి మత్స్యపురాణమును ఈక్రింది విధముగా చెప్పబడెను.

యస్మి స్కల్పేతు యత్ప్రోక్తం పురాణం బ్రహ్మణా పురా ।

తస్య తస్యతు మాహాత్మ్యం తత్స్వరూపేణ వర్ణ్యతే ।

అగ్నే శ్శివస్య మాహాత్మ్యం తామసేషు ప్రకీర్తితమ్

సంకీర్ణేషు సరస్వత్యాః పితౄణాం చ నిగద్యతే ।

రాజసేషు చ మాహాత్మ్య మధికం బ్రహ్మణో విదుః

సాత్వికే ష్వథకల్పేషు మాహాత్మ్యమధికం హరేః

తేష్వేవ యోగసం సిద్ధాః గమిష్యంతి పరాం గతిమ్

అనగా చతుర్ముఖ బ్రహ్మ కూడ ప్రకృతి బద్ధుడే కాబట్టి ఒక్కొక్క కల్పములో నప్పటి తవ రజస్తమ స్సత్వముల యొక్క ప్రత్యేకోద్రేక స్థితి వలనను మూడింటి సాంకర్యస్థితి వలనను తత్తదనుగుణముగా పురాణములను రచించి ఋషుల కుపదేశింపగా వారు లోకములో నాయా పురాణములను ప్రకటించిరి.

అందు తమోగుణోద్రేక స్థితిలో బ్రహ్మకల్పించిన పురాణములలో అగ్ని యొక్కయు శివుని యొక్కయు శివుని యొక్కయు మాహాత్మ్యము చెప్పబడెను. త్రిగుణసాంకర్య స్థితిలో చెప్పబడిన వారిలో సరస్వతి యొక్కయు పితృ దేవతల యొక్కయు గొప్పతనము చెప్పబడెను. రజోగుణోద్రేక స్థితిలో చెప్పబడిన వానిలో బ్రహ్మ (తన) యొక్క గొప్పతనము చెప్పబడెను.

సత్యగుణోద్రేక స్థితిలో చెప్పబడిన వానిలో శ్రీహరి యొక్క గొప్పతనము అధికముగా చెప్పబడెను. సత్వ గుణోద్రేక స్థితిలో చెప్పబడిన వానిలో శ్రీహరి యొక్క గొప్ప తనము అధికముగా చెప్పబడెను. అట్టి సత్వ గుణోద్రేక స్థితిలో చెప్పబడిన పురాణములందే ప్రావిణ్య బుద్ధి కలిగిన వారే యోగసంసిద్ధులగుచున్నారు. అట్టి వారే ఉత్తమగతిని పొందగలరు. అని చెప్పిన వచనములను బట్టి పురాణములకు సాత్వికాదిభేదము సుస్పష్టమగుచున్నది. అందువలన సాత్వికములగు నుత్తమ పురాణముల చేత నుపబృంహితమై (స్పష్టముగ వివరించబడి) తత్త్వము హితము పురుషార్ధముల అను వానిని బోధించు వేదమే అసాధారణ విశిష్ట వస్తువునుపాస్యముగా బోధింపగలదనుట నిర్వివాదాంశము.

తత్త్వబోధ యనగా నారాయణః పరం బ్రహ్మ తత్త్వం నారాయణః పరః

నారాయణుడే పరబ్రహ్మము. నిశ్చితమగు ఉపాస్య తత్త్వ మాతడే అనెడి శ్రుతి వాక్యమును దాని కుపబృంహణరూపమగు

తమసః పరమో ధాతా శంఖ చక్ర గదాధరః

తమో మిశ్రమగు ప్రకృతి కతీతుడై జగత్కారణమై శంఖ చక్ర గదాధాయయుధ విశిష్టమైన వాడు నారాయణుడు అను పురాణ వచనము చెప్పినరీతిని శ్రియః పతి యొక్కడే తత్త్వము అని తెలియుటే.

హితబోధయనగా నాన్యః పందా అయనాయ విద్మహే

అని చెప్పబడిన శ్రుతి వలన పైన చెప్పబడిన పరతత్త్వ భజనమే హితము (ఉపాయము) అని తెలియుటయే.

పురుషార్ధబోధ యనగా యేన యేన ధాతా గచ్ఛతి తేన తేన సహ గచ్ఛితి

అనగా పరమకారణుడగు పరబ్రహ్మ యేయే ఆనందము ననుభవింపుచు వర్తించునో ఆయా ఆనందమునే మక్తాత్మ బ్రహ్మతో సమముగా అనుభవించునని భగవన్ముఖోల్లాస హేతువగు తత్కైంకర్యమే కోరదగినదని తెలియుటే.

వేదములకు త్రైగుణ్య విషయత్వము

వేదములు పరమప్రమాణములయినచో ఆ వేదములలో ఐశ్వర్య కైవల్యరూపములగు ఆర్వాచీన ఫలములను వాని సాధనములను చెప్పు వాక్యములు గూడ ననేకములున్నవే. అదియెట్లు పొసగును? అనినచో లోకములో

"జాయమానం హి పురుషం యం పశ్యే న్మధుసూదనః

" సాత్విక స్సతు విజ్ఞేయ స్స వై మోక్షార్థచింతకః " అనియు

"పశ్య త్యేనంజాయ మానం బ్రహ్మ రుద్రో ఽ అథవా పునః

అనియు చెప్పిన రీతిని మనుజుల జన్మకాలమున శ్రియఃపతి కటాక్షము సోకినందు వలన సాత్విక ప్రకృతి గలవారుగను, బ్రహ్మ యొక్క గాని రుద్రుని యొక్క గాని కటాక్షము పడినందు వలన రాజస తామస ప్రకృతులు కలవారుగను జన్మింతురు. వేదములు సకల పురుషార్థనాయా పురుషానుకూల ఫలాదులను చెప్పుట విరుద్ధము కాదు. వేదమట్లు త్రిగుణ ప్రకృతుల కనుకూలముగా భోదింపుచున్నను అందు సాత్వికులగు ముముక్షువులు తన కనుకూలమగు విషయమునే గ్రహించి మిగిలిన వానిని విడువ వలెను. ఈ విషయమే గీతలలో

త్రైగుణ్య విషయా వేదాని స్త్రైగుణ్యో భవార్జున అనియు

యావా నర్థి ఉదపానే సర్వత స్సంప్లుతోదకే ।

తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య నిజానతః

అనియు చెప్పబడెను. అనగా త్రిగుణ ప్రకృతులుగను అందరు జనులకు అనుకూల ఫలాదులు వేదములు బోధింపుచుండినను అదృష్టవశమున సాత్విక ప్రకృతులుగా జనించిన వారై మోక్షేచ్ఛ గలవారు తటాకములో పరిపూర్ణమైన జలముండినను తనకవసరమగు జలమును మాత్రమే జనుడు గ్రహించునట్లు పరమార్ధమగు మోక్షమును తత్సాధనములను మాత్రమే పరిగ్రహించి మిగిలినవానిని విడువవలెను. అని భావము.

వేదములందు భాగద్వయము

ఆ వేదము పూర్వభాగము – ఉత్తర భాగము అని రెండు విభాగములుగ నున్నది. పూర్వభాగము జగచ్ఛరీరియగు పరమాత్మ యొక్క స్వరూప రూప గుణ విభూతులను విశదముగా జెప్పి అట్టి అసాధారణ స్వరూపము గల పరమాత్మను అద్వారకముగా నారాధించు విధముగా బోధింపుచున్నది.

ఇట్టి వేదము చేత ముఖ్యముగా ప్రతిపాదింపబడుపర స్తువునకు లక్షణము.

యతో వా ఇమాని భూతాని జాయంతే .... తద్విజిజ్ఞానస్వ తద్బ్రహ్మ

అను శ్రుతి వాక్యములో జగజ్జన్మాది కారణత్వముగా చెప్పబడెను. అట్టి జగజ్జన్మాది కారణమైన వస్తువే **కారణం తు ధ్యేయః** అని ఉపాస్యవస్తువని నిర్ణయింపబడెను అట్టి ధ్యేయమగు బ్రహ్మము.

సదేవ సోమ్యేన మగ్ర ఆసీత్

అనెడి శ్రుతులలో సత్ – బ్రహ్మ ఆత్మ అను సామాన్య శబ్దములతో చెప్పబడి, తుదకు నిస్సంశయముగా **ఏకో హ వై నారాయణ ఆసీన్న బ్రహ్మ నేశానః**

అని విశేషించి సృష్ట్యాదిలో బ్రహ్మాదులు లేరనియు నారాయణుడు మాత్రమే ఉన్నాడనియు చెప్పబడుట చేత నారాయణ శబ్దమమందే సత్ - బ్రహ్మ - ఆత్మాది శబ్దములకు పర్యవసానము చెప్పబడుట చేతను ఇంకను కారణ వస్తు బోధకములుగా చెప్పబడు శివ-రుద్ర-ఇంద్ర- ప్రాణ - ఆకాశాది శబ్దములు గూడ ఆ నారాయణ శబ్దము నందే పర్యవసితము లనుట చేతనూ, నారాయణుడే అని సిద్ధించుచున్నది.

అందుకు ఉపపత్తి నారాయణ శబ్దము కూడ శివ, రుద్ర, ఇంద్రాది శబ్దముల వలెనే సామాన్య వాచక శబ్దముగా చెప్పి వానిలో నొక శబ్దముచే ప్రధానముగా చెప్పరాదా? అనినచో అటు చెప్ప వీలు లేదు. ఏమనగా,

ఏకో హ వై నారాయణ ఆసీత్ న బ్రహ్మ నేశానః

అని అన్వయ వ్యతిరేకములతో నీ శ్రుతి నారాయణుడుండినట్లును, బ్రహ్మాదులు లేనట్లును, ప్రతిపాదించుట చేతను,

నారాయణా ద్బ్రహ్మా జాయతే, నారాయణ రుద్రో జాయతే

అని బ్రహ్మ రుద్రాదులు సృచ్య వర్గముగాను నారాయణుడే స్రష్టగాను, చెప్పబడియుండుట చేతను, నారాయణుడట్లు సృజ్యవర్గములో నుండెనని పరిగణించి చెప్పెడి శ్రుతి ఎచ్చటనూ కూడ లేనందుచేతను, మిగిలిన ఇంద్ర ప్రాణాది శబ్దములకు నారాయణ శబ్దమందే పర్యవసానము బ్రహ్మసూత్ర సమ్మతమగుట చేతను, శివ రుద్రాది శబ్దములకు గూడ నారాయణ శబ్దమందే పర్యవసానము చెప్పవలెను. ఇంకను నారాయణ శబ్దము పంకజాది శబ్దముల వలె యోగరూఢ శబ్దముగానుండి సర్వశబ్ద వాద్యుడగు శ్రియః పతినే బోధించు నామమగుటచే **రూఢి ర్యోగాద్బలీయసీ, రూఢి ర్యోగమపహరతి** అను న్యాయము వలన కేవల మౌఖిక పదములకు ఇంద్ర, రుద్ర, ప్రాణాది పదములకు యోగ రూఢమగు కాత్యాయనీ పదమువలె, ఏకవస్తు సంజ్ఞా శబ్దములుగా నుండు యోగ్యత లేదు. ఎట్లనగా, పంకజ శబ్దము, పంకేజాయతే అను యౌగికార్థము కలదైనను, పద్మమందే విశేషించి రూఢియుండుటచేత పంకమందు బుట్టువాడు మొదలగు వానిని చెప్పక రూఢ్యర్థమగు పద్మమును మాత్రమే చెప్పును కదా! మఱియు వ్యాకరణ మర్యాదననుసరించి సమానపదమగు నట్టి నారాయణ పదములో నార-ఆయన అని రెండు పదము లిమిడి యున్నవి. ఈ పదము చేత ఏదేని యొక నిర్దిష్టవ్యక్తిని మాత్రమే బోధనను సంజ్ఞాపదమగునప్పుడే ఆయన పదములో నుండు న కారమునకు **పూర్వపదా త్సంజ్ఞా యామగః** అను సూత్రము చేత 'ణ' త్వమునచ్చును, లేనప్పుడు కేవల నకారము యౌగికార్థమునే చెప్పినచో ణత్వమురాదు నకారముగా నేయుండును. అందువలన నారాయణుడు యొక పురుషోత్తమునే చెప్పుచున్నది. మిగిలిన శబ్దములన్నియును కూడ యోగికార్థము చేత నారాయణుని చెప్పగలవు.

ఇతిహాస సమ్మతి

వేదమున కుపబృంహణమై పంచమ వేద మని ప్రసిద్ధి నందిన భారతేతిహాసము నందు యుధిష్ఠిరుడు భీష్ముని పరతత్త్వమేది యని ప్రశ్న మొనర్చు సందర్భములో కి మేకం దైవతం లోకే అనియు **కో ధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమః** అనియు సామాన్య ప్రశ్న రూపముగా నడుగగా

జగత్ప్రభుం దేవదేవ మనంతం పురుషోత్తమమ్ అని ప్రారంభించి

అనాది నిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరమ్

అని విశేషించి విష్ణు పురుషోత్తమాది శబ్దవాచ్యుడగు నారాయణుడే పరతత్వమని భీష్ముడు విశేషోత్తర రూపముగా సమాధాన మిచ్చెను. మహాభారతోక్త విష్ణు సహస్రనామాధ్యాయములో నారాయణ శబ్ద పర్యాయములుగా ఈశ్వర, ఈశ, ఈశాన, శివ, శంభు, శంకరాది యౌగిక పదములన్నియును చెప్పబడెను. ఇంకను

వేదాక్షరాణి యావన్తి పఠితాని ద్విజాతిభిః ।

తావంతి హరినామాని కీర్తితాని న సంశయః

సర్వే వేదా స్సర్వ వేద్యా స్సశాస్త్రా స్సర్వే యజ్ఞా సర్వఇజ్యాశ్చ కృష్ణః ... విధుః

కృష్ణం బ్రాహ్మణాస్త త్వతోయే తేషాం రాజ స్సర్వ యజ్ఞాః సమాప్తాః

ఇత్యాది పురుషోత్తమ పరత్వబోధకములగు వేద వేదాంత వేద్య వాక్యముల చేతను

వేదైశ్చ సర్వై రహమేవ వేద్య

అను శ్రీకృష్ణ గీతావచనము చేతను పరతత్వముగా నారాయణుడు నిరూపింప బడుట వలన నారాయణ పదము శ్రీహరియగు పరతత్త్వమునే బోధించునని స్పష్టము.

భగవదవతారముల కైచ్చికత్వము

అట్లయినచో **బ్రహ్మ, విష్ణు, రుద్రేంద్రాస్తే సంప్రమాయంతే** అను వాక్యము చేత బ్రహ్మాదులకు వలె విష్ణువునకును జన్మముండినట్లు తెలియుచున్నదే! దాని వలన విష్ణువునకు గూడ బ్రహ్మ రుద్రాది సామ్యము సిద్ధించుచున్నదే! అనినచో బ్రహ్మ రుద్రాదుల జన్మమునకును విష్ణువు యొక్క జన్మమునకు భేదము కలదు. బ్రహ్మాండాంతర్వర్తి వ్యక్తులందఱికిని

అబ్రహస్తంబ పర్యన్తం జగదంతర్వ్యవస్థితా

ప్రాణినః కర్మ జన సంసార వశ వర్తినః

అని చెప్పబడినట్లు కర్మ నిమిత్త జన్మన సిద్ధము. నారాయణుడు సర్వాండములకు ఆధారమైయుండుట చేత నాతనికి కర్మ వశ్యత లేదు. కాన ఆయన యొక్క అవతారములు స్వేచ్ఛ చేతనే చేయబడినవి మాత్రమే యగును. అందువలన విష్ణుపారమ్యమునకు కొరతరాదు.

భగవంతుడు స్వయముగా గీతలలో **జన్మ కర్మచ మే దివ్యమ్**

అని భగవదవతారమునకు వైలక్ష్యము చెప్పియుండెను. ఇంక సుశ్రుతులలో గూడ

అజాయమానో బహుథా విజాయతే

అనగా జగత్కారణమగువాడు. పుట్టుక లేని వాడైననూ అనేక విధములుగా జనించునని పరస్పర విరుద్ధ ధర్మములతో గూడినట్లు చెప్పుట, కర్మ నిమిత్త జన్మము లేని వాడై నను ఇచ్ఛాధీన జన్మలను పొందునని బోధించుటకే అయి యున్నది.

ఈ విషయమే గీతలో అవతార రహస్యమును చెప్పు సందర్భమున **పరిత్రాణాయ సాధూనాం** అని యారంభించి **సంభవామ్యాత్మ మాయయా** అని వివరింపబడెను.

ఇచ్చట మాయయా అను దానికి మాయావయుసం జ్ఞానమ్ అను **వేద నిఘంటు** వలన జ్ఞానమర్థమనియు నదియే సంకల్పమును ఇచ్ఛారూపమనియు **శ్రీయెంబెరుమానార్లు తమ భాష్యములో** సాయించి యుండిరి.

కాబట్టి భగవదవతారములు ఐచ్ఛికములని యెఱుంగవలెను. ఇంకనూ బ్రహ్మ, రుద్రులతో సమానముగా జన్మించినది. **న హి పాలన సామర్థ్య మృతే సర్వేశ్వరం హరిమ్** అని చెప్పినట్లు అనన్య సాధ్యమగు పాలనము తనకే చెల్లును గాన వారితో బాటు ఐచ్ఛికముగా సర్వవ్యాపియగు విష్ణువుగా నవతరించెను.

ఈ విషయమునే **మధ్యే విరిఞ్చి గిరిశం ప్రథమావతారః అని శ్రీభట్టరు** సాయించిరి. అందువలన బ్రహ్మ రుద్రులతో లోకములో నైచ్చికముహా అవతరించుననునది సిద్ధమగును, గాన విష్ణు సారమ్యమున భంగము రాదు.

ఇంకను రుద్రమహాత్మ్యమును తెలుపు లైంగిక పురాణములో గూడ ద్వితీయాధ్యాయములో

సర్వావస్థాసు విష్ణో ర్వైజననం స్వచ్ఛయైన తుల అనియు

లీలయా చైవ కృష్ణస్య స్వకులస్య చ సంసృతిః

జరకాస్త్రచ్ఛలేనైవ స్వేచ్ఛ యో గమనం హరేః । అనియు

ద్విజశాపచ్ఛలేనైవ మమ తీర్ణో ఽపి లీలయా

అనియు భగవదవతారమైచ్ఛికమై లీలార్థము జరుగుచుండునని చెప్పబడెను.

భగవదవతారములకు జగద్రక్షణ ప్రయోజనకత్వము **పంచమ వేదమగు మహాభారతములో సంభవ పర్వమందు అర్జునుని గురించి ద్రోణాచార్యులు** చెప్పిన వాక్యములో

ఏకస్తవాధికో లోకే యో హి వృష్ణి కులోద్భవః అని మొదలుకొని

ప్రాదుర్భవతి ధర్మాత్మా పాలనార్థంస్వలీలయా

అని జగత్పాలనము కొఱకు లీలగా భగవంతుడు అవతరించుచుందునని చెప్పబడెను.

పరమ ఋషుల భగవతత్త్వ ప్రతిజ్ఞ శ్రుతి స్మృతి పురాణ విద గ్రేసకులగు వ్యాస పరాశర శుక ప్రభృతి పరమమహర్షులలో

సత్యం సత్యం పున స్సత్య ముద్ధృత్య భుజ ముచ్యతే

వేదశాస్త్రా త్పరం నాస్తి న చైవం కేశవాత్పరమ్ అని వ్యాసుడును,

విష్ణు గ్రసిష్ణుం విశ్వస్యః స్థితిసర్గే తథా ప్రభుమ్ ప్రణమ్య జగతా

పరమఋషుల భగవత్పరత్వ ప్రతిజ్ఞ

శ్రుతి స్మృతీతిహాసపురాణవిద గ్రేసరులగు వ్యాస పరాశర శుక ప్రభృతి పరమమహర్షులలో

సత్యం సత్యం పున స్సత్య ముద్ధృత్య భుజ ముచ్యతే ।

వేద శాస్త్రా త్పరం నాస్తి న చైవం కేశవాత్పరమ్ అని వ్యాసుడును

విష్ణు గ్రసిష్ణుం విశ్వస్యః స్థితిసర్గే తథా ప్రభుమ్ ।

ప్రణమ్య జగతా మీశం అజన్మ క్షయ మీశ్వరమ్ అని పరాశరుండును

కిన్తు శ్రీ మద్భువభవనస్థిత్యభావైక హేతో ।

ర్లక్ష్మీభర్తు ర్నరహరితనోర్ధాదాసస్య దాసః అని శ్రీశుకుడును

ప్రతిజ్ఞాపూర్వకముగా విష్ణు పరత్వమును చెప్పియుండిరి. ఇంకను ఇతిహాస సముచ్చయములో చెప్పబడిన

విష్ణుం బ్రహ్మణ్యదేవేశం సర్వదేవ నమస్కృతమ్ అని మొదలుకొని

విహాయ యో భజేదవ్యం బిస సైన్యం కరోతి సః అను వరకునుండు వచనములను బట్టి సప్తర్షులు తమలో తాము శపథ పూర్వకముగా పరబ్రహ్మ స్వరూపుడును, ఇతర దేవతలకును సేవ్యుడును, అగు విష్ణువును వదలి ఎవడు ఇతర దేవతలను భజించునో వాడు వికసిత పద్మములుండగా తామరతూడులను దొంగిలించు వాని వంటి వాడని చెప్పియుంటిరి.

భగవద్భాక్తా భక్తుల ఉత్కర్షాకర్షములు

విష్ణు పాదాశ్రయులగు భగవద్భక్తులను తద్విముఖులైన వారికిని గల తారతమ్యమును గూర్చి ఇతిహాస సముచ్చయములో

యే భజన్తిచ జగద్యోనిం వాసుదేవం జనార్ధనమ్ ।

న తేభ్యో విద్యతే తీర్థ మధికం రాజసత్తమ ॥

అనగా జగత్కారణ భూతుడు నట్టియు విరోధి నిరసన శీలుడై నట్టియు, వాసుదేవుని భజించు వారికంటె పుణ్యతీర్థము ఇంకొకటి మించినది లేదని భావము అట్లే

మాతృవ త్పరిరక్షంతం సృష్టి సంహార కారకమ్ ।

యో నార్చయతి పాపాత్మా తం విశ్వ ద్బహ్మ ఘాతుకమ్ ॥

తల్లి వలె సంరక్షించు జగజ్జన్మాది కారణ భూతుడగు హరిని ఎవ్వడర్చింపడో అట్టివాడు బ్రహ్మహత్యా పాతకమును చేసిన వాడుగా దెలియ వలె ననియు చెప్పియుండుట చేత విష్ణు భక్తుల ఉత్కర్షయు తద్విముఖుల అపకర్షణమును స్పష్టమగుచున్నది.

వేదాద్యంతములలో ప్రణవోచ్చారణాది ఫలము

ప్రణవ ప్రతిపాద్యుడు, విష్ణు మహేశ్వర నారాయణాది దివ్యనామములు గలవాడును, సర్వశబ్ద వాచ్యుడునునగు హరియే వేదాధ్యయనమునకు ఆద్యంతముల యందు కీర్తంపబడుచున్నాడు.

సమస్త వేదముల యొక్క సర్వశాఖలను అధ్యయనము చేయునప్పుడు, ఆద్యంతములలో **హరిః ఓమ్** అని ప్రణవవిశిష్టమగు హరినామ స్మరణ చేయబడుట అన్ని దేశములలోను సర్వసమ్మతమైన ఆచారము. ఈ ఆచారము నిష్ప్రమాణకము కాజాలదు. ఈ విషయమునే

యద్వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాన్తే చ ప్రతిష్ఠితః ।

తస్య ప్రకృతిలీ నస్య యః పరః స మహేశ్వరః

అను శ్రుతి వచనము బోధింపుచున్నది. అందుకే **సర్వ వేదమయో విష్ణుః** అని చెప్పబడెను.

ఇట్టి విశేష కారణములను బట్టి జగత్కారణభూతుడై సర్వదేవ సేవ్యుడగు వాడు శ్రియః పతియే అని నిశ్చయమగు చున్నది.

మోహక శాస్త్రోత్పత్తి ప్రయోజనము

సాక్షాన్నారాయణో దేవః కృత్వా మర్త్యయీం తనుమ్ అని చెప్పినరీతిని సాక్షాన్నారాయణావతారమైన శ్రీకృష్ణ భగవానుడు, కైలాసయాత్ర రుద్ర స్తోత్రప్రణామాది కృత్యములను చేయుటయు,

త్వం చ రుద్ర మహాబాహో మోహశాస్త్రాణి కారయ అని విష్ణువు రుద్రుని నియమించుటయు అనునది లోకమోహనము కొఱకును, సర్వముక్తి ప్రసంగము రాకుండుటకును శ్రుతి స్మృతి మమైవాజ్ఞ అని చెప్పినట్లు

స్వాజ్ఞారూపమగు శ్రుతి స్మృతులకు నైష్ఫల్యము రాకుండ తదతిలంఘన మొనర్చు జనులు గూడ లోకములో నుండుటకును అయి యున్నదని తెలియవలెను. దీని వలన అట్టి మోహన శాస్త్రములు పుట్టుకకును వాని ప్రచారము కలుగుటకును, భగవంతుడే కారణభూతుడగుచున్నాడని స్పష్టము. మరియు

త్వం చ రుద్ర మహాభాగ । మోహ శాస్త్రాణి కారయ

అల్పాయాసం దర్శయిత్వా ఫలం శీఘ్రం ప్రదర్శయ అను వారాహ పురాణ వచనమును,

ఏవం సంచోదితో రుద్రో మోహశాస్త్రాణ్యకారయత్ " అను కూర్మ పురాణ వచనమును ఈ విషయమును బలపరచుచున్నది. అనగా స్వల్పాయాస సాధ్యఫలములను కనబరచి ఇతర దేవతా తారమ్యమును తదారాధన ప్రకారము భోదించు మోహశాస్త్రములను నిర్మింపుమని విష్ణువే రుద్రున కాదేశింప ననియూ భగవన్నియమానానుసారమే బట్టిశాస్త్రములు పుట్టెననియూ తెలియుచున్నది.

మోహక శాస్త్రోత్పత్తి ప్రయోజనానంతరము

సాత్వికులకు దేవతలయందు పక్షపాతియగు భగవంతుస్ర, రాజస, తామస, ప్రకృతులగు అసుర రాక్షసులను మోహింపజేసి శిక్షించుటకు అట్టి మోహకశాస్త్రములను పుట్టించెను. ఈ విషయము పద్మ పురాణోత్తర ఖండాదులయందు స్పష్టము ఎట్లనగా,

దేవతానాం హితార్థాయ వృత్తిః పాషణ్డినాం శుభే:

కపాల కేశ భస్మాది ధారణం తు మయాకృతమ్ అని మొదలుకొని

ఏవం దేవహితార్థాయ వృత్తిం వేదనిగర్హితాం ।

విష్ణోః రాజ్ఞాం పురస్కృత్యః కృత్య భస్మాస్థి ధారణమ్ ।

బాహ్యా చిహ్నా మిదం దేవి మోహనార్థ సురద్విషామ్

అనగా పార్వతితో తన బాహ్య వేషమును సమర్థించుచు రుద్రుడు, దేవతల హితము కొఱకును, దేవ శత్రువులను మోహింపజేయుటకును, మోహశాస్త్రములను సృజించియు. అందు చెప్పబడిన రీతిని కపాల, జటా, భస్మాస్థి వరణ రపమగు బాహ్య చిహ్నములను నేను గూడ ధరించియుంటినని చెప్పెను. అందువలన కృష్ణావతారములలో కృష్ణుడు తాను గూడ రుద్రునకు నమస్కరించి స్తోత్రాదులను చేయుటయు లోక మోహనము కొఱకే అని తెలియదగును.

సర్వ విష్ణువకు రుద్రోపదేశ ప్రకారము

పంచమ వేద మనబడు మహాభారతములో సత్వ గుణ నిష్ఠులగు మహర్షులకు గూర్చి రుద్రుని చేత మీకు అనిష్ట నివృత్తి పూర్వకముగా ఇష్ట ప్రాపణ రూప రక్షణమును జేయు వాడు శ్రియః పతి యొక్కండే అని యుపదేశింపబడెను. అందు **హరివంశమునందు ఉత్తర భాగమునందు ఆరువదియవ అధ్యాయములో రుద్రవచన** మట్లున్నది.

హరి రేక స్సదా ధ్యేయో భవద్భిస్సత్వ శ్రీవిష్ణు ధర్మములో

సంస్థితైః ఓ మిత్యేవ సదా విప్రాః పఠధ్వం ధ్యాత కేశవమ్ ।

తతోవః శ్రేయసః ప్రాప్తి ర్భవిష్యతి న సంశయః

ఏవం ధ్యాతో హరి స్సాక్షా త్ప్రసన్నో నో భవిష్యతి ।

భవనాశ మయం దేవః కరిష్యతి న సంశయః

అనగా రుద్రుడు హరి యొక్కడే సత్వ నిష్ఠులగు మీకు ఎల్లప్పుడు సేవింపదగిన వాడు. మీరు ఓం అను ప్రణవము నుచ్చరింపుచు మనస్సునందు కేశవుని ధ్యానింపుడు. అందుచే మీకు శ్రేయస్సు కలుగును. ఇది నిశ్చయము. ఇట్లు మీచేత ధ్యానింపబడిన శ్రీహరి మీకు ప్రసన్నుడై జన్మ రాహిత్య పూర్వక మోక్షమును కటాక్షించును. సంశయము లేదు అని ఋషుల కుపదేశించినట్లున్నది.

కాన ప్రణవ ప్రతి పాద్యుడగు శ్రీహరి స్వాశ్రిత విరోధి నిరసన పూర్వక ఫలప్రదాతను సమర్థుడు నుపాస్య వస్తువని తేలుచున్నది. ఇక రుద్రుడు మోహకశాస్త్రములను ఉపదేశించి రజస్తమః ప్రచురులను మోహింప జేసినను భగవత్సంకల్పాధీనముగా తద్విశేషాధిష్ఠితుడై సర్వము ప్రసంగము రాకుండుటకును దేవాది సత్వ ప్రకృతుల రక్షణము కొరకును జరిగినదని తెలియవలెను.

ఫలితార్థ సంగ్రహము

పూర్వోక్త జ్ఞానము నెఱింగి విష్ణు భక్తుడై యుండు సమ్యగ్ జ్ఞాన ఫలము. దానినే

బ్రహ్మాణిం శితికంఠంచ యా శ్చాన్యా దేవతాః స్మృతా

ప్రతిబుద్ధాన సేవన్తే యస్మాత్పరిమితం ఫలమ్ అనియు

నాన్యం దేవం నమస్కుర్యాత్ అనియు భారతాదిశాస్త్రములు ఘోషింపుచున్నవి.

కాబట్టి దేవతాంతర భజన నివృత్తి పూర్వ విష్ణు సమాశ్రయణమే వైష్ణవత్వ లక్షణమని తెలియవలెను.

తటస్థ శాస్త్రములందలి విష్ణు పారమ్యము

తత్వ ప్రతిపాదకములగు పురాణేతి హాసాదులలోనే గాక తటస్థ శాస్త్రములన దగు జ్యోతి శ్శాస్త్రాదులలో గూడ శ్రీమన్నారాయణుడే పరతత్త్వమే జగత్కారణ భూతుడని స్పష్టముగా నిరూపించబడెను.

జ్యోతిః శాస్త్రములో బ్రహ్మ సిద్ధాంతమను గ్రంథమందు, భూగోళాధ్యాయములో నారదునకు బ్రహ్మ ఇట్లను చున్నాడు.

అస్మా న్నారాయణీద్భీషా వాతః పవత ఏవ హి ।

ఉదేతి సూర్యోమృత్యుశ్చ ధావతీన్ద్రో పి వర్షతిః

తదాశ్రయా మహామాయా వాది ర్నీహార సన్నిధౌ.

శ్రీమన్నారాయణుని భయము చేతనే గాలి యెల్లప్పుడు వీచును. సూర్యుడుదయించును. మృత్యువు త్వరగా తన సంహార కర్మ నొనరించును. మృత్యువు త్వరగా తన సంహార కర్మ నొనరించును. ఇంద్రుడు వర్షించును. మహావిష్ణువు నాశ్రయించి తచ్ఛధీర భూతమగుచు, మహామాయాశబ్ద వాచ్యమైన అనాదియైన మంచువంటి ప్రకృతి యున్నది అని చెప్పబడెను. ఇందువలన తటస్థ శాస్త్రముచే అంగీకరించిన పరతత్త్వము, శ్రీమన్నారాయణుడే అని చెప్పుటకు సందేహము లేదు.

ఇట్లు అద్వైతమత కర్తలగు శంకరాచార్యుల వారు గూఢ స్వరచిత బ్రహ్మ సూత్ర భాష్యములో జగత్కారణత్వాదులను శ్రీమన్నారాయణుని యందే గలవని చెప్పుచూ, బ్రహ్మ వాచ్యుడు నారాయణుడే అని స్పష్టముగా చెప్పిరి.

శాంకర భాష్యములో ద్వితీయాధ్యాయారంభమున మొదటి సూత్రభాష్యములో

అత శ్చ సంక్షేప మిదం శృణుధ్వమ్ ।

నారాయణం సర్వమిదం పురాణ స్స సర్గ తాలే చ కరోతి సర్గమ్ ।

సంహార కాలే చ తదత్తి భూయ । అని చెప్పుచు

అహకృత్స్నస్య జగతః ప్రభవః ప్రళయ స్తథా

అని గీతావాక్యమును చూపి జగత్కారణము శ్రీమన్నారాయణుడే స్పష్ట పరచెను. మరియు వారి చేతనే రచింపబడిన సహస్రనామ భాష్యము, గీతా భాష్యము అను వానిలో నెచ్చటను పరదేవత నారాయణుని కంటె భిన్నమని నిరూపింపబడ లేదు. అందు విశేషించి సహస్రనామ భాష్యములో కేశవః తన పదమును వివరించు సందర్భమున

హరి రేవ సదా ధ్యేయ భవద్భి స్సత్వ సంస్థితైః ।

ఓ మిత్యేవ సదా విప్రాః పఠధ్వం ధ్యాత కేశవమ్

అని చెప్పబడిన హరివంశస్థ రుద్ర వచనమును ప్రమాణముగా నిచ్చి సమర్ధించెను. కాన విష్ణు పరత్వమే సకల శాస్త్ర సమ్మతమని చెప్పుటకు సందేహము లేదు. మరియు బ్రహ్మ రుద్రాదులు, వారు విలక్షణాత్మలనియు భగవదదీనులనెడి భావముతో వారిని భాగవతులనుట మాత్రము. తప్పుకాదు. అపూర్వమునకు స్వర్గాది ఫల ప్రదత్వ నిరసనమ్, పూర్వ మీమాంసాశాస్త్రములో కర్మ జనితమగు నపూర్వమే స్వర్గాధిపలము నిచ్చునని యున్నది. కాని అట్టి అచేతనమును, కేవల మనుమాన సిద్ధ స్వరూపమును నగు అపూర్వమను దాని గల్పించి దానికి ఫల ప్రదాన శక్తిని చెప్పుట యెట్లు.

ఇష్టా పూర్తం బహుధా జాతం జాయమానం ।

విశ్వం బిభర్తి భువనస్య నాభిః ॥

ఇష్టా పూర్త కర్మలకును, వాని వలన గలుగు నిఖిల ఫలములకును ఆధార భూతుడు పరమాత్మయే అనియు **స ఏవం ప్రీతః ప్రీణాతి** అట్టి పరమ పురుషుడే కర్మానుచరణము చేయు వాని యెడల ప్రీతుడై వానికి ఫల ప్రదానము చేత తృప్తిని కలిగించుననియు

నిత్యో నిత్యానాం । చేతన శ్చేతనానా ।

మేకో బహూనాం । యో విదధాతి కామాన్

నాశము లేని జీవులందరిలోను నిరుపాధిక నిత్యత్వము కలిగి, చేతనులలో పరమచేతనుడైన ఒక్కడే అనేక జీవుల యొక్క కోర్కెలను తీర్చుననియు, శ్రుతి ప్రమాణము లనేకములచేత, పరమ పురుషునకే ఫల ప్రదాన శక్తి కలదని చెప్పబడుట చేతను వేదో సబృంహణ రూపములగు మహాభారతాదులలో గూడ,

తం దేవా ఋషయశ్చైవ । నానా తను సమాశ్రితాః ।

భక్త్యా సంపూజయ స్త్యేనం గతిం చైషాం దదాతి సః

దేవ ఋష్యాది శరీర ధారులగు జీవులందరును భక్తితో శ్రీమన్నారాయణుని ఆరాధింపగా, వారు కోరిన ఫలములను ఆయనే ఇచ్చును అనియు **యోగీశః సర్వకామగః** ఆరాధకుల కారాధ్యుడై సమస్త కామములను నిచ్చువాడు అనియు **లభతే చ తతః కామామయైవ విహితా న్హితాన్.** ఎట్టి దేవత నారాధించు వారికైనను నా

శరీరభూతులగు నాయా దేవతల ద్వారా చేతనే ఇయ్యబడిన ఫలము కలుగుచుండు ననియు, **సకల ప్రదో హి విష్ణుః సర్వ దేవ వ్యాపియగు విష్ణు** వే సమస్తములను ఇచ్చు వాడు అనియు చెప్పబడి యున్నందున సకల కర్మారాధ్యుండు, సకల ఫల ప్రదుండును శ్రీమన్నారాయణ అనుట యుక్తము. కాని అపూర్వమున కట్టి యోగ్యత ఉండజాలదు గదా.

తార్కికాది మత నిరసనము

అనుమాన ప్రమాణమునే ముఖ్యముగా నాదరించు తార్కికులు, శబ్ద ప్రమాణమును విడచి కేవల మనుమాన చేతనే ఈశ్వరసత్తమ సాధించు వారై **క్షిత్యాధికం సకర్తృకం కార్యత్వాత్ ఘటవత్**, భూమ్యాది సమస్త ప్రపంచమును కార్యరూప (సావయవ రూప) మగుట చేత నొక కర్తను గలదిగా నుండును.

కుండయెట్లు సావయవ కార్యరూపమైన దగుట వలన కుమ్మరి వల్ల చెయబడుచున్నదో అటులనే అనుమానము చేత నీశ్వరుని సాధించెదరు. అట్లు అనుమానము చేత జగత్కర్త యొకడు సిద్ధించినను అట్టి వాడు జీవులలో నేదో కొంత విశిష్ట శక్తి గలవాడు గనే యుండగలడు. కాని సర్వజ్ఞుడు సర్వ శక్తియగు పరమపురుషుడు సిద్ధింప జాలడు. కాన ఆ మతము ఆదరింపదగదు. ఇందు విశేష మేమనినచో జగత్కర్త యొకడుండినట్లు మాత్రము వారంగీకరీంచిరి.

సాంఖ్య మతము వారట్లు కాక ఈ జగత్తునకు కారణము అచేతనమగు ప్రకృతియే యనియూ ఆత్మలున్నను, అవి యనాదిగా ప్రకృతితో గలసి యుండి ప్రకృతి మయ జగత్తున మునిగి యుండునని చెప్పెదరు. యోగమతము వారును అట్లే చెప్పుచు విలక్షణాత్మ యొకటి ఈశ్వరుడని యుండినను, అతనికి జగత్సృష్టిలో కేవలము తాటస్థ్యమునే చెప్పుదురు. కాన ఆ మతములు రెండును,

భోక్తా భోగ్యం ప్రేరితారం చ మత్వా అని యెడి ఈశ్వర తత్వమును మూడవదిగా జెప్పెడి శ్రుతి ప్రమాణములకును

దైవీ హ్యేషా గుణమయీ। మమమాయా దురత్యయా ।
మా మేవ యే ప్రపద్యంతే । మాయా మేతాం తరంతి తే ॥

అనెడి గీతా వచనముల విరుద్ధములై అబ్రహ్మాత్మక ప్రకృతి పురుష నిరపణములు చేయునవి గాన, సర్వధా ప్రమాణములు కాజాలవు.

ఇక వేదమును ప్రమాణముగా నంగీకరించిన వారైనను నట్టి వేదమునకు స్వాభీష్టమైన విరుద్ధార్థములను కల్పించు వారిలో అగ్రగణ్యులన బడు జీవ బ్రహ్మ భేదవాదులగు మాయావాదులు మూడు విధములుగా నున్నారు. అందొకరు శాంకరీయులు బ్రహ్మము. నిర్విశేషము చిన్మాత్ర స్వరూపమునై యుండునందురు. ఇంక నొకరు భాస్కరీయులు. వారు అట్టి బ్రహ్మకు సత్యోపాధి మిశ్రమై యుండి. భ్రమను జెందుచుండునందురు. చివరి వారు యాదవీయులు.

బ్రహ్మము చిదచిదీశ్వర రూపమగు ప్రపంచ స్వరూపమును పొంది భ్రమించు స్వభావము గలదందురు. ఇట్లు కాక, ఏకాయనులలను ద్వైతులు, పరబ్రహ్మము నారాయణుడనియు, ఆయనే జగత్కారణ భూతుడనియు నాతనికి ప్రపంచము శేషభూతమనియు, నారాయణ సన్నిధియే ప్రాప్తి ఫలమనియు, నంగీకరించుచూ నట్టి

బ్రహ్మము శ్రీవిశిష్ట తత్త్వము గలదైననూ పరిమిత శక్తులు గలదై యుండుననియు జెప్పుదురు. పైన జెప్పబడిన శంకరాది మతములను మూటిని విపులముగా చర్చించి శ్రీభాష్యకర్తలగు **ఎమ్బెరుమానార్లు** వానిని ఖండించి యుండిరి. ఇక నేకాయన మతమునకు

పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే" అని చెప్పునట్టి వివిధ శక్తి యుక్తుండు నారాయణుడనియు,

హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ " అని చెప్పబడు శ్రియః పతిత్వము కలవాడనియు చెప్పు వేదాంత వాక్యములు విరోధించును గాన నా మతము గూడ గ్రాహ్యము కాజాలదు. ఇట్టి మతముల నన్నింటిని ప్రపన్న జన కూటస్థులగు నమ్మాళ్వార్లు తిరువాయ్ మొళి గ్రంధములో ఎత్తి ఖండించిరి.

బాహ్యకు దృష్టిమత నిరసనము

పరమ ప్రమాణమగు వేదము నంగీకరింపని వారు బాహ్య మతస్థులనబడుదురు. అట్టి వేదమును ప్రమాణముగా నంగీకరించియూ, దానికి విరుద్ధార్ధములను గల్పించుచు, స్వాభిష్టానుకూలముగా తదర్ధమును వర్ణించువారు, కుదృష్టులనబడుదురు. శ్రీవైష్ణవ సిద్ధాంతములకివి యన్నియు విరుద్ధములే.

అందు బాహ్యమతస్థులు ఆరువిధములుగా నుండిరి. అవి చార్వాకము, జైనము, సౌత్రాంతికము, వైభాషికము, యోగాచారము, మాధ్యమికము అనునవి వేదబాహ్యమతములు. అందు చార్వాకమతము వారు పృథివి, జలము, తేజస్సు వాయువు అను నాల్గు భూతముల యొక్క అణువులే ప్రపంచముగా పరిణమించి వాని నిబిడ సంయోగము వలన చైతన్యము దృవించి అదియే శరీరిగా నుండి ఆ సంయోగము వీడిన వెంటనే ఆయా శరీరభాగములు నశించి పోయి అణువులయిపోవును అని యందురు.

జైన మతస్థులు పైన తెలిపిన భూతాణువులే గాక వానితో బాటు ఆకాశతత్త్వమును ఆత్మతత్త్వమును అంగీకరించిరి. అవి అనేకములుగా నుండుననియూ తత్తద్రూపముగా పరిణమించిన పంచభూత శరీరములలో నంతటను స్వరూపము చేత వ్యాపించి చీమ శరీరములో చీమంతయు, గజశరీరములో గజమంతయు నుండునందురు. వీరి మతములో శరీర నాశము గలిగి మరియొక శరీరమములో చేరినంతనే, తత్తత్పరిమాణమును ఆత్మలు పొందుచుండు నందురు.

ఇక సౌత్రాంతికాదులు నలుగురు బౌద్ధమతము వారు, వారిలో వైభాషికులు జగత్తంతయు ఆత్మశూన్యమై కేవలము బాహ్యవస్తువులును శరీరములోని చిత్తచైతన్యాదులును మాత్రము క్షణికములుగా నుండుటచే ప్రత్యక్షానుమాన ప్రమాణ గమ్యములుగా నుండునందురు. సౌత్రాంతికులు అట్టి జగత్తు అనుమాన మాత్ర గమ్యమే గాని ప్రత్యక్ష గమ్యము కాదం దురు. యోగాచారులు. జ్ఞాన మాత్రమే ఈ జగత్తుగా భాసించుచుండును గాని వేరేమియు లేదందురు. మాధ్యమికులు ప్రపంచము, జ్ఞానము అన్నియు కేవల శూన్యములే గాని ఏమియు లేదందురు. వీరార్గురును వేదము నంగీకరింపని వారు. వీరిని నిరసించు విధము శ్రీ నమ్మాళ్వార్లు అద్భుతముగా సాయించిరి. ఎట్లనగా తుదివారగు సర్వ శూన్య వాదులను నిరసించినచో మిగిలిన వారును నిరసింపబడుదురు గాన. ఇది లేదు అది లేదు అని చెప్పునప్పుడు ఇది అది అనునవి యుండనిచో వానిని నిషేధించుట యెట్లు? కాన లేవని భాసించునవిగా కొన్ని యుండక తప్పదు. అట్టివి లేవు అని చెప్పబడగలవు. కాని శూన్యములు మాత్రము కారాదు. కాబట్టి అట్టి వస్తువులే లేదని చెప్పుట పొసగదు అని చెప్పిరి.

ఇక కుదృష్టులలో ప్రధానులు శాంకరమతము వారు. వీరు వేదము నంగీకరించియు నందు కొన్ని వాక్యములు తదితరమైన కొన్ని వాక్యముల కంటె ప్రబలములై, వానిని బాధించునని చెప్పెదరు. ఎట్లనగా వేదాంత వాక్యములలో జగద్బ్రహ్మలకు భేదము కలదను నర్థము స్ఫురింపజేయు వాక్యములు కొన్నియు, అట్టి భేదము లేదని చెప్పు వాక్యములు కొన్నియు, అట్టి భేదము లేదని చెప్పు వాక్యములు కొన్నియు గలవు.

అందు **ద్వా సుపర్ణా సయుజా సఖాయౌ భోక్తా భోగ్యం**

ప్రేరితారం చ మత్వా పృథ గాత్మాణం ప్రేరితారం చ మత్వా,

ఇత్యాది శ్రుతులు భేదమును చెప్పుచున్నవి.

నేహ ఽనానాస్తి సర్వం ఖల్విదం బ్రహ్మ

సేవ సోమ్యేద మగ్ర ఆసీ దేక మేవా ఽద్వితీయమ్ తత్త్వమసి శ్వేతకేతో, ఇత్యాదులు, అభేదమును చెప్పుచున్నవి.

అయితే భేదమును చెప్పు వాక్యము అధికముగాను, అభేదమును చెప్పు వాక్యములు పరిమితముగాను, నుండుట చేత అభేద శ్రుతులను బట్టి భేద శ్రుతులకు శరీర శరీరిభావ నిబంధనమైన అభేదమర్థమనియు, నానా వస్తు నిషేధమును చెప్పు వాక్యములకు అబ్రహ్మాత్మక వస్తు నిషేధమును జెప్పునవి గాను అర్థము తేటతెల్లమగుచుండగా, అభేదమునే స్థాపింపబూనుటయే కుదృష్టి మూలమని తెలియవలెను.

ఇంకను చైతన్య మాత్ర స్వరూపమగు బ్రహ్మము నిర్గుణమ్, నిరంజనమ్ ఇత్యాది శ్రుతులను బట్టి నిర్గుణమైనది. అదియే అవిద్యా సంబంధము చేత తనను జగద్రూపముగా భ్రమించుచుండును. అని వారందరు ఇట్టి వాదములన్నియు అపభ్రంశములు. ఆధార రహితములు. ఇట్టి దుర్వాదములన్నింటిని సప్రమాణ యుక్తికముగా శ్రీభాష్యకారులు ఖండించిరి. నిర్గుణ మనగా హేయగుణములు లేనిదనియును, సర్వజ్ఞుడును, సర్వశక్తి మంతుడును, స్వప్రకాశ స్వరూపుడును, నిరుపాధిక నిత్య నిరవచ్ఛిన్న జ్ఞాన స్వరూపుడును, జ్ఞాన గుణకుడునగు జగత్ సృష్టి, స్థితి, లయ, మోక్ష కర్తయు అవిద్యా అజ్ఞాన సంపర్క గ్రంధము గాని, భ్రమాదులు గాని లేనివాడనియు, అటుల భావించుట మహాపాపమనియు శ్రీభాష్యకారులు శ్రీభాష్య గ్రంధాలలో సప్రమాణముగా నిరూపించిరి. జగద్బ్రహ్మల కభేదమును బ్రహ్మము నిర్గుణ మనుటయును మహాదోషము ఏలననగా,

య **"స్సర్వజ్ఞ స్సర్వవిత్ " "ఆనన్దో బ్రహ్మ"**

"ఏష హ్యేవా ఽనన్దయాతి" ఇత్యాది శ్రుతులును

"జ్ఞానానందమయ స్త్వాత్మా శేషో హి పరమాత్మనః "

"దాసభూతా స్స్వత స్సర్వే హ్యాత్మానః పరమాత్మనః "

ఇత్యాద్యుపబృంహణములును అభేద భావము నిరసించుచున్న నను విషయము స్పష్టము.

శ్రీ వైష్ణవ సిద్ధాంతమున బ్రహ్మ స్వరూపము

శ్రీవైష్ణవ సిద్ధాంతమునందు బ్రహ్మము సగుణమనియు విగ్రహ విశిష్టమనియు, విభూతి మత్తనియు, సిద్ధాంతీకరింపబడినది. **సగుణమనుటకు అపహత పాప్మా .... సత్య కామ స్సత్య సంకల్పః** అను ఘటక శ్రుతి ఆధారము. అందు అపహత పాప్మా ఇత్యాదుల వలన హేయగుణ రాహిత్యమును సత్యకామ స్సత్య సంకల్పః అను దాని వలన నిరుపాధిక సత్యకామత్వాది కళ్యాణ గుణ విశిష్టత్వమును, వివేకింపబడినదని

చెప్పబడెను. విగ్రహవత్త్వములో **"ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్ " "తస్య యధాకప్యాసం పుణ్డరీక మేవ వక్రిణీ "** ఇత్యాది శ్రుతులు ప్రమాణములుగా జెప్పబడెను.

న తే రూపం న చాకారః ...... తథాపి పురుషాకారో భక్తానాం త్వం ప్రకాశసే" అనునట్టి విగ్రహాయుధాది వైశిష్ట్య నిషేధము స్వార్ధముగా విగ్రహాయుధాది మత్త్వము లేదనియు, భక్తరక్షణము కొరకవి యన్నియు సర్వేశ్వరునకు గలవనియు, నర్థము వలన సుస్పష్టముగా తెలుపబడెను. అట్లు గానిచో ననేక శ్రుతి స్మృత్యాదులకు విరోధమవును.

ఇందను విభూతియనగా నైశ్వర్యమును తెలుపును అనగా విశిష్ట స్థాన పరికరాదులర్థమగును. అట్టి భగవద్విభూతులు నిత్య విభూతియనియు, లీలా విభూతియనియు రెండు విధములు నిత్య విభూతి త్రిగుణాత్మక ప్రకృతి కంటె బహిర్భూతమై, కేవల సత్త్వ గుణమయమై యుండును. లీలా విభూతి, త్రిగుణాత్మక ప్రకృత్యం తర్భూతమై యుండును. ఈ రెండు విధములు విభూతులును భగవదధీనములై యుండుటయే విభూతి మత్త్వ మనబడును. అందు నిత్య విభూతి నిత్యముక్తులకు నిత్య నిరవచ్ఛిన్న నిరతిశయ నిరుపాధికానంద స్థానమై సర్వేశ్వరుడు వారలతో గూడ విహరించు స్థానము, మహారాజునకు రాజ భవనము వంటివి. లీలా విభూతి బద్ధాత్మలతో నిండి సర్వేశ్వరమన క్రీడకు అనుకూలమైన స్థానము మహారాజునకు కందుక క్రీడాది స్థానము వంటిది.

వైకుంఠము యొక్క అద్భుత స్వరూపము

భగవద్భక్తులగు వారికి, అవిచ్ఛిన్న భగవద్గుణానుభవ కైంకర్య రూప పురుషార్థములకు స్థానముగా పరమపదమని వ్యవహరింపబడు శ్రీ వైకుంఠము, శ్రుతి,స్మృత్యాదుల వలన ప్రాప్యస్థానముగా నిరూపించబడినది. అందుకు

తద్విష్ణో పరమం పదమ్ సదా పశ్యంతి సూరయః తేహ నాకం మహిమానః స్సచన్తే
యత్ర పూర్వే స్థావ్య స్సంతి దేవాః ఇత్యాది శ్రుతులును,
ఏకాన్తిన స్సదా బ్రహ్మధ్యాయినో యోగినో హి యే ।
తేషాం తత్పరమ్ స్థానం యద్వై పశ్యన్తి సూరయః
వైకుంఠే పరే లోకే శ్రియా సార్థం జగత్పతిః
ఆస్తే విష్ణు రచిన్త్యాత్మా భక్తై ర్భాగవతై స్సహః

ఇత్యాద్యుపబృంహణ వచనములును ప్రమాణములు. అచ్చట కేగిన ముక్తాత్మలకు తిరిగి సంసార ప్రాప్తి లేదని న చ పునరావర్తతే ఇత్యాది శ్రుతులును యద్గత్వాన నివర్తంతే తద్ధామ పరమం మమ ఇత్యాది స్మృతి వచనములును జెప్పుచున్నవి. ఇట్టి పరమ పద స్థానము, శ్రియఃపతి నుపాసించి తద్గుణానుభవ కైంకర్య నిష్ఠులకు మాత్రమే లభ్యమగునని కూడా నిరూపించు, ప్రమాణము లనేకములు కలవు.

మోక్షాధికారి స్వరూప నిరూపణము

అట్టి పరమ విలక్షణమైన పరమపదమును పొందుట కధికారులు, అహంకార మమకార ప్రభృతి హేయగుణములు లేని వారును భక్తి శ్రద్ధతో గూడియుండు వారలేయని శ్రీవిష్ణు ధర్మము నందును, శ్రీవామన పురాణము నందును చెప్పబడెను.

నమ ఇత్యేవ యో బ్రూయాన్మద్భక్త శ్ర యాన్వితః।

తస్యాక్షయో భవే ల్లోకః శ్వపాకస్యాపి నారః **శ్రీవిష్ణు ధర్మము**

అనగా నాకు నేను శేషభూతుడనుగాను నీకే నేను శేష భూతుడను అను అర్థము తెలిపెడి నమః అను పదమును నుచ్చరింపుచు మనసా నమ్మి యుండు వాడు. అంత్యజాతి వాడైనను అక్షయ్యమగు లోకమును బొందగలడు. అని భావము. శ్రీవామన పురాణమునందు

యేషాం విష్ణుః ప్రియో నిత్యం యే విష్ణో సతతం ప్రియాః

నతే పున స్సంభవంతి తద్భక్తా స్తత్పరాయణ

అనగా అనవరత భావనారూపమైన భక్తి రూపాపన్న జ్ఞానము కలిగి దాని వలన శ్రీహరి యందు నిరతిశయ ప్రీతి కలవారై శ్రీహరికి గూడ తమయందున్న ప్రీతిని కలిగింపజేసుకొని యున్నవారు తిరిగి జన్మము నెత్తక శాశ్వతమగు పరమపద లోకమును బొందగలరని భావము.

భగవంతుని మోక్ష ప్రధానరీతి

శ్రియః పతి యొక్క మోక్ష ప్రదత్వ మతిసులభమైనది.

ఉపోషితః పూజితో వా దృష్టో వా నమితో పివా

ప్రసహ్య హరతే పాపాన్ కో న సేవే ధ్ధరిం తతః

అనగా శ్రియః పతి తన నుద్దేశించి హరివాసరమున నుపవాసము చేసినను లేక భగవత్సన్నిధిలో నివసించినను, ఒకసారి పూజించినను దర్శించినను నమస్కరించినను వెంటనే ప్రసన్నుడై అట్టివాని ప్రతిబంధక దురితములను వెంటనే పోగొట్టి మోక్షార్హులను జేయును. అట్టి శ్రియః పతి నెవడు సేవింపడు. అను భగవదనుగ్రహ మతిసులభమై మోక్ష ప్రాప్తిని కలుగజేయునని స్పష్టము.

నిత్యముక్తుల కృత్యము

బ్రహ్మవేత్తలై బ్రహ్మని దాప్నోతి పరమ్ చెప్పిన రీతిని పరమపదమును పొందిన ముక్తులను అస్పృష్ట సంసారగంధులగు నిత్యులును పరమపదమందు భగవద్గుణానుభవ కైంకర్యములయందే మగ్నులై యుందురని శ్రీవిష్ణు తత్వ శాస్త్రములో చెప్పబడెను. ఎట్లనగా

స్వత్వ మాత్మని సంజాతం స్వామిత్వం బ్రహ్మణి స్థితమ్ ।

ఉభయో రేష సంబంధో న ఉ పరో భిమతో మమ ॥

అనగా జీవాత్మలు భగవంతుని సొత్తుగా నుండుటయు, బ్రహ్మ స్వరూపుడగు పరమాత్మ అట్టి సొత్తు కల స్వామిగా నుండుటయు కంటే వేరు అభిమతమైన సంబంధమేదియు వారి శుభములకు లేదు అని భావము. కాని స్వామియగు పరమాత్మ తన సొత్తగు జీవులను యధేష్టముగా నుపయోగించుకొనును. అయితే పరమకారుణికుడగు శ్రియః పతి ఆత్మలను తన గుణ ప్రదర్శనము వలన తన కైంకర్యము నందు స్వేచ్ఛా పూర్వకముగా నానందముతో ప్రవర్తింపచేసి అందు నిమగ్నుల జేయును.

ఏష హ్యే వానన్దయాతి సర్వేశ్వరుడాత్మల నానందింపజేయును అనియు

సో శ్నుతే సర్వాన్కామా స్సహ బ్రహ్మణావి పశ్చితా

ముక్తుడు బ్రహ్మముతో గూడి వాని కల్యాణగుణముల ననుభవించుచుండు ననియు.

యేన యేన ధాతా గచ్ఛతి తేన తేన సహగచ్ఛతి పరమాత్మ యెట్టెట్లు ప్రవర్తించునో అట్లట్లు ముక్తుడు గూడ ప్రవర్తించు ననియు వేదాంత వాక్యములు చెప్పిన రీతిని, నిత్యముక్తులానంద రూపముగా భగవద్గుణానుభవ కైంకర్యము లందు మగ్నులయి యందు రనుట స్పష్టము. మరియు వారికి గల కృత్యములు యధాధికారముగా భగవనుభవ కైంకర్య విశేషములే అను నంశము

యే పి ముక్తా భవన్తీహ నరా భారత సత్తమః

తేషాం లక్షణ మేతద్ధి యచ్ఛేద్వీప వాసినామ్"

శ్వేతాం శ్చంద్ర ప్రతీకాశా స్సర్వలక్షణ సంయుతాన్ ....

నిత్యాంజలి పుటా హృష్టా ....

నమ ఇత్యేవ వాదినః ....

అనగా ముక్తులు, శ్వేత ద్వీపవాసులు (వ్యూహ వాసుల వలె స్వచ్ఛమగు శరీరమనస్సులు గలిగి యెల్లప్పుడు చేతులు జోడించి నమః అని పలుకుచు సంతోషించుచుందురని ప్రమాణములు చెప్పుచున్నవి.

కైవల్య స్థాన నిరూపణము

సంసారబంధము నుండి విముక్తములైన కొన్ని ఆత్మలు తమ తమ భావనావశమున, భగవదనుభవ గర్భమగు శ్రీ వైకుంఠ ప్రాప్తి లేక కేవలాత్మనుభవ మాత్ర పర్యవసితమగు కైవల్యమును పొంది, యనుభవింతురని శ్రీవైష్ణవ సిద్ధాంతము. అట్లు కైవల్యమును పొందెడి యాత్మలకు స్థానము

విరజా పరమ వ్యోమ్నో రంతరా కేవలం స్మృతమ్

అను ప్రమాణమును బట్టి విరజానదికిని శ్రీవైకుంఠనగరికిని మధ్యభాగములో కైవల్యము ననుభవించు వారుండెడి చోటని తెలియుచున్నది. అట్టి కైవల్యస్థానమును పొందువారు

జరామరణ మోక్షాయ మామాశ్రిత్య యతంతి యే

అని చెప్పిన రీతిని కేవలము ముదిమి చావులతో గూడిన శరీరము పోవలెనని మాత్రము భగవంతుని ఆశ్రయించి యట్టి కేవలాత్మ స్వరూప లాభము నభిలషించెడి కైవల్య కాములు మాత్రమే యని తెలియదగును.

ప్రసంగవశము శ్రీవైష్ణవ సంప్రదాయ భేదములు

శ్రీవైష్ణవ సిద్ధాంతమునకు చెందిన శ్రీవైష్ణవులలో రెండు సంప్రదాయముల వారు గలరు. వారు వడకలైవారు, తెన్కలై వారు అని చెప్పబడుదురు. వీరందరికిని తత్త్వహిత పురుషార్థములలో భేదము లేకున్నను సంప్రదాయ భేదములు మాత్రమే కలవు. తత్త్వ విషయములో శ్రియః పతియే పరతత్త్వ మనుచూ వడకలై సంప్రదాయమువారు శ్రియః పతితో బాటు శ్రీదేవికి గూడ విభూత్వము నంగీకరించిరి.

తెన్కలైవారు శ్రీదేవి విలక్షణజీవులలో జేరినదే కాన, ఆమెకు అణుస్వరూపమే యుండునందురు. వడగలైసంప్రదాయములు, మోక్షములో కైవల్య భగవల్లాభములను రెండు విధములంగీకరించియు, కైవల్య పదప్రాప్తులగు ఆత్మలకు తిరిగి సంసార ప్రాప్తి పూర్వకముగా భగవల్లాభరూప పురుషార్థమును నొందుట కర్హత గలదని సిద్ధాంతీకరించిరి.

తెన్కలైవా రట్లు గాక కైవల్యమును పొందిన ఆత్మలకు తిరిగి భగవత్సన్నిధిని పొందు అర్హత లేదందురు. అనగా అర్చిరాది మార్గముననే కైవల్యకాములు గూడ విరను దాటి విరజా శ్రీవైకుంఠముల నడుమ నుండు

కైవల్య స్థానమును జేరి యచ్చటనే స్థిరముగా స్వాత్మానుభవ పరులై యుందురని వీరి తాత్పర్యము. అట్లగుట కైవల్యస్థానము ప్రకృతి మండలములోనిదే అని వడకలై వారును, నిత్యవిభూతిలో నొక భాగమే అని తెన్కలైవారును నమ్ముచున్నారు.

తెన్కలై వారికి **ఏడు నిలత్తిలిడువర మ్మున్నం** అను **పెరియాళ్వార్ల శ్రీసూక్తి** గూడ ఆధారమగుచున్నది. **ఏడునిల** మనగా ఎడారి భూమి అని అర్థము. అట్టి నిష్ఫలస్థానమగు కైవల్యమును జేరుటకు ముందే శ్రీవైష్ణవులు, భగవత్కైంకర్యాసక్తులు గావలెనని వారి యుపదేశమున దేలుచున్నది. కాన కైవల్యస్థానమునకు జేరిన వారి కిక భగవదనుభవ గర్భమగు పరమపదము లభింపదని వీరి నిర్ణయము.

ప్రసంగవశమున మరికొన్ని సంప్రదాయ భేదములను మాత్రము దిఙ్మాత్రముగా నిచటదెలిపెదము.

ఇంకను వడకలై వారికి సంస్కృత వేదమందు ప్రామాణ్యమెక్కువ కనుకనే వారికి **వడకలై (ఉత్తరకల)** యాసక్తులను అర్థము వచ్చు వారని నామము గలిగెనందురు. తెన్కలై వారికి ద్రావిడ వేదమగు దివ్య ప్రబంధముల యందు ప్రామాణ్య మెక్కువ. కనుక వారికి **తెన్కలై (దక్షిణకల)** యందాసక్తులని అర్థము వచ్చెడి వారని నామము కలిగెనని పెద్దల సంప్రదాయము.

వడకలై వారికి నిత్యనైమిత్తిక కర్మలతో పాటు కామ్య కర్మలు కూడ భగవత్ప్రీతి కొరకు భగవదారాధన రూపముగా నాచరింపదగినవని అభిసంధి గలదు. తెన్కలై వారి కట్లుకాక నిత్య నైమిత్తిక కర్మలు బ్రాహ్మణ్య సిద్ధి కొరకు జేయటయే తప్ప కామ్య కర్మలు భగవదుద్దేశమున గూడ ఆచరింప దగినవి కావని యుందురు.

మరియు వడకలై వారు ఊర్ధ్వపుణ్డ్ర ధారణములో **నాసికామూల మారభ్య** అని చెప్పబడిన ప్రమాణము ననుసరించి నామికామూలము కనుబొమల మధ్యనున్నది గాన నచ్చట నుండియే ఊర్ధ్వపుండ్రమును ధరింపవలెనని యట్లు ధరింతురు.

తెన్కలైవారు **(నాసికస్యత్రయో భాగః నాసికామూలముచ్యతే)** అను ప్రమాణమును బట్టియు నాసికామూలమనగా పైకి కన్పట్టు నాసికాదండ మూలము కాక నాసికా భాగములో ఇంచుమించు సగము నందే శ్వాసానిలము ప్రవర్తించు రంధ్ర భాగము లుండును గాన యచ్చట నుండియే నాసిక ఆరంభమగును గాన, నాసికామూలముగా పైకి కన్పట్టు నాసాదండములో ఇంచుమించు మధ్య భాగమే నాసామూలమని నిశ్చయించి, యచట నుండియే యారంభించి యూర్ధ్వపుండ్రమును ధరించెదరు. ఇట్లే తెన్కలైవారు ఊర్ధ్వపుండ్రమునకు నిరుప్రక్కల ధరించు శ్వేతమృత్తుయొక్క రేఖలు శ్రియఃపతి పాదస్థానములనియు మధ్య ధరించు శ్రీచూర్ణ రేఖ లక్ష్మీ యొక్క స్వరూపమనియు నట్టి లక్ష్మీకి పాదస్థానమగు శ్రీపాదము క్రిందను వికసించిన పద్మము యొక్క ఆకారముండవలెను తథాకారముగా శ్రీపాదమును ధరింతురు.

ఇంకను **వడకలై వారు శ్రీచూర్ణమును హిరణ్యవర్ణాం** అను శ్రుతి చొప్పున **పీతవర్ణముగల** దానినే ధరింతురు.

తెన్కలైవారు శ్రీచూర్ణము హిరణ్యవర్ణమనగా పుటపాకశోధిత సువర్ణవర్ణమని యర్థమువచ్చును గాన రక్త వర్ణ మిశ్రితమగు దానినే ధరించెదరు.

వడకలైవారు భగవద్భాగవతులకు దండవత్ప్రణామము చేయునప్పుడు

నమో నమో భాగవత వ్రజాయ నమో నమో వాఙ్మనసాతి భూమయే

ఇత్యాది అనేక శ్రీసూక్తుల వలన పునః పునః ప్రణామమును ఆచరింతురు.

తెన్కలైవారు దండవత్ప్రణామము ప్రపత్తి సూచకము గాన ఒక్కమారు చేయవలెనని తలంచి ఒకే పర్యాయము మాత్రమే ప్రణామమొనరింతురు. ఇంకను మరికొన్ని భేదములు కలవు. గ్రంథములో కొన్ని చర్చింపబడుటచే నిచ్చట నింతటితో విరమింతుము.

ఇక శ్రీవైష్ణవులు గానే నుండు వైఖానస శ్రీవైష్ణవులు కొందరు వడకలై సంప్రదాయము వారి ఆచారాదుల ననుసరింతురు కాని వారి భగవదారాధన క్రమము విఖనస మరీచ్యాది ఋషి ప్రోక్త సంహితల ననుసరించి యుండును. సాక్షాద్భగవన్ముఖోదితములని ప్రసిద్ధములగు పాంచరాత్ర సంహితలను అనుసరించి భగవదారాధనము చేయు వారు తెన్కలై సంప్రదాయములో చేరిన వారని తెలియవలెను.

ఇట్లు శ్రీవైష్ణవాచార నిర్ణయములో సిద్ధాంత ప్రతిపాదకమగు మొదటి భాగములో

పరతత్త్వ నిర్ణయ మను మొదటి ప్రకరణము ముగిసెను.

శ్రీవైష్ణవ ఆచార నిర్ణయము

సదాచార్య నిర్ణయమను రెండవ ప్రకరణము

నిత్య విభూతి ప్రకారము

సమస్త శ్రుతి స్మృతీతిహాస పురాణ ప్రతిపాద్యుడై జగత్కారణ భూతుడై బ్రహ్మ రుద్రాది సకలాత్మ సంసేవ్యుడై ఎట్టి హేయ గుణములు లేనివాడై అసంఖ్యాక కల్యాణ గుణాకరుడై. స్వేతరమగు సమస్త వస్తువులకంటె విలక్షణమైన జ్ఞానానందముల స్వరూపముగ గలవాడై, ఆశ్రితులనుభవించుటకు తగిన విలక్షణ గివ్య మంగళ విగ్రహయుక్తుడై, ఉభయవిభూతి తగిన విలక్షణ దివ్య మంగళ విగ్రహయుక్తుడై, ఉభయ విభూతి నాధుడై, శ్రీ భూ నీళాద్యనంత దివ్య మహిషీయుక్తుడై, నిత్య ముక్తానుభావ్యుడై వేంచేసి యుండు శ్రియఃపతియగు సర్వేశ్వరుడు. తన దాసులకు నిత్యమై నిరవద్యమై నిరతిశయానందరూపమగు మోక్షాఖ్య మహైశ్వర్యము నిచ్చి తన కైంకర్య సుఖము ననుభవింపజేయునను విషయము శ్రీవైష్ణవాచార నిష్టులగు సదాచార్యుల ముఖముగా తెలియదగును. ఇది శ్రీవైష్ణవ సిద్ధాంత సిద్ధము. అట్టి నిష్ఠలభించుటకు సర్వేశ్వరుని నిర్హేతుక జాయమాన కటాక్షమే హేతువు. దానికి మూలము జీవుల సుకృత విశేషమే. ఉభయ విభూతులును ఆయన కధీనములై యుండి యున్ననూ అందు నిత్యవిభూతి, స్వచ్ఛ సత్వగుణమయమై విలక్షణ జ్ఞాన ప్రదమై యుండుట వలన నచ్చట నుండు నిత్యముక్తులు

యేన యేన ధాతా గచ్ఛతి తేన తేన సహ గచ్ఛతి

అని చెప్పిన రీతిని పరమశేషియగు శ్రియఃపతి యొక్క దివ్యహృదయము ననుసరించి యనువర్తించుచు నాతని సంతోషపరచుచు నాతని స్వాతంత్ర్యములో నిమిడి **ఒణ్డొళియాళ్ తిరుమగళుమ్ నీయుమ్** అను ఆళ్వార్ల శ్రీసూక్తి ప్రకారము శ్రియఃపతియగు స్వామి యొక్క చరణ పరిచర్యాపరులై యుండుటయే తమకు పురుషార్ధమని తలచి యుందురు. ఇదియే నిత్యవిభతి కుండెడి విలక్షణ ప్రకారము.

లీలా విభూతి ప్రకారము

శ్రియఃపతికి శేషములగు నుభయ విభూతులలో నిత్య విభూతి మూడు వంతులు భాగమై త్రిపాద్విభూతి యనబడుచున్నది. లీలా విభూతి ఒకవంతు గలదై ఏకపాద్విభూతి యనబడుచున్నది. అట్టి లీలా విభూతి, సత్వరజస్తమో రూప త్రిగుణమయ ప్రకృతి రూపమై యజ్ఞానాంధకారమునకు స్థానమై యుండును. అందుచే నిందుండు బద్ధ జీవులు

ఈశ్వరో ఉ హమహం భోగీ సిద్ధో ఉ హం బలవాన్ సుఖీ ।
ఆఢ్యో భిజనవానస్మి కో ఉ న్యో ఉ స్తి సదృశో మయా ॥

అని చెప్పిన రీతిని, నేనే స్వతంత్రుడను, నేనే భోగానుభవము గలవాడను, నాకన్నియు సిద్ధములే, నేనే బలవంతుడను, సుఖవంతుడను, ధనికుడను, గొప్ప కులమువాడను నాతో సమాను లింకేవ్వరును లేరు అను బుద్ధి కలిగియుండును సర్వేశ్వరుడే లేడని తలంచుచున్న ఆ సర్వేశ్వరుని ద్రవ్యమగు ఆత్మవస్తువుకు తనకు తానే స్వతంత్రమైనదని భావించును. ఇట్లు ఆత్మాపహార రూపమగు మహాపాపమును జేయును, తమవంటి యస్వతంత్ర జీవులేయగు దేవతాంతరములను గొప్పగా తలంచును, ఒక వేళ నెవరికయినను భగవచ్ఛేషత్వజ్ఞానమున్నను దానిని లేని దానినిగా జేయునట్టి వర్ణాశ్రమాభిన విద్యావృత్తముల వలన గల్గు దురహంకారము మొదలగు వానిని కలిగియుందురు. దానిచేత అజ్ఞులై భాగవతుల యందు వర్ణాశ్రమాది

నిరూపణములను జేయుచు వారిని తక్కువగా జూచుచు చెడిపోవుదురు.

తాపత్రయభూతులై దారేషణా, పుత్రేషణ, ధనేషణాధీషణత్రయ నిమగ్నులై, పడచుచు, లేచుచు, స్వపుణ్య పాపానుగుణముగా స్వర్గ నరకార్యనుభవములకు తగిన జన్మల నెత్తుచు, మరణించుచు శరీరబంధము చేతను యమభటపాశ బంధముచే బద్ధులగుచు, కృత్యాకృత్య వివేకశూన్యులై యనంత క్లేశములననుభవింపు చుందురు. తమ కోరికలు దీరుటయే పురుషార్ధమనియు నని తీరకుండుటయే హానియనియు దలంచు చుందురు. ఇట్టి జీవుల కాటపట్టయినది. లీలా విభూతియని తెలియవలెను.

శ్రియఃపతి యొక్క స్వాభావిక కారుణ్య కటాక్షములు

ఇట్లు లీలావిభూతిలో నిమగ్నులై యుండు నందఱును దురహంకారులై తమను స్వతంత్రులుగా తలంచుచుండు సంసారులై, తనను తెలియకుండుటయే గాక **త్వం మే** అనగానే **అహం మే** అని తనతో నెదురాడువారై యుండుటను గమనించి, తన యొక్క సహజమైన నిర్హేతుక జాయమాస కటాక్షముచే వీతరాగులును, పరమాత్మానురాగాలునగు కొందరిని తాను ఉభయ విభతులకు సమాననాధుడగుట వలన, సాధారణ మగు నారాయణత్వ ప్రయుక్త మగు గర్భ సంబంధము వలన

శ్రియః పతి వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః

ఇత్యాదులలో చెప్పిన రీతిగా దయాపరవశుడగుటచే విచారించి తన యొక్క చల్లని కటాక్షములచే వారి సంసార తాప మారునట్లు గటాక్షించి, తన వాత్సల్యమునకు మూలమైన శ్రియఃపతిత్వమును బట్టి ఆ చేతనులు తనను తెలిసి నట్లు సంకల్పించి, వారికి గడ తన కైంకర్య భాగము నిచ్చి కృప చేయును. ఇట్లా సర్వేశ్వరుని నిర్హేతుక కృపాదృష్టికి బాత్రులగు వారే ముముక్షువు లనబడుదురు. ఈ విషయమునే

ఏవం సంసృతి చక్రస్థే భ్రామ్య మాణే స్వకర్మభిః
జీవే దుఃఖా కులే విష్ణోః కృపా కా ప్యుపజాయతే ।
జాయమానం హి పురుషం యం పశ్యే న్మధుసూదనః
సాత్విక స్స తు విజ్ఞేయ స్స వై మోక్షార్ధచింతకః అను వచనములు స్ఫుట పరచుచున్నవి.

శ్రీ వైష్ణవాచార ప్రాముఖ్యము

శ్రీ వైష్ణవునకు అన్నిటికంటెను శ్రీవైష్ణవాచారము ముఖ్యము. ఎందుకనగా నిర్హేతుక కృపాశీలుడగు శ్రియఃపతి విరోధి నిరసన సమర్ధుడగుట చేత బద్ధ జీవులు జ్జీవించు రీతిని వారిని కటాక్షించి యొసంగిన శ్రుతి స్మృతి పురాణములు

శ్రుతి స్మృతీ ఉభే నేత్రే పురాణం హృదయం స్మృతమ్

అని చెప్పబడిన రీతిని శ్రుతి స్మృతులు నేత్ర స్థానీయములుగా పురాణములు హృదయ స్థానీయములుగాను నున్నవి. ఇట్లు కటాక్షింపబడిన శ్రుతి స్మృతులు వర్ణాశ్రమాది దర్శన సాధనములగు చున్నవి. పురాణములు వాని యధార్ధ స్వరూపము దెలిసికొనుటలో సాధనము లగుచున్నవి. అట్టి సచ్ఛాస్త్ర ప్రదర్శితములైన శ్రీవైష్ణవ విశేషాచారములతో గూడిన వర్ణా శ్రమాచారముల నిష్కృష్టార్ధమును గ్రహించిన విలక్షణాత్ములగు విప్రశేష్టులు తదితరులకు దెలుపుచుండ వలెను. ఆయంశములను యథోక్తముగా దెలిసికొనిన వారందరు యధాశక్తిగా ననుష్ఠించు చుండవలెను.

అట్లనుష్ఠించు నప్పుడు శరీర విశిష్టాత్మ ధర్మమగు (శమాచారమును భగవదాజ్ఞా కైంకర్య రూపముగా నాచరించుచు, తదుత్కృష్టాత్మ ధర్మమగు శ్రీవైష్ణవాచారము దెలిసికొనియే ముముక్షువులగు వారనుసరించు చుండవలెను. సామాన్యముగా (శుతి స్మృతీ మమైవాజ్ఞా అని భగవదాజ్ఞా రూపములుగానే (శుతి స్మృతులుండినను, తదుక్త ధర్మములు భగవత్ప్రాప్తి హేతువులగు రీతిని శ్రీవైష్ణవాచార్య జ్ఞాన పూర్వకముగా వాని నాచరింపవలెను. ఏమనగా భగవచ్ఛాస్త్రములో

త్రిషు వర్ణేషు సంభూతో మా మేవ శరణాగత

నిత్యనైమిత్తికరతో మదీయారాధనే రతః

మత్సాయుజ్యం చ సర్వేషాం వైష్ణవాచార సేవనాత్

ఇత్యాదివచనములలో తత్తద్వర్ణాశ్రమాచారముల నాచరించు మూడు వర్ణముల వారును శ్రియః పతినగు నన్ను శరణముగా పొంది, తదనురూపముగా నిత్య నైమిత్తిక ధర్మముల యందాసక్తి కలవారయి మదారాధన రూపముగా వాటి నాచరింప వలెను. అట్టి వైష్ణవాచారములను సేవించుట చేతనే నా సన్నిధి యందఖి మధారాధన రూపముగా వాటి నాచరింప వలెను. అట్టి వైష్ణవాచారములను సేవించుట చేతనే నా సన్నిధి యందఖి శ్రీవైష్ణవులకును లభించును. అని భగవంతునిచే చెప్పబడియున్నది. కాన శ్రీవైష్ణవాచారాను కూలముగా నాచరించు వర్ణా (శమాచారములే భగవత్ప్రీతిజనకములై తత్ప్రాప్తి హేతువులగుచున్నవని తెలియనగును.

శ్రీవైష్ణవ లక్షణము

శ్రీవైష్ణవుల లక్షణమును వారాచరింపవలసినస ఆచారములును నెట్లుండవలెననిన బాహ్యలక్షణము ఆంతరంగిక లక్షణమని రెండు విధములు. అందు శ్రీవైష్ణవ బాహ్యలక్షణము.

యే కంఠలగ్న తులసీ నళి నాక్షమాలా ।

యే బాహుమూల పరిచిహ్నిత శంఖ చక్రాః

యే వా లలాట ఫలకే లసదూర్ధ్వపుండ్రా

స్తే వైష్ణవా భువన మాశు పవిత్రయంతి ॥

అను వచనము ప్రకారము కంఠమందు తులసి తామర పూసల మాలలు ధరించి, బాహువుల మూలమందు తప్తశంఖ చక్ర చిహ్నములు కలిగి, ముఖమందూర్ధ్వ పుండ్రములను ధరించి యుండుటయే శ్రీవైష్ణవ బాహ్య లక్షణము. ఇట్టి ముఖ్య లక్షణములు కలవారే శ్రీవైష్ణవ శబ్ద వ్యవహారమున కర్హులు. తీనిచే తులసి నలినాక్షమాలల కంటే మరియొక రుద్రాక్ష స్ఫటికాది మాలలు ధరించుట గాని, శంఖ చక్ర వ్యతిరిక్త చిహ్నములను ధరించుటకాని శ్వేత మృన్నిశా చర్ణ వ్యతిరిక్త పుండ్రములను ధరించుటగాని, శ్రీవైష్ణవలక్షణము గాజాలదని తేలుచున్నది. ఈ ప్రమాణములో ఊర్ధ్వపుండ్రము లలాటమందు ధరింపవలసినట్లు చెప్పబడినను విశిష్టధర్మములు బోధించు **ఊర్ధ్వపుండ్రోపనిషదాదులలో**

ప్రథమం తు లలాటే, ద్వితీయం నాభ్యాం,

తృతీయం హృదయే, చతుర్థం కంఠదేశే,

పంచమం దక్షిణే కుక్షౌ, షష్టం దక్షిణే బాహౌ,

సప్తమం దక్షిణే స్కంధదేశే. అష్టమం వామకుక్షౌ,

నవమం వామబాహౌ దశమం వామే స్కంధే,

ఏకాదశం పృష్ఠ దేశే , ద్వాదశం కంఠపృష్ఠే

అని విశేషించి తత్తత్స్థానములందు కేశవాది ద్వాదశనామోచ్చారణ పూర్వక పుండ్రవిన్యాసములును శిష్టాచార సిద్ధములయి యున్నవి. కాబట్టి శ్రీవైష్ణవులకు ద్వాదశోర్ధ్వపుండ్రధారణము శాస్త్ర శిష్టాచార సిద్ధమని తెలియదగును. అశక్త్యాది విశేష హేతువులలో లలాటమందును పృష్ఠ కంఠ పృష్ఠముల యందును మాత్రమైన ధరించుట, శిష్టాచారమైయున్నవి.

ఊర్ధ్వ పుండ్ర మృద్విధాయక ప్రమాణములు

శ్రీవైష్ణవులు ధరించు ఊర్ధ్వపుండ్రములకు శ్వేత మృత్తికయే ప్రధానమని శాస్త్రములు చెప్పుట చేత, తెల్లని మృత్తికనే వాడవలెను. నారద పురాణములో

శ్వేతమృత్తికయైవ వార్యైః శ్యామయా పీతయాఽథవా

ఊర్ధ్వపుండ్రం ద్విజైః కార్యం వైష్ణవై శ్చ విశేషతః అని చెప్పబడెను.

ఇచ్చట శ్వేత మృత్తికతో పాటు శ్యామ పీత మృత్తికలను గూడ నుపయోగింప వచ్చునని యున్నను శ్వేత మృత్తికయైన అని విశేషించి అవధారణ ముండుట వలన, ఆచార్య పదార్హులగు శ్రీవైష్ణవ బ్రాహ్మణులు శ్వేత మృత్తికనే ఊర్ధ్వపుండ్రమున కుపయోగించుట విహితమై యున్నది.

శ్యామయా పీతయా ఽదివా అని పక్షాంతరముగా చెప్పబడుట చేత సామాన్యముగా శ్వేత మృత్తికా లాభమందు బ్రాహ్మణులగు వైష్ణవ మాత్రులుపయోగించుటకు, శ్యామ పీతవర మృత్తిక నుపయోగింపవచ్చునని యర్థము గ్రహింప వలెను. ఇచ్చట శ్యామ మనగా కొంచెము నీలపురంగుగల తెల్లని మృత్తిక యనియు పీత మనగా కొంచెము పచ్చని రంగు కల శ్వేత మృత్తిక యనియూ అర్థమును గ్రహింపవలెను.

అంతే కాని కేవలము శ్యామ పీత వర్ణములు గాఢముగా గల మృత్తిక యని యర్థమును చెప్పుట శిష్ట సమ్మతము కాదు. మరియు

శంఖ చక్రోర్ధ్వ పుండ్రాది ధారణం దాస్య లక్షణమ్।

తన్నామకరణం చైవ వైష్ణవం తదిహోచ్యతే

అని చెప్పబడిన విధముగా అనేక స్మృతి పురాణ వచనములు దాసచిహ్నములగు తప్తచక్రాంకణము (శంఖ చక్ర ధారణను ఊర్ధ్వ పుండ్ర ధారణమును. శ్రీ విష్ణువు యొక్క అవతారములు కాక పూర్ణావతారములగు నృసింహ రామ కృష్ణాది నామములను ధరియించుటయు, మొదలగునవి శ్రీవైష్ణవ లక్షణములని సత్సంప్రదాయ వేత్తలగు సదాచార్యుల అభిమతమని తెలియదగును.

శ్రీవైష్ణవావశ్యక బాహ్యాభ్యంతర శుద్ధి

ఇక పతివ్రతా నిమిత్తం హి వలయాది విభూషణం అని చెప్పినట్లు పతివ్రతలగు నారీమణులకు వలయాది విభూషణ ధారణము ప్రత్యేక పరాయణతను సూచించునట్లే యనన్యార్హ విష్ణు భక్తులకు శంఖ చక్రాది ధారణ రూపమగు బాహ్య చిహ్నములు సహృదయ భగవదైక పరాయణతను సూచించును. పై వచనములో వలయాది యను పదము ఉపలక్షణముగా నుండి యనన్యార్హ సూచకమగు తిరుమాంగళ్యమునే చెప్పునని గ్రహింపదగును.

ఆ వాక్యమునే అభ్యంగ శుద్ధి గూడ నుండవలెనని తెలియుచున్నది. అభ్యంతర శుద్ధి యెట్టి దనగా

పితా చ రక్షక శ్శేషి భర్తాజ్ఞేయో జనార్ధనః

స్వామ్యావరో మహత్మాచ భోక్తాచార్య మనూదితః

అని చెప్పిన రీతిని ప్రథమ మంత్రమగు అష్టాక్షరిలోని మూడు పదముల చేతను జెప్పబడిన నవ విధ సంబంధములను దెలిసికొని యనుష్ఠించుచు, తద్వివరణ రూపములగు ద్వయ చరమ మంత్రములను రహస్య ద్వయము నందు గూడ నిష్ఠ గలిగి యుండుటయే

ద్వివిధం వైష్ణవం ప్రోక్తం బాహ్య మాభ్యంతరం తథా

శంఖ చక్రాదికం బాహ్యమాంతరం వీతారాగతాః

అని చెప్పబడు ద్వివిధ వైష్ణవ చిహ్నములును శ్రీవైష్ణవాధికారి కవశ్యము నుండదగినవి. వీతరాగత్వ మనగా శ్రీశాంఘ్రి సంబంధ జ్ఞానానురాగ పూర్వకముగా నితర దేహ సంబంధులయందు ప్రతికూలతా రూపమగు వైరాగ్యమే యని తెలియదగును.

ఆచార లక్షణము

శ్రీవైష్ణవ సిద్ధాంతమందలి ఆచార స్వరూపమును దెలుపుచున్నాను. వెనుక ప్రకరణములో చెప్పిన వైష్ణవ లక్షణమైన శంఖ చక్రాది ధారణ రూప సంస్కారములను బొందునప్పుడు తాను స్వతంత్రముగా ప్రవర్తింపక

తద్విజ్ఞానార్థం స గురు మే నాభి గచ్ఛేత్ .....

ప్రోవాచ తాం తత్వతో బ్రహ్మ విద్యామ్

అని శ్రుతి జెప్పునట్లు బ్రహ్మ స్వరూప తదుపాసనాస్వరూప తదుపయోగి సమస్త పరికరములందు అత్యంత శ్రద్ధాయుక్తులై భగవదాశ్రయణము వలన దత్కటాక్ష శబ్ధ సమ్యక్ జ్ఞాననిష్ఠులై సర్వవిధ బంధువు శ్రీమన్నారాయణుడే యను నధ్యవసాయముతో గూడి స్వలబ్ధ దివ్యజ్ఞానుపదేశించు ఆచార్యుని సన్నిధిని జేరి

ఆచార్యః స స్సావ చ్ఛరరూపీ న సంశయః

గురురేవ పరం బ్రహ్మ గురు రేవ పరాగతః

గురు రేవ పరావిద్యాః గురు రేవ ధనమ్

అర్చనీయశ్చ వంద్యశ్చ పూజనీయశ్చ సర్వదా

ధ్యాయే జ్జపే న్నమే ద్భక్త్యా । భజే దభ్యర్చయే న్ముదా

ఇత్యాది ప్రమాణముల ననుసరించి యాచార్యుని సాక్షా ద్భగవన్మూర్తిగా దలంచి భగవద్విషయమున జేయదగు ధ్యానార్చనా పూజనాదికములను సలుపుచు నాయన పాదములనే నమ్మి, యాయన ముఖోల్లాసమునకై భగవద్భాగవత కైంకర్యమును జేయుట యందు నిరతుడై ఆచార్య కృపాలబ్దమగు సకలశాస్త్ర సిద్ధ రహస్య తమమగు ప్రపత్తి వైభవ జ్ఞానము కలవాడై, ఆచరించుచుండుటయే ఆచారమనబడును. ఇట్లు సకలోపాయ శ్రేష్టమైన ఈ భగవద్భాగవతాచార్య ప్రపత్తియే వెనుక వైష్ణవాచార సేవనాత్ అని చెప్పబడిన ఆచార శబ్దమునకు ముఖ్యార్థమై యున్నదని తెలియవలెను.

ఆచార్య శబ్దార్థ విచారము

ఇట్లగుచో సామాన్యముగా శ్రుతి స్మృతి సిద్ధమగు వర్ణాశ్రమాచారములను బోధింపక ఆచార శబ్దము, ఆచార విశేషమైన ప్రపత్తినే చెప్పుననుట యెట్లు పొసగును? అనినచో

తస్మాన్న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే

ఇత్యాది శ్రుతులచే న్యాసమని చెప్పబడునదియు, ముముక్షు కర్తవ్యమగు శరణ వరణరూపమైనదియునగు ప్రపత్తియే ఉత్కృష్టతపోరూపమగు ఆచారమని చెప్పుట చేతను, **సాయుజ్యం ప్రతిపన్నా యే తీవ్రభక్తా స్తపస్వినః** అని తదుపబృంహణ రూపమగు వచనములో సామాన్యమగు తపశ్శబ్దమునకు సాయుజ్య రూపవిశేష ఫలమర్థముగా చెప్పబడుట చేతను,

మత్సాయుజ్యం హి సర్వేషాం వైష్ణవాచార సేవనాత్

అను శ్రీభగవద్వచనములో ఆచారపదమునకు భగవత్సాయుజ్య ఫలకమగు ప్రపత్తి రూపార్థమును జెప్పుట చేత నట్లు వైష్ణవాచారకాష్ఠయగు ప్రపత్త్యాచరణమే ఆచార శబ్దార్థముగా జెప్పబడుచున్నది.

ప్రపత్తికి సర్వోపాయ మూర్ధన్యత్వము

సకలోపాయాచార తపస్సులలో ప్రపత్తియే శ్రేష్ఠమని చెప్పుటచే నీవిధముగా నిర్ధారితమైనది.

న్యాసశబ్దవాచ్యమగు ప్రపత్తికి శ్రేష్ఠతను ప్రతిపాదించు

తస్మా న్న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః అను శ్రుతికి ఉపబంహ్మణరూపములగు భారద్వాజ హారితాది మహర్షి ప్రణీత స్మృతి వచనములును గూడ యీ విషయమునే సమర్థించు చున్నవి మరియు

న ప్రపత్తేః పరా విద్య న విష్ణోః దైవతమ్ పరమ్ అను భారద్వాజ స్మృతి వచనము విష్ణు పరదైవత్వమును వలె ప్రపత్తికి ఉపాయమూర్ధన్యత్వమును జెప్పుచున్నది. ఇంకను మహాత్ములై బ్రహ్మవేత్తలలో ముఖ్యులగు ముముక్షువులకు చతుర్థోపాయమగు ప్రపత్తియే స్వరూపానురూపమైన ఉపాయమనియు మిగిలిన కర్మజ్ఞాన భక్తులు మూడును స్వరూప విరుద్ధములనియు దలంచి వానియందు రుచి యుండదని హారితాది స్మృతులలో జెప్పబడినది.

చతుర్భి శ్శోభనోపాయై స్సాధ్యం స్యాద్యన్మహాత్మభిః
తుర్యయా పరయా భక్త్యా సుసిద్ధం సముదాహృతమ్ ॥
తత్స్వీకుర్వంతి విద్వాం నః స్వస్వరూపతయా సదా ।
పూర్వే త్రయ ఉపాయా స్తే భవేయు రమనోహరాః ॥

అనియు కర్మజ్ఞాన భక్తి ప్రపత్తులనెడి నాల్గు ఉపాయముల చేతను ముముక్షువులగు మహాత్ములకే ఫలము లభించునో యది యంతయు నందలి నాల్గవ ఉపాయమైన పరభక్తి శబ్ద వాచ్యమగు ప్రపత్తి చేతనే సుఖముగా సాధ్యమగును. వెనుకటి మూడుపాయములును స్వాతంత్ర్య గ్రంధ దూషితము లగుటచే నంతరుచికరములు గాని ప్రతిపాదింప బడినది. అందువలన ప్రపత్తి సర్వోపాయ శ్రేష్ఠ మనదగును. ప్రపత్తి ప్రీతిరూపమైయుండుట చేత దానిని భక్తి శబ్దము చేతనే చెప్పి యుండిరి. అంతియె కాని భక్తి భేదమును తాత్పర్యము కాదు.

మరియు తుర్యయా పరయా అను రెండు విశేషణములతో జెప్పుట చేత నిచ్చట ప్రపత్తి భక్తి రూపము కాక భిన్నమని తేలుచున్నది. ఇంకనూ సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యములను మోక్షప్రకారములలో సాయుజ్యమునకు ముఖ్యత్వమున్నటులే కర్మాద్యుపాయములలో తపః శ్రేష్ఠమగు తుర్యోపాయరూప ప్రపత్తికి ముఖ్యత్వము గలదు. అందువలననే

సాయుజ్యం ప్రతిపన్నాయే । తీవ్రభక్తా స్తపస్వినః

అని చెప్పినట్లు సాయుజ్య ప్రాప్తి నందిన వారికి తీవ్రభక్తులనియు తపస్వులనియు విశేషణములు జెప్పుటలో ద్వయైక నిష్ఠులై, శ్రీవైష్ణవ ప్రపన్నులై, ఏకాంతి పరమైకాంతులని వ్యపేశింపబడు భగవద్భక్తులనుట తాత్పర్యమై యున్నది. ఈ విధముగా సచ్ఛాస్త్ర ప్రతిపాదితమైనందుననే

మత్సాయుజ్యం చ సర్వేషాం వైష్ణవాచారసేవనాత్

అను వచనము నందలి ఆచార శబ్దమునకు ప్రపత్తియే ముఖ్యార్థ మని తెలియవలెను.

ప్రపత్త్యనుపాయత్వ సిద్ధాంత సమన్వయము

ప్రపత్తి ఉపాయ మూర్ధన్య మని వెనుక నిరూపింపబడెను. దీనిపై గలుగు ఆపత్తులకు సమన్వయ మిచ్చుట నిరూపింపబడును. ప్రపత్తి వేదచోదితోపాయములలో చేరనే చేరదు. వేదాంతములలో ద్వాత్రింశద్విద్యలే భగవత్ప్రాప్త్యుపాయములుగా జెప్పబడెను. శ్రీభాష్యకారులు గూడ ద్వాత్రింశ ద్విద్యలలో నీ ప్రపత్తి కంతర్భావము జెప్పియుండలేదు.

అయినను శ్రీ వేదవ్యాసులు దమ బ్రహ్మసూత్రములలో తృతీయాధ్యాయ తృతీయపాదము నందలి విద్యలలో భగవద్గుణోపసంహారమును గూర్చి చెప్పుచు నీ ప్రపత్తియగునది విద్యాభేధమని సూచించెను.

కాని **తస్మా న్న్యాస మేషాం** అను నుపనిషద్వాక్యము ప్రపత్తికి ఉపాసనారూప విద్యలలో నంతర్భావము జెప్పలేదు. ఇచ్చటి తప శబ్దము చేత కాయక్లేశ సాధ్యమగు సాధ్యకర్మలలో నొకటై వానిలో మర్ధన్య మని మాత్రము అర్థము జెప్పవలసి యుండును అను శంక రాగా దానికి సమాధాన మేమనగా శ్రీ వేదవ్యాస సూత్రములలో గుణోపసంహార పాదములో సందేహమున్న విద్యలను మాత్రము ఉదహరించి అందు ఉపసంహరింప వలసిన గుణముల నిర్ణయమును చెప్పుచు విద్యాభేదములనన్నింటిని చెప్పక నానాశబ్ధాది భేదాత్ అను సూత్రము మాత్రము జెప్పబడెను. దానిని వివరింపుచు శ్రీ భాష్యకారులు గూడ విచారిత విద్యల యొక్క వివరమును పేరుబెట్టి చూపిరి. అంత మాత్రము చేత ప్రపత్తికి ఉపాయత్వమే లేదని గాని చెప్ప వీలుండదు. నానా విద్యలలో శబ్ద భేదములను బట్టి న్యాస విద్యకు గూడ గ్రహణముండవచ్చును.

ఇక తపశ్శబ్దమునకు కాయ క్లేశ రప తపస్సని అర్థము చెప్పి దాని వలన ప్రపత్తి తప శ్రేష్ఠమని నిరూపించుట గూడ సమంజసము గాదు. తపః సంతాపే అను ధాతువు వలన వ్యుత్పన్నమైన తపః శబ్దమునకు మానసిక సంతాపము అర్థమయి దాని వలన సంసార ప్రతిబంధక నివృత్తి కామనా పూర్వక నిరతిశయోపాయాచరణ మర్థముగా జెప్పి, అందులో అతిరిక్త తపోరూపముగా ప్రపత్తిని గ్రహించి ఇదియు ఉపాసనాత్మక విద్యలలో నంతర్భవించునని ఉపనిషత్తాత్పర్యముగా గ్రహింప వలసి యున్నది.

న్యాస మనగా భగవంతుని యందు చేతనుడు తన ఆధారము నర్పించుట అని యర్థము. ఇట్లు తన నిర్భరతకు తోడ్పడి భగవదనుగ్రహరపమగు సాక్షాన్మోక్ష ప్రదర్శ రప సిద్ధోపాయమును సాధించును. బాగుగా విచారించినప్పుడు కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తులు నాలుగు గూడ సాక్షాన్మోక్ష సాధనోపాయములు గాజాలవు. భగవత్ప్రీతి జనకములై పరంపర మా ఉపాయము ఇట్టి ప్రపత్త్యుపాయము ద్వయమంత్ర పూర్వ వాక్యోచ్చారణ పూర్వకమై యుండును.

అందువలన ఆచార్య సమాశ్రయణ పూర్వకముగా ద్వయోపదేశమును పొంది ఆచార్య సన్నిధిలో నొకే పర్యాయము ద్వయోచ్చారణ పూర్వక ప్రపత్తిని జేయవలెను. తరువాత బాహ్యాభ్యన్తర శుద్ధి కొఱకు ద్వయోచ్చారణము చేయుచుండుట ప్రపత్తి రూపము కాక మనోదార్ఢ్యము నాపాదించును. ఈ సంగతినే

అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాం గతో ఽపివా

ద్వయ స్మరణ మాత్రేణ స బాహ్యాభ్యంతరః శుచిః అని స్మృతి వచనము చెప్పుచున్నది.

ప్రపత్తి సకృదనుష్ఠేయమని **తెన్కలై వారును,** అసకృదను ష్ఠేయమని **వడకలై వారును** నమ్ముచున్నారు. ఆయా వివరములు పూర్వాచార్య గ్రంథములలో జూడనగును.

ప్రపత్తి యొక్క నిష్కృష్ట స్వరూపము

ప్రపత్తి యొక్క నిష్కృష్ట స్వరూప మనగా, వైష్ణవాచార సేవనాత్ అని చెప్పిన రీతిని ప్రపత్తి ఫలింపవలెనను నప్పుడు ప్రపత్తిని కేవల భగవంతుని విషయముననే కాక తదీయులగు భాగవతుల పర్యంతము పర్యవసింప జేయవలెను. ప్రపత్తికి పూర్తి యనునది విష్ణు పాదాశ్రయులగు శ్రీవైష్ణవులలో నొక వ్యక్తి మాత్ర మందు పర్యవసితమై వారి నాచారములుగా వరించి వారి విషయములో ప్రపత్తి చేయుట వలన కలుగును. దాని వలన మనస్సు స్వచ్ఛమై ఆచార్య సేవాభిరతుడై యుండుట గలుగును. అదియే విషయనబడును. తన్నిష్ఠ అయితే ద్వయ ప్రతిపాద్యమగు ప్రపత్తి శ్రియః పతి విషయమున గాక తదీయ పర్యంతము పర్యవసించు నను దానికి మూలమేమి? అనినచో

సర్వస్య ప్రభవో యస్మా ద్విష్ణు పాదాశ్రయో నరః

తన్మూలతః క్రియా స్సర్వా స్సఫలా భవంతి హి

సిద్ధే తదీయ శేషత్వే సర్వార్థాః సంభవంతి హి

అను బోధాయన స్మృతిని బట్టి విష్ణు పాదాశ్రయుడగు నరుడు సమస్త ఫలములను బొందును. వాని భక్తులగు వారి కటాక్షమే గలిగినచో సమస్త క్రియలు క్షణములో సఫలములగును. భాగవత శేషత్వము సిద్ధించినచో సమస్త పురుషార్థములును గలుగును. అని తెలియుట వలనను ఇంకను ఇట్టి బహు ప్రమాణముల వలన కలుగు ప్రసిద్ధి వలనను భాగవత పర్యంతత్వము ప్రపత్తికి సిద్ధించును.

తదీయ శేషత్వ వైభవము

ఇట్లు నిష్కర్షింపబడిన తదీయశేషత్వము సాత్వికాగ్రేసరులగు మహర్షులకును, ఆళ్వార్లకును, నిత్యసూరులకును, నాదరణీయమైయే యున్నది. ఋషులలో శాండిల్య ఋషి

సిద్ధి ర్భవతి వా నేతి సంశయో ఽచ్యుత సేవినామ్

న సంశయో ఽస్తి తద్భక్త పరిచర్యా రతాత్మనామ్ ॥ అని చెప్పెను.

అనగా భగవద్భక్తులకు తమ పురుషార్థ సిద్ధిని గూర్చి సంశయముండును. గాని తద్భక్త పరిచర్యాసక్తుల కట్టి సంశయముండబోదని తాత్పర్యము.

అట్లే శ్రీశుక ఋషి **లక్ష్మీ భర్తుర్నరహరితనో ర్దాసదాసస్య దాసః**

అని తదీయదాస్య ప్రాధాన్యమును జెప్పెను. వామన పురాణములో నారదుడు

దాసో ఉహం వాసుదేవస్య దేవదేవస్య శార్ఙ్గిణః

యే నమస్యంతి సతతం నారాయణ మనామయమ్

తేషాం చ దాసదాసో ఉహం పునర్జన్మని జన్మని అనియు నారసింహ పురాణము నందు

జన్మాంతర సహస్రేషు యస్య స్యాద్భక్తి రీదృశీ

దాసో ఉహం విష్ణు భక్తానా మితి సర్వార్థ సాధనీ

స యాతి విష్ణు సాయుజ్యం పురుషో నాత్ర సంశయః అనియు జెప్పబడెను.

ఇక నిత్య సూరులలోని శంఖ చక్రాంశ సంభూతులగు భరత శత్రుఘ్నులలో శత్రుఘ్నునకు గల భాగవత నిష్ఠయగు భరతానువర్తనము శ్రీరామాయణములో

గచ్ఛతా మాతు లకులం భరతేన తదా ఉనఘః

శత్రుఘ్నో నిత్య శత్రుఘ్నో నీతః ప్రీతి పురస్కృతః

అను శ్లోకములో జెప్పబడెను. ఇంకను నిత్యాభివాంఛిత పరస్పర నీచభావైః అను అభియుక్తుల నిత్యసూరిస్వరూప నిరూపణము గూడ నీ విషయములో ప్రమాణము గాగలదు. ఇక ఆళ్వార్లు కూడ

అడియార్గళెన్దమై విఱ్కవుం పెరువార్ గళ్

భగవద్దాసులు మమ్ము విక్రయించు కొనుటకు గడ సమర్థులు అనియు

తొణ్డర్ శేవడి చ్చెల్వం శేతేన్ శెన్నిక్కణివనే

భగవదాసుల దివ్య పాదపద్మములను నా శిరస్సు నందలంకరించు కొనెదను, అనియు

అడియార్కెన్నై యాళ్ పడుత్త విమలన్

భగవద్దాసులకు నన్ను దాసునిగా జేసిన విమలుడు అనియు

కడల్మల్లై త్తలశయనత్తుఱైవారై క్కొణ్డాడుం నెఞ్జుడైయారవ

రెఙ్గళ్ కులతైవమే తిరుక్కడల్ మల్లై

యందలి తలశయన మనెడు దివ్యదేశము నందు వేంచేసియుండు స్వామిని గొని యాడెడి మనస్సు కలవారగు దాసులు మా కులదైవములు అనియు

తణ్ శేఱై యెమ్బెరుమాన్ తాళ్ తొజావార్ కాణ్మిన్ ఎన్తవైషేలారే చల్లని శేఱై

అను దివ్య దేశము నందలి మా స్వామి యొక్క తిరువడిని శేవించువారు సుడీ మాఖు శిరోధార్యులు అనియు

పాఱ్కడల్ శేర్ న్ద పరమనై ప్పయిలుమ్

తిరువుడై యార్ ఎమ్మైయాళుం పరమరే

పాల సముద్రము నందు వేంచేసి యుండు పరముని ఆదరించు సద్గుణము గలవారు. మమ్ము నేలుకొను పరమపురుషులు అనియు సాయింపబడు శ్రీసూక్తుల వలన వారియొక్క తదీయ శేషత్వ సిద్ధాంతము

స్పష్టమగుచున్నది. ఇక పూర్వాచార్య గోష్ఠిలో గూడ ముఖ్యులగు యామునాచార్యులు

తవ దాస్యసుఖైక సజ్గినాం భవనే ష్వస్త్వపి కీట జన్మమే,

ఓ భగవన్ నీ దాస్య సుఖమందు మగ్నులైన దాసుల గృహములలో నొక పురుగుగా జన్మించుట గూడ నాకు వాంఛనీయమే అని చెప్పిరి. శ్రీవరవర మునులు

త్వద్ధాస దాసగణనా చరమావధౌ

య స్తద్ధాసతై కరసతా విరతా మమాస్తు"

ఓ ఉడైయవరే! భగవద్దాసులగు తమ దాసగుణములో తుది దాసుని యొక్క దాసునిగా నుండు భాగ్యము నాకవిరతముగా నుండును గాక" అని సాయించిరి. ఇట్టి అభియుక్తోక్తులను బట్టి వారి యందరి సిద్ధాంతమును తదీయ శేషత్వమే అని స్పష్టమగుచున్నది.

శ్రీవైష్ణవాచార సేవన పదముల సరసార్థము

శ్రీ పాంచరాత్ర సంహితలో భగవంతుడు స్వయముగా నానతిచ్చిన

మత్సాయుజ్యం చ సర్వేషాం వైష్ణవాచారసేవినామ్ అను వచనము చొప్పున నందు జెప్పబడినది.

వైష్ణవులు తులసీ నలినాక్ష మాలాధారణ పూర్వకముగా, శంఖ చక్ర లాంఛిత బాహు మూలత్వమును లలాటఫలక లసదూర్ధ్వపుండ్రత్వ మును నగు రూప విశేష లక్షణములు గల శ్రీవైష్ణవ ప్రపన్న ఏకాన్తి పరమైకాన్తి వ్యపదిష్టులగు విష్ణుభక్తులనియు, ఆచారమనగా సర్వోపాయ శ్రేష్ఠమగు ప్రపత్తియనియు, తత్సేవనమనగా భాగవత పర్యంతానుష్ఠాన మనియు నిష్కర్షార్థమును జెప్పవలసియున్నది. ఈవిధమును భగవత్సాయుజ్య కాము లందఱును దెలిసికొనదగును.

ఆచార్యాభిమాన ప్రభావము

ఇట్టి నిష్కృష్టాత్మ స్వరపమున కనురపమగునట్టియు భగవదత్యంత ప్రీతికరమగునట్టియు శ్రీ వైష్ణవాచార నిష్కర్షము **శ్రుతి స్మృతి ర్మమైవాజ్ఞా** అను దానిని నమ్మి భగవత్ప్రాప్తి హేతుభూతమగు భాగవత సేవనమే యను ప్రధానార్థము గలదిగా గ్రహింపవలెను. అట్టి భాగవత విశేషులగు నాచార్యుల అభిమానము గలిగినచో

అనన్త విహగేశాద్యై రర్చిత స్సర్వ దైవతైః

తేషా మన్యతమో భత్వామోదతే తత్ర దేవవత్ ॥

దాసవ త్పు త్రవచ్చైవ మిత్రవ ద్భన్ధువత్సదా అనియు,

సో శ్నుతే సర్వా న్కామా స్సహ బ్రహ్మణా విపశ్చితా అనియు

సర్వదాదూర విధ్వస్త దుఃఖవేశ లవాంశకః

గుణానుభవజ ప్రీత్యా కుర్యాద్దాస్య మశేషతః

అని హారీతస్మృతిలో జెప్పబడినట్లు అనంతగరుడ విష్వక్సేనాది నిత్యసూరి వర్గమున కాదరపాత్రమై, వారిలో నొకడై, నిత్య సరుల వలె నానందానుభవమును జెందుచు భగవత్కల్యాణ గుణములతో శ్రియఃపతిని సేవింపుచు నిరస్త సమస్త దుఃఖుడై గుణానుభవజనిత ప్రీతితో సకలవిధ భగవత్కైంకర్యములను ముచుందునని తెలియుచున్నది.

భగవంతుడు పరమరహస్యోపాయమును చెప్పుటకు హేతువు

భగవంతుడు ఇట్టి పరమరహస్యమగు శ్రీవైష్ణవాచార నిష్కర్షమును వెలిబుచ్చుటకు హేతువేమనగా, జగత్కారణభూతుడును సకలధ్యేయుడును నగు శ్రియఃపతి తనదయా వాత్సల్యాది గుణములు నిత్యవిభతి యందు పగటిదీపమువలె నిస్తేజములై యుండుటచేత వానిని తమో బహుళమగు లీలా విభూతిలో చేతనుల యందు గల కృపావిశేషముచే సదాచార్య ముఖముగా చేతనులకు కటాక్షింపగా వాని ప్రభావమును దెలసికొని ముముక్షువులై క్రమముగా పరమపదమునందు నిత్య కైంకర్య రతులై యుజ్జీవింపవలెనను భగవంతుని తీవ్రేచ్ఛయే యని తెలియవలెను.

సదాచార్య లాభ ప్రభావము

సర్వాత్మగ స్సర్వసుహృ త్సర్వ భృధ్భృత భావన
యమీ భగవాన్కృష్ణో ముకున్దో ఉ నన్త ఏవచ

అనువచన ప్రకారముగా సర్వ వ్యాపకుడును సర్వవిధ బంధువును సర్వరక్షకుడును సర్వస్రష్టయు, సర్వ నియంతయు నవాప్త సమస్త కాముడును, జ్ఞానబలైశ్వర్యాదనంత కళ్యాణగుణనిధియు సాధు పరిత్రాణాద్యర్థమై భమియం దవతరించు వాడును సర్వ ఫలప్రదుడును, దేశకాల వస్తుకృత పరిచ్ఛేద రహితుడును నగు శ్రియఃపతికి తన జగద్వ్యాప్యాది గుణములకు ప్రయోజనము బద్ధజనముక్తి ప్రధానమేయగుట చేత నుభయ విభూతి నాథత్వము వలన స్వతః సిద్ధమైన గొప్పతనమును కొనుట, ఆయన ప్రధానకృత్యమై యున్నది అట్టి కారణము వలన నిత్య విభూతిలో నిత్యముక్త సేవ్యుడై యుండియు బ్రహ్మ అను రీతిని నిరతిశయానందముతో గూడి యుండియు

ఆనన్దో కృపైదుఃఖిగళుక్కు వాత్సల్యం సోషర్కు శీలం మందర్కు అని చెప్పిన ప్రకారముగా దయావాత్సల్య శీలాది గుణములు విజృభింపగా అనిత్య విభూతిలో తన కనుభవమున్నను లేనట్లుగనే భావించి లీలావిభూతిలో సదోషులై దుఃఖితులై మందులై **సంసృతి చక్రస్థే** అను రీతిని సంసారచక్రములో జిక్కునడి యుండు బద్ధచేతనులపట్ల తన మనస్సు బరువెత్తగా అయ్యో వీరును నిత్యముక్తులవలె నిత్య నిరవద్య నిరతిశయానంద రూప మగు నా కైంకర్యమను మహైశ్వర్యమును పొందుట కర్హులే గదా! అని పరితపించి విచారించి తన కైంకర్యములో వీరు గూడ నన్వయించు ప్రకారమేది? అని యోచించి **శాసనా చ్ఛాస్త్రమ్** అనునట్లు స్వాజ్ఞారూపమగు వేదశాస్త్ర ప్రమాణమును వారికి విశాలదృష్టి గలుగుటకై గటాక్షించి పరమపద ప్రాప్తికి సాధనములగు కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తులను **నానేరవలితన్ద వాట్టాత్తాన్** అనినట్లు జ్జీవనమార్గములుగా తెలిపియుండగా నా మార్గములన్నియు నధికారి భేదమును బట్టి వేర్వేరుగాను గలసి యొక్కటిగాను సాంసారికులకు విభ్రమము గల్పించునది గాంచి వారా నాల్గు మార్గముల వలనను తనను సమీపించుట కష్టమని మరియు యోచించి తాను వారికి **పితా చ రక్షకః శేషీ** అను రీతిని నవవిధ సంబంధములు గలవాడని వారు తెలసికొనుటకును నట్టి సంబంధమును బ్రతిపాదించునట్టియు, సకల శాస్త్రసారమైనట్టియు తిరుమంత్రము (అష్టాక్షరి) యొక్క ప్రతి పాద్యార్థములగు స్వరపోపాయ పురుషార్థముల యందు నిష్ఠను బద్ధాత్మలైన వారు దెలిసికొని యుజ్జీవించుటకై తన దయాతిశయము చేత కృష్ణుడై అవతరించి మామేకం శరణం వ్రజ అని తనను శరణముగా అధ్యవసించమని బోధించెను అట్టి కృష్ణావతారము ఏదో యొక కాలమందు వరదవచ్చి పారు నది వలె, మిగిలిన అన్ని కాలములందలి వారికిని నుపయోగపడ జాలదాయెను.

అందుచే తన పరవ్యూహ విభవాన్తర్యామ్యర్చా చార్య భాగవత స్వరూపములను దలంచి తాను సర్వ వ్యాపియగుట వలన ఈ చేతనులకు ఇష్ట ప్రాప్త్య నిష్ట నివృత్తులు గలుగు ప్రకారము ఏదియో యని విచారించి అట యిట్టిదని వారికి నిస్సంశయముగా తెలుపవలెనని తలంచి **జంగమ శ్రీ విమానాని హృదయాని మనీషిణామ్** అనునట్లు బ్రహ్మజ్ఞుల హృదయములే జంగమ భగవదాలయములని సృష్టి పరచి, అట్టి మనీషులెవ్వరును సంశయము గలుగకుండ ఏకంఠలగ్న తులసి నలినా మాలా ఇత్యాది లక్షణములు గల శ్రీవైష్ణవులే యని సుప్రసిద్ధమగు రీతిని వ్యక్తపరచి యందు గూడ నొక్కొక్క నిలక్షణ వ్యక్తి యందు తాను పరిపూర్ణుడై యుండునను నంశము దోచునట్లు అట్టి వ్యక్తుల లక్షణముల నిట్లు వెల్లడించెను

నిరపేక్షం మునిం శాంతం నిర్వైరం సమదర్శినమ్ అను వ్రజా మ్యహం నిత్యమ్

అనగా ఎట్టి అపేక్షలు లేక మనస శీలుడై శాంత స్వభావుడై ఎట్టి వాని యందును ద్వేషము లేక నందరను నొక్క రీతిని చూచు వాడగు శ్రీవైష్ణవుని నే నెల్లప్పుడు అనుసరించి యందును అనియు,

సాధనో హృదయం మే సి సాధూనాం హృదయం

హ్యహమ్ మదస్య త్తేన జానంతి నాహం తేభ్యో మనాగపి

అనగా ఉపాసకులగు భక్తులు నాకు హృదయ భూతులు వారికి నేను హృదయభూతురను నాకంటె అన్యులను వారును, వారికంటె అన్యులను నేనును యెరుగము అనియు,

వశీకుర్వంతి మాం భక్త్యా సత్స్త్రియ స్సత్పతం యథా

అనగా అట్టి భక్తులు తమ అనన్యార్హతా గర్భమగు భక్తి చేత పతివ్రతలైన స్త్రీలు ఉత్తమ పతినివలె నన్ను వశపరచుకొందురు అనియు తానే స్వయముగా వివరించెను. మరియు అట్టి వైలక్షణ్యము చేత విరాజమానులగు వారివారని తెలియుటకు వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః శ్రియఃపతియే నాకు ధారకపోషక భోగ్యములని యుండువారే అని లక్షణము జెప్పుచు నాకు గూడ నట్టి మహాత్ముల రరుదుగానే లభించురని తానే చెప్పియు, తన భక్తులగు ఆళ్వార్ల చేత గూడ

ఉణ్ణుం శోరుపరుగు నీర్ తిణ్ణుం నెత్తిలైయు

మెల్లాం కణ్ణన్ యూవారాయ్ నిక్కిన్త దెల్లాం

నెడుమాలే న్త్తోరాదార్ కత్కిన్త దెల్లాం కడై

ఇత్యాది శ్రీ సూక్తుల చేత చెప్పించియు, అట్టి ఆళ్వార్ల కుండు భక్తాగ్రేసరత్వమును

కాసార సంయమి ముఖాః కమలా సహాయ భక్తాః ప్రపత్తి

పదవీ నిరతా మహాంతః భక్తానేవ పరాంకుశాది పురుషాన్ అని చెప్పించియు

యస్యాభవ న్ననయ వాఇవ పారతంత్ర్యాత్ అని నమ్మాళ్వార్ల

కందరాళ్వార్లు అవయవ భూతులని వారిని ప్రఖ్యాపించి, అట్టి నమ్మాళ్వార్ల తిరునామమునే తమ పాదుకలకు శఠకోప మని పేరుగా నుండునట్లు చేసి వారే తమకు భూమిపైని కాలుమోపుట కాధారభూతులని సకల జనులకు తెలియునట్లు సూచించియు, నిట్లనేక విధముల గటాక్షించెను.

మరియు నింతియెగాక తన కనంత వైనతేయాదులను అంతరంగులున్నను నమ్మాళ్వార్లనే పాదుకాస్థానములో స్వీకరించినట్లు ఆ నమ్మాళ్వార్లకు గూడ మధురకవి నాథమున్యాదు లంతరంగులై యున్నను

ఆయాళ్వార్లకు పాదుకాస్థానముగా ఎమ్బెరుమానార్ల నే నిర్ణయించి రామానుశన్ అను నామముతో పండిత పామర సాధారణముగా నన్ని దివ్య దేశములలో ప్రసిద్ధమగునట్లు దానే కటాక్షించెను.

ఇట్లు సర్వేశ్వరుడే సంకల్పించి నడిపించుటకు

మమ మద్భక్త భక్తేషు ప్రీతి రభ్యధికా భవేత్ అను భగవద్యానమే మూలమని గ్రహింపవలెను,

అట్టి తద్భక్త భక్తులే శ్రీవైష్ణవులకు పరమప్రాప్య భూతులను నంశము పూమన్ను మాదు అను పాశు రములో విశదపరచబడినది. ఇంకను తన కత్యంత ప్రియులగు రామానుజుల నాదరించిన వారు రామానుజదాసులని సమస్త వైష్ణవులును అసాధారణమునామ ధరించియుండవలెనని నిర్ణయింపజేసిరి. అంతటితో దృప్తినందక తనకు శ్రీపాదుకాస్థానాపన్నులు శఠకోపులై నట్లును, వారికి పాదుకాస్థానాపన్నులు రామానుజులైనట్లును రామానుజుల సకాలములో నుండు కూరేశ కురుకేశ గోవిందాద్యంతరంగులగు దాసులున్నను యతీన్ద్ర ప్రవణులని తదేక ప్రసిద్ధనామముగల మణవాళమామునులను రామానుజ పాదుకాస్థానీయులగు నట్లు గటాక్షించిరి. దానికి తార్కాణముగా శ్రియఃపతినే నమ్మిన శఠకోపులవలెనును, శఠకోపులనే నమ్మిన రామానుజుల వలెనను, రామానుజులనే నమ్మి

పూ మగళ్ కోన్ ఎన్దెయిరామానుశనై వాయ్న్దు ఎనదు నెఞ్జమే వాళ్

అని అనుసంధించుచు యతీంద్ర ప్రవణులని శ్రీరంగనాథుం స్వయముగా మనవాళ మామునుల విషయమై యానతిచ్చిరి. ఎంబెరుమానార్ల సమకాలికులగు దాశరథి అను వారికి ఎంబెరు మానార్ల పాదుకలను వ్యవహారమున్నను తరువాత మణవాళ మామునులే రామానుజ పాదుకా స్థానీయులని భగవదభిమతమైనది. శ్రీవైకుంతములో నివాస శయ్యాసన పాదుకాంశుకే త్యాదిగా జెప్పబడినట్లు పాదుకులుగా అనంతులైయున్నను లీలావిభతిలో శఠకోపు లెట్లు పాదుకాస్థానీయులై యుండిరో యట్లే తదనంతర కాలములో మణవాళ మామునులే రామానుజ పాదుకాస్థానీయులైరి అని తెలియదగును.

మణవాళ మామునుల సదాచార్యత్వము

వెనుక జెప్పినట్లు శ్రియఃపతి తన ప్రధాన ప్రపతి బోధకమగు ద్వయమంత్రమందలి ఆరు పదములను భాగవతుల హృదయ పద్మమందు నాటునట్లును, తదర్ధమును లభించునట్లును, వరవరమునులనెడి మహానుభావులను తాను విశేషించి కటాక్షించిన విధముము తోపించునట్లుగా, ఎంబెరుమానార్లను గటాక్షించి కురంగ నగరీపూర్ణ మంత్రరత్నోపదేశకః అని చెప్పబడినట్లు తిరుక్కురుంగుడినమ్బి యను వారిని గటాక్షించి మంత్రరత్నమును వారి వలన నుపదేశమును పొందినట్లే శ్రీరంగనాథుడుగానుండు తాను వరవరమునులను ఆచార్యులనగా వరించి తిరువాయ్ మొళి వ్యాఖ్యానమగు ఈడు ముప్పత్తారాయిరమును విని, తన కాయన ఆచార్యులగునట్లాదరించి కటాక్షించెను.

ఇట్లు ప్రారంభము నుండియు ప్రవర్తించు సదాచార్య ప్రధానమగు శ్రీవైష్ణవాచార నిర్ణయములో నిష్టులైయుండు వారిలో నగ్రేసరులగు యతీన్ద్ర ప్రవణులను మణవాళ మహామునుల వైభవము తన దాసులందరును తెలుసుకొని యాదరించి వరవరమునుల పాదప్రవణులై ఉజ్జీవింప వలెనను నుద్దేశముతో శ్రీరంగనాథుడు, సంస్కృత వేదాధ్యయనాద్యంతములలో అవశ్యకముగా ప్రణవము నుచ్చరించవలసినట్లే ద్రావిడ వేద తదంగోపాంగభత సమస్త దివ్య ప్రబంధముల అనుసంధానాద్యంతముల యందు

శ్రీశైలేశేత్యాది వరవరమునితనియన్‌ను అనుసంధించునట్లు నియమించిరి. అట్లు దిద్దుబాటు జేయుటయే గాక, పశుం శాన్దుమ్ ఇత్యాది వలె తనకు అసాధారణాంగ రాగాదులను దగునట్టి ద్రావిడ వేదాది దివ్య ప్రబంధములు దాచుకొనదగినట్టి భరిణెయు మూతయువలెనే వరవరమునుల దివ్య నామముండునట్లు మిక్కిలి సంతోషముతో సంకల్పించి యనుగ్రహించి యుండిరి.

అట్టి యుపకార స్మృతి గుర్తెరిగియే నిఖిల దివ్యస్థలముల యందును దివ్య ప్రబంధము చాత్తుచేయు సమయములో భాగవతులు మణవాళ మామునుల గూర్చిన వాళి త్తిరునామములను అనుసంధించి, మణవాళ మామునియే యిన్న మెరు నుత్తాణ్డిరుమ్ అని కోరుచుందురు. ఇంకను అట్టి మణవాళ మామునులను భగవచ్చరణ చరమావధిగాదలంచి

కుణ్ణమెదుత్తా వడి శేరి రామానుశన్ తాళ్

పిడిత్తా ర్పిడిత్తారై పత్తి నన్టుమ్ తిరువుడైయోమ్

అని నిర్భరులై ఉజ్జీవించుచుందురు. ఇట్టిది మణవాళ మామునుల దివ్య ప్రభావము.

సదాచార్య నిర్ణయము

శ్రీరంగనాధుడు స్వయముగా యతీన్ద్ర ప్రవణం వన్దే అను ఈడు శాత్తు సమయములో బాలక రూపములో సాయించుట చేతనే ఎంబెరుమానార్ల శ్రీపాదసంశ్రయులలో చరమావధిగా శ్రీమణవాళమామునులు యతీంద్ర ప్రవణులై సదాచార్య ముఖ్యులై యుండిరి. శ్రీవైష్ణవ సిద్ధాంతమునకు రామానుజ దర్శనమని శ్రీరంగనాథుడెట్లు ప్రసిద్ధి నిచ్చెనో యట్లే రామానుజ దర్శన మందలి వారిలో శ్రీ వరవరమునులకు యతీంద్ర ప్రవణులని ప్రసిద్ధి నిచ్చెను. అట్లు రంగనాధుడే నిశ్చయించి కటాక్షించుటచే శ్రీవైష్ణవ సిద్ధాంతములోని వారికందరకును **ఇరామానుశనుడైయార్ రామానుజీయులని** వ్యవహారము గడ గలిగెను. ఇంతియే కాక

తస్మిన్ రామానుజార్యే గురు రితి చ పదం భాతి నాన్యత్ర అనియు

భక్తి ప్రపత్తీ యది దుష్కరే నో రామానుజార్యం సమత

శ్రీరామానుజాచార్యులయందే ఆచార్య పదము జెల్లును ఇతరుల యందు జెల్లనేరదు. భక్తి ప్రపత్తి రూపోపాయానుష్ఠానము దుష్కరమని మీకు దోచినచో రామానుజాచార్యులను నమస్కరించిన జాలును అనియెడి రహస్యము సదాచార్యోపదేశ సూక్తులలో సాయించబడి యుండుటకు గూడ నిందు ప్రమాణమై యున్నది.

అట్టి ఉపదేశము ననుసరించియే

శ్రీమాధవాంఘ్రి చరణద్వయ నిత్య సేవా ప్రేమావిలాశయ పరాంకుశ పాద భక్తమ్

అని యారంభించి **యతిరాజ దయాంబురాశే .... అనన్య శరణో భవతీతి మత్వా**

అని శ్రియఃపతి పాదభక్తులైన నమ్మాళ్వార్లకు చరణస్థానీయులైన యెంబెరుమానార్లను శరణముగా బొంది దయాసముద్రులగు యతి రాజులు దమ విజ్ఞాపన మాలకించి తమను అనన్య శరణులమని తలంచి కటాక్షింపవలెనని యతిరాజవింశతి యందు వరవర మునులు విన్నవించి యుండిరి. ఇంకను దాము సాయించిన ఉపదేశ రత్నమాలయందు గూడ

ఇన్న ఉపదేశ రత్తిన మాలై తన్నై చిన్దైత్తన్నిల్ నాళుమ్

శిన్దిప్పార్ ఎన్దై యతిరాశరిన్నరుళు కున్గ్షు మిలక్కాగి చ్చదిరాగ వాళిన్దిడువర్

తామే అని తమ ఉపదేశ రత్నమాల యెంబెరుమానార్ల ప్రీతిని కోరి సాయించబడినందున దానినను సంధించు వారు గూడ ఎంబెరుమానార్ల కటాక్ష పాత్రులగుదురనుచు సాయించిరి.

అట్లే ఆర్తి ప్రబంధములో గూడ నెమ్బెరుమానార్లకు మంగళాశాసనము చేయువారును వారికి మంగళాశాసనము చేయువారును నిత్య సూరులకు గూడ శిరోధార్యులనుచూ,

వాళి యతిరాజన్ .... విణ్ణోర్ తలై అని సాయించుచు

తన్దై తాయ్ తనయర్ పేరం శెల్వమ్ ఎన్దమక్కు నీయే యతిరాశా

నాకు సకలవిధ బంధువును సంపదయు నీవే స్వామి యతిరాజా అని విన్నవించిరి. ఇట్లు స్వాను సంధానురూపముగా మణవాళ మామునులు ఇదియే శ్రీవైష్ణవ సిద్ధాంత సారమని అందరును తెలిసికొను నట్లు సాయించి యుండిరి.

కాన శ్రియఃపతి చరణాశ్రితులగు రామానుజుల పాద సంబంధము వలన గలుగు సదాచార్యత్వము యతీంద్ర ప్రవణులగు వరవరమునుల యందే స్థిరమై యున్నది. ఇట్టి శ్రీవైష్ణవ వైభవము నెరిగిన వారందరకును మణవాళ మామునుల పట్లనే స్వాచార్య బుద్ధియు సదాచార్య బుద్ధియు ప్రపత్తియు నుండవలె ననునదియే సమ్య జ్ఞాన ఫలమైయున్నది.

శ్రీవైష్ణవ దర్శమునకు వరవరమునుల ఉపకారము

అయితే ఆ వరవరమునుల సమకాలము మొదలు నేటి వరకు నుండు ముముక్షువుల కందరకును స్వాచార్యులుగా వారియందే ప్రపత్తి యుండవలె ననునది తత్త్వజ్ఞులైన వారికి మాత్రమే తెలియగలదు. కాని యందరికిని అట్టి ప్రతిపత్తి దెలిసి యాచరింపబడుటెట్లు సంభవించును? ఈ రామానుజ దర్శనమునకు వారు చేసిన ఉపకారము లేవయిన నందరకు దెలియునవిగా నుండవలెను గదా!

అనినచో వరవరమునులు కృపతో సాయించిన **రహస్య త్రయ తత్వ త్రయ శ్రీవచన భూషణములకు, అర్చిరాది, ఆచార్యహృదయము, జ్ఞాన సారము, ప్రమేయసారము,** అను గ్రంధములకు, అతివివరణ రూపమై విశదమగు వ్యాఖ్యానతతిశయము, **తిరుపల్లాండు** మొదలుకొని **శెన్నియోఙ్గు** వరకు నుండు **పెరియాళ్వార్ తిరుమొళి** కిన్నీ, **పెరియవాచ్చాన్పిళ్లై** సాయించిన నలబది పాశురములకు దప్ప మిగిలిన దానికంతకు సాయించిన వ్యాఖ్యాన మున్ను ప్రసిద్ధములు, మరియు **ప్రపన్న గాయత్రి** యను ప్రసిద్ధిగల **ఇరామానుశనూత్తందాదికి** వ్యాఖ్యానమున్ను వారు సాయించిరి.

దీర్ఘశరణాగతియను వ్యవహారముగల **తిరువాయ్‌మొళికి** విపుల వ్యాఖ్యానమగు **ఈడు ముప్పత్తారారప్పడిలో** ప్రదర్శింపబడిన **శ్రుతిస్మృత్యాదికి ప్రమాణతిరట్టు** అనుదానిని సకల శాస్త్ర విచారణాపూర్వకముగా నుదాహరించి వ్రాసి యుండిరి. ఇట్టి మహోపకారము వలన శ్రీవైష్ణవ మతస్థులగు ఆస్తికజనులకు నాలాయిర దివ్య ప్రబంధమునకు నిరర్గళమగు వివరణ మొనర్చుకోగలశక్తి గలిగినది. పై దానివలనను ఇంకను

ఎన్దాదైయాన యెతిరాశనై వణ్ణుమ్ శినియుం నీ రెతిరాశ నెన్జే,

అని యిట్లు తమ తదనంతరతరము వారందరు తెలిసికొనునట్లు ఎమ్బెరుమానార్ల విషయమగు ప్రతిపత్తిని ఉపదేశరూపముగా సాయించి యుండుట వలనను, ఇంకను నెన్నియో ఉపకారములను

జేసియుండుటవలననూ ప్రమాణ పరతంత్రులైన వారికందఱకును వరవరమునుల యందు స్వాచార్య ప్రతిపత్తి యుండుట న్యాయమగును.

వరవరముని సంబంధము సకలోజ్జీవన హేతువు ఇట్లు సత్పురుష సమ్మతమైన మహోపకారకులగు వరవరమునుల విషయములో స్వాచార్య ప్రతిపత్తి యుండవలెను. భగవంతుని పాదాసుల పరంపరలో నవధిభతులై వారుండుటచేతనే యీ విషయము సిద్ధము. వరవరమునుల ప్రియ శిష్యులగు **ఇరుమ్బియప్పాయును** ద్రావిడ నామముగల దేవరాజ గురువరులు ఈ యంశమునే తమ అనుసంధాన రూపముగా నిట్లు సాయించి యుండిరి.

నిరవది నిగమాన్త విద్యా నిషద్యా న వద్యాశయాన్।
యతిపతి పదపద్మ బద్ధాను బంధాను సంధాయినః ।
వరవరమునివర్య సంబన్ధి సంబన్ధి సంబన్ధినః ।
ప్రతిదిన మనుభయ భయో న భూయాస మాయాసభూః ॥

అనగా అపారమైన వేదాన్తవిద్య కాపణమై దోషరహితులగు రామానుజుల పాదపద్మ బంధముతో ననుబంధము కలవారమని యను సంటంచుచున్నట్టియు, వరవరమునుల యొక్క సంబంధ సంబంధులైన భాగవతులను ప్రతి దినము అనుభవింపుచు, తిరిగి సంసార సంబంధము వలని ఆయాసమునకు స్థానమును కాకుందుము గాక, దీనిని బట్టి సకల వేదాంత శాస్త్ర పరిశీలనా ఫలము రామానుజ పదాంభోజ సమాశ్రయణమే యనియు, అట్టి ప్రతిపత్తి గలవారలకు వరవరముని శ్రీపాదముల యందును తద్దాసదాస చరణారవిందముల యందును ప్రావణ్య ముండవలెననియు, దాని వలన సంసార దుఃఖ గంధ విహితులై యుజ్జీవింతురనియు, సుస్పష్ట మగుచున్నది. ఇట్లు భగవద్దాస తద్దాస పరంపరవధిగా శేషత్వముండుటయే భాగవత లక్షణమని

యెతిగియే మన్నుయిర్ గాళ్ ఇజ్జే చ్చిరత్తాలే తీణ్ణి
లజ్గమానవనుమ్ నమ్మైక్కరత్తాలే తీణ్డల్ కడన్,

ఓ మనుజులారా! ఈ లోకములో మణవాళ మామునుల పద్మ స్పృహణీయములైన శ్రీపాదములను శిరస్సుతో తాకి నచో వారిని నిత్యవిభూతిలో అమానవ నిత్యసూరి వరుడు తన చేతులతో తాకి విధిగా కటాక్షించును, అని పెద్దలు సాయించిరి. ఇట్లు పరమపద ప్రాప్తి హేతువుగా వరవరముని చరణారవింద సేవనము చెప్పబడి యుండిన సంగి నిఖిల వైష్ణవులును తెలిసికొనవలెను.

వరవరమునులు చేసిన హితోపదేశము

రామానుజ దర్శనమునకు జెందిన వారిలో కొందరు శ్రీవైష్ణవ కులగురువులగు పరాంకుశ పరకాలాది భక్తుల యొక్క అర్చా విగ్రహములు ఆరాధ నియములు గావనియు దానికి దృష్టాంతముగా, **స్త్రీ ధర్మిణ్యాం జనన్యా మివ** తల్లి వంద్యురాలైనను రజస్వల ప్రసూతి మొదలగు ధర్మములు కలిగియున్నప్పుడు ఎట్లు వంద్యురాలు కాదు యట్లే ఆళ్వారులు సుగుణ విశేషముల చేత వందనీయులగుటలో జాతి ధర్మము ప్రతిబంధక మగుచున్నదని చెప్పుదురు. అది సరికాదు ఏలననగా ఆయాళ్వార్ల సమకాలికులై వైదికాగ్రేసరులైన మధురకవి సూరివరులు,

మేనినే నవన్నొన్నడి మెయ్మ్మైయే తేవుమత్తతియేన్ అని ఇంకొక దైవము నెఱుగననియు, శ్రీశఠకోపుల శ్రీపాదములనే సత్యముగా నారాధించితి ననియు చెప్పియుండిరి.

అట్లు హీన దృష్టాంతమును జెప్పు అజ్ఞానులగు వారిని జూచి పరమకృపతో వారు గూడ నుజ్జీవింపవలెనను సత్సంకల్పము గలిగి వరవరమునులు ఉపదేశరత్నమాల

ఆళ్వార్గళైయుమ్ అరుళిచ్చెయల్ గళైయుమ్ ।

తాళ్వానినైప్పవర్గళ్ తామ్ నరగిల్ ।

వీళ్వార్గళెన్ఱు నినైత్తు నెఞ్జే యెప్పోలుదుం నీ యవ్ పాల్ । శెన్ఱణుగ కూశి త్తిరి

అని తమ మనస్సును సంబోధించుచు తెలిపిరి. ఆళ్వార్ల దివ్య ప్రబంధములను దక్కునగా దలంచు వారు నరకమందు పడిపోదురని తలంచి ఓ మానసా! నీవు వారిని దగ్గరించుటకు భయమును గలిగి తిరుగ మని సాయించి యుండిరి. అట్లు వరవరమునులు తమ తరువాతి వారు గూడ తెలిసికొని యుజ్జీవించుటకును ప్రబంధముఖమున కృపచేసిరని తెలియవలెను. ఇంకను వారు తమ ఆర్తి ప్రబంధములో గూడ

మన్నియశీర్ మారన్ కలైయుణనాగ ప్పెత్తోమ్ ।

మధురకవి శొల్పడియే ని లైయా గప్పెత్తోమ్ ॥

స్థిరమగు కళ్యాణగుణములు కల నమ్మాళ్వార్ల దివ్య ప్రబంధముల ననుభవింప గలిగితిమనియు మధురకవి శ్రీసూక్తి విధముగా నిష్ఠను లభింపగలిగితి మనియు ఆళ్వార్ల యందు వారి దివ్య ప్రబంధముల యందు తమకు గల ప్రావణ్యాతిశయమును వ్యక్తపరచిరి. అట్లు ప్రబంధముఖముగా సాయించినది గూడ శ్రీవైష్ణవులందరును తమవలె తన్నిష్ఠులై యుజ్జీవించుటకే యని తెలియవలెను.

శ్రీవైష్ణవ సిద్ధాన్తవర్తులగు వారిలో కొందరు ఆళ్వార్లను వారి దివ్య ప్రబంధములను, దుక్కునగా తలంచు వారుండ బట్టియే, వరవరమునులు ఉపేదేశ రత్నమాల యందు

తెరులులుత్త వాళ్వార్ గళ్ శీర్మైయరివారార్।

అరుళిచ్చెయలై అరివారార్ ।

అరుళ్ పెత్త నాదముని మదలాన

సందేశికరై యల్లార్ వేదై మనమే ఉణ్ణో పేశు

స్వచ్ఛ జ్ఞాన సంపన్నులగు ఆళ్వార్ల శ్లాఘ్యతను వారి దివ్య ప్రబం శాఘ్యతను తెలియగలవారు ఆచార్య కటాక్ష పాత్రులగు నాధముని మొదలగు వారు దప్ప నింకెవరు గలరు? ఓ చపలచిత్తమా చెప్పుమా అను పాశు రమును సాయించిరి. నమ్మాళ్వార్లు స్వయముగా యవనికాంతరము నుండి తమ దివ్య ప్రబంధములను, మిగిలిన ఆళ్వార్ల దివ్య ప్రబంములను, వారు వారవతరించిన గ్రామములను వారి దివ్య నక్షత్రములను వారి అవతార క్రమములను సకల శాస్త్ర సంగ్రహ రూప రహస్య త్రయ తాత్పర్య పూర్వకముగా శ్రీమన్నాధమునులకు సాయించగా నట్లు చరిత్రము వలన స్పష్టబడుచున్నది. ఆ విషయమునే వరవరమునులు నాధమునుల నట్లు విశేషించి సత్సంప్రదాయాగత విషయము స్పష్టపడునట్లు అరుళ్ పెత్త నాధముని అని సాయించిరి.

వరవరమునుల నిష్ఠా ప్రకారము

వరవరమునులు కృపా పూర్ణులై సామాన్య జనులకు పేశమును జేయగలవారు గనుకనే మధురకవి

శొల్పడియే నిలైయాగ పెత్తోమ్

అని స్వానుష్ఠాన ముఖముగా పరోప దేశమును చేయబూనిరి. మధురకవి శ్రీసూక్తి యందలి నిష్ఠ యెట్టిది?

నావినాల్ నవిత్తి ఇన్బమెయ్దినేన్ ।

మేవినేనే అవన్ పొన్నట మెయ్మైయే । తేవు మత్తిఱియేన్

అని వాచా కర్మణా మనసా ఆచార్య నిష్ఠులై యుండుటయే దానినే **నావినాల్నవిత్తు** అని వాచిక నిష్ఠయు **ఇన్బమెయ్ దినేన్** అని మానసిక నిష్ఠయు **మేవినేనవన్ పొన్నడి** అని కాయిక నిష్ఠయు జెప్పి యదియంతయు నటనగాక **మెయ్మైయే తేవు మత్తఱియేన్** సత్యమై అనితరనిష్ఠమై యుండునదియే అని తెలుపబడినది. నమ్మాళ్వార్లకు కాలాన్తర జాతులగు రామానుజులు పాద స్థానాపన్నులైనటులే మధురకవులకు గడ కాలాంతర జాతులగు వరవరమునులు తన్నిష్ఠులగుట యసంభవము గాజాలదు. ఈ విషయమును

మిక్క వేదియర్ .... అడిమై పయనన్డే అను మధురకవి శ్రీసూక్తిని.

పూమగళ్ కోన్ ... వాయ్న్దేను నెఞ్జేవాల్

అను మణవాళ మానుల ఆర్తి ప్రబంధసూక్తిని విచారించి నప్పుడు వారిరువురి ఏకాచార్య నిష్ఠయు స్పష్టమగును.

వైష్ణవగోష్ఠికి నమ్మాళ్వార్లు చేసిన మంగళా శాసనము దాని భావము

నమ్మాళ్వార్లు తమ తిరువాయ్ మొళి ప్రబంధములో సాయించిన పొలిగ పొలిగ అను భాగవత మంఘళాశాసనమునకు పూర్వాచార్యులు రెండు విధములుగా యోజనలను సాయించి యుండిరి. ఆళవందార్ల నిర్వాహమును బట్టి తిరుమాలై యాణ్డాన్ సాయించిన రీతిని బట్టి **ఆళ్వారుడైయ శ్రీ వైష్ణవశ్రీయై క్కాణ్ణైక్కాగ, నిత్యసరిగళిజ్గె వం అవర్గళై మంగళాశాసనం పణ్ణుగిఱార్,** శ్రీనమ్మాళ్వార్ల శ్రీవైష్ణవ శోభను దర్శించుటకు నిత్యసూరులీ లీలా విభూతికి రాగా వారికి మంగళాశాసనమును చేయుచున్నారు అని యొక యోజన తెలియుచున్నది. ఇంకను ఆళ్వార్ల విషయములో తత్సమకాలికులగు మధురకవి మొదలగు వారొనర్చిన ఆదర నిష్టను ఆళ్వార్ల విశేష కటాక్ష పాత్రులగు నాధముని ప్రభృతి రామానుజుల పర్యంతము గల యాచార్యుల గోష్ఠి యొక్క ఆదర నిష్ఠను, భావిగా తలంచియు, వారిని జ్ఞానదృష్టిచే ప్రత్యక్షముగా జూచి, వారి కందఱికిని మంగళాశాసనమును కృప జేసిరని యింకొక యోజన తెలియుచున్నది. మొదటి యోజనలోని ఆళ్వార్ల శ్రీవైష్ణవ శోభ యెట్టి దనగా తత్సమకాలికులగు భాగవతాగ్రగణ్యులగు మధురకవి యాళ్వార్లు భగవంతుని యందు కంటె గూడ ఆళ్వార్ల యందొనరించిన ఆదర నిష్ఠయే అధికమని తెలియవలెను. ఇంకను మిగిలిన యాళ్వార్ల యందు వారి వారి సమకాలికులు చేసిన ఆదర నిష్ఠయు నని తెలియవలెను. ఇకను అట్టి భావి శ్రీవైష్ణవ గోష్ఠిని గూడ చూచి తృప్తులగు నిత్యసూరుల గోష్ఠికి మంగళాశాసన రూపముగా నీ తిరువాయ్ మొళిని సాయించిరని గూడ నింకొక యోజన గలదు.

రెండవ యోజన ననుసరించి యాళ్వార్ల మంగళా శాసనమునకు విషయముగా నుండు మధురకవి నాధముని ప్రభృతిగా, యెమ్బెరుమానార్ల వరకు గల శ్రీవైష్ణవ గోష్ఠియే యైనన నందు ముఖ్యముగా

ఇరామానుశన్ శరణారవిన్దమ్ నామ్ మన్ని వాళ్ అనియు

ఇరామానుశనై త్తొళుమ్ పెరియా ర్పాద మెల్లామ్ ।

ఎన్దన్నారుయర్కు యాదొన్ఱుమ్ పత్తిల్లైయే

చరమ సర్వభూతులగు యెమ్బెరుమానార్ల యందు నిష్ఠ గలిగి సుఖించు వారి గోష్ఠియే యని

తెలియుచున్నది. అట్టి అతిశయము రామానుజుల యందుండుటకు కారణము శ్రీ వైష్ణవదర్శనమునకు రామానుజ దర్శనమని శ్రీరంగ నాథుడు ప్రకటించుటయే యని తెలియవలెను. ఆళార్లు భవిష్యద్ జ్ఞానముచే శ్రీరామానుజ సంబంట వైష్ణవ గోష్ఠిని దర్శించి వారికి పొలిగ పొలిగ అని మంగళాశాసనమును చేసిరని నిర్ణయించుటకు హేతువేమనగా, ఆ తిరువాయ్ మొళిలో 3వ పాశురములో

కరియముగిల్ వణ్ణ నెమ్మాన్ । కడల్వణ్ణన్ పూతఙ్గళ్మేల్ అను దాని వ్యాఖ్యానములోని యవతారిక యందు

నిత్యసూరిగళు మ్బుగున్దు పరిమారలామ్బడి

సంసారమడై య శ్రీవైష్ణవర్గళే వ్యాపిత్తార్ నిత్యసూరులు గూడ వచ్చి సేవింప దగిన విధముగా లీలా విభూతి యంతటను శ్రీవైష్ణవులే వ్యాపించి యున్నారు, అనుచు సాయించబడినది.

మరియు వ్యాఖ్యాన సందర్భములో మేఘశ్యామమ్ అను రీతి నీలమేఘశ్యామల శరీరమును కనబరచి శ్రియఃపతి నన్ను స్వాధీనపరచుకొనిన రీతినే శ్రమ హరమగు తమ రూపమునే గలిగియున్న శ్రీవైష్ణవులు **ఎఙ్గు మిడంకొండ నవే** అంతటను నిండియున్నారనీ చెప్పుచు ఇతరులకు జోటు లేకుండ తమ శిష్య ప్రశిష్య వర్గముతో వ్యాపించి యుండిరనీ, నిత్య సూరులు గూడ వచ్చి ప్రవేశించి వర్తించునట్లు సంసారమంతటను శ్రీవైష్ణవులే వ్యాపించినారనియు సాయించబడి యుండెను. దాని వలన అట్టి భాగవత గోష్ఠికే మంగళాశాసనమును చేసిరని నిశ్చయింపవచ్చును.

ఆళ్వార్లకు భూత భవిష్యత్ వర్తమాన జ్ఞానములు సమానముగా గలవను నంశము ఆళి యెల్ అను తిరువాయ్మొళి యవతారికలో స్పష్టముగా జెప్పబడెను. కాగా ఆళ్వార్ల మంగళాశాసనము శ్రీరామానుజ తద్దాస దాస గోష్ఠిని గూర్చియే యని నిశ్చయింపవచ్చును.

శ్రీ వైష్ణవ మనోదోషము పోకుండుటకు హేతువు

ఆళ్వార్లు సాయించిన పొలిగ పొలిగ అను తిరువాయ్ మొళి తుది పాశురములో ఇప్పత్తు ముళ్ళత్తు మాశఱుక్కుమ్ ఈ పది పాశురములు మనన మాలిన్యమును ఛేదించునని చెప్పినట్లు అసత్య దూరమగు నా శ్రీసూక్తి వలననే వైష్ణవులలో కొందఱికి మనోదోషము పోకుండుటకును కారణము కలదు. భగవద్దివ్య మంగళ విగ్రహగుణాదుల ననుభవించువారై తత్కైంకర్య నిష్ఠులగు సదాచార్యుల సన్నిధి నాశ్రయించి వారి సదాచారానుష్ఠాన సన్మార్గముల యందు నిష్ఠ కలిగి యట్టి ఆచార్యులకు ప్రియమైన భగవద్భాగవత సేవను జేయుచుండువారికే ఆ తిరువాయ్ మొళి యర్థము హృద్గతమగును. దానినే కాలక్షేపము చేయుచు నుజ్జీవింతురు అట్లుగాక,

గురువో బహవ స్సన్తి శిష్య విత్తాపహారిణః

దుర్లభో స్మి న్గురు ర్లోకే శిష్యహృత్తాపహారకః

అని చెప్పినట్లు శిష్యవంచకులగు వారివద్ద పంచసంస్కారాదులను బొంది వారినే యాచార్యులుగ నాశ్రయించు వారికి. అట్టి సంస్కారాదులు మనో మాలిన్యమును బోగొట్టజాలకుండుట వలన వారి మనో మాలిన్యము తీరకుండును. ఈ విషమును పొలిగ పొలిగ అను తిరువాయ్ మొళి 6వ పాశురములో ఆళ్వారులే సాయించి యున్నారు.

సదాచార్యాశ్రయణము సర్వలాభకరము

శ్రీవైష్ణవ జన్మమెత్తినను ఆళ్వార్ల పట్ల జాతి చింతనము చేసినను పరమైకాంతిక శ్రీవైష్ణవ మాత్రుల యందు ఈతడు భాగవత బ్రాహ్మణుడు, ఈతడు శూద్ర భాగవతుడు అని జాతిబుద్ధిని గలిగి కామధేనువైనను పశువే కదా అని నికృష్ట బుద్ధిని పెట్టుకొనుటయు, శ్రీవైష్ణవ చిహ్నములగు పంచ సంస్కారములను బొందిన వారికి పుత్రిక నిచ్చుటయు వారి కన్యకలను వివాహ మాడుటయు, అసత్ప్రరిగ్రహమును జేసి కుటుంబపోషణము చేసికొనుట యూనను విరుద్ధాచారములు గలిగియుండుట నిహీనతకు మూల మగును. అట్టి దోషములు లేకుండ మనస్సును దిద్దుబాటు చేయగల సదాచార్యపరుల నాశ్రయించుట వలన సమస్త దోషములు నశించి భగవద్భాగవతాచార్య ప్రావణ్యము గలిగి సంసారదశలోను ముక్తి దశలోను భగవద్భాగవత సేవా కైంకర్య రూప్రప మహాభాగ్యము గలుగును. ఈ విషయమే ఆళ్వారులు తమ తిరువాయ్ మొళిలో విశదముగా సాయించి యుండిరి. **నేమిప్పిరాన్ తమర్ పోన్దార్** చక్రధరుడగు నుపకారకుని దాసులు వచ్చి యున్నారు అనియు **శెన్ఱు తొళుదు ఉయ్ మిన్** వారి సన్నిధికి వెళ్ళి వారిని సేవించి ఉజ్జీవింపుడు అనియు ప్రజలకుద్భోధించుట బట్టి ఆళ్వార్ల సదాచార్యా శ్రయణోపదేశమును ఉజ్జీవన రూప ఫల ప్రదర్శనమును స్పష్టపడుచున్నది.

అట్టి సదాచార్యా శ్రయణము చేయునప్పుడు దేహి మే దదామి తే అను రీతిలో ఉపకార బుద్ధితో గాక స్వరూపాను రూపమను భావముతో నాచార్యా శ్రయణము జేయుట ముఖ్యము. అట్లు సదాచార్యా శ్రయణము జేసి ఆచార్యుని ద్వారా **రామానుజార్య శరణో ఉస్మి** అను రీతిని భగవత్సంబంధమును తెలిసి భగవదాశ్రయణమును చేయుటయే, వైష్ణవాధికారికి స్వరూపమై యున్నది. సదాచార్య సమాశ్రయణ వశమున దివ్య ప్రబంధ రహస్యార్థ జ్ఞానము గలిగి మానస దోషములు నశించి నిజమగు రామానుజ దర్శన ప్రవేశము లభించి **పొలిగ పొలిగ** లో ఆళ్వార్లు సాయించిన సదుపదేశమందు విశ్వాసము లభించి ఉజ్జీవించుటకు హేతువగునని తెలియవలెను.

ఆళ్వార్లు సాయించిన సదుపేశము లెట్టివి అనగా **కలియుమ్ కెడుమ్ కణ్డుకొణ్మిన్** కలి ప్రభావము నశించు నని తెలిసికొనుడు,

తొణ్డిరెల్లీరుమ్ వారీర్ తొలుదు తొలుదు నిన్ఱార్తుమ్

దాసులగు వారందఱును రండు. భగవద్దాసులను మాటి మాటికిని సేవించి ఉండి హర్ష ధ్యానములను జేయుడు.

నేమిప్పరాన్ తమర్ పోన్దార్ శెన్ఱు తొలుదుయ్ మ్మిన్ శిన్దైయై శెన్నిఱుత్తియే

చక్రధారి యగు నుపకారకునకు దాసులు నచ్చియున్నారు. వారి సన్నిధికి జేరి సేవించి చిత్తమును వారియందు లగ్న మొనర్చి యుజ్జీవింపుడు.

మఱుత్తిరు మార్వ నవసన్ పూదఙ్గళ్ కీదఙ్గళ్ పాడి,

వెఱుప్పిణ్ణి ఞాలత్తు మిక్కార్ మోనిత్తొళుదుయ్ మిన్నీరే,

శ్రీవత్సలక్ష్మి గీతములను బాడి భయము విడచి భూమియం దధికముగా నిండి యుండిరి. వారి నాదరించి సేవించి మీరుజ్జీవింపుడు అని యిట్లు పలువిధములుగా భాగవతాశ్రయణ ముజ్జీవన హేతువగు నని యుపదేశ స్వరూపము గన్పట్టు చున్నది. అట్టి సదుపేశములకు వివరణ రూపములగు వ్యాఖ్యానాంశములను దెలసి యట్లనుష్ఠించు సదాచార్యుల నాశ్రయించిన వారికి పైన జెప్పబడిన మానస దోషములు నశించి

యుజ్జీవింపనగును. ఈ విషయమంతయు సత్సమ్మతము గావుననే యాళ్వార్ల ఉపదేశ ప్రకారముగా వరవరమునులు అట్టి సదాచార్య నిష్ఠ గలిగి తాము యతీంద్ర ప్రవణులై తమ శిష్య ప్రశిష్యులను గూడ యతీంద్ర ప్రవణులగు రీతిని

నన్దానరగ త్తలన్దామై వేణ్డిడిల్ నానిలత్తీర్ ఎన్దాతైయాన యెతిరాశనై వణ్ణుమ్

విచ్ఛేధము లేని నరకమందు మునిగిపోవుట కిష్టములేని వారైనచో ఓ జీవులారా! మా తండ్రియగు యతి రాజులను జేరుడు అని యుపదేశించి యుండిరి.

పొలిగ పొలిగ తిరువాయ్ మొళికి రామానుజ పరత్వము

ఆళ్వార్లు సాయించిన పొలిగ పొలిగ అను తిరువాయ్ మొళి లో వారు భవిష్యద్ జ్ఞానముచే ప్రత్యక్షీకరించి సాయించిన శ్రీవైష్ణవ వైభవమంతయు శ్రీ యెమ్బెరుమానార్లను, వారి సంబంధి సంబంధులను గురించియే యని చెప్పియున్నాము.

అది యెట్లనగా ఆ తిరువాయ్ మొళిలో **ఇజ్గొళ్ శమయత్తై యెల్లా మెడుత్తుక్కళై వనపోలే**

అను పాశురము యొక్క అవతారికలో వాయుపదేశము యెమ్బెరుమానార్ విషయమందే స్థిరమైయున్నదని సూచింపబడినది. ఎట్లనగా

నాలామ్పాట్టు అవిచాల్యమాన బాహ్య సమ యంగళై వేరోడే

అఋప్పారై ప్పోలే ఎజ్గుమ్ వైష్ణవర్ గళేయాయ్

భగవద్గుణాను భవజనిత హర్షత్తాలే కళిత్తు త్తిరి యానిన్దార్ గళ్

అనగా నాల్గవ పాశురములో నవిచాల్యములైన వేద బాహ్య సిద్ధాంతములను వేరుతో గూడ బెరికి వేసినట్లు తీసి వేయువారు వలె, శ్రీవైష్ణవులంతటను నిండియుండి భగవద్గుణాను భవము వలన గలిగిన హర్షము చేత, గర్వించి తిరుగుచున్నారని సాయించుచున్నారని వ్యాఖ్యాతలు సాయించిరి. ఇట్టి యసాధారణకృత్యము ఎమ్బెరుమానార్ల విషయములోనే సుప్రసిద్ధమై యున్నది. ఈ విషయము మణవాళ మామునులు తమ ఆర్తి ప్రబంధముతో

ఆఋశమయచ్చెడి యదనై అడియఋత్తాన్ వాళియే

శెఋకలియై చ్చిరుదుమఱ త్తీర్త్తు విట్టాన్ వాళియే

ఇత్యాదిగా బాహ్యదర్శనములనియెడి తుప్పలను మూలముతో ఛేదించిన వారనియు, దట్టమగు కలిని నిశ్శేషముగా తొలగించిన వారనియు నెమ్బెరుమానార్లను మంగళాశాసన రూపముగా సూచించి యుండిరి.

అయితే **ఎజ్గుమ్ వైష్ణవర్ గళే యాయ్** అను దాని యవతారికలో అంతటను వైష్ణవులే నిండియుండినట్లు జెప్పి యవతారికలో అంతటను వైష్ణవులే నిండియుండినట్లు జెప్పినది. ప్రత్యేకముగా యెమ్బెరుమానార్ల విషయములోనే యని చెప్పుట యెట్లు ? అనినచో, నంతటను నుండు వైష్ణవులు రామానుజ సముద్ధృత దర్శనము నందలి వారే యగుటచే నట్లు చెప్పుట విరుద్ధము గాస్త్ర. ఇంకను తడంకడల్ వళ్ళి ప్పెరుమాన్ తన్నుడైయ పూతజ్గళ్ విశాల సముద్రశాయియగు స్వామి యొక్క దాసులు అను శ్రీసూక్తి కూడ శ్రీయెమ్బెరుమానార్ల విషయమే అను విషయము

విళన్దిరై ప్పార్కడల్ కణ్తుయల్ మాయన్ తిరువడిక్కీఴ్ విళ్

న్దిరుప్పార్ నేఙ్జిల్ మేవువన్ ఞాని,

శ్లాఘ్యతరంగిత తీర సముద్రశాయి యగు నాశ్చర్యభతుని శ్రీపాదముల నాశ్రయించి యున్న వారిని మనస్సు నందు ఆదరించు మహాజ్ఞాని అని అముదనార్ నూత్తందాదిలో సాయించిన రీతిని బట్టియు తెలియగలదు. ఈవిధముగా సూచితమై యుండుటయే గాక ఆ **పొలిగ తిరువాయ్మొళి** నాల్గవ పాశురములోనే

నదన్దుమ్ పరన్దుమ్ కునిత్తుమ్ నాడగం శెయ్గినవే

నడచుచు, వ్యాపించుచు, గర్వించుచు, నాటకమాడుచున్నవి అని యట్టి వైష్ణవులను వర్ణించి యుండుట చేతను ఆ పాశుర వ్యాఖ్యలో ఎమ్పెరుమానార్ల స్థితి గమన శయనాదులను గొనియాడుచున్నారని చెప్పుట గూడ యెమ్బెరుమానార్ల విషయముగానే యుండుట చేతను సుస్పష్టమగుచున్నది. నఞ్జీయర్ ఈ వ్యాఖ్యానావసరములో

ఇవర్ వా పారమవర్కు నల్లారాడినాఖ్పోలే యిరుక్కై

అళవన్దారుదైయ నదైయై రాజా కొణ్డాడినాప్పోలే యిరున్దదు,

యామునాచార్యులను చోళరాజు కొనియాడి నట్లే ఆళ్వార్లు వీరిని గొనియాడి యుండిరని తెలియుచున్నది. అచ్చుటనే నఞ్జీయర్ **నామ్ ఎమ్బెరుమానార్ స్థితిగమనశయనాదిగళై కొణ్డాడినాఖ్పోలే యుమ్**

మనము యెంబెరుమానార్ల స్థితిగమన శయనాదులను కొనియాడుచున్నట్లే యని ఎమ్బెరుమానార్ల అనంతర కాలికులగు తాము గూడ వారి చర్యను తెలిసికొని శ్లాఘించుచున్నట్లు చెప్పియుండిరి. దానిని విచారించి చూచినప్పుడు నంజీయర్‌కును ఎమ్బెరుమానార్లకును సమకాలికత్వము లేకపోయినను మనము కొనియాడినట్లని ప్రత్యక్షముగా చూచిన దానిని జెప్పినట్లు జెప్పుట, ఆళ్వార్ల భవిష్యద్ జ్ఞానము వలననే యని స్పష్టమగుచున్నది.

ఆళ్వార్లు తమ భవిష్యద్ జ్ఞానముచే ప్రత్యక్షముగా జూచి కణ్ణుక్కినియన కణ్డోమ్ అని యనుభవించి శ్రీనాధమునుల కుపదేశింపగా వారు పుండరీకాక్షులకును వారు రామమిశ్రులకును, వారు యామునాచార్యులకును ఉపదేశింపగా, వారి వలన పెరియనమ్బిగారు లభించిరి. ఆ పెరియనంబి గారీ సత్సంప్రదాయ ప్రాప్తమగు ఆళ్వార్ల ప్రత్యక్ష దర్శనమును నా రహస్యమును యెమ్బెరుమానార్ల పట్ల జూచి

కలియుమ్ కెడమ్ కణ్డుకొణ్మిన్ అని ఆళ్వార్లు సాయించినది యెమ్బెరుమానార్ల విషయమే యని నిర్ధారణ యొనర్చి యా జ్ఞానమును తత్సమకాలికులగు కూరేశ గోవిన్ద పరాశర భట్టారకుల కుపదేశింప, వారి వలన నెఱిగిన నఞ్జీయరు, తన్నిష్ఠులై యీ పరమరహస్యమును తదనంతర కాలికులు గూడ దెలిసి ఉజ్జీవించుటకు సాయించుచు వచ్చిరి. ఇట్లు సదాచార్య సమ్మతమైన రహస్యము గనుకనే మణవాళ మామునులు ఆళ్వార్ల శ్రీసూక్తి యందు గాడ నిష్ఠులై అందుచే యతీంద్రుల యందు ప్రవణులై తాము స్వానుభవ గర్భమగు పరోపదేశముగను, పరోపదేశ గర్భస్వానుభవముగను, నుండు ఆర్తి ప్రబంధము, **ఉపదేశరత్నమాల, యతిరాజ వింశతి** అను దివ్య గ్రంధముల యందు సాయించి రామానుజ దర్శన నిష్ఠులై యుండు సదాచార్య సచ్ఛిష్య వర్గము నుజ్జీవింప జేసిరి. కనుకనే శ్రీవైష్ణవుల కందఱకును వారు సదాచార్యులై విలసిల్లిరి. మరియు అష్టాక్షర బ్రహ్మవిద్య యనబడు తిరుమంత్రములో ప్రణవ మధ్యాక్షరము (ఉ) మధ్య పదము (నమః) న్ను వివరించు శ్రీఎమ్బెరుమానార్ల వైభవమును ప్రతిపాదించు పొలిగ పొలిగ అను ఆళ్వార్ల శ్రీసూక్తులను పూర్తిగ నెఱిగిన

మణవాళ మామునులు వాళియె తిరాశన్ అని యారంభించి విణ్ణోర్తలై అనియు, ఇరామానుశాయ నమ వెన్ఱు అని ఆరంభించి విణ్ణోర్గళ్ వాళ్వ అనియు నార్తి ప్రబంధములో సాయించి యుండిరి. దీని వలన శ్రీవైష్ణవులందఱును దాని నెఱింగి తన్నిష్ఠులై యుండదగునని వరవరమునుల సదుపదైశమై యున్నది.

తిరువరఙ్గత్త ముదనార్లు చేసిన ఉపకారము

పిళ్ళైయముదనారను నామాంతరము గల తిరువరఙ్గత్త ముదనారను శ్రీవైష్ణవోత్తములు శ్రీయెమ్బెరుమానార్ల సమకాలికులై వారి వైభవమును ప్రత్యక్షముగాను కూరత్తాళ్వార్ల నాశ్రయించి వారివలనను సాకల్యముగా నెఱింగి యెమ్బెరుమానార్ల విషయములో పరమ ప్రావణ్యము కలిగియుండిరి. తత్పూర్వము నమ్మాళ్వార్ల వైభవము నెరిగిన మధురకవి ఆళ్వారు తదేక ప్రవణులై స్వానుభవ రూపముదాను పరోపదేశ రూపముగాను **కణ్ణినుణ్ శిరుత్తామ్బు** అను దివ్య ప్రబన్ధమును సాయించినట్లే ఆచార్య పరంపరా ప్రాప్తమగు రహస్య రూపమగు శ్రీరామానుజ వైభవమును స్వానుభవ రూపముగాను పరోపదేశ రూపముగాను విపులముగా **ఇరామానుశ నూత్తందాది** యను నూట యెనిమిది పాశురములు గల దివ్య ప్రబంధమును శ్రీఅముదనార్లు సాయించిరి. అట్లు వారు సారోమూలమనో ర్గురో శ్శరణతాతత్తా యతీంద్రే స్థితా అని మూలమంత్రార్థ సారములో చెప్పబడిన విధముగా తిరుమంత్రసారమగు ఆచార్య శరణత్వము శ్రీయెమ్బెరుమానార్ల యందే పరినిష్ఠితమైన విధమును దెలుపుచు శ్రీవైష్ణవ లోకమునకు మహోపకారము నొనర్చిరి.

శ్రీమధురకవుల దివ్య ప్రబంధము, శ్రీ అముదనార్ల నూత్తందాది దివ్య ప్రబంధమున్ను ఆచార్య నిష్ఠాబోధకములై తరువాతి వారగు శ్రీవైష్ణవుల కందఱకును స్వాచార్య ప్రవణతను భాగవతనిష్ఠను గలుగజేయుచు మహోపకారకములై యున్నవి.

సదాచార్య పరంపరకు చరమ పర్వ నిష్ఠా క్రమము

శ్రీ వైష్ణవులందఱుకను తమతమ ఆచార్యులకు, భాగవతులకునూ, పరమాచార్యులగు యెమ్బెరుమానార్ల పాదముల నాశ్రయించి తరింపవలసినట్లు నూత్తందాది అవతారికలోను, పొలిగ పొలిగ మొదలగు తిరువాయ్ మొళి యందలి సూక్తి పంచకములోను జెప్పబడి యుండెను. అదియే చరమ పర్వనిష్ఠగాను, అట్టి నిష్ఠగల వారికే పరమపములో నిత్య కైంకర్య లాభము గలిగి యుజ్జీవించునట్లును నిశ్చయింపబడెను. ఈ విషయమే ఆళ్వార్లు మొదలుగా పరంపరా ప్రాప్త సదుపేశ లబ్ధమయి యున్నది.

ఇంతియగాక యెంబెరుమానార్ల సమకాలికులగు కూరత్తాళ్వారు, తిరువరంగత్తముదనారు, ఎమ్బారు, భట్టరు, అరుళా పెరుమాళెమ్బెరునామార్, మొదలగు వారి శిష్య ప్రశిష్యులు యెంబెరుమానార్ల శ్రీపాద ప్రవణులై సాయించిన శ్రీసూక్తుల వలె యెంబెరుమానార్ల అర్చావతార మందత్యంత ప్రవణులైన భట్టరు శిష్యులగు నఞ్జీయరు, వారి శిష్య ప్రశిష్యులగు నమ్బిళ్లై పెరియవాచ్చాన్పిళ్లై, నైనారాచ్చాన్ బిళ్లై మొదలగు వారు సాయించిన శ్రీసూక్తులు గూడ ఇట్లే నిర్ధారింపగలవు.

నఞ్జీయరు శ్రీమల్లక్ష్మణ యోగివర్య చరణద్వంద్వా శ్రయో నాభవ ।
త్తస్యా త్యన్త దయాది సద్గుణ నిధిర్నారాయణః శ్రీ పతి ః
దాతుం ముక్తి మనాదరో భవ బృహద్వారా కరే సంతతం
నిక్షిప్యైవ హృదాపి నో గణయతి ప్రాక్సిద్ధ కర్మేరితః

అత్యంత దయా వాత్సల్యాది సద్గుణ నిధియగు నట్టి శ్రీమన్నారాయణుడు ఏ చేతనునకు రామానుజ యోగివర్యుల చరణ ద్వంద్వమందా శ్రయణము లేకుండునో వాని పూర్వకర్మలను బరిగణించి సంసార సాగరము నందే వానిని బడవైచి నిర్లక్ష్యముగా నుండును అని భావము గల శ్లోకమును దమ చరమ గురు నిర్ణయములో సాయించిరి. అట్లే నమ్బిళ్ల గారునూ,

శ్రీమల్లక్ష్మణ యోగి వర్య చరణ ద్వంద్వాశ్రయో శ్రీపతి ।
మ్మామాదృత్య మహాఫల ప్రసవితా జాతోహి రజ్గేశ్వరః ।
తద్దృష్ట్వా మయి రజ్గరాధరమణీ శ్రీరజ్గనాయక్యహో ।
శ్రీరామానుపాదభాదయమితి ప్రాచీకశత్స్వాం దయామ్

శ్రీరామానుజుల పాదద్వంద్వా శ్రయణము వలన శ్రియః పతి యగు రంగనాధుడు నన్నాదరించి మహాఫలమగు స్వపాద కైంకర్యమును కటాక్షించి యున్నారు. అది జూచియే శ్రీరంగనాచ్చియారు గూడ నా యందు శ్రీరామానుజ పాద సంబంధుడు గదా యని తమ దయను బ్రకాశింప జేసిరి. అను నట్టి భావము గల శ్లోకమును తమ చరమగురు నిష్టలో సాయించిరి.

పెరియవాచాన్బిళ్ల గారు గూడ

విష్ణు శ్శేషీ తదీయ శ్శుభగుణ నిలయో విగ్రహశ్శ్రీ శఠారిః ।
శ్రీమాన్ రామానుజార్యః పదకమలయుగం భాతి రమ్యం తదీయం ।
తస్మిన్ రామానుజార్యే గురురితి చ పదం భాతి నాన్యత్ర తస్మాత్ ।
శిష్టం శ్రీమద్గురూణాం కులమిద మఖిలం తస్యనాధస్య శేషః ॥

జగత్తునకు శేషి శ్రీవిష్ణువు. ఆయన యొక్క కళ్యాణగుణములకు ధామమగు దివ్య మంగళ విగ్రహము శ్రీశఠకోపులు, శ్రీరామానుజులా విష్ణు శరీరులగు ఆళ్వార్ల పద కమల యుగముగా ప్రకాశించుచున్నారు. అట్టి రామానుజాచార్యుల యందే గురుః అను పదము జెల్లును, మఱి యొకరియందది జెల్ల నేరదు. కాన మిగిలిన ఆచార్య గోష్ఠియంతయు ఆ రామానుజులను స్వామికి శేషభూతమై యున్నది అని సాయించిరి.

నైనారాచ్చామ్బిళ్ళ గారు కూడ **స్వవ్యాపారేణ సాధ్యా భజనగతి రియం స్వానురూపత్వహానా ।**
త్యాజ్యా పూర్వై ప్రసన్నైః శరణవరణతా ంశికై ర్యాపి లభ్యా ।
కింత్వాచార్యాభిమానాత్పరమపద మహో లభ్యతే నాన్యతో నః ।
స్తస్యా ద్రామానుజాంఘ్రీ ద్వితయ మనుపదం సానం భావయామః ।

భక్తి యోగము స్వప్రవృత్తి సాధ్య మగుట వలన స్వాను రూపము గాదు. కానీ యాచార్య కటావభిమానమున్నచో సాక్షాత్పరమప ద్వారమునకు గొని పోవును. కాబట్టి శ్రీయెమ్బెరుమానార్ల శ్రీ పాదద్వయము నెల్లప్పుడును పరమపదో పాయముగా తలంచెదము అని స్వకీయ చరమో పాయ నిర్ణయము లో సాయించి యుండిరి.

ఇంకను నడదూర్ అమ్మాళ్ శిష్యులగు ఘటికాసహస్రాచార్యులను వారు సాయించిన ప్రార్థనా పంచకములో గూడ నీ యర్థము స్పష్టము. అట్లే భట్టరు సాయించిన గురుపరంపరా ప్రభావము యందును ఎజ్గళాళ్వారులు సాయించిన యతీంద్ర సారార్థ చతుష్టయము నందును సోమాశి యాణ్డాన్ సాయించిన

చరమోపాయ వివరణ మందును, ఇట్లు పూర్వాచార్యులు సాయించిన గ్రంథములలో నన్నింటి యందును శ్రీవైష్ణవాచార నిష్కర రూపమగు ఆచార్యాభిమానము యొక్క సత్యజ్ఞాన మతివశదముగా చెప్పబడియుండుటను, శ్రీరామాను ప్రవణులగు వారందఱును దెలసికొనవలెను.

నూత్తందాదికి ప్రపన్న గాయత్రీత్వము

ఈ విధముగా నెమ్బెరుమానార్ల చరమోపాయత్వము సర్వాచార్య సమ్మతమగుట. ఇరామానుశ నూత్తందాది యొక్క ప్రవేశములో

ఎమ్బెరుమానార్ తిరువడిగళ్ ప్రేమ ముదైయ వర్గళుక్కు,
సావిత్రిపోలే ఇదునిత్యానుసంధేయ మాగ వేణు
మెన్టాయిత్తు పాట్టు దోరుమ్ తిరునామత్తై వైత్తు,
నూత్తెట్టు పాట్టాగ వరుళిచ్చెయ్‌దదు,
ఆగైయాలే ఇత్తై ప్రపన్న గాయత్రి ।
యెన్టాయిత్తు నమ్ముదలిగళ్ అరుళిచ్చెయ్‌దదు

అనగా రామానుజ పాదపద్మముల యందు ప్రేమ గల వారికి గాయత్రివలెనే నూత్తందాది నిత్యానుసంధేయము గావలెనని ప్రతి పాశురములోను రామానుజ నామమును జేర్చి నూటయెనిమిది పాశు రములుగా సాయించబడినది. అందువలన దీనిని ప్రపన్న గాయత్రి యనియే మన పూర్వాచార్యులు సాయించిరని శ్రీమణవాళమామునులు దెలియజెప్పిరి. దీని తాత్పర్యమేమనగా గాయత్రీ మంత్రము ప్రతి దినము నూట ఎనిమిది పర్యాయములు జపించవలెను గదా. అట్లే రామానుజా అను తిరునామమును నూటయెనిమిది పర్యాయములు అనుసంధించునటుల నూట యెనిమది పాశురములో నా ప్రబంధము సాయించబడినది. మంత్రము కేవలాక్షర పఠన మాత్రము కన్న తదర్థాను సంధాన పూర్వకముగా జపించిన విశేష ఫల ప్రదముగదా.

పొలిగ పొలిగ తిరువాయ్ మొళితో నూత్తందాదికి ఐకార్థ్యము

నమ్మాళ్వార్లు సాయించిన **పొలిగ పొలిగ** అను తిరువాయ్ మొళిలోని సారార్థమునకును, శ్రీమదష్టాక్షరీ మంత్రము నందలి మధ్యమ పదమునకు విశేషార్థము, శ్రీ స్వామి యెమ్బెరుమానార్ల విషయమైయే యున్నదని యందురు చక్కగా గుర్తెఱిగి ఉజ్జీవింపవలసియుండు నను దానికి హేతువేమనగా, త్రికాల జ్ఞానము చేత భగవద్భాగవతాచార్య వైభవమును దెలసికొనియున్న నమ్మాళ్వార్లు, శ్రీయెమ్బెరుమానార వైభవ రూపమగు తిరువాయ్ మొళిని శ్రీనాథమునులకు కటాక్షింపగా, వారు పుండరీకాక్షులకు, వారు రామమిశ్రులకు ఇట్లు ఉ పదేశ పరంపరా రూపముగా నేటి వరకును లభించు చుండుట చేత పై విశేషార్థము రూఢమై సర్వ జనోజ్జీవనమునకు హేతువైనది. నూత్తందాది యందలి అవతారిక యందు ఆళ్వార్ల ప్రబంధముకిది సారార్థమైయున్నదని చెప్పబడుటచే పొలిగ పొలిగ తిరువాయ్ మొళి యందుండు అర్థ విశేషములు నూత్తందాది యందు గూడ నుండిన వనియే యెఱుగవలెను.

అది యెట్లనగా **కలియుమ్ కెడుమ్ కణ్డుకొణ్మిన్** అను పాశురార్థము
అఱుంశీఱుమఱు కలియైత్తురక్కు మ్బెరుమైయి రామానుశన్ అనియు
తాళ్వోన్ఱిల్లా మఱై తాళంన్దు తలముదుమ్ కలియే

యాళ్ గిన్టనాళ్ వన్దళిత్తవన్ కాణ్మిన్ అనియు

శెఱుకలియాల్ వరున్దియ ఞాలత్తై వణ్ణెయినాల్

వన్దెదుత్తళిత్త అరున్దవ నెఙ్గళిరామానుశన్ అనియు

నిలత్తైచ్చెఱుత్తుణ్ణుమ్ నీ శక్కలియై నినైప్పరియ వలత్తై చ్చెఱుత్తుమ్ ......

నలత్తైప్పెఱుత్తది రామాశన్ దన్నయప్పగ

అనియు అనేక పాశురములలో విశదముగా సాయించబడెను. ఇందు తుదిపాశురములో

కలియుం నరగమునైన్దన నమనుక్కిఙ్గియా దొన్ఱుమిల్లై

అను తిరువాయ్‌మొళి పాశురార్ధము గూడ సుస్పష్టము.

కణ్ణుక్కినియన కణ్డోమ్ .... తోళుదునిన్ఱార్తుమ్ అను పాశురార్థము

కైయిల్ కనియెన్న కణ్ణనై .... వేణ్డిలన్ యాన్ అనియు

తిరువరఙ్గర్ కైత్తలత్తాళియుమ్ ....వన్ది రామానుశన్ ఎన్నై ముత్తునిన్ఱే అనియు

తెర్విడుమ్ కోనై ములుదుణర్న్ద నడియఱ్కుముదమ్ అనియు

అరుమునివర్ తొలున్దనత్తోన్ అనియు జెప్పబడిన పాశురములు వివరింపుచున్నవి. మఱియు,

తిరుయుమ్ కలియుగమ్ నీఙ్గి తేవర్గళ్ తాముమ్ పుగున్దు

పెరియ కిదయుగమ్ పత్తి.... ఎఙ్గుమిడ ఙ్గొణ్డనవే అను పాశురార్ధము

నైప్పాయవాన్‌పొరుళేన్ఱు .... వైక్కుమిరామానుశన్

తెన్నరఙ్గర్ తొణ్డర్ కులావుమి రామానశనై పణ్డరుమాఱన్ వాళం వత్తదే అనుపాశురములు వివరించుచున్నవి. ఇంకను **ఇడఙ్గొళ్ శమయత్తై యెల్లామెడుత్తుక్కళైవన పోలే** అను నూత్తన్దాది పాశురార్ధమే

అఱుశమయచ్చెడియై అను పాశురములోను

పార్తానఱు శమయఙ్గళ్ అను పాశురములోను అత్యంత విశదముగా చెప్పబడెను.

ఉయ్యుమ్ వగై యిల్లై తొణ్డీర్ ఊళి పేర్తిడుమ్ కొన్ఱే

అను పాశురార్ధము నాట్టియ నీశచ్చమయఙ్గళ్ మాణ్డన అను పాశురములో కూడియున్నది.

శెన్ఱుతొళుదుయ్‌మిన్ తొణ్డీర్ మేవిత్తొళుదుయ్ మిన్నీరే "మేవిత్తొలుదుయ్ మినీర్ గళ్ "అని మొదలుకొని

అడియారుమ్ పగవరు మ్మిక్కదులగే అని సాయించిన తిరువాయ్ మొళి పాశురములన్నియు

పల్‌కలై యోర్ తామ్మన్న వన్ద విరామానుశన్

తెన్నరఙ్గన్ తొణ్డర్కు లావుమి రామానుశనై

మేవిత్తొళిఱ్కుడి యామెఙ్గళ్ కొక్కుడియే

అను సూత్తందాది పాశురములతో సరిపడును. ఈవిధముగా ఆ తిరువాయ్‌మొళికి వివరణము నూత్తందాదియగుటచే కలియుఙ్కణ్డుకొణ్మిన్ అని యారంభించి,

కలియుగ మొన్ఱుమిన్ఱిక్కె .... మాయాప్పిరాన్ కణ్ణన్ తన్నై

అను నంతవరకు సాయించబడిన పాశురములలోని విశేషార్ధములు.

ఇరుప్పిడమ్ వైగున్ధమ్ ... అను పాశురములో సుస్పష్టముగా తెలియగలవు.

ఇట్లు పొలిగ పొలిగ అను తిరువాయ్మొళికిని, నూత్తందాదికిని గల ఐక్యార్థ్యము వాని వ్యాఖ్యానము లందు పరిశీలించి శ్రీవైష్ణవులు తెలిసికోగలరు.

భాగవతుల విషయమై భాష్యకారుల ప్రావణ్యము

నమ్మాళ్వార్లు సాయించిన పయిలుమ్ శుడరొళి నెడుమాఱ్కడిమై అను రెండు తిరువాయ్ మొళిలలోను భగవద్భాగవత ప్రావణ్యమునకు విషయభూతులు. శెన్తమిళ్ పాడువార్ అని ప్రసిద్ధిని బొందిన పోయ్గైయాళ్వార్లు మొదలగు ఆళ్వార్లును శ్రీమన్నాథముని, యామునాచార్యులు మొదలగు ఆచార్యులును, అయియున్ననూ వారి పాదారవిన్ద భృఙ్గములగు స్వామి యెమ్పెరుమానార్ల పట్లనే ఆ రెండు తిరువాయ్ మొళికును తాత్పర్యమైయుండనోపును అయిననూ, అట్టి పోయ్గైయాళ్వార్లు మొదలగు వారియందు యెమ్బెరుమానార్లకు ప్రావణ్యము కలిగియుండు టెట్లు బొసగును. అనినచో

కుఱైయల్ పిరానడిక్కీళ్ విళ్ళాదవన్బని రామానుశన్ '

వఱుత్తు మ్బుఱవిరుళ్ మాత్త యెమ్బుయ్ గెప్పిరాన్ " అని యారంభించి

అన్టెరిత్త తిరువిళక్కైత్తన్ తిరువుళ్ళత్తే యిరుత్తుమ్ పరమని రామానుశన్

ఞాన మొన్నుమ్ నిఱైవిళక్కేత్తియ పూదత్తిరువడిత్తాళ్గళ్

నెఞ్జ ఱైయ వైత్తాళుమి రామానుశన్"

"తమిళ్ తవైవన్ పొన్నడి పోత్తుమి రామానుశన్"

"మళిశైక్కిఫైవని ఱైయ డిప్పోదదఙ్గ మిదయత్తి రామానుశన్ "

"అరఙ్గత్తయ్యన్ కళఱ్కణియు మ్బరన్ తాళన్టి యారియా మెయ్యని రామామశన్"

"కొల్లి కావలన్ శొల్ పదిక్కుమ్ కలైక్కం పాడుమ్ పెరియవర్ పాదఙ్గళే తుదిక్కుమ్ పరమని రామానుశన్

పల్లాడెన్టు కాప్పిడుమ్ పాన్మైయన్ తాళ్ పేరా వుళ్ళత్తి రామానుశన్

శూడిక్కొడు త్తవళ్ తొల్లరులాల్ వాళ్గిణ్ణ వళ్లవిరామానుశన్

ఉరుపెరుమ్ శెల్వముమ్... ఇన్నీణిలత్తోరతితరనిన్టవి రామానుశన్

నాదమునియే నెఞ్జాలా వారిప్పరుగుమి రామానుశన్

యమునైత్తుఱైవనిణై యడియామ్ గతిపెత్తుడైయని రామానుశన్

అను మొదలగు నూత్తందాది పాశురముల చేత ఆళ్వార్ల యందును వారి వారి ప్రబంధముల యందును గల ప్రావణ్యమును, ఆళ్వార్ల కత్యంత ప్రేమ పాత్రులగు నాథ యామునాద్యాచార్య వరుల పాదముల యందలి భక్తియును, స్వామి యెమ్బెరుమానార్ల కత్యధికముగా నుండిన విధము సుస్పష్టము. అందువలన భగవద్భాగవత ప్రావణ్యము యెమ్బెరుమానార్ల యందు సుస్థిరమై యున్నదని తెలియవలెను.

శ్రీభాష్యకారుల భగవత్ప్రావణ్యము

ఇంక నా రెండు తిరువాయ్మొళుల యందు చెప్పబడిన భగవత్ప్రావణ్యము గలవారు, స్వామి **యెమ్బెరుమానారే యని గూడ నూత్తందాది యందు సుస్పష్టము.**

వాణన్ వెళై పొరుత్తతీర్తనై యేత్తుమి రామానుశన్

ఉళి ముదల్వనై యే పన్నప్పణి త్తవి రామానుశన్

తెన్నత్తి యూరల్ కడలిణైక్కిళి పూణ్డవన్నాళ నిరామానుశన్

ఆడైయార్ కమలత్తలర్ మగళ్ కెళ్వన్

ఇదై యే యిరామానుశమునియాయిన

మా మలరాళ్ పుణర్న్ద పొన్మార్పన్ పొరున్దుమ్ పదితొరుం పుక్కునిఱుమ్

ఇరుప్పిడమ్ వైకున్దమ్ వేఙ్గడమ్ మాలిఱుమ్శోలై ...

ఆవై తన్నొడుమ్ వన్దిరుప్పిడమ్ మాయ నిరామానుశన్ మనత్తు

పొన్నరఙ్గ మెన్నిల్ మయలే పెరుగు మిరామానుశన్

కులవియ పాఱ్కడలు మున్దనక్కేత్తనై యిన్బంతరుమ్

అను మొదలగు పాశురములు వారి ప్రావణ్యమును తెలుపుచున్నవి.

అందువలన ఆ రెండు తిరువాయ్ మొళిలలోను

పాఱ్కడల్ శేర్న్ద పరమనై ప్పయిలుమ్ తిరువుడైయార్ అనియు

నెడు మాఱ్కడిమై అని మొదలుకొని **అవనడియా రడియే కూడు మిదువల్లాల్**

అనియు జెప్పబడినట్లు భగవద్భక్తులలో గూడ నగ్రగణ్యులు ఎమ్బెరుమానార్లే యనియు విశదమగుచున్నందున భగవన్నిష్ఠయు, భాగవత నిష్ఠయు శ్రీయెమ్బెరుమానార్లకు గలవని తాత్పర్యము. ఇట్టి భగవద్భాగవత నిష్ఠయే ఆళ్వార్లు మొదలుకొని వచ్చెడి సత్సంప్రదాయమై యున్నది.

ఎమ్బెరుమానార్ల విషయములో ఆళ్వార్ల ప్రీతి

ఎమ్బెరుమానార్లే ఆళ్వార్ల పయిల్ శుకరొళి నెడుమాఱ్కడిమై

అను తిరువాయ్మొళిలలో తాత్పర్య భూతులనుటకు, అందలి యొక పాశురము వ్యాఖ్యానములో నైనను నావిశేషార్థము చెప్పబడి యున్నదా అనినచో

నెడుమాఱ్కడిమై అను తిరువాయ్మొళిలో, **అవర్కే కుడిగళాయ్చ్చెల్లుమ్** అను స్థలమందు

నీక్కమిల్లావడియార్ అను పాశురములో

శయమే అడియే తలై నిన్టార్ ఆగిరార్ శ్రీభరతాళ్వాన్ పోల్వార్,

కోదిలడియార్ ఆగిదార్ శ్రీశత్రుఘ్నాళ్వాన్ పోల్వార్,

నీక్కమిల్లావడియార్ ఆగిఱార్ ఇళైయ పెరుమాళ్ పోల్వార్,

ఆవర్కే కుడగళాయ్ ఇరుకరై యరాయిరాదే,

నచే ద్రామానుజే త్యేషా చతురా చతురక్షరీ

ఎన్టుమాప్పోలే కాణు మిరుక్క వడుప్పదు అని నమ్బిళ్ళై

సాయించుట చేత ఈ విషయములో వివేకులైన వారికి స్పష్టముగా నా విశేషార్థ గోచరమగును. అయితే **పయిలమ్ శుడరొళి** అను తిరువాయ్ మొళిలో గూడ యెమ్బెరుమానార్ల విషయమున్నదా? అనినచో, దానికి నుపేశ పరమ్పరయే కారణమని తెలియవలెను.

అడియారడియార్ తమ్మడియా రడియా ర్తమక్కడియా ర్తమ్మటయా రడియోఙ్గళే

అని సాయించిన సప్తదాస వర్గములో చరమపర్వము. ఎమ్బెరుమానార్లే యని సదాచార్యోపదేశము.

ఆళ్వార్లకు పాదరేఖాసములగు మధురకవి యాళ్వారు 1) శ్రీమన్నాథమునులు 2) శ్రీపుండరీకాక్షులు 3) శ్రీరామమిశ్రులు 4) శ్రీయామునాచార్యులు 5) శ్రీపెరియనమ్బి 6) శ్రీరామానుజులు 7) అని ఇదియే గదా సచ్ఛిష్య సదాచార్య క్రమము.

అందుకే **అడియార్.... తమ్మడియోజ్గళే** అని ఆళ్వార్లు తలంచిన చరమ పర్వమిదియే యగును.

అయిననూ, అవర్కే కుడిగళాయ్ చ్చెల్లుమ్ అను చోట ఎమ్బెరుమానార్లను స్పష్టముగా సాయించినట్లు

అడియారడియార్ అని చెప్పబడిన ఏడవ పర్వము

యెమ్బెరుమానార్లే యని ఆ వ్యాఖ్యానములో చెప్పబడ కుండుట చేత వీరి చరమ పర్వత్వమెట్లు స్థిరపడును? పయిలుమ్ శుడరొళికి ముందుగా ముడియానే అను తిరువాయ్‌మొళిలో, వ్యాఖ్యానావతారిక యందు గానీ

అచ్చటి వ్యాఖ్యానములలో గానీ ఆళ్వార్లకు మిగిలిన యాళ్వార్లు అవయవ భూతులుగా సాయించి యుండకపోయినను నమ్మాళ్వార్లకు మిగిలిన వారవయనభూతులని సత్సంప్రదాయ సిద్ధమైనట్లే సప్తమ పర్వమునకు ఆళ్వార్ల హృదయము ఎమ్బెరుమానార్లే యని సత్సంప్రదాయ సిద్ధము.

ఇందుకు ప్రమాణముః

కాసార సంయమిముఖా । కమలా సహాయ ।

భక్తా ప్రపత్తి పదవీనియతా మహాన్తః

యస్యా భవన్ననయనా ఇవ పారతంత్ర్యా ।

త్తస్మై నమో వకుళభూషణ దేశికాయ ॥ అని సత్సంప్రదాయజ్ఞుల శ్రీసూక్తి.

అందువలన నావిధముగానే ఆళ్వార్ల యొక్క చరమ పర్వనిష్ఠకు విషయము ఎమ్బెరుమానార్లే అనునది గూడ

మజ్జెయరాళి పరాఙ్కుశర్ మున్నవర్ వాళ్వ ముళైత్తిడునాళ్

అనుటచే సత్సంప్రదాయ సిద్దమగుచున్నది.

వణ్డార్ తణస్తుజాయాన్ మాదవన్ పూదజ్గళ్

అని చెప్పబడు శ్రీవైష్ణవులకు సేవింపదగిన చరమ పర్వము. శ్రీపెరుమ్బూదూరు యందలి స్వామి యెమ్బెరుమానారే యని సత్సంప్రదాయజ్ఞులు తెలిసికొనవలెను.

సచ్ఛిష్య సదాచార్య పరస్పర ప్రవర్తనము

నమ్మాళ్వారు దమకవయవభతులగు మిగిలిన ఆళ్వార్లు నాథముని మొదలగు ఆచార్యులును వారికి ప్రధానులై కల సతి అగుట చేత నమ్మాళ్వార్లు సేవింపదగిన పూజ్యపదమును బొందుదురా? అను సంశయ మక్కర లేదు.

తొణ్డర్ తొణ్డర్ తొణ్ణర్ తొణ్డన్ శడకోపన్

అని నమ్మాళ్వార్లు స్వయముగానే సాయించి యుండుట చేత అట్లు వారందఱును, ఆళ్వార్లకు పూజ్యపదమును పొందుదురనక దీరు. ఇంకను **పొలిగ పొలిగ** అను తిరువాయ్‌మొళి అవతారికలో

తమ్మాలే తిరున్ని శ్రీవైష్ణవర్గళ్ తిరువడిగళ్ విళున్దుమ్ అని సాయించి యుండుట చేత గూడ నట్లు చెప్పవచ్చును. అనగా తమచేత దిద్దబడిన శ్రీవైష్ణవుల శ్రీపాదముల యందు నమ్రులై అని కదా ఆ వాక్యము యొక్క తాత్పర్యము. ఇంకను

నెడుమాఱ్కడిమై లో అవనడియార్ శిఱుమానిశరాయెన్నై యాణ్డార్ అను స్థలము నందు వ్యాఖ్యానములో

అవర్గళాగిఱార్ మన్నన్ శరితైక్కే మాలాగి పొన్‌పయన్దేన్

ఎన్ఱిరుక్కిఱ తిమఙ్గైయాళాలుమ్ ఆణ్డాన్ ముదలానారుమ్

అనగా భగవద్దాసు లెట్టి వారనగా భగవంతుని చరితములకు మోహమును జెంది నా శరీరము యొక్క వర్ణమును గోల్పోతి నని చెప్పిన తిరుమఙ్గైయాళ్వార్లును ముదలియాణ్డాన్ మొదలగు వారును అని సాయించబడెను. కాబట్టి ఆళ్వార్లకు, ఇతరాళ్వార్లు, ఆచార్య గోష్ఠియు, పూజ్యులై యుందురనుట స్పష్టమగుచున్నది.

భట్టర్ తమ బాల్యకాలమున, తండ్రిగారగు కూరత్తాళ్వార్లతో, చిన్నతనము పెద్దతనము అనెడి ధర్మములు రెండును ఒకే ధర్మి యందు సమావేశమెట్లు గూడును? మరి ఆళ్వార్లు **శిఱుమామనిశర్** అని చెప్పిరే అని యడుగగా వారు మనతో పాటు అన్న పానాదికము ధారకమగునట్లు ప్రవర్తించుచు భగవద్విషయములో వారవగాహించు రీతిని జూచినప్పుడు నిత్యసరులతో సమానులనదగిణ ఆణ్డాన్, అరుళాళ ప్పెరుమాళ్, గోవింద ప్పెరమాళ్ అను వారు సుమి శిఱుమాన శుడరొళి, నెడుమాఱ్కడిమై, అను వాని యందు నిర్ధారించబడిన భాగవత శేషత్వమనునది, ఆళ్వార్లకును ఆచార్యులకును చరణవత్పరతంత్రులై యత్యంత ప్రియులగు ఎమ్బెరుమానార్ల యందే స్థిరస్థాయియగు ననునదియు, నట్టి చరమ పర్వముగా నుండు యెమ్బెరుమానార్ల విషయములో శేషభూతులై యుండునట్టి తచ్చరణశరణులై తత్సంబంధి సంబంధులగు కూరత్తాళ్వార్, ముదలియాణ్డాన్, అరుళాళ ప్పెరమాళ్ ఎమ్బార్ మొదలుకొని యతీంద్ర ప్రవణులగు మణవాళ మామునులు పర్యంతమును వ్యాపించుచున్నదని సిద్ధమగుచున్నది. ఈ విషయము పై పాశురములకు వ్యాఖ్యానముల వలనను, సదుపదేశము వలనను తెలియుచున్నది. ఈ సత్సంప్రదాయార్థములను, సదాచార్యాభిమానమును, పొంది శ్రీవైష్ణవులు సదా తనిష్ఠులై యుండవలెను.

చరమ పర్వమందే దివ్య ప్రబంధ తాత్పర్యము

ఆళ్వార్ల శ్రీ సూక్తులగు దివ్య ప్రబంధములు, చరమపర్వమందే నిగూఢ తాత్పర్యములు గలవిగా ఉన్నవి. ఎట్లనగా **నల్లిన్ కవితూముదల్ పత్తర్‌క్కు** మంచి భోగ్యమైన యీ కవిత్వము, పరిశుద్ధులగు ముఖ్య భక్తులు కొరకే అని ఉరు పెరుం శెల్వముమ్ అను నూత్తందాదిలో చెప్పుట చేతను, **ఆముదల్వ నివనెన్ఱు తత్తేత్తి** అను ఆళ్వార్ల సూక్తిలోని ఆముదల్వన్ అమృత స్వరూపులు అను వారు ఎమ్బెరుమానార్లే యని యామునాచార్యులు సాయించుట చేతను,

కున్ఱమెడుత్త పిరానడి యారొడు మొన్ఱినిన్ఱ శడగోపన్ అను పాశురార్థము

కున్ఱమెడుత్తా నడిశేరి రామానుశన్ అను నూత్తందాదిలోని సూక్తి చేతను

కడల్ మల్లై త్తలశయనత్తుఱై వార్ఐ క్కొణ్డాడుమ్

నెఞ్జుడైయా రవరెఙ్గళ్ కులతెయ్‌వమే అను మొదలగు ఆళ్వార్ల శ్రీసూక్తులు

మామలరాళ్ పుణర్ న్ద పొన్ మార్బన్ పొరున్దుమ్ పదితొఱుమ్....

కొణ్డిరిరామానుశ నెఙ్గళ్ కులక్కొలన్దే అను నూత్తందాదిలోని పాశురముచేతను

అరఙ్గనెమ్మా నుక్కె కాదళ్ శెయ్యు మెన్నెఞ్జమే అను ఆళ్వార్ల శ్రీ సూక్తి

పొన్నరజ్గమెన్నిల్ మయిలే పెరుగుమి రామానుశన్ అను నూత్తందాదిలోని పాశురము చేతను

నాదనై నరశిఙ్గనై నవిన్డేత్తువార్గళ్ ఉళక్కియ పాద తూళి

పడుదలా లివ్వులగు పాగ్గియుమ్ శెయ్దదే

అను ఆళ్వార్ల శ్రీసూక్తి

వళర్న్ద వెజ్కోపమడఙ్గ లొన్రాయే అన్రు వాళవుణన్ కిళర్ న్ద పొన్నాగమ్

కిళిత్తవన్ కీర్తిప్పయిరెళున్దు విళైనెడుమ్ శిన్దై యిరామానుశన్

తవన్ తారుణి పెత్తదు ఇవ్వులగిరుళ్ నీఙ్గ త్తన్నీణ్డియశీ రరుళ్ శురన్దు

అను నూత్తందాదిలోని పాశురముల చేతను

తమ్మడిక్కేదుమ్ తక్కవా నినైయాళ్ అను పాశుర వ్యాఖ్యానములో

ఎమ్బెరుమానారెన్రు మదునాయ్త్తు సుప్రసిద్ధమ్

అని చెప్పబడుట చేతను, ఈ విషయము స్పష్టముగా తెలియుచున్నది. ఈ విధముగా, పన్నిద్దరాళ్వార్ల యొక్కయు, మధుర సూక్తులకు హృదయ భూతులు, శ్రీ యెమ్బెరుమానార్లే యని తెలియ చేయుటకు మూలము నూత్తందాది దివ్య ప్రబన్ధమే. దానికి మూలము ఆళ్వార్ల శ్రీసూక్తి విశేషములును, దానికి మూలము పాంచరాత్ర భగవచ్ఛాస్త్రములో చెప్పబడిన భగవద్వాక్యము నగుచున్నది.

పాంచరాత్ర శాస్త్రమునందు

మమ స్వరూపం సర్వస్మాత్ పరస్యజగదీశితుః

షడ్విధం పరిపూర్ణం తత్ సేనేశ పరిపశ్యతే ॥

పరత్వం వ్యూహవిభవా దన్తర్యామిత్వ మేవచ ॥

అర్చాచార్యావతారౌ ద్వౌషాడ్విధ్యం మే ప్రకీర్తితమ్

పూర్వస్మాదపి పూర్వసా త్సులభోహ్యుత్తరోత్తరః ।

తేష్వాచార్యావతరణే కారుణ్యం పరిపూరితమ్

జ్ఞానాదిగుణతస్తత్ర విశేషాధిషితిర్భవేత్ ।

ఆసన్న త్వాద్దయాళుత్వాత్ జ్ఞానిత్వాద్గురు భావతః ।

చరమస్యానతారస్య గురు రూపేణ మే సదా । ప్రాప్యత్వ ప్రాపకత్వే ద్వే ।

స్వ నిష్ఠేన గుణాన్వితే । తస్మాత్తత్పాద యుగళం శరణం మోక్ష కాంక్షిణామ్ ।

అని విష్వక్సేన సంహితలో, విష్వక్సేనులకు భగవంతుడు చెప్పినట్లున్నవి. వీనిభావ మేమనగా, సర్వేశ్వరుడనైన నా స్వరూపము ఆరు విధములు, పరము, వ్యూహము, విభవము, అంతర్యామి, అర్చనా, ఆచార్యావతారములు అని, అందు పరము కంటె వ్యూహము. దాని కంటే విభవము, దానికంటే అంతర్యామి దానికంటె అర్చనా, దాని కంటె ఆచార్యావతారములు సులభమైనవి. ఆచార్యావతారములో కారుణ్య గుణము పూర్ణమైనవి. ఆచార్యావతారములో కారుణ్య గుణము పూర్ణముగా గలదు. ఇంకను జ్ఞాన శక్త్యాది గుణములు గూడ విశేషాధిష్ఠితములై యుండును. మనుజునకు దగ్గరగా నుండి తనతో సమానమైన వాగాది చేష్టలు గలిగి దయాళువై, జ్ఞానియై, ఆచార్యుడుండును, అందుచే చరమావతారమగు నాచార్యావతార మందే ప్రాప్య

ప్రాపకత్వములు తన్నిష్ఠములై, జ్ఞానశక్త్యాది గుణవిశేషములు గలిగియుండును. అందువలన ఆచార్య పాదయుగళమే మోక్షార్థులకు నత్యంత శరణము అని భావము కావున ఆళ్వార్ల ప్రబంధ తాత్పర్యము ఆచార్య పరత్వమే యని నిశ్చితము.

శ్రీమదష్టాక్షరీ ప్రతిపాద్యుడగు శ్రియఃపతియే

ఆచార్యావతరణే కారుణ్యం పూర్ణమిష్యతే ।

తస్మాత్తత్పాదయుగళం శరణం మోక్ష కాంక్షిణామ్

అని నిశ్చితముగా చెప్పుట చేత సమస్త శాస్త్ర సంగ్రహరూపమగు అష్టాక్షరికినీ, తద్వివరణ రూపములగు ద్వయ చరమములకును తాత్పర్యము, నూత్తందాది దివ్య ప్రబంధ ప్రతిపాదకమగు చరమ పర్వనిష్ఠయే యనుట నిర్వివాదమైయున్నది.

పాంచరాత్ర ప్రతిపాద్యాచార్యులు శ్రీరామానుజులే

అయితే అట్టి ఆరవ అవతారము ఆచార్యుడని పాంచరాత్రములో చెప్పినంత మాత్రము చేత ఆ ఆచార్యులు ఎంబెరుమానార్లే అని నిశ్చయించుట ఎట్లు పొసగును? అనినచో అది కూడ పాంచరాత్ర శాస్త్రములోనే ప్రసిద్ధముగా చెప్పబడెను.

మద్భక్తా జ్ఞానపూర్ణాయే భవిష్యంతి కలౌయుగే ।

త్రిదణ్డినో భిమానాన్మే తే సర్వే గురురూపిణః ॥

నా భక్తులై జ్ఞానపూర్ణులై త్రిదండధారులగు సన్యాసులుగా నుండు వారెవ్వరు కలియుగములో జన్మించగలరో వారు నా అభిమానము (విశేషాధిష్ఠానము) చేత ఆచార్య రూపులుగా నుందురు. అను మొదలగు భగవద్వాక్యములకు పరమ హంస పరివ్రాజకాచార్యులగు శ్రీమద్రామానుజాచార్యుల యందే అట్టి ఆచార్యత్వము గలదని తాత్పర్యముగా గ్రహింపదగును. అందువలననే కదా శ్రీరంగనాథుడగు శ్రియఃపతి, వైష్ణవ సిద్ధాంతమునకు ఎమ్బెరుమానార్ దర్శనము అని జగత్తునందు ప్రసిద్ధ పరచిరి.

అట్లే శ్రీకాంచీ వరద రాజులు గూడ యాదవ ప్రకాశులతో, మన రామానుజునికి ఒక్క ప్రదక్షిణము చేయుట సకల భూప్రదక్షిణము వలని ఫలము కంటె మించిన ఫలము కలుగు నని సాయించిరి. శ్రీరంగనాథ వరదరాజుల కంటె గూడ భోగ్య భూతులగు శ్రీ సుందర బాహుస్వామి (తిరుమాలిరుమ్ శోలైనమ్బి) తమ సన్నిధిలో **కిడామ్బియాచ్చాన్** అను వైష్ణవోత్తములు **అపరాధ సహస్ర భాజనమ్** అను యామున సూక్తి ననుసంధించి ప్రపత్తి చేయు సమయమున, నా శ్లోక మందలి **అగతిమ్** అనగానే ఆయనను చూచి మన రామానుజులుండగా అగతి నని అనరాదు సుమా అని సాయించి ఉండిరి. వీని యన్నిటి చేతను, ఎమ్బెరుమానార్ల ఆచార్యత్వము సుస్పష్టమగుచున్నది. కావుననే యీ రామానుజ దర్శనము నందలి యాచార్యులకును, తచ్ఛిష్య ప్రశిష్యులకు గృహారాధనములో భగవద్విగ్రహములతో బాటు ఎమ్బెరుమానార్ల విగ్రహమును గూడ నుంచుకొని యారాధించుట ఆవశ్యమగుచున్నది.

అదియుగాక, వారికి అందరకును ఇరామానుజనుడైయార్ అని శ్రీరంగాది దివ్యస్థలములలో ప్రసిద్ధి గలిగి యున్నది. మరియు శ్రీపాంచరాత్రమహాశాస్త్ర ప్రతివాదితమైన ఆచార్యావతారము. శ్రీరామానుజులే యని చెప్పబడిన యంశము దీనినే ధ్రువపరచుచున్నది. శ్రీపాంచరాత్రములో గురురూపిణః అను బహువచనము

పూజ్యతను బోధించి ఏక వ్యక్తి యందే పర్యవసితమగుచున్నదని గ్రహింపవలెను. గురుషు బహువచనమ్ అని కదా శిష్ట సంప్రదాయము, అయినను అట్టి ఆచార్యత్వము ఎంబెరుమానార్ల యందే పర్యవసించినను, తచ్ఛిష్య ప్రశిష్యులగు అరుళాళ ప్పెరుమాళ్, నలన్తిగళ్ నారాయణజీయర్, ఎంబార్ నంజీయర్, పిన్బలిగియరామ్ పెరుమాళ్ జీయర్, వారికేసరి అళగియమణవాళ చ్ఛీయర్, ధీభక్త్యాది గుణార్ణవులగు మణవాళమామునులు, వారి పాదాశ్రితులును అన్తిమోపాయనిష్ఠులగు శ్రీభట్టనాథ జీయర్ వారి పాదాశ్రయులగు శ్రీవానమామలై జీయర్ మొదలగు ఎంబెరుమానార్ల తిరువడి సంబంధులందఱి యందును రామానుజ దాసత్వాభిమానము గల ఇతర యతివరులందరి యందును చరమ పర్వత్వమును స్థిరముగా నుండునని తెలియవలెను.

భగవత్ప్రకటిత భాష్యకారాచార్యత్వము

సర్వవేదాంతాది సచ్ఛాస్త్ర ప్రతిపాద్యుడై సర్వశేషియైన శ్రియఃపతి గూడ అను వ్రజామి అని చెప్పినట్లు రామానుజీయులుగా తమను తామే అన్వయించుకొనిన విధము, యాదవాద్రియందలి సంపత్కుమారులు పుత్రులుగా భావింపబడుటయు, తిరుపతిలోని తిరువేఙ్గడముడైయానులు శంఖ చక్రములను పొందుటయు, తురుక్కురుఙ్గుడినమ్బి, మంత్రరత్నము నుపదేశము పొందుటయు, శ్రీకూర్మమందలి శ్రీకూర్మనాథులు ఊర్ధ్వపుండ్రమును పొందుటయు గమనించినచో తెల్లమగును.

శ్రీరామానుజాష్టోత్తర నామావళిలో నీ విషయమును సూచించుచు, ఎంబెరుమానార్ల ప్రీతిపాత్రులగు ఆంధ్ర పూర్ణులు సంపత్కుమార జనకః అనియు

శ్రీవేంకటాచలాధీశ శంఖ చక్ర ప్రదాయకః అనియు

కురంగ నగరీపూర్ణ మంత్రరత్నోప దేశకః

అనియు కూర్మనాథ ప్రకాశకః అనియు సాయించి యుండిరి.

శ్రీ కూర్మనాధునకి ఊర్ధ్వపుండ్రధారణము చేయించియే గదా, శివలింగత్వ భ్రాంతిని పోగొట్టి విష్ణు బింబముగా శ్రీఉడైయవరులు ప్రకాశింపచేసినట్లు స్థలపురాణము చెప్పుచున్నది. అందువలన శ్రీ ఎంబెరుమానార్లే ఆరవ భగవదవతారమని భగవంతుడే స్పష్టపరచెనని తెలియవలెను. మరియు నిప్పటికిని యాదవాద్రి మొదలగు స్థలములలో పెరుమాళ్లకు ఇరామనుశ నమ్బి అని వ్యవహారము గలదు. ఈ విధముగా శ్రియః పతి తానే తనయొక్క ఉక్త్యనుష్ఠానముల చేత జగదేకాచార్యులు స్వామి రామానుజాచార్యులే యని ప్రకటించి యుండుట చేత,

శ్రోత్రియం బ్రహ్మ నిష్ఠమ్ .... సగురుమే వాభి గచ్ఛేత్,

ఆచార్య దేవో భవ, దేవమివాచార్య ముపాసీత,

గురుదేవ పరంబ్రహ్మ ఆచార్య స్సహరి సాక్షాచ్చర రూపీ న సంశయః,

సాక్షాన్నారాయణో దేవః కృత్వా మర్త్యమయీం తనుమ్,

అని అనేక ప్రమాణముల చేత భగవద్రూపులుగా చెప్పబడిన సదాచార్య శ్రేష్ఠులు, ఆచార్య చూడామణియగు రామానుజాచార్యులే అని నమ్మవలెను. వైదికోత్తములగు నట్టి ఎంబెరుమానార్ల యందే ఆచార్యత్వము ముఖ్య వృత్తమని ముముక్షువు లందఱును తెలిసికొనవలెను.

శ్రీరామానుజుల ఆచార్యత్వ నిగమనము

ఈ విధముగా శ్రీరామానుజుల సకలోత్తమాచార్యత్వము భగవద్భాగవత సమ్మతమగుట చేతనే **రామానుజార్య దివ్యజ్ఞా వర్ధతా మభివర్ధతామ్** శ్రీరామానుజాచార్యులు శ్రీ భాష్య ద్రవిడాగమ ప్రవచనమ్ ఇత్యాదిగా చేసిన దివ్యాజ్ఞ ఉత్తరోత్తరముగా నభివృద్ధి నందవలెననియు

రామానుజార్య దివ్యాజ్ఞా ప్రతివాసర ముజ్జ్వలా

దిగన్త వ్యాపినీ భూయా త్సాహిలోక హితైషిణీః

అదియే లోకహితమును గోరునది యనియు సమస్త దివ్యదేశములందలి శ్రీవైష్ణవ గోష్ఠులలో నిత్యము పఠింపబడుచు నతి ప్రసిద్ధముగా నున్నది.

గుశబ్దస్త్వంధకారే స్యా ద్రుశబ్ద సన్నిరోధఖకే ।

అంధకార విరోధిత్వా ద్గురురిత్యభిధీయతే ॥

గు అనగా నజ్ఞానాంధకారమును చెప్పును, రు అనగా దాని విరోధించునదని చెప్పును. అందువలన అజ్ఞానాంధకారమును నిరోధించు వాడు,కావున గురుః అని ఆచార్యునకు పేరు. ఇచ్చటవో అట్టి గురు పదము

పుణ్యాంభోజ వికాసాయ పాపధ్వాంత క్షయాయ చ ।

శ్రీమానా విరభూద్భూమౌ రామానుజదివాకరః ॥

అన్నట్లు అజ్ఞానమూలమగు పాపాంధకారమును క్షయింపచేయు రామానుజులయందే, యా గురుపద మన్వర్థమై చెల్లును. **"తస్మిన్ రామానుజార్యే గురురితి చ పదం భాతి"** అని గదా పెద్దల శ్రీసూక్తి.

పై యంశమును బలపరచునట్టి

ఉన్ తుళఙ్గళోడి తిరుప్పాద మెల్లైయిల్ శీరిళనాయిఱు ఇరణ్డు పోలుళవా

అను ఆళ్వార్ల శ్రీసూక్తిని వివరించు

ఉదిప్పవ ఉత్తమర్ శిన్దైయుళ్ .... ఏతిత్తలై నాద నిరామానుశన్ తన్నిణైయడియే

అను నూత్తందాది పాశురము వివరించెనని గ్రహింపవలెను. మరియు

"తుయరఱు శుడరడి తొళుదెన్మనే"

తిరుమాళ్ తిరుప్పేర్ వల్లారడి క్కణ్ణి శూడియ మాఱన్

ఆరెనక్కు నిన్పాదమే శరణాగ త్తన్దొళిన్దాయే ।

కళల్ గళవైయే శరణాగక్కొణ్డు ।

ఉన్నడిక్కీర్ మఱ్న్దు పుగున్దేనే "

అను మొదలగు ఆళ్వార్ల శ్రీ సూక్తుల యందుండిన భగవచ్చరణ యుగళ తచ్ఛేషత్వాద్యను సంధాన మంతయు భాగవత పర్యంతమై యెమ్బెరుమానార్ల యందే పర్యవస్థితమగుచున్నది. ఇందువలననే కదా

పయిలుమ్ శుడరొళి" "నెడుమాఱ్కడిమై, నణ్ణాదవాళవుణర్" తేట్టరుమ్ తిఱల్

అను వాని యందు గల భాగవత శేషత్వాదులకును

పొలిగ పొలిగ ...... కలియుగం కెడుమ్ కణ్డు కొణ్మిన్

కణ్డోమ్ కణ్డోమ్ ...... తొణ్డీర్ ఎల్లీరుమ్ వారీర్ తొళుదు తొళుదు నిన్నార్తుమ్

ఇత్యాదులలో చెప్పబడిన భాగవశేషత్వాదులకును శ్రీయెమ్బెరుమానారే లక్ష్యమని యత్యంత విశదమగుచున్నవి.

కాబట్టి రామానుజవైభవ ప్రతిపాదికమగు నూత్తందాది దివ్య ప్రబంధమునకు మూలము ఆళ్వార్ల దివ్య ప్రబంధమునందలి భాగవత వైభవమే యనియు, నా దివ్య ప్రబంధమునకు మూలము శ్రీ పాంచరాత్రోక్త భగవత్సూక్తులే యనియు, వానికి మూలము శ్రీమదష్టాక్షర బ్రహ్మవిద్యయే యనియు శ్రీ వైష్ణవ సంప్రదాయ సమ్మతమని తెలియవలెను. అందువలననే నూత్తందాది అవతారికలో

సకల శాస్త్ర సంగ్రహమాన తిరుమంత్ర త్తినుడైయ

తాత్పర్యమ్ః

ఆళ్వార్ కళుడైయ దివ్య ప్రబంధ సారార్థమ్ అనియు

నమ్మాళ్వార్ తుడఙ్గి ఉపదేశ పరమ్పరా ప్రాప్తమ్ అనియు

ఇత్తై ప్రపన్న గాయత్రియెన్ఱు నమ్ముదలిగళ రుళిచ్చెవర్ అనియు

శ్రీమణవాళ మామునులు సాయించి యుండిరి. అందు తిరుమంత్రము యొక్క తాత్పర్యమని చెప్పుట తత్ప్రతిపాద్యుడగు శ్రియఃపతి గూడ రామానుజనమ్బి అని వెనుక చెప్పిన రీతిని ఎమ్బెరుమానార్ల సంబంధులలో నన్వయించి, వారి వైభవమును ప్రకటించుట చేతనే యని తెలియవలెను. కావున తిరుమంత్రము యతీంద్రుల ప్రాధాన్యమును చెప్పుననుటలో నాటకము ఏమియును లేదు.

ఈ విధముగా శ్రియః పతికిని ఆళ్వార్లకును తాత్పర్యమై యుండుట చేతనే

అష్టాక్షరాఖ్యమను రాజ పద త్రయార్థ ।

నిష్ఠాం మమాత్రవితరాద్య దయాంబురాశే ।

శిష్టాగ్రగణ్య జనసేవ్య భవత్పదాబ్జే ।

హృష్టా ఽస్తు నిత్య మనుభూయ మమాస్య బుద్ధిః ॥

అని మణవాళ మామునులు యతిరాజ వింశతిలో సాయించి తమ చరమపర్వ నిష్ఠను ప్రకటించి యుండిరి. ఇక అడియారడియార్ అను పాశురములో ఏడవ చరమపర్వము ఎమ్బెరుమానార్ల తిరువడియే అను నంశము **పేఱోన్ఱుమత్తిల్లై నిన్ శరణన్ఱి** అను నూత్తందాది శ్రీసూక్తి వలన స్పష్టము.

కనుకనే **ఆర్వాఞ్చో యత్పద సరసిజ ద్వంద్వమాశ్రిత్య పూర్వే ।**

మూర్ధ్నా యస్యాన్వయ మపగతా దేశికా ముక్తి మాపుః ॥

ఉడైయవరులకు తరువాతి వారు వారి తిరువడి సంబంధము చేతను, పైవారు తిరుముడి సంబంధము చేతను ముక్తి నందిరని మర్మజ్ఞులగు ఆచార్యులు సాయించి యున్నారు. ఇచ్చట ముక్తిమాపుః అనుటను యతిరాజుల వలననే ప్రాచీనార్వాచీనా చార్యుల కందఱకును ముక్తి కలుగుట ఎట్లు? అనగా దానికి సమాధానము

శేషోవా సైన్య నాథోవా శ్రీపతిర్వేతి సాత్త్వికైః । వితర్క్యాయ మహాప్రాజ్ఞైః

అను అభియుక్తోక్త మంగళశాసనములో సాక్షాత్తు నిత్యసూరులలో నొకరగు అనంత విష్వక్సేనులో లేక సాక్షాత్తు శ్రియఃపతియో, రామానుజులగా నవతరించిరని తలంచబడుటచేత వారి కట్టి మోక్ష ప్రదత్వ సామర్థ్య సిద్ధమని తెలియవలెను.

ఈ విధముగా శ్రీవైష్ణవ సిద్ధాంతమగుట చేతనే

ఆచార్యానాశ్రయామో యతివరచరణ ద్వంద్వ సేవైక భోగాన్ ।

శ్రీమద్గోవిన్ద ముఖ్యా స్సముదిత భగవద్ జ్ఞాన భక్తి ప్రభావాన్ ।

ఆప్యన్యాన్ సాధువృత్తా న్ప్రపదనసమయే నిష్ఠితా స్థాను దివ్యమ్ ।

ప్రాప్తుం సంవృత వాంఛా ననుకలమఖిలాన్ మూర్ధ్ని కుర్మో ముముక్షూన్ ॥

ఎమ్బార్ మొదలగు యతి రాజ సంబంధులును ఇంకను శ్రేష్ఠాచరణముగల ప్రపన్నులై పరమపద కాంక్షులగు ముముక్షువులను నాశ్రయించెదమని అభయుక్తులగు పెద్దలు సాయించియుండిరి.

వ్యాసాది మహర్షులును, ఆళ్వార్లును ఉభయవిభూతి నాయకుడగు శ్రియఃపతియు గూడ ఎమ్బెరుమానార్ల అవతారమే లోకహితార్థమై యున్నదని తెలిసికొని బోధించిరి. ఇతరులకిది యెట్లు తెలియును? ఇంకను ప్రాచీనార్యులు శ్రీ రామానుజుల అవతారమును అనేక విధములుగా అభివర్ణించి యుండిరి.

వరవరమునుల వైభవము

విణ్ణి తలైనిన్ఱు వీడళిప్పాన్ ఇత్యాదిగా **నూత్తందాదిలో** చెప్పిన రీతి వేదమార్గమును లోకములో విస్తరింప జేయుటకును, మోక్షమును జనులకు కటాక్షించుటకును అవతరించిన ఎమ్బెరుమానార్లకు పిమ్మట, నట్టి జగదాచార్యత్వము తిరిగి రమ్యజామాతృ మునులయందే స్థిరపడియున్నది. మరియు కున్ఱమెడుత్తాన్ ఇత్యాదిగా నూత్తందాదిలో చెప్పబడిన శ్రీవైష్ణవాచార్యత్వము యొక్క సారార్థమునకు శ్రీమణవాళ మామునులే స్థానమగుదురు. అడియారడియార్ అను ఆళ్వార్ల శ్రీసూక్తిలో సాయించబడిన దాస సప్తకము మధురకవి మొదలుకొని యెమ్బెరుమానార్లతో నెట్లు పర్యవసితమైనదో, అట్లే రామానుజ పదచ్ఛాయయగు గోవిందాఖ్యాయుతులైన ఎమ్బారు మొదలుకొని నఞ్జీయర్, నమ్బిళ్ళై, పెరియవాచ్చాన్పిళ్ళై, పిళ్ళై లోకాచార్యులు, తిరువాయ్ మొళిపిళ్ళై, మణవాళ మామునులతో పరి సమాప్తమగుచున్నదని చెప్పవచ్చును. అట్టి జ్ఞాన సంతతియే ఉత్తమ సంతతియగుచున్నది గాన పిడిత్తార్పిడిత్తార్ అను నది జ్ఞానసంతతి సంబంధమైన ఆశ్రయణమే యని తెలియవలసియున్నది.

శ్రీ యతీంద్ర ప్రవణ ప్రభావము

ఎమ్బెరుమానార్ల వైభవమును పొలిగ పొలిగ అను తిరువాయ్ మొళి యందు నమ్మాళ్వార్లు ప్రకటించిరి. అట్లే శ్రీరంగనాధుడు మొదలగు పెరుమాళ్లు గూడ నాయాకృత్యముల చేత ప్రకటించి యుండిరి. అట్లే పొలిగ పొలిగ తిరువాయ్ మొళిలోని మూడవ పాశురములో ఇశైపాడి యెఝ్గుమిడఝ్కొణ్డనవే అను దాని వ్యాఖ్యానములో భగవదనుభవ జనిత ప్రీతియాలే అను వాక్యమునకు తిరువాయ్మొళి మొదలగు దివ్య ప్రబంధములను భగవద్భక్తాగశీదులతో ననుసంధించి అని తాత్పర్యమగుట చేత నట్టి యనుభవ పూర్తి మణవాళ మామునుల యందే కలదు అని స్పష్టమగుచున్నది. ఈ విషయము

మన్నియశీర్ మాఱన్ కలై యుణ వాగ పెత్తోమ్

ఇత్యాది మణవాళ మామునుల శ్రీ సూక్తి వలననే స్పష్టమగుచున్నది. అట్లే తత్సమాన కాలికులగు ప్రామాణికులు మణవాళమునివన్

వన్దిలనేల్ ఆత్తిల్ కరైత్త పుళ్ళియల్లారో తమిలారణమే

అనగా మణవాళ మామునులు అవతరింపనిచో తమిల్ దివ్యప్రబంధములు ఏటిలో కొట్టుకొని పోవు చింత చెట్లుగావా అని చెప్పు వాక్యములు గూడ నిచ్చుట ప్రమాణములు.

శ్రీశైలేశేత్యాది శ్లోకావతరణము

తిరుక్కురుఙ్గుడి నమ్బి యెమ్బెరుమానార్ల యందాచార్య ప్రతిపత్తి యొనర్చి మంత్రరత్నమును వినినట్లుగా శ్రీరంగనాథుడు వరవరమునుల పట్ల ఆచార్య ప్రతిపత్తి యొనర్చి యట్టి మంత్రరత్న వివరణ రూపమగు తిరువాయ్ మొళిని అయిదు వ్యాఖ్యానములతోను, మిగిలిన ఆళ్వార్ల దివ్య ప్రబంధ రహస్యములతోను, విని కటాక్షించి శాత్తునాడు **శ్రీశైలేశే** త్యాది తనియను దాను స్వయముగా శ్రీవైష్ణవ బాలుని రూపముతో వచ్చి విన్నవించి, అతనియను నాలాయిర దివ్య ప్రబంధాను సంధానం ఆరంభమునందు అందఱు శ్రీవైష్ణవులును అనుసంధింప వలెనని కట్టుబాటు చేయుటచే, నేటి వరకు సంస్కృత వేదాధ్యయనము నారంభించునప్పుడు ప్రణవోచ్చారణము వలె, నందరును, దీనిని తప్పక అనుసంధించుచున్నారు. అట్టి నియమము శ్రీరంగనాథుడే శ్రీవైష్ణవ సిద్ధాంతమునకు రామానుజ దర్శనమని ప్రసిద్ధి నిచ్చినట్లే దీనిని గూడ నియమించెనని తెలియవలెను.

శ్రీబదరీనారాయణము నందలి బదరీనాథులు తమ కత్యంత ప్రియుడై ముముక్షువగు నొక భాగవతునకు ఇది మోక్ష ప్రద మంత్రము చెప్పి శ్రీశైలేశేత్యాది శ్లోకమునుపదేశింపగా, ఆభాగవత శ్రేష్ఠుడు దక్షిణ దేశ మందలి శ్రీరంఘమునకు వచ్చి మణవాళ మామునుల నాశ్రయించి వారి వైభవమును ప్రకటించెనను విషయము ప్రసిద్ధము గదా!

వరవరమునుల శేషావతారత్వ వైభవము

ఇంకను **మున్నలోర్ వెళ్లి ప్పెరుమలై కుట్టన్** ప్రాచీనులగు అద్వితీయరజతపర్వతమను అనంతుని పిల్లడు అని చెప్పినట్లు శేషావతారమగు మణవాళమామునుల వైభవము నెఱుంగ జాలక, సాధారణులని తలంచి అపచారపడకుండ లోకులు జ్జీవించునట్లు **పైగొళ్ పామ్బణై కరుమలై కుట్టన్** అని చెప్పబడు శ్రీరంగనాథుని పర్యంకమగు శ్రీఆనన్దాళ్వానులే మణవాళ మామునులుగా అవతరించిరి అనునది లోక ప్రసిద్ధమే కదా! ఇక ఎఙ్గుమిడ జ్గొణ్డనవే అను ఆళ్వార్ల శ్రీసూక్తిలో చెప్పినట్లు అంతటను తమనివాసము లేర్పరచుకొని బాహ్యకుదృష్టులకు జోటు లేకుండ శిష్య ప్రశిష్య సంతతితో వ్యాపించి యుండిరి అను వ్యాఖ్యాన శ్రీసూక్తులకు ఎంబెరుమానార్ల తరువాత యతీంద్ర ప్రవణులగు మణవాళ మామునులు, వారి శిష్య ప్రశిష్యులే యనునది స్పష్టముగా తెలియుచున్నది.

వరవరమునుల శ్రీ పాదముల నాశ్రయించిన పట్టర్ పిరాన్ జీయర్, వానమామలై జీయర్, కోయిలణ్ణన్ కన్డాడైయప్పన్, మొదలగు కన్దాడై వారునూ, తిరుమలైనంబియే అనదగిన తిరుమలై వంశ జాతులగు అద్దంకి శ్రీరంగాచార్యులు మొదలగు తిరుమలవారును, ఎరుమ్బియప్పాయను దేవరాజాచార్యులును, ప్రతివాదిభయంకరులైన హస్తిగిరి నాథాఖ్య వేంకటాచార్యులు, అణ్ణరాయ చక్రవర్తియను నల్లానా చార్యులు ఇంకను ఆచార్య పౌత్రులను వారు జ్ఞాన భక్త్యాది సద్గుణ పూర్ణులగు నట్టి వరవరమునికి వ్యవహిత శిష్యులగు అళగియ మణవాళ ప్పెరుమాళ్ నాయనాచార్యులు మొదలగు జీయరులును, ఆచార్య పురుషలును వారి వారి తిరువడి నాశ్రయించి పంచ సంస్కారాదుల వలనను, భగవద్విషయాద్యన్వయము వలనను తచ్ఛిష్య ప్రశిష్యులై యుండు శ్రీవైష్ణవులును ఆచార్య పురుషలును, లోకమంతట నిండి బహు ప్రసిద్ధులై యుండి నందున

ఎజ్గుమిడ ఎజ్జొణ్డనర్ అను శ్రీసూక్తి సార్ధకమైయున్నది.

ఇంకను శ్రీవైష్ణవ దర్శనమునకు ప్రధమపురుషులగు నమ్మాళ్వారు, తిరుమఙ్గైయాళ్వారు, నాధముని, యామునాచార్యులు, ఎమ్బెరుమానారు, మొదలగు ఆళ్వారాచార్యులకు వారి వారి తనియన్లు వేలు వేలుగా నున్నను, యతీంద్ర ప్రవణులగు వరవర మునుల యొక్క శ్రీశైలేశే త్యాదిత నియశ్లోకము శ్రీరంగనాధ బదరీనాధాది స్వాములు ఆదరించి లోకములో వ్యాపించు రీతిని ప్రవర్తింపచేయుట చేత, వరవరమునుల వైభవము వాచానుగోచరమగుచున్నది. శేషావతారమగు ఎమ్బెరుమానార్ల వైభవము వలెనే వారి అపరావతారమై, తత్పద ప్రవణులగు రమ్యజామాతృమునుల యొక్క వైభవము గూడ జగత్ప్రసిద్ధమై యున్నది.

ఒకప్పుడు, భకాగ్రేసరు లొకరు మణవాళ మునుల కత్యంత శ్రద్ధా భక్తి పురస్సరముగా భిక్షా ప్రసాదము సమర్పించి నంత, స్వామి దానిని రహస్యమైన గదిలో నుండి యారగించు చుండుటను గవాక్షరంధ్రముల ద్వారా చూడగా నా భక్తులకు సహస్రఫణములతో నత్యాదరముగా స్వామి వారారగించుచుండుట గన్పట్ట వారత్యాశ్చర్యమగ్ను భేరని ఐతిహ్యాము గలదు. దీనిని బట్టి గూడ రమ్యజామాతృమునులు శేషాంశ సంభూతులని స్పష్టమగుచున్నది. ఇంకను శ్రీవైష్ణవ దర్శన మందలి ప్రామాణికులకు ప్రమాణ తిరట్టు మొదలగు దివ్య ప్రబంధ వ్యాఖ్యాన రహస్యములను సాయించి మహోపకారము నొనరించిన వరవరమునుల వైభవము, పిళ్ళై లోకం జీయర్ ఆచార్యులగు పరవస్తు పిళ్ళైలోకాచార్య జీయర్ సాయించిన శ్రీశైలేశేత్యాది శ్లోక సంగ్రహ విస్తర వ్యాఖ్యానముల యందును, యతీంద్ర ప్రవణ ప్రభావము నందును, మిక్కిలి విస్తరముగా వర్ణింపబడి యున్నది. వాని యందాసక్తి గలవారు జూచుకొనవలెను.

వరవరమునులు తరచు శ్రీభాష్య ప్రవచనము చేయకుండుటకు నిమిత్తము

అట్లు శేషావతారముగా నుండియు, సకల శాస్త్ర సమ్మత వ్యాఖ్యాన శక్తి గలిగియుండియు, ప్రమాణ తిరట్టు మొదలగు ప్రబంధ రహస్యములను వెల్లడింపజేయ సమర్థులై యుండియు, సకల లోక పూజ్యులగు వరవర మునులు శ్రీభాష్యమును ఒకసారి యయినను ఎవరికి కాలక్షేపము సాయించి యుండకుండుటకు కారణమేమనగా, వారి సమకాలములో శ్రీభాష్యమునకు అధికారులు అనేకులుండి ద్రావిడ దివ్య ప్రబంధములను అధికరించి యనుసంధించు అధికారులు లేకుండుట చేతను, ఎచ్చటనో అట్టి వారిని శ్రమించి సంగ్రహించి ప్రవచనము ఒనర్పవలసి యుండుటను జూచి, వీరికాచార్యులగు తిరువాయ్‌మొళిప్పిళ్ల గారు మొదలగు పెద్దలు, వీరి కుండు ఉభయ వేదాంతాది సకల శాస్త్ర వ్యాఖ్యాన శక్తిని గమనించి, వీరిని ద్రావిడ గ్రంధములగు దివ్య ప్రబంధములను ప్రవచన మొనర్పవలసిదని మిక్కిలి నిర్బంధ పూర్వకముగా నియమింపగా, వారి ఆజ్ఞానుసారము దాని యందే ఆసక్తిని విస్తరింప చేసుకొని మన్నియ శీర్మాఅన్ కలైయుణవాగపెత్తోమ్ అని యత్యాదరముతో తన్నిష్ఠులై యుండుట చేతనే శ్రీభాష్య ప్రవచనమునకు అవకాశ మొదవలేదు.

మరియు శ్రీభాష్యకర్తలగు రామానుజులకు కూడ తిరువాయ్ మొళి మొదలగు దివ్య ప్రబంధముల యందే అభిలాష యుండెనని తత్సమకాలికులగు తిరువరఙ్గత్తముదనార్లు తాము సాయించిన నూత్తందాదిలో **ఉఋ పెరుమ్ శెల్వమ్ – శెన్దమిళారణమే ఎన్నిన్నీణిలతోరతీతర నిన్రవిరామానుశన్ ఎనక్కారముదే** అని స్పష్టముగా సాయించియుండిరి. కావున శ్రీభాష్య ప్రవచనములో వరవరమునులు అంత శ్రద్ధను బూనలేదని తెలియవలెను.

ద్రమిడోపనిషత్ ప్రవచనావశ్యకత

శ్రీవైష్ణవ సిద్ధాంతమునకు ఉభయ వేదాంతములును ఆవశ్యకములే యైనను, శ్రీవైష్ణవ కూటస్థులగు నమ్మాళ్వార్లు తమ తిరువాయ్ మొళిలో తిరుక్కురుఙ్గుడియదన్ మేలతి యక్కత్తవల్లార్ వైట్టణవర్, నన్మైయావదున్ కోయిలిల్ వాళుమ్ వైట్టణవర్ అని యిట్లు దివ్య దేశముల యందలి అర్చావతార ప్రావణ్యము చేతను దివ్య దేశ వాసము సిద్ధింపగలదని సాయించి యుండిరి.

పతివ్రతలగు స్త్రీలకు మంగళ సూత్రము, వస్త్రధారణము యట్ల సాధారణ లక్షణమై, దానికి రెండవదిగా వారి వారి యోగ్యతానుసారము అంగరాగాభరణాది ధారణాపేక్ష అనుషంగిక మైనట్లే, శ్రీవైష్ణవులకు, ద్రవిడోపనిషదాద్యను సంధానము, దివ్యదేశ వాసము, అసాధారణ లక్షణమై తరువాత వారి వారి యోగ్యతాను సారముగా శ్రీభాష్యాది శ్రీసూక్త్యపేక్ష కలిగి యున్నచే పరమత నిరసనాదుల యందు వారి ప్రీతి నెరవేరుటకు వానిని అధికరింపవచ్చును. అట్లు గాక, శ్రీభాష్యము చేతనే, వైష్ణవత్వ సిద్ధి గలుగుననుచో, దానికి అనధికారులగు సామాన్య శ్రీవైష్ణవులకును, వారి స్త్రీలకును, శిఖాయజ్ఞోపవీత విహీనులగు శాత్తాద శ్రీవైష్ణవులకును వైష్ణవత్వము లేకనేపోవును. కావున వైష్ణవత్వము ఆళ్వార్ల వైష్ణవత్వము లేకనేపోవును. కావున వైష్ణవత్లము ఆళ్వార్ల దివ్య ప్రబంధాను సంధానము చేతనే సిద్ధించుననియు, తదుపరి ఆభరణాద్యలంకారముల వలె, శ్రీభాష్యాద్యధ్యయన మనియు వివేకులు గ్రహింపవలెను.

ఈ రీతిని సత్సంమతమైనందున శ్రీవైష్ణవత్వ ప్రదమగు దివ్య ప్రబంధ ప్రచారము చేయుటకై శ్రీవర వరమునులు, ప్రమాణ తిరట్టు, పెరియాళ్వార్ తిరుమొళికి వ్యాఖ్యానము, నూత్తందాది జ్ఞానసారము, ప్రమేయ సారము అను వానికి వ్యాఖ్యానములు, శ్రీవచన భూషణము, రహస్య త్రయము, తత్వ త్రయము, ఆచార్య హృదయము మొదలగు దివ్య రహస్య గ్రంథముల వ్యాఖ్యానములు, రచించి కటాక్షించిరి. దాని వలన ఆళ్వారా చార్యుల యొక్కయు, పూర్వాచార్యుల యొక్కయు దివ్య ప్రబంధ రహస్యాదుల శ్రవణ మందిచ్చు గల వారు గరీయ నర్థదో గురుః అను రీతిని తమ తమ మంత్రప్రదాచార్యుల కంటె మణవాళ మామునుల యందే యత్యధిక ప్రతిపత్తి చేయవలెనని ఎఱుంగునది. వారేకదా అర్థ ప్రదులగు ఆచార్యులు.

వరవరమునుల శ్రీభాష్య ప్రవచన రీతి

వరవరమునులు శేషావతార రూపులై, యుభయవేదాంత ప్రవచన శక్తి గలవారై యుండిరని తెలిసి వారియందే ప్రావణ్యము గలవారై యుండిరని తెలిసి వారియందే ప్రావణ్యము గలవారై తేవుమత్తఱియేన్ అను రీతి వారిని దప్ప మరొకరిని యెరుగని శ్రీవైష్ణవులు వచ్చి ఉభయ వేదాంతములు దేవరవారే యనుగ్రహింపవలెను. అని కోరినప్పుడు వారికి, శారీరక మీమాంసాభాష్యమును, ద్రావిడ వ్యాఖ్యాన ప్రవచనమయమందే ప్రసంగ సంగతిగా నొక్కొక్క సందర్భమును పురస్కరించుకొని శ్రీభాష్యోక్తాంశ సమన్వయ రూపముగా సాయించుచు, నాలుగు అధ్యాయముల ప్రమేయమును శ్రుత ప్రకాశికాద్యంశములతో చేర్చి విస్తరించి సాయించుచుండిరి. అట్లు కాక కేవలము శ్రీభాష్యమును మాత్రమే ఆపేక్షించు వారికి అట్లే ప్రత్యేకము సాయించుచుండెడివారు అని పెద్దలు సాయించుచుందురు.

వరవరమునుల శ్రీభాష్యాన్వయ క్రమము

వరవరమునులు సత్సంప్రదాయ సిద్ధులగు శ్రీకిడాంబి నైనారాచార్యులను ఆత్రేయ వరదాచార్యుల వారి వద్ద శ్రీభాష్యాన్వయము పొంది యుండిరని ప్రసిద్ధి. ఆ వరదా చార్యులు, సత్సంప్రదాయ సిద్ధులనుటకు గల ఆధారమేమనగా వారు విలక్షణ జ్ఞానానుష్ఠానములు గల నమ్బిళ్ళ గారి సంబంధుల వలన పంచ సంస్కారములు బొంది శ్రీసుదర్శన భట్టర్ యొక్క సత్సంప్రదాయములో శ్రుత ప్రకాశికా సహిత శ్రీ భాష్య కాలక్షేపమును చేసి యుండిరి. అను పెద్దల వచనముల వలన తెలియుచున్నది. అట్టి వారి వద్ద మణవాళ మామునులు, శ్రీభాష్యాన్వయము కలిగి ఉభయ వేదాన్తములయందును, అఖండ శక్తి గల వారిని యెఱిగియే శ్రీప్రతివాది భయంకర అణ్ణన్ అను వారు సకుటుంబముగా శ్రీవరవరమునుల సన్నిధిలోనే శ్రీభాష్యాన్వయము గలదను నంశమును దెలియపరచుచు తమ ఆచార్య తనియన్‌గా ఈ క్రింది శ్లోకమును అనుసంధింపు చుండిరని చెప్పెదరు. అది ఏమనగా,

శ్రీమాన్ సుందరజామాతృమునిః పర్యాయభాష్యకృత్ ।
భాష్యం వ్యాకురుతే తస్య శ్రోతృకొటౌ మమాన్వలః ।

శ్రీరమ్యజా మాతృయోగీంద్రులు అపర భాష్య కారులే కాలక్షేపములో వివరించుచుండగా దానిలోను అన్వయించిన శ్రోతృకోటిలో నాకు గూడ అన్వయము కలదు. అంతియకాని పూర్ణముగా వారి వ్యాఖ్యానరీతిని అధికరించు శక్తి నాకే మాత్రమును లేదు అని తాత్పర్యము. దాని వలన శ్రీమణవాళ మామునుల శిష్య సత్సంప్రదాయ క్రమము పూర్తిగా విశదమగుచున్నది.

వరవరమునుల ఆచారోజ్ఞోల్లంఘున భ్రమ నివారణము

అట్లయిన స్వాచార్యులైన తిరువాయ్‌మొళిప్పిళ్ళగారు తమ చరమకాలమందు వరవర మునులను పిలచి ప్రపత్తి శాస్త్రములగు ద్రావిడ వేదాన్త గ్రంథములనే ప్రవర్తించేయవలెనని శపథపూర్వకముగా చెప్పించి యొప్పించగా, వీరును అట్లే శపథపూర్వకముగా విన్నవించి వారిని సంతోషపరచిరని ప్రసిద్ధిగలదు కదా! అట్లయినను, ప్రతివాది భయంకర అణ్ణనాచార్యులు మొదలగు వారు భాష్యం వ్యాకురుతే అని కంఠోక్తముగా శ్రీభాష్యమును వరవరమునులు తమకు కాలక్షేపము సాయించినట్లు చెప్పియుండుట చేత ప్రత్యేక శ్రీభాష్య కాలక్షేపము కూడ వరవరమునులు సాయించుట, ఆచార్యోజ్ఞోల్లంఘనముగా పరిణమింపదా? అనినచో నది సరిగాదు. ఎందుచేతననగా, ఈ కలికాలములో ఆళ్వార్ల దివ్య సూక్తులను వ్యాపింప చేసి పెంచువారెనని మిక్కిలి క్లేశపడి బాధననుభవింపుచున్న తిరువాయ్ మొళిప్పిళ్ళైగారి యెదుట దాసుడు అట్లే దేవరవారి యిచ్చానుగుణముగా ద్రావిడ దివ్య ప్రబంధ ప్రవచనమే ముఖ్యముగా జేయుచుండునని శపథపూర్వకముగా శ్రీవరవరమునులు విన్నవించినందున మనసున సంతోషము గలిగి, వారిని దగ్గరగా పిలచి సంస్కృత శాస్త్రములలో చాల కాలము కన్ను పెట్టి యుండకుడీ అనిన్ని ఎంబెరుమానార్లకు ప్రియమైన శ్రీభాష్యమును సత్సంప్రదాయ శుద్ధిగల వారికి నేదే నొక్కమాఱు అన్వయించి కాలక్షేపము చేయుడు.

అనిన్నీ చెప్పి తరువాత, మనకును, స్వామి రామానుజులకును నత్యంత ప్రియముగా ద్రవిడ వేదాంతము యొక్కయు, శ్రీభాష్యము యొక్కయు, పరిశీలమును చేయుచుండుడు. అనిన్నీ, పూర్వాచార్యులవలెనే శ్రీరంగనాథునికి మంగళాశాసనమును చేయుచు శ్రీరంగమందే నిత్య నివాసముగా నుండుడు అనిన్నీ

నియమించియుండిరని యతీంద్ర ప్రవణ ప్రభావము నందు చెప్పబడిన అంశమును విచారించినచో సంస్కృత శాస్త్రములలోనే ఎక్కువ కాలముగన్ను వేయకుడీ, అను దాని చేత అత్యంతాసక్తి గల ప్రత్యేకాధికారులకు నొకరిద్ధఱకు శ్రీభాష్యమును సంస్కృత శాస్త్రములలో నాసక్తి గలిగి యర్థించినప్పుడు సత్సంప్రదాయ శుద్ధి కొరకు నొకటి రెండు పర్యాయములు శ్రీభాష్యమును ప్రసాదింపవచ్చునని సూచింపబడినది. చాలకాలమందులోనే నిమగ్నులు కాక మిగిలిన కాలమంతయు సాంగ ద్రవిడ వేదాంత ప్రవచనమునందే నిమగ్నులై గడుపుచుండవలెనని వారి అభిప్రాయముగా తెలియుచున్నది. కావున, నిందు ఆచార్యోజ్ఞోల్లంఘనమును, వరవరమునులొనర్పలేదని దేలుచున్నది.

ఇక పూర్వాచార్యులవలెనే శ్రీరంగ నివాసము కూడా స్వాచార్యుల చేత నియమింపబడి యట్లే నిర్వర్తించుట చేతను వరవరమునులు, సంపూర్ణముగా ఆచార్యాజ్ఞాను వర్తనము చేసియే యున్నట్లును, ఒకరిద్దరికి శ్రీభాష్య ప్రవచనము ప్రత్యేకముగా చేసియున్నట్లును దేలుట చేత, వరవరమునులకు ఉభయ వేదాన్త ప్రవర్తకత్వమునకు భంగమును రాలేదు.

పూర్వాచార్యులగు కూరత్తాళ్వార్, ఎంబార్, భట్టర్, నఞ్జీయర్, నమ్బిళ్లై, నడుక్కుత్తిరువీధిపిళ్లై, పెరియ వాచ్చాన్ బిళ్లై, పిళ్లైలోకాచార్యులు, నయనారాచ్చాన్బిళ్లై మొదలగు వారందరును యధాయోగ్యముగాను ఉభయ వేదాంతాది దివ్య గ్రంధ పరిశీలకులుగా నుండి శ్రీరంగమందే నిత్య నివాసము చేయుచుండిరి. మరియు శ్రీభగవద్విషయాది ద్రావిడ గ్రంధములతో పాటు శ్రీభాష్యమును కూడ, కాలక్షేపమును సాయించుచుండినను అది విచారింపగా, శరణాగతి రూప ప్రపత్తి కూడ శ్రీభాష్యమున కంతస్తాత్పర్యమను భావము వారికి ఉండినట్లు గ్రహింపవచ్చును.

ఇక నొక్కొక్క వ్యక్తికి వరవరమునులు ప్రత్యేకముగా శ్రీభాష్య కాలక్షేపమును సాయించునప్పుడు, శరణాగతి సారమగు శ్రీరామాయణ కాలక్షేప సమయమందు వలెనే పూర్వాచార్య తనియన్లను, అనుసంధించియే కాలక్షేపము సాయించుచుండిరనియు తెలియుచున్నది. కాబట్టి శ్రీభాష్యము కూడ ప్రపత్తిసార బోధకమని వారి భావమైనట్లు బొడగట్టుచున్నది. ఈవిధముగా వరవరమునుల వైభవము సత్సంమతమగుట చేత శ్రీఎంబెరుమానార్ల వైభవము వలెనే ఉన్నదనుటకు సంశయము లేదు.

వరవరమునుల యందు కృతజ్ఞుల వర్తనము

వరవరమునుల విషయములోను ఉపకారస్మృతి కలిగి వర్తించు వారి సిద్ధాంతము ఏమనగా, **పూదూరిల్ వన్దుదిత్త పుణ్ణియనో పూఙ్కమలత్తాదూరడిమాఱన్ తానివనో తూదూర వన్ద నెడుమాలో మణవాళ మామునిన నెన్దెయివర్ మూవరిలుమ్ యార్, శ్రీపెరుంబూదూరు** నందు అవతరించిన పుణ్యులగు రామానుజులా? వికసిత పద్మసదృశ పాదపద్మములు కల శ్రియఃపతి పాదస్థానా పన్నులగు, శఠకోపులా? పాండవ దూతగా వెడలిన ఆశ్రితవ్యామోహముగల శ్రీహరియా? మాతండ్రి మణవాళమామునులు, వీరి ముగ్గురిలో నెవ్వరో వీరు? అని తలంపదగిన నిరతిశయ జ్ఞానానందములతో వర్తించుటయే.

కనుకనే **కున్దమెడుత్తా నడి ..... పిడిత్తారై ప్పత్తి** అను శ్లాఘ్య శ్రీ సూక్తి శ్రీమణవాళమామునుల యందే పర్యవసించి యున్నదని సిద్ధమగుచున్నది. అది ఎట్లనగా, గోవర్ధన పర్వతధారియొక్క పాదస్థానాపన్నులు శఠకోపులు, వారి పాదములగు వారు రామానుజులు, వారి పాదస్థానాపన్నులు మణవాళ మామునులును అగుచున్నారు. మణవాళ మామునుల అను సంధానము కూడ నిట్లే యున్నది.

పూమగళ్ కోన్ తెన్నరజ్గన్ పూజ్కమలల్కు పాదుకమాయ్ ।

తాం మగిలుం శెల్వచ్చడగోపర్ తేనమలర్తాళ్ కేయ్న్దినియ

పాదుకమామెన్దై యిరామానుశనై నాయ్న్దెనదు నెఞ్జమే వాళ్ ।

అనియే కదా యున్నది. కాబట్టి రామానుజుల తిరువడిస్థానాపన్నులు వీరనుటకు సంశయము లేదు.

శ్రియఃపతికి అంతరంగులకు అనంత గరుడ విష్వక్సేనాదులుండగా, శ్రీశఠకోపులే శ్రియఃపతి పాదస్థానావన్నులైనట్లును, శఠకోపులకు అంతరంగులగు మధురకవి నాథమున్యాదులు ఉండగా రామానుజులే వారి పాదస్థానాసన్నులైనట్లును, వారికి అంతరంగులగు ముదలియాణ్డాన్, కూరత్తాళ్వాన్, అరుళాల పెరుమాళ్ గోవిందులు మొదలగు వారు ఉండగా, రామానుజులకు తానే పాదస్థానాపన్నులుగా తగి యుందుమని తమ మనస్సులో తామను సంధించి వరవరమునులు అట్లు సాయించి ఉండిరి.

కాబట్టి రామానుజుల పాదుకాస్థానాపన్నులు, ముదలియాండాననబడు దాశరథి యని వ్యవహారమున్నను, తమ భావములో మాత్రము తామే రామానుజ పాదుకాస్థానాపన్నుడనని వరవరమునులు భావించిరని తెలియవలెను. ఈ విధముగా నాచార్యకోటికి చరమావధిగా నుండుటయే కదా శ్రీవైష్ణవ సిద్ధాంత నిర్ణయము. అందువలన ఎంబెరుమానార్ల సమకాలములో వారియందు ప్రవణులైన కూరత్తాళ్వార్లు తచ్ఛిష్యులగు తిరువరఙ్గత్తముదనార్లును, తరువాత ఎంబెరుమానార్ల అర్చావతారమందు అతి ప్రావణ్యముగల వరవరమునుల వలెను, వారి శిష్యులగు ఎరుమ్బియప్పాయను దేవరాజాచార్యుల వలెను, ఈ వర్తమాన కాలములో నుండెడి, సదాచార్య సచ్ఛిష్యరూప ముముక్షువైష్ణవ వర్గమంతయు తమకు పరలోక సాధనముగా ఎంబెరుమానాళ్ తిరువడిగళే శరణమ్ అని అనుసంధించుచు, తమ తమ మనస్సులను స్వాచార్యుల యందే పొందు పరచుకొని యుండవలెను.

ఇట్లే కూరత్తాళ్వార్ల అనుసంధానము

నచేద్రామానుజేత్యేషా చతురా చతురక్షరీ ।

కామవస్థాం ప్రపద్యంతే జంతనో హన్త మాదృశః అనియున్నది.

అట్లే వారి శిష్యులగు అముదనార్లు గూడ

ఇరామానుశ నెన్నై యాళవన్దిప్పదియిల్ పిఱన్దదు మత్తిల్లై కారణం పార్తిడిలే

అనియే నూత్తందాదిలో యనుసంధించి యుండిరి. ఇంకను **పేఱొన్టు మత్తిల్లై నిన్ శరణన్టి** అని కూడ సాయించి ఉండిరి.

మణవాళమామునుల ప్రార్థిత పురుషార్థము

ఎమ్బెరుమానార్ల అర్చా విగ్రహమందు ప్రావణ్యము గలిగియున్న వరవరమునులు సాయించిన శ్రీసూక్తి యిట్లున్నది.

ఉన్నై యొళియ తొరుతెయ్సమ్ మత్తఱియా ।

మన్ను పుగుల్ శేర్ వడుగనమ్బి తన్నిలైయై ।

యెన్టనక్కు నీతన్టు ఎతిరాశా యెన్నాళు । మున్టనక్కేయాళ్ కొళ్లుగన్డు

నీవు తప్ప మరియొక దైవము నెరుగని సుస్థిరకీర్తి గల వడుగనమ్బి యెనెడి ఆంధ్ర పూర్ణుల నిష్ఠను, నాకు నీవు గటాక్షించి ఓ యతిరాజా! నీకే కైంకర్యమును జేయునట్లు ప్రీతి పూర్వకముగా నన్ను స్వీకరింపుము. అని యార్తి ప్రబంధములో గలదు. వడుగనమ్బి స్వామియెమ్బెరుమానార్లకు ఆరగింపునకై పాలుగాచుచుండగా

రంగనాధుని తిరుగోష్ఠి వీధిలోకి రాగా, తోటి శ్రీవైష్ణవులందరును తమతమ కృతములను వీధిలోనికి పరిగెత్తుచు, శెల్వరెళుందరుళినార్ అని హెచ్చరింపగా మీ దేవుని చూడబోతే మా దేవుని ఆరగింపు ఉత్తదగున ని జవాబిచ్చిరని ప్రసిద్ధిగలదు.

ఇంకను మరొక్కప్పుడు, పెరుమాళ్ల తిరువారాధన పేటికను వేంచేయింపుచు దాని పైని స్వాచార్యులగు ఎమ్బెరుమానార్ల పాదుకల నుంచి వెళ్లుచుండగా శ్రీవైష్ణవులది చూచి పెరుమాళ్ల తిరుముడి స్థానమందు పాదుకల నుంచివేమని యాక్షేపింపగా మీ పెరుమాళ్లు మీకెక్కువ నా పెరుమాళ్లు నా కెక్కువ అని జవాబిచ్చిరనియూ ప్రసిద్ధి.

అట్లే ఉడైయవరు లొకసారి స్వాచార్యులగు తిరుక్కోటియూర్ నమ్బిగారు వచ్చుచున్నారని తెలిసి కావేరీ తీరము వరకు ఎదురేగి వారికి సాష్టాంగ దండవత్ప్రణామము చేయగా, వారు తమ ఆజ్ఞోల్లంఘనమును (తిరుమంత్రమును రహస్యముగా నుంచకుండుట) చేసిరను కోపముతో లెమ్మని ఆజ్ఞ ఇవ్వక నూరకుండగా, కాలుచుండు విముక మీద మండుతున్న ఎండలో ఎంబెరుమానార్లు ఒరుండునట్లు తీసికొనిరని గూడ ప్రసిద్ధి గలదు. ఇట్టి యనన్యార్హ నిష్ఠను తమకు కటాక్షింపమని మణవాళమామునులు కోరుకొనిరి. వారి శిష్యాగ్రేసరులగు ఎరుమ్బియప్పాగూడ తమ యవసాన సమయమందు, శ్రీరామానుజాష్టకమును, సాయించి శిష్యులకు కటాక్షించిరి. అందు కూడ

రామానుజాయ మునయే నమ ఉక్తి మాత్రం ।
కామాతురో ఽ పి కుమతిః కలయన్న భీక్ష్ణమ్
మామామవంతి యమినాం భగవజ్జనానాం ।
తామేవనిన్దతి గతిం తమసః పరస్తాత్ ॥

అనగా ఇతర కామముల యందు ఆతురుడై కుమతియగు వాడు గూడ **రామానుజాయ నమః** అను వాక్యమును మాటి మాటికిని తలంచినచో ధ్యాననిష్ఠులగు భగవద్దాసులే సద్గతిని బొందెదరో దానినే పొందగలడు అనియు

మామాధినోతి మనసోఽ పి నగోచరోయ ।
ద్బ్యామాసఖేన పురుషేణ సహోనుభూయ ।
ప్రేమానువిద్ధ హృదయ ప్రియ భక్త్య లభ్యే ।
రామానుజాంఘ్రికమలే రమతాం మనోమే

శ్రీ భూనాయకుడగు పురుషోత్తమునితో గూడ అనుభవించినప్పటికి ఏ భక్తి భావము మనస్సునకు గూడ గోచరము గాక నన్ను నిర్బంధించుచున్నదో, అట్టిదగు ప్రీతియుక్తమగు భక్తికి గూడ లభ్యము కాని రామానుజుల పాద కమలముల యందు నా మనస్సు క్రీడించు గాక అనియు చెప్పబడెను. అందువలన ఎంబెరుమానార్ల సమకాలములో నుండిన సదాచార్య సచ్ఛిష్య వర్గమంతయు వారి యందే ఉత్తారకాచార్య ప్రతిపత్తిని చేసి యుజ్జీవించినటులనే, ఈ వర్తమాన కాలమందలి రామానుజార్చావతార ప్రవణులగు సదాచార్య సచ్ఛిష్యులందరును, మణవాళమామునులు, వారి శిష్య వర్గముతో పాటు రామానుజుల యందు గూడ నుత్తారకాచార్య ప్రతిపత్తి చేయుట వలన నుజ్జీవింపగలరని సిద్ధమగుచున్నది.

ఉత్తరకాచార్యత్వ ప్రతిపత్తి యెట్టిదనగా

తెన్నరఙ్గర్ తమక్కామో తేవియర్ గట్కామో ....
యెతిరాశా ఉనక్కన్ఱి యానొవర్కు మాగేన్ ।

ఉన్నరుళాల్ ఎనక్కు రుచి తన్నైయుణ్డాక్కి

ఒళివిశుమ్బి లడియైనై యొఱుప్పదుత్తు విరైన్దే ।

అని యార్త్తి ప్రబంధములో వరవరమునులు సాయించిన ప్రకారముగా శ్రీ శ్రియఃపతులు మొదలు నిత్యసూరి వరులు, నమ్మాళ్వార్లు మొదలగు దేశికవరులు, కటాక్షింపజాలని మత్కృత పాప సంతతి క్షయమును క్షమాపూర్వకముగా చేసి, నన్ను ఉత్తమగతికి చేర్చుట యను కృత్యము నీయొక్కనికే సాధ్యమగును కావున నీవే నన్నుత్తమగతికి చేర్చు ఉత్తారకుడవని నమ్మియుంటిని.

ఈ విధముగా నర్చారూపమైన ఎంబెరుమానార్ల యందలి ప్రావణ్యమును, తన్నిష్ఠులగు వరవరమునుల అర్చారూపమందు గూడ, ఇప్పటి సదాచార్య సచ్ఛిష్యులు గలిగియుండినప్పుడే వారికి రామానుజదర్శనస్థులను వ్యవహారము సిద్ధింపగలదు. ఇదియే ఇరామానుశన్ తాళ్పిడిత్తా ర్పిడిత్తార్ అను దివ్య సూక్తికి భావమని గ్రహింపదగును.

మణవాళముని సంబంధి సంబంధుల మహిమ

శ్రీరామానుజపాదస్థాపన్నులగు వరవరమునుల చరణ కమల షట్పదములై యుండు వారికి గల ఆత్మ గుణ పూర్తి యెట్టిదనగా

అసగతమదమానై రంతిమోహాయనిష్ఠై ।

రధిగత పరమైర్థై రర్థ కామానపేక్షైః ।

నిఖిల జనసుహృద్భిర్నిర్జిత క్రోధ లోభై ।

ర్వరవరమునిభృత్యై రస్తుమే నిత్యయోగః ।

అనియెడి పంక్తి పావన శ్లోకములో సుస్పష్టమై యున్నది. ఎట్లనగా మదమానములు లేక అర్థకామముల యందు అపేక్ష లేక, పరమార్థమగు నాచార్య నిష్ఠ గలిగి అందునను చరమోపాయమగు వరవరమునుల యందు అత్యంత ప్రతిపత్తి కలిగియుండి సమస్త జనుల యందును సుహృద్భావము ఉంచుకొని క్రోధలోభములను జయించి నట్టి వరవరమునుల దాసులతోనే నాకు నిత్యసాన్నిధ్యముండవలెను అని తలంచి యుండుట ఆత్మ గుణ పూర్తి యగును. అట్టి యాత్మగుణ పూర్తి లేని వారికి వరవరమునుల చరణ సంబంధము లేదనియు తెలియవలెను. అట్టి వారితో సహవాసము గూడ త్యాజ్యమగును.

ఇట్టి యాత్మగుణములు గలవారు ఇరామానుశన్ తాళ్పిడిత్తార్ పిడిత్తార్ అను శ్రీసూక్తియందు చెప్పబడిన రెండు విరోధభావములను విడువవలెను. ఏవనగా, వెనుక చెప్పిన రీతిని ఎంతకామధేనువైన నుపశుత్వము పోదు అనునట్లు ఆళ్వార్లు ఎంతటి బ్రహ్మవేత్తలైనను జాతి ప్రయుక్త నికృష్టతను ఎంచుట యొకటి. భగవదాజ్ఞాకైంకర్య రూపముగా యజ్ఞాదులను చేయు పరమవైదికులగు బ్రాహ్మణోత్తముల వలె వర్తింపక, అవైదికులై, దేవతాంతర భజన మొనర్చుట యను నికృష్ట మార్గములలో ప్రవేశించుట యింకొకటి, ఈ రెండును వర్జింపవలెను. అట్టి యాత్మగుణోపేతులగు పరమభాగవతుల పట్ల అత్యంత ప్రీతి కలిగి, శ్రీరామానుజ పాద భక్తులగు వరవరమునుల యందు ధృఢ భక్తి కలిగి, యట్టి వరవరముని భృత్యులతో నిత్యసన్నిధానమును పొంది నిరవధినిగమాంత విద్యానిషద్యాశయాన్ అను వచనమునకు లక్ష్యభూతులైన సదాచార్యుల నాశ్రయించి యుజ్జీవించుటయే శ్రీరామానుజ దర్శనస్థులగు శ్రీవైష్ణవుల లక్షణమని యెఱుగవలెను.

సదాచార్య నిర్ణయ ప్రకరణము ముగిసెను

శ్రీవైష్ణవ ఆచార నిర్ణయము

సిద్ధోపాయ నిర్ణయమను మూడవ ప్రకరణము

శ్రియఃపతి కటాక్ష ప్రవాహ ప్రకారము

లక్ష్మీనాథాఖ్య సింధౌ శఠరిపుజలదః ప్రాప్య కారుణ్య నీరం
నాథాద్రా వభ్యవర్షత్ తదనుజలజదృగాఘవాభ్యాం ఝురాభ్యామ్।
గత్వాతాం యామునాభ్యాం సరితమథ । యతీంద్రాఖ్య పద్మాకరేంద్రం ।
సంపూర్య ప్రాణిసస్యే ప్రసహతి బహుధా దేశికేన్ద్ర భ్రమౌఘైః ॥

అని చెప్పిన విధముగా శ్రియఃపతి యొక్క నిర్హేతుక కృపాపరిపూర్ణ కటాక్ష వారిపూరమును గ్రసించి పరిపూర్ణులైన శఠరిపులనెడి కాలమేఘము, నాథమునులను పర్వతముపై వర్షింపగా, ఆ పర్వతము నుండి పుండరీకాక్ష రామమిశ్రాఖ్య నిర్ఝరములు (సెలయేళ్లు) యామున మునులను నదియందు చేరి యా నదీ ప్రవాహము **పడికొణ్ణ కీర్తి వెళ్ళమ్ కుడికొణ్ణ కోయి విరామానుశన్** అని చెప్పబడిన నదీ మాతృక మహాహ్రదమగు శ్రీరామానుజాచార్యులలో నిలచియుండి, రామానుజ పదాంభోజ సమాశ్రయణ శాలులగు సదాచార్యులనెడు తూముల గుండ ప్రాణికోటులను సస్యముల యందు బారుచు నా ప్రాణిసస్యములు జ్ఞానానందరూప ఫలములను ఫలించునట్లు చేసి పొన్నులగు అని చెప్పబడు దివ్య నగరికి చేరిన యా సస్యఫలమగు భోగ్యాన్నరూపమగు విలక్షణాత్మలు అచ్చుటి నిత్యసూరి వర్గమునకును శ్రియఃపతికిని అహమన్నమహ మన్నమ్ అను రీతిని భోగ్యభూతులుగా నుండునట్లు చేయును. ఇదియే

కున్ద మెడుత్తా నడిశేరి రామానుశ న్తాళిడిత్తార్పిడిత్తారై ప్పత్తి అను శ్రీసూక్తి యొక్క హృదయము. కాబట్టి

నిరవధి నిగమాంత విద్యానిషద్యాశయాన్ ।
యతిపతి పద పద్మ బద్ధాను బంధాను సంధాయినః ॥ అనియు
ఆపగతమదమానైః అనియు ఆచార్యానాశ్రయామో
యతిపతి చరణ ద్వంద్వ సేవైక భోగాన్ ।
శ్రీమద్గోవింద ముఖ్యా స్సముదిత భగవత్ జ్ఞాన భక్తి ప్రవాహాన్ ।
అప్యన్యాన్సాధువృత్తా న్ప్రపదన సమయే నిష్ఠితాన్థామనిత్యమ్ ।
ప్రాప్తుం సంవృత్త వాంఛా ననుకలమఖిలాన్ మూర్ధ్ని కుర్మో ముముక్షూన్ ॥

అను నీ శ్లోక **త్రయోదిత నిష్ఠ (ఆచార్య నిష్ఠ)** గలవారే **"లక్ష్మీనాథాఖ్య సింధౌ"** అను శ్లోకమందు చెప్పబడిన శ్రియఃపతి కారుణ్య ప్రవాహము నందు అన్వయించి, తరించగలవారని తెలియవలెను.

అయితే యతివరచరణ ప్రవణులగు ముముక్షువులకు ప్రపదన సమయేనిష్ఠితాన్ అని చెప్పబడిన ప్రపత్తి సిద్ధాంత నిష్ఠ గూడ నుండవలెనని చెప్పుట యేల? ఆచార్యాశ్రయణము వలననే ప్రాప్య సిద్ధి గలుగదా? అనినచో, ప్రపత్తి, ఎమ్బెరుమానార్ల ముఖోల్లాసార్థమై తప్పనిసరి యగుటచేతను, కర్మ జ్ఞానభక్తులవలె ప్రత్యేకముగా నుపాయము గాక శ్రియఃపతి చరణముల యందు తన భారము నుంచుకొని యుండుటయే యావశ్యకమగుట చేతను, అట్టి భారవిన్యాస రూప శరణాగతి సిద్ధాంతా విరోధియని ప్రపత్తి నెఱుంగునది. ఇక, తిరుమంత్రమను మను రాజము యొక్క పదత్రయములో, మధ్యమ పదమగు నమః పదము యొక్క అర్థమగు అచిద్వత్పారతంత్ర్య స్వరూపముకు అనురూపమై యుండునది, ప్రపత్తియే అయియున్నది.

ఇట్లే నాల్గవ ఉపాయమగు ప్రపత్తిలో అన్వయించుచు శ్రియఃపతి పాదముల యందు న్యస్తభరులైనవారే, ఆ శ్రియఃపతి చేత **ఎన్నడియారదు శెయ్యార్ శెయ్దారేన్ నన్రుశెయ్దార్** అనగా నా దాసులెట్టి తప్పును చేయరు చేసిన దంతయు మంచియే చేసినట్లగును అని తన స్వభావమగు వాత్సల్యముతో నభిమానింపబడి కటాక్షింప బడుదురు. అట్టి వాత్సల్యము వరవరమునుల చరణ సంబంధుల విషయముగనే ప్రవహించు చుండుట చేత ఎంబెరుమానార్ తిరువడి సంబంధులగు వరవరమునులను తత్సంబంధులగు స్వాచార్యులను ఆశ్రయించి తరింపవలెను.

కర్మాదులకుండు నుత్తరోత్తరోత్కర్షము

కర్మ జ్ఞాన భక్తి ప్రపత్తులు నాల్గింటిలో నొక దానికంటె నింకొక దాని కుండు నుత్కర్షమును ఆ ఉపాయప్రకారములను వివేచించి ఉపదేశించు శ్రీగీతాచార్యులే, క్రమముగా నుపదేశించుట చేత కర్మాదుల కంటె, నాధిక్యము ప్రపత్తికి గలదు. ఎట్లనగాః

కర్మణై వహి సంసిద్ధి మాస్థితా జనకాదయః

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచరః

అనగా జనకాదులాచరించి తరించిన కర్మనే ఫలసంగరహితముగా నాచరింపవలెను అని ఉపదేశించి దానికి పైని

సర్వం కర్మా ఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే

న హి జ్ఞానేక సదృశం పవిత్ర మిహ విద్యతే

అనగా సమస్త కర్మలు జ్ఞానమందు పరిసమాప్తములై నాశరహితమై లగుచున్నవి. జ్ఞానముతో సమానమగు పావన హేతు వింకొకొటి లేదు అని కర్మ కంటే జ్ఞానమున కాధిక్యమును తెలిపి, భక్త్యాత్వనన్యయాశక్యః. ఇతరోపాయ సహాయ మక్కఱ లేకుండనే చేయు భక్త్యుపాయమునకే నేను వశ్యుడను అగుదునని చెప్పి, అది కూడ నచిద్వత్పారతంత్ర్యరూపమగు జీవ స్వభావమునకు సరిపడదని భయపడు వాని ని గురించి మామేకం శరణం వ్రజ అని తన గుండె మీద చేయి వైచికొని చూపిన శరణవరణమే నాల్లవదై, యుత్కృష్టమైన యుపాయమగును. అందువలన ఆర్యులగు ముముక్షువులు, శిరసావహింప దగిన తుర్యోపాయరూపమగు భగవచ్చరణ శరణ వరణ రూప ప్రపత్తియే, స్వరూపాను రూపమగు నుపాయమని గుర్తెఱుంగవలెను.

శ్రీభాష్యములో ప్రపత్తిని వెల్లడింపకుండుటకు హేతువు

అయితే, ఈ శ్రీవైష్ణవ దర్శనమందలి వారికందఱకును అసాధారణ స్వామియగు శ్రీమద్రామానుజాచార్యులు సాధన భక్తి నే ప్రధానోపాయముగా శ్రీభాష్యము నందు నిర్వహించిరేమి? అనినచో, దానియందు వారికంతస్తాత్పర్యము లేదనునది ప్రపత్తి ప్రధానమగు గద్య త్రయమను వారి గ్రంథములో సుస్పష్టము. బాహ్య కుదృష్టులచేత నపహరింపబడిన భగవత్స్వరూప గుణవిభూతులను, వేదాంతాది సచ్ఛాస్త్ర ప్రమాణ ముఖమున స్థాపించుటకును, ఆయా మతముల నిరసనము కొఱకును. కర్మజ్ఞాన స్వరూపములగు నుపాయాంతరములు, స్వతంత్రముగా జీవుని యొక్క పారతంత్ర్య స్వరూపముకు సుతరాము విరుద్ధములగునని తెలుపుటకును, వ్యాససూత్ర వ్యాఖ్యాన రూపముగా శ్రీభాష్యమును వారు సాయించి యుండిరి.

ఆహుర్వేదానమానం పుణ్యాంభోజవికాసాయ ఇత్యాది పూర్వాచార్య శ్రీసూక్తులలో ఆయామత స్వరూపమును తత్ఖండన ప్రకారమును స్పష్టము. పాపధ్వాంతమని చెప్పబడునవి లోకాయతిక, భౌద్ధ, అర్హత, వైశేషిక, పాశుపత, సాంఖ్య, యోగ, భాట్ట, ప్రాభాకర, శాంకర భాస్కర, యాదవాదుల మతములే. అట్టి మతముల నిరసనము శ్రీ శఠకోపుల తిరువాయ్ మొళి యను దివ్య ప్రబంధములో మొదటి తిరువాయ్‌మొళిలో సుస్పష్టము. కనుకనే భాష్యకారరిదుకొణ్డు సూత్ర వాక్యఙ్గ ళొదుఙ్గవిదువర్ శ్రీభాష్యకారులీ శ్రీసూక్తుల ననుసరించియే సూత్రవాక్యములను చేర్చి యుండిరని శ్రీవైష్ణవ దర్శనస్థులగు పూర్వాచార్యుల అభిప్రాయముగా నున్నది.

పాషణ్ద్రుమషణ్డదావదహనః శిట్టప్పరాఙ్కుశన్ తాఙ్గుమానై

శినత్తోడు మణ్ కరైక్కుత్తుమానై పట్టమఙ్గళై చ్చాయ్ క్కుమానై,

పరర్కాగా ప్పేచ్చు ప్పొరాదవానై, కాట్టాకై వీరఙ్కళిత్తవానై, ఇరామానుశ నెన్ఱు మెఙ్గళానై

అనగా పాషండ మతమను వనమునకు దావాగ్నియు, శిష్టులగు పరాంకుశు లధిష్ఠించు గజమును, కోపముతో నితర మతములనెడి నది యొడ్లను గ్రుద్దిపడదోయు గజమును, పరమాత్మకు చెందని ఇతర వాక్కులను సహింపని గజమునూ, అడవి యేనుగువంటి ఇతర మత గజముల వీర్యమును నశింపచేయు మత్తగజమునూ, కాణాదులవాసనను సహింపని గజమునూ, లభించిన దాని భుజించు గజము సూనగు రామానుజులను మాభద్రగజము అను నిట్టి శ్రీసూక్తుల వలనను ఎంబెరుమానార్ల ఇతర మత నిరసన ప్రకారము ప్రసిద్ధము.

ఇక, పుణ్యాంభోజ వికాస మనగా

కృష్ణం ధర్మం సనాతనమ్, రామో విగ్రహవాన్ధర్మః పుణ్యానమపి మపి పుణ్యో సౌ

ఇత్యాదిగా చెప్పబడిన భగవత్స్వరూపమగు ధర్మరూప పుణ్యము, వికసించునట్లు చేయుటయే మన్నియ తెన్నరఙ్గ పురిమామలై మత్తుమునన్దిదునాళ్ స్థిరతరమగు శ్రీరంగము నందలి మహాపర్వత రూపుడగు రంగనాధుడను ఇతరమగు తిరుమలై మొదలగు వాని యందలి స్వాములునూ, పూచి పుష్పించి యభివృద్ధి బొందు దినములు యతిరాజుని అవతార దినములే యను శ్రీసూక్తి లోని అర్చావతార సమృద్ధి గూడ, పుణ్యాంభోజ వికాస మగును.

అట్టి యర్చావతార సమృద్ధి ఎట్టిదనగా, శ్రీరంగాది దివ్యస్థల మహిమా ద్యోతకమగు శ్రీవైష్ణవ సిద్ధాంతమునకు ఎమ్బెరుమానార్ దర్శనమ్ అనియు శ్రీవైష్ణవులకు రామానుజీయుల నియు దివ్య స్థలములలో వ్యవహారము కలిగియుండుటయే, ఈవిధముగా శ్రియఃపతియే యభిమానించుట, పుణ్యాంభోజ వికాస మగుచున్నది.

అందువలననే, ఎంబెరుమానార్లు శ్రీభాష్యము నందు పరమత నిరసన పూర్వక స్వమత స్థాపనమును చేసి కటాక్షించి యున్నను, నంత మాత్రమున తృప్తిలేక భక్తి శ్రద్ధాదికారులగు వారిని గురించి కర్మ జ్ఞానాంగకమైన భక్త్యుపాయమును మోక్షోపాయముగా సాయించి యుండిరి. మరియు అంతమాత్రముతో విరమింపక స్వమత సిద్ధాంత సిద్ధమగు ప్రపత్తిని గూడ నానాశబ్దాది భేదాత్ అను సూత్ర వ్యాఖ్యానావసరములో, ఉపదేశ గమ్యమగు రీతిని నిగూఢముగా, ప్రపత్తిని తెలిపి, అట్టి భక్తి ప్రపత్తి రూపోపాయ ద్వయనిష్ఠులగు అధికారి ద్వయమునకు అనుగుణముగా తస్య వశీకరణం తచ్చరణాగతి రేవః భగవంతుని వశపరచుకొనుట అనగా భగవంతుని

విషయములో శరణాగతి చేయుటయే యని శ్రీభాష్యములోనే సాయించి యున్నారు. ప్రపత్తి శ్శరణాగతిః అని శరణాగతియే ప్రపత్తి యని గదా పెద్దలలో ప్రసిద్ధి. భక్తుపాయాధికారి కనుగుణముగా చెప్పబడిన తచ్ఛేషత్వమునే శరణాగతి శబ్దము చేత చెప్పుట తమ అసలైన అంతరంగము నందలి ఇచ్ఛాబలము చేతనే యని తెలియవలెను. కనుకనే శ్రీభాష్యకారుల హృదయము నెరిగి వ్యాఖ్యానించు శ్రుత ప్రకాశికాచార్యులు గూడ తచ్ఛరణాగతిః తచ్ఛేషత్వాను సంధానమ్ అని యర్థము సాయించి యుండిరి.

ఉడైయవరుల కభిమతము ప్రపత్తియే

ఉడైయవరులు తమ కభిమత సిద్ధాంతమగు ప్రపత్తిని గూడ భక్త్యుపాయమును వలె విశదముగా సాయించక, శ్రీభాష్యములో నిగూఢముగా నుంచినది, అన్యార్థమని స్వతంత్రుడుగా నుండు పుత్రుని యందుండజాలదని వేరుగా చెప్పపనిలేదు గదా. భూమి యందుండెడి ధనధాన్యాదులన్నియు స్వాధీనములో నుండియున్న శక్తుడగు సార్వభౌమునకు తన పుత్రులు తాముగా సంపాదించు కొనవలసినది ఏమియు లేనందున, తమ స్వాతంత్ర్యాదులను విడచి తత్పర తంత్రులై యుండుట.ం ముఖోల్లాసహేతువై యున్నట్లే, అచిత్తు వలె పరతంత్రమగు స్వరూపము నెరిగి యుండు ప్రపత్తి నిష్ఠుల విషయమునందు శ్రియఃపతియు నుభయ విభూతి నాయకుడునునగు సర్వేశ్వరునకు మిక్కిలి ప్రీతియుండును. ఈ ప్రపత్తి నిష్ఠులే, శిష్ట జనోత్కృష్టులుగా నందువలననే చెప్పబడుదురని తెలియవలెను.

శ్రుతి స్మృతులయందు గూడ నీ ప్రపత్తి యధికమైనదని చెప్పబడినది.

శ్రుతియందు న్యాస ఇతి బ్రహ్మోహి పరః।

పరోహి బ్రహ్మ తానివా ఏతాన్యపరాణి తపాంసి న్యాస ఏవాత్యరేచయత్ అని ఆరంభించి

తస్మాన్న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః అనియూ,

న్యాసమందు ఉపాయమే యుత్కృష్టమైనట్టియు, వ్యాపకమైనట్టియు ఉపాయము. మిగిలిన ఉపాయములన్నియూ దాని కంటే తక్కువే. న్యాసమే యన్ని ఉపాయములలో నుత్కృష్టమే యున్నది. అందువలన న్యాసమను ఉపాయమే శ్రేష్ఠము అని భావము. అట్లే యా శ్రుతితో సమాన ప్రమాణమగు శ్రీభగవత్పాంచరాత్రాది శాస్త్రములలో బ్రహ్మ మొదలగు మహర్షుల గూర్చి, భగవంతుడు, విధించి చెప్పినదే మనగా,

శ్రీ భగవానువాచ,

ఆచార ప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః
ఆచారయుక్త ఆచార్య శ్చరరూపీ సదాహరిః
ఆచార్యమాశ్రయే ద్ధీమా న్ప్రపత్త్యా వృత్త సంయుతమ్ ।
ప్రపత్త్యా విష్ణు సాయుజ్యం లభతే నాత్ర సంశయః ।
తస్మా దాచార్య చరణం శరణైకం ప్రయచ్ఛతి
ఇతి శ్రుత్వా సునిర్ణీతం సర్వధా బ్రహ్మావాధిభిః
వశిష్ఠో యాజ్ఞవల్క్యశ్చ శుక స్సమ్యగ్బృహస్పతిః ।
శక్తిర్బోధాయనో వ్యాసో హారీతో ఉ_ప్యాశ్వలాయనః ।
కాత్యాయన శ్శౌనకశ్చ ఆప స్తంబాదయ స్తథా ।

సాత్త్వికా ఋషయ శ్చాన్యే ఋషయో హారితాదయః ।

భారద్వాజాది మునయో గార్గ్యః శ్రీవత్సకాదయః ।

ఏతే శుద్ధ ప్రపన్నా హి వేదమార్గ ప్రవర్తకాః ॥

ఏతదాచార నిష్ఠానై సర్వదా కమలాసన ।

తస్మాత్త్వ మేత మాచారం నిత్యం కురు చతుర్ముఖ ।

మత్సాయుజ్యాది సిద్ధ్యర్థం సర్వబంధ విముక్తయే ।

ఏతదాచార నిష్ఠానా న్ప్రపన్నోత్తమ ఏవ చ ॥

శ్రీమత్సేనేశ వత్సర్యే మత్ప్రియాస్తు పరావరాః ।

అనియు శ్రీపరాశర సంహిత మూడవ అధ్యాయములో చెప్పబడెను. ఇది బ్రహ్మతో శ్రీభగవంతుడు సాక్షాత్తుగా చెప్పిన వాక్యము.

ఈ భగవద్వాక్యములలో గూడ, భగవంతుని చర రూపమే ఆచార్యుడనియు ఆయాచార్య చరణములొందు శరణ వరణమే తరుణోపాయమనియు, ప్రపత్తియే ఉత్తమోపాయమనియు అటులనే బ్రహ్మ వాదులగు వసిష్ఠ యాజ్ఞవల్క్యాది ఋషులు చెప్పియుండిరనియూ, ప్రపత్తి నిష్టుడుగా నుండు ముముక్షువు శ్రీవిష్వక్సేనులతో సమానముగా శ్రియఃపతికి ప్రియుడగుననియూ, వేదవేదాన్త వేద్యుడగు శ్రియఃపతియే, ప్రపత్తిని అంగముగా గొనిన భక్తి నిష్టుల కంటే ప్రధానముగా ప్రపత్తి యందే నిష్ఠులగు వారు ముఖ్యులని చెప్పియుండెను. ప్రపత్తి యొక్క ఆధిక్యమును గుర్తెఱుంగని సమయమున వ్యాసాదులు భక్తి యందు మోహపడిరి. దానిచే భ్రమపడి కొందరు వ్యాసాది ముని విద్విష్టం స్తోతుం న సయ మీత్మహే న్యాసాది మునులు ద్వేషించిన భక్తీతర నిష్ఠులను, మేము స్తోత్రము చేయజాలము అని చెప్పియుండిరి.

ఆ న్యాసాదులే క్రమముగా ప్రపన్నులై వైష్ణవ పరమ సిద్ధాంతమున కనుకూలురైన పిమ్మట నుండు స్థితిని బట్టియే **నమామి నాథేన యామునం వ్యాసమ్** అనియు **తస్మై నమో మునివరాయ పరాశరాయ** అనియు పూర్వాచార్యుల గోష్టిలో చేర్చి వ్యాసపరాశరులను సమస్కార్యులనుగా పెద్దలను సంధించి యుండిరి. ఈ విధముగా ప్రపత్తిని శ్రియః పతియే కొనియాడుట చేతనే మన పూర్వాచార్యులు

ప్రాపకాంతర పరిత్యాగత్తుక్కుమ్ అజ్ఞానశక్తిగళన్దు కారణమ్, స్వరూపవిరోధమే ప్రధాన హేతు

అనగా కర్మజ్ఞాన భక్త్యుపాయములను వదలుటకు, అజ్ఞానము, అశక్తియు, కారణములు కావు. స్వరూప విరోధమగుటయే, ప్రధాన కారణమని పెద్దల చేత చెప్పబడెను.

ఉపాయాంతర నిష్ఠాచ ద్రోహో భాగవతేషు చ ।

శ్రీ శ్రీశయోః పరిజనే నిందనాదీని సర్వశః ।

బంధనాని ప్రసన్నస్తు నకుర్యాత్తా దృశాన్యపి

దేవతాన్తర సంసక్తై స్సంగం త్యక్త్వా తు వైష్ణవః ।

ఉపాయాన్తర సంసక్తైః ప్రపన్నై స్సహ నో విశేత్

అను ప్రపన్న పారిజాత వచనములో, ప్రపత్తీతరోపాయ నిష్ఠ, దేవతాంతర నిష్ఠతో సమానముగా చెప్పబడి మోక్ష ప్రతిబంధకములగు భాగవత ద్రోహాదులతో సమానముగా నిర్ణయింపబడెను. దాని చేత ప్రపత్తీ కరోపాయ నిష్ఠులు, శ్రీవైష్ణవ ప్రపన్నుల కసేవ్యులై యుందురు.

ఇది సత్సమ్మతమగుట చేత మన పూర్వాచార్యులు వ్యాసాది విషయములో, వారికి ప్రపత్తి నిష్ఠలేనిచో వారి వందనములు చేసియుండెడివారు గారు. ఇక వేరుగాను అక్కడక్కడ ఉపకారస్మృతి కొరకు నమస్కారము. మన పూర్వాచార్యుల చేత చేయబడనను పూర్వాచార్యులతో పాటు

భాష్యకృద్యామునౌ నాథ । మునిం వ్యాసం నమామ్యహమ్.

నమామి నాథేన యామునం న్యాసం

అని కలిసి వ్యాసులకు గూడ నమస్కారము లుంచుట వలన వ్యాసాదులు గూడ ప్రపన్నులే యనుటలో నిస్సందేహము.

ఇక విధి శివపానకాదులతో పాటు వ్యాసులను గూడ చేర్చి చెప్పినది, యొకప్పుడు తమోగుణోద్రేకము గల జీవుని అధిష్ఠించిన గౌణావతారమును బట్టియే యని తెలియవలెను. అందువలన పైని చెప్పిన దానికి విరోధము లేదు.

అవతీర్ణో మహాయోగీ సత్యవత్యాం పరాశరాత్ ।

ఉత్పన్నా న్భగవాన్వేదాన్ ఉజ్జహార హరి స్స్వయమ్ ॥

అను మొదలగు ప్రమాణముల చేత వేదోద్ధారము నిమిత్తమై పరాశరుని వలన సత్యవతియందు జీవాధిష్ఠితుడై భగవంతుడు, వ్యాసనామముతో నవతరించెనని స్పష్టమగుచున్నది గదా! అట్లగుట నా వ్యాలుల యందు ప్రపన్నత్వమే యుద్రేకించి యుండును. అయితే అట్టి వ్యాసుల పట్ల చతర్థోపాయమగు ప్రపత్తి యొక్క నిష్ఠ, గలిగియున్నప్పటికినీ, ఆళ్వారాదుల వలె వ్యాసునకు, విగ్రహారూపముగా నారాధన గూడదు. సహస్రశాఖోప నిషత్సమమగు నట్టియు, దీర్ఘ శరణాగతిని ప్రవర్తింప జేయునట్టియు, ప్రబంధములను ప్రవర్తింపజేసిన శ్రీకారి సూను ప్రభృతి సూరివరులు, వారి చరణ భూతులగు రామానుజులు, వారి చరణభూతులగు మణవాళ మామునులు, అను మహాప్రపన్నులకే యట్టి విగ్రహరూపముగా నారాధించుట యుక్తమై యున్నది. వారి కంటె భిన్నులగు వారిపట్ల ఉపకారస్మృతి చేత నొనర్చు నమస్కారము మాత్రమే యర్హమగును.

అట్లే యభియుక్తులగు యామున దేశికులు, తమ స్తోత్రరత్నములో తస్మై నమో మునివరాయ పరాశరాయ అని ఉపకారకత్వ ప్రయుక్తమైన నమస్కారుమును శ్రీపరాశరులను గూర్చి వేసి

మాతాపితా యువతయః .... ప్రణమామి మూర్ధ్నా

అని ఉత్తారకత్వ బుద్ధితో నమ్మాళ్వార్ల విషయమై కాయిక వాచిక మానసిక రూప త్రివిధ నమస్కారమును సంపూర్ణముగా జేసి యుండిరి. ఈ విషయము,

విద్యంతే హి పరాశరాది మునిభిః ప్రోక్తాః ప్రబంధాః పరాః ।

భక్తా ఏవ హి తే తథా పి సకాలాం స్త్యక్త్వా ఉ త్ర రంగేశ్వరః ।

భక్తానేవ పరాంకుశాది పురుషాది స్తత్ప్రబంధాంశ్చ తా ।

నత్యాదృత్య సదోపలాలయతి యత్తత్ జ్ఞాపనం తత్ప్రియే ।

అనగా పరాశరాది మునివరులు చెప్పిన పురాణాది వచనములున్నను, వారు గూడ తన భక్తులైనను, వారి నందఱును వదలి దివ్య స్థలములలో శ్రీరంగనాథుడు, భక్తాగ్రేసరులగు పరాంకుశాది దివ్యసూరులను, వారి దివ్య ప్రబంధములను, అత్యాదరముతో నభిమానించి ఎల్లప్పుడును తన సన్నిధిలో నుపలాలించు చుండుట వారి యందు తనకు గల ముఖ్య ప్రీతికి సూచకములని చెప్పిన శ్రీరంగరాజస్తవ శ్లోకమునున్ను,

కులమునివన్ కూఱియనూలోది వీది వాళియెనవరుం

తిరళై వాళ్తువార్ తమ్మలరడి యెన్నెన్నిక్కు మలర్న్ద పూవే

అనగా కూటస్థులగు ఆళ్వార్లు సాయించిన దివ్య ప్రబంధముల ననుసంధించుచు, వీధుల మార్గమున వేంచేయువారి దివ్య సంఘమును సేవించి మంగళాశాసనమునే చేయు భాగవతోత్తముల చరణ కమలములే, నా శిరస్సునకు భూషణములు అనెడి శ్రీసూక్తియు విచారించి నప్పుడు తేటపడగలదు.

ఇక ఏతేశుద్ధ ప్రపన్నావై అని శ్రీభగవచ్ఛాస్త్రములలో సాక్షాత్తుగా భగవంతుడే న్యాసాదులను ప్రపన్నులుగా చెప్పియుండుటచేత వ్యాసాదులు కాలాంతరములో ప్రపత్తి కంటె అన్యోపాయమందు నిష్ఠగలవారగుట చేత, ప్రపత్త్యుపాయము. వ్యాసాది ముని విద్విష్ట మని చెప్పబడినది. అంతియేగాని, వ్యాసాదులు ప్రపన్నులుగారని చెప్పబడినట్లు కాదు. ఒక కాల విశేషములో నుండిన ఉపాయాంతర నిష్ఠ వ్యాసాదుల యందు స్థిరముగా నున్నట్లు చెప్పవీలు లేదు. ఇక నట్టి మహర్షుల వచనములలో గూడ ప్రపత్తియే అందరకు స్వరూపానురూపోపాయమని చెప్పబడినది. ఈవిషయము భారద్వాజ హారిత మహర్షి ప్రోక్తమైన సంహితలలో గూడ స్పష్టము. ఎట్లనగా,

అస్మిన్వావర్తమానానాం విధౌ ప్రతినిషేవితే ।

పూర్వేత్రయ ఉపాయాస్తే భవేయు రమనోహరాః ॥

చతుర్బి శ్శోభనోపాయై స్తుర్తయా పరయా । అనియు

స్వాభావికో ఽ స్య సంబన్ధః పుంసో యః పరమాత్మనః

తస్యైవ బోధో న్యాసాఖ్యః ప్రథమం యాత్యుపాయతామ్ ।

అనియు చెప్పబడెను, కాన నట్టి ప్రమాణముల నాదరించు శ్రీవైష్ణవాధికారుల కందరకు, నత్యంత పరిగ్రాహ్యమై యాత్మాను రూపమైనది ప్రపత్తియే.

ప్రపత్తి శక్తులైన వారికి గూడ నుత్తమోపాయము

వేదమార్గ ప్రవర్తులకు వ్యాసాది మహర్షుల కన్న నత్యంత శక్తుడైన తన జ్యేష్ఠ తనూభవుడగు చతుర్ముఖుని జూచి, సాక్షాద్భగవంతుడే,

తస్మాత్త్వమే తమాచార నిత్యం కురు చతుర్ముఖ । అని ప్రపత్త్యా చరణమునే నిత్య కర్తవ్యముగా ప్రవర్తింపచేయుమని ఉపదేశించి యుండుట చేత, భగవదభిప్రాయము నందు ప్రపత్తియే ప్రధానోపాయమనియు, శక్తులగు వారు గూడ ననుష్ఠింపదగినదనియు, తెలియుచున్నది. అది గమనింపక ప్రపత్తి దేహ ప్రయుక్తా శక్తులను భక్తి, దేహానుగుణ శక్తియుక్తులకును చెప్పబడినదని యభిప్రాయపడి చెప్పు వారి మాటలు, భగవద్వచన విరుద్ధములమగుట చేత ననాదరణీయములు.

సర్వేషా మవ్యయః పితా, పితా మాతా చ మాధవః పితా చ రక్షక శ్శేషీ

ఇత్యాది వచనముల ననుసరించి, ప్రియహితపరుడై, సకలవిధ బంధువై, తత్రాపి తండ్రియగు శ్రియః పతి, శక్తా శక్త భేదము లేకుండ నందరు చేతనులకును ప్రపత్తినే యుపదేశించుట చేత, దానినే శక్తా శక్త విభాగము లేకుండ నాచరింపదగును. ఈ విషయములో, వెనుక చెప్పబడిన రాజపుత్ర దృష్టాంతమును గమనించినచో, ప్రపత్తి నిష్ఠుల యందే అత్యంత భగవత్ప్రీతి యుండునని తెలియును.

ఇందు మరొక విశేషమున్నది శక్తి శబ్దమునకు అ చిద్వత్పరతంత్రమగు స్వరూప జ్ఞానము పూర్ణముగా లేక అనువర్తించు స్వాతంత్ర్యమే అర్థమని తెలియదగును. **భక్తియిలే అశక్తన్** అను దానికి, స్వరూప యాథార్థ్య జ్ఞానము గలిగి స్వతంత్రుడు గాని వాడనియే యర్థము. కృతాది యుగాంతరములతో గూడ, శరీరదారుఢ్యము గలవారికినీ ఈ ప్రపత్తియే యవశ్యాచరణీయమనుటలో యుండగా, నాల్గవదగు కలియుగములో, ప్రపత్యుపాయ మాచరణీయమనుటలో శరీరాశక్తి, కారణము గాదని తెలియగలదు. కాబట్టి ఈ యుగములో చతుర్థోపాయమగు ప్రపత్తియే సర్వ వర్ణాశ్రమముల వారికిని నాశ్రయింపదగినీ ఉపాయమని సిద్ధము.

శక్తా శక్త వచనముల తాత్పర్యము

ఇంకను, భగవత్సన్నిధి ప్రాప్తి పూర్వక తద్గుణానుభవములో క్రమవిళంబమును సహించుట శక్తియనియు, నట్టి విళంబాసహిష్ణుతయే అశక్తి యనియు చెప్పి, దానిని బట్టి నిళంబ సహనశీలిని శక్తుడనియు అట్టి విళంబా సహిష్ణుని నశక్తుడనియు నిశ్చయించి, శక్తాధికారము భక్తికిని, అశక్తాధికారము ప్రపత్తికిని గూడ చెప్పవచ్చును. జన్మాంతర సహస్రేషు ఇత్యాదులలో చెప్పబడిన విళంబము, స్వరూప జ్ఞానము గల వారికి, తాము చేయదగిన భగవద్గుణానుభవమునకు గాలవిలంబము ప్రతిబంధకమగుటచే నట్టి కాలవిలంబమును సహింపవలసియుండు శక్తాధికారమైన భక్తి కంటె, కాలవిలంబాసహమై, స్వరూపానురూపమగు ప్రపత్తి, అశక్తాధికారమైనను శ్రేష్ఠమై యుండునని చెప్పవలసియున్నది.

భక్తిరూపమగు నుపాసనాత్మక జ్ఞానము గూడ భగవత్ప్రీతిని కలిగించి తద్ద్వారా ముముక్షువగు చేతనునకు, భగవత్ప్రీతి కారితమగు కర్మబంధ చ్ఛేదములో సంచిత రూప పూర్వాఘములు నశించి ఉత్తరాఘరూప ప్రామాదికములు సంశ్లేషింప కుండినను, ప్రారబ్ధ కర్మశేషమును పూర్తిగా ననుభవించదగినన్ని జన్మలయందును ననుభవించియే నిశ్శేష మొనర్చుకొనవలెనని, **ప్రారబ్ధం భోగతో నశ్యేత్** అనెడి ప్రమాణము చెప్పుచుండుట చేత భక్తి నిష్ఠులకు, భగవత్ప్రాప్తి గుణానుభవ రూప పురుషార్థములు విలంబలభ్యములగుచున్నవి. ప్రపత్తి రూప భరన్యాసమన్ననో, ప్రారబ్ధమును గూడ తగ్గించి ప్రకృత జన్మావసాన మందే భగవదాత్యంతిక ప్రీతి, ప్రపన్న చేతమని భగవత్సన్నిధికి చేర్చును. ఈ యంశమే

ఒడుజ్గ నసన్గళ్ । నిడుజ్గల మెల్లామ్ ।
విడుమ్ పిన్ను మాక్కె విడుమ్ పొళుదెణ్ణే

అను తిరువాయ్ మొళిలో నమ్మాళ్వార్లు సాయించి యున్నారు. ఈ పాశురము యొక్క తాత్పర్యమేమనగా, ఆ సర్వేశ్వరునిపై తన భారము నుంచి యాశ్రయించినచో, ప్రతిబంధక కర్మలన్నియు విడచిపోవును. తరువాత ప్రకృత శరీరము వదలు కాలమును లెక్కించుకొను చుండవలెను. అని ఇట్లు ప్రపత్తి స్వరూపమును వారు స్పష్టపరచిరి. కాబట్టి భక్తి కంటె ప్రపత్తి, శీఘ్ర ఫలప్రదమని యంగీకరింపవలసి యున్నది.

స్వగత పరగత స్వీకారభేదము

పైని వివరించిన శీఘ్రఫలప్రద ప్రపత్తి కూడ, స్వగత స్వీకారము, పరగత స్వీకారము అను రెండు భేదములు కలిగియున్నది. అందు స్వగత స్వీకారరూప ప్రపత్తి మర్కట కిశోర న్యాయము పోలియుండును. పరగత స్వీకార రూపమగు ప్రపత్తి మార్జార కిశోర న్యాయమును పోలియుండును. ఈ న్యాయములు రెండును భక్తి నిష్ఠులకు గూడ వర్తించినను ముఖ్యముగా సర్వేశ్వర సన్నిధిప్రాప్తిలో ప్రపత్తి నిష్ఠులకే ముఖ్యముగా చెల్లును. అందు మర్కట కిశోర న్యాయమనగా చేతనుడు పరమాత్మను కోతిపిల్ల, తల్లికోతిని వలె ఎన్నడును వదలకుండ స్వప్రయత్నముతో బట్టుకొని యుండుట.

మార్జార కిశోర న్యాయమనగా చేతనుడు పరమాత్మ ఇచ్ఛానుసారము పిల్లి పిల్ల తల్లికి అధీనమై స్వప్రయత్నముడిగి యుండినట్లు అస్వతంత్రుడై భగవధీనుడుగా నుండుట. ఇట్లు భగవత్పోష్యవర్గములో చేరిన ప్రపన్న చేతనుడు. భగవంతుని నిర్బంధించి స్వపోషణ మొనరించుకొనుట, మర్కట కిశోర న్యాయము. భగవంతుని ముఖము కనిపెట్టుచు తత్కృతపోషణమును తదిచ్ఛాధీనముగా పొందుట మార్జార కిశోర న్యాయము. అని వివరము గ్రహింపవలెను.

దీని వలన భగవంతుడు వదలినను తాను భగవంతుని వదలక, రక్షణము పొందుట యొకటి, భగవంతుడే తనను వదలక పోషించవలెనని నిర్భరతతో నుండుట ఇంకొకటి యని తెలియుచున్నది. ఈ రెండిటిలోను ఉజ్జీవనమే ముఖ్యమగుట చేత ప్రపత్తి నిష్ఠలో ఫలప్రాప్తికి భేదముండదు. అయితే ఈ రెండింటిలో నుండు సూక్ష్మభేదమును సదుపదేశ శుద్ధులగు సదాచార్యులు దెలుపగా నందు స్వగత స్వీకారమును వీడి పరగత స్వీకారమునే యాదరించి నిర్భరోనిర్భయో స్మి అని నిర్భరత్వాను సంధానము కలిగి యుజ్జీవించుటయే సక్రమ పద్ధతి.

ప్రపత్తి ప్రపన్నుల స్వరూప నిరూపణము

ఈ విధముగా స్వగత పరగత స్వీకారములతో గూడిన ప్రపత్తియు, తన్నిష్ఠ ప్రపన్నునియు, స్వరూపము లెట్లుండునని విచారించినచో దీనిని గూర్చి శ్రీభగవచ్ఛాస్త్రము నందెట్లున్నది.

బుద్ధిరధ్యవసాయాత్మా యాచ్ఞాపర్యవసాయినీ ।
ప్రాప్యేచ్ఛో రనురూపాయాః ప్రపత్తే రూపమిష్యతే ॥
అనన్య సాధ్యే స్వాభీష్టే మహావిశ్వాస పూర్వకమ్ ।
తదేకోపాయతా యాచా ప్రపత్తి శ్శరణాగతిః ।
అహమస్మ్యపరాధానా మాలయో ఽ కించనో ఽ గతిః ।
త్వమేవ పాయభూతో మే భవేతి ప్రార్థనామతిః ॥
శరణాగతి రిత్యుక్తా సాదేవే ఽ స్మి న్ప్రయుజ్య తామ్
(అనుకూలస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్ ॥
రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వ వరణం తథా ।
ఆత్మ నిక్షేప కార్పణ్యే షడ్విధా శరణాగతిః ॥)

అనగా భగవంతుడు రక్షించునను అధ్యవసాయ బుద్ధియే తన స్వరూపముగా కలిగి భగవంతుని యాచించుటయే పర్యవసానముగా నుండు ధృఢాధ్యవసాయమే, ప్రాప్యప్రార్థన చేయువాని కనురూపమైన ప్రపత్తియని చెప్పబడును. ఇతరోపాయములు దేనివలనను సాధ్యముగాని తన యభీష్టమును దీర్చుటకు భగవంతుడొక్కడే సమర్థుడనియూ, ఆయనే తనకుపాయ భూతుడనియూ, ఆయనను ప్రార్థించుటయే ప్రపత్తి యనియూ, అదియే శరణాగతి యనియూ చెప్పబడును.

స్వామి! నే నెన్నియో అపరాధముల కాశ్రయభూతుడను, ఏ ఉపాయములునూ, తదాచరణశక్తియు లేని వాడను. నీవే నాకుపాయ భూతుడవు గావలెను. అను ప్రార్దనా రూపమగు బుద్ధియే శరణాగతి యనబడును. అట్టి శరణాగతినే శ్రియఃపతియగు భగవంతుని యందు ప్రయోగింపవలెను. ఇక భగవంతుని తనకు అనుకూలుడని తలంచుటయూ, తానాయన విషయములో ప్రతికూలబుద్ధిని వదలుటయూ, ఆయన తప్పక తనను రక్షించుననెడు నమ్మకము గలిగియుండుటయూ, నీవే నాకు రక్షకుడవు కావలెనని కోరుటయూ, తన యాత్మను ఆయన చేతిలో నప్పగించుటయూ, తన దైన్యమును కనపరచుటయూ నను నీ యారు విధములతో గూడి శరణాగతి యనెడి ప్రపత్తి యుండునని భావము. ఇక ప్రపన్న స్వరూప మెట్టి దనగా

తేన సంరక్ష్యమాణస్య ఫలే స్వామ్యవియుక్తతా ।
ఉపాయేచ ఫలే చేవ స్వప్రయత్నా న్నివర్తనమ్ ।
స్వామ్యాయత్త మితి వ్యక్తం నిక్షేపస్యాంశతా తథా ॥

అనగా భగవంతునిచే సంరక్షింపబడు తనకు ఫలమునందు ఆశ లేకుండుట ఉపాయాచరణము నందు గాని తల్లభ్యఫలమందు గాని, స్వప్రయత్నము నుండి నివర్తించుట, తాను చేసిన శరణాగతి స్వామి కధీనమైనదే గాని తన స్వయత్నము వలన యని తలంచ కుండుట యనునట్టి లక్షణములు గలవాడే ప్రపన్నుడని చెప్పబడునని భావము. ఇట్లు ప్రపత్తి యొక్కయు తదధికారియగు ప్రపన్నుని యొక్కయు స్వరూపములు భగవచ్ఛాస్త్రములో చెప్పబడెను. ప్రపత్తి ప్రమాణములందలి పరస్పర విరోధ పరిహారము పైని చెప్పబడిన ప్రమాణములన్నియు నున్నను వానిలో

అహమస్మ్య పరాధానా మాలయః .... సా దేవే స్మి న్ప్రయుజ్యతామ్"

అనునదియే ప్రపత్తికి నిశ్చితమైన ప్రమాణమగుచున్నది. ఆనుకూల్యస్య ఇత్యాది వచనము ప్రపత్తికి నిశ్చిత ప్రమాణము గాజాలదు. అనుకూలస్య సంకల్పః ఇత్యాది వచనమే యేల నిశ్చత ప్రమాణము గారాదు? అనినచో అప్పుడా రెండు ప్రమాణ వచనములకు విరోధమేర్పడినది. అందువలన రెండు వచనములును ప్రపత్తికి లక్షణముగా చెప్ప వీలుపడదు. ఆ విరోధ మెట్టిదనగా అహమస్మ్య పరాధానా మూలయః అను చోట **"త్వమేవో పాయభూతో మేభవ"** అని తవ కితరోపాయ నైరషేక్ష్యము చెప్పబడి యుండెను. **ఆనుకూల్యస్య సంకల్పః** అను దానిలో అంగములు నారు పద్ధతులు చెప్పబడినవి. దీనివలన ఇతరోపాయ శూన్యత, అనుకూల్య సంకల్పాద్యంగ సహితముగా గొని యాచరించుట యను నైషమ్య ముండుట చేత నవి రెండును పరస్పర విరుద్ధములని సిద్ధించును. అందువలన **అహమస్మ్య పరాధానామాలయః** అనునదియే ప్రపత్తికి ముఖ్య లక్షణముగాను తరువాతిదగు అనకూలస్య సంకల్పః అను వచనము దంపిన వానికి చెమట బట్టినటు ప్రసన్నునకు సంభావితములగు స్వభావములుగాను చెప్పవలసి యుండును.

ఇట్లు చెప్పుట చేత వానికి పరస్పర విరోధము కలుగదు. ఈ విషయము తిరుక్కడల్ మల్లై అను దివ్యదేశమునకు సంబంధించిన పెరియ తిరుమొళి లోని దశకములో ప్రసిద్ధముగా తెలుపబడినది.

ప్రపత్త్యనుపాయత్వ ప్రదర్శనము

ఇక, నట్టి ప్రపత్తి, **తస్యైనబోధోన్యాసాఖ్యః ప్రథమం యాత్యుపాయతామ్** అని చెప్పినట్లు ఉపాయములతో మొదటి స్థానమందుండునని కొందఱందురు. మరికొందరు మామేకం అను చరమశ్లోకమందలి భగవద్వచనమును బట్టి భగవంతుడే తప్ప మరియొక యుపాయము మోక్షసాధకము గానందున ప్రపత్తికి ఉపాయత్వము లేదని యందురు.

ఈ విధముగా రెండుపక్షములుగా నుండినందున నిచ్చట దాని నిష్కర్ష మావశ్యకము. అది యెట్లనగా, శ్రీవైష్ణవ సిద్ధాంతములో సిద్ధోపాయ ఉపేయంచ బ్రహ్మైవ అని ఉపాయత్వము భగవంతునకే యున్నట్లు చెప్పబడినది. కర్మ జ్ఞాన ప్రపత్తులు నాల్గును తత్సాధనములై పరంపరోపాయములే కాని ప్రత్యక్షోపాయములు గాజాలవు. అందువలన, **ప్రథమం యాత్యుపాయ తాం ......** అను వచనము కర్మ జ్ఞాన భక్తుల కంటె శీఘ్రముగా భగవత్ప్రీతి జనకమగుట చేతను ప్రారబ్ధ కర్మను గూడ సంకోచింప జేసివేయునది యగుట చేతను, ప్రపత్తి మొదటిగా పరిగణింపబడుటను చెప్పుచు.

త్వమేవోపాయభూతో మే భవ మామేకం శరణం వ్రజ,

అను చోట్ల ఏవ అను అవధారణము, ఏకం అను ప్రాధాన్యమును, చెప్పుపదములుండుట చేత సిద్ధోపాయమగు భగవంతుని విషయములో అన్యోపాయము లెవ్వియు సంహిపబడనని చెప్పబడును, అని నిర్ధారణ చేయవలెను, ఇక **ప్రసక్తస్యైవ హి ప్రతిషేధః** అను రీతిని, ఇతరోపాయములకు ప్రసక్తి కలిగనప్పుడే అవధారణాదుల వలన వానిని ప్రతిషేధింప వలసి యుండును.

అట్లు సిద్ధోపాయ విషయములో ఇతరోపాయములకు ప్రాప్తియే లేకుండ చేత వానిని ప్రతిషేదించి, తన్నివృత్తిని చెప్పవలసిన అవసరముండబోధు. అనుకూల్య సంకల్పః ఇత్యాదిగా చెప్పబడిన ప్రపత్త్యంగములలో మొదటి అయిదును, అవిచ్ఛిన్న భగవదనుభవ రూపమగు మోక్షదశలో గూడ నుండుటకు విరోధము లేనందున ప్రపత్త్యంగములుగా అన్వితములైన షడ్విధ శరణాగతి లక్షణముల వలన సిద్ధమగు నాయంగములు, ప్రపత్తి స్వరూప నిర్ణాయకములు కాజాలవు.

అందును బట్టి ఆ యంగములు ప్రపత్తి వలన సిద్ధించిన సిద్ధోపాయరూప భగవత్ప్రీతి నంగములు కావు. మరియేమనగా, ముక్తుని షడ్గుణ షట్కముగా పరిణమించును. ఇదియే సత్సమ్మత సిద్ధాంతమని తెలియవలెను. అనగా కర్మాదుల వలెనే ప్రపత్తి గూడ స్వతంత్రోపాయము గాదనియు, ప్రపత్తి నిష్ఠనకు భగవత్ప్రీతిజన్యమగు మోక్షదశలో గూడా ననువర్తించు సద్గుణ సంపత్తియే అనుకూల్య వర్జనాదిక మగుననియు ముఖ్య తాత్పర్యము.

ఆర్త దృప్త ప్రపత్తి విధానము

భగవత్ప్రీతి జనకమగు నీ ప్రపత్తి ఆర్త ప్రపత్తి యనియు, దృప్త ప్రపత్తి యనియు రెండు విధములు, ఆర్త ప్రపత్తి యనగా సాక్షాత్తుగా భగవంతుని జేరనెంచుట,. దృప్త ప్రపత్తి యనగా ఆచార్యుని ముఖముగా భగవంతుని చేరగోరుట. వాని వివరమెట్టిదనగా, ఆర్త ప్రపత్తితో

యధా పరానన్వయిభి ర్దుశ్శక స్మృతిభి ర్వినా తేన తత్పురతః పాత స్స్వప్రపత్తి స్త ధాభవేత్

అనగా ఇతరములతో సంబంధింప నట్టియు, అశక్యమగు స్మరణములు లేనట్టియు, భావముతో భగవసన్నిధిలో బడియుండుటయే ప్రపత్తియగుననియు **"బుద్ధి రధ్యవసాయాత్మా .... ప్రపత్తి శ్శరణాగతిః"** అను వచన ప్రకారము భగవంతుని గూర్చి యాచన రూపముగా నుండు నధ్యవసాయ రూపబుద్ధియే ప్రపత్తియగుననియు చెప్పబడినట్లు **అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః** అను శ్రుతి ప్రమాణము చొప్పున సర్వ వ్యాపియగు శ్రియః పతి చరణములయందే పడి యుండి త్వమేవ మాతా చ పితా ఇత్యాదిగా చెప్పబడినట్లు, ఔపాధిక పిత్రాదుల యందు మమతను పరిత్యజించి, నిరుపాధిక పితగా శ్రియఃపతిని దెలిసికొని అవిచ్ఛిన్న భగవద్గుణానుభవము, కైంకర్యము అను వాని యందు దదేక నిష్ఠుడై సాక్షాత్తుగా, సర్వేశ్వరుడే యాశ్రయించుట అవశ్యకమై యుండును. ఇక దృప్త ప్రపత్తిలో

ఆచార ప్రభవో ధర్మః ఆచారయుక్త ఆచార్యః ....

తస్మాదాచార్య చరణౌ శరణైకః ప్రపద్యతే "

అని చెప్పినట్లు సాక్షాన్నారాయణ స్వరూపుడగు నాచార్యుని పాదములను శరణములనుగా పొంది, ఈ సంసారమునందు ఉన్న రోజులలో ఆచార్య ముఖోల్లాసమునకు హేతువగు భగవద్భాగవత కైంకర్య నిరతుడై, చరరూప హరియగు స్వాచార్యుని చరణముల యందే ప్రవణుడై

"ఇళై కొల్ శోదిశెన్దామరైక్కణ్ పిరా । నిరుందమై క్కాట్టినీర్ "

సుందర జ్యోతిర్విశిష్టములగు నెఱ్ఱ తామరల వంటి నేత్రములు గల ఉపకారకుని నాకు కనబరచిన వారు అను విశ్వాసముతో నుండవలెనని చెప్పబడినది.

ఆర్త దృప్త ప్రపన్నుల వైలక్షణ్యము

వెనుక చెప్పిన అనుకూల్యాది గుణ షట్కము, ఆర్త ప్రపన్నునకు మొదటనే యుండవలెను, దృప్త ప్రపన్నునకు ఆ గుణములు ఆశ్రయణానంతరము సంభావిత స్వభావములుగా నుండును. ఇట్లుకాక చర రూపి హరియగు నాచార్యుని సమాశ్రయణ కాలమందే, ఆ గుణషట్కముండవలెననినచో నప్పుడది యాతనికి సంభవించునది కాదు. తరువాత, భగవన్నిర్హేతుక కృపచేతను, సత్సహవాసము చేతను, ప్రపత్తి శాస్త్ర పరిశీలనము చేతను, ఆ గుణములు కలుగుట నిశ్చితము. కాబట్టి ఆర్త ప్రపన్నుని వలె దృప్త ప్రపన్నునకు గూడ, నా గుణములు మొట్టమొదటనే యుండవలెనను నిర్బంధము లేదు.

కనుకనే ఆనుకూల్యస్య సంకల్పః అను దాని కంటె అహమస్మ్య పరాధానాం అనునదియే ప్రపత్తికి ముఖ్య లక్షణముగాను, తరువాత కలుగు అనుకూల్య సంకల్పాదులు. అవఘాత స్వేదము నిశ్వాసము మొదలగు సంభావిత భావములుగాను, నిర్ణయింపబడెను. కనుకనే కదా శ్రీపిళ్లైలోకాచార్యులు ముముక్షుప్పడి **ద్వయప్రకరణారంభము నందు పురమ్బుణ్డాన పత్తుక్కళై వాసనై యోడే విడుగైయుమ్** అను నవతారికలో సాయించిన వాక్యములలో ఈ విషయమునే యుద్ఘాటించి యుండిరి. అందు మొదటి మూడు వాక్యములు చేతను నీ ప్రపన్నుని ఆరుగుణములు చెప్పబడినవి.

ఎట్లనగా పురమ్బుణ్డాన .... విడుగైయుమ్ అను వాక్యము **ప్రాతికూల్యస్య వర్జనమ్** అను దానిని వివరించు చుండుటచేత అనుకూల్యస్య సంకల్పః అనునది గూడ తనంతట తానే సిద్ధించును. అనుకూల్య సంకల్పముండినగదా ప్రాకూల్య వర్జనము సిద్ధించుట. ఎమ్బెరుమానైయే తఞ్జమెన్ఱు పత్తుగైయుమ్ అను

వాక్యములోని అవధారణము వలన రక్షిష్యతీతి విశ్వాసః అనునది సంకల్ప ఫలమై యుండును.

తఙ్ఞమెన్ను పత్తుగైయుమ్ అనునది ఆత్మనిక్షేప కార్పణ్యముల యొక్క ఫలమును వివరించును. శరణ్యుడగు సర్వేశ్వరుని యొక్క జ్ఞానశక్త్యాద్యనంత కల్యాణ గుణాను సంధాన బలము చేత, భగవంతుని యందు నిక్షిప్త భరుడగు ప్రపన్నునకు పురుషార్థము దప్పదను అధ్యవసాయబలము చేత ఆత్మ నిక్షేపమును, నిశ్చయజ్ఞానము వలన, ఆకించన్యము, అనన్య గతికత్వము అను కార్పణ్యమునూ (దీనత్వము) సిద్ధించును. అందువలన ఆత్మ నిక్షేప కార్పణ్యములనునవి మూడవ వాక్యమునకు తాత్పర్యముగా చెప్పుటకు ప్రతిబంధకము లేదు. ఈవిధముగా నా యవతారికా వాక్యములు మూడింటి చేతను ఫలపర్యంతావసాయులగు గుణము లారును, సిద్ధించునట్లు చెప్పిన శ్రీపిళ్లైలోకాచార్యుల విద్యా ప్రౌఢిమ వ్యక్తమగుచున్నది. ఇక పేత్తుక్కుత్వరిక్కైయుమ్ ఇత్యాదుల చేత ప్రపన్న కాలక్షేప ప్రకారము గూడ చెప్పబడెను.

ఇట్లు అర్తదృప్త ప్రపన్నాధికారి భేదము చేత రెండు విధములుగా నుండు ప్రపత్తిని, అసంశయముగా దెలిసికొని యనుష్ఠించువారు, శ్రీప్రపన్న జన కూటస్థులగు పరాంకుశులు పరకాలులు, మొదలగు మారివరులను, నాథయామున యతివరాది పూర్వాచార్యులునూ నైయున్నారు. అందు ఆళ్వార్లార్త ప్రపన్నులనియు, నాథయామునాదులు దృప్త ప్రపన్నులనియు దెలియవలెను.

ఆచార్యాభిమాన నిష్ఠుని వర్తనము

అందాచార్యాభిమానః నిష్ఠులై యుజ్జీవించు దృప్త ప్రపన్నులుండు విధమెట్టిదనగా, మాల్వణ్ణనై మలక్కు నావుడై యేఙ్కు శ్రియఃపతిని యనుసంధించు జిహ్వాగలవారమగు మాకు అనియు **తొణ్డీరెల్లీరుమ్ వారీర్ తొలుదు తొలుదు నిన్ఱార్తుమ్** దాసులందరును రండు. స్వామిని పునః పునః సేవించి సంతోషాధిక్యము వలన స్తోత్రారావములను చేయుడు అనియు.

శ్రుత్యగ్ర వేద్యనిజ దివ్యగుణ స్వరూపః ....
వశ్య స్సదా భవతి తేయతిరాజ తస్మా ।
చ్ఛక్తః స్వకీయజన పాప విమోచనే త్వమ్

వేదాంత వేద్యమగు స్వకీయ దివ్యగుణ స్వరూపములు గల శ్రియః పతి నీకు వశ్యుడై యెల్లప్పుడు నుండును. కావున ఓ యతిరాజా! నీవు నీ దాసుల పాప విమోచనములో శక్తుడవే అనియు,

కాలత్రయే ఽ పి కరణత్రయ నిర్మితాతి ।
పాపక్రియస్య శరణం భగవత్ క్షమైవ,
సాచత్వయైవ కమలారమణే ఽ ర్థితాయత్ ।
క్షేమ స్స ఏవహి యతీంద్రభవచ్ఛ్రితానామ్ ।

భూత భవిష్యద్వర్తమాన కాలములయందును, మనోవాక్కాయములచేతను, చేయుచుండిన నిరవధీక పాపములుగల చేత మనకు, భగవంతుని క్షమ తప్ప వేరు నివృత్త్యుపాయము లేదు. అట్టి క్షమను నీ సంబంధి సంబంధుల కొరకు నీవే శ్రియఃపతి వద్ద నుండి లభించి యుంటివి.

అందువలన ఓ యతీంద్రా! నీవే నీ దాసుల పాప విమోచనములో సమర్థుడవై యుంటివి. అదియే నీ ఆశ్రితులకు అత్యంత క్షేమకరమగుచున్నది. అనియు ఆళ్వారు, వరవరమునులు సాయించిన శ్రీసూక్తులను బట్టి భగవద్గుణానుసంధానము కలుగుటయే ఆచార్య ప్రతిపత్తి గల దృప్త ప్రపన్నుల వృత్తి విశేషమని తెలియవలెను.

ఇంకను **తదామృతస్యందిని పాద పంకజే।**

నివేశితాత్మా కథ మన్య దిచ్ఛతి

అమృతమును స్రవించు నీ పాదపంకజము నందు సమర్పించిన ఆత్మ భారము కలవాడు, ఇతరముల నెట్లు కోరగలడు, అనియు

త్వదంఘ్రీముద్ధిశ్య ......, సకృత్కృతో ఉ_ంజలిః ....

తథైవ ముష్ణాత్యశుభాని ..... నజాతు హీయతే అనియు

మమమద్భక్త భక్తేషు ప్రీతి రత్యధికా భవేత్ అనియు

ఏత్తియిరుప్పారై వెల్లు మే మత్తవరై చ్ఛాత్తి యిరుప్పార్ తవమ్

సర్వేశ్వరుని స్తుతించుచుండు వారిని ఇతర నిష్ఠులగు వారి తపస్సు జయించినా? అనియు చెప్పబడిన ప్రమాణ వచనములన్నియు ఆర్త దృప్త, ప్రపన్నుల విషయము నందునూ, ఆచార్యాభిమానము గల వారి విషయము నందునూ, ఆధారములై యుండును.

వేదాంతములలో ప్రపత్తి ప్రతిపాదన ప్రకారము

ఆర్తదృప్తాధికారి భేదము చేత రెండు విధములుగా నుండు ప్రపత్తి మార్గము. వేదాంతముల యందు గూడ ప్రసిద్ధమై యున్నది.

తస్యైవం విదుషో యజ్ఞాస్యాత్మా యజమాన శ్శ్రద్ధాపత్నీ అని యారంభించి

బ్రహ్మణో విద్యానభిజయతి। తస్మా ద్బ్రహ్మణో మహిమాన।

మాప్నోతి తస్మా ద్బ్రహ్మణో మహిమాన మిత్యుపనిషత్

అను నంత వరకును, బ్రహ్మ జ్ఞాన సంపన్నుడగు వాని జ్ఞాన యజ్ఞ ప్రకారమంతయు, ప్రపన్నాధికారి విషయముగానే యుండునని యందరు వేదాధికారులును తెలిసికొనవలెను. ఎందువలననగా, తస్మాన్న్యాస మేషామతిరిక్త మాహుః అని తత్పూర్వ వాక్యములలో ప్రపత్తియే ఉత్కృష్టోపాయమని నిరూపించి, పిమ్మట నీ జ్ఞానయజ్ఞమును చెప్పుట చేత నిది కేవల కర్మగాగాని, జ్ఞానవిశిష్టకర్మగా గాని చెప్ప వీలులేదు. ఇది కేవలము దేహ దైహికములతో పాటు, ఆత్మార్పణరూపమగు ప్రపత్తియే యని చెప్పవలెను. ఈ విధముగా వేదాంత ప్రసిద్ధమగునట్టియు, ప్రపన్న స్వరూప జ్ఞానమునకు సారభూతమైన ప్రపత్తి, భగవద్గీతలలోని చరమ శ్లోకమందలి అవధారణార్ధకమైన ఏకం అను పదము యొక్క అర్ధనిష్ఠులగు ప్రపన్నులకు, వ్యావర్తక విశేషమై యుండును.

సిద్ధోపాయమునకు స్వీకారాంగత్వ నిరసనము

చరమశ్లోకమందలి ఏకశబ్దము అవధారణమును బోధించుటయు, ప్రపత్తి వ్యావర్తక విశేషమగుటయు, నెట్లు పొసగుననినచే,

త్వమేవోపాయ భూతోమే త్వామేవ శరణం ప్రాప్య, మామేవయే ప్రపద్యంతే,

తమేవ చాద్యం పురుషం ప్రపద్యే, తత్వమేవ శరణం గచ్ఛ,

ఇత్యాది బహుస్థలములలో శరణముగా స్వీకరింపదగిన వస్తువును నిర్దేశించునప్పుడంతయు, ఏవ అను అవధారణార్థక పదము నుపయోగించి యుండుట చేత నట్టి స్థానమందే ఇక్కడ గూడ ఏక శబ్దమును చెప్పుటతే, స్థాన ప్రమాణము చొప్పున అవధారణార్థకమే ఈ ఏకశబ్దమగుచున్నది. ఈ అవధారణము వలన

నిచ్చుట వ్యానర్తింప దగినదేదియనగా, **సర్వధర్మాన్ పరిత్యజ్య** అని సాధనాంతర త్యాగము వెనుకనే చెప్పబడుట చేత నది యిచ్చుట న్యావర్తము గాదు, మామ్ అని ఏకవచనము ప్రయోగింపబడుట చేత దేవతాంతర వ్యావృత్తియు, నిచ్చుట యర్థముగాదు. **మత్తః పరతరం నాన్య త్కించిదస్తి** అని తనకు సర్వఅలస్మాత్పరత్వము చెప్పబడుట చేతగూడ, దేవతాంతర వ్యావృత్తి యిది వరకే తెలుపబడినది. కావున నిచటి ఏక శబ్దార్థమగు అవధారణము వ్రజ అనునపుడు విధింపబడిన శరణ వరణ రూప స్వీకారము గూడ నంగముగా నుండుటయే వ్యావర్తింపబడును. అయితే స్వీకారమునకు అంగ బుద్ధి కలుగుట యెందువలన ననగా

యదనన్తరం యద్భవతి తత్తస్య కారణమ్ అను యదనంతర న్యాయమును బట్టి స్వీకారము లేనిదే సర్వేశ్వరుని ఉపాయ భావము నిలువదు కనుక, స్వీకారము సిద్ధోపాయములో నంగమనుటకు యోగ్యత గలదు. యోగ్యత యున్నప్పుడు స్వీకారమునకు అంగభావము తీసివేయుట ఎట్లు? అనినచో, అంగమనగా అంగికి నేదియో విశేషమును కలిగించునది గదా! అట్టి విశేషాపాదన రూపకించిత్కార మనునది, స్వరూపోత్పాదన ద్వారముగా గాని, ఉత్పన్న స్వరూపమునకు పోషకముగా నుండుట ద్వారముగా గాని వర్ధితమగు దానికి, ఫల ప్రదాన శక్తినిచ్చుట ద్వారముగా గాని యుండును. భక్త్యుపాయమునకైతే అది సాధ్యరూపమగుట చేత ఉత్పత్త్యపేక్ష గలదు.

ప్రతిదినము అభ్యాసము వలన కలుగు అతిశయములుండుట చేత వృద్ధ్యపేక్షయు గలదు. స్వయముగా చేతనము కాదు, కనుక ఫలము నిచ్చు వేళ, చేతనాంతరాపేక్ష యుండును. అందువలన, భక్తికి కర్మజ్ఞానా ద్యంగకత్వము అపేక్షితము. ఈశ్వర రూపమగు ఈ ఉపాయము, సిద్ధమైయుండునది కావున ఉత్పత్త్యపేక్ష దీనికి లేదు. సదైక రూపముగాన, వృద్ధ్యపేక్షయూ లేదు పరమ చేతనమగుట చేత ఫల ప్రదానములో అన్యాపేక్షముండదు. కాబట్టి దీనికి అంగములను బట్టి కలుగు నట్టి కార్యమును లేదు. కావున సిద్ధోపాయమగు నీశ్వరునకు నితరాంగాపేక్షలేదు.అట్టి యెడ స్వీకారమంగము కాదు.

ప్రపత్తికి అధికారి ధ్యానర్తక విశేషత్వము

అట్టి సిద్ధోపాయమునకు స్వరూపోత్పత్త్యాది హేతువులగు అంగముల అపేక్ష లేనప్పుడు ఈ ఉపాయము ఎల్లపఈడు ఫల ప్రదము కాకుండుటకు కారణమేమి? అనినచో ఉపాయత్వమనగా నొకరికి కలుగు అనిష్టములను పోగొట్టుట, ఇష్టములను గలిగించుట అని అర్థము. కావున అట్టి దాని కాలంబన భూతుడగు నొక యధికారి యుండవలెను. అట్టి అధికారి లభింపకుండిన ఉపాయత్వమే సిద్ధింపదు. అట్టి చేతనుండినప్పుడు అతను ఉపాయస్వీకారమును చేయవలెనను నిర్బంధమేమి? అనినచో, ఐశ్వర్యార్థి కంటెను, కైవాల్యార్థి కంటెను, భగవచ్చరణార్థియై సాధనానుష్ఠానము, చేయువాని కంటెను, ఈ ప్రపత్త్యధికారి వ్యావృతుడై యుండుటకు, ముఖ్య కారణము భగవల్లాభారమై ఈ స్వీకారముండవలసి యుండుటయే అనగా భగవల్లాభరూప ఫలమును గోరునని ఇతరోపాయములు. ఈ స్వీకార రూపమనునది. కేవల సిద్ధోపాయమును మాత్రమే కోరునది, గాని ఫలసంబంధము దీనికి లేదు. ఫలము, సిద్ధోపాయమగు ఈశ్వరుని యందే అంతర్భూతమై యున్నది, అని భావము. అందువలన **"అరుణయైక హాయన్యాపింగాక్ష్యా సోమం క్రీణాతి"** అను అరుణాధికరణ న్యాయము వలన అరుణత్వ పింగాక్షీత్వాది విశేషణములు సోమక్రయణములో నుపయోగించు పశువునకు, ఇతర పశువుల కంటె వ్యావర్తకములైనట్లే. ఈ స్వీకారము గూడ ఇతరోపాయ వ్యావర్తకమై యుండును. కాబట్టి ఇతరోపాయ ఫలనిష్ఠుల కంటె ప్రపన్నాధికారికి వ్యావర్తకముగా ఈ స్వీకారముండునని తెలియవలెను.

ప్రపన్ననకు అంగత్వ నిరసనము

సిద్ధోపాయములో తదధికారియగు చేతనుడు అంగమైనప్పుడు, ఆ యధికారికి విశేషణమగు స్వీకీరము గూడ అంగము గాజాలదు. సిద్ధమైన అన్నమునకు ఆకలి సాధనము గానట్లే. కేవల మా యధికారికి విశేషణ మాత్రమై యుండగలదు. సిద్ధమైన యన్నమును దినుటకు ఆకలి గల పురుషదధికారి అయినను, సిద్ధాన్నములో నెట్లు ఆకలియు, అది గల పురుషుడు గూడ సాధనము గాజాలరో, యట్లే యిదియునని ముఖ్య తాత్పర్యము.

ఇక స్వీకారమునకు సిద్ధసాధనములో సంగత్వమును చెప్పి యుపాయత్వమును సాధింపబూనినచో, **త్వమేవోపాయభూతో మే భవ** అని చెప్పబడిన ఆ సిద్ధోపాయభూతుడగు భగవంతునే నిరపేక్షోపాయముగా పట్టుట. ప్రపత్తి అను ప్రపత్తి లక్షణ వాక్యముతో నిరోధించుచు గాన భగవంతుడు తన ఆపేక్షిత కార్యమును చేయుటలో నాభిముఖ్య సూచకముగా ఉండును.

ఈ విధముగానే **కృష్ణ తృష్ణా తత్వమనదగు** ఆళ్వార్ల విషయములో నిష్ణాతులై నట్టియు ఆచార్య చూడామణియగు ఎంబెరుమానార్ల చరణ సరోజ మందలి షట్పదములగు సుహృద్వర వరదరాజాచార్యుల వారు సాయించి యుండిరి. అందువలన చరమశ్లోక మందలి ఏక శబ్దార్థము నెఱిగిన సిద్ధోపాయ నిష్ఠనకు, చరణ శరణ వరణము అధికారి విశేషణ మాత్రమే యగునని యెఱుంగునది.

ప్రపత్తికి అధికారి విశేషణత్వ విమర్శ

ఈవిధముగా ప్రపత్తి విశిష్ఠుడగు అధికారి, మిగిలిన కర్మ జ్ఞాన భక్త్యాది కారుల కంటె విశిష్టుడై, భగవద్గుణామృత పానదీక్షాన్విత వైదికోత్తముల గోష్ఠికి నత్యంతాదరణీయుడై సూరిభోగ్యుడగు శ్రీహరికి గూడ నభిమతుడై యుండును. ఇక నట్టి ప్రపత్తి, అధికారి విశేషణమను దానికి అధికారి వ్యావర్తకమని, సద్గోష్ఠీ సమ్మతమైన యర్థము ప్రసిద్ధమై యుండగా నది తెలియని కొందరు, జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత అనియెడి యాగవిధి ప్రకరణములో, అధికారికి స్వర్గ కామనారూప ఫల ప్రదాన విశేషణము వలె, ప్రపత్తి గూడ ఫల ప్రదాన విశేషణమని భావించుచున్నారు. అట్టివారి వాదము నందలి వికల్పములన్నియు ఉపాయోపేయ భూతుడై యుండు భగవంతుని ప్రసాదమునే మూలముగా చేసికొని భగవచ్చరణ శరణ వరణము చేయు ప్రపన్నాధికారి పట్ల నకించిత్కరములగును. కావున నిష్ఫలములని తేలుచున్నది, వారి వాదములో, స్వర్ణమునకు సాధనమగు జ్యోతిష్టోమమునకు అధికారి విశేషణత్వము వలెనే శరణ వరణమునకు సాధనత్వము నాపాదించి చెప్పునది.

అనుమాన ప్రమాణముతో పరత్వమందు వహ్నిని సాధింపదలంచి అందుకు దృష్టాంతమైన వంట యింటి యందలి ఇతర సాధనములగు వానిని గూడ, పర్వతమందాపాదించిన యట్లే ఉండును. ఉపాయమగు జ్యోతిష్టోమమునకును, ఉపేయమైన స్వర్గమునకును ఐక్యము లేకుండుట చేతను, ఇక్కడ ఆ ఉపాయో పేయత్వములు రెండును సర్వశక్తియగు భగవంతుని యందే యుండుట చేతను, జ్యోతిష్టోమ దృష్టాంతమునకును, అధికారి విశేషణముగా నుండు ప్రపత్తి రూప దార్ష్టాంతికమునకును, సమన్వయము కుదరదు. అందువలన పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే అని చెప్పిన ప్రకారము, సర్వశక్తియగు శ్రియః పతి యొక్క నిర్హేతుక కృప వలన గలుగు అభిముఖ్యాదులకు సూచకముగా నుండు ప్రపత్తి, అధికారి విశేషణమనునంత మాత్రము చేత, ఫలాదిభ్యో విభన్నత్వా న్నాధికారి విశేషణమ్, అనగా ఫలభూతస్వర్గాదుల కంటే వేరగుట చేత జ్యోతిష్టోమము అధికారి విశేషణము కాజాలదు అను మీమాంసక నిరూపణ మిచ్చుట వర్తింపదు.

యాదృచ్ఛికమగు సుకృతమును గూడ నీ చేతనుని పట్ల నా(శియఃపతియే కలుగచేసి మోక్ష పర్యంతము గూడ దానే నడిపింపగల నిరూపాధిక శేషియై యుండు నాతని స్వభావమే ఇందు కారణమగును. అందువలన, రక్ష్యుడుగా నుండు నీ చేతనుడు చేయు ప్రపత్తి, అప్రతిషేధద్యోతకమై రాగప్రాప్త ఫలము గలిగి భగవన్ముఖోల్లాసముగా మాత్రమే యుండును. తండ్రికి స్వతసిద్ధమైన ప్రీతిచే, పుత్రునాదరించి, యెత్తికొను నప్పుడు, పుత్రుడు, త్రోసి వేయక చేతులందించి నట్లగును. మరియు, బిత్తరోగ నివారణము కొరకు చేయు క్షీరపానము, పిత్తనివృత్తిలోను, భోగ్యమగు ఆహారమగుటలోను, సాధనమైనటును, రాజకుమారుడు చేయు కర్పూర తాంబూల సేవ, విలాసరూపమైనట్లును, నుండు నీ ప్రపత్తి అధికారి విశేషణము గాక, ఇతరోపాయ నిష్ఠుని కంటె వైలక్షణ్య సూచకమగు వ్యావర్తకము మాత్రమే యగును. అధికారి విశేషణమని చెప్పునది, అవిచారితోక్తి మాత్రమే యని వివేకులగు వారు గ్రహింపనగును.

ఈ సిద్ధాంతము నందు ప్రమాణము

జీవుడు, నా రక్షణమునకు నా యొద్ద నేదియు నుపాయము లేదు. నీవే రక్షకుడవని తన భారమును భగవంతునకు సమర్పించుటయే స్వరూపముగా గల ప్రపత్తికి ఉపాయత్వము ఉండునని చెప్పుట, నా తల్లి గొడ్రాలు” అనునట్లు స్వవచన వ్యాఘాతముపై, మన పూర్వాచార్య శ్రీసూక్తులకు విరోధించును. నా తల్లి గొడ్రాలని చెప్పుటకు తాను సంతానముగా నుండగా పొసగదు గదా! అట్లే ఇందునూ తనకుపాయంతరయేమియూ లేదని యొక వంక మొఱబెట్టుచూ భగవానుని ఉపాయభూతునిగా నాశ్రయించుటయూ పొసగదు.

ఇక, పూర్వాచార్య శ్రీసూక్తు లెట్లున్నవనగా ప్రపన్న పారిజాతమను గ్రంధములో

తేన సంరక్ష్య మాణస్య ఫలే స్వామ్యవియక్తతా ।
ఉపాయే చ ఫలే చైవ స్వప్రయత్నాన్నివర్తనమ్ ।
స్వామ్యాయత్త మితి న్యక్తం నిక్షేప స్యాంశితా తథా ॥

అనియు, భగవంతుని చేత సంరక్షింపబడు వానికి ఫలమందు స్వామ్యము లేకుండుటయు, ఉపాయమందు ఫలమందు గూడ, తన ప్రయత్నము నుండి తొలగుటయూ అని యన్నియు స్వామికే యధీనములని తలంచి ఆత్మవిక్షేపమును భగవంతుని విషయములో చేయుటలే జీవున కంశ భాగము మాత్రము గలదు. ఇక నుపాయాంతరముల కంటె వ్యావృత్తమగు ప్రపత్తికి అనుపాయత్వమును, అధికారి విశేషణత్వ సూత్రమును, ఈ క్రింది పూర్వాచార్య శ్రీ సూక్తుల వలన స్పష్టము.

భక్తి ప్రపత్తి హేతుభ్యా మధికారి వ్యవస్థయా ।
ఆరాధితో హరి ర్ముక్తిం దద్యా చ్ఛేదవిశేషతా ॥
ప్రపత్త్యారాధిత స్యాన్య నైరపేక్ష్యేణ హేతుతా ।
భక్తి సంరాధిత స్యాన్య సాపేక్షత్వేన హేతుతా ॥
పూర్వత్ర భక్తి విరహ త్పరత్ర న్యాస యోగతః ।
నైశమ్యం యదితత్రైవం పున రప్య విశేషతా ॥
భక్తేః ప్రపదనాపేక్షా హ్యంగత్వా దుచితా భవేత్
భక్తే రంగత్వ విరహా త్ప్రపత్తి స్తాం న చేచ్ఛతి ॥

భక్తి ప్రపత్త్యో రుభయో స్స్వాంగాన్యస్యానపేక్షణం ।
తుల్యంచే త్కథమేకప్రత వైషమ్యస్యోపపాధనమ్ ॥
కించాత్ర భక్తి నిర్వృత్తిః ప్రపత్తేః ఫల మిష్యతే ।
స్వసాధ్యముక్తి సిద్ధ్యైతు భక్తేర్న్యాసానపేక్షణమ్ ॥
భక్తి ప్రపత్త్యో ర్ముక్తౌతు సముచ్చిత్య నహేతుతా ।
తతో న్యాసస్య హేతుత్వ మనపేక్ష్యైవ భక్తితః ॥
ఏవం భక్తేశ్చ హేతుత్వ మనపేక్ష్య ప్రపత్తితః ।
ఫలప్రదానే తుల్యం స్యాన్నై రపేక్ష్యం హరేస్తతః ॥
యతః ప్రపత్తి హేతుత్వ మనపేక్ష్యైవ మాధవః
ముక్తి ప్రదో హ్యభిజ్ఞానాం నైరపేక్ష్యం తతో హరేః
స్వారస్యా దేకశబ్దోహి రుణద్ధి న్యాసహేతుతామ్ ।
అపవాద విహీనత్వా ద్భక్తే ర్హేతుత్వ మిష్యతే
సాధ్యోపాయస్య సర్వస్య స్థానే నారాయణో యతః ॥
చోదితః పంచరాత్రస్థవచనైర్బలవత్తరైః ।
అతః ప్రపత్తి హేతుత్వం న సిధ్యతి కథంచన
చోదితాంగ కలాపేన పూర్ణే ప్రపదనేప్యహో ॥
హేత్వంతరస్య విరహా త్తత్థానే చేతక్ శ్రియః పతిః ।
తర్హి సర్వత్ర కార్యే ఉ పి వైకల్పిక నిదానకే ।
హేత్వంతరస్య విరహా త్తత్ స్థానే భగవాన్ భవేత్ ॥
సాధ్యోపాయస్య హేతుత్వం వినా ముక్తి ర్భవే ద్యది ।
పురైవ ముక్తిః కిం నస్యాత్ ఇతి చోద్యం నిరాకృతమ్ ।
అధికారి విశేషాణా మధికారి విశేషణం ।
ప్రపత్తే రూపం నా స్తీతి పురాముక్తి విహీనతా ॥
అన్వయవ్యతి రేకాభ్యాం దండాదే రివ హేతుతా ।
న్యాసస్యేతి నయుక్తం హి తద్రూపే వ్యభిచారతః ।
న్యాస వాచక శబ్ద విభక్తే ర్నైవహేతుధీః
స్యా ద్విభక్తిస్తు నియతా కృతిసాధ్యత్వమాత్రతః ॥
భగవద్భాష్యకారైస్తు సాధనత్వం వినావిధేః ।
కృతిసాధ్యత్వమేవార్థ ఇతి భాష్యే ప్రదర్శితమ్ ॥
హేత్వంతరస్య స్థానే తు ఈశ్వరస్య నివేశతః ।
ప్రపత్తే రనుపాయత్వం రక్షాభర సమర్పణాత్
ఆలోచిత స్వరూపాచ్చ సిధ్యత్యత్ర న సంశయః ।
స్వరక్షణోపాయ భూత వ్యాపారరహితస్య మే

త్వ మేవోపాయభూత స్సన్ మద్రక్షణ భరం వహ ॥
ఇత్యేతస్యాః ప్రపత్తేస్తు ఉపాయత్వం తదాహిసః
వంధ్యా మే జననీ జాతే త్యేవ మాహ న సంశయః
ఉపాయత్వ పరాణాం చ గతిః ప్రాగేన దర్శితా
వచనానాం భగవతో హేతుస్థాననివేశినామ్
గత్యంతరాభావతశ్చ ప్రపత్తే రనుపాయతా ॥
అవచ్ఛేదక మాహు స్త ద్రక్షాభర సమర్పణమ్ ।
ప్రపత్త్యవ్యస్య తస్యాస్తు సంబంధస్తు స్ఫుటః ఖలు ।
భక్తేస్తు తాదృశం రూపముపాయత్వేన బాధితమ్ ।
అంగీకృతేఽనుపాయత్వే వివాదో నాస్తినౌ తదా ॥

పై శ్లోకములకు తాత్పర్యముః

అధికారి భేదమును అనుసరించి భక్తి ప్రపత్తులనెడి ఉపాయముల చేత నారాధింపబడిన హరి, అట్టి అధికారులకు ముక్తిని సమానముగానే యొసగినచో, భక్తి ప్రపత్తులకు భేదమే యుండదు. ప్రపత్తి చేత నారాధింపబడునప్పుడు, ఇతరాపేక్ష లేకుండ నుండుటయే ఉపాయత్వ సాధకమగును. భక్తి చేత నారాధింప బడునప్పుడు, కర్మజ్ఞాన సాపేక్షతోనే ఉపాయత్వ ముండును.

ప్రపత్తియందు భక్తి లేకుండుట వలనను భక్తి యందు భరన్యాసము లేకుండుట వలనను, వైషమ్యమున్నచో అన్యోన్యానపేక్షారూప సాదృశ్యమును బట్టి, తిరిగి భక్తి ప్రపత్తులకు భేదముండదు. భక్తికి అంగముగా ప్రపత్తి యొక్క అపేక్ష ఉండవచ్చును.

ప్రపత్తికి మాత్రము భక్తి అంగము కాజాలదు, కావున భక్త్యపేక్ష ప్రపత్తికి లేదు. భక్తి ప్రపత్తులు రెండిటికిని తమ అంగముల కంటె యితరముల అపేక్ష ఉండబోదు. అను తౌల్యమును చెప్పినచో, నందులో ప్రపత్తికి భక్తి నిర్వర్తనము ఫలము కావచ్చును. కాని భక్తి సాధ్యమగు ముక్తి సిద్ధించుటలో భక్తికి ప్రపత్త్యపేక్ష యుండబోదు. భక్తి ప్రపత్తులు రెండును గలసి ముక్తికి సాధనములు కావు.

అందువలన ప్రపత్తికి భక్త్యపేక్ష లేకయే సాధనత్వముండును. అట్లే భక్తికి ప్రపత్త్యపేక్ష లేకయే సాధనత్వముండును. ఫలము నిచ్చుటలో హరికి ఇందువలననే సాధన నైరపేక్ష్యము సిద్ధము. ఎందువలన ప్రపత్తిని హేతువుగా గొనకయే మాధవుడు ముక్తి నిచ్చు" నను అభిప్రాయము అభిజ్ఞులకు గలదో, అందుచేతనే ప్రపత్తి నిరపేక్షత్వము హరికి ఉండగలదు.

మామేకం అను చోట ఏకశబ్ద స్వారస్యము వలన ప్రపత్తికి ఉపాయత్వమును నిరసించును. భక్తికి మాత్రమట్టి యపవాదము ఏదియు లేనందున, దానికి ఉపాయత్వముండవచ్చును. సాధ్యోపాయములన్నిటి స్థానమందును నారాయణుడే నిలచియుండుట, పంచరాత్రస్థ ప్రబల ప్రమాణ వచనముల వలన బోధింపబడుట చేత, ప్రపత్తికి మోక్షహేతుత్వమే విధముగాను సిద్ధింపదు. విధింపబడిన అంగకలాపములతో ప్రపత్తి పూర్ణమై యున్నను, ఇతర హేతువులు లేవు కావున నా స్థానములో, శ్రియః పతియే యుండునని చెప్పినచో నప్పుడు వేర్వేరు సాధనములగు కర్మ జ్ఞాన భక్తుల యందు గూడ సాధనాంతర విరహము వలన, నా స్థానములో హరియే యుండగలడు.

సాధ్యోపాయము దేనికిని హేతుత్వము లేకుండగనే ముక్తి కలిగినచో, నట్టి యుపాయానుష్ఠానమునకు పూర్వమే ఏల ముక్తి కలుగకూడదు? అను ప్రశ్నకు జవాబేమనగా, ఆయా ఉపాయముల యొక్క అధికారి విశేషములకు, అధికారి విశేషణమగు ప్రపత్తి రూప భరన్యాసము లేనందున ముందే ముక్తి సిద్ధింపకుండును.

దండాది సత్త్వే ఘట సత్తా, దండాద్య భావే ఘటా భావః ।

అను అన్వయ వ్యతిరేక వ్యాప్తుల వలన దండాదులకు ఘటహేతుత్వము సిద్ధించినట్లు

న్యాస సత్త్వే మోక్ష సత్తా । న్యాసాభావే మోక్షాభావః

అను వ్యాప్తుల వలన న్యాసమునకు హేతుత్వము మోక్షములో సిద్ధించు ననరాదు. దండగత రూపము నందు వలె వ్యభిచారము వచ్చును. అనగా

దండరూపసత్త్వే ఘట సత్త్వం । తదభావే తదభావః

అను వ్యాప్తులు ఎట్లు దండరూపము, ఘటకారణము కాదు కావున దండరూపమునకు ఘటకారణత్వమును సాధింపజాలవో అట్లే ప్రపత్తి వాచకమగు శరణ శబ్ద మందలి ద్వితీయా విభక్తికి మోక్షసాధనత్వ బుద్ధి యుండబోదు.

ఏమనగా, విభక్తి, కృతిసాధ్యత్వమును మాత్రము బోధించుటలోనే నియతమగుట చేతనే అని యెరుగవలెను. **శ్రీభగవద్భాష్యకారులు గీతా భాష్యములో శరణం వ్రజ** అను విధికి సాధనత్వము లేకుండగనే కృతి సాధ్యత్వ మాత్రమే యర్థమని చెప్పియుండిరి. వారి భావమేమనగా శరణవరణము, కేవల కృతి సాధ్యముగా మాత్రమే విభక్తిని బట్టి వచ్చుచున్నది. గాని సాధనముగా నుండబోదనియే, సాధనాంతర స్థానమందు ఈశ్వరుడే యుండుట చేత, ప్రపత్తి, కేవల రక్షాభర సమర్పణ రూపమై ఉపాయకోటిలో చేరదు. ప్రపత్తి యొక్క స్వరూపమును బట్టి యాలోచించినను ఈ విషయమే సిద్ధించును.

ప్రపత్తి స్వరూపము, నన్ను నేను రక్షించుకొను వ్యాపారములు లేని నాకు నీవే ఉపాయభూతుడవై నన్ను రక్షించు భారమును సహింపుము అని కదా! అట్టి ప్రపత్తికి ఉపాయత్వమును చెప్పువాడు, నా తల్లి గొడ్రాలు అని గూడ చెప్ప సాహసించును.

ఇక ప్రపత్తికి ఉపాయత్వమును బోధించు వాక్యములకు గతి, ఇది వరలోనే చూపబడెను. అట్టి వచనములకు గత్యంతర ముండుటచేతను, భగవంతుడే మోక్షహేతువని నిశ్చయించి చెప్పు వచనములకు వేరుగతి లేకుండుట చేతను, ప్రపత్తికి, ఉపాయత్వము లేదు, శరణ వరణ రూప రక్షాభర సమర్పణము విశేషణ రూపమై యుండును.

ప్రపత్తవ్యడగు భగవంతునకు ప్రపత్తికిని సంబంధము స్పష్టమే కదా! భక్తికి మాత్రము, అది కేవలోపాయమగుట చేత బాధితము, మీరును భక్త్యుపాయవాదులు భక్తికి గూడ ఉపాయత్వము లేదని అంగీకరించినచో మనకు వివాదమే లేదు అని పై శ్లోకముల తాత్పర్యము.

సర్వజ్ఞో పి హి విశ్వేశ । స్సదా కారుణికో ఉ పిసన్ ।

సంసార తంత్ర వాహిత్వా । ద్రక్ష్యాపేక్షాం ప్రతీక్షతే

సర్వేశ్వరుడు సర్వజ్ఞుడైనను, ఎల్లప్పుడు కారుణికుడై యైనను, తన లీలార్థము సృజించిన సంసార తంత్రమును నడిపించు వాడగుట చేత, సర్వముక్తి ప్రసంగము రాకుండ, రక్ష్యుడగు చేతనుని కొఱకెదురు చూచుచుండును అని చెప్పబడిన రీతిని రక్ష్యవర్గాపేక్షను గుర్తించియే మోక్షప్రదాన కార్యమును చేయువాడగుట

చేత రక్ష్యుల అపేక్షాసూచకమగు ఉపాయ స్వీకారము, ఘటమునకు సాక్షాత్కారణమగు దండాదులను పరిచయము చేయు దండరూపాదుల వలె సిద్ధోపాయమునకు పరిచాయకము మాత్రమే యుండును.

భువనభవనస్థిత్య భావైక హేతుః అనునట్టి ప్రమాణములలో ఆయన యొక్క సర్వశక్తిత్వము సుప్రసిద్ధమే కదా.

అట్లుగాక ఉపాయస్వీకారము గూడ ఉపాయమగుననినచో., సిద్ధోపాయ స్వీకారము ఉపాయమైనట్లే, సాద్యోపాయ స్వీకారము గూడ నుపాయమగుచు, దానికి తత్స్వీకారము ఉపాయము కావలసి వచ్చుటచే అనవస్థా దోషము పుట్టును.

ప్రపత్తివిధికి నరర్ధకత్వాది దోష పరిహారము

ప్రపత్తి ఉపాయముగానిచో వ్రజ అను విధియు తదనుష్ఠానమును ఎట్లు బొసగను? అనినచో ఈ ప్రపత్యధికారికి మోక్షము పట్ల ఉపాయములు గానట్టి, సంధ్యావందనాదులలో **అహరహస్సంధ్యాముపాసీత** అను విధియు, అవశ్యముగా వాని ననుష్ఠించుటయు, ఎట్లు బొసగునో అట్లే మోక్షానుపాయమగు నీ ప్రపత్తికి గూడ, విధ్యనుష్ఠానములు అర్థములగును. సంధ్యావందనాదుల నాచరింపనప్పుడు ప్రత్యవాయము గలుగునట్లే, ప్రపత్తి నాచరింపనప్పుడు గూడ ప్రత్యవాయముండును.

కులజోవా తపస్వీ వా అని మొదలుకొని

యతిర్వా జ్ఞానవానపి । ద్వయాధికారీ నభ వేత్తం ప్రయత్నేన వర్జయేత్

అను వచనముల వలన సత్కుల ప్రసూతుడైనను, తపశ్శాలియైనను, యతియైనను, జ్ఞానవంతుడైనను, నిత్యనైమిత్తిక కర్మన విడనాడినప్పుడు ద్వయాధికారి కాజాలడు. అందువలన ప్రయత్న పూర్వకముగా నిత్యనైమిత్తిక కర్మలను అనుష్ఠించుచుండవలెను, అని స్పష్టముగా చెప్పబడెను. భగవంతుడే ఏకోపాయము అను ఆధ్యవసాయరూపమైన ఈ ప్రపత్తి గూడ, సర్వముక్తి ప్రసంగము రాకుండుటకై యాచరింపవలసినదై యున్నది. ఈ విధముగా నిరపేక్షోపాయమగు భగవంతుడను ఏకోపాయమునకు, కాలు కట్టు వలె ప్రతిబంధకమగు ప్రపత్తికి మోక్ష కారణత్వము పోయిన తరువాత, భగవదుపాయత్వము, అగతికులకు గతియై యుండుటలో దానికి మెడకట్టుగా నుండి ప్రపత్తి యనునది, పతివ్రతకు మెడయందు భాసించు తిరుమాంగళ్య చిహ్నము వలే, తదేకాధీనతను సూచించుచు నుండును. అనగా పిరాట్టి స్థానము ప్రపన్నునకు సిద్ధించునని భావము.

పిరాట్టికి అనుపాయత్వ ప్రదర్శనము

అయితే **అహం మత్ర్పాప్యుపాయోనై సాక్షా ల్లక్ష్మీపతి స్స్వయమ్**

అని ఉపాయత్వము లక్ష్మీ విశిష్టుడగు శ్రీహరికే నిరూపితముగాగా ఆ లక్ష్మీస్థానమునే ప్రపన్నుడు పొందినచో, నా పిరాట్టి ఉపాయకోటిలో నుండి వేరుపడుట యెట్లు సాధ్యము? పిరాట్టితో గూడిన హరికి ఇతర పత్నుల వలె శేషభూతుడగునే యనినచో **సాక్షాల్లక్ష్మీ పతి స్స్వయమ్** అను చోట భగవంతునకు విశేషణ భూతురాలగు లక్ష్మికి గూడ ఉపాయత్వ మొప్పుకొనినచో, జగన్నాథం ప్రపద్యేత అను స్థలమందు, విశేషణ భూతమగు జగత్తునకు గూడ నుపాయత్వము ప్రసంగించును. ఇట్లు అతి ప్రసంగము లెన్నో వచ్చును. జగత్సర్వం శరీరం తే ఇత్యాదులలో చెప్పబడినట్లు జగచ్ఛరీరియగు నాహరికి నుండు విశేషణము లన్నియు లంబకర్ణ మానయ చిత్రగుమానయ, అను చోట్ల తద్గుణసంజ్ఞాన బహు వ్రీహి లబ్దములగు లంబకర్ణత్వ చిత్రగుత్వరూప విశేషణములు, అనయన క్రియలో ప్రాధాన్యమును పొందినట్లే ఉపాయత్వములో చేరవు. అందు లంబకర్ణత్వము వంటిది. శ్రియః పతిత్వము,

చిత్రగుత్వము వంటిది, జగచ్ఛరీరిత్వమని వివేకింపవలెను. కాబట్టి హరియొక్క ఉపాయభావములో లక్ష్మీకి గాని జగత్తునకు గాని సంబంధము లేదు.

ఇక **అహం మత్ప్రాప్త్యుపాయోవై** ఇత్యాది వచనములో

లక్ష్మీపతి, అహం, స్వయం, సాక్షాత్, మత్ప్రాప్త్యుపాయః వై ప్రసిద్ధః అనియు

లక్ష్మీః పురుషకారేణ వల్లభా ప్రాప్తియోగినీ అను వచనమునకు

వల్లభా, లక్ష్మీః పురుషకారేణ ప్రాప్తి యోగినీ, అనియు, సమన్వయము చేసి పై వచనములకు, నాకు ఫలదానములో ఉపాయత్వమును లక్ష్మీకి పురుషకారత్వమును విశేష లక్షణములుగా నుండును, అని తాత్పర్యమును చెప్పవలెను. దీనివలన హరికి మాత్రమే ఉపాయత్వమును, లక్ష్మీకే పురుషకారత్వమును విశేష లక్షణములు స్వరసములై యుండును. అనగా శ్రీహరికి ఉపాయత్వమును లక్ష్మీకి పురుషకారత్వమును అవ్యభీచరిత లక్షణములని భావము. అట్లుగాక శ్రీ శ్రియఃపతులకు ఇద్దరకును ఉపాయత్వము సమముగా నుండునని చెప్పి పిరాట్టికి పురుషకారత్వము విశేషమని చెప్పినచో,

నాన్యథా లక్షణం భవేత్ అని చెప్పబడు **లక్ష్మ్యుపాయత్వ ఖండన** పరవచనముతో నిరోధించును.

ఇక మంత్రరత్నమగు ద్వయములో పూర్వఖండమందు మతుప్ ప్రత్యయము చేత నిత్యయుక్తముగా నుండునని చెప్పబడు లక్ష్మితో గలసి యుండు నారాయణుడే శరణ్యుడుగా ప్రతీతి గలుగుట చేత వచ్చెడి లక్ష్మ్యుపాయత్వము. వెనుక చెప్పిన రీతిని ఆమెకు పురుషకారకత్వములో ప్రాధాన్యముండుట వలన వారింప బడినది. అయితే పూర్వఖండములోని మతుప్ ప్రత్యయము వలన సిద్ధించు ఉపాయత్వము.

పిరాట్టికి లేదని తీసివేసినచో, ఉత్తరఖండములోని మతుప్ ప్రత్యయము చేత ఆమెకు వచ్చెడి ప్రాప్యత్వము గూడ నుండదని చెప్పవలసి వచ్చునే యనినచో, ఉపాయత్వములో నుండు బాధక ప్రమాణములవలె ప్రాప్యత్వము విషయములో బాధక ప్రమాణము లేవియు లేనందున, ఆమెకు ప్రాప్యత్వముండులో నేమియు కొరత లేదు. లోకములో తమబిడ్డ చేయు అపచారముల వలన తండ్రి వానిని ఉపేక్షించి, తగిన ప్రేమాదవముల చేయకుండినప్పుడు, వానికి పశ్చాత్తాపము గలిగి తల్లిదండ్రుల నిద్దఱను వేడికొనుటయు నప్పుడు తల్లి, తాను గూడ భర్తకు పరాధీనయగుట చేత పతికిగల స్వాతంత్ర్యము నెరిగి పతి వద్ద తాను పురుషకారము చేసి భోగ సమృద్ధిని కలిగించుటయు, తరువాత బిడ్డ అట్టి భోగానుభవ వేళలో తల్లిదండ్రుల నిద్దరను ఒకే విధమైన బుద్ధితో కొలుచుటయు ప్రసిద్ధమే కదా!

ఇక నాద్వయమందలి పూర్వోత్తర ఖండముల అర్థములగు ఉపాయోపేయత్వముల ననుసంధించుట చేత కలుగు జ్ఞానమెట్టిదనగా, శాస్త్రములకు వశ్యులై యుండు వారికి, మంగళ సూత్ర ధారణముతో గూడిన పాణి గ్రహణము వలె పూర్వవాక్యమందుండు ప్రాపకత్వమును, తరువాత తన పతి యొక్క పెద్ద భార్య అనుమతి కలిగి పతి గృహమున అగ్రభార్యాయుక్తుడగు పతి పరిచరణమువలె ఉత్తర ఖండ ప్రతిపాద్యమగు ప్రాప్యత్వమును నుండుననియు వివేకులు గ్రహింపవలెను. కాబట్టి పిరాట్టికి ఉపాయత్వకోటిలో నన్వయము లేదు.

శ్రీ కి వైశిష్ట్య మాత్రము చేత నుపాయత్వమును చెప్పుటలో విరోధము

సిద్ధోపాయభూతుడగు భగవంతునకు లక్ష్మీవైశిష్ట్యము కూడ ప్రతీతమగు చుండుట చేత, విశేషణ భూతరాలగు పిరాట్టికి గూడ ఉపాయకోటిలో ప్రవేశము ఉండునని చెప్పినచో, విశేష్య భూతుడగు సర్వేశ్వరునకు ఉండెడి జగత్కారణత్వ జగన్నిగరణోద్గిరణములను అవి గూడ అమెకుండవలసి వచ్చును. దానికి గూడ సమ్మతించినచో **నతత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే** ఇత్యాది శ్రుతుల చేత బోధింపబడిన **బ్రహ్మ ద్వితీయత్వమునకు** భంగము వచ్చును. దాని వలన ఈశ్వరద్విత్వము సంభవించును. **భువన భవన స్థిత్యపాయైక హేతో ర్లక్ష్మీభర్తు** అను ప్రమాణ బలము చేత, జగత్సృష్ట్యాదులు గూడ ఆమె కుండుట కంగీకరించుట అవివేకమైనట్లే ద్వయ పూర్వ ఖండములోని మతుప్ ప్రత్యయము చేత నుపాయత్వముండునను మరియు అవివేకమే. అందువలన పరమ వైదికోత్తములగు సజ్జనులకు సమ్మతమేమనగా లక్ష్మీపతి కుపాయత్వమును, లక్ష్మీకి కేవల పురుష కారకత్వమును, నియత ధర్మములుగా నుండు నననదియే.

శ్రీకి ఉపాయత్వముతో సాధక బాధక ప్రమాణములు

ఈ విధమైన సత్సంప్రదాయము నెరిగి యుపదేశింపక తమకు దోచిన విధముగా ద్వయములోని శ్రీమచ్ఛబ్దము చేత చెప్పబడు పత్నీ సంబంధముచే వచ్చెడి ప్రతిబంధములకు దిఙ్మాత్రముగా పరిహారములను జూపెదమని వారు వ్రాసిన దాని వలననే ప్రతిబంధము లెక్కువగా నున్నవని సిద్ధించు చున్నది.

ఇక ద్వయ పూర్వఖండము నందలి చరణౌ అను ద్వి వచనమును బట్టి ఈశ్వరునకే యుపాయత్వ ముండునని చెప్పవలసి యున్నది. పిరాట్టికి గూడ నుపాయత్వముండినచో చరణాన్ అని బహువచనము ఉండవలసి యున్నది గదా. అట్లు లేనందున ఆమెకు ఉపాయత్వము లేదను ప్రతిబంధోక్తికి సమాధానముగా

చరణావితి నిర్దేశః పత్నీ వైశిష్ట్య బాధకః ।
ఇతి మందేరితం ప్రోక్తం శ్రీమచ్ఛబ్ద విరోధతః ।
శబ్ద స్వరసతః ప్రాప్తం వైశిష్ట్యం ప్రథమం శ్రుతమ్ ।
విశేష్య చరణ ద్విత్వం నహి బాధితు మర్హతి ।
చరణానితి వ్యక్తవ్య మితి యచ్చ ప్రపంచితమ్ ।
గ్రంథజ్ఞైః అపహాస్యం తత్పతి ప్రాధాన్యతో ఽ న్వయాత్ ।
న సమ్రాజిసపత్నీ కే సద్వితీయో క్తి సాహసమ్ ।
తే తథాత్వే పరామృశ్య దర్శితం గురు సాహసమ్ ॥

అనగా చరణౌ అను ద్వివచన నిర్దేశము, ఉపాయత్వములో పత్నీ వైశిష్ట్యమునకు బాధకమగుచున్నదని మంద బుద్ధులు చెప్పుట, శ్రీమచ్ఛబ్దములో నిత్యయోగమత ప్రత్యయమునకు విరోధించును గాన సరిగాదు. శబ్ద స్వారస్యమును బట్టి శ్రీమచ్ఛబ్దము చేత వైశిష్ట్యము మందు చెప్పబడెను, అట్టి వైశిష్ట్యము విశేష్యమగు హరియొక్క చరణ ద్విత్వమును బాధింపజాలరు. చరణాన్ అని బహువచన ముండవలెనని చెప్పుట శాస్త్రజ్ఞులకు అపహాసపాత్రమగును. ఎందువలన అనగా పతికుండెడి ప్రాధాన్యము చేత ద్వివచనము జెప్పబడెను. ఒక సమ్రాట్టు భార్యతో గూడియున్నఇత మాత్రము చేత సమ్రాట్టు పాలింపుచున్నాడనక సమ్రాట్టులు పాలింపు చున్నారని చెప్పవలెనను సాహసము వంటిదే, బహువచనముండవలెను అనుట యని తెలియదగును.

అందువలన నది యుక్తము కాదని, వారు చెప్పు సమాదానము విశేష ప్రమాణ జ్ఞానము లేనందున చెప్పినదే యగుచున్నది.

లక్ష్మీవిశిష్టుడగు ఆ సర్వేశ్వరుడే

అహం మత్ప్రాప్త్యుపాయోవై సాక్షా ల్లక్ష్మీపతి స్స్వయమ్ ।

లక్ష్మీః పురుష కారేణ వల్లభా ప్రాప్తి యోగినీ।

ఏతస్యాశ్చ విశేషోయం నిగమాంతేషు శబ్ద్యతే

అని నాకుపాయత్వమును లక్ష్మీః పురుషకారత్వమును విశేషలక్షణములని విశేషించి చెప్పుటయే వేదాంత నిర్ణయమని, శ్రియఃపతి శ్రీ సూక్తితో విరోధించునట్లే, పిరాట్టికి ఉపాయత్వముండు ననునది, విశేషజ్ఞుల కపహాస్యపాత్రము గూడ నగుచున్నది. మరియు **పతి ప్రాధాన్యతోన్వయాత్** అని వారు చెప్పుదాని చేతనే శ్రీవిశిష్టుడగు నారాయణుడే ప్రధానుడనియు, ఆయనకు విశేషణ భూతురాలగునట్టియు నిత్యానపాయినియు నగు పిరాట్టి, అప్రధాన భూతురాలనియు, సుస్పష్టము అగుట చేత నప్రధానురాలగు పిరాట్టి కూడ సర్వేశ్వరుని వలెనే ఉపాయభూతురాలు అనువారే గ్రంథజ్ఞుల చేత అపహాస్యము పొందగలరు. ఐచ్ఛికముగా నొక్కొక్క సమయములో జరుగు నవతారములలో కూడ పిరాట్టి అప్రధానురాలని

మాం న యేద్యది కాకుత్ స్థః తత్తస్య సదృశం భవేత్ అనియు

క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః

అనియు శ్రీరామాయణ వచనముల వలన సుస్పష్టము అది యెట్లనగా, శ్రీరామాయణములో సీతాపిరాట్టి చేతనస్థానాపన్నురాలనియు, లంక సంసారమనియు, సత్సంప్రదాయము. అట్టి స్థితిలో నన్నాయనే తన సన్నిధికి చేర్చుకొనుట ఆయన ఉపాయత్వమునకు దగియుండున నిమ్ము శీఘ్రముగా నన్నాయన స్వీకరించి పొందగలడు అనియు చెప్పుట, భగవదేకోపాయత్వమును స్పష్టపరచుచున్నది గదా! ఇక ద్వయ పూర్వ ఖండములో ద్వివచనము చరణ పదమునకు లేకుండ చరణం అని ఏక వచనముండినచో జాత్యేక వచనముగా చెప్పి యందువలన నిద్దరుకును ఉపాయత్వముండునని చెప్ప వీలగును. అట్లుండక చరణౌ అని ద్వి వచనముండుట చేత విశేషణ భూతురాలగు పిరాట్టికి ఉపాయత్వముండబోదు. పిరాట్టి విశేషణముగా గల సర్వేశ్వరునకే ఉపాయత్వముండునని చెప్పుటయే వేదాంతములక స్వతమగును. కాబట్టి ఉపాయత్వ నిర్ణయ స్థలమునకు అనురూపములగు ప్రమాణములలో ద్వివచనము అనుక్తమగు సమప్రాధాన్యద్యోతక మగుననియు, బహుత్వమను కూడ చెప్పుటకు సహమైయుండుననియు చెప్పెడి పూర్వపక్షమునకు సమ్మతినిచ్చు దృష్టాంతమును ఎత్తి చూపినచో నది సత్సమ్మతమగును, కాని సప్రమాద్దృష్టాంతమును జూపుట తగియుండదు. ఇదియును గాక

అనన్యాహి మయా సీతా భాస్కరేణ ప్రభా యధా

అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యధా

అని భార్యాభర్తలగు సీతారాములు చెప్పిన వచనములను అనుసరించి పిరాట్టికి ఉపాయత్వమును తీసివేయు పారతంత్ర్యము సిద్ధమగుచున్నది. సూర్యుని విడచి ప్రభ యెప్పుడును నుండునట్లు, స్వామిని విడచి పిరాట్టి యుండజాలదని కదా ఆ ప్రమాణ వచనముల కర్థము. అట్టి దివ్య దంపతులగు శ్రీశ్రియఃపతులిద్దరును ఏకవ్యక్తి యనదగినట్లు అన్యోన్య సంబంధము, తత్ప్రణయిత్వాను రూపమని శ్రుతి

స్మృత్యాది సచ్ఛాస్త్ర సమ్మతము. ఈ విధముగా నుండు లక్ష్మీ విశిష్ట వస్తువునకు అనసురూపమైన సమ్రాట్ దృష్టాంతమును చెప్పుట గ్రంధజ్ఞుల కపహాస్యము గానోపును. ఇటు శ్రీకి పురుషకారకత్వమును, శ్రియః పతికి ఉపాయత్వమును, సత్సంమతమైన తరువాత, సిద్ధోపాయ భూతుడగు ఈశ్వరునకు ఉపాయత్వములో ప్రతిబంధకము పోయినట్లే, ఆయనకు మాంగళ్య ధారిణి యగు భార్యకు ఉపాయత్వ బుద్ధిలో ప్రతిబంధము గూడ సిద్ధించునను దానిలో నేమియు సందియము లేదు.

లక్ష్మీ కుపాయత్వ భ్రమకర వాక్యములకు అభియుక్తోక్త్యర్థములు

ఇంకను శ్రియఃపతికి వలెనే శ్రీకి గూడ, నుపాయత్వముండు ననుటలో ననేక ప్రమాణములు కనబడుచున్నవి. ఎట్లనగా,

లక్ష్మ్యా సహ హృషీకేశో దేవ్యా కారుణ్యరూపయా ।

రక్షక స్సర్వసిద్ధాంతే వేదాంతే ఒ పిచగీయతే ।

హృషీకేశుడు లక్ష్మితో గూడియే రక్షకుడగునని అన్ని శ్రుతి స్మృతి సిద్ధాంతములలోను చెప్పబడు చున్నాడని చెప్పబడిన ప్రమాణ వాక్యము ననుసరించి భార్యతో గూడియే సర్వరక్షణ దీక్ష నొందిన సర్వేశ్వరునకు, ద్వయమందలి శ్రీమచ్ఛబ్దములో చెప్పబడిన పత్నీ సంబంధము వలన వచ్చెడి ఉపాయత్వ ప్రతిబంధనమునకు సమాధానముగా నీ క్రింది ప్రమాణములు కనబడుచున్నవి.

వేతిమాఅాద పూమేవిరుప్పాళ్ వినై తీర్కుమ్ సదా పరిమళయుక్తమగు పద్మమందు నివసించు నామెయే ప్రాప్య ప్రతిబంధకములను తీర్చును. అనియు

నిన్ తరువరుళుమ్ పఙ్గయత్తాళ్ తిరువరుళుమ్ కొన్డు నిన్ కోయిల్ శీయ్‌త్తు

నీ కృపను, పద్మాదేవి కృపను ఆలంబముగా గొని నీ సన్నిధిలో చేరి, అనియు నమ్మాళ్వారు సాయించిరి.

అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయత్,

అలమేషా పరిత్రాతుం రాఘవా ద్రాక్షసీ గణమ్

ఈ పిరాట్టియే రాక్షసస్త్రీలకు రామనిగ్రహము నుండి కలుగు భయమును దీర్ప సమర్థురాలు అని శ్రీవాల్మీకి శరణాగతి సారమగు శ్రీరామాయణములో చెప్పెను.

సంసారార్ణవ తారిణీమ్ అని హిరణ్యగర్భ కాశ్యపాదులు చెప్పియుండిరి.

వాచః పరం ప్రార్థయితా ప్రపద్యేన్నియతః శ్రియమ్,

వాచామగోచరుడగు శ్రియః పతిని ప్రార్దించు వాడు నియమముతో లక్ష్మిని గూడ శరణు పొందవలెను అని శౌనకులు చెప్పిరి.

ఆత్మ విద్యాచ దేవిత్వం విముక్తి ఫలదాయినీ ముక్తియను ఫలము నిచ్చు ఆత్మ విద్యవు దేవీ! నీవే అని పరాశరులు చెప్పియుండిరి.

యామాలంబ్య సుఖేనేదం దుస్తరం త్రిగుణోదధిమ్ ।

నిస్తరంత్యచిరేణైవ వ్యక్తి ధ్యాన పరాయణాః

ఏ లక్ష్మిని యాశ్రయించి దుస్తరమగు ప్రకృతి సముద్రమును ఏకవ్యక్తి ధ్యానపరాయణులై శీఘ్రముగా దాటగలరో, అని శ్రీ సాత్వతసంహితలో రూప ధ్యాన ప్రకరణములో శ్రియఃపతియే స్వయముగా చెప్పియుండెను.

జగత్సమస్తం యదపాంగ సంశ్రయమ్

ఏ పిరాట్టి యొక్క క్రీగంటి చూపు మీద సమస్త జగమును నాధారపడియున్నదో అనియు,

శ్రేయో నహ్యరవిందతోచన మనః కాతా ప్రసాదాదృతే

పుండరీకాక్షుని మనోవల్లభయగు పిరాట్టి కటాక్షము తప్ప వేఱగు నుపాయము లేద ని యాళవందారులు సాయించి యుండిరి.

శేష శేషాశనాది సర్వం పరిజనంగవత స్తత్తదవస్థోచిత పరిచర్యాయా మాజ్ఞాపయంత్యా అనంత గరుడ విష్వక్సేనాది పరిజనమును భగవంతుని యొక్క ఆయా యవస్థలకు తగిన విధముగా పరిచర్యయందు నాజ్ఞాపించునట్టి పిరాట్టి అని శ్రీభాష్యకారులు శ్రీవైకుంఠ గద్యములో సాయించిరి.

స్వస్తి శ్రీర్ధిశతాదశేషజతాం అనియు ఆరంభించి

స్యాదైకరస్యాత్తయా, సమస్త జగత్తులకు సృష్టి స్థితి ప్రళయములు చేయు హరి, యే పిరాట్టి ముఖ చేష్టలను జూచి వానికధీనుడుగా నుండి ఆ వ్యాపారమును చేయుచు, వేరు విధముగా నీ క్రీడ యంతయు ఆమెతో నేక రసముగా ననుభవించువాడై యుండుట చేత రసము నివ్వజాలదో అనియు,

దేవి త్వన్మహిమావధి ర్నహరిణా నాపిత్వయా జ్ఞాయతే,

ఓ దేవీ! నీ మహిమ యొక్క అవధి శ్రీహరికిని నీకును గూడ తెలియదమ్మా యని శ్రీకూరత్తాళ్వార్లు సాయించిరి.

ఐశ్వర్య మక్షర గతిం పరమం పదం వా ....

కథయ కో ౨ యము దారభావః,

అమ్మా ఒక్క మాఱు నీకు చేతులు జోడించిన వాని కెవ్వనికైనను, నదియే గొప్పగా తలచి, ఐశ్వర్య కైవల్య మోక్షరూప పరమ పదముల నిచ్చి కూడ, ఇతనికి తగిన ఉచితోపకారమును చేయ లేకుంటినే యని సిగ్గుపడుచుందువు గదమ్మా, ఏమి నీ యుదారభావమమ్మా! చెప్పుము! అని శ్రీపరాశర భట్టరు సాయించిరి. ఈ భట్టరు శ్రీసూక్తి శ్రీసూక్తమందలి ఉదారామ్ అను పదమునకు వివరణ రూపమై యున్నది.

మఱియు నా శ్రీసూక్త భాష్యములో **ఆపేక్షితార్థంగళై యెల్లా ముపపాదిత్తార్** అనియు

విశిష్టముపేయనూ మాప్పోలే విశిష్టముపాయము మాగ క్కుఱైయిల్లై అనియు, పెరియజీయరు పిరాట్టికినీ శ్రియఃపతికినీ గూడ నుపాయోపేయత్వములు సమముగా నుండినట్లు సాయించిరి.

ఉభయాధిష్ఠానం హి శేషిత్వమ్ శ్రీశ్రియఃపతుల నిద్దఱను నాధారపరచుకొనియే శేషిత్వమున్నదని

సోమాశియాండాన్ తమ **షడర్థ సంక్షేపమను** గ్రంథములో నిష్కర్షగా చెప్పి యుండిరి. మరియు శ్రియః పతిని చెప్పిన స్థలములలో నంతటను పిరాట్టిని గూడ చెప్పినట్లే యని తెలియవలెనని సాయించిన శ్రీఉడైయవరులనార్తను, ఆచ్చాన్ వద్ద విని నంజీయరునూ దానిని సంగ్రహించుకొనిరి అను పూర్వాచార్య శ్రీ సూక్తి గలదు. ఈ విధముగా ననేక ప్రమాణ శ్రీసూక్తులను బట్టి భగవద్రూపములో లక్ష్మీకి భాగముండుటచే, తల్లిదండ్రులిద్ధరిలో తండ్రికివలెనే తల్లికి గూడ ప్రణామాది ప్రతిపత్తి చేయుట వంటి ప్రాధాన్యము కలదు.

ఈ విధముగా మధ్యస్థ దృష్టితో నుండు ప్రామాణిక వచనముల యర్థము స్పష్టముగా నున్నను తాము బట్టిన లక్ష్మ్యనుపాయత్వ నిరాకరణపు పట్టు విడువకుండినచో,

దృఢపూర్వ శ్రుతో మూర్ఖః .....

కుతర్క జ్ఞాన దృష్టీనాం విక్రాంతేంద్రియవాజినామ్

అను నింద్యత కలుగ గలదు. అని యిట్లు రహస్య త్రయ సారము ఇరువది మూడవ అధికారములో లక్ష్మికి పురుషకారత్వమాత్రమును చెప్పువారిని గురించి దూషింపబడియున్నది.

ఇట్లు లక్ష్మీ కుపాయత్వము బహు ప్రమాణ సాధితమై యుండగా అది లేదని చెప్పుట ఎట్లు బొసగుననినచో దానికి లక్ష్మీపురుషకారత్వ మాత్రవాదులగు మనపూర్వాచార్యులిట్లు సమాధానము చెప్పిరి. ఎట్లనగా, వెనుకటి కొన్ని ప్రమాణముల ననుసరించి లక్ష్మీ కుపాయత్వము అభాగమైననూ అట్లన్ని ప్రమాణ వచనములకును యర్థము చెప్పుట భ్రమకృతమే యనవలెను. ఏమనగా, తేఱిమాఱాద అలమేషా పరిత్రాతుం ఇత్యాది దివ్యసూరి మహర్షి వచనములను జూచి కొందరు భ్రమపడి లక్ష్మికుపాయత్వమున్నదని నిశ్చయించి చెడుదురను భావముతోనే వారి భ్రమ నివృత్తి కొఱకు, ఆ శ్రియఃపతి తానే

మత్ప్రాప్తిం ప్రతి జంతూనాం సంసారే పతతామథః ।

లక్ష్మీః పురుషకారత్వే నిర్ధిష్టా పరమర్షిభిః ॥

మమా పి చ మతం హ్యేత న్నాన్యథా లక్షణం భవేత్ అని

ఘంటాపదముగా పాంచరాత్ర సంహితలలో చెప్పి యుండు వచనములను వారు పరిశీలింపకుండుట భ్రమ కృతమనక తప్పదు. దీనిని బట్టి పై వచనముల కన్నిటికిని మోక్ష ప్రదానములో స్వతంత్రుడగు శ్రీహరికి ఉపాయత్వము వలెనే, పిరాట్టికి తత్స్వాతంత్ర్య ప్రయుక్తముగా నొకప్పుడు ఆయన హితపరుడగుట వలన గలుగు మనఃకాఠిన్యమును సంబంధించిన స్వాతంత్ర్యమును పోగొట్టి మోక్ష ప్రదానము చేయించు పురుషకారత్వము గలదనియు, ఉపాయత్వ పురుషకారత్వములు రెండిటికిని జీవుని మోక్షపద ప్రాప్తిలో సమానబలము గలదనియు తెలియగలదు. అట్లు తెలియుటయే ప్రాజ్ఞ లక్షణము.

అన్వయ వ్యతిరేకముల చేత నుపాయత్వ పురుషకారత్వములకు మోక్షములో కారణత్వముండుట చేతనూ, పై ప్రమాణములలో లక్ష్మికి గూడ మోక్ష ప్రదత్వము చెప్పబడుట విరుద్ధముగాజాలదు.

ఈ విషయములో భట్టరు శ్రీగుణరత్నకోశమునందిట్లు నుడివిరి.

పితేవ త్వత్ప్రేయాన్ జనని పరిపూర్ణాగసి జనే ।

పిత స్రోతో వృత్త్యా భవతి చ కదాచి త్కలుషధీః ।

కిమేత న్నిర్దోషః క ఇవా జగతీతి త్వ ముచితై ।

రూపాయై ర్విస్మార్య స్వజనయపి మాతా తదసినః

అమ్మా! లక్ష్మీ ! తండ్రి వలె నీ భర్తి చేతన అధిక పాపియైనప్పుడు నుంచి మార్గమున పెట్టుటకు దయా రహితుడై మనః కాఠిన్యమును పూని యొకప్పుడు వాని విషయమున నుపేక్షాభావమును గలిగి యుండును. అట్టి యెడ నీ వనేక ఉపాయముల చేత పురుషకార మొనర్చి స్వసన్నిధికి చేరునట్లు వారిని చేతువు. అందుకే నీవు హితపరుడగు తండ్రి కంటె ప్రియపరురాలగు తల్లివై యుంటివి అని తాత్పర్యము. మరియు

అకించన్యైక శరణాః కేచిత్ భాగ్యాధికాః పునః ।

మత్పాదాంభోరుహద్వంద్వం ప్రపద్య ప్రీతమానసాః ।

లక్ష్మీం పురుషకారేణ వృతవంతో వరానన।

మత్ క్షమాం ప్రాప్య సేనశ ప్రాప్యం ప్రాపకమేవ మామ్ ।

లబ్ధ్వా కృతార్థాః ప్రాప్స్యంతే మామేవానస్య మానసాః ।

అనియెడి విష్వక్సేన సంహిత యందలి భగవద్వచనము నన్ను శరణమును పొంది లక్ష్మిని పురుషకారముగా వరించి, సత్క్రమాచరణము గలవారు నా కృపను పొంది నన్నే ప్రాప్య ప్రాపకములుగా పొంది నన్ను చేరుదురు. అట్టివారే భాగ్యవంతులు, కృతార్థులు, అనన్య మనస్కులు అయియుందురు అని చెప్పుచున్నది. అట్లా ఆచరింపని వారు గర్భ నిర్భాగ్యులును, అకృతార్థులును, విపరీత బుద్ధి కలవారును, నగుదురని దీనివలన సుస్పష్టము.

ఆకించన్యైక శరణాః అను భగవద్వచనములో

లక్ష్మీం పురుషకారేణ అనియు,

ప్ర్యాప్యం ప్రాపకమేవమామ్ అనియు చెప్పుట చేత లక్ష్మికి పురుషకారత్వము మాత్రమే యుండుననియు, ఉపాయత్వము తనకే చెందియున్నదనియు, స్పష్టమగుచున్నది. దీనివలన లక్ష్మికుపాయత్వ భ్రమ నిరసమైనది.

పై వచనము వలన ప్రపత్తి కెట్లు పాయత్వము లేదో, పురుషకార భూతురాలగు లక్ష్మికిని యట్లే ఉ పాయత్వము లేదని స్పష్టముగా తెలియుచున్నది. కాబట్టి ప్రబల ప్రమాణములు అనేకములుండుట చేత, వెనుక పూర్వపక్షుల చేత ప్రదర్శింపబడిన ఆళ్వారాదుల శ్రీసూక్తులకు, పిరాట్టి యొక్క అమోఘ ఘటకత్వ ప్రయుక్త పురుషకారము చేత మోక్ష ప్రదానములో హేతుభూతురాలగుననియే తాత్పర్యమును గ్రహింపవలెను. విస్తర భీతి చేత తిరిగి వానికన్నింటికి వివరణము చెప్పబడలేదు. వివేకులగు వారికందరకును నా విషయము విశదమే యగును. ఇంకను జిజ్ఞాసువుల సంశయములు దీరని యెడల శ్రీవైష్ణవ సమయాచార నిష్కర్షమున చూడనగునని కోరెదము.

లక్ష్మనుపాయత్వమున నిదర్శనము

అయినను, **వేరిమాఱాద పూమేల్** అని స్పష్టముగా పిరాట్టి, జీవుని ప్రతిబంధక దురిత నిరసనములో నుపాయమని చెప్పుట చేత నామె పాపములను మాత్రము తీర్పించునని సంకోచించి చెప్పుట యెట్లు కుదురనినచో, ఆళ్వార్ల శ్రీసూక్తి స్వభావమును బట్టి పరంపరయా కారణమును గూడ ప్రధాన కారణముగా చెప్పుట సామాన్యముగా నుండునని తెలియుచున్నది. ఎట్లనగా

ఇప్పత్తుంశన్మంవిడ త్తీయ్న్దఱ నోక్కుమ్ అని మొదలుకొని అనేక తిరువాయ్ మొళిలలో నా తిరువాయ్ మొళియే ప్రాప్యము నిచ్చునని చెప్పబడెను. కాబట్టి ఆళ్వార్లశైలిని బట్టి పరం పరయా కారణమునే ప్రత్యక్ష కారణముగా చెప్పుట జరిగినదని గ్రహింపవలెను. కాబట్టి

వినై తీర్కుమ్ అను దానికి వినై తీర్పిక్కుమ్ అనియే తాత్పర్యముగా గ్రహించుట సరసమైయుండును. లోకములో గూడ, ప్రధానాధికారి చేయు నుపకారమును మధ్య ఘటక కృత్యము చేయు సహాయాధికారుల యందారోపించి, వారేమాకా ఉపకారము చేయగలరని వ్యవహరించుట ప్రసిద్ధమే కదా!.

పిరాట్టికి పారతంత్ర్యము వలన అనుపాయత్వము

అయితే ఆళ్వార్ల శ్రీసూక్తి స్వభావమును బట్టి యట్టి యర్థము చెప్పవచ్చునని యంటిరి కదా! ఆయా తిరువాయ్ మొళులు, అచేతనములు గనుక ఫలప్రదాన శక్తియు, ఫలప్రాపకత్వ శక్తియు, నుండ వీలులేదు కావున నచ్చట ఫలము నిప్పించునని యర్థమును చెప్పవచ్చును, గాని పిరాట్టి చేతన స్వరూపురాలు కావున ఆమె విషయములో నట్టి అను ప్రపత్తి యుండగూడదు కదా.

అందువలన **తీర్పిక్కుమ్** అని యర్థము మార్చుట యెట్లు బొసగును?

అనినచో పిరాట్టి కూడ జీవకోటిలోనే చేరియుండును కావున నామెకు భగవద్దృష్ట్యా పారతంత్ర్యమే స్వరూపము. కాబట్టి యట్లర్థము మార్చవచ్చును.

ఆమెకు అచిద్వత్పారతంత్ర్య ముండుటను గూర్చి

మాం నయేద్యది కాకుత్ స్థ స్తత్తస్య సదృశం భవేత్ అను శ్రీరామాయణ వచనము స్పష్టపరచుచున్నది.

ఇక **తేయ్న్దఅ నోర్కుమ్ తన్ కణ్గళ్ శినన్దే** అనుచోట

ఆ తిరువాయ్ మొళికే ఎర్రబారి చూచుట యను చేతన ధర్మము చెప్పబడియున్నను, నదియంతయు స్వతంత్ర ఫల ప్రదాన శక్తి గల పరమ చేతనుడగు భగవంతుని ధర్మము దానే చెప్పక తప్పదు.

అట్లే **వినైతీర్కుమ్** అను స్థలము నందు, స్వతంత్ర ఫలప్రదాన శక్తి లేని పిరాట్టికి, పురుష కారత్వ సూచకముగా తీర్పిక్కుమ్ అని మార్చి యర్థము చెప్పవలసి యుండును. మరియు నాళ్వార్ల శ్రీసూక్తులలో ననేక స్థలములలో

వల్వినై తీర్కుం కణ్ణన్ తొల్వినై తీర్ధ .... వీత్తిరుప్పార్, కణ్ణనల్లాల్ ఇల్లైకణ్ణిర్ శరణే

ఇత్యాదులలో భగవంతునకే ఫలప్రదానములో స్వతంత్రోపాయత్వము, చెప్పియుండుట చేత దానికి అనుగుణముగా పిరాట్టికి పురుషకారత్వ మూలకమైన ఫలప్రదాన శక్తిచే చెప్పవలసిన యుండును. ఇదియే ప్రాజ్ఞ సమ్మతము.

కాబట్టి స్వామికి ఉపాయత్వమును పిరాట్టికి పురుషకారత్వమును లక్షణములని లక్ష్మీః పురుషకారత్వే ఇత్యాది భగవద్వచన ప్రకారము సిద్ధమగును.

ఇక **నిన్తిర వరుళుమ్ పఙ్గయత్తాళ్ తిరువరుళుమ్** అనియు,

అలమేఘ పరిత్రాతుమ్ అనియు మొదలగు వచనములకు

పిరాట్టి పురుషకారత్వేన రక్షకత్వమును గూడ నుండునని యర్థము చెప్పుట సరసమైయుండును.

నమ్బిళ్లై గారి వ్యాఖ్యానములో గూడ **పణ్డైనాళాలే నిన్తిరువరుళుమ్** అను పాశురములె

నెడునాళ్ కూడప్పణ్ణి పోన్ద ఉన్ కటాక్షత్తైయుమ్,

ఉన్నరుళుక్కడియాన పెరియ పిరాట్టియార్ కటాక్షిత్తైయుమ్

అని నీ కృపకు మూలమగు పిరాట్టి కటాక్షమనియే సాయించబడెను. ఇంకను ఎన్నడి యారదు శెయ్యార్ అను నీ కటాక్షమును, నకశ్చిన్నా పరాధ్యతి అను పిరాట్టి కటాక్షమును, అనియు చెప్పవచ్చును. మరియు

అవనుదైయ (ఆశ్రిత) పారతంత్ర్యమ్ ప్రణయిత్వ ప్రయుక్త

మన్రో అదునిలై నిర్కుమో స్వాతంత్ర్య మన్రో, అవనుక్కు ప్రకృతి?

ఎన్ణఙ్ఞవేణ్డా అవళరుగేయిరుక్కు స్వాతంత్ర్యమ్ జీవియాదు.

ఆగైయితేముఖ్కాత్తాలవలై పురుషకారమాగ ప్పత్తుగిఅదు అని వారి చేత సాయించబడెను.

దాని తాత్పర్యమేమనగా, స్వామి ఆశ్రిత పరతంత్రుడనుట, కేవల ప్రీతి మాత్రము చేతనే గాని స్వాతంత్ర్యమే కదా ఆయన ప్రకృతి. కాబట్టి పారతంత్ర్య మాయనకు సోపాధికము. అది స్థిరముగా నిలచునా? అని భయపడనక్కరలేదు. పిరాట్టి దగ్గరనే యుండగా ఆయన స్వాతంత్ర్యము నిలచునా? నిలువదు. కనుకనే కదా ద్వయమందలి పూర్వ వాక్యములో నామెను పురుషకారముగా నాశ్రయించుట చెప్పబడెను అని తెలియవలెను. కాబట్టి యామెకు పురుషకారత్వమే ప్రధాన లక్షణము. ఉపాయత్వ ముండుననుట సత్సంప్రదాయ విరుద్ధము.

అనుపాయత్వములో మరికొన్ని వచనములు

అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్,

అలమేషా పరిత్రాతుం రాఘవాద్రాక్షసీ గణమ్

అను వచనములు రెండును పిరాట్టికి పురుషకారత్వములోనే స్వరసముగా సమన్వయించును. దీనికి పాపానాం వా శుభానాం వా అను పిరాట్టి వచనమే ప్రమాణము అనగా వధార్హమైన రాక్షసీగణమును రక్షించుటలో నామె చెప్పు పురుషకార వచనములే హేతువులై రక్షింపబడుట జరిగెను. త్రాతుమ్ అను దానికి పురుషకార రూపములో రక్షించుటకనియే యర్థము చెప్పుట సరసమై యుండును.

సంసారార్ణవ తారిణీమ్ అను దానికి **లక్ష్మీం పురుషకారేణ వృతవంతః తరేత్సంసార సాగరమ్** అను భగవద్వచన ప్రకారము పురుషకారముగా నుండి సంసార సముద్రమును దాటించునది యనియే అర్థము చెప్పవలెను.

ఇక సంసారార్ణవ నమగ్నానాం విషయాక్రాంత చేతసామ్ ।

విష్ణు పోతం వినా నాన్యత్కించిదస్తి పరాయణమ్

అని భగవదేకోపాయత్వము చెప్పు ప్రమాణము గూడ పిరాట్టికి నుపాయత్వమును నిషేధింపు చున్నది. ప్రపద్యే న్నియతః శ్రియమ్ అని పిరాట్టి విషయములో చెప్పబడిన

ప్రపత్తి శ్రియం దేవీం నిత్యానపాయినీం... శరణ మహం ప్రపద్యే అను

శ్రీభాష్యకారకృత గద్య ప్రమాణము చేత నిత్యానపాయినియై పురుషకారము చేయుట విషయమైనదే యని చెప్పవలెను.

మరియు **ఫలమత ఉపపత్తే సకల ఫలప్రదో హి విష్ణుః**

అను బ్రహ్మ సూత్రాది ప్రమాణముల వలన గూడ భగవదేకాయత్తమే ఫలప్రదానమని స్పష్టము.

ఇట్లే **విముక్తి ఫలదాయినీమ్** అను దానికి మోక్షమిచ్చే జనార్ధనాత్

అను వచనమును బట్టి పిరాట్టికి స్వతంత్ర మోక్ష ప్రదత్వము లేదని సిద్ధించుట చేత ముక్తి నిప్పించునది యనియే యర్థము చెప్పవలెను. యమాలంబ్య అను వచనమునకు కూడ,

లక్ష్మీం పురుషకారేణ వృతనంతః అనియు,

మామేవానన్య మానసాః అనియు చెప్పబడిన భగవద్వచన ప్రమాణము చేత పురుషకారముగా నవలంభించి యనియే యర్థము చెప్పుట సరసమైయుండును.

జగత్సమస్తం యదపాంగ సంశ్రయమ్ అను దానికి గూడ శ్రియఃపతి కుండెడి పరమ ప్రణయిత్వమును బట్టి **యస్యావీక్ష్యముఖం తరంగిత పరాధీనో విధత్తే ఉ ఖిలమ్**

అని చెప్పినట్లు పిరాట్టి ముఖ వికాసము కొరకు నామ్ చెప్పినట్లు చేతనునకు ప్రాప్య సిద్ధి కలిగించును. కావున నామెకు పురుషకారత్వమే యర్థముగా సిద్ధించును. అంతే కాని దాని వలన నామె కుపాయత్వము సిద్ధించును. అంతే కాని దాని వలన నామె కుపాయత్వము సిద్ధించునని చెప్ప వీలులేదు.

శ్రేయో నహ్యర విందలోచనా నమనః కాంతా .... కర్హిచిత్

అను వచనము గూడ **శ్రియః శ్రియమ్ శ్రియః శ్రీః** అను ప్రమాణ వచనముల ప్రకారము ఆయా పురుషార్థ కాముకులనైశ్వర్య కైవల్య పరమపద రూప ఫలసిద్ధిని, ఆమె పురుషకారముగా హరి నాశ్రయించి కలిగించుట వలన గలుగు ప్రాధాన్యమును బట్టి చెప్పినదే గాని మరొండు గాదని గ్రహింప వలెను. ఎందువలననగా,

న సంపదాం సమాహరే విపదాం వినివర్తనే ।

సమర్థో దృశ్యతే కశ్చిత్ తం వినా పురుషోత్తమమ్

నహి పాలన సామర్థ్య మృతే సర్వేశ్వరం హరిమ్

జీవే దుఃఖాకులే విష్ణో కృపా కాప్యుపజాయతే

ఇత్యాది ప్రమాణములను బట్టి సంపదలను ఇచ్చుటకు, విపత్తులను పోగొట్టుటకు, పురుషోత్తముడే సమర్థుడనియు, పాలనరూపమగు ఇష్ట ప్రాపణము, ఆయన యందే యున్నదనియు, జీవుని విషయమై సర్వేశ్వరునకు అనిర్వచనీయమగు కృప గలిగి మోక్ష మొసంగు ననియు, ఫల ప్రాపణ రూపమగు ఉపాయత్వ మాయనయందే కలదని స్పష్టముగా నుండుట చేత నితరులకా ఉపాయత్వము లేదనియూ స్పష్టమగుచున్నది. అభియుక్త వచనముల **కర్థ నిర్వాహము శేష శేషాశనే త్యాదిగా ఆజ్ఞాపయంత్యా** అను శ్రీవైకుంఠ గద్య వచనము,

ఆస్యేశానా జగతో విష్ణుపత్నీ అను శ్రుతి ప్రక్రియ చేత

పత్నీత్వ ప్రయుక్తమైన పరిజన నియమనమే చెప్పును. కాని ఆమెకుపాయత్వమును గలిగింపదు. శ్రీరామాయణములో,

సభ్రాతు శ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః ।

సీతా మువాచాతియశాః రాఘవం చ మహావ్రతమ్ ॥

సీతా సమక్షం కాకుత్స్థమిదం వచన మబ్రవీత్

ఇత్యాది స్థలములలో పురుషకార భూతురాలగు పిరాట్టి యొక్క అనుమతి, రాజద్వారము నందలి ప్రదానుల యొక్క అనుమతి వలెనే భగవత్కైంకర్య విషయములోను ఆవశ్యకము కావున నట్లు పిరాట్టి సహకారముతో కైంకర్య ప్రార్థన చేయబడెను. ఆమె భగవత్కైంకర్య విషయములో సహకారముగా మాత్రముండవలసి యుండుట చేత నామె పరిజనమును కైంకర్యములో నియమించుట జరుగును. కాని యామెయే ఫలప్రాప్తిలో సాక్షాదుపాయభూతురాలగుననుట యుక్తము కాదు.

దేవి త్వన్మహిమావధిః అని చెప్పబడిన వచనము **స్వస్తిశ్రీర్ధిశతాత్** అను శ్లోకము యొక్క విస్తరణ రూపమే యగుట చేత మాం నయేద్యది అనునట్లు పరతంత్రురాలగు పిరాట్టి స్వామి, తన మెడలో నిండిన ముత్యాలహారమును తీసి చేతబట్టుకొని **అవైక్షత హరీన్సరాన్ భర్తారం చ ముహుర్ముహుః** అని స్వతంత్ర ప్రధాన యోగ్యత తనకు లేనందున వానరుల వైపు, భర్తి వైపు మాటి మాటికి చూచుచు హార ప్రధానమునకు సాహసింపలేదు.

ప్రదేహి సుభగే హారం యస్య తుష్టాసి అని భర్త యనుమతి పొందిన తరువాతనే **ప్రదదౌ వాయుసూనవే** అని వాయుపుత్రునకు ఇయ్యగలిగెను. ఇట్లు భార్య యొక్క అనుమతి భర్తకును, భర్త యొక్క అనుమతి బార్యకును గలిగి యుండుట దాంపత్య ధర్మమై యుండుటచేత, నా మిథునము యొక్క రక్షణ ప్రకారము దుర్వివేచమని తెలుచున్నది. జీవుని రక్షణము విషయములో పిరాట్టికుండు పురుషకారత్వమును, స్వామి కుండెడి ఉపాయత్వమును, పరస్పర ప్రణయ స్వభావము చేత వృద్ధి చెందు పారతంత్ర్యమును బట్టి **త్వం దేవి నిత్యమభినందయసే ముకుందమ్** అనియు **ప్రహర్షయంతం మహిషీం మహాభుజం** అనియు పరస్పర ప్రీతి కారిత మగుట చేతనే యామెకు పురుషకారత్వము తప్ప ఉపాయత్వముండునని చెప్పుట సాహసమే యగును. ఇట్లే యంతటను అభియుక్త వచనములకు పిరాట్టి పురుషకారత్వములోనే తాత్పర్యముగా గ్రహింపవలసియుండుననునది దిఙ్మాత్రముగా నిచ్చట నుదహరింపబడెను.

పిరాట్టికి రక్షణత్వ ప్రతీతిలో తాత్పర్యము

లక్ష్మ్యా సహ హృషీకేశాన్ దేవ్యా కారుణ్య రూపయా
రక్షకః స్సర్వ సిద్ధాంతే వేదాన్తేషు చ గీయతే

అను వచనములో, లక్ష్మితో గలసియే భగవంతునకు రక్షకత్వమును తత్ప్రయుక్తోపాయత్వమును నుండునని చెప్పబడుట చేతనే పిరాట్టి కుపాయత్వము సిద్ధించుచున్నదని వాదించినచో

బ్రహ్మ దక్షాదయః కాల..... జగతః సృష్టి హేతవః । ఇత్యాది శ్రీవిష్ణు పురాణ వచనములో బ్రహ్మాదులకు గూడ, జగత్సృష్టిలో హేతుత్వము చెప్పబడుట వలన వారికిని సృష్టి కారణత్వముండునని చెప్పవలసి వచ్చును. అప్పుడు జగజ్జన్మాది కారణత్వ లక్షణము అతి వ్యాప్తమగును.

కావున బ్రహ్మాదులకు సృష్టిలో నెట్లు భగవదదీన కర్తృత్వము గలదో అట్లే పిరాట్టికి గూడ రక్షణత్వ ప్రయుక్తో పాయత్వము భగవదధీనముగా నుండునని తెలియవలెను.

అట్టి అర్థమును సూచింపుచునే లక్ష్మ్యా సహ కారుణ్య రూపయా అని చెప్పబడెను. సహ అను నవ్యయముతో కలసి యుండు తృతీయాస్త శబ్దము యొక్క వాచ్యమునకు, అప్రాధాన్యముండునని వ్యాకరణ మర్యాద. కావున కారుణ్య గుణరూపురాలగు పిరాట్టి యప్రధానురాలై రక్షణములో పురుషకారరూపమగు నుపకారత్వమునే పొందును. అనగా బ్రహ్మాదులకు అప్రధానమైన సృష్టికారణత్వమున్నట్లే పిరాట్టికి రక్షణ మంద ప్రధాన కారణత్వ ముండును. ఈ విషయమే **లక్ష్మీః పురుషకారత్వే నిర్ధిష్టా .... నాన్యథా లక్షణం భవేత్**

అని భగవచ్ఛాస్త్రములో నిర్ధారణగా చెప్పబడెను. ఈవిధముగా సకల శాస్త్ర సమ్మతమైనట్టి లక్ష్మీపురుషకారత్వము సిద్ధాంతితమై యుండుట చేత నుపాయత్వము సహకారమును బట్టి సద్వారకమని తెలియదగును.

పిరాట్టికి పురుషకారత్వ ప్రయుక్త ప్రమాణము

శ్రీవైష్ణవ సిద్ధాంతస్థులగు సదాచార్యుల శ్రీసూక్తులు, పిరాట్టికి పురుషకారత్వమే కాని ఉపాయత్వముండదని చెప్పునవి యనేకములు కలవు. కొన్ని దిఙ్మాత్రముగా నిచ్చట చూపెదము. తత్త్వ సంగ్రహమను గ్రంథములో

కారణవస్తువే ఉపాస్యమాయ్ శరణ్యముమాగైయాలే

ఇవళుక్కు ఉపాయభావత్తి లన్వయ మిల్లై.

ఇవళుక్కుపాయ భావముణ్ణాగ ప్రమాణఙ్గళుణ్డే యెన్నిల్

అదు శరణ్యనుడైయ ఇచ్చానువిధాయి యాగక్కడవదు

అనగా కారణ వస్తువే ధ్యేయమై శరణ్యమై యుండుట చేత పిరాట్టికి, ఉపాయభావములో (శరణ్యత్వములో) అన్వయముండదు. ఈమె యొక్క ఉపాయభావమును గురించి యనేక ప్రమాణములున్నవే యనినచో నవి యన్నియు, నుపాయభూతుడగు భగవంతునకు తోడ్పడుటలోనే తాత్పర్యము గలదిగా నున్నవి.

అను నంశమున చెప్పి తరువాత **ప్రథమ పద ద్వివచనత్తాలే నిర్విగ్రహవాదిగళై నిరసిక్కిఅదు,** అనంతర

పదర్తాలే ఉపాయద్విత్వవాదిగళ్ నిరసిక్షిఅదు

అనగా మంత్రరత్నమగు ద్వయములోని ప్రథమ పదమగు శ్రీమన్నారాయణ చరణౌ అను దాని యందలి ద్వివచనము చేత భగవంతునకు రూపము లేదను వారి వాదము నిరసింపబడెను. తరువాతదగు శరణం అను పదమందలి ఏకవచనము చేత ఉపాయద్విత్వము నిరసింపబడెను. అనుచు నైనారాచ్చాంబిళ్లై సాయించిరి.

ఇంకను తిరుమాలైయాణ్డాన్ వంశమౌక్తికులగు శ్రీయామున దేశికులు తమ రహస్య త్రయసారమగు గ్రంథము నందు

చరణౌ ఎన్రుద్వివచన ప్రయోగం పణ్ణువానెన్నిల్,

ఏకవచన ప్రయోగం పణ్ణినాల్, జాత్యేక వచన మాయ్ కొణ్డు లక్ష్మీ

విశిష్టోపాయత్వత్తై కాట్టవుమ్ కూడుమాగైయాలే, ఆత్తై వ్యావర్తిక్కైక్కాగ ద్వివచన ప్రయోగమ్

అనగా ద్వయములో చరణౌ అను ద్వివచనముండినదెందుకనగా ఏకవచనమున్నచో జాత్యేకవచనమను శాస్త్ర మర్యాదను బట్టి లక్ష్మీ విశిష్టతత్వము నందుభయులకును నుపాయత్వము సిద్ధింపవచ్చుననియూ దానిని వ్యావర్తించుటకు ద్వివచన ప్రయోగము చేయబడెననియూ నిర్ణయించుచు,

లక్ష్మీ గుణ విగ్రహఙ్గళ్ విశేషణమాయ్ అవన్

విశేష్యమాగై యాలే విశేష్యాంశ భూతనానవతనుక్కే ప్రాధాన్యేన కార్యకరత్వమ్,

విశేషణాంశమాన వివత్తుక్కు తదను విధాయిత్వ మాత్రమే

యాయిఱుక్కుమాగైయాలే, విగ్రహత్తుక్కు శుభాశ్రయుత్వముమ్,

వాత్సల్యాదులకు ఆశ్రయణ సౌకర్యాపాదకత్వమును, జ్ఞానశక్త్యాదులకు ఆశ్రితకార్యాపాదకత్వమును, ఇతర గుణములకు వేర్వేరుగా నాయాకార్యభేదమును ఎట్లుండునో అట్లే లక్ష్మికి పురుష కారత్వమే నియతమై యుండుననియు సాయించి యున్నారు. చతుశ్శ్లోకిలోని మూడవ శ్లోకము యొక్క వ్యాఖ్యానములో

శ్రేయో న హ్యరవిన్దలోచన మనః కాంతా ప్రసాదాదృతే అనుచోట పిరాట్టి కుపాయత్వము లేదనియు పురుషకారత్వము మాత్రమే గలదనియూ పెరియవాచ్చాన్పిళ్లైగారు కూడ సాయించి యుండిరి.

పిరాట్టికి పురుషకారత్వ ప్రాధాన్య హేతువు

సంప్రదాయ గ్రంథముల యందు ఉపాయత్వము చెప్పు ప్రమాణములునూ పురుషకారత్వమును చెప్పు ప్రమాణములనూ తుల్యములై కన్పట్టుచుండగా పురుషకారత్వానుగుణముగా ఉపాయత్వ ప్రతిపాదక వచనములను సమన్వయించుట యేల, ఉపాయత్వానుగుణముగానే పురుషకారత్వ ప్రమాణములను యోచింపరాదా అనవచ్చును. అందుకు నీదు పూర్తి ఉపాయత్వ ప్రతిపాదక ప్రమాణములు. ఉపాయత్వములో నన్వయము మాత్రమే చెప్పుచున్నవి గాని పురుషకారత్వమును నిషేదించుట లేదు. పురుషకారత్వ పరములైన ప్రమాణములు

లక్ష్మీః పురుషకారత్వే నిర్ధిష్టా అని చెప్పుచూ నాన్యథా లక్షణం భవేత్

అని గూడ చెప్పుచుండుట చేత కేవలాన్వయ మాత్రముగానే కాక వ్యతిరేకముగా గూడ చెప్పుట, ఉక్తార్థ దార్ఢ్యమునకు మిక్కిలి తోడ్పడును. కావున పురుషకార ప్రమాణములే ప్రబలములని తేలుచున్నది. అదియును గాక మమాపి చ మతమ్ అనుట చేత భగవదభిమతమదియే యని సిద్ధమగుచున్నది.

పిరాట్టికి గూడ మాం నయేద్యది ఇత్యాది వచనముల వలన నదియే యభిమతమని తెలియుచున్నది. సత్సంప్రదాయము గూడ నట్లే యున్నది గదా, కావున అట్లు ఉపాయపర వాక్యములను, పురుషకార వాక్యములకు అనుగుణముగా యోజించుటయే యుక్తము, కాని విపరీతముగా యోచించుట యుక్తము కాదు. ఇంకను, పిరాట్టి ఉపాయత్వమును ప్రమాణములు చెప్పుచున్నను లక్ష్మీ విశిష్టుడు ఉపాయమను దానిలో విశేష్యభూతుడగు ఈశ్వరునకే ప్రాధాన్యమునూ, విశేషణ భూతురాలగు లక్ష్మికి అప్రాధాన్యమును సిద్ధించుచున్నవి.

పురుషోత్తముడగుట వలన వచ్చెడి స్వాతంత్ర్యము చేత ననిష్ట నివృత్తియు, ఇష్ట ప్రాప్తియు, గలిగించి కృప చేయు వాడు ఈశ్వరుడే, అది చూచి సంతోషించి తాను ఆయనను అనుసరించుటయే యామె స్వభావమని తాత్పర్యము.

ఇక ప్రత్యేకముగా శ్రీ శ్రియఃపతులుపాయభూతులని చెప్పెడి స్థలములలో భగవంతునకభిమతయై అనురూపురాలై యుండునట్టి ప్రాధాన్యమును బట్టియే, ఈమె చెప్పినట్లాయన చేయునను నిశ్చయమును మూలముగా చేసికొని, చెప్పినట్లు తెలియవలెను. అందుచేతనే రహస్యామృతమను గ్రంథములో వాదికేసరి అళగియ మణవాళ జీయర్ ఉపాయవిశేషణమాన

విగ్రహాదిగళిల్ శుభాశ్రయత్వత్తలే విగ్రహత్తుక్కు అనన్వయ మాగవుమ్,

గుణంగళిల్ వాత్సల్యాది గనుక్కు ఆశ్రయణీయత్వత్తిలుమ్

జ్ఞాన శక్త్యాదిగళుక్కు కార్యకరత్వత్తిలుమ్ అన్వయమాగిఱాప్పోలేయుమ్,

ఇతర గుణంగనుక్కు తనిత్తనియే కార్యభేధముండా ప్పోలవుమ్

లక్ష్మికు్కు పురుషకారభావత్తిలే అన్వయ మెన్టు నిష్కర్షిక్షపట్టదాయిత్తు అని ధృఢముగా సాయించి యుండిరి.

శ్రీకి పురుషకారత్వమున శిష్ట సమ్మతి

పెరియవాచ్చాన్పిళ్ళైగారు పరందరహస్యములో గూడ వెనుక నిరూపించి చూపిన విధముగా ద్వయపూర్వ వాక్యములోని శ్రీమత్పదముతో పాటు చెప్పబడిన నారాయణ శబ్దాంతర్గత కళ్యాణ గుణములను బోధించు నార పదము చేత సిద్ధమగు గుణములను గూడ శ్రీమత్పదబోధకమగు లక్ష్మితో కలిపి చెప్పినందున లక్ష్మికుపాయత్వ ముండవలసి యుండుననియు, కాబట్టి యట్టి గుణములతో బాటు నీమెకు గూడ నుపాయవయవ రూపముగా నన్వయమే తప్ప స్వతంత్రోపాయత్వముండబోదు అనియు, తల్లిదండ్రుల కురువురుకును సంతాన రక్షణములో సమానమైన ప్రాప్తియుండుటచే నీమెకు పేరిమాఊద అనియెడి ఆళ్వార్ల శ్రీసూక్తిలో స్వతంత్ర రక్షణ కర్తృత్వము చెప్పబడి యున్నట్లు తోచినను, అట్టిది, ఉపాయ విరోధి నిరసన మందే తాత్పర్యమై ప్రదేశాంతరములో ఆయాళ్వార్లే. ఈమెకు పురుషకారత్వమే యుండునని చెప్పుట చేత పర్యవసించుననియు, ఇంకను ఈమెకు గుణముల వలె విశేషణత్వముండినను, విశేషణ భూతములగు గుణములకు వలె ఆశ్రిత సమాశ్రయణోప యోగిత్వము, ఆశ్రిత కార్యాపాదకత్వము, స్వతంత్రముగా లేక స్వాతంత్ర్య నివర్తకత్వ మాత్రములోనే అన్వయము నుండి సమాశ్రయణోప యోగియును సౌశీల్య విరోధియును, నగు స్వాతంత్ర్య నివృత్తిచే పురుషకారముగా నుండి చేసినను, సర్వేశ్వరుడు కార్యము చేయునప్పుడు రక్ష్యాపేక్షాం ప్రతీక్షతే అని చెప్పినట్లు చేతనుని ఉపాయ ప్రార్థనా రూపమైన ప్రపత్తి గూడ నపేక్షితమై యుండుట చేతను, ఆమె కుపాయత్వములోన స్వయములేదు.

వినై తీర్కుమ్ అను శ్రీసూక్తికి కళై వాయ్

తున్బమ్ కళైవా దొళియాయ్ కళైగణ్ మత్తిలేన్

అని తదేకోపాయత్వమును, చెప్పిన వారిదై యుండుట చేత నా తిరువాయ్ మొళి ననుసంధించు వారి పట్ల ఆమెకుండు ఆదరాతశయమును సూచించుటయే తాత్పర్యమై ఈమెకు పురుషకారత్వములోనే తాత్పర్యము అనియు సాయించి యుండిరి.

మరియు పిరాట్టికి, ఉపాయత్వములో అన్వయముండినచో సాధన భూతములుగా చెప్పబడిన కర్మజ్ఞాన భక్తి ప్రపత్తులకు గూడ ఉపాయత్వములో నన్వయముండవలసి వచ్చును. అట్లుగాక ఫలమత ఉపపత్తేః అను వ్యాససూత్రమును బట్టియు, కర్మాదులకు, ఫలప్రదత్యము లేనట్లే. శ్రీకి గూడ ఫలప్రదత్వరూపో సాయత్వము లేక ఫలప్రదాన మందుపకారకత్వ రూప పురుషభాదత్వమే యుండును. ఈమెకు స్వతంత్రముగా ఫలప్రదాన శక్తియే యున్నచో

యస్సర్వజ్ఞ స్సర్వవిత్ పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే,

తేజోబలైశ్వర్య మహానబోధ సువీర్య శక్త్యాది గుణైకరాశిః

అను శ్రుత్యాది ప్రమాణ సిద్ధమగు జ్ఞాన శక్త్యాది గుణ విశేషములు. ఈశ్వరునకులేని వగును. అట్టి గుణములన్నవని అంగీకరించినపుడు ఈమె సంబంధము లేకుండగనే ఆయన, స్వతంత్రముగా ఫలము నివ్వగలుగును.

అట్లునుగాక, అట్టి గుణములాయనకు ఉండునట్లు చేయునది. యామెను యనినచో గుణములకు స్వాభావికముగా స్వామియందుండెడి స్థితియే పోవును. అట్లును గాక, సౌశీల్యాదులు స్వాతంత్ర్య గుణము చేత దిరోహితములైనట్లు స్వాభావికములైనను, తిరోహితములై యున్న జ్ఞానశక్త్యాదులకు నీమె ప్రకాశకురాలగుచున్నదని

యనినచో, జగత్సృష్ట్యాదులలో విచ్ఛేదము లేకుండ వినియోగపడుచుండు జ్ఞాన శక్త్యాదులకు సౌశీల్యాది తిరోధాయకమగు స్వాతంత్ర్యము వంటి తిరోధాయకము ఏదియు లేదు కదా, ఉన్నచో సృష్ట్యాదుల విచ్ఛిన్నమనుగా జరుగకుండ నుండ వలసివచ్చును కదా, అట్లును గాక ఆమె నిత్య సన్నిహిత గావున నట్టి విరోధ నివృత్తి అవిచ్ఛిన్నముగా జరుగవచ్చుననిచో, ఆమె స్వవిరోధి యందు గూడ తత్తస్య సదృశం భవేత్ అని యాయన యందే భారముంచి యుండవలసిన పనిలేదు. ఆయన యందుండు గుణ విశేషములు, స్వతంత్రముగానే కార్యాపాదకములను తాపము చేతనే కదా.

ఆశంసే యం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః ।

అంతరాత్మా చ మే శుద్ధః తస్మింశ్చ బహవో గుణాః ॥

అనగా ఓ ఆంజనేయా, శీఘ్రముగా నా పతి నన్ను చేర్చుకొనునని యాశించుచున్నాను. నా యంతరాత్మ (మనస్సు) ఏ దోషమును లేక శుద్ధమై యున్నది. ఆయన యందనేక కల్యాణ గుణములు గలవు. అని పిరాట్టి చెప్పి యుండెను. అనగా, తన యందనన్యోపాయత్వమును, నాయన పట్ల పుష్కల గుణ సంపత్తియు నుండుట చేత ఫలసిద్ధి కవి హేతువులగునని స్థాపించెనని తాత్పర్యము.

అయితే, మనముపాయముగానే యొక ఈశ్వర వస్తువును గ్రహించు చున్నామో యీ వస్తువునకు ఈమె యొక్క స్వరూపము, నిరూపక భూతమగుట చేత, ప్రణవములో మొదటి పదమగు ఆకారములో శ్రీ సంబంధము, యద్యపి సచ్ఛిత్తః ఇత్యాదిద్రవిడ భాష్యకార వచన సిద్ధమైన గుణ సిద్ధిన్యాయముగా, అవర్జనీయమై, యన్వయించునేమో యనినచో, స్వరూప నిరూపకముగా నవర్జనీయ సంబంధముండినను ఉపాయ దశలో కాదగిన ప్రయోజనమేదియు లేనందున స్వరూప నిరూపకములగు జ్ఞానానందాదుల వలెను, నిరూపిత స్వరూప గుణముల వలెను, నణగియే యుండును.

శ్రీ సంబంధ జ్ఞానానందాదులకు ప్రయోజనము. ఉపాయదశలో భగవంతుని యొక్క నైరపేక్ష్యమే యైనచో జ్ఞాన శక్త్యాదులు ఉపాయముగా నన్వయించుట ఎట్లు బొసగుననినచో ఆ గుణములు కార్యోపయోగులగు గుణములగుట చేత సపృథక్సిద్ధములుగా నుండును కావున తమకాశ్రయమగు గుణిద్వారా, కార్యములో నుపయోగించుట ఆయన నైరపైక్ష్యమునకు భంజకములు గాకుండును.

అందువలన ప్రతిబంధకము లేదు. ఇక పిరాట్టియో, ఉపాయ కార్యములో ననుపయుక్తురాలగుట వలనను గుణము గాక ద్రవ్యముగా నుండుట వలనను, పృథక్సిద్ధి ప్రవృత్తులలో యోగ్యత యుండుట చేతను, ఉపాయ భావములో నన్వయముండబోదు. అది యెట్లనగా, ద్రవ్యమగు దండము పురుషునకు విశేషణమై పృథక్సిద్ధి ప్రవృత్తులు గలదగుట వలన పురుషుని యావత్కార్యములలోను నన్వయము లేనిది అయినట్లే యని తెలియవలెను.

అందువలననే ఆ దండము పురుషునకు విశేషణము కావలసినప్పుడు మత్వర్థీయ ప్రత్యయము చేరి దండీ యని చెప్పవలసి వచ్చును. అట్టిదే పిరాట్టి సంబంధమగుట చేత, ద్వయపూర్వ వాక్యములో నారపదాంత ర్భూతురాలుగా చెప్పబడక ప్రత్యేకముగా శ్రీమత్పదము చేతనే చెప్పబడెను.

అందువలన శేషిత్వ దశలోను ప్రాపత్వ దశలోను శ్రీశ్రియః పతి రూప మిథునమే, అయి యుండ వలసినట్లు ఉపాయదశలో సర్వేశ్వరునకు స్వేతర సకల సహాయము సహింపరానిదైనందున పిరాట్టికి నుపాయత్వములో నన్వయముండదు. కేవల పురుషకార భావములోనే యన్వయముండును అని విపులంగా చర్చించి సాయించిరి.

మరియు నాపెరియవాచ్చాన్పిళ్ల గారే తమ గద్య త్రయ వ్యాఖ్యానములో శ్రీవల్లభ అను పదమునకు వ్యాఖ్యానము చేయుచు ఇవ్వాల్లభ్యం పురుషకారభావత్తుక్కుమ్ ప్రాప్యత్తైక్కు మురుప్పాయిటుక్కుమిటే అనగా ఈ శ్రీవల్లభత్వము పురుషకారత్వమునకును, ప్రాప్యతకును నుయుక్తమై యుండునని వ్యాఖ్యానించించిరి. ఇంకను, శ్రీమత్పదము ప్రయోగింపబడిన యన్ని చోట్లన్ను లక్ష్మికి పురుషకారత్వమే యుండునని ధృఢముగా చెప్పి యుండిరి. అట్లు పెరియవాచ్చాన్పిళ్లై మొదలగు దివ్య ప్రబంధ పరిశీలనము నందు ప్రవీణులై, శ్రేష్ట ప్రామాణికులైన వారు సాయించుట చేత లక్ష్మికి పురుషకారత్వమే వారికి అందరకును సమ్మతమని చెప్పక తీరదు.

ఇట్లు స్వయముగా శ్రీశ్రియఃపతులకునూ పూర్వాచార్యులకు, మహర్షులకు, నత్యంత సమ్మతమై యుండుటయే గాక వారందరకును శ్రీకి ఉపాయత్వము లేదని గూడ నభిప్రాయమై యున్నదని స్పష్టము. లక్ష్మికి నుపాయత్వములో నన్వయముండునను వారు తత్పరిశీలన లేని వారని చెప్పక తప్పదు.

శ్రీకి అనుపాయత్వ నిగమనము

శ్రీ నైనారాచ్చాన్పిళ్లైగురు కూడ, శ్రీశాది సమస్త సదాచార్యాభిమతము, లక్ష్మికి, అనుపాయత్వమే యనియు, లక్ష్మికి విభుత్వమును నిరసించు సందర్భమున తుదిని ఈ లక్ష్మీ విభుత్వోపాయత్వములు, ప్రమాణ ప్రసిద్ధములు సంప్రదాయ సిద్ధములును గావనియూ, దీనికి వ్యతిరేకముగా నేకొందరో రహస్య రూపముగా నుపదేశించి జగత్తును మోహింపచేయు వారుగా నుండినచో, నట్టి వారు అస్మదాచార్య పరంపర చేత నంగీకరింపబడనివారై యుండుట నిశ్చయముగాన మాచేతను గూడ, వారాదరింపబడరు, అనియు ఘంటాపదముగా సాయించిరి. కావున సత్సమ్మతమైన లక్ష్మీపురుష కారత్వమే రామానుజ సిద్ధాంత సిద్ధమని తెలియవలెను.

సదాచార్యోపాయత్వ విచారము

అట్లయినచో సదాచార్యునకుండెడి ఉపాయత్వమున్నూ నట్లే నిరస్తముగారాదా ఆనినచో నట్లుగాదు. ఆచార్యులు శ్రియఃపతి యొక్క సాక్షాత్స్వరూప రూపులగుటచే, నుపాయత్వము తప్పక సిద్ధించును. స్వరూపత్వ మూలముగా నుండు చేతనత్వము చేత వచ్చెడి పిరాట్టికి వలె నుండు పురుషకారత్వము కూడ గలదు. ఎట్లనగా పరవ్యూహ విభవాంతర్యామ్యర్చలతో పాటు ఆచార్యావతార మారవదిగా చెప్పబడుట చేతను, ఆచార్య స్సహరి సాక్షాత్ గురు రేవ పరం బ్రహ్మ ఇత్యాది ప్రమాణముల వలన విలక్షణాత్మ విశిష్ట భగవత్స్వరూపమే ఆచార్యుడను సదుపదేశము చేతను, ఉపాయత్వ పురుషకారత్వములు రెండును. సదాచార్యునకు ఉండుటకు ఆటంకము లేదు. దీనికి ప్రమాణములు

అర్చాచార్యావతారాద్యా .... షాడ్విధ్యం మే ప్రకీర్తితమ్,

ఇత్యాది శ్రీభగవచ్ఛాస్త్రములోని ప్రమాణముల నిది వరకే సదాచార్య ప్రకరణములో చూపబడినవి.

ఇరామానుశనూత్తందాదిలో గూడ **ఇడుమే వినియ శువర్కతిల్ .... మనమే నైయల్ మేవుదత్కే** అనియూ నాచార్యునకు ఉపాయత్వము స్పష్టము.

పిరాట్టికి అణుత్వ స్థాపనము

అట్లగుచో, ఆచార్యుడు సాక్షాత్తు భగవంతుడే యని ప్రమాణమున్నను, అణు స్వరూపముగల జీవకోటిలో నంతర్భూతుడైన ఆచార్యునకు ఉపాయత్వము గూడా యున్నట్లే. యథా సర్వగతో విష్ణు స్తథేవేయం ద్విజోత్తమ ఇత్యాది ప్రమాణముల చేత విభుత్వము గల పిరాట్టికి, ఉపాయత్వము గూడ, నేలయుండరాదు, అని కొందరు ప్రశ్నింతురు. అట్లు కాదు, అసలు పిరాట్టికి స్వరూపము చేత విభుత్వముండదని, పెరియవాచ్చాన్పిళ్లైగారు

సాయించుట చేత, ఆమెకు అణుత్వమే స్వరూపమే యున్నది. నిత్యుల వలెను, ముక్తుల వలెను, అసంకుచిత శ్రీత జ్ఞాన వ్యాప్తి మాత్రముండును. లక్ష్మికి విభుత్వము లేదని నైనారాచ్చాన్పిళ్లై, తమ తత్త్వసంగ్రహములో నిట్లు చర్చించి నిశ్చయించిరి.

ఏవమాత్మనామణుత్వే కథం వ్యవహారః యథా సర్వగతో
విష్ణుస్తథైవేయం ద్విజోత్తమ ఇతి శ్రియః అత్రాహుః నేయమాత్మ
స్వంతర్భూతే తి. కథమిద మనంతర్భావ వచనమ్,
భోగ్యాంతర్భావాత్, భోక్త్రం తర్భావాత్ ఈశ్వరాంతర్భావాత్,
కోటి త్రయాతిరిక్తత్వాద్వా నాద్యః జ్ఞత్వాజ్ఞత్వ విరోధాత్
సతృతీయః ఈశ్వరద్విత్వా సంభవాత్, నచ తురీయః
ఈశ్వర ద్విత్వా సంభవాదేవ తయోః స్వాజ్ఞావ్యాఘాతేన
అనీశ్వరత్వా పత్తేశ్చ అత ఏవ ఉక్తమ్ ఈశతే దేవ ఏకః ఇతి శ్రుత్యా

అనగా అట్లు ఆత్మల కణుత్వముండినచో నందు చేరియున్న లక్ష్మికి, విష్ణువునకు వలెనే సర్వగతత్వ వ్యవహారమెట్లు కుదురును అని ప్రశ్నించుకొని, యిచ్చట కొందరు లక్ష్మికి వుభుత్వమే యున్నదనియు, నీమ్ ఆత్మలలో చేరదనియు నందురు అని చెప్పుచు దాని పైని జీవులలో నరతర్భావము లేదని యెట్లు చెప్పనగును. ఆమెకు చేతన భోగ్య భూతమగు ప్రకృతిలో నంతర్భావమును బట్టియా, ఈశ్వర తత్వములో నంతర్భావమును బట్టియా? ఆ రెంటికి నతిరిక్తమగు నాల్గవ తత్త్వముగా నుండుటచను బట్టియా? అని వికల్పించుకొని జ్ఞానవత్తగు వస్తువగుట చేత జడరూప ప్రకృతిలో చేరదు. ఈశ్వర తత్వములు రెండగుట సంభవించును కావున ఈశ్వర తత్వములో చేరదు. తత్వత్రయాతిరిక్తముగా నాల్గవ తత్వమని చెప్పినచో చేరదు. తత్వత్రయాతిరిక్తముగా నాల్గవ తత్వమని చెప్పినచో నామెకు గూడ ఈశ్వరత్వముండుట వలన ఈశ్వరద్విత్వము సంభవించుటయే గాక రెండీశ్వర తత్వములకును పరస్పర స్వాజ్ఞావ్యాఘాతము గలిగి రెండీశ్వర తత్వములకు గూడ అనీశ్వరత్వమే సంభవించును. అందుకే ఈశ్వరుడొక్కడే యని శ్రుతి వాక్యము చెప్పుచున్నది. అని తాత్పర్యము.

ఇక పెరియవాచ్చాన్పిళ్లై గారు, చతుశ్శ్లోకి మూడవ శ్లోకము వ్యాఖ్యానములో సాయించినది యీ విషయమే యని లోగడ నిరూపింపబడెను.

నైనారాచ్చాన్పిళ్లై గారు తత్వత్రయాతిరిక్త వస్తువును అంగీకరింపకుండ చెప్పుటకు,

భోక్తా భోగ్యం ప్రేరితారంచ క్షరం ప్రధాన మమృతాక్షరం హరః క్షరాత్మానా వీశతే దేవ ఏకః

ఇత్యాది శ్రుతి ప్రమానములే యాధారమని తెలియవలెను.

అందుకై యట్టి విరోధమును పరిహరించుటకు లక్ష్మికి ఈశ్వర తత్వముతో నైక్యము చెప్పినచో నామెకు **హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ** ఇత్యాది ప్రమాణ సిద్ధమగు పత్నీత్వములోను **అస్యేశానా జగతో విష్ణుపత్నీ** అను ప్రమాణ సిద్ధమగు భగవత్తత్వభేదములోను, విరోధము వచ్చును. **శ్రీ శ్రియః పతుల కైక్యమును** బోధించు ప్రమాణ వచనములకు, ఆమెకు అత్యంత పారతంత్ర్యము చేత వచ్చుననినా భావమును సూచించుటయే తాత్పర్యముగా గ్రహింపవలెను.

భేద ప్రతిపాదక ప్రమాణములు స్వరూప భేదమును చెప్పునని తెలియవలెను. మరియు నామెకు గూడ ఈశ్వరత్వమును స్వతంత్రముగా నుండినచో, **అన్యోన్యాజ్ఞావ్యాఘాతము** సంభవించి శ్రీ శ్రియః పతుల కిద్దరకును అనీశ్వరత్వమే ప్రసక్తమగును. వెనుక చూపిన ప్రమాణములను బట్టి మూడేతత్వములని నిర్ణయింపబడుటచే, నాల్గవ తత్వము నంగీకరించుటకు ప్రమాణము లేదు. కాబట్టి పారిశష్యమును బట్టి జీవతత్వములోనే ఆమెకు అంతర్భావము సిద్ధము. అందువలన జీవ సామాన్యమునకు చెప్పబడిన **ఏషోఽణురాత్మా** ఇత్యాది శ్రుతిసిద్ధమగు అణుత్వమే ఆమెకు ఉండునని నిశ్చయింపవలసి యున్నది.

ఇందుమూలముగా నామెకు స్వరూప విభుత్వము లేదు. ఇక నామెకు జీవతత్వాంతర్భావమును అంగీకరించి, **అణుత్వము తదతిరిక్త జీవ** విషయమని చెప్పి **జీవత్వేసతి విభుత్వం** అని ఆమెకు విశేష లక్షణము చెప్పినచో **యత్ర యత్ర జీవత్వం తత్రాణుత్వం** అను వ్యాప్తి ననుసరించి **చేతనత్వేసతి అణుత్వం** అని జీవలక్షణముగా చెప్పునప్పుడు, ఆమె యందు వ్యాప్తి వచ్చును. అట్లే **విభుత్వేసతి చేతనత్వం** అను ఈశ్వర లక్షణము ఆమె యందు అతి వ్యాప్తమగును. ఇక జీవాణుత్వ శ్రుతి విరోధముండనే యున్నది. కనుకనే ముక్తుని చెప్పుచోట **సచాసంత్యాయ కల్పతే** అను ప్రమాణములో విభుత్వమర్థము చెప్పక, అసంకుచిత జ్ఞాన వ్యాప్తి మాత్రమే చెప్పబడెను. ఈ విషయము **ప్రదీపవదావేశ స్తథాహి దర్శయతి** అను బ్రహ్మ సూత్రములో ప్రతిపాదితమై యున్నది.

శ్రీకి వ్యాపకత్వాణుత్వముల సమర్థనము

అట్లయిననూ, ముక్తులకు జీవ సామ్యము చేత నవర్జనీయముగా అణుత్వము సిద్ధించినను, దానికి బాధక ప్రమాణము లేనందునను, అనుగ్రాహక ప్రమాణములే యుండుట చేతను, అణుత్వ మంగీకరింపక తప్పదు. కాని పిరాట్టికి జీవత్వ సామ్యము వలన ప్రాప్తమగు అణుత్వము. ఆమెకుండు వ్యాపకత్వ ప్రమాణములను బట్టి బాధకములగును కదా, యనినచో అట్లుకాదు. ఆమెకు చెప్పబడిన వ్యాపకత్వ ప్రమాణములకు, స్వరూప విభుత్వము నర్థము చెప్పక, విగ్రహ వ్యాప్తి ప్రతిపాదనమును చేయునవిగా యర్థము చెప్పవలసి యుండుట చేత నామె స్వరూపాణుత్వములో నవి బాధకములు గాజాలవు. విగ్రహ వ్యాప్యి అనగా జ్ఞాన వ్యాప్తి చేత నిఖిల ప్రపంచ వ్యక్తుల యందు వ్యాపించుట యని తెలియవలెను. సౌభరికి గల జ్ఞాన వ్యాప్తి వంటిదని గ్రహింపదగును.

ఇట్లు ప్రమాణ వచనముల కున్నదున్నట్లుగా అర్థము చెప్పు. మరియొక విధమైన యర్థమును గల్పించుట యుక్తము కాదు, గాన పిరాట్టి విభుత్వ ప్రమాణ వచనములు ఆమె అణుత్వమునకు భంజకములు గావని చెప్పుట యుక్తమా అనినచో, వేదాంత శాస్త్రరీత్యా విభుద్వయాంగీకారము లేకుండుట వల్ల, విభుద్వయ ప్రసంగమే యచట బాధకమగుచున్నది.

అందువలన, నామె కణుత్వమవర్జనీయమని తెలియవలెను. అయితే కాలాదులకు గూడ విభుత్వముండుట చేత ఈశ్వరద్విత్వము రానట్లే. లక్ష్మీ,విభుత్వ ముండినను ఈశ్వరద్విత్మము రాకుండినచో, ఈశ్వరద్విత్వా పాదన మెట్లు విరోధించును, అనినచో కాలాదులకు చైతన్యానాధారత్వే నతి విభుత్వ ముండుటచే, చైతన్యాధారత్వేసతి విభుత్వముందు ఈశ్వర లక్షణను, వాని యందతి వ్యాప్తము కాదు. చైతన్యానాధారత్వేనతి విభుత్వ ముందుటచే, చైతన్యాధారత్వేసతి విభుత్వముందు ఈశ్వర లక్షణము. వాని యందతివ్యాప్తము కాదు. చైతన్యాధారమైన లక్ష్మీయందు, విభుత్వము గూడ నంగీకరించినచో, అతివ్యాప్తమై, ఈశ్వర లక్షణ మామెయందు గూడ వర్తించి, ఈశ్వర ద్విత్వము సంభవించును. అందువలన లక్ష్మికి, అణుత్వమే యుండుననుటలో నద్దులేదు. ఈవిధముగానే

పెరియవాచ్చాన్పిళ్ళైగారు నిర్వహించి యుండిరి. కాబట్టి

దేవ జుష్టా ముదారామ్ అహంతా బ్రహ్మణస్తస్య సాహమస్మి సనాతనీ,

గుణైర్విలాసై రూపైశ్చ స్వాత్మనా చాత్మనీశ్వరమ్ నియచ్ఛంతీ

మఖిలాద్దాణ్డ నియన్త్రీం చ స్తుమ శ్రియమ్ ॥

నిత్యైవైగా జగన్మాతా యథా సర్వగతో విష్ణుః

త్వయా చ విష్ణు నా చాంబ జగద్వ్యాప్తం చరాచరమ్

అగంగిల్లేన్ శాంతానంత విభూతి పరమం,

ఇత్యాది శ్రుత్యభియుక్త వచనములకు, తాత్పర్యముగా

నజీవేయమ్ అస్యాదేబ్యా మన స్తస్మిన్ దేవత్వే దేవ దేహేయమ్,

యది మనుజతిరశ్చాం బహుధా విజాయతే,

అస్యేశానా జగతో విష్ణుపత్నీ అను ప్రమాణ జాలము ననుసరించి భగవత్పత్నీత్వ ప్రయుక్తమైన స్తుతి రూపత్వమే చెప్పవలెను.

భట్టరు సాయించిన **శ్రియః శ్రీః ..... స్ఫుటతు భుజయోః కంచుక శతమ్** అను శ్రీగుణరత్న కోశమందలి, స్తుతి వంటివనియే చెప్పవలెను. స్తుతి అనునది యెప్పుడును లేని గుణములను చెప్పి యానందింపచేయ ప్రయత్నించుటయే కదా, అట్లు స్తుతి పరములుగా గాక యథాశ్రుతార్థమునే వానికంగీకరించినప్పుడు,

దేవతిర్యజ్మనుష్యేషు పున్నామా భగవాన్ హరిః ।

స్త్రీ నామ్నీ శ్రీశ్చ మైత్రేయ నానయో ర్విద్యతే పరమ్ ॥

అను శ్రీవిష్ణుపురాణము నందలి వచనమునకు గూడ యథా శ్రుతార్థమును చెప్పి పురుష స్త్రీ రూపములతో నున్న భగవంతునకును లక్ష్మికిని చేతనానుభావ్య పుణ్యపాపానుభవముండునని యంగీకరింపవలసి వచ్చును. కావున శబ్దమున కర్ధము చెప్పునప్పుడు, ఉన్నదున్నట్లు చెప్పుట యొక్కొక్కప్పుడు తగదు.

బ్రహ్మయోనిమ్ అను దానికి బ్రహ్మ యొక్క ఉత్పత్తి ద్వారమగు గుహ్యావయవమని గాని, బ్రహ్మ మను గుహ్యావయవము నుండి పుట్టినది, యని గాని యర్థము చెప్పుట హాస్యాస్పదమే కదా. అందువలన సత్సంప్రదాయము ననుసరించి యర్థనిర్ణయము చేయుటయే వివేకఫలమగును.

కాగా **లక్ష్మీః పురుష కారత్వే నిర్ధిష్టా పరమర్షిభిః మమాపి చ మతం హ్యేతత్ ।**

ఇత్యాది భగవత్సూక్తి ననుసరించి లక్ష్మికి పురుషకారత్వమే, స్థిరలక్షణమవి ప్రమాణ పరతంత్రులు గ్రహింపవలెను.

పిరాట్టి పురుషకారకత్వములో దేశికుల సమ్మతి

శ్రీకవితార్కిక సింహులగు వేదాంత దేశికులు తాము రచించిన రహస్య రత్నావళీ హృదయమను గ్రంథమందు, పిరాట్టికి, పురుషకారకత్వమే కాని ఉపాయత్వము లేదని నిశ్చయించి చెప్పి యుండిరి. అది యెట్లనగా,

సర్వస్వామియాయ్ సర్వేశ్వరనుక్కు శేషమాయ్

సహధర్మచారిణియాన పిరాట్టి ఇత్తవైయిల్

వాత్సల్యాతిశయత్తాలుమ్, అత్తవైయిల్, వాల్లభ్యాతిశయత్తాలుమ్,

పురుష కారమాయ్ కొణ్డు జీవర్గళుక్కు త్తఞ్జ మాగిఱాళ్

అనగా సమస్త ప్రపంచమునకు స్వామినియై, సర్వేశ్వరునకు శేషభూతురాలై భార్యయై సహధర్మచారిణియగు పిరాట్టి, చేతనుల యందు వాత్సల్యము చేతను భర్త యొద్ద నుండు వాల్లభ్యము చేతను పురుషకార భూతురాలై జీవకోటికి రక్షకురాలగుచున్నది అని సాయించుచు, దానికుపష్టంభకముగా నీ క్రింది ప్రమాణజాలమును చూపిరి.

సర్వేషామేవ లోకానామీశ్వర మమ వల్లభా, నిత్యై వేషా జగన్మాతా
విష్ణో శ్రీః రసపాయినీ విముక్తి ఫలదాయినీ, ఆర్యా,
యశోదా వసుదా ధర్మకామార్ధ మోక్షదా
వాచః పరం ప్రార్థయితా ప్రపద్యే నియతః శ్రియమ్,
మామేకం దేవదేవస్య మహిషీం శరణం వ్రజేత్
సంసార్ణవ తారిణీమ్ అలమేష పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్
అలమేషా పరిత్రాతుం రాఘవా ద్రాక్షసీగణమ్

అని యిట్లు ప్రమాణ పరంపరలను జూపుచు పై ప్రమాణములతో చూపబడిన సర్వశేషియగు భగవంతునకు తప్ప మిగిలిన ప్రపంచమునకు జూపబడిన సర్వశేషి యగు భగవంతునకు తప్ప మిగిలిన ప్రపంచమునకు శేషిత్వమును నిగ్రహలేశము లేకుండ కేవలము సర్వానుగ్రహత్వము మొదలగు స్వభావ విశేషములు గల పిరాట్టి సావరాధులగు చేతనులందరకు శాసితగా నుండు సర్వేశ్వరుని ముఖమును చేతనులు చూడజాలక భయపడుటకు అవసరము లేకుండ ఆయన యొక్క హితపరత్వ ప్రయుక్తమైన ఆగ్రహమును ఉ చితై రుపాయై ర్మిస్మార్య అని చెప్పిన రీతిని, బహువిధోపాయముల చేత పోగొట్టి ఈ చేతనులను ఆయన చరణముల యందు చేర్చి **తన్నడి యార్తిఅత్తగత్తు తామరై యాళాగిలుంశితగుతైక్కిమమ్ । ఎన్నడి యారదుశెయ్యార్** తన దాసులైన చేతనుల విషయములో నొకప్పుడు పిరాట్టి, తాను ఎవరైనను నేరముల చెప్పినను నాదాసులట్లు చేయరు అని ఆయన అభిమానించునట్లు చేసి **భవేయం శరణంహి వః అని సీతా పిరాట్టి** చెప్పినట్లు, చేతనులను రక్షించుటలో హేతువగుచున్నది అని సాయించిరి. ఇంకను

ఇవళ్ పురుషకారా మాగ వేణ్డువదు, ఈశ్వరన్ దణ్డధరనాగై యాలే

ఈమెకు పురుషకారము సిద్ధించునది ఈశ్వరుడు చేతనుని యపరాధానుసారముగా శిక్షకుడగుటచేతనే యని యారంభించి **అనతిలంఘనీయవాక్యైయాన విష్ణుపత్నియై పురుషకారమాగ వేణ్డుగిఅదు,** తన మాటను జవదాటనట్లుండు సర్వేశ్వరుని పత్నిని పురుషకారముగా చేసికొనవలసియుండెను అని ముగించిరి. దీని వలన వేదాంత దేశికుల యభిప్రాయము గూడ పిరాట్టికి పురుషకారత్వమే యని స్పష్టపడుచున్నది.

ఇట్లు శాస్త్ర సమ్మతమై సదాచార్యాను మతమై యుండిన సిద్ధాంతము ననుసరించి, ప్రపత్తి బద్ధుడగు శ్రీమన్నారాయణుడు మాత్రమే స్వతంత్ర సిద్ధోపాయమని చెప్పుటకు ఆటంకము లేదు. దాని వలన సర్వచేతన సమాశ్రితచరణుడుగు సర్వేశ్వరుడు చేతనుని యాభిముఖ్య సూచకముగా, శరణ వరణ రూపమైన అపేక్షను ప్రతీక్షించుచు **సకల ఫలప్రదో హి విష్ణుః** అను రీతిని సమస్త పురుషార్థములను కటాక్షించుచుండునని తెలియవలెను. దీని వలన శ్రీమన్నారాయణుని అగతిక గతిత్వము సుప్రసిద్ధమని శ్రీవైష్ణవోత్తములెఱుగవగును.

సిద్ధోపాయ ప్రకరణము ముగిసెను.

శ్రీపాంచరాత్ర ప్రామాణ్య ప్రకరణము

శ్రీవైష్ణవులకు ద్రవిడ వేదాధ్యయనావశ్యకత

సిద్ధోపాయనిష్ఠులగు శ్రీవైష్ణవులకు

ఋచో యజూంషి సామాని తథై వాధర్వణానిచ ।

సర్వమష్టాక్షరాంతః స్థల యచ్చాన్యచపి వాఙ్మయమ్ ॥

అని చెప్పబడిన రీతిని నాలుగు వేదముల యొక్కయు నితర వాఙ్మయము యొక్కయు, సంగ్రహరూపమగు నష్టాక్షరీ బ్రహ్మ విద్యకు, వివరణరూపమైన, ద్రావిడ దివ్య ప్రబంధములయందు నిరవధికమైన యాసక్తియు, నమ్మకమును, గలిగియుండవలసిన యావశ్యకత గలదు. ఇదియే సిద్ధోపాయ భూతుడగు శ్రీహరికి ముఖ్య తాత్పర్యము. ఆ ద్రావిడ దివ్య ప్రబంధములకుండు అతిశయమెట్టిదో విచారింతము.

మార్కండేయ పురాణములో మధ్యభాగమగు భగవద్ధర్మములో నాఅవయధ్యాయములో నిట్లు చెప్పబడినది.

కృపయా తత్ప్రణీతాంతు బ్రహ్మ విద్యాం మహత్తరామ్ ।

అధ్యేష్యంతి ద్విజా భూపా వైశ్యా శ్శూద్రాశ్చ సర్వశః ।

ఏషాచ వేదగాధావ న్నిత్యా ద్రావిడ సంహితా ।

.... సంస్కృత శ్రుతయో యద్వ త్తథా ద్రావిడ సూక్తయః ॥

అనగా అతిదయతో దివ్యసూరులు, సాయించిన బ్రహ్మ విద్యారూపమై మిక్కిలి గౌరవింపదగిన దివ్య ప్రబంధజాలమును, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులందఱును నధ్యయనమును చేయుదురు. ఈ ద్రావిడ వేద సూక్తి గూడ, సంస్కృత వేదసూక్తి వలెనే, శ్రీహరివలన సృష్ట్యాది యందు తనలో లీనమైయున్న దానిని బ్రహ్మాది ముఖముగా వెల్లడింపజేయబడి, ఋష్యాదిత్యులగు దివ్య సూరుల ద్వారా లోకమందు వ్యాపింప చేయబడిన సంస్కృత వేదము వలెనే నిత్యమై యున్నది అని సనత్కుమారుని గూర్చి విష్వక్సేనులు స్పష్టముగా సంస్కృత వేదసామ్యము ద్రవిడ వేదమునకు చెప్పినట్లున్నది. కాన వైష్ణవ మాత్రులకు ద్రావిడ ప్రబంధాన్వయ మావశ్యకమై యున్నది. ఇంకను, కురుకామాహాత్మ్యమను గ్రంథమందు గూడ

అధ్యేతవ్యం ద్విజ శ్రేష్ఠైర్వేదరూపమిదం సదా ।

స్త్రీభి శ్శూద్రాదిభిశ్చైవ తేషాం ముక్తిః కరే స్థితా ॥

అనగా వేదరూపమగు దివ్యసూరి శ్రీసూక్తియగు ద్రావిడ దివ్య ప్రబంధము కేవల బ్రాహ్మణాదిత్రై వర్ణిక పురుషులే గాక, స్త్రీలు శూద్రులు గూడ నధ్యయనము చేయదగినది. అట్టి వారి కందఱకును ముక్తి స్వాధీనమై యుండునని స్పష్టబరచబడియున్నది.

ఈ ద్రావిడ వేదాధ్యయమును విధించునది **స్వాధ్యాయో ఉ ధ్యేతవ్యః** అను శ్రుతి వాక్యమే అని తెలియవలెను. ఏలననగా, **అనంతావై వేదాః** అని వేదముల కంతము లేదనుట వలనను, నట్టి వేదములు విశేషించి గైర్వాణా అనని చెప్పకుండుటచేతను, ఆ వేదములోనే ద్రవిడ వేదములు గూడ చేరునని తెలియవలెను. కాబట్టియే **భక్తామృతం .... నమామ్యహం ద్రావిడ వేదసాగరమ్** అని వేదమను సాగరములో నేకదేశమై,

కేవల భక్తి నిష్ఠుల కమృత ప్రాయమై యుండు శ్రీశఠకోపసూక్తి రూపమగు సామవేదాంతరూపమైన దివ్య ప్రబంధమును, సద్విజశ్రేష్ఠులగు మధురకవి నాథయామున యతివరాదులు మోక్షేచ్ఛతో మిక్కిలి ప్రీతి గలిగి అధ్యయనము చేసి యుండిరి.

శ్రీహరికి ద్రావిడ వేద మందత్యాసక్తి

తన ఆజ్ఞారూపమైన శ్రుతి ప్రమాణములోనే **స్వాధ్యాయో ఉ ధ్యేతవ్యః** అని విధింపబడినవై యుండు ద్రవిడోపనిషద్రూపమగు దివ్య ప్రబంధముల నధ్యయనము చేయుచు తన్నిష్ఠులై యుండు శ్రీవైష్ణవుల విషయమై, శ్రియఃపతికుండెడి ప్రీత్యతిశయము వేదోపబృంహణరూపమగు శ్రీభాగవత పురాణములో శ్రియఃపతి తానే స్వయముగా చెప్పినట్లున్నది.

న ప్రీతి రస్తి మమవక్షసి లాలితాయాం ।
లక్ష్మ్యాం తథా సకలభూతనిదాన సీమ్ని ।
మజ్జన్మ కర్మగుణబంధయుతా ప్రబంధాన్ ।
సంకీర్తయత్యనఘభక్త జనే యథైవ ॥

నా యొక్క ఐచ్ఛికావతారములను, అతిమానుష చేష్టికములను, అనన్య సాధారణ గుణములను, వర్ణించి చెప్పబడిన దివ్య ప్రబంధముల ననుసంధించుచు, పాపరహితులగు భక్త జనమందు నాకుండెడి ప్రేమ. నా వక్షస్థలమందు చేర్చి లాలింపబడునట్టియు, సమస్త జగద్విధానమునకు అనుమోదనమను ప్రకృష్టోపకారము చేయునట్టియు, లక్ష్మీయందు గూడ నాకుండబోదని చెప్పియుండెను. అందువలననే ఇప్పటికిని దివ్యస్థలములలో పెరుమాళ్ల గ్రామపర్యటనములో స్వామికి ముందుభాగమున దివ్య ప్రబంధాధ్యయన గోష్ఠియు, వెనుకను సంస్కృత వేదాధ్యయన గోష్ఠియు నుండుట శిష్టాచారమై యున్నది. దీనికి, ద్రావిడ వేదము నందు భగవంతునకుండు ఆదరమే కారణమని పెద్దలు వచించెదరు.

దాని కభియుక్తుల నిర్వాహము

శ్రీరంగరాజ వరప్రసాద లబ్ధావతారులై శ్రీరంగేశ పురోహితులై శ్రీవత్సాంకసుతులగు శ్రీపరాశర బట్టరొప్పుడు, మార్గళి (ధను) మాసము నందు, రాజ పురోహితులు, మొదలగునద్వైతాది మతస్థులు తమతో ప్రసంగించుచు, వ్యాస పరాశర ప్రభృతి మునివరులును, వారి శ్రీసూక్తులును నుండగా, నీయాళ్వార్ల ప్రబంధము అనే భగవత్సన్నిధిలో నాదరించుటకు కారణమేమి? యని ప్రశ్నింపగా, వారందఱి మనసులకును, తృప్తి గలుగునట్లు వెనుక వివరింపబడిన ప్రకారముగా ద్రావిడ వేదమునకు, వేదాంతర్భావము మొదలగు విషయముల నుపన్యసించి నప్రీతిరస్తి అను భాగవత శ్లోకములోని ప్రబంధ శబ్దమునకు, భగవదవతారాద్య పూర్వ విషయములను బోధించు దివ్య ప్రబంధములే యని, నిరూపించి యాళ్వార్ల యందును, వారి దివ్య ప్రబంధముల యందును, భగవంతునకుండెడి యత్యంత ప్రీతిని నిరూపించి యొప్పించిరి. ఈ విషయమునే తమచే విన్నవింపబడిన శ్రీరంగరాజస్తవములో,

విద్యంతే హి పరాశర ప్రభృతిభిః ప్రోక్తా ప్రబంధాః
పరాః భక్త్యా ఏవ హితే తథాపి సకలం ఉ త్యక్త్వా త్రరంగేశ్వరః ।

భక్తానేవ పరాంకుశాది పురుషాం స్తత్ప్రబంధాంశ్చ తాన్ ।
అత్యాదృత్య సదోపలాలయతి యత్తధ్ జ్ఞాపనం తత్ప్రియే ॥
అని స్పష్టముగా భట్టరు సాయించి యుండిరి.

అట్లే దాని నంగీకరించిన ఇతర మతస్థులు గూడ, శ్రీరంగాది దివ్య స్థలములలో నేటి వరకును ద్రావిడ దివ్య స్థలములలో నేటి వరకును ద్రావిడ దివ్య ప్రబంధాను సంధానమునకును, శఠకోపాది దివ్య సూర్య అర్చా బింబారాధనమునకును, సంమతితో ప్రోత్సాహమిచ్చుచున్నారు. అందువలన, భాగవత వచన మందలి ప్రబంధ శబ్దమునకు ద్రావిడ దివ్య ప్రబంధములే యర్థమని యభియుక్తుల సిద్ధాంతము. ఇంకను, సాక్షాత్తు అనంతుని అవతారముగా నంగీకరింపబడిన శ్రీరామానుజాచార్యుల వారు గూడ. ద్రావిడ వేదమంటే, యత్యంత ప్రావణ్యమును గలిగి రామానుజ దర్శనస్థులందరకును బోధించి తన్నిష్ఠులనుగా చేయుట గూడ నా దివ్య ప్రబంధములభియుక్త లాలితములై యున్నవని తెలియవలెను.

భాష్యకార శాసనమునకు తాత్పర్యము

శ్రీరామానుజాచార్యులు వారు తమ యవతార చరమదశలో శ్రీభాష్య ద్రవిడాగమ ప్రవచనం శ్రీశస్థలేష్వస్వహం కైంకర్యం ఇత్యాదిగా శిష్య ప్రశిష్యులకృత్యములనుపదేశించి యుండిరి. అందు శ్రీభాష్య ప్రవచనమునకు ముందు స్థానమిచ్చి, తరువాత ద్రవిడాగమ ప్రవచనమునకు స్థానమిచ్చుట చేత, వారికి శ్రీబాష్య ప్రవచనము నందే ముఖ్య తాత్పర్యమనియు, రెండవదిగా ద్రావిడ దివ్య ప్రబంధ ప్రవచనమనియు తాత్పర్యము చెప్పుట తగదు. ఏమనగా, అందఱకును నిష్టప్రాప్తి కంటె ముందుగా నవిష్ట నివారణము వాంఛనీయముగా నుండును గదా. కాన, శ్రీవైష్ణవ సిద్ధాంత సిద్ధమైన తత్వహిత పురుషార్థ స్వరూపములను నంగీకరింపని యితర మతములను నిరసించుట ప్రథమ కర్తవ్యము. అట్టి అనిష్ట నివారణమును, విపులముగా చేయునది శ్రీభాష్యము. శ్రీభాష్యము పరమత నిరసనమునకే ముఖ్యముగా నవతరించెను. అందువలన దాని ప్రవచనము ముందుపదేశించి, తరువాత భగవద్భాగవతాచార్య శేషత్వ పారతంత్ర్యములతో గూడిన భగవద్గుణానుభవ కైంకర్యములను ముఖ్యముగా బోధించు, ద్రవిడాగమ ప్రవచనము చెప్పబడెను.

ఆళ్వార్ల దివ్య ప్రబంధములలో, నితర మత నిరసనము క్వాచిత్కముగా చేయబడినను, తత్వహిత పురుషార్థములే సంపూర్ణ తాత్పర్యముతో చెప్పబడియున్నది. అందుకే, కలుపును తీసి చేనును పెంచినట్లు, ఇతర మత నిరసనము ముందుగా నావశ్యకమని తెలియవలెను. దీనిని బట్టి రామానుజ దర్శనము నందఱకును ద్రవిడోపనిషద్రూప దివ్య ప్రబంధాను సంధానమే ముఖ్యమని తేలుచున్నది. ఈ విషయములో

వచన భూషణ వాగమృతాశనం ।వచన భూషణ భూషిత మానసమ్ ।
పరిజనై స్సహ వాసిన మత్రతే । యతివరార్య సదైవ కురుష్వమామ్ ॥
అను నభియుక్తోక్తి ప్రమాణమ్

శ్రీభాష్యకారుల ద్రవిడ వేద ప్రావణ్యమ్

మరియు, రామానుజ భక్తులు ఆ **మోక్షం । లక్ష్మణార్యత్వత్ప్రబంధ పరిశీలనైః ।**
కాలక్షేపో ఉ_స్తు సస్సద్భి స్సహవాసముపేయుషామ్ ॥

అని శ్రీభాష్యకారుల విషయములో ప్రార్థించిన వచనములో ఎల్లప్పుడు శ్రీభాష్యకార శ్రీసూక్తి పరిశీలనముతోనే కాలక్షేపము జరుగవలెననియున్నది గదా అది యెట్లు సమన్వయించును. ద్రవిడ వేద పరిశాలనము అందు చెప్పబడలేదు కదా యనినచో, నట్లు శంకింప బనిలేదు. త్వత్ప్రబంధ పరిశీలనైః అను దానికి కేవల శ్రీభాష్య

మాత్రము గాక వారియితర ప్రబంధములగు గద్య త్రయాదులును, వారభిమానించిన, యాళ్వార్ల శ్రీసూక్తులన్నియును, నని యర్థము చెప్పుట సమంజసము.

ఈన్టముదల్ తాయ్ శడగోపన్ మొయ్మ్బాల్వళర్త ఇతత్తా యిరామానుశన్ అనగా తిరువాయ్ మొళిని గన్న తల్లి నమ్మాళ్వార్లు గానీ, హితముతో బెంచిన తల్లి రామానుజులే అనియు

ఎజ్ఞళ్కతియే యిరామానుశమునియే .....

మజ్ఞైయర్కో విన్దమత్తై యాయిరమనైయుమ్ తజ్ఞుమనమ్ నీయెనక్కుత్తా ॥

అనగా మాకు గతియగు నోరామానుజ మునీ, తిరుమజ్ఞమన్నరు సాయించిన ద్రావిడ వేద సారము నంతయు దెలియునట్లు విశదజ్ఞానమును నీవు మాకు కటాక్షింపుము అనియు చెప్పబడిన పూర్వాచార్య శ్రీసూక్తులు, దివ్య ప్రబంధములు గూడ రామానుజాభిమాన పాత్రములనుటలో ప్రమాణములు.

ఇంకను నూత్తందాది యందలి పణ్ణరు మాఅన్ కలిమిక్క శెన్నెల్ ఇత్యాది శ్రీసూక్తులు గూడ నిండు ప్రమాణములు మరియు శ్రీభాష్యకారులు, స్వయముగా విన్నవించిన

పద్మాసనో పవిష్టం పరపదయుగళీ నివిష్ట చైతన్యమ్ ।

పరతత్వ బోధముద్రం పరమాచార్యం పరాంకుశం వన్దే ॥

వకుళ ధవళ మాలా వక్షసం వేద బాహ్య ।

ప్రబల సమయవాద చ్ఛేదనం పూజనీయమ్ ।

విపులకురుకనాథం కారిసూనుం కవీశం ।

శరణ ముపగతో ఉహం చక్రహస్తేభ చక్రమ్ ॥

అనెడి శ్లోక ద్వయముగూడ శ్రీభాష్యకారుల కాళ్వార్లయందును, తదుక్తుల యందును, గల ప్రావణ్యమును వ్యక్తపరచుచున్నది. ఈ శ్లోకములు రెండును, కణ్ణినుణ్ శిరుత్తామ్బు వలెనే శ్రీరామానుజ దర్శనస్థులందఱు నిత్యమును ననుసంధింప వలసినవని సత్సంప్రదాయము.

పంచ సంస్కారములకు సకల వైదిక సమ్మతి

ఉభయ వేదాంతాచార్యులగు శ్రీయెమ్బెరుమానార్ల యభిమాన పాత్రులగు వారికి తత్సంబంధము గల సదాచార్యుని వద్ద **తాప పుండ్ర స్తథా నామ మంత్రో యాగశ్చ పంచమః** అని చెప్పబడిన పంచ సంస్కారములను పొందుట అత్యావశ్యకము. అయితే తాపాది సంస్కారములు పరమ ప్రమాణమగు శ్రుతి యొక్క సమ్మతిని పొందినవా అనినచో పొందినవి. అదియెట్లనగా,

పవిత్రం తే వితతం బ్రహ్మణస్పతే ప్రభుర్గాత్రాణి పర్యేషి విశ్వతః ।

అతప్త తనూ ర్నతదామో అశ్నుతే కృతాస ఇద్వహంత స్తత్సమాశత అని ఋగ్వేదము నందును,

చరణం పవిత్రం వితతం పురాణం యేన పూత స్తరతి

దుష్కృతాని తేన పవిత్రేణ శుద్ధేన పూతాః అని యజుర్వేదము నందును గలవు.

పవిత్రం చరణం చక్రం లోకద్వారం సుదర్శనం ।

పర్యాయ వాచకా హ్యేతే చక్రస్థః పరమాత్మనః ॥

సుదర్శనం సహస్రారం పవిత్రం చరణం పవిః ॥

అని వేద నిఘంటువు వలన పవిత్రమనినను, చరణమనినను, భగవంతుని చక్రాయుధమునకు పర్యాయపదములని తెలియుచున్నది. సామవేదమందలి మైత్రావరుణీయశాఖ యందు

పవిత్రమిత్యగ్నిః అగ్నిర్వై సహస్రారః సహస్రారోనేమిః

నేమి నాతప్తతనూః బ్రహ్మణస్సాయుజ్యం సలోకతామాప్నోతి అని చెప్పబడెను.

అథర్వణ మందు

చక్రం బిభర్తి వపుషాభితప్తం బలం దేవానా

మమృతస్య విష్ణోః । స ఏతి నాకం దురితా విధూయ

ప్రయాంతి యద్యతయో వీతరాగాః అనియు

చక్రమాదాయాగ్నౌ ప్రతప్య

బ్రాహ్మణస్య దక్షిణే బాహౌ ధారయేత్ ।

పాంచజన్య మాదాయాగ్నౌ ప్రతప్య

బ్రాహ్మణస్యోత్తరే బాహౌ ధారయేత్ । అనియునున్నది.

బృహదారణ్యక విశేషములో

బ్రహ్మవాదినో నదన్తి విచిక్షేప సుషణం భిద్యమానం

మధేబాహు మదధత్సుదర్శనమ్ ।విష్ణో రిదం భూరిద్ భూరితేజః

ప్రదక్ష్యతి దివానక్తం బిభృయు స్తజ్జనాసః అనియు,

కఠవల్లిలో **ధృతోర్ధ్వపుండ్రః కృత చక్రధారీ విష్ణుం పరం ధ్యాయతి**

యో మహాత్మా సర్వేణ మంత్రేణ సదా హృది స్థితం

పరాత్పరం యన్మహతో మహాంతమ్ అనియు నున్నది.

అందు కఠవల్లీ శ్రుతిలో, పంచ సంస్కారములు సుస్పష్టముగా చెప్పబడినవి. ఎట్లనగా, ధృతోర్ధ్వపుండ్రః అను దాని వలన పుండ్ర సంస్కారమును కృత చక్రధారీ అను దాని వలన చక్ర ధారణమును, తదుపలక్షితమై అథర్వ వేదోక్త పాంచజన్యధారణము గూడ చెప్పబడి, తాప సంస్కారము సిద్ధాంత మొనర్పబడెను.

యో మహాత్మా అను దాని వలన, ఉత్కృష్టాత్మ స్వరూపుడగు భగవంతునితో నామసామ్యము చెప్పబడి, మూడవదగు, నామ సంస్కారము చెప్పబడెను. స్వరేణ మంత్రేణ అను దాని వలన నాలుగవదగు మంత్ర సంస్కారమును, విష్ణు పరం ధ్యాయతి అను దాని వలన యాగరూపమగు భగవదారాధన సంస్కారమును చెప్పబడెను. అయితే మహాత్మా అను దాని వలన నామ సంస్కారమెట్లు చెప్పబడుననగా

యానినా మాని గౌణాని విఖ్యాతాని మహాత్మా యనగా

అను సహస్రనామాధ్యాయ వచనమును బట్టి మహాత్మాః అను సహస్రనామాధ్యాయ వచనమును బట్టి మహాత్మా యనగా మహావిష్ణునకు నర్ధమును గలిగి యిట్టి మహాత్మ స్వరూపగుణాది ప్రబోధకములగు నామములు భరించిన వారు గూడ మహాత్ములగుదురని నిశ్చయము గలిగినందును, మహాత్మ శబ్దము చేత నామ సంస్కారము సూచితమాయెనని తెలియవలెను.

ఇంకను, మహోపనిషత్తులోని బ్రహ్మ సూక్తములో ....

దక్షిణే తు భుజే విప్రో భిభృయాద్వై సుదర్శనమ్ ।

సవ్యేతు శంఖం బిభృయా దితి బ్రహ్మవిదో విదుః ॥ అనియు,

శతపథ బ్రాహ్మణములో .... అథ వాత్యాయనః పప్రచ్ఛ ।

యాజ్ఞవల్క్య ఇతి హోవాచ,

పృచ్ఛామి త్వాపరమంతం పృథివ్యాః ॥ పృచ్ఛామిత్వా భువనస్య నాభిమ్,

బ్రాహ్మణోజాయత ఇతి దేవస పితరోయేన విధృతేన బాహునా

ప్రయాతా స్స్వర్గలోక మాయన్ యేనాంకితా

మనవో లోకవృష్టిం వితన్వంతి బ్రాహ్మణా స్తద్వహంతి.

అగ్నినా వై హోత్రా తప్తం చక్రం ద్విభుజే ధార్య మిత్యూర్ధ్వపుండ్ర మాలిఖేత్

తస్మా ద్విరేఖం భవతి పునరాగమనం నయాతి బ్రహ్మణ స్సాయుజ్యం జయతి

య ఏవం వేద అనియు నింక నచ్చటనే

అథ కాత్యాయనః ప్రపచ్ఛ । యాజ్ఞవల్క్య ఇతి హోవాచ

జ్ఞానం వై పురుషో బ్రాహ్మణో జాయతే । సవై సద్బ్రాహ్మణో భవతి ।

భగవద్భక్తోర్ధ్వ పుండ్రీ వసిష్ఠః కాశ్యపో ఽ త్రి రగస్త్యః

జామదగ్ని ర్విశ్వామిత్రో యమోన్యాసః

పరాశరః సనకస్సనందనః శుకోవామదేవ స్సబ్రహ్మలోకో భవతి

తప్తం చక్రం ద్విభుజే ధార్యమితి, సవిష్ణులోకో భవతి ॥

సోఽ నంతలోకో భవతి ॥ పుణ్య లోకో భవతి ॥

య ఏవం వేద అనియు నున్నది. ఇట్టి ప్రమాణములను వివేకులు విచారించినచో పంచ సంస్కారముల కుండు ఋష్యనుమతి స్పష్టపడగలదు. ఈ శతపథ బ్రాహ్మణము ననుసరించియే పంచమవేదమగు మహాభారతములో శాంతి పర్వమందు యాజ్ఞవల్క్య కరాళజనక సంవాదములో కరాళ జనకుని గురించి యాజ్ఞవల్క్యుడు శ్రుత్వా

శతపథం సాగ్రం స సంగ్రహమ్ చక్రేణ పరిశేషం చ హర్షేణ పరమేణ చ"

అని చక్రధారణమును గురించి శతపథ బ్రాహ్మణము ప్రమాణమని చెప్పెను. ఇంకను

యజ్ఞోపవీత కృత చక్రధారీ యో బ్రహ్మ విద్బ్రహ్మవిదో మనీషా ।

స హిరణ్యమాదాయ, సుదర్శనం చ కృత్వా ।

తద్వహ్నౌ చిహ్నం స్వయ ముపైతి యుక్తమ్ ।

స్త్రీ శూద్రా సం బాహుభ్యాం ధారయేత్ ॥

తస్మాద్గర్భేనజాయంతే బ్రాహ్మణస్య శరీరం జాయతే శ్రీవిష్ణుం భజంతి అని చక్రాంకన విషయములోను,

నాసాది కేశ పర్యన్త మూర్ధ్వపుండ్రం తు ధారయేత్, ...

తస్మా ద్విరేఖం భవతి తం దేవకీ పుత్రం సమాశ్రితః అనియు

అగ్నినా వై హోత్రా చక్రం పాంచజన్యం ప్రతప్తం ద్విభుజే రాప్యతే

ఆత్మ కృత మాచార మాదరేణాచార్య సంముఖం ప్రపద్యేత సాయుజ్యం గచ్ఛతి ॥

య ఏవం వేద ఇత్యుపనిషత్ అనియు

ఓమిత్యగ్రే హ్యాహరేత్ - నారాయణాస్యాష్టాక్షరం పదమధ్యేతి

తతో ఽ మృతత్వమశ్నుత ఇతి, ఓం నమో నారాయణాయేతి

మంత్రోపాసకః వైకుంఠ భువనం గమిష్యతి

అనియునూ, పంచ సంస్కారములును విధించుచు ననేక శ్రుతి ప్రమాణములు గలవని తెలియవలెను. అట్లే వేదముల కుపబృంహణ రూపములగు, స్మృతీతిహాస పురాణములందు గూడ ననేక ప్రమాణములు గలవు. అందు హారీత స్మృతి యను విశిష్ట పరమ ధర్మశాస్త్రమందు, అయిదవ అధ్యాయములో,

చక్రాది హేతిభిస్తప్తం తాప ఇత్యభిధీయతే

పుండ్రమూర్ధ్వం తథా ప్రోక్తం వామవిష్ణోః సనాతనమ్

మంత్ర మష్టాక్షరం ప్రోక్తం మంత్రరత్న మథాపి వా ।

యజనం వాసుదేవస్య పాంచరాత్ర విధానతః ।

ఏవం తాపాది సంస్కారీ మహాభాగవతః స్మృతః

మహాభాగవతో విప్రః పూజయేత్సతతం హరిమ్

అని స్పష్టముగా పంచ సంస్కారములు వివరించి, అట్టివారే దేవతారాధనలో నధికారము గలవారని చెప్పబడెను. అందులో మంత్రమష్టాక్షరం ప్రోక్తం మంత్రరత్న మథాపి వా అని చెప్పబడిన వికల్పమునకు తాత్పర్యమేమనగా వేదచోదితమైన అష్టాక్షరిని త్రైవర్ణికాధికారులకును, శూద్రాదులకు, ద్వయమును, నుపదేశింపవలెనని తేలుచున్నది. కొందరు, ప్రణవము వేదత్రయ సంగ్రహము కావున దానిని విడచి మిగిలిన మూలమంత్రమును వేదనధికారుల కుపదేశింప వచ్చునందురు. కాని ప్రణవమును విడచినచో మంత్రమున కష్టాక్షరత్వమే సిద్ధింపదు, కావున అట్ల సమర్ధించుట యుక్తము కాదు.

అట్లే **మహాభాగవతో విప్రః పూజయే త్సతతం హరిం** అను స్థలమున పంచ సంస్కార సంస్కృతుడై మహాభాగవత సంజ్ఞను పొందిన బ్రాహ్మణ మహాభాగవతులే, పాంచరాత్ర విధానమున హరి పూజనము చేయవలెనని విశేష విధానముతో చెప్పబడినది. దీని వలన, తమ తమ ఉజ్జీవనార్థమై భగవదారాధన మందఱు పంచ సంస్కారపరులును చేసికొనినను, విశేషించి పాంచరాత్రాగమ ప్రకారమారాధింపబడు దేవాలయములలో, బ్రాహ్మణ శ్రీవైష్ణవులే యారాధకులుగా నుండవలెనని తేలుచున్నది.

ఇంకను ఆ స్మృతిలోనే రెండవ అధ్యాయము నందు

కేచిత్తు శంఖచక్రే దేవ ప్రచప్తే బాహుమూలయోః

ధారయంతి మహాత్మాని శ్చక్ర మేకం తు వా పరే ।

వైష్ణవానాం తు హేతీనాం ప్రధానం చక్రముచ్యతే అని చెప్పబడెను.

శ్రీ హరి యొక్క పంచాయుధములగు శంఖు చక్ర గదా శార్ఙ్గ నందకముల చిహ్నములను గూడ ధరించుట, వైష్ణవత్వ లక్షణముగా చెప్పబడెను. కాని యందు, కేవల చక్రమాత్రధారణమును, పంచాయుధ

ధారణమును వైష్ణవత్వ చిహ్నములుగా నిర్ణయింపబడినను, **శంఖ చక్రోర్ధ్వపుండ్రాది ధారణం** అనియు

కేచిత్తు శంఖ చక్రే ద్వే .... ధారయంతి మహాత్మనః అనియు

యే బాహుమూల పరిచిహ్నిత శంఖ చక్రాః ..... తే వైష్ణవాః

అనియు, విశేష వచనములనేకములను బట్టి,

శంఖ చక్రోభయధారణమే స్వపరోజ్జీవన వైభవము

నిచ్చునని తెలియవలెను. మరియు శంఖ చక్ర ధారణ సమయములో పఠించు శ్లోకములలో

పాంచజన్యః నిజధ్వాసధ్వస్త పాతక సంచయః అనియు

అజ్ఞానాంధస్య మే నిత్యం విష్ణోర్మార్గం ప్రదర్శయ అనియు నుండుటచే

మోక్ష విరోధి పాప సంక్షయమును, పాంచజన్య చిహ్న ధారణము గలిగించుననియు, మోక్ష మార్గ ప్రదర్శన పూర్వకముగా మోక్షరూప మహా ఫలప్రదము, చక్రధారణమనియు, నట్లే ఉభయచిహ్నధారణమునూ వైష్ణవాది కారికవశ్యాపేక్షితమనియునూ నిర్ణయించబడుచున్నది.

కాబట్టి శంఖ చక్రధారణము, శ్రీవైష్ణవమాత్రులునూ,ప్రపన్నులునూ,ఏకాంతులునూ, పరమైకాంతులునూ, నను నాలుగు విధములైన వారలకు సత్యావశ్యకమని తెలియవలెను. హేతిధారణమ్ అను విధి వలన, సిద్ధించునది గూడ నిదియే పంచాయుధ ధారణమ్ అద్వేషి చానుకూలశ్చ ఇత్యాదిగా చెప్పబడిన, యాఋగుణములు గల కేవల వైష్ణవ మాత్రులకే యవి నిశ్చయింపదగును.

ఊర్ధ్వపుండ్ర మృత్ప్రమాణములు

రెండవ సంస్కారమగు పుండ్రసంస్కారము గూడ తాప సంస్కారము వలెనే యనేక శ్రుతి స్మృతి ప్రమాణ సిద్ధము. నాసాది కేశ పర్యంతం ఊర్ధ్వ పుండ్రం ధారయేత్ అని శ్రుతి ప్రమాణము గలదు. అయితే , అట్టి ఊర్ధ్వపుండ్రము తెల్లని మృత్తికతోనే ధరింపవలెనను యెట్లనగా, అన్ని శ్రుతి ప్రమాణములను ఊర్ధ్వ పుండ్ర మాలిఖే త్తస్మార్ధ్విరేఖం భవతి ఇత్యాదిగా చెప్పుచున్న వివరములలో నెచ్చటను శ్వేత మృత్తుతోనే యని చెప్పబడలేదు. అని కొందరు మాతాంతరులు శంకింపగా, దానికిని శ్రుతి ప్రమాణమున్నవని జవాబు చెప్పవచ్చును. రహస్యామ్నాయ బ్రాహ్మణములో

తదావిష్ణుః లక్ష్మై శ్రీమద్ద్వయముపది దేశ, దేవీచేమాం

బ్రహ్మ విద్యాం న రహస్యాం విష్వక్సేనాయోపాదిశత్.

విష్వక్సేనో మృతతీర్థే ఐరమ్మదీయే తటాకే సామసవనాఖ్యాశ్వత్థ

చ్ఛాయాయాం వైనతేయోపహృతాం శ్వేతాం మృత్స్నాం

శంఖ చక్రోర్ధ్వ పుండ్ర దాస్యం మంత్రం యాగం చేతి

పారమైకాన్తిక ధర్మాన్ బ్రహ్మాణం ధారయన్

బ్రహ్మ సనత్కుమారం సనత్కుమారో నారదం

నారదోవ్యాసం వ్యాసోబృహత్సేనం శుకం చేతి

ఇమముపనిషదం సకృదధీతే సపరస్య ప్రియో భవతి పపరస్య ప్రియో భవతి

య ఏవం వేదేత్యుపనిషత్ అనగా

శ్రియఃపతి లక్ష్మీదేవికి మంత్రరత్నమగు ద్వయమును ఉపదేశింపగా నామెనా బ్రహ్మవిద్యను సాంగ రహస్యముగా విష్వక్సేనునకుపదేశించెను. ఆయన దాని కంగమగు నూర్ధ్వపుండ్రమున కుపయోగించెడి శ్వేతమృత్తును అమృతతీర్థమందలి ఐరంమద తటాకమున సామసవనమను రావిచెట్టు క్రింద నుండెడి దానిని వైనతేయుని చేత చెప్పించి బ్రహ్మకు, పంచ సంస్కార పూర్వకముగా నాద్వయమంత్రమును ఉపదేశించెను. బ్రహ్మ, సనత్కుమారునకు ఆయన నారదునకు, నారదుడు వ్యాసునకు, వ్యాసుడు బృహత్సేనునకు, శుకునకు సంస్కార పూర్వకముగా నుపదేశించిరి అని చెప్పబడెను. దాని

నుపబృంహణ స్మృతియగు హారితస్మృతిలో స్పష్టముగా మృదాశుభ్రేణ అనియు

శుభ్రేణై నమృదా వశ్చాత్ ......

ఊర్ధ్వపుండ్రం లలాటే తు కుర్వీత చతురంగుళం

ఉదరే హృది కంఠేద దశాష్ట చతురంగుళమ్

ఊర్ధ్వ పుండ్రం మృదా శుభ్రం లలటా యస్య దృశ్యతేః

చండాలో పి విశుద్ధాత్మా విష్ణులోకే మహీయతే

ఇత్యాదిగా శ్వేతవర్ణమృత్తికే ఊర్ధ్వపుండ్రమునకుపయోగింపవలెనని చెప్పబడెను.

ఊర్ధ్వ పుండ్రమును ధరించు విధములో, శ్వేతమృత్తులో రెండు రేఖలుగా ధరింపవలెననియు, మధ్యను అంతరాళముండవలెననియు, నిది వరకు చెప్పబడిన ప్రమాణముల వలన స్పష్టమగుచున్నది. అట్టి రేఖలు రెండిటికిని, మధ్యభాగమున శ్రీశ్రియఃపతులు వేంచేసియుందురనియు, నందువలన ఆ రేఖలకు నడమ విశాలమగు అంతరాళముండవలెననియు, నట్లుగా నుండి మధ్య అంతరాళము లేకుండ ధరించినచో, నచ్చట నుండి శ్రీశ్రియఃపతులు వెడలిపోదురనియు నది మహాపాతక హేతువగుననియు, హారిత స్మృతిలోనే యున్నది.

ఊర్ధ్వ పుండ్రస్య మధ్యేతు విశాలే సుమనోహరే

లక్ష్మ్యాసహ సమాసీనో రమతే తత్ర మాధవః అనియు

నిరంతరాళం యః కుర్యాత్ ..... తత్రస్థితం విష్ణుం శ్రియం చైవ వ్యపోహతి ఇత్యాదిగా చెప్పబడెను.

ఇక నాశ్వేతమృత్పుండ్రరేఖల మధ్యను

పుండ్రాణామంతరాళేతు హరిద్రాం బిభృయాచ్ఛ్రియమ్

అని గూడ నచ్చటనే చెప్పబడుట చేత, పసుపుతో చేయబడిన శ్రీచూర్ణమును తదంతరాళము నందు ధరింపవలెను. భగవచ్ఛాస్త్రమగు పాంచరాత్ర శాస్త్రములో

లలాట ఏవ సాధార్యా హరిద్రా ముక్తిదాయినీ

విష్ణు పాద విశిష్టాతు వీతరాగై ర్ముముక్షుభిః

అని చెప్పబడెను. అందు లలాట ఏవ అని యున్నందున మిగిలిన కుక్షిహృదయాదుల యందు ధరింపనక్కర లేదని యర్థము చెప్పరాదు. వైష్ణవుల స్వరూపమును చెప్పు

అద్వేషీ దానుకూలశ్చ దశైతే వైష్ణవాః స్మృతాః అను వచనములో పదివిధములగు శ్రీవైష్ణవ బేధములు ప్రసిద్ధములు. అందు వీతరాగై ర్ముముక్షుభిః అని చెప్పిన వైరాగ్య పూర్వక ముముక్షు శ్రీవైష్ణవులు. లలాట మందు ధరింపవలసిన హరిద్రా చూర్ణము వెనుక చెప్పబడిన

పుండ్రాదామంత రాళేతు హరిద్రాం భిభృయాచ్ఛ్రియమ్

అను దాని కంటే, భిన్నమై కేవలము లలాట మాత్రమందే ధరించు హరిద్రాచూర్ణము వేఱునదమైనదని తెలియవలెను. అదియే లలాట ఏవ అని విశేషించి చెప్పబడెను. అది యెట్టిదనగా,

హరిద్రాచూర్ణ రజసా స్నాపితే మధుసూదనే ।

లలాటే తద్రజో ధృత్వా బ్రహ్మలోకే మహీయతే ।

విష్ణుగాత్రా చ్చ్యుతం చూర్ణం లలాటే ధారయే చ్ఛ్రియమ్ ।

విష్ణుగాత్రా త్పరిభ్రష్టం తచ్చూర్ణం తు లలాటకే ।

అని హారితాత్ర స్మృతులలోను వరాహపురాణములోను చెప్పబడిన విధముగా శ్రియఃపతికి నభిషేకము సమర్పించునప్పుడు సమర్పించు హరిద్రా చూర్ణమును సంగ్రహించుకొని భక్తితో లలాటము నందు మాత్రమే ధరింపవలసినది. అది ఇతరాంగములకు తగులకుండ లలాటమందే ధరింపవలసినదని యిప్పటికిని ముముక్షు శ్రీవైష్ణవుల సదాచారణము వలన తెలియుచున్నది. ఆచార్య పురుషులగు శ్రీవైష్ణవులు, దానిని లలాటమందు శ్రీచూర్ణరేఖమధ్యను ధరించుచుండుట, యందఱు నెఱిగినదై యున్నది.

నామ సంస్కార క్రమము

ఇక మూడవదగు నామ సంస్కారమును గూర్చి కూడ శాస్త్రము వివరించి చెప్పుచున్నది. భగవంతుని నామములతో

ద్వాదశైవతు మాసాస్తు కేశవాద్యైరధిష్టితాః ఆరభ్య

మార్గశీర్షంతు యధా సంఖ్యం ద్విజోత్తమాః

యస్మిన్మాసే భవేద్దీక్షా తన్మూర్తే ర్నామ చోదితమ్

నృసింహ రామకృష్ణాఖ్య నామవేద ప్రకల్పయేత్

శక్త్యావేశావతారాణాం వర్జయే న్నామ వైష్ణవః

నామ దద్యాద్విశేషేణ వైష్ణవం పాపనాశనమ్

యస్య వై వైష్ణవం నామ నాస్తి చేద్ది ద్విజోత్తమ ।

అనామక స్సవిజ్ఞేయ స్సర్వకర్మ బహిష్కృతః

అనగా మార్గశిరమాసము మొదలు పండ్రెండు మాసములలో నేమాసమందు పంచ సంస్కృతునకు నామమును ఆచార్యుడు, కృప చేయవలెను. అట్లుగాక నృసింహ, రామ,కృష్ణ ఇత్యాది పూర్ణావతారముల నామములనైనను కృపచేయవలెను. భగవన్నామమైనను, ఒక జీవుని యందు భగవద్విశేష శక్తి యొకప్పుడావేశించి మరియొకప్పుడంతర్ధానమైన పరశురామ వ్యాస దత్తాత్రేయాది నామములను వర్జింపవలెను. ఇట్టి విష్ణు సంబంధమును తెలుపు భగవన్నామమెవని కుండదో వాడు అనామకుడై సమస్త కర్మలలోను అనర్హుడగుచున్నాడు అని హారీత స్మృతిలో విశదముగా చెప్పబడెను.

మంత్ర సంస్కార క్రమము

నాల్గవదగు మంత్ర సంస్కారము కూడా, శాస్త్ర విహితమయమై యున్నది. హారిత సంహిత, రెండవ అధ్యాయములో చతుర్థం మంత్ర సంస్కారం కుర్వీత ద్విజసత్తమః అని యారంభించి,

ఆచార్య సంస్కారం కుర్వీత ద్విజసత్తమః అని యారంభించి,

ఆచార్య స్స్వగురుం స్మృత్వా జపేద్గురు పరంపరామ్ ।

.... మాతరం సర్వజగతామ్

... ఏవం ప్రపద్య లక్ష్మీం తాం శ్రియం ఘటక భావతః ।

నిత్యయుక్తం తయాదేవ్యా వాత్సల్యాది గుణాన్వితమ్

ఏవం రక్ష జగన్నాథ బహు జన్మ పరాధినమ్ ।

ఇత్యాచార్యేణ సనిర్దిష్టః ప్రపద్యేత జనార్ధనమ్ ।

ప్రపద్యేత తతః శిష్యో గురు మేవ దయానిధిమ్

గురోత్వమేవమే మేదేవ స్త్వమేవ పరమాగతిః ।

త్వమేవ శరణం బ్రహ్మన్ త్వమేవ పరమం హితమ్ ॥

త్వమేవ పరమోధర్మస్త్వమేవ పరమం తపః ॥

ఇతి ప్రపన్న మాచార్యః ....

స్వాచార్యం పురతో ధ్యాత్వా నమస్కృత్య చ భక్తిమాన్ ।

గురోః పరంపరాం జప్త్వా హృది ధ్యాత్వా జనార్ధనమ్ ।

కృపయావీక్ష్య తం శిష్యం దక్షిణం జ్ఞాన దక్షిణమ్ ।

నిక్షిప్య హస్తం శిరసి వామం చ హృది విన్యసేత్ ॥

అద్యాపయే త్తత స్తస్మై మంత్రరత్న శుభాహ్వయమ్ ॥

సార్ధ మధ్యాపయేచ్ఛిష్యం ప్రపత్తిం శరణాగతిమ్

.... ప్రాప్త మంత్ర స్తత శ్శిష్యః పూజయే చ్ఛ్రద్ధయా గురుమ్ ।

గోభూ హిరణ్య వస్త్రాద్యై ర్వాసోభిః భూషణైరపి ॥

సద్వృత్తౌ శాసయేచ్ఛిష్య మాచార్య స్సంశితవ్రతః ।

స్వరూపం సాధనం సాధ్యం మంత్రేణాస్మై నివేదయేత్ ।

ఆచార్యాధీన వృత్తిస్తు సత్పథే సంస్థితస్సదా ॥

కర్మణా మనసా వాచా హరిమేవ భజేత్సుధీః ।

యావచ్ఛరీర పాతం తు ద్వయమావర్తయేత్సదా

ఏవం గురుణా సమ్యఙ్మన్త్ర సంస్కార సంస్కృతమ్

మంత్రార్థ తత్వ విదుషం యాగ తంత్రే నియోజయేత్

అని విపులముగా చెప్పబడెను. ఆచార్యుడు శిష్యునకు మంత్ర సంస్కార మొనర్చునప్పుడు ముందు తన యాచార్యుని, పరమాచార్యాది గురు పరంపరను ఘటకురాలగు లక్ష్మిని, శరణ్యుడగు శ్రియఃపతిని ధ్యానింపవలెను. తరువాత, శిష్యుని భగవత్సన్నిధికి, తీసికొని వెళ్లి, ఓ నారాయణా! దయాసింధూ! వాత్సల్య

గుణసాగరా ఈనీ దాసుని బహు జన్మాపరాధిని కృపతో రక్షింపుము అని ప్రార్థింపవలెను. పిమ్మట శిష్యుడు గూడ, గురువును, భగవంతుని వలెనే తలంచి, నీవే నాకు సమస్త విధోపకారకుడవని ప్రార్థింపవలెను. తరువాత ప్రసన్నుడైన శిష్యుని ఆచార్యుడు, మంత్ర సంస్కారముతో సంస్కరింప వలెను. అందుకు పూర్వము స్వాచార్య పరంపర ననుసంధించుచు శ్రీహరిని ధ్యానించి, అత్యంత కృపతో శిష్యుని శిరస్సు నందు జ్ఞానప్రదమగు తన కుడిచేతి నుంచి, ఎడమచేతిని తన హృదయ మందుంచుకొని (శిష్యుడు, ఆచార్యుని చరణముల యందు తన కుడిచేతిని, తన నోటికదముగా నెడమచేతిని చేర్చుకొనియుండగా) మంత్ర రత్నమునుపదేశింపవలెను. ఇచ్చట మంత్ర రత్నమని చెప్పిన దానికి తాత్పర్యమేమనగా, యదాధికారముగా త్రైవర్ణిక పురుషశిష్యులకు, నష్టాక్షరీమంత్రముతో గలసిన ద్వయమంత్రమును, స్త్రీ శూద్రాదులైనచో, కేవల ద్వయమంత్రమును, నుపదేశింపవలెనని వివేకముగా గ్రహింపవలెను.

మంత్ర రత్నమని యష్టాక్షరికిని ద్వయమునకును గూడ వాడుట శిష్ట సమ్మతము. తరువాత ఆ మంత్రములకు, వివరణ రూపమగు చరమశ్లోకమును గూడ నుపదేశించుట శిష్టాచార సిద్ధము. ఇట్లు రహస్య త్రయము శబ్ద రూపముగా నుపదేశించిన పిదప, వాని అర్థమును గూడ నాచార్యుడు శిష్యునకుపదేశించవలెను. ఇచ్చట నొక శిష్టాచారము ఆంధ్రదేశ మందలి ద్రావిడ శ్రీవైష్ణవులందు గలదు.

బ్రాహ్మణ వైష్ణవులయినచో, నుపనయన సంస్కారమై గాయత్రీ మంత్రోపదేశమైన తరువాత వెంటనే ఉపనయన దీక్ష మూడు దినములు జరిగిన వెంటనే సదాచార్యుని వద్ద నాయుపనీతునకు పంచ సంస్కారములు చేయించుట జరుగుచున్నది. కేవల గాయత్రీ మంత్రము జపించుట ప్రపనన జన విరుద్ధము గాన, దానితో పాటు, ప్రపన్నార్హమైన మంత్రరత్నమగు నష్టాక్షరిని చేర్చి జపించుటావశ్యకమని ఎట్లు జరుపబడుచున్నది. కాని మంత్రార్థము మాత్రము సాంగ వేదాధ్యయన సమనంతరమే యుపదేశింపబడుచున్నది. అంతవరకు అయిదవదగు యాగ సంస్కారము నిలిపి యుంచి అటుపైనే యా సంస్కారము జరుపబడుట ఆచారము గలదు. అదియే శాత్తు కాలక్షేపములను పేరుతో ద్రావిడ వేద శాంతియు, మంత్రార్థోపదేశమును జరుపబడుచున్నది.

అట్లే బ్రాహ్మణకులోద్భూతలగు స్త్రీలకు, పతి సంయోగవసర కాలము నందే, నాలుగు సంస్కారములను పూర్తి చేసి, తరువాతనే యుక్తమైన కాలములో ద్రావిడ ప్రబంధ చాత్తును, మంత్రార్థోపదేశమును జరిపి పిమ్మట, యధోచిత భగవత్కైంకర్యరూపమగు పాక క్రియాదులలో నన్వయింపచేయుట యనబడు యాగసంస్కారము పూర్తి చేయబడుచున్నది. దీనినే తళిగై నియమనము అని వ్యవహరింతురు.

యాగ సంస్కార క్రమము

యాగసంస్కారమనగా యజు– దేవ పూజయామ్ అను ధాతువు వలన పుట్టిన యాగ శబ్దమునకు భగవదారాధనమని యర్థముండుటవలన నట్టి భగవదారాధనాన్వయమును, ఆచార్యుడు శిష్యులకు గలిగించుటయే యని తెలియవలెను. ఇదియే అయిదవ సంస్కారము దీనిని గూర్చి హారితస్మృతిలోనే ఈ క్రింది విధముగా చెప్పబడెను.

పూర్వాహ్ణే పూజయేద్దేవం తస్య ప్రియతమం శుభమ్ ।
మంత్ర రత్న విధానేన గంధ పుష్పాదిభి ర్గురుః ॥

అర్చయిత్వా చ్యుతం భక్త్యా అని యారంభించి

ప్రణమ్య భక్త్యా దేవేశం జప్త్వా మంత్రమనుత్తమమ్ ।

ఆహూయ ప్రణతం శిష్యం తద్బింబం దర్శయన్ గురుః ।

కృపయా ధ తత స్తస్మై దద్యాద్బింబం హరేర్గురుః ।

ఏవం రక్ష జగన్నాధ కేవలం కృపయా తవ అర్చనం

యత్కృతం తేన విభో స్వీకర్తు మర్హసి ।

ఏవం లబ్ధ్వా గురోర్బింబం పూజయేత్తం ప్రయత్నతః ॥

అనగా ఆచార్యుడు పూర్వాహ్ణములో తన ప్రియ భగవద్విగ్రహమును మంత్ర రత్నాను సంధాన పూర్వకముగా షోడశోపచారములతో నారాధించి తరువాత భగవంతునకు దండము సమర్పించి, శిష్యుని బిలచి దండము సమర్పింపచేసి భగవద్బింబమును చూపి కృపతో నా భగవద్బింబములలో నొక మూర్తిని శిష్యున కియ్యవలెను. అట్లొసంగుచు, ఓ జగన్నాథా నీ యొక్క కేవల కృపతో వీనిని కటాక్షించి, వీడు చేయు నారాధనమును స్వీకరింపు చుండుము అని ప్రార్థించి ఇయ్యవలెను. శిష్యుడా బింబమును, శిరసా వహించి ప్రయత్నపూర్వకముగా నారాధించుకొనుచుండవలెను. అని భావము. ఈ విధముగా పంచసంస్కార విధానము. శ్రీపరాశర శాండిల్య భారద్వాజాది ప్రోక్తములగు విశిష్టధర్మశాస్త్రములలో గూడా చెప్పబడియున్నది.

ఆ బ్రాహ్మణ చండాలము పంచ సంస్కారావశ్యకత

పంచమ వేదమని చెప్పబడిన శ్రీమహాభారతము భీష్మ పర్వమందు

బ్రాహ్మణైః క్షత్రియై ర్వైశ్యైః శూద్రైశ్చ కృత లక్ష్మభిః ।

అర్చనీయశ్చ సేవ్యశ్చ ర్వైశ్యైః శూద్రైశ్చ కృత లక్ష్మభి ।

అర్చనీయశ్చ సేవ్యశ్చ పూజనీయశ్చ మాధవః

అని నాలుగు వర్ణముల వారును వైష్ణవ చిహ్నములగు పంచ సంస్కారములను పొంది శ్రీహరి నర్చించి పూజించి సేవించుకొనుచుండవలెనని చెప్పబడినది.

పురాణరత్నమందును, హరి వంశము నందును

నాముద్రితాః ప్రవేష్టవ్యా యావదాగమనం

మమ చక్రాంకితాః ప్రవేష్టవ్యా యావదాగమనం మమ ।

అని శ్రీకృష్ణుడు శత్రువధకు ద్వారక నుండి బయలు వెడలుచు పురరక్షకులకు నేను తిరిగి వచ్చువరకు, భగవదానుకూల్యశూచకమగు చక్రాంకణము లేని వారిని పురములోనికి ప్రవేశింపనీయకుడు. చక్రాంకణపరులను మాత్రము ప్రవేశింపనీయుడు అని శాసించినట్లు చెప్పబడెను. కాన నిఖిలజాతుల వారలకును, భగవదానుకూల్య సూచకమగు తాపాది సంస్కారము, భగవత్ప్రీతి హేతువని దేలుచున్నది. గారుడ పురాణములో గూడ,

అగ్నినైవతు సంతప్తం చక్రమాదాయ వైష్ణవః ।

దాహయేత్సర్వ వర్ణానాం హరి సాలోక్య సిద్ధయే ॥

అని నిఖిల వర్ణముల వారును తప్త చంక్రాంకణమును పొంది విష్ణు సాయుజ్యమును పొందవలెనని చెప్పబడెను. స్కాంద పురాణములో, పూయనసనత్కుమార సంవాదమందు, సనత్కుమారులిట్లు చెప్పిరి.

శంఖ చక్రాంకితం దృష్ట్వా దేవతాః పితరో గ్రహాః ।

ఇచ్ఛన్తి మంగళం నిత్యం తుష్టా స్తస్య పరం భువి ॥

కృష్ణాయుధై ర్లాంఛితానాం మృత్యుర్నాభిభవేత్క్వచిత్ ।

విదేశే ఽ పి భవేన్ముక్తిః పాతకైః ర్వేష్టితా అపి ॥

ఉపసర్గాః క్షయం యాంతి రోగా నశ్యంతి దూరతః

దృష్ట్వా చరకాంకితం దేహం విముఖాయాంతి శత్రవః ॥

వృత్రేణ విజితాః పూర్వం సర్వేదేవా స్సవా సవాః ।

బ్రహ్మాదయో గతా భూప శంకర ప్రముఖాస్తతః ॥

త్రాహి త్రాహి జగన్నాథ వృత్రేణ విజితా వయమ్ ।

శ్రీభగవానువాచ మధాయుధాని దేహేషు లాంచయిత్వా సురోత్తమాః ।

యుధ్యంతాం సమరే దైర్యా మత్ర్పసాదేన భూయసా ॥

మదాయుధాంకితా స్దృష్ట్వా భవతః సురశత్రవః ।

క్షయం యాస్యంతి సమరే మత్ర్పసాదా త్సురేశ్వరాః ॥

ప్రణమ్య దండవద్భూమౌ బ్రహ్మ రుద్ర పురోగమాః ।

హత్వా వృత్రం గతా దేవాః స్వస్థానం చ ముదాన్వితాః ।

తదా ప్రభృతి ధాత్రాద్యా స్సర్వే దేవా స్సవాసవాః ।

ఋషయ సిద్ద గంధర్వాః పాతాళే పన్నగేశ్వరా ॥

వహ్నౌ తప్తం హరే శ్చక్రం శంఖం చైవ విధానతః ।

ధారయన్తి ముదా యుక్తా శ్శత్రో ర్విజయ కాంక్షిణః ।

తస్మాత్త్వమపి రాజేంద్ర కురు కృష్ణాయుధాంకితమ్ ।

స్వదేహం నిజ సంగ్రామే హ్యజేయు స్త్వం భవిష్యసి ॥

కృష్ణ చక్రాంకితో భూత్వా సంగ్రామం ప్రవిశేర్యది

విజిత్య చ రిపూస్సర్వా స్స్వదేశం ప్రాప్నుయాన్నృప ॥

వృత్రవధ విషయములో భగవదాజ్ఞ వలన దేవతలు శంఖ చక్రాంకితులై విజయమును పొందిరి. కాన దేవాదులకే అసాధ్యమగు శత్రువధ కార్యము చక్రాంకణ ప్రభావము చేత సాధ్యమైనందును, నీవటలు కూడ చక్రాంకణమును పొంది శత్రువులను జయింపుము అని పూయనసునకు సనత్కుమారులు చెప్పిరి. దీని వలన భగవద్భాగవతాచార్యాది కైంకర్యోపయోగి యగు ఐశ్వర్యమును గోరువారు కూడ, పంచ సంస్కారముల వలన ధృఢ తరముగా వృద్ధి నందెదరని స్పష్టమగును. మరియు బ్రహ్మాదులకే అభీష్ట సిద్ధికి హేతువగు చక్రాంకణాదులు, మనుజుల కావశ్యకములని వేరుగా చెప్పనక్కరలేదని తెలియవలెను.

పద్మ పురాణములో నారదుడు మునులనుద్దేశించి ఇట్లు చెప్పినట్లు గూడ ఉన్నది.

ఏవముక్త్వా విధాతారం దేవదేవో హరిః పితా ।

స్వచక్రేణాంకయిత్వా తం తస్య మంత్ర మదాత్స్వయమ్ ॥

సర్వలోకేశ్వరో దేవో బ్రహ్మా మమ పితా ప్రభూః

మమాపి విధివ న్మంత్రం ప్రదధౌ మునిసత్తమాః

తస్మా ద్యూయం మునిశ్రేష్మా ధారయధ్వం సుదర్శనమ్ ॥

అనగా శ్రీమహావిష్ణువు తన పుత్రుడగు బ్రహ్మకు తన చక్రముతో చిహ్నమునిడి, తన మంత్రమగు నష్టాక్షరి నుపదేశించెను. మాతండ్రియగు నా బ్రహ్మ, నాకును నట్లే తాపాది సంస్కారపూర్వకముగా మంత్రము నుపదేశించెను. ఓ ఋషులారా మీరు గూడ నట్లే పంచ సంస్కారములను పొందుడు అని చెప్పెను. శ్రీపాంచరాత్ర శాస్త్రములో గూడ, బ్రహ్మయు ఋషులను దేహవిశుద్ధి కొఱకు చక్రాంకణమును పొంది యుండిరనియు, తప్త చక్రాంకనమును పొందిన వానికి మంత్రోపదేశము నొనరించిన తరువాతనే, భగవత్కైంకర్యములలో నియోగ్యత గలుగుననియు, నట్టి వారికే గో భూ హిరణ్యాది దానములు చేయవలెననియు చెప్పబడెను. అచ్చటనే

చక్రంతా శంఖ చక్రేతా తథా పంచాయుధునివా ॥

ధారయిత్వైత విధివత్ బ్రహ్మ కర్మ సమాచరేత్ ॥

అని కేవలమొక చక్ర చిహ్నమును గాని, శంఖ చక్రోభయ చిహ్నములను గాని, పంచాయుధ చిహ్నములను గాని, ధరింపవలెనని యున్నది గదా. శ్రీవైష్ణవ మతస్థులలో శంఖచక్రోభయధారణమునే చేయు నాచారమేల బుట్టెననగా, శ్రీవైష్ణవునకు జ్ఞానభక్త్యాద్యభివృద్ధి కొరకు శంఖ చక్రధారణమును విధించుచు మిగిలిన విధములను విడచుటకు విశేషవచనము గలదు. ఎట్లనగా,

వైష్ణవత్వస్య సిద్ధ్యర్థం జ్ఞానసిద్ధ్యైవిశేషతః ప్రతపే

చ్ఛంఖ చక్రాభ్యాం హుత్వా హోమం విధానతః ॥

అన్యై ర్నధారయే ద్గాత్రే బ్రాహ్మణో హరిలాంఛనైః ।

శంఖ చక్ర చిహ్నములు తప్ప మిగిలిన శ్రీహరి ఆయుధలాంఛనములను జ్ఞానార్థి ధరింపరాదని విశేషించి చెప్పబడెను.

ఇక **అగ్నినైవతు సంతప్తం హుత్వా హోమం విధానతః ।**

అగ్నినైవతు సంతప్తం చక్ర మాదాయ వైష్ణవః ధారయే త్సర్వ వర్ణానామ్

అని యనేక వచనములలో అగ్నినైవ అని యవధారణముగా చెప్పబడుట చేత, నాశంఖ చక్రలాంఛనము మాసిపోకుండుటకును ప్రకాశముగా గన్పట్టుటకును నగ్నియందు దహింప చేసిన చిహ్నములనే ధరింపవలెను అని యుండగా, నీ అగ్ని తప్త చిహ్నము అవైష్ణవులకును, గర్భమందతి పిండమునకును, వైష్ణవత్వ సిద్ధికే చెప్పబడినదని యోచించుట వివేకఫలము గాజాలదు.

పై నిరూపణములను అనుసరించి, వెనుక చెప్పినట్లు శంఖ చక్రధారణము శ్రీవైష్ణవ ప్రపన్న ఏకాంతి పరమైకాంతి విషయమనియు మిగిలిన చక్రమాత్ర ధారణము. పంచాయుధ ధారణమును అద్వేషాది షడ్విధ వైష్ణవ లక్షణములు గలవారి విషయమనియు తెలియవలెను. ఈ విధముగా సకల ప్రమాణ సిద్ధమగు పంచ సంస్కారములు బ్రహ్మ మొదలుకొని దేవ ఋషి సిద్ధ గంధర్వాదులకే యావశ్యకముగా నుండి నటుల తెలియచుండుట చేత మనుష్యులలో సర్వ వర్ణముల వారికిని విధిగా నుండవలెనని చెప్పుటకు ఆటంకము లేదు. పరాశర మహర్షి, సరాశ్రమముల వారికిని పంచ సంస్కారములావశ్యకములని

బ్రహ్మచారీ గృహస్థో వా వానప్రస్థో ఉ_థభిక్షుకః

శంఖ చక్ర ధరా స్సర్వే సమయ వ్రత నిష్ఠితాః

అనుచు చెప్పియుండెను. మరియు శ్రీవైష్ణవ సిద్ధాంతాను యాయులగు బ్రాహ్మణులు, పంచ సంస్కార విహీనులగు బ్రాహ్మణులను శ్రాద్ధాదుల యందు నిమంత్రణ చేయగూడదనియు, వారితోనే విధమైన సంబంధమును పెట్టుకొనరాదనియు, ననేక విశిష్ట ధర్మ శాస్త్రములు చెప్పుచున్నవి.

యజనం వాసుదేవస్య పాంచరాత్ర విధానతః అను స్మృతి వచనమును బట్టి పాంచరాత్ర విధానానుసారము భగవదారాధనము చేయువారు. పంచ సంస్కారపరుడై యుండవలెననియూ తెలియుచున్నది.

పాంచరాత్ర ప్రామాణ్య నిరూపనము

ఇక నిప్పుడీ ప్రకరణమునకు ప్రధానమై యుండు పాంచరాత్ర ప్రామాణ్యమును గూర్చి విచారింతుము.

పాంచరాత్ర శాస్త్రము, తదితరాగమ తంత్రములెట్లు శ్రుత్యాది సమ్మతములుగావో, ఇట్లే ఇది గూడ శ్రుత్యాది సమ్మతము గాజాలదని పొంద అభిప్రాయ పడుచున్నారు. దానికి సమాధానము క్రింద చెప్పుచున్నాము. సహోవాట వ్యాసః పారాశర్యః అని ఆప్తతములుగా చెప్పబడిన పరాశర పుత్రులగు వ్యాసమహర్షి

పంచరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణః స్వయమ్,

సర్వేషు చ నృపశ్రేష్ఠ జ్ఞానేష్వేతేషు దృశ్యతే

అని మహాభారతములో చెప్పి యుండుట చేత, పాంచరాత్రమునకు సమస్త ప్రమాణ రూప శ్రుత్యాదులతో సమాన ప్రామాణ్యము గలదని తెలియుచున్నది. మరియు నా వ్యాసమహర్షి చేత ప్రణీతమైన బ్రహ్మ సూత్రములలో ఉత్పత్త్య సంభవాదికరణములో, పూర్వ పక్ష సిద్ధాంత రూపములగు సూత్రములను రచించి పాంచరాత్రమునకు ప్రామాణ్యమును స్థాపించెను. పాంచరాత్రమునకు వేదమునకు వలె ప్రామాణ్యము గలదు.

అట్లగుచో మనువచనములు, అలాభే యని చెప్పినంత మాత్రము చేత, పాంచరాత్రమునకు వేదసామ్య మెట్లు సిద్ధించును. అగత్యా వేదమంత్రములకు బదులు పాంచరాత్ర శ్లోకములనుపయోగించవచ్చునని, అచ్చట యర్థము వచ్చును గదా అనినచో నట్లుగాదు. **సోమాభావే పూతికస్య గ్రహణమ్** అని యాగ సాధనమగు సోమలత, దొరకని యెడల పూతిక లతను ఉపయోగింప వచ్చునని పూర్వ మీమాంసలో చెప్పబడినది. అచ్చట సోమానయవములు బహుళముగా, పూతీకము నందుచుండుట చేత దానితో సామ్యమును పొందగలదని యెట్లు గ్రహింపబడుచున్నదో, యట్లే ఇచ్చట గూడ అలాలే వేదమంత్రాణాం అనునప్పుడు వేద మంత్రసామ్యమే పాంచరాత్రమునకు చెప్పవలెను. ఆ మను వచనములోనే,

పౌరుషం సూక్తమాస్థాయ యే యజంతి ద్విజాస్తు మామ్ ।

సంహితా జప మాస్థాయ తేమాం పశ్యంతి బ్రాహ్మణాః అని యుండుట చేత, పురుషసూక్త రూప వేదమంత్రములకును, పాంచరాత్ర సంహితా వచనములకును, సామ్యము స్పష్టమగుచున్నది. ఇంకను మహాభారతములో నారాయణీయము నందు, నూట డెబ్బది యైదవ యధ్యాయములో,

యథాగమం యథాన్యాయం నిష్ఠా నారాయణే ప్రభౌ ।

నచైవ తం విజానంతి తమో భ్రాంతా విశాం పతే ॥

తమేవ శాస్త్రకర్తారః ప్రవదంతి మనీషిణం ।

నిష్ఠా నారాయణ ఋషౌ నాన్యో ఉ_స్తితిచ వాదినః

పాంచరాత్ర ప్రవక్తయగు నారాయణుని యందు వేదశాస్త్రాదుల యందు వలె, ప్రామాణ్యము గలదు. తమోగుణ ప్రచురులు దాని నెఱుంగజాలరు. శాస్త్ర కర్తలందఱును నట్టి నారాయణ ఋషి యందే ప్రామాణ్యమును చెప్పుదురు అని భావము.

పాంచరాత్రమునకు వేదసమ్మితత్వము, వరాహపురాణములో నిట్లు చెప్పబడెను.

బ్రాహ్మణ క్షత్రియ విశాం పంచరాత్రం విధీయత్ ।

శూద్రాదీనాం తచ్ఛ్రోత్రపదవీం నోపయాస్యతి

అని మొదలుకొని తస్య వేదాః పంచరాత్రం నిత్యం హృది వసిష్యతి అనియు

వేదేన పంచరాత్రేణ భక్త్యా యజ్ఞేన చ ద్విజ ।

ప్రాప్యో హం నాన్యథా ప్రాప్యో వర్ష లక్ష శతైరపి ॥ అనియు చెప్పబడినది.

వచనములకు భావముః - వేదముకు వలెనే పంచరాత్రముకును, త్రైవర్ణికాధారముండునే గాని శూద్రాదులకధికారము లేదనియు, వేదముతో పాటు పంచరాత్రమునకు గూడ, భగవత్ప్రాప్తి హేతుత్వముండును అనియు తాత్పర్యము. దీని వలన వేదసామ్యమును పొందిన పాంచరాత్రము, వేదము వలెనే ప్రమాణమని స్థిరమగుచున్నది.

ఇట్లే **శ్రీరామాయణోత్తరకాండలో**

పురాణైశ్చైవ వేదైశ్చ పాంచరాత్రై స్తథైవచ ।

ధ్యాయంతి యోగినో నిత్యం క్రతుభిశ్చ యజంతి తమ్

అని వేదసామ్యము చెప్పబడెను. శ్రీభాగవతములో గూడ విధినోపచరే ద్దేవం తత్తలంత్రోక్తేన కేశవమ్ అని భగవత్ప్రాప్తికి, పాంచరాత్ర తంత్రోక్త విధితో కేశవుని పూజింపవలెనని చెప్పబడెను. అట్లే

యజంతి వేద తంత్రాభ్యామ్ తంత్రం

సాత్వత మాచష్టే నైష్కర్మ్యం కర్మిణాం యతః అనియు నా భాగవతమందే వేదములతో పాటు, పాంచరాత్రము దేవపూజనము సమానమనియు, పాపకర్మక్షయపూర్వక భగవత్ప్రాప్తికి సాత్వతాది పాంచారాత్ర సంహితోక్తారాధన మావశ్యకమనియు చెప్పబడెను.

బ్రహ్మాండ పురాణములో గూడ,

ఋగ్యాధ్యాభారతం చైవ పంచరాత్రం యథాఖిలమ్ ।

తథా రామాయణం చైవ పురాణం చైతదాత్మకమ్ ॥

యేచానుయాయిన స్తేషాం సర్వేతే చ సదాగమాః ॥

దురాగమా స్తదన్యే యే తైర్నజ్ఞేయో జనార్ధనః ॥

అని వేదాదులతో పాటు పాంచరాత్రమునకు గూడ, సచ్ఛాస్త్రత్వము నిరూపింపబడెను.

ఈవిధముగా వేదము తదుపబృంహణములతో పాటు, పాంచరాత్రమును సమానముగా, నిరూపించి చెప్పుట చేతను, వేదమునకు వలెనే దానికిని త్రైవర్ణికాధికారము మాత్రము, విధింపబడుట చేతను, శ్రీ పాంచరాత్ర శాస్త్రము, వేదతుల్యమై శాస్త్ర శ్రేష్ఠమై విరాజిల్లుచున్న దనక తప్పదు. ఇంకను, భగవచ్ఛాస్త్రమగు పాద్మ

సంహితలో

బ్రాహ్మణ స్సర్వ వర్ణేషు యతిశ్చాశ్రమిషూత్తమః ।

యద్వద్గంగాచ తీర్థేషు దైవతేష్వహమచ్యుతః ఊ

తద్వత్సర్వేషు శాస్త్రేషు పాంచరాత్రం ప్రశస్యతే ।

... చింతామణి ర్యథా లోకే కపిలా కల్పకద్రుమః ।

అర్థిత్యో వాంఛితం సర్వం ప్రయచ్ఛతి గతిం వినా ॥

పాంచరాత్రాఖ్య రత్నంతు చతుర్వర్గ ఫలప్రదమ్ ।

స్వర్ణవర్ణములతో బ్రాహ్మణుని వలెను, సర్వాశ్రమములలో యతివలెను, సర్వ తీర్థములలో గంగ వలెను, అందరు దేవులలో అచ్యుతుడనగు నావలెను, సమస్త శాస్త్రములలో పాంచరాత్ర శాస్త్రముత్తమమై యుండును. చింతామణి, కామధేనువు, కల్పవృక్షము, కోరిన త్రివర్గ ఫలములనిచ్చునే గాని అపవర్గరూప మోక్షము నియ్యజాలవు. అట్లుగాక, పాంచరాత్ర శాస్త్రము, చతుర్విధ పురుషార్థములను గూడ నొసంగ గలదని పాంచరాత్రమునకు సర్వోత్కృష్టత చెప్పబడియున్నది. అనగా వేదశాస్త్రముల కంటె గూడ, పాంచరాత్రమునకు సర్వోత్కృష్టత యున్నదని పర్యవస్థితము.

పాంచరాత్రాధిక్యము వలన వేదములకు న్యూనత

అట్లయినను, పాంచరాత్రమునకు సర్వోత్కృష్టత చెప్పినంత మాత్రముచే వేదమునకు న్యూనత గలుగదు. ధర్మజ్ఞ సమయః ప్రమాణం వేదాశ్చ అని సామయాచారిక ధర్మ నిరూపణము చేయు ధర్మ సూత్ర వచనము వలన శిష్టాచారమునకు ముందు స్థానమిచ్చి, తరువాత వేదములకు స్థానమిచ్చినంత మాత్రము చేత వేదమునకు ప్రామాణ్యములో లోపము రానట్లే, పాంచరాత్రమున కుత్కృష్టత చెప్పినంత మాత్రముచే గూడ, వేదమునకు ప్రామాణ్యము లోపించినదని తెలియవలెను. శిష్టాచారమనునది, వేదోదిత ధర్మముల నాచరించు వారల యాచరణమే కదా, అట్లే వేద సారముగా భగవంతుని చేత చెప్పబడిన పాంచరాత్రము వేదమూలకమైన యర్థములను వివరించునదియై ప్రథమ స్థానమును ప్రమాణములలో పొందినదని తెలియదగును.

ఇంకను వేదాధ్యయనమునకు **శ్రావణ్యాం ప్రోష్ఠపద్యాం** వా ఇత్యాది అధ్యయన కాలనియమమున్నట్లు, పాంచరాత్రాధ్యయనమునకు లేదు. దీని వలన వేదము కంటె పాంచరాత్రమునకు సౌలభ్యము సిద్ధించును. మరియు, పాంచరాత్రమునకు నిష్కృష్ట భగవత్స్వరూపాదులను ప్రతిపాదించుచున్నది. వేదమట్లుగాక, కలగలుపుగా దేవతాంతరములతో చేర్చియు, తత్తద్దేవతారాధనలతో చేర్చియు, భగవత్స్వరూపారాధనలను, చెప్పునదియై యున్నది. పొట్టుతోను, పిప్పితోను, చేర్చి యుండు బెల్లపుగడ్డకు వలె వేదము నందలి భగవత్స్వరూపమునకు ప్రాధాన్యముండును.

అట్లు గాక పాంచరాత్రము నందు, ఏలాలవంగాది పరిమిళితమై సువర్ణ పాత్రమందుంచబడిన శర్కరాపానీయము (పానకము) వలె భగవత్స్వరూపముండును. ఇట్టి వేదాధిక్యము, పాంచరాత్రమునకుండినను తప్పులేదు. గుడసారమే కదా శర్కరయును అగుచున్నది. ఇంకను, వేదమును బ్రహ్మాదిముఖముల నుండి భగవంతుడే లోకమునకు ప్రసాదించను. పాంచరాత్రమో, సాక్షాత్తుగా నారాయణుడే ఈ లోకములో నావిర్భవించి, స్వవచన రూపముగా నయిదు దినములలో కటాక్షించి ప్రసాదించినది. దాని వలన గూడ పాంచరాత్రమునకు

వేదము కంటె వైలక్షణ్యముండును. కాబట్టి, తదుక్త ధర్మములలో చేరిన ద్రావిడ దివ్య ప్రబంధ వైలక్షణ్యమును, పంచ సంస్కారముకొత్కృష్టమును, సర్వోత్తరమైనదిగా నుండునవి వివేకి జనులు, విశాలదృష్టితో గ్రహింపదగును.

పాంచరాత్రమున కాగమవ్యవహారాన్యూనత

పాంచరాత్ర శాస్త్రమునకు ఆగమమని వ్యవహారమున్నది. అయితే, పాశుపతాద్యాగముల వలెనే, ఆగమ వ్యవహారము చేయబడు వానిని, నింద చేయు కొన్ని వచనముల వలన నీ పాంచరాత్రాగమమునకును నింద తప్పదేమో యన్నచో నట్లుగాదు, వేదోపబృంహణములగు స్మృతి పురాణాదులలో నాగమములను నిందించిన విధమును బట్టి, యట్టినింద శైవగమాదులకే చెందును. కాని పాంచరాత్రమునకన్వయించదు. పాంచరాత్రమున కాగమవ్యవహారమెట్లు వచ్చెననగా,

ఋగ్యజుఃసామభి ర్జుష్టం ఏతద్ధి సర్వ శాస్త్రాణాం శాస్త్రముత్తమ సంజ్ఞితమ్

అని వేదముతో సరిపోలినదై సర్వ శాస్త్రోత్తమమైయున్నదిని, యా ప్రమాణ వచనములలోనే చెప్పబడి యుండుట వలన వేదముల వలెనే భగవన్మూలముగా వచ్చినదను నర్థమును స్ఫురింపచేయునది ఆగమ శబ్దమని తెలియవలెను. ఇతరాగమముల కాగమ శబ్దము, ఆగంతుకముగా మధ్యనచ్చినవని స్ఫురింపచేయుచు, త్రిగుణమయ ప్రకృతిబద్ధ జీవ విశేషముచే రచింపబడినవని యర్థము నిచ్చును. ఏశాస్త్రమునకైనను, ప్రామాణ్యము గలుగవలెననిన, నవిగీతమైన యర్థమును బోధింపవలెను. ఇతరాగమములట్లుగాక. శిష్ట జన విగీతములగు శ్మశాన భస్మ స్నానాదులగు నాచారములను చెప్పుట చేత నవినింధ్యములైనవి.

అట్లగుచో, రుద్రపరత్వమును చెప్పెడి పాశుపతాగమము గూడ, మహాభారతములో నారాయణీయమున

సాంఖ్యం యోగం పాంచరాత్రం వేదాః పాశుపతం తథా ।
ఆత్మ ప్రమాణా న్యేతాని న హంతవ్యాని హేతుభిః ॥

అని పాంచరాత్ర వేదాదులతో పాటు పాశుపతము గూడ, స్వయం ప్రమాణమని చెప్పుటచే స్వపయం ప్రమాణమగుటవలన, నింధ్యము గాదు ఇంకను, కూర్మ పురాణములో గూడ

నిర్మితం హి మయా పూర్వం వ్రతం పాశుపతం శుభం
గుహ్యాద్గుహ్యతమం సూక్ష్మం వేదసారం విముక్తయే ॥
ఏవం పాశుపతం యోగం సేవనీయం ముముక్షుభిః ।
భస్మచ్ఛన్నైర్హి సతతం నిష్కామైరితి హి శ్రుతిః ॥

ఇత్యాది వచనములలో పాశుపతము కూడ భగవన్ముఖోదితమనియు, వేదసారరూపమైనదనియు విముక్తి హేతువనియు ముముక్షుజన సేవ్యమనియు చెప్పి, యందు నిరూపితమగు భస్మధారణము, నిష్కామత్వ సూచకమని వేదములో ప్రశంసింపబడినదనియు స్పష్టముగా నున్నది కదా. అందువలన పాశుపతమునకు గూడ ప్రామాణ్యమంగీకరింపవలెనే, అందువలన, పాశుపతమునకు గూడ ప్రామాణ్యమంగీకరింపవలెనే, యనినచో దానికి సమాధాన మిట్లున్నది. పాశుపతమునకు ప్రామాణ్యమును చెప్పెడి పురాణవచనములకు తాత్పర్యమేమనగా,

పాంచరాత్రము నందు వలెనే త్రివిధమగు చిరు చిదీశ్వర తత్వములు మూడును, పశు పాశ పశుపతి శబ్దముల చేత, పాశుపత మందంగీకరింపబడెను.

అందు పశు శబ్దమునకు చిత్తన బడు జీవుడును, పాశశబ్దమునకు బంధ హేతువగు అచిద్రూప ప్రకృతియు, పశుపతి శబ్దము చేత నీశ్వరుడును, చెప్పబడెను. కాని ఈశ్వర తత్వము మాత్రము రుద్రుడని చెప్పబడెను. దానికి తన్మతమును ప్రవిర్తింప చేసినది గూడ. రుద్రాంతర్యామియగు నారాయణుడేయని కూర్మ పురాణము నందు స్పష్టమగును. కనుక, నా పాశుపతము వేద పూర్వభాగ చోదితచ సద్వారకారధనమును బోధించుటచే నదియు గ్రాహ్యమైనది. ఈ విషయమే మహాభారతములోని నారాయణీయములో స్పష్టము. ఎట్లనగా, జనమేజయుడు

సాంఖ్యం యోగం పాంచరాత్రం వేదాః పాశుపతం తథా

కిమేతాన్యేక నిష్ఠాని పృథఙ్నిష్ఠాని వా మునే

అని ప్రశ్నింపగా దానికి సమాధాన రూపముగా

సాంఖ్యస్య వక్తా కపిలః అని యారంభించి

ఉమాపతిః పశుపతిః శ్రీకంఠో బ్రహ్మణ స్సుతః

ఉక్త వా నిదమవ్యగ్రో జ్ఞానం పాశుపతం శివః

అని సాంఖ్యాది వక్త నారాయణుడే యైనను తత్తదంతర్యామిగా నుండి యుపదేశించెననియు,

పాంచరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణ స్స్వయమ్

అని సాక్షాత్తుగా నారాయణుడు, స్వస్వరూపముతో నుపదేశించినది పాంచరాత్రమనియు చెప్పబడెను. దీని వలన పరతత్వమగు నీశ్వరుడు, రుద్రాంతర్యామిగా నుండి యుపదేశించి, తదంతర్యామియగు తనకు ప్రాధాన్యమును, పాశుపతములో చెప్పెను. పాంచరాత్రములో నట్లుగాక, సాక్షాత్తుగా తానే చెప్పుట చేత, తానే పరతత్వమని, నారాయణ పరత్వమును స్పష్టపరచెను. కాబట్టి తాపన్మాత్రము చేత పాశుపతమునకు వేద పూర్వభాగమునకు వలె ప్రాధాన్యముండినను, వేదాంతమునకు వలె పాంచరాత్రమునకే యుత్తమ ప్రమాణత్వమియ్యబడెను. వేదపూర్వభాగము, సద్వారక భగవత్స్వరూపమును చెప్పినట్లే. పాశుపతము గూడ సద్వారక భగవత్స్వరూపమునే బోధించునదియై కేవల రుద్రపరముగాదని గూడ తెలియవలెను. అందువలన నదియు ప్రమాణమే యగుచున్నది.

శ్రీశంకరాచార్యుల మతమున పాంచరాత్ర గౌరవము

బ్రహ్మ సూత్ర భాష్యములో శ్రీశంకరాచార్యులు ఉత్పత్త్య సంభవాదికరణములో, శ్రీపాంచరాత్ర శాస్త్రమును, నారాయణ పారమ్యమును, అభిగమనాది పాంచకాల్యారాధనమును ప్రమాణముగా స్వీకరించి జీవోత్పత్తి విషయము నందు మాత్రము అంగీకారమును తెలుపలేదు. శాంకర భాష్య వ్యాఖ్యయగు కల్పతరువు నందు నారాయణప్రోక్తమైన పాంచరాత్రము, సర్వ విషయములందును ప్రమాణమే యగును గాన నందలి జీవోత్పత్తి ప్రతిపాదనము లాక్షణికముగా తీసికొనవలెననియు, పాంచరాత్ర శాస్త్రమంతయు ప్రమాణమే యనియు చెప్పబడెను. ఇంకను, శాంకర భాష్యములో పశుపత్యధికరణము నందు మహేశ్వరమతము వేదబాహ్యములో పశుపత్యధికరణము నందు మాహేశ్వర మతము వేదబాహ్యమని వ్రాయబడియున్నది. వాచస్పతి మిశ్రులు గూడ, పాశుపత, శైవకాపాలాది మతములు, మాహేశ్వర మతాంతర్భూతములే యని వ్రాయుచు, వానిని గూడ నిరసించు యున్నారు. ఈ విధముగా నద్వైత మతస్థులగు శంకరాదులు గూడ పాశుపతశైవాద్యాగమములను

ఏకదేశమందు కూడ ప్రమాణముగా నంగీకరింపక పోవుటచే కేవలరుద్ర పరముగా పాశుపతమును నంగీకరింపరాదు. అట్లయినప్పుడది యవైదికమతమగును. శరీర శరీరి భావనిబంధనమగునంతర్యామి పరముగా నంగీకరించినప్పుడు, కొంత ప్రమాణమే కాగలదు. మహాభారత వచనములో శ్రీకంఠో బ్రహ్మణ స్సుతః అను దాని వలన, రుద్రునకు ప్రకృత్యంతర్భూత జీవత్వము స్పష్టపడుచున్నది. కావున, కేవల రుద్ర పరత్వముగానే సమన్వయించినప్పుడా శాస్త్రము ప్రమాణము గాగలదు. ఆగమనిందా వచనము లట్టి శాస్త్రములను గురించిన వేయని తెలియవలెను. పాంచరాత్రమునకు అవి వర్తింపవు.

రుద్రాదుల కంతర్యామి ప్రాధాన్యము చేత ఆరాధ్యత్వము

శ్రుతి సిద్ధముగా పాశుపత వ్రతమును చెప్పుట, రుద్రాంతర్యామియగు నారాయణ ప్రధానమగుట చేతనే యని తెలియవలెను.

ఇక **శంకరాత్ జ్ఞానమన్విచ్ఛే న్మోక్షమిచ్ఛే జనార్ధనాత్**

అను వచనమును బట్టి, శంకరునకు జ్ఞాన ప్రదత్వము చెప్పుట **తద్గుణ సారత్వాత్తద్వ్యపదేశః** అను బ్రహ్మ సూత్రన్యాయము చేత భగవంతుని నంతర్యామిగా గలిగియుండుట చేత, మోక్ష పర్యంత జ్ఞాన సమృద్ధినిచ్చువాడను తాత్పర్యముతోనే యని గ్రహింప వలెను. దీనికుపష్టంభకముగా,

భాస్కరస్య తు యోభక్త స్సప్త జన్మాంతరం పరః ।
తస్యైవతు ప్రసాదేన రుద్ర భక్తః ప్రజాయతే ॥
శంకరస్య తు యో భక్తః సప్త జన్మాంతరం పరః ।
తస్యై వ తు ప్రసాదేన విష్ణు భక్తః ప్రజాయతే

ఇత్యాది వచనములున్నవి. సూర్యాంతర్యామి నర్చించుట వలన, నేడు జన్మలకు పిదప రుద్రభక్తు డగుననియు, రుద్రాంతర్యామి నర్చించుట వలన నేడు జన్మముల తరువాత విష్ణు భక్తుడగుననియు తాత్పర్యము. దానిని బట్టి అంతర్యామ్యారాధనలో తుది వ్యక్తిగా చెప్పబడిన రుద్రుడు మోక్ష పర్యంతజ్ఞాన ప్రదుడై మహోపకారకుడనుటలో నాటంకము లేదు. ఇట్లు భగవద్ జ్ఞానోపదేశ రూప మహోపకారకుడగు రుద్రుని పట్ల నారాయణాంతర్యామికుడను భావముతో ముముక్షువులు, భక్తి నొనర్చి పాశుపత తంత్ర ప్రతిపాదితమైన రుద్ర ప్రీతి జనక భస్మ రుద్రాక్ష ధారణములు గర్హ్యములు గాజాలవని గ్రహింపవలెను. అట్లు సద్వారకముగా గాక ఆ ద్వారకముగానే సాక్షాత్తు విష్ణుభక్తులైన ముముక్షువులకు శ్రుతి స్మృత్యాది సంమతమగు పాంచరాత్ర విహితమైన శంఖచక్రోర్ధ్వపుండ్రాది ధారణమే ముఖ్య కర్తవ్యము. ఇక శ్రుతి సమ్మత పాశుపత వ్రతానుష్ఠాన పరులగు ముముక్షువులకు గూడ, శంకర ప్రసాద జన్య జ్ఞానము వలన విష్ణుభక్తి గలిగిన పిదప

* సదాచార్య కృపాలబ్ధ భగవచ్చరణారవింద సమాశ్రయణ పూర్వకముగా తప్త శంఖ చక్ర శ్వేత మృదూర్ధ్వ పుండ్ర ధారణాదులు బొంది, పాంచారాత్ర విధానానుసారిము సాక్షాద్భగవదారాధనమును చేయుచు మోక్షమును బొందుటావశ్యకమని తెలియవలెను.

పాంచరాత్ర మగతికగతియగుట వలని వైభవము

పాంచరాత్ర శాస్త్రము వేదతుల్యమైనదైననూ పాంచరాత్రం భాగవతమ్ అని మొదలుకొని

వేదభ్రష్టా స్సముద్ధిశ్య కమలాపతి రుక్తవాన్ అనియు,

సాత్వతం నామ శోభనమ్ కుండాదీనాం హితావహమ్ అనియు

కుండాదీనాం హితావహమ్ అనియు నిత్యాది యనేక ప్రమాణములను బట్టి యత్యంత నికృష్టులైన వేద భ్రష్ట పాపిష్టకుండా (జారజా) ది రక్షణమును గూర్చి దయామయుడగు భగవంతునిచే నుపదేశింపబడిన దగుట వలన, వేదము కంటె గూడ నెక్కువ వైభవము గలదని తెలియవలెను.

పాప ప్రాచుర్యముచే విప్రజన్మమెత్తియు శూద్రప్రాయులై నట్టియు, బ్రహ్మ వేత్తలై నను దురాచార పరులగుట చేత వేదాధ్యయనాదులయంద యోగ్యులైనట్టియు, ఒకప్పుడు వేదాధ్యయనమునకు అర్హులైయుండినను వేదోక్తములగు కఠిన ప్రాయశ్చిత్తాదులను ఆచరించుటకశక్తులై నట్టియు, వారలకందఱకును, వేదోక్త ప్రాయశ్చిత్తముల కంటే నతి సులభముగా వివరించి భగవంతుడు స్వయముగా నీ పాంచరాత్ర శాస్త్రములో నుపదేశించుటచే దీనిని సకల శాస్త్రముల కంటె శ్రేష్టము సిద్ధించెను. ఈ విషయమే క్రమేణ

శ్రుతి సిద్ధ్యర్థం మనుష్య స్తంతమాశ్రయేత్ అనియు

ప్రాయశ్చిత్తే ష్వనున్ముఖః తదుక్తం ధర్మ మాచరేత్

అనియు చెప్పబడెను. పాంథుల కొఱకు నిర్మించిన చలివేంద్రము. మిగిలిన స్థానికులకు గూడ నుపయోగించి యాదరణీయమైనట్లును. ప్రతిమాస్వప్రబుద్ధానామ్ అని చెప్పినట్లు ప్రబోధరహితుల కొఱకేర్పడిన శ్రీరంగాది దివ్యస్థలముందలి భగవదర్చా విగ్రహములు ప్రబుద్ధులగు బ్రహ్మాదులకు గూడ నారాధ్యములైనట్లును, శ్రీపాంచరాత్ర శాస్త్రము అత్యంత పాపిష్ఠులైనట్టి వేదోక్త ప్రాయశ్చిత్తాద్యాచరణాసమర్థులనుద్ధరించునదియైనను, సజ్జనులగు భగవద్భక్తులకు గూడ నవశ్యాదరణీయమని తెలియవలెను. శ్రీమహాభారతాశ్వమేధ పర్వములో యుధిష్ఠిరుడు, శ్రీకృష్ణ భగవానుని ప్రశ్నింపగా శ్రీకృష్ణుడు. అగతికగతియగు పాంచరాత్ర ధర్మమునే యుపదేశించినట్లున్నది. కాబట్టి సమస్త జనులకును పాంచరాత్ర శాస్త్రము. అగతికగతియైనను పరిగ్రాహ్యమని గ్రహింపవలెను.

శ్రీకృష్ణోపదేశ ప్రకారము

ధర్మరాజు ప్రశ్నమునకు శ్రీకృష్ణుడుపదేశించిన ప్రకారము పాంచరాత్ర విషయకమైనదే యనియెట్లు నిశ్చయింప వచ్చుననగా,

కౌంతేయ శ్రూయతామిద ముత్తరమ్ ।

కథరూష్యే పరం గుహ్యం మమ భక్తష్య పాండవ ॥ అని యారంభించి

ద్వాదశాక్షర తత్వజ్ఞ శ్చతుర్వ్యూహ విభాగవిత్ ।

అచ్ఛిద్ర పంచకాలజ్ఞః సవిప్ర స్తారయిష్యతి

అనగా వాసుదేవం ద్వాదశాక్షరి యొక్క తత్వము నెఱిగి వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధవ్యూహ చతుష్టయ విభాగయ విభాగము తెలిసికొని పంచకాలారాధన క్రమ మెఱిగిన విప్రుడే సమస్త జనులను తరింపచేయునవి. పాంచరాత్ర ప్రతిపాదిత విషయములనే చెప్పుట చేతను, ఇంకను

కథం త్వ మర్చనీయో సి మూర్తయః కీదృశాస్తుతే ।

కథం వైఖానసా బ్రూయుః కథం వై పాంచరాత్రికాః ॥ అని యుధిష్ఠిర విశేష ప్రశ్నలో, వైఖానస పాంచరాత్ర సంప్రదాయములను ప్రశ్నింపగా, శృణు పాండవ తత్సర్వం అని యారంభించి

స్తండిలే పద్మకం కృత్వా సాష్టపత్రం సకర్ణికమ్ ।

అష్టాక్షర విధానేన త్వథవా ద్వాదశాక్షరాత్ ॥

వైదికై రథవా మంత్రై ర్మమ సూక్తేన వా పునః ।

స్థాపితం మాం పున స్తస్మిన్ అర్చయిత్వా విచక్షణ ॥

పురుషంతు తత స్సత్య మచ్యుతం చ యుధిష్ఠిర

వరిపిండితో గాని బియ్యముతో గాని, యొక మండలము నొనర్చి, యందు అష్టదళపద్మమును లిఖించి (లేక పండ్రెండు దళముల పద్మమును లిఖించి గాని) మధ్య కర్ణికను లిఖించి, అందాదళములలో నష్టాక్షరీ మంత్రమును గాని ద్వాదశాక్షరీ మంత్రమును గాని ప్రతిదళ మధ్యము నందును అక్షర క్రమముగా విన్యసించి వేదమంత్రములతో గాని కేవల పురుషసూక్తముతో గాని అందు నా బింబమును కర్ణిక యందు స్థాపించి యర్చింపవలెను. అని చెప్పుచు మరియు

అనిరుద్ధంచ మాం ప్రాహు ర్వైఖానసవిదో జనాః ।

వామదేవం చ రాజేంద్ర సంకర్షణ మథాపిచ ।

ప్రద్యుమ్నం చా నిరుద్ధం చ చతుర్వ్యూహం ప్రచక్షతే

అన్యే చైవం విజానంతి మాం రాజన్ పాంచరాత్రికాః

అని వైఖానసులు కేవలము నన్ను అనిరుద్ధ స్వరూపునిగా నారాదించురనియు, పాంచరాత్రులు వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధ స్వరూపునిగా (సంపూర్ణ స్వరూపముతో) నారాధింతురని, వివరముగా చెప్పెను. కాన, పాంచరాత్రమునకు నితరాధన ప్రక్రియలకంటె వైలక్షణ్యము నిరూపింపబడెను. అట్లగుచే, శ్రియఃపతి వైఖానస పాంచరాత్ర విధానానుసారమైన ఆరాధనాక్రమ ముపదేశింపగా, వానిలో పాంచరాత్రమునకుండెడి ప్రాధాన్యమేమని ప్రశ్నవచ్చుచున్నది. దానికి సమాధాన మేమనగా

అనన్య దేవతా భక్తా యే మద్భక్త జనప్రియాః ।

మా మేవ శరణం ప్రాప్తా స్తే మద్భక్తాః ప్రకీర్తితాః ॥ అనియు

చతుర్వ్యూహ విభాగవిత్ అచ్ఛిద్ర పంచకాలజ్ఞః । నవై భాగవతోత్తమః ॥

అనియు చెప్పియుండుట చేత పాంచరాత్రారాధన పరులు, భగవద్భక్తులగు ఆళ్వారాదులను ఆదరించుట చేతను, ఇతరులైన యారాధ్యదేవతలను గూర్చి విముఖులగుట చేతను, వాసుదేవాది చతుర్వ్యూహములతో గూడిన భగవంతుని యారాధనముచే చేయుట చేతను, పాంచరాత్రులు ప్రధానులనియు, భక్తబింబముల నారాధింపక ఋషిరూపులగు విఖనోముని బింబము నారాధించుట చేత వైఖానసరాధకులు అంతకంటె నప్రధానులనియు, భగవదభిప్రాయముగా గ్రహింపదగును.

అనంతర భారత గ్రంథము చేతను గూడ శ్రీకృష్ణభగవానుడుపదేశించిన పాంచరాత్ర విధానాను సారమే భగవదారాధనము చేయుచు తరించినట్లు యుధిష్ఠిరుని గూర్చి చెప్పబడెను.

ఇంకను, సాంబ, కూర్మ, శ్రీభాగవతాది పురాణములలో గూడ, పాంచరాత్ర విధానానుసారమగు ఆరాధనయే శ్రేష్ఠమని చెప్పబడెను. మఱియు,

పాంచరాత్రం సహస్రాణాం యది కశ్చి ద్గ్రహిష్యతి ।

కర్మక్షయే చ మాం కశ్చి ద్భువి భక్తో భవిష్యతి ॥

తస్య వేదాః పాంచరాత్రం నిత్యం హృది వసంతి హి

అని వారాహపురాణ వచనమును బట్టి గూడ, వేదములతో సమానముగా చెప్పబడిన పాంచరాత్రముచే, కూర్మ పురాణములో

పాంచరాత్రం భాగవతం తంత్రం వైఖానసాభిధమ్ ।

వేదభ్రష్టా స్సముద్ధిశ్య కమలాపతి రుక్తవాన్ ॥

.... వేదేతరాగమం గత్వా తదుక్తం ధర్మమాచరేత్

అని వేదభ్రష్టులను గురించి, వారిని గూడ తరింపజేయుటకు భగవంతుడుపదేశించిన పాంచరాత్ర బాగవత తంత్ర వైఖానస తంత్రములలో వేదముతో సమాన స్కంధమును పొందిన పాంచరాత్ర భగవత్తంత్రమునే యవలంభించి కర్మాచరణము చేయుచుండవలెనని చెప్పబడెను.

అచ్చట వేదేతరాగమమనగా పాంచరాత్రమనియే యర్థము గావించుకొనవలెను.

బ్రాహ్మణేతరమానయ అని చెప్పినప్పుడు బ్రాహ్మణుని కంటె భిన్నుడును, బ్రాహ్మణునితో సమానమగు వర్ణాశ్రమాది ధర్మములు గలవాడే యెటు దీసికొనిరాబడునో యట్లే వేదభిన్నమై తత్సదృశార్థ ప్రతిపాదకమై ప్రామాణ్యముగల పాంచరాత్రమే గ్రహింపబడునని తెలియదగును.

పాంచరాత్రమునకు పాపసముత్తరణత్వము

పాంచరాత్ర శాస్త్రము, పాపిష్ఠానాం క్షణార్థం కుండ గోళాదిభిః శ్రితమ్

వర్ణాశ్రమ పరిభ్రష్ట స్తదుక్తం ధర్మమాచరేత్,

వేదభ్రష్టాన్ సముద్ధిశ్య, స్త్రీ శూద్రదాసానామ్

ఇత్యాది బహుపురాణ వచనములను, బట్టి పాపాచరణము గల వారికిని, భర్త బ్రతికి ఉండగా నన్యపురుషసాంగత్యము వలన స్త్రీకి జనించిన కుండుండను వానికిని, భర్త గతించి విధవ అయిన స్త్రీకి జారత్వము వలన జనించిన గోళకుండను వానికిని, వర్ణాశ్రమాచారముల నుండి భ్రష్టుడైన వానికిని, వేద భ్రష్టునకును, స్త్రీలకును, శూద్రులకును, పావనత్వము నిచ్చుచు పాప సముత్తరణమును గలిగించుటలో పాంచరాత్ర శాస్త్రమే యుత్తమ సాధనముగా చెప్పబడినది. ఇంత మాత్రము చేత నది కేవలము ప్రాయశ్చిత్తీయుల విషయములోను వేదానధికారుల విషయములోను మాత్రమే ఉపయోగించునదిగా గాక, ఉత్తమ వేదాధికారులకు గూడ సద్గతి సాధనమై వేదతుల్య ప్రామాణ్యమును, గలిగి యున్నదని, పూర్వమే నిరూపితమైనది. దీనికి యుధిష్ఠిరాచరణమే ప్రమాణము.

ఇక వేదములు, త్రైగుణ్య విషయములు గాన నట్టి త్రైగుణ్య విషయక భాగములలో రాజస, తామస తన్మిశ్ర సాత్విక భాగములను, వదలుమనియు, అనేక జన యోగ్యములగా పుష్పించిన వృక్షముల వంటి వేదము నంతను ముముక్షువులైనవారు, సాకల్యముగా నెఱుంగజాలక యాదరించుట యుక్తము గాదనియు,

శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడుకు ఉపదేశించిన

త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున,

యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః

అను గీతా వచనములను బట్టి వేదమునకు ప్రామాన్యము వచ్చినదా. పాంచరాత్ర శాస్త్రము గూడ పాపిష్ఠులకు పావిత్ర్యము నిచ్చుననుటచే వేదమెట్లు. సకల జన సముద్ధరణ హేతువో యట్లే, పాంచరాత్రమున్నూ, యని దీనికినీ అభుచ్ఛయమే వచ్చును. కాబట్టి పాంచరాత్ర దివ్య శాస్త్రము వేదము వలెనే ఉత్తమ ప్రమాణమై యున్నది. అర్చావతారమెట్లు, బ్రహ్మ మొదలు పాపిష్ఠ పురుష పర్యంతము సేవ్యమై, పావనమై, సద్గతి ప్రదమగుచున్నదో, యట్లే పాంచరాత్ర శాస్త్రమునూ యని వివేకులు తెలియగలరు.

అభియుక్తానుష్ఠాన ప్రయుక్త ప్రామాణ్యము

ఇచ్చట నొక యాక్షేపము గలదు. పాంచరాత్ర శాస్త్రము వేదాదుల వలె తప్త చక్రాంకితాదులను విధించు చున్నను, చక్రాంకితభుజాః కేచిత్కులే విష్ణు పరిగ్రహే అను వచనానుసారముగా పాంచరాత్రోక్త విష్ణు పూజా తత్పరులై తదుక్త ధ్వజారోహణ రథోత్సవాది నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, వర్షోత్సవాదులలో దీక్షాన్వితులై యుండు, దేవలక సంజ్ఞ గల, దేవాలయార్చకుల విషయమైనదే పాంచరాత్ర శాస్త్రము. కాని సామాన్య ముముక్షువులకు ప్రపన్న శ్రీవైష్ణవ విషయము గాజాలదు. అని, ఇట్లు వచ్చు ఆపత్తికి సమాధానమిది.

పాంచరాత్ర శాస్త్రోక్త పంచసంస్కారములను చతుర్ముఖ నారద వశిష్ఠ వ్యాస పరాశర శాండిల్యారీహాతాది సమస్త దేవ ఋషి ప్రవరులు దామనుష్ఠించి బోధించుట వలన పాంచరాత్ర శాస్త్రము కేవల దేవలక విషయమనుటకు వీలులేదు. వారట్లు అనుష్ఠించిన విధమునకు ప్రమాణము తిధి వఱకే చూపబడినవి.

అదియును గాక **నవిష్ణు పూజనా ద్దేవలకత్వ** మని యాగమప్రామాణ్యములో శ్రీయామునాచార్యులు వారు సిద్ధాంతీకరించి చెప్పిరి. కాబట్టి దేవలకత్వ ప్రయుక్తమైన, అపాం క్తేయతాదులు, విష్ణు బింబార్చకులగు శ్రీవైష్ణవుల కుండవు.

పాంచరాత్ర వైభవ సంగ్రహము

పాంచరాత్ర శాస్త్రమునకుండెడి వైభవము, శ్రీమహాభారతాదులలో ప్రసిద్ధమై యున్నదని యిదివరలో చెప్పబడెను. ఇంకను, మహాభారతములోని నారాయణీయములో,

ఇదం మహోపనిషదం చతుర్వేద సమన్వితమ్ అని యారంభించిన,

నారాయణ ముఖోద్గీతం నారదః శ్రుతవాన్ పురా బ్రహ్మణః సదనే అనియు

అష్టాశీతి సహస్రాణి మునీనాం భావితాత్మనామ్,

సూర్యానుగతిభిస్తాత ఋషిభిన్తై ర్మహాత్మభిః

మేరౌ సమాగతా దేవా శృణ్వంతశ్చైత దుత్తమమ్ అనియు

వివరముగా పాంచరాత్ర శాస్త్రమును బ్రహ్మకు నారాయణుడు స్వయముగా నుపదేశించుచుండగా నారదుడు వినెననియు, ననేక వేల మునులు, సూర్యునమవర్తింపుచు నీ శాస్త్రమును తెలిసికొనుచుండగా మేరు పర్వతమందలి దేవతలు వినిరనియు, శంతను సుతుడగు భీష్ముడు, ధర్మరాజున కుపదేశించినట్లు

చెప్పబడెను. ఇట్లీ శాస్త్రము, సత్సంప్రదాయప్రాప్తమై యున్నది. ఇంకను

శ్రుత్వైతదాఖ్యాన పరం ధర్మరాడ్జనమేజయః

భ్రాతర శ్చాస్యతే సర్వే నారాయణ పరా భవన్

అని భీష్ముని వలన వినిన నీయాభ్యాసము ననుసరించి ధర్మరాజు తమ్ములు మనుమడగు జనమేజయుడు గూడ, పాంచరాత్రోక్త నారాయణ ధర్మపరులై యుండిరనియూ చెప్పబడెను.

మరియు కృష్ణద్వైపాయనః ప్రభుః ....

గతాంతరిక్షాత్సరితం క్షీరోద మమృతాశయం

పూజయిత్వా ఉ థ దేవేశం పునరాయాత్స్వమాశ్రమమ్

అని శ్రీవేదవ్యాస మహర్షి గూడ పాంచరాత్రగమ తత్పరుడై అంతరిక్ష యానముతో నమృత ప్రభవమగు క్షీరార్ణవము కేగి యచ్చట వ్యూహరూపుడగు శ్రీమన్నారాయణుని మనసార యర్చించి తిరిగి తనయాశ్రమమునకు వచ్చుచుండెననియూ చెప్పబడెను. ఇట్లు నారాయణుడు స్వయముగా కటాక్షించిన పాంచరాత్ర శాస్త్రము. అనేకాభియుక్తుల చేత, పరమ ప్రమాణముగా నాదరింపబడిన ఉత్తమ ప్రమాణమని నిర్ణయింపబడినది.

కాబట్టి పాంచరాత్రము, కేవలము దేవలకులకే వర్తించుననుట యుక్తము కానేరదు. వైదిక మార్గ ప్రవర్తకులైన చతుర్ముఖాదుల చేత నాదరింపబడి సత్సంప్రదాయ సిద్ధమై శ్రుత్యాద్యన్వితమైన యీ శాస్త్రానుసారముగా వైదిక ధర్మములతో పాటు, ఆచరించుట యుక్తము.

పాంచరాత్ర ప్రామాణ్య ప్రకరణము ముగిసెను.

భగవద్భక్త దౌర్జాత్యాపగమ ప్రకరణము

వక్ష్యమాణ సంగతి సంగ్రహము

ఇక పైని, ఈ ప్రకరణములో వెనుకటి ప్రకరణముల యందు చెప్పబడిన విధముగా సిద్ధోపాయ నిష్ఠులై సదాచార్యాశ్రయణము వలన పంచ సంస్కారపరులైన ముముక్షువులలో శ్రుతి స్మృత్యాదుల వలెనే శ్రేష్ఠ ప్రమాణమైన శ్రీపాంచరాత్ర శాస్త్రము నందు దాహృతమైన పంచ సంస్కారవశ్యకత. దేవలకులనబడు విష్ణు పూజక విప్రులకు మాత్రమే యను దుశ్శంకకు పరిహార వచనములును, తత్వ త్రయ జ్ఞాన పూర్వకముగా నొనరింపవలసిన భగవదారాధన బోధక వచనములును, భగవద్భక్తి లేని క్షత్రియాదులకు మాత్రమే దేవతాంతర పూజయుక్తమనియు, భగవద్భక్తులగు క్షత్రియాదులకు గూడ, విష్ణ్వారాధనమే కర్తవ్యమనియు చెప్పు ప్రమాణ వచనములును, ముముక్షువులగు బ్రాహ్మణాదులకు సులభమగు గృహోర్చారూప భగవదారాధన విధియు, అర్చక శబ్దము సర్వ సాధారణముగా నున్నను, ధ్వజారోహణాదులతో గూడిన దేవాలయార్చన చేయు విప్రుల యందే, అర్చక వ్యవహారముండునను దానికి ప్రమాణములును, శ్రీవైష్ణవత్వమునకంగమగు శంఖ చక్ర ధారణము ఆర్త ప్రపన్నులకు గూడ నుండవలెననియు, నక్కరలేదనియు విభిన్నముగా చెప్పెడి ప్రమాణములకు ఐక కంఠ్యముగా నవగాహన మొనర్చుకొనుట.

సదాచార్య ప్రసాద లభ్యమను విషయమును, అట్టి జ్ఞానము లేనందు వలన సంశయాత్మత గలుగుననునంశమును, సదాచార్య సచ్ఛిష్య స్వరూప ప్రదర్శనమును, సదాచార్య పర తంత్రులగు వర్ణాశ్రమ స్థులకందఱకును కేశవారాధనావశ్యకతయు, అట్టి యారాధనోపయుక్త స్నానాదులు పుష్పాద్యుపకరణ సంగ్రహత దధికారి వివరణమును, గర్భ వైష్ణవునకు పంచ సంస్కారముల కాలనిర్ణయమును, తత్ప్రమాణ వచనములును, గర్భ వైష్ణవులకు గూడ వర్ణాశ్రమాచారవశ్యకతయు, దానికి ప్రమాణములును, భగవదారాధనము బ్రాహ్మణ క్షత్రియాదులకుండినను, బ్రాహ్మణులకు ద్విజధర్మోక్తాచారములుండవలెనను దానికి ప్రమాణ వచనములును, వాని యందలి శంకా పరిహారములున్ను, భగవద్భక్తులకు దౌర్జాత్యమును తొలగించు ప్రమాణములను, వివరముగా తెలుపబడినవి.

దేవలకార్చక భేద నిరూపణము

శ్రుత్యాదులతో సమాన ప్రామాణ్యము గల పాంచరాత్ర శాస్త్రములో విధింపబడిన శంఖ, చక్రధారణాదికము చేయకుండగనే భగవదర్చనాదికము చేయు వారిని దేవలకులుగా శాస్త్రము చెప్పుచున్నది. పరాశర సంహిత, మూడవ అధ్యాయములో

అసంకితస్తు యో మోహా త్కామా న్మోక్షార్థ మాదరాత్
అర్చయే న్మాం వేదయుక్తం చండాలో భవే ద్ధ్రువమ్ ॥
సవై దేవలకో నామ సర్వ కర్మ బహిష్కృతః ॥
స యాతి నరకం ఘోరం తస్యాయుశ్శ్రీశ్చ నశ్యతి

చక్రాంకణాది విహీనుడై మోహము వలనను ద్రవ్యాశ చేతను గాని మోక్షమును కోరిగాని, వేదమంత్రములతో నన్నర్చించు వాడు చండాలుడగును. వానినే దేవలకుడందురు. వాడు సర్వ కర్మలకును అనర్హుడు. అతని ఆయువు సంపదయు నశించును. అని భగవంతుడు స్వయముగా చెప్పినట్లున్నది. ఇంకను

భగవంతుని ద్రవ్యమును దొంగిలించుచు భగవదర్చనమును చేయువారు చక్రాంకితులైనను వారిని గూడ దేవలకునియే శాస్త్రము చెప్పుచున్నది. ఆ పరాశర సంహితలోనే మొదటి అధ్యాయములో

పరార్థం పూజయే ద్విష్ణుం ధనార్థం హ్యర్చయే ద్ధినమ్ ।

స వై దేవలకో నామ సర్వ కర్మ బహిష్కృతః ॥

కుక్షిం భరార్థం యో విష్ణుం విత్తార్థీ యోదినత్రయమ్ ।

స వై దేవలకో జ్ఞేయ స్సర్వ కర్మ బహిష్కృతః

ఇతరుల నుండి రాదగిన ధనము కొరకై యొక దినము విష్ణు నర్చించినను తన పొట్టను పోషించుకొనుటకు డబ్బునకాశ పడి మూడు దినములు అర్చించిన వాడును. దేవలకుడనబడి సర్వ కర్మలలో ననర్హుడగునని గూడ నిరూపింపబడెను.

అట్లు గాక, అనన్య ప్రయోజనులై, కేవల భగవత్తీర్థ ప్రసాదములనే ధారకముగా నెంచి భగవదారాధనము చేయు బ్రాహ్మణ శ్రీవైష్ణవుల యందు దేవలకత్వముండదని హారితస్మృతియందు ఐదవ అధ్యాయములో చెప్పబడెను.

భక్త్యా యద్యర్చయే ద్దేవం గ్రామార్చాహరి మవ్యయం ।

ప్రసాద తీర్థ సేవార్థం నాసౌ దేవలకో భవేత్

నాప హృత్య హరేర్ద్రవ్యం గ్రామార్చన పరో భవేత్ ।

భక్త్యా సంపూజ్య దేవేశం నాసౌ దేవలకో భవేత్ ॥

వైఖానసస్తు యో విప్రః హరి పూజన తత్పరః ।

నాసౌ దేవలకో జ్ఞేయో హరి పాదాబ్జ సంశ్రయాత్

అని యిట్లు. భక్తితో గ్రామార్చయందు ఆరాధనము చేయునట్టి తత్తీర్థ ప్రసాద మాత్ర కాంక్షులగు పాంచరాత్ర వైష్ణవులు, వైఖానస శ్రీవైష్ణవులును గూడ, దేవలకులు గారని స్పష్టముగా చెప్పబడెను.

వైఖానసులకు గూడ పంచసంస్కారావశ్యకత

వైఖానస వైష్ణవులకు గూడ దప్త చక్రాంకణమావశ్యకమని సాక్షాద్భగవద్వచనములన వలన సిద్ధము

వైఖానసద్విజానాం చ కుర్యా త్తృత్యం చతుర్ముఖ

విష్ణు పూజాది సిద్ధ్యర్థం పంచసంస్కారముత్తమమ్

అని పరాశర సంహితలో గలదు. ఇంకను నందే

తతో విష్ణ్వర్చన స్సమ్య గ్విష్ణు దేవలయం తతః ।

ప్రవిశ్య పాంచరాత్రేణ వైఖానసమతేన వా

పంచ సంస్కారములు పొందిన పిమ్మటనే, విష్ణ్వర్చకుడు, పాంచరాత్ర విధానముతో గాని, వైఖానస విధానముతో గాని, విష్ణ్వర్చనమునకు దేవాలయములో ప్రవేశించి యర్చింపవలెననియూ చెప్పబడెను. దీని వలన పాంచరాత్ర వైఖానస వ్యతిరిక్త విధానముతో భగవదారాధనమును చేయువారే దేవలకులనబడుదురని తెలియుచున్నది.

దివ్యే సిద్ధే మానుషే చ స్వయం వ్యక్త స్థలాదిషు ।

అర్చయే ద్వాసుదేవం చ కేశవాది స్త్రియాసహ

దేవతా ప్రతిష్ఠితములునూ, సిద్ధ ప్రతిష్ఠితములునూ, మానుష ప్రతిష్ఠితములునూ, స్వయం వ్యక్తములు మానగు భగవద్బింబముల యందు శ్రియః పతిని, కేశవాది తత్తన్నామములతో లక్ష్మీ విశిష్టునిగా నర్చించుచుండవలెను. అని చెప్పినట్లు స్వల్ప కామనా లోలురై కాక కేవల భగవత్తీర్థ ప్రసాదధారకులైన పాంచరాత్ర వైఖానసార్చకులు, దేవలకులనింపించుకొనరు.

ఇకనట్టి, దేవలకత్వము రుద్రా దీతర దేవతార్చన మొనర్చు వారి యందే యుండునని హారితస్మృతిలో స్పష్టముగా యున్నది.

హరద్విజానామయేతు విప్రా దేవ పరాయణాః ।

తే వై దేవలకాజ్ఞేయా స్సర్వ కర్మసు గర్హితాః ॥

స్పృష్ట్వా దేవలకాన్విప్రా స్సవాసా జల మావిశేత్

అని దీనిచే వైఖానసులు గూడ, పంచ సంస్కార సంస్కృతులై విష్ణ్వారాధనము నొనర్చవలెనని స్పష్టము.

భగవదారాధకులకు తత్త్వ త్రయజ్ఞానావశ్యకత

శ్రియఃపతి నారాధించువారికి చిదచిదీశ్వర తత్త్వముల యథార్థ జ్ఞాన ముండవలెనని శాస్త్రము చెప్పుచున్నది. ఎట్లనగా, హారీత విశిష్ట ధర్మశాస్త్రములో నాల్గవ యధ్యాయమున

అథ వక్ష్యామి రాజేంద్ర విష్ణోరారాధనం పరం ।

ప్రత్యూషే సహసోత్థాయ సమ్యగాచమ్య వాగ్యతః ॥

ఆత్మానం దేహ మీశం చ చింతయే త్సంయతేంద్రియః అని మొదలసుకొని

చింతయిత్వా నమస్కృత్య కీర్తయే ద్దివ్యనామభిః ।

సంకీర్త్య నామ సాహస్రం నమస్కృత్య గురూనపి

అను వరకు చెప్పబడెను. దాని భావమేమనగా భగవదారాధన చేయు అర్చక వైష్ణవుడు తెల్లవారు జాముననే నిద్రలేచి దైహిక కృత్యములను నిర్వర్తించుకొని శౌచనమున నాచమనమును చేసి నియమయుక్తుడై పంచవింశతి తత్త్వాత్మకుడగు ఆత్మ యొక్కయు, ప్రకృతి వికార రూపమై మాంసశోణితాద్య పవిత్ర ద్రవ్య ప్రచురమైన దేహము యొక్కయు, అట్టి యాత్మ ప్రకృతుల కంటె పరమ విలక్షణ స్వరూపుడగు పరమాత్మ యొక్కయు, స్వరూపములను విశదముగా ధ్యానించుచు, పరిశుద్ధాత్మస్వరూపుడనగు నేను కర్మ వశమున నిట్టి యపవిత్ర దేహమును పొందితిని గదాయని నిర్వేదమును చెంది, ఇట్టి దేహ సంబంధము దీరుటకు సాక్షాత్పర తత్త్వమై భక్తానుగ్రహార్థము దివ్యమంగళ విగ్రహమును దివ్యస్థానమును పరిగ్రహించి వేంచేసియున్న శ్రీహరిని ధ్యానించి సహస్రనామములతో స్తోత్రమొనర్చి తరువాత, సాక్షాద్భగవత్స్వరూపులగు స్వాచార్యులకు భక్తి పురస్సరముగా నమస్కరించి, తరువాత స్నానాదికృత్యముల నాచరించుకొని దేవాలయమున ప్రవేశించి భగవదారాధనమున కుపక్రమింపవలెను అని విపులముగా చెప్పబడెను. కాబట్టి భగవదారాధకులగు అర్చక స్వాములకు తత్త్వత్రయయాదార్థ్యజ్ఞాన మావశ్యకమని విశిష్ట ధర్మశాస్త్రములు చెప్పుచున్నవని తెలియవలెను.

ముముక్షువులకు గృహార్చనా విధి

ముముక్షువులగు శ్రీవైష్ణవ విప్రులు తమ తమ గృహములలో ప్రత్యేకముగా విష్ణుబింబముల నుంచు కొని నిత్య నైమిత్తిక కర్మల నాచరించుకొనిన పిదప నీ క్రింది విధానముతో నారాధించుకొనవలెను. ఎట్లనగా

గృహార్చనే తు కర్తవ్యం విధిం వక్ష్యామి శాశ్వతమ్ ।
సంస్నాప్య దేవం గవ్యేన మంత్ర పూత జలేన చ ॥
మంత్రేణావాహయే ద్దేవ్ పరవ్యోమ్ని స్థితం హరిమ్ ।
మహాభాగవత స్స్పృష్ట్వా మంత్ర రత్నం జపే త్సుధీః ॥
ఉపచారై స్సమభ్యర్చ నమస్కుర్యాచ్చ భక్తితః ।
దద్యాత్ పుష్పాంజలిం తస్మై

అని హారిత స్మతి యందు విపులముగా చెప్పబడినట్లు, గృహార్చాబింబమునకు పంచగవ్యముతోను మంత్రపూతజలముతోను నభిషేకము సమర్పించి మూలమంత్రముతో నావాహనము మొదలగు నుపచారములను చేయవలెను. అంతకు ముందు, పంచోపనిషదన్యాస పూర్వకముగా తన దేహమును స్పృశించి మూలమంత్ర న్యాస పూర్వకముగా మూల మంత్ర జపము నాచరించి తరువాత, షోడశోపచారములను సమర్పించి, నమస్కరించి, పుష్పాంజలిని సమర్పింపవలెను. ఇట్టి గృహార్చారాధనము వైష్ణవై ర్వైదికైః పూర్వై ర్యద్యాదాచరిత్ పురా అనెడు హారిత స్మృతి వచనముల వలన పూర్వాచార్యులగు వైదిక శ్రీవైష్ణవులందఱును నాచరించు విధము విశదమగుచున్నది. ఇంకను,

గృహార్చనము అధునా సంప్రవక్ష్యామి వృత్త మేకాంత లక్షణమ్ ।
నారీణామపి కర్తవ్య మహన్యహని శాశ్వతమ్

అను దానిని బట్టి, పురుషులకే కాక, స్త్రీలకు గూడ కర్తవ్యముగా భగవదారాధనము చెప్పబడినందున స్వరూప జ్ఞానము కలిగి పరిశుద్ధాచరణము గల వైష్ణవ బ్రాహ్మణ స్త్రీలు, పురుషా సన్నిధానములో గృహార్చనను నారాధింపవచ్చునని కనబడుచున్నది.

వర్ణ చతుష్టయమునకు అర్చనా నియమములు

ప్రథమ వర్ణజులగు బ్రాహ్మణ శ్రీవైష్ణవులకు శ్రీమన్నారాయణుడే పరదైవమనియు, క్షత్రియాదులకు నైచ్ఛికముగా సూర్య సోమ రుద్రాదులు గూడ దైవములుగా నుండవచ్చుననియు, భస్మాదిధారణము క్షత్రియాదులకు ఐచ్ఛికముగా నుండవచ్చుననియు, వారికే శ్రీహరియందు భక్తి గలిగినప్పుడు, ఊర్ధ్వ పుండ్రాది ధారణ మావశ్యకమనియు, వాసిష్ఠ స్మృతి యందున్నది. ఎట్లనగా

నారాయణః పరం బ్రహ్మ బ్రాహ్మణానాం హి దైవతమ్ ।
సోమ సూర్యాదయో దేవాః క్షత్రియాణాం విశామపి ।
శూద్రాదీనాం తు రుద్రాద్యా అర్చనీయాః ప్రకీర్తితాః ।
రుద్రార్చనం త్రిపుండ్రం చ యత్పురాణేషు గీయతే ॥
క్షత్రవిట్ఛూద్ర జాతీనాం న విప్రాణాం తదిష్యతే ...

ముముక్షుభి ర్వీతరాగైః అప్రమత్తై స్సమాహితైః ।

ఊర్ధ్వ పుండ్రం హరేః పూజా క్షత్రియాద్యై రనుష్ఠితమ్

అని చెప్పబడెను మరియు బ్రాహ్మణుడు, విష్ణ్వర్చనమును చేయునప్పుడాతనికి హరేః పూజా క్షత్రియాద్యై రనుష్ఠితమ్ అని చెప్పబడెను. మరియు బ్రాహ్మణుడు, విష్ణ్వర్చనమును చేయునప్పుడాతనికి అర్చక, బ్రాహ్మణ, విప్ర, వేదవిత్, వైష్ణవ, గురు అను గౌరవ నామములుండుననియు, ఇతర దేవతారాధన మొనర్చునపుడు దేవలకుడని వ్యవహారము గలిగి వర్ణ భ్రంశము గలుగుననియు, హారిత స్మృతిలో గలదు.

అర్చకో బ్రాహ్మణో విప్రో వేదవిద్వైష్ణవో గురుః ।

పర్యాయేణ తు విద్యన్తే నామాని శ్రీపతే ర్హరేః ॥

యః కర్మ కురుతే విప్రో వినా విష్ణ్వర్చనాత్క్వచిత్ ।

బ్రాహ్మణాద్భ్రశ్యతే సద్య శ్చండాలత్వం చ గచ్ఛతి అని చెప్పబడెను.

అర్చక శబ్దమునకు యోగరూఢత్వము

అర్చక శబ్దము, పంకజాది శబ్గముల వలె యోగరూఢ శబ్దము, **పంకే జాయతే** అనునట్లే **అర్చయతీతి** = అర్చకః అని యౌగికముగాను ఒకే వ్యక్తియందు రూఢముగాను గూడనుండును. పంకమందు పుట్టిన యన్నింటి యందును, పంకజ పదము, యౌగికముగా వర్తించినను, అరవిందమందెట్లు యోగరూఢమై ముఖ్యముగా నుండునో, యట్లే భగవదర్చనమును చేయు వారందఱి యందును నర్చక పదము, యౌగికముగా వర్తించినను, విష్ణ్వారాధకుల యందు మాత్రమే, గౌరవ నామమై యర్చక స్వాములని యోగరూఢముగా వ్యవహరింపబడును. అట్టివారు శ్రీరంగాది దివ్యదేశములలో ధ్వజారోహణ రథోత్సవాది దీక్షాకర్మ నిరతులై యుండువారగుచున్నారు. ఇండ్లలో గృహార్చనమును చేయు వారట్టి నామమును పొందరు.

దృప్తార్త ప్రపన్న సంస్కార భేదాదులు

ప్రపన్నులు, ఆర్త ప్రపన్నులనియు దృప్త ప్రపన్నులనియు రెండు విధములుగా నుందురని యిది వఱలో సిద్ధోపాయ నిర్ణయ ప్రకరణములో నిరూపింపబడెను. అందు, ప్రపత్త్యంగముగా పంచ సంస్కారములు భగవదారాధన కుండవలెనని చెప్పబడి యుండినను, దృప్త ప్రపన్నునకు వలె ఆర్త ప్రపన్నులకు పంచ సంస్కారముల యావశ్యకత యుండబోదని ఈక్రింది పరాశర సంహితా వచనము వలన తెలియుచున్నది.

తాపాది పంచ సంస్కారాః ప్రపన్నానాం విశేషతః ।

ప్రపత్త్య.ంగాని విజ్ఞేయా వాసిష్ఠాద్యైశ్చ యౌగిభిః ॥

సర్వదాஉ_ర్త ప్రపన్నానాం దృప్తానాం వేదమార్గిణామ్ అని చెప్పుచు,

ఆర్తానామంగవైకల్యే మత్సాయుజ్యం లభేత్సదా అనియు

తాపాది పంచ సంస్కారాః పారమైకాంత్య హేతవః అనియు చెప్పబడెను.

ఈ వచనములను విచారించినప్పుడు అన్యోన్య విరోధమున్నట్లును, నార్త ప్రపన్నులకు దృప్త ప్రపన్నులకు వలె పంచ సంస్కారములు, విధిగా నుండ నక్కర లేదనియు, నార్త ప్రపన్నులకు పారమైకాంత్యము లేదనియు స్పష్టమగుచున్నది. అయితే, ఆ వచనములకు ఐక కంఠ్యము, సద్గురూప దేశ లభ్యమే గాని వేఱు ఆధారమందు గానరాదు. కాబట్టి యట్టి సంశయమును పొందిన వారు సంశయాత్ములు కావలసి వచ్చుచున్నది. ఇట్లుండగా

దీనిని గురించి భగవద్విషయములో, నమ్మాళ్వార్లు దృప్త ప్రపన్నులా, యార్త ప్రపన్నులా యను విచారములో వారు, ఆర్త ప్రపన్నులేయనియు వారికి వెంటనే పరమ పదము సిద్ధింపక తడవైనందుకు కారణము. భగవత్సంకల్పముచే వారి వలన లోకమును దిద్దుబాటు చేయించుటకు విలంబము గలిగినదనియు సాయించబడియున్నది. అట్టి యాళ్వార్లు గూడ తమ అనుసంధానములో పంచసంస్కారోప లక్షకముగా పుండ్ర సంస్కార సూచకమగు కేశవన్తమర్ అను తిరువాయ్ మొళి సాయించి యుండిరని సత్సంప్రదాయము. కాబట్టి, సంసార విరక్తులై మోక్షార్తి గల పరమైకాంతులకు గూడ పంచ సంస్కారావశ్యకత గలదు. దీనికి బలకరముగా శ్రీవైష్ణవ ధర్మములలోని

బ్రహ్మచారీ గృహస్థోవా వాన ఉ ప్రస్థో థ భిక్షుకః ।
శంఖ చక్రధరా స్సర్వే సమయ వ్రత నిష్ఠితాః ॥

అను వచనము నాలుగాశ్రమముల వారికినీ, పంచ సంస్కారావశ్యకతను చెప్పుచున్నది. పరమైకాంతులు యతులలో చేరుదురు గదా,

సదాచార్య సచ్ఛిష్య లక్షణములు

వెనుకటి ప్రకరణములలో వివరింపబడిన సదాచార్యులునూ వారి చేత సంస్కరింపబడిన సచ్ఛిష్యుడునూ నుండవలసిన విధమును వివరింతుము. అందు సచ్ఛిష్య లక్షణ మెట్టిదనగా

ఆస్తిక్యమనసం సద్భిరుపేతం ధర్మ వత్సలమ్
శ్రద్ధ ధానం సదాచారం గురు శుశ్రూషణేరతమ్

అనగా భగవదస్తిత్వమునందు గాఢ విశ్వాసమును, సత్పురుష సాంగత్యమును, ధర్మమందు ప్రీతియు, నమ్మకమును, మంచి ఆచరణమును, గురువు నెడ సేవాభిలాషయు, గలిగి యుండవలె నని భావము. అట్లే

ఆస్తికో ధర్మశీలశ్చ శీలవా న్వైష్ణవ శ్శుచిః ।
గంభీర శ్చతురో ధీర శ్శిష్య ఇత్యభిధీయతే ॥

ఆస్తిక్య ధర్మ బుద్ధులతో పాటు, సత్స్వభావమునూ, విష్ణు భక్తియూ, బాహ్యాభ్యన్తర శుద్ధియూ, గంభీర స్వభావమును, చాతుర్యము, ధైర్యమునూ ననునవి గూడ శిష్య లక్షణములని చెప్పబడెను. మరియు

గురోశ్చ గురవ స్సర్వే పూజనీయ విశేషతః
గురుదార సుతాదౌ చ గురువద్ వృత్తి మాచరేత్

తన గురువునకు గురువులుగా నుండు వారిని పూజించుట, గురు భార్య గురు పుత్రులు అగు వారి యందు గురు ప్రతిపత్తిని చేయుట, అనునవి గూడ సచ్ఛిష్యుని లక్షణములు.

ఏవం గురు ప్రసాదేన శేషత్వ జ్ఞాన పూర్వకమ్ ।
దేవతా న్తరవన్నిత్యం శబ్దాదీనవకుత్సయేత్ ॥

గురు కటాక్ష లబ్ధ గురుశేషత్వ జ్ఞాన పూర్వకముగా, శబ్దాది విషయములను దేవతాంతరముల వలె నసహ్యముగా జూచుచుండవలెను. ఇంకను

యేనైవ గురుణా యస్య న్యాసవిద్యా ప్రదీయతే ।
తస్య వైకుంఠ దుగ్ధాబ్ధి ద్వారకా స్సర్వ ఏవసః ॥

అనగా ఏ ఆచార్యునిచే నేశిష్యునకు, ప్రపత్త్యుపాయము ఉపదేశింపబడెనో, ఆయనే (ఆయన సన్నిధియే) ఆ శిష్యునకు పరమపదముగాను, వ్యూహనివాసమగు క్షీర సముద్రముగాను, అవతార నివాసమగు ద్వారకగాను దలంపబడు చుండుటావశ్యకము. సర్వదేవ నివాస భూతుడుగా స్వాచార్యుని భావించు చుండవలెనని భావము. ఇంకను

ఆచార్యస్య ప్రసాదేన మమ సర్వ మభీప్సితమ్ ।

ప్రాప్స్యామీతి హి విశ్వాసో యస్యాస్తి స సుఖీ భవేత్ ॥

ఆచార్య కటాక్షము వలన నాసకలాభీష్టములు సిద్ధించుననెడి నమ్మకము కలిగియుండుట వలన నట్టి శిష్యునకు సుఖము లొదవును.

ఇక, సదాచార్య లక్షణ మెట్లుండవలెననగా, లోగడ సదాచార్య ప్రకరణములో **ఆచార్యో వేద సంపన్నో విష్ణు భక్తో విమత్సరః** ఇత్యాదిగా చెప్పబడియుండెను. అట్టి సదాచార్యుడు తనను ఆశ్రయించిన శిష్యుని

సంవత్సరం తదర్థం వా మాసత్రయ మథాపి వా ।

పరీక్ష్య వివిధోపాయైః కృపయా నిస్పృహో వదేత్ ॥

అని చెప్పినట్లు, సంవత్సరము గాని, ఆరు మాసములుగాని, మూడు మాసములు గాని అనేక ఉపాయములతో వానిని పరీక్షించి అర్హుడనితోచిన పిదప కామనారహితముగా మంత్రోపదేశాదులను చేయవలెను. ఈ విషయమునే

సంవత్సరం పరీక్ష్యాథ తం శిష్యం శాసయే ద్గురుః ।

తస్య వై పంచ సంస్కారాన్ కుర్యాత్సమ్యగ్విధానతః

అను వచనము గూడ చెప్పుచున్నది. సద్గురువు అర్థకామతత్పరుడు గాక, కేవల శిష్యోజ్జీవనమునే కాంక్షించుచు, దానిని సంస్కరింపవలెను. ఇట్లు ప్రవర్తించు ఆచార్యునకు వేదాంత వేద్యుడగు రంగనాథుడు వశ్యుడై యుండి తచ్ఛిష్యోజ్జీవనమును కలుగచేయును.

ఈ విషయమునే, వరవరమునులు, తమచే విన్నవింపబడిన యతిరాజవింశతిలో

శ్రుత్యగ్రవేద్యనిజ దివ్య గుణ స్వరూపః ప్రత్యక్షతాముపగత స్త్విహరంగరాజః ।

వశ్య స్సదా భవతి తే యతి రాజ తస్మా చ్ఛక్త స్వకీయజన పాపవిమోచనే త్వమ్

అని సాయించి యుండిరి.

సర్వ వర్ణాధికృత భగవదారాధనము

ఇట్టి పాపధ్వాంత క్షయకరులగు, యతిరాజ సమానులైన సదాచార్యులను ఆశ్రయించిన సర్వ వర్ణముల వారును, చేయతగిన భగవదారాధన మెట్టి దనగా,

రాగాద్యదుష్టం హృదయం వాగదుష్టా ఒనృతాదినా ।

హింసాద్యదుష్టః కాయశ్చ కేశవారాధనత్రయమ్ ॥

అని వేదాచార్యులు చెప్పినట్లు, రాగద్వేషాదుల చేత దూషితముగాని మనస్సును, అనృత పరుషాది వర్జితమగు వాక్కును, పరహింసాదులను వర్జించిన కాయమును, అను త్రికరణముల యందు శుద్ధి కలిగి యుండుట. మొట్టమొదటి కేశవారాధన సాధనము, మరియు నట్టి కరణ త్రయశుద్ధితో పాటు

జ్ఞాన హ్రదే ధ్యాన జలే రాగ ద్వేషమలాపహే ।

యః స్నాతి మానసే తీర్థే న యాతి పరమం గతిమ్ ॥

అని చెప్పిన రీతి మానసమను పుణ్యతీర్థమందు, జ్ఞానమను తటాకములోని, రాగద్వేషాది మలములను పోగొట్టు ధ్యానమను జలము నందు స్నానము ఆచరింపవలెను. అట్టి వానికి ఉత్తమగతి కలుగును. ఇక, ఆరాధనోపయోగి పుష్పము లెట్టివనగా,

అహింసా ప్రథమం పుష్ప పుష్ప మింద్రియ నిగ్రహః ।

సర్వభూత దయా పుష్పం క్షమా పుష్పం తథైవచ ।

జ్ఞానం పుష్పం తపః పుష్పం ధ్యానం పుష్పం విశేషతః ।

సత్య మష్ట విధం పుష్పం విష్ణోః ప్రీతికరం శుభమ్ ॥

అని చెప్పినట్లు అహింస ఇంద్రియ నిగ్రహము, సర్వభూత దయ, క్షమ, జ్ఞానము, తపస్సు, ధ్యానము, సర్వము అను నీ ఎనిమిదిపుష్పములే భగవత్ప్రీతి కరములని తెలియవలెను.

ఇక నైవేద్యము అహమన్న మహమన్నం అని చెప్పబడు ఆత్మయే నైవేద్య స్వరూపమని తెలియవలెను.

ఈ విధముగా స్నానపూర్వక పరిశుద్ధ పుష్పాద్యుపకరణములతో కరణత్రయశుద్ధి రూప కేశవారాధనమును చేయుటయే పరిశుద్ధ భగవదారాధనమనిపించుకొనును. ఈ ఆరాధనములో అన్వయింపదగిన అధికారులు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః స్త్రియ శ్శూద్రా స్తథేతరే ।

తస్యాధికారిణ స్సర్వే సత్వశీల గుణాయుధి ॥

ఇత్యాది హారితాది బోధితమైన రీతిని సర్వ వర్ణములలోని సర్వ లీలాదులు గల పురుషులు, స్త్రీలు గూడ నిందధికారులని తెలియుచున్నది. ఇట్టి కేశవారాధనము తమకు పంచసంస్కారములు కృపచేసియున్న సదాచార్య పూర్ణ కృపాలభ్యమని తెలియవలెను.

అధికారి భేదము చేత సంస్కార కాల భేదము

సదాచార్యుని వద్ద పంచ సంస్కారములను పొందుటకు, సామాన్యార్థులకు కాల నియమము లేదు.

పంచ సంస్కార దీక్షాయాం కాలదోషాదికం న చ ।

భక్తానాం విష్ణు సాయుజ్యం ప్రపత్త్యా సర్వదా భవేత్

అని పరాశర సంహితలో చెప్పబడెను. ఈ వచనము సామాన్యార్థియనదగు ప్రాకృతుడై యుండి వైష్ణవత్వరుచ్యాదులు గల వానిని గురించియే చెప్పబడినదని తెలియవలెను. అది వఱకే గల వైష్ణవకులమందు పుట్టి, వైష్ణవుడై యుండు గర్భ వైష్ణవునకు మాత్రము కాలనియమము ఉన్నది. అదెట్లనగా,

పుత్రోత్పత్తి ముహూర్తే వై బ్రహ్మణా స్సద్విజాతయః ।

తాపసంస్కార విధినా శంఖం చక్రం సదా శుచిమ్ ॥

కృత్వా తప్తం లఘుతరం సార్ధక శ్వేత మృత్స్నయా

ఊర్ధ్వపుండ్రం తథా కృత్వా జాతకర్మ సమాచరేత్ ॥

ఏతత్కర్మ న కుర్యాచ్చే త్తచ్ఛిశుం శూద్రవ త్త్యజేత్ ॥

బ్రాహ్మణ శ్రీవైష్ణవులు, పుత్రోత్పత్తి సమకాలముననే స్నానము చేయించిన శిశువునకు, అతిస్వల్ప తప్తములగు శంఖ చక్రముల చిహ్నములను బాహుమూలమున అంకితమును చేసి యార్ద్రమగు శ్వేత మృత్తిక నందు వెంటనే పూసి ఊర్ధ్వపుండ్రము నిడి తరువాత జాతకర్మ నాచరింపవలెను. అట్లు సంస్కరింపబడని శిశువు బ్రాహ్మణ శిశువైనను శూద్రశిశివువలెనే యగును అని పరాశర సంహితలో చెప్పబడెను. ఇంకను నామకరణాన్న ప్రాశన చౌలోప నయన సంస్కారముల సమయమందు గూడ, చక్రాంకణాదులను చేయుచు నాయాశ్రౌత సంస్కారములను నిర్వర్తింపవలెనని గూడ పరాశర సంహిత యందు గలదు. కాని ప్రస్తుత కాలములో జాత కర్మాది సంస్కారములను చేయునప్పుడు శ్రీవైష్ణవ బ్రాహ్మణులలో, ఊర్ధ్వ పుండ్ర ధారణమును మాత్రము చేయించుటయు, ఉపనయన సంస్కారానంతరము, తగిన సదాచార్యుని సన్నిధి పంచ సంస్కారములు యధావిధిగా జరిపించుటయు నంతవరకు బాలురకు, సహపంక్తి భోజనమును, స్నాతులైన వారు వారి స్పర్శను వర్జించుట శిష్టాచారముగా నున్నది. కాబట్టి ప్రాకృతులగు వారి కభిలాష కలిగిన కాలమందే మాసాదిపరీక్ష లేకుండ పంచ సంస్కారములు కృపచేయవచ్చుననియు, శ్రీవైష్ణవ బ్రాహ్మణులలో గర్భవైష్ణవ బాలులకు శిష్టాచార ప్రకారము కాల నియమముండుననియు తెలియదగును.

పూర్వోక్త కేశవారాధకుని గూడ భగవద్విగ్రహారాధనావశ్యకత

ఇది వరలో చెప్పబడిన కరణ త్రయశుద్ధి పూర్వకముగా మానసిక కేశవారాధనము చేయువారికి గూడ అట్టి శ్రద్ధను, వృద్ధి పరచుటకు పంచ సంస్కారపూర్వకముగా యాగ సంస్కార ప్రయుక్తమైన భగవద్విగ్రహారాధనమును గూడ సాక్షాత్తుగా నాచరింపవలసి యుండును. అట్లే శాస్త్రములు చెప్పుచున్నవి.

అనంతో వైనతేయశ్చ తథా వైఖనసాదయః ।

ఏతే ప్రపత్తి నిష్ఠాశ్చ పంచ సంస్కార సంయుతాః ॥

పంచకాలపరా స్సమ్యగ్బింబార్చాయాం ప్రియా శ్శుభాః ॥

అని పరాశర సంహితలో చెప్పబడెను. దీని భావమేమనగా అనంత గరుడ విష్వక్సేనాదులు, వైఖనసాది ఋషులు గూడ, ప్రపత్తి నిష్ఠులైయున్నను పంచసంస్కార సంస్కృతులై భగవద్విగ్రహములను పంచకాలార్చనావిధిలో నారాధించుటలో నాసక్తులై యుండిరని తెలియుచన్నది. కాబట్టి యందరకును విగ్రహారాధన మావశ్యకమని తెలియవలెను. **సర్వం సహోమ్** అని చెప్పినట్లున అర్చ్య స్పర్శ సహిష్ణుః అని చెప్పినట్లును సర్వ కళ్యాణ గుణ పరిపూర్ణత గలిగియు సర్వ సహిష్ణుత యర్చారూపమందే కలదని తెలియవలెను.

ఆరాధనలో వర్ణాశ్రమాచారావశ్యకత

ప్రతివారును నర్చావిగ్రహారాధనమును చేయునప్పుడు, స్వస్వవర్ణాశ్రమాచారముల, ననువర్తింపుచునే చేయవలెనని శాస్త్రములు చెప్పుచున్నవి. ఎట్లనగా,

వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరః పుమాన్ ।

విష్ణు రారాధ్యతే పంథా నాన్య స్తత్తోషకారకః ॥

అని విష్ణుపురాణము నందు గలదు. అయితే

జ్ఞాననిష్ఠో విరక్తోవా మద్భక్తోవా నపేక్షకః ।

స లింగానాశ్రమాం స్త్యక్త్వా చరేదవిధి గోచరః ॥

అని భాగవతములో శుద్ధ జ్ఞాన నిష్ఠుడును, సంసార విరక్తుడును, నా భక్తుడును, నగువాడు, అపేక్షను విడచి వర్ణాశ్రమాచారములను విడనాడి శాస్త్ర విధి పతిక్రమించి యుండవచ్చునని వచనము గలదు గదా అది యెట్లుచితమగును,? అనినచో, అట్టి భాగవత వచనము కంటె

శ్రుతి స్మృతి ర్మమైవాజ్ఞా యస్తాముల్లంఘ్య గచ్ఛతి ।

ఆజ్ఞాచ్ఛేదీ మమ ద్రోహీ మద్భక్తో ఽ పి సవైష్ణవః ॥

అను భగవద్వచనమే ప్రబలమని, పండిత జన సమ్మతముగాన పై భాగవత వచనమునకు, ఆశ్రమాం స్త్యక్త్వా అనగా స్వరూపత స్త్యాగము గాక ఫలత్యాగమే యర్థమని గ్రహింపవలెను, లేనిచో భగవద్వచనములకే పరస్పర విరోధము సంభవింపగలదు. ఇట్లేకదా సర్వ ధర్మా న్పరిత్యజ్య అను దానికినీయర్థమును అభియుక్తము నిర్వహించిరి. ఇంకను, నాన్యస్తత్తోషకారకః అను నిషేధవచనమున కుందు ప్రాబల్యము చేర గూడ యథాశక్తిగా వర్ణాశ్రమ సదాచారయుక్తుడగుచునే యారాధనము చేయవలెనను నదియే భగవత్సంమతమనవలెను. అశ్రమాంస్త్యక్త్వా అను వచనమున కట్టి యర్థమే భగవదభిప్రేతమని మద్భక్తోపి న వైష్ణవః అను భగవద్వచనము వలన సూచింపబడుచున్నది. కాబట్టి, వర్ణాశ్రమాచారములు స్వరూపతః । త్యాజ్యములు కావనియు ఫలతస్త్యాగమే భగవదభిప్రేతమనియు తెలియవలెను. అట్లు గాక, వానికి స్వరూప త్యాగమే యర్థమని చెప్పినచో, భగవద్భక్తులగు బ్రాహ్మణాదులకు బ్రహ్మచర్యాద్యాశ్రమ నియమములంతరించి వారికి శూద్రతౌల్యమే వచ్చివేయును.

ఇంకను, ఆ శ్రియఃపతికి వర్ణాశ్రమాచారయుక్త కైంకర్యమే ప్రిమమగుననునది

ప్రియాయ మమ విష్ణోస్తు దేవదేవస్య శార్ఙ్గిణః ।

మనీషీ వైదికాచారం మనసా ఽ పి నలంఘయేత్ ॥

అను భగవద్వచనము వలన సిద్ధము, అట్టి భగవదాజ్ఞనుల్లంఘించిన వాడు, ఆజ్ఞాచ్ఛేధియై ఆ వైష్ణవుడే యగుచున్నాడు. ఈ విషయములో దృష్టాంత రూపముగా నీ క్రింది వచనము గనబడుచున్నది.

యథా హి వల్లభో రాజ్ఞో నదీం రాజ్ఞా ప్రవర్తితామ్ ।

లోకోప యోగినీం రమ్యాం బహుసస్య వివర్ధనీమ్ ॥

లంఘయన్ శూలమారోహే దనపే క్షోఽ పి తాం ప్రతి ।

అనగా రాజునకు అత్యంత ప్రియుడగు, నొక పురుషుడు. ఆ రాజు నిఖిల జనోపయోగము కొరకును సమస్త సస్య సమృద్ధి కొరకును ఏటి కాలువను త్రవ్వించి యుండగా తనకా నీటి యందపేక్ష లేకున్నను, దానిని దాటుటకు కొరత కొయ్యనెక్కినట్లు, భగవదాజ్ఞారూప శ్రుత్యాది బోధిత ధర్మముల నతిక్రమించి స్వనాశ హేతువగు దురాచార సేవన ముందునని భావము. ఇందు అనపేక్షోఽ పి అని చెప్పినందున ప్రపన్నునకు గూడ లోక సంగ్రహము మొదలగు వాని కొరకు వర్ణాశ్రమాచారములు విడువదగవని తేలుచున్నది.

అవిప్లవాయ ధర్మాణాం పాలనాయ కులస్యచ ।

సంగ్రహాయ చ లోకానాం మర్యాదా స్థాపనాయచ అనియు

లోక సంగ్రహమేవాద్య సంపశ్య స్కర్తు మర్హసి

అనియు చెప్పబడిన వచనముల వలన వేదచోదిత ధర్మములు చెడకుండుటకును, తన వైష్ణవకులమును సంరక్షించుకొనుట కొరకును, లోక సంగ్రహము కొరకును, (అనగా లోకమును మంచి మార్గము నుండి

భ్రష్టముగా కుండ సంరక్షించుటకును) శాస్త్ర మర్యాదను నిలుపుట కొరకును, తనకు వాని యందు సాధన బుద్ధి లేకున్నను, నాచరించుచూనే యుండవలెనని తెలియుచున్నది. అట్లు గాక, వానినతిలంఘించిన వాడు,

ప్రియో ఽ పి మే నప్రియోసౌ మదాజ్ఞావ్యతివర్తనాత్

అను భగవచ్ఛాస్త్ర వచన ప్రకారము భగవద్భక్తుడై ప్రియుడై యుండిన వాడు గూడ భగవదాజ్ఞాతి లంఘన దోషము వలన భగవంతునకు విరోధియే యగును. అయినప్పుడు, భగవదాజ్ఞాతిక్రమణ మనునది, సామాన్య విశేష శాస్త్రముల రెండిటిలోను దేనిని అతిక్రమించినను సంభవింపగలదు. కాబట్టి తమ తమ యధికారమును, శక్తిని అనుసరించి సామాన్య విశేషధర్మములును రెండింటిని ననుష్ఠించుచు, భగవదాజ్ఞానువర్తియై భగవదర్చా విగ్రహారాధనమును చేయుచుండుట ప్రపన్నులగు నిఖిలాశ్రమ వర్ణస్థులకును నత్యావశ్యకమని తెలియవలెను.

ప్రపన్న ద్విజాచారము దౌర్జాత్య భంజకము

ప్రపన్నులైన బ్రాహ్మణుల, ఆచారము బ్రహ్మ క్షత్రియాది సకల వర్ణ సాధారణముగా నుండునని శ్రీపాంచరాత్ర భగవచ్ఛాస్త్రము చెప్పుచున్నది. పరాశర విశిష్ట ధర్మ శాస్త్రములో

జ్ఞానాన్న శుద్ధి ర్దాస్యం స్యా త్సర్వతాంత్రిక భేదతః ।
సదా ప్రపన్న శూద్రాణాం సర్వేషాం మోక్షకాంక్షిణామ్ ॥
మత్సాయుజ్యాది సిద్ధ్యర్థం ద్విజ ధర్మోక్త వద్భవేత్ ।

తత్త తంత్రోక్తమగు జ్ఞానము గలిగి నంత మాత్రము చేత శుద్ధి గలుగజాలదు. శూద్ర వర్ణమందలి వారికి, అగ్రజాతి దాస్యమే విహితమై యున్నది. ప్రపన్నులై ఆచార్యముఖతః సంస్కారములను లభించి మోక్షమును గోరు శూద్రులకు, భగవత్సాయుజ్య సిద్ధికై ద్విజధర్మోక్తమైన పంచ సంస్కారములావశ్యకములై యుండును అని భావము. అట్టి శూద్రులకు గూడ, ప్రపన్నాచారము వలన దౌర్జాత్యము నశించి వారు సర్వవంద్యులగుదురని గూడ శాస్త్రము చెప్పుచున్నది. ఎట్లనగా,

యః పశ్యతి శుభాచారం వైష్ణవం వీత కల్మషమ్ ।
యస్మి న్కస్మిన్కులే జాతం దండవత్ప్రణమే ద్భువి ॥
మన్యే భగవతశ్చాపి మాన్యా భాగవతా ఇతి ।
కిమిక్షో రస్తి మాధుర్యం శర్కరా శకలే ష్వివ ॥
వైష్ణవస్తు విశేషేణ విష్ణో రాయతనం మహత్ ।
జంగమ శ్రీవిమానాని హృదయాని మనీషిణామ్
ఆధేయత్వ విధేయత్వ శేషత్వర సతాశ్రయాః ।
శ్రీపతే ర్ముఖ్య తనవః పరమైకాన్తిన స్స్మృతాః

అనగా పరిశుద్ధాచరణము కలిగినట్టియు, కల్మష రహితుడై నట్టియు, వైష్ణవుడు, ఏజాతిలో జన్మించిన వాడైనను, రహితుడై నట్టియు, వైష్ణవుడు ఏజాతిలో జన్మించిన వాడైనను, దర్శనమాత్రముననే ఆయన కందరును దండవత్ప్రణామము చేయవలెను. చెరకురసము నందు, తత్సారభూతమైన శర్కరా ఖండము (పటిక పంచదార) నందలి మాధుర్యముండదు గదా, విష్ణు భక్తుడు, భగవంతునకు నివాసభూతుడై యుండును. భక్తుల

హృదయములు, భగవంతునకు జంగమ (చలించెడు) దివ్య విమానములు, పరమైకాంతులగు శ్రీవైష్ణవ ప్రపన్నులు. అదేయత్వ విధేయత్వ శేషత్వ రూపముఖ్య శరీర లక్షణము గల భగవచ్ఛరీర భూతులగుచున్నారు. అని ఇట్టి మహర్షి వచన ప్రమాణములను బట్టి సాక్షాద్విరాట్పురుషుని ముఖబాహూరు పాదజాతులని శ్రుతి చెప్పుచున్న నాలుగు వర్ణముల వారికిని గూడ, ప్రపన్న పరమైకాంతి వైష్ణవత్వముండినప్పుడు, వారిని సాక్షాద్భగవచ్ఛరీర భూతులను గా దలంచి ప్రతిపత్తి చేయవలెను.

పై నిరూపణము వలన భగవద్భక్తులైన వారికి పుట్టుక చేత కలిగిన దౌర్జాత్యము పోయి నిఖిలవంద్యులుగా వారుండగలరని తేలినది.

పై విషయమునందు ఉదాహరణములు

అయితే ప్రపన్నులగు శ్రీవైష్ణవ శూద్రులకు శ్రీవైష్ణవత్వముతో పాటు, ద్విజధర్మోక్తాచారములు గూడ నుండినచో వారును, శ్రియః పతికి ముఖ్య శరీర భూతులగుదురని మాత్రము చెప్పినందున వారికి శూద్రత్వ రూప జాతియు నశించుట యెట్లు, వారికి ఔత్పత్తికమగు శూద్రత్వము శరీరముతో గూడ నుండునది గదా. అట్టి వారలకు నిహీనజాతి తొలగి ద్విజసమానులగుచ ఎట్లు పొసగదు. అనినచో, దానికి సమాధానము చెప్పెదము. జాతియనునది, పుట్టుకతో వచ్చిన ధర్మమనియు, ఆయా వ్యక్తి యొక్క శరీర సంస్థానమేయనియు, రెండు విధములుగా చెప్పబడుచున్నది. ఆ రెండు విధములగు జాతి హైన్యమునూ గొప్ప వారి సంబంధము వలన నశించి యపూర్వమగుధర్మరూపముగాను, సంస్థానముగాను, విలక్షణజాతి యుత్పన్నమగునని శాస్త్రము వలనను, ప్రత్యక్షముగాను సిద్ధమైనందున నట్టి శంకకు స్థానముండబోదు. ఎట్లనగా, ఔత్పత్తిక ధర్మమే జాతి, యను పక్షము నందు, ప్రత్యక్షములో ఘటము కాల్చనప్పుండు శ్యామ రూపము, కాల్చుట వలన పోయి దానికి విలక్షణయైన యెఱుపు రంగు వచ్చుచున్నది. అట్లే పుట్టుక వలన గలిగిన ధర్మమగు శూద్రత్వ రూప దుర్జాతి భగవద్భక్తి రూప దీప్తాగ్నిచే నశించి, భగవద్రాగరంజితమై, యుత్తమమగు వైష్ణవత్వ రూప జాతి సిద్ధింపగలదు. ఇంక వస్తువు యొక్క సంస్థానమే జాతి యనుపక్షము నందు గూడ, ప్రత్యక్షములో భ్రమర కీటక న్యాయమును బట్టియు, స్పర్శవేది సంసర్గ వశము నినుము బంగారమగుటను బట్టియు, సంస్థాన రూప జాతి యంతరించి, ఉత్తమ జాతి వచ్చుట ప్రత్యక్ష సిద్ధమగును.

మరియు శాస్త్ర ప్రమాణమును బట్టి కూడ, ఐళ స్త్రీ విషయములోను, అహల్యా శాప వృత్తాంత విషయములోను, అశ్వత్థామ యొక్క అస్త్ర వశమున నుత్తరాగర్భ పరివర్తనము విషయములోను, విశ్వామిత్రాది వృత్తాంత విషయమునను, చెప్పబడిన శబ్దరూప పురాణ ప్రమాణములను బట్టి సంస్థాన రూప జాతి, మారి క్రొత్త జాతి గలుగుట పరిమితమైయున్నది. దీనివలన జాతికి గూడ మార్పు తత్తత్ వ్యక్తికి సిద్ధించుననునది యసంబద్ధము కాదు. భగవద్భక్తులైన వారు శూద్రులైనను విప్రవత్పూజ్యులనియు, భగవద్భక్తి శూన్యులు. విప్రులైనను శూద్రుల వలె నపూజ్యులగుదురనియు, మహాభారతములోని

నశూద్రా భగవద్భాక్తా విప్రా భాగవతాః స్మృతాః ।
సర్వ వర్ణేషు తే శూద్రా యే హ్యభక్తా జనార్ధనే ॥

అను వచనము చెప్పుచున్నది.

భగవద్భాష్యకారాభిమత సిద్ధాంతము

పైన నిరూపించిన ప్రకారము దౌర్జాత్య ప్రయుక్త దోషము ప్రపన్న శ్రీవైష్ణవుల విషయములో నుండబోవను సిద్ధాంతము ప్రపన్న జనాచార్యులగు శ్రీభగవద్భాష్యకారుల కెంతవరకు సమ్మతమో విచారింతుము. శ్రీ భాష్యకారులు, పశుపత్యధికరణములో శైవమత నిరాకరణ సందర్భమున, మోహక శాస్త్రోక్త భస్మ రుద్రాక్ష ధారులగు శూద్రులకు, శూద్రత్వము పోయి, **బ్రాహ్మణో భవతి ధ్రువమ్** అని బ్రాహ్మణత్వము మొదలగునవి వచ్చుననునదియు **కపాల వ్రత మాస్థాయ యతి ర్భవతి మానవః** ఇత్యాది వచనముల చొప్పున బ్రాహ్మణత్వాదుల వలె నుత్తమాశ్రమము కూడ వచ్చునను వచనములను అంగీకరింపక, యట్టి మతము వైదికమని నిరూపించిరి. దానిని మూలముగా కొని, రహస్య త్రయ సారములో

మోహన శాస్త్రంగళిల్ శొన్న జాత్యుద్ధరణాదిగళై ప్రామాణికర్ నిగైక్కలా గాదు అని చెప్పబడెను. అందువలన, సంస్కార మాత్ర వశమున జాతి మారుననునది. ప్రపన్నజనాగ్రేసరులగు శ్రీభాష్యకారులకు సమ్మతముగా జాలదని తోచుచున్నది. ఇదియెట్లు నొసంగును. అనగా సమాధాన మీక్రింది విధముగా చెప్పనగును. మోహక శాస్త్రములలో చెప్పబడిన రుద్రపరత్వము శ్రుతి స్మృత్యాది విరుద్ధమగుట చేత నా శాస్త్రములో చెప్పబడిన జాతి విపరిణామాదులను భోదించు **ముద్రికాషట్కతత్వజ్ఞః దీక్షా ప్రవేశ మాత్రేణ బ్రాహ్మనో భవతి ధ్రువమ్** ఇత్యాది వచనములు గూడ నవైదికములుగనే శ్రీభాష్యములో నిరూపించబడినవి నిజమే. అట్లు గాక

ఏకోహ వై నారాయణ ఆసీత్ న బ్రహ్మే నేశానః

ఇత్యాది వేద వేదాంత ప్రతిపాద్యుడైన నారాయణునకు పరత్వము సిద్ధమగుటచే, తద్భక్తులకు జాతి పరివర్తనము గూడ వేదోపబృంహణ రూప శాస్త్ర సిద్ధమని చెప్పుటలో వైదికోత్తములగు శ్రీయెమ్బెరుమానార్లకు సమ్మతి లేదని చెప్పవలనుబడదు. ఈ విషయమును చక్కగా పరామర్శింపక రహస్య త్రయ సారములో నట్లు వ్రాయబడెనని నిశ్చయింపవలెను. అట్లు శ్రియఃపతి భక్తులకు జాతి పరివర్తనము విష్ణు భక్తి వశమున కలుగుననునది. స్వామి యెమ్బెరుమానార్లకు సమ్మతమే యగునని. ఈ క్రింది వారి చరిత్రాంశముల వలన స్పష్టము.

మారనేరి నమ్బి నికృష్టజాతిజనితులైనను, వారి వైష్ణవత్వము వలన వారి యంతిమ సంస్కారములను తాము యతులై యుండుటచే తమ యాచార్యులగు పెరియనమ్బిగారిచే నిర్వర్తింప చేయించినట్లు చెప్పబడి యున్నది. అటులనే, పిళ్లైయురంగావిల్లి దాసుల చరమ కైంకర్యమును, భట్టరు చేత చేయించినట్లు గలదు. అదిగాక తాము స్నానమాడి వేంచేయున్నప్పుడు పిళ్లైయురంగావిల్లదాసరు యొక్క చేతిని తాము పట్టుకొని వచ్చుచుండిరని వారి చరిత్రాంశముల వలన వారికి ప్రపన్న శ్రీవైష్ణవుల విషయమైన దౌర్జాత్య బుద్ధ్యభావము వారికి ప్రపన్న శ్రీవైష్ణవుల విషయమైన దౌర్జాత్య బుద్ధ్యభావము స్పష్టము. ఇవి యన్నియు, గురుపరంపరా ప్రభావము ముప్పాయిరప్పడిలోను ఆఱాయిరప్పడిలోను స్పష్టముగా చెప్పబడియున్నవి.

కాబట్టి భగవద్భక్తులకు జాతి పరివర్తనము, ఎమ్బెరుమానార్లకు సమ్మతమే యని తేలుచున్నది. అయితే ఇచ్చట నీనిష్కర్షమును మాత్రము తెలియవలెను. భగవద్భక్తులై, ప్రపన్న జనోచిత సంస్కార సంస్కృతులై, బాహ్యాభ్యన్తర శుద్ధి గలవారే జాతివారైనను, వారిని ఉత్తమజాతి ప్రపన్నుల వలె గౌరవించి యభినందన స్పర్శనాదులలో నేవిధమైన భేదము లేకుండ నుండుట ప్రపన్న జనక కర్తవ్యము.

ఇక, పంక్తి భోజన కన్యా పరిగ్రహతద్దానాదులలో మాత్రము భగవదాజ్ఞారూపమైన శ్రుతి స్మృతి చోదిత నియమములను గూడ, భగవదాజ్ఞాచ్ఛేదన రూప దోషము రాకుండ పాటింపలెను. అట్టి కర్మలను మాత్రము, జాత్యంతర శ్రీవైష్ణవులతో చేయంజనదు. ఆళ్వార్ల విషయములోను, పూర్వాచార్య గోష్ఠిలోని విశేష వ్యక్తుల విషయములోను, విశేష ప్రతిపత్తి చేయుట శ్రీవైష్ణవాచార సిద్ధమైనను, వారి వారి యనంతర కాలములోనే యాప్రతిపత్తి చెల్లును. ఈ విషయములో నుడైయవరుల కాలమందలి కాంచీపూర్ణుల విషయమందలి విశేష ప్రతిపత్తి వలన, వారితళిగై ప్రసాదము (భుక్త శేషము) ను, ఉడైయవరులు కోరి ప్రయత్నించినను, శ్రీకాంచీ పూర్ణులు, ఈ విషయములనే బోధించుచు నట్టిది జరుగకుండ తప్పించిన విషయము గూడ గురుపరంపరా ప్రభావాది సిద్ధమై యున్నది.

విష్ణు భక్త దౌర్జాత్యాపగమ ప్రమాణములు

ఇక, ప్రపన్న విష్ణుభక్తులకు దౌర్జాత్య ప్రయుక్త నిహీనత యంతరించి, యుత్కృష్టత గలుగు నను విషయములో, నీ క్రింది ప్రమాణములు గలవు. అందు

విష్ణుక్రాంతం వాసుదేవం విజానన్ విప్రో విప్రత్వం గచ్ఛతి తత్వదర్శీ

అను శ్రుతి ప్రమాణము. బ్రాహ్మణుడైనను సర్వవ్యాపియై సర్వత్ర నివసించు వాడు భగవంతుడను, యథార్థము నెఱిగినప్పుడే విప్రుడగను అని చెప్పుచున్నది. దీని వలన నట్టి తత్వదర్శి, యెవడైనను, బ్రాహ్మణుడగునని తేలుచున్నది. ఇంక, పంచమ వేదమగు భారతములో

శూద్రభావే ఽ పి జాతస్య సద్గుణా నధితిష్ఠత ।

వైశ్యత్వం భవతి బ్రహ్మన్ క్షత్రియత్వం తథైవచ ॥

ఆర్జవే వర్తమానస్య బ్రాహ్మణ్యమభిజాయతే ।

యస్తు శూద్రో ధమో నత్యే ధర్మే చ సతతోత్థితః ।

తమహం బ్రాహ్మణం మన్యే వృత్తేన భవతి ద్విజః

అని యున్నది. అచ్చటనే యుధిష్ఠిరుడు సర్పమునకు ప్రత్యుత్తరము చెప్పుచు

సత్యం దానం క్షమా శీలమానృశంస్యం శమోఘృణా ।

దృశ్యంతే యత్ర నాగేంద్ర స బ్రాహణ ఇతి స్మృతః ॥

శూద్రే చైవ భవేల్లక్ష్మ ద్విజే నైవ వై ద్విజః ॥

యత్రైతల్లక్ష్యతే వృత్తం స సర్వో బ్రాహ్మణః స్మృతః ।

యత్రైత న్న భవేద్వృత్తం శూద్రం తమితి నిర్ధిశేత్ ॥

ఆయా జాతులకు, ఔత్కృష్ట్యమును తెచ్చునవి. సత్యము, దానము, ఓర్పు, సత్స్వభావము, పరుల కష్టములను ఓర్వలేకుండుట, శాంతి, లజ్జ అను సద్గుణములేయనియు, నవిలేని వారికి జాతి ప్రయుక్తమగు ఔత్కృష్ట్యముండ బోదనియు చెప్పబడెను. హారితస్మృతిలో భగవద్భక్తి దీప్తాగ్ని దగ్ధ – దుర్జాతి – కిల్బిషః ।

శ్వపాకో పి బుధై శ్లాఘ్యః న వేదాధ్యయనాద్ద్విజః

అనగా భగవద్భక్తియే దీప్తాగ్ని వలె జాతి ప్రయుక్త నిహీనతా పాదక పాపమును దహించి నిహీన జాతి వానికి గూడ శ్లాఘ్యత నిచ్చుననియు, నట్టి భగవద్భక్తి విహీనునకు వేదాధ్యయన మాత్రముచే, బ్రాహ్మణ్యము

ఉండబోదనియు చెప్పబడెను. కురుకా మాహాత్మ్యములో

శూద్రో ఽపి మమభక్తశ్చే ద్విపాద్రభ్యధికో మతః ।

విప్రో ఽపి మయ్యభక్తశ్చే చ్ఛూదాద్రధమ ఉచ్యతే ॥

అని చెప్పబడెను. శ్రీరంగ మాహాత్మ్యములో

అవైష్ణవా ద్వేద విదో వేదహీనాచ్ఛ వైష్ణవాత్ ।

జ్యాయాంస మనయో ర్విద్ధి యస్య భక్తిః పరామయి ॥

భగవద్భక్తి హీనస్య జాతి శ్శాస్త్రం జపస్తపః ॥

అప్రాణ్యనేవ దేహస్య మండనం లోకరంజనమ్

అని చెప్పబడెను. శ్రీభాగవతములే

యే న్యేచ పాపా యదపాశ్రయా శ్రృయా శ్శుధ్యంతి తస్మై ప్రభ విష్ణ వే నమః అని యున్నది.

ఈయన్ని ప్రమాణ పరంపరల వలన, జాతి ప్రయుక్త దర్మముల కన్న హరిభక్తి తత్వమే యుత్కృష్టతా పాదకమని ఘోషింపబడుచున్నది. ఇంకను నిర్ధోషం విద్ధి తం జంతుం ప్రభావా త్పరమాత్మనః

య స్తప్త శంఖచక్రాభ్యాం విముక్తః పూర్వ కిల్బిషైః ।

ఉవవీతా ద్యథా విప్ర స్సభవే ద్వైష్ణవద్విజః ॥

ఇత్యాది ప్రమాణముల వలన, భగవత్పారమైకాంత్య సూచక తప్త శంఖ చక్రాది ధారణములగు బాహ్యాభ్యంతర లక్షణములు, జాతి ప్రయుక్త – నికృష్టతను బోగొట్టి, ఉత్తమ పురుషునిగా దిద్దునని తేలుచున్నది. కాబట్టి పంచ సంస్కార సంస్కృతులైన ప్రపన్న శ్రీవైష్ణవులకు, జాతి ప్రయుక్త – నిహీనతాదోష ముండబోదనునది. యనేకానేక ప్రమాణములచే సిద్ధమగుచున్నది.

భగవద్వచనానభిజ్ఞ వచన ఖండము

ఈ విషయములో కొందరు భగవద్వైభవము నెఱుంగ జాలక, ఇట్లుపన్యసింతురు. నశూద్రా భగవద్భక్తా ఇత్యాది వచన ప్రకారము, భగవద్భక్తులైనచో శూద్రులు విప్రులగుదురు అనియు, భగవద్భక్తిలేని వారు బ్రాహ్మణులైనను, శూద్రులే యగుదురనియు, చెప్పబడుట చేత, భగవద్భక్తులైనచో, నందఱునూ నొకే జాతి వారుగా పరిణామ మొందుదురని తేలుచున్నది గదా. అట్లంగీకరించినప్పుడు, భాగవత బ్రాహ్మణులిట్లుండ వలెననియు, భాగవత శూద్రులిట్లుండవలెననియు, చెప్పెడి ధర్మ శాస్త్ర వచనములు విరోధించును గాధా. కాబట్టి బ్రాహ్మణ ధర్మమును బ్రాహ్మణుడును, శూద్ర ధర్మమును, శూద్రుడును, భగవద్భక్తులైనను ననువర్తింప వలసియున్నది. భారతములో దుర్యోధనుడు, పాండవదూతచగా నేతెంచిన శ్రీకృష్ణుని గురించి

భీష్మ ద్రోణా వతిక్రమ్య మాం చైవ మధుసూదన ।

కిమర్థం పుండరీకాక్ష భుక్తం వృషల భోజనమ్

అని ప్రశ్నింపగా, శ్రీకృష్ణుడు

ద్విషదన్నం నభో క్తవ్యం దిషన్తం నైవ భోజయేత్ ।

పాండవాన్ ద్విషసే రాజన్ మమ ప్రాణా హి పాండవాః ॥

అని ప్రత్యుత్తర మిచ్చి యుండెను. దీని వలన శత్రు గృహ భోజనము కంటె, వృషలగృహ భోజనమే కొంచ మేలని చెప్పినట్లయి, వృషల గృహ భోజనమునకుండు దోషమును శ్రీకృష్ణుడంగీకరించినట్లయినది. ఇంకను, శరీరమునకు సంబంధించిన గుణముల మూలముగా వచ్చెడి జాతి విశేషములు, మరణాంతము వరకును వదలునవి కావు. విశ్వామిత్రునకు వచ్చిన బ్రాహ్మణ్యము కేవలము స్వదత్త చరువు (హోమార్హమగు నన్నము) యొక్క వ్యత్యాసమునకు సంబంధించినదే. అనగా తానగ్నిలో హోమ మొనర్చు చరుద్రవ్యము. బ్రాహ్మణదత్తము వలె, పవిత్రముగా తగినంత మాత్రమునకే, బ్రాహ్మణత్వము గాని, శరీరమునకు బ్రాహ్మణత్వము కలుగుటగాదని తాత్పర్యమై యున్నది. మరియు, విదురాదుల కంటె నధిక ప్రభావవంతులగు ఆళ్వార్లకు, జాతి మారినది శంకింపబనిలేదు. వారి వృత్తాంతమును విచారించినచో, వారికి గూడ జన్మ సిద్ధ జాతి మారినట్లు లేదు. బ్రాహ్మణాది జాతి ధర్మములున్నప్పుడే బ్రాహ్మణ శ్రేష్ఠులు లభింపనప్పుడు, క్షత్రియాది జాత్యంతరులైనను శ్రేష్ఠులగు వారి వద్ద భగవద్జ్ఞానమును పొందవచ్చును. కాని వారి యెండల నా భార్యాను వర్తనాదిక మక్కర లేదు. అను సంప్రదాయమునకు మూలము.

విష్ణు ర్నిత్యం విద్యయా తాత ఈడ్య స్తస్మాత్ జ్ఞానం నిత్యరూపం వరేణ్యమ్ ।

ప్రాప్యం జ్ఞానం బ్రాహ్మణాత్ క్షత్రియాద్వా వైశ్యా చ్ఛూద్రా ద్వాపి వీచా దభీక్ష్ణమ్

అనగా విష్ణువు జ్ఞాన సంపాదన మొనర్చియే స్తోత్రమ్ చేయదగిన వాడు. అందువలన జ్ఞానము విష్ణువునకు సంబంధించినచో, నతి పవిత్రమైనదగును. దానిని, బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదులలో నెవరి వద్దనైనను సంపాదించుకొనవచ్చును. అనువచనమే యని తెలియవలెను. కాబట్టి అళ్వారాదుల వలన జ్ఞాన సంపాదనము చేసి కొనవచ్చునే గాని, యంత మాత్రముచే వారి వారి జాతి మారినట్లుగా భావించి బ్రాహ్మణ ప్రతిపత్తి చేయ నక్కర లేదు అని విపులముగా నుపన్యసించెదరు. దానికి సమాధాన మీ క్రింద నుదహరింపబడినది.

విష్ణుభక్తులకు, జాతి మారుటను గూర్చి, విష్ణుం క్రాంతం వాసుదేవం విజానన్ అను శ్రుతి ప్రమాణమును, న శూద్రా భగవద్భక్తాః అను పురాణ వచనమును, ఇది వరలోనే కనపరచబడినది. ఇంకను అహల్యకు నికృష్ట శిలారూపమును, త్రిశంకునకు నికృష్ట చండాల రూపమును, మహర్షుల నిగ్రహము వలన కలిగినట్లు శ్రీరామాయణము నందు ప్రసిద్ధము కదా. అట్లే, విశ్వామిత్రునకు వీతహవ్యునకు ఉత్కృష్టజాతి, మహర్షి ప్రభావము చేత గలిగినట్లును ప్రసిద్దమై యున్నది.

ఇక భగవద్భక్తులందరును నేక జాతీయులని వ్యవహరింపబడుటలో,

దాసభూతా స్స్వతః సర్వే హ్యాత్మానః పరమాత్మనః అనియు

నాన్యథా లక్షణం తేషాం అనియు నిత్యాది ఆత్మత్వ జాతి ప్రయుక్తమైన, ఐక్యమును బోధించు వచనములు ప్రమాణములై యున్నవి. మరియు సదాచార్యులను ఆశ్రయించి, వేదసార భూతమగు నష్టాక్షరీ మంత్రమును గాని, తద్వివరణ రూపమగు ద్వయ మంత్రమును గాని, యుపదేశము పొందిన తరువాత, శ్రేష్ఠమగు భాగవత జన్మములభించి, ద్రవిడోప నిషద్రూప దివ్య ప్రబంధన పఠణ తదర్థానుసంధానత దుక్తార్థానుష్ఠానములను లభించి, దేవతాంతర మంత్రాంతర ప్రయోజనాంతర సాధనాంతర, పరిత్యాగము చేసియుండువారందరును నేక భాగవత జాతీయులై శ్రీరామానుజ దర్శనస్థులను నిరూపక నామముతో వ్యవహరింపబడుటలో నభ్యంతర మెంత మాత్రమును లేదు.

ఇంకను, ఆత్మ స్వరూపమును బట్టి నాయం దేవో నమర్త్యోవా నతిర్య క్థావరో ఉ పివా ఇత్యాది ప్రమాణములను బట్టి దేహ సంబంధము వలన గలిగెడు జాతి భేదము, ఆత్మకు లేదు అన్ని యాత్మలును, లక్ష్మీ భర్తుః నరహరితనో ర్దాసదాసస్య దాసః అని చెప్పినట్లు, భగవద్దాసులనెడి నిరూపక నామమే యన్ని యాత్మలకును నుండును. అట్టి యాత్మవర్గమంతయు **వన్దెజ్ఞళ్ కుళాం పుగున్దు తొణ్డక్కులత్తలుళ్లీర్** అని తిరుప్పల్లాండు ప్రబంధము నందలి వచనములను అనుసరించి దాసకులము, భక్తజాతి యను నిరూపక నామముతో పిలువబడును. ఆయా దేహప్రయుక్తమైన ఉత్కృష్టతయు, ఆపకృష్టతయు, నంతరించి పంచ సంస్కార ప్రభావము చేత సామ్యము గలిగింపబడును.

అయినను, తత్తచ్ఛరీరమునకుండెడి ఔత్పత్తిక జాతి భేదము మాత్రముండి, దాని వలన గలుగు జాతసాంకర్యకరమగు శ్రుతి స్మృతి నిషిద్ధమైన, సహజగ్ధి (పంక్తి భోజనము) యౌన సంబంధము (కన్యా దాన పరిగ్రహములు) మాత్రము. భగవదాజ్ఞోలంఘన దోషము నాశంకించుకొని మానుటయే భాగవత ధర్మమని లోగడనే నిరూపింపబడి యుండెను. మిగిలిన సర్వ సామ్య వ్యవహారములలో భగవద్దాసకులములలో భేదముండబోదు.

ఈ విషయమునందు రహస్య త్రయసారమను గ్రంథములో భగవద్భక్తుల కైక్యము చెప్పువారు, దుష్ప్రజ్ఞులని నిందించుచు, నాగ్రంథమందే మరియొక చోట నాయం దేవో న మర్త్యోవా అనియు దాసభూతా స్స్వత స్సర్వే అనియు, నన్నియాత్మలు సమానమే కనుక శిష్టులగు మనపూర్వాచార్యులు ముముక్షువులగు నన్ని యాత్మలకును జ్ఞాతవ్యార్థముల నుపదేశింతురని తద్విరుద్ధముగా చెప్పుట చేత నా గ్రంథము, పరస్పర విరుద్ధమని స్పష్టమగుచున్నది.

శ్రీకృష్ణ ప్రతివచచాభిప్రాయ నిరూపణము.

దుర్యోదనస్తు పాపాత్మా అనియు, ద్వావిమౌ పురుషాలోకే దుర్యోధన దశాననా అనియు మమ పుత్రస్తు మందాత్మా న శృణోత్యతిదుర్మతిః అనియు లోకులును తుదకు తండ్రియగు ధృతరాష్ట్రుడును గూడ ఏవగించు కొనిన దుర్యోధనుడు, తన రాజ్య గర్వముచే నొనరించిన భాగవత శ్రేష్ఠ విదుర నిందను, కృష్ణుడు సంమతించినట్లు చెప్పిన సందర్భములో,

జ్ఞానీత్వాత్మైవ మే మతమ్ మద్భక్తాన్ శ్రోత్రియో నిందన్ సద్య శ్చండలతాం వ్రజేత్

అని చెప్పెడి భగవద్బుద్ధ్యా, భాగవత నిందను స్వనిందనుగా తలంచి, సహించని సందర్భమగుటచే నా శ్రీకృష్ణ వచనమునకు సామాన్యార్థము గాక విశేషార్థమున్నదని తెలియదగును.

భీష్మ ద్రోణా నతి క్రమ్య మాం చైవ అను వచనములో రాజస గుణము వ్యక్తమగుచున్నది. దానికి శ్రీకృష్ణుడు, ఋజువుగా జవాబు చెప్పక పాండవాన్ ద్విషవే రాజన్ అని జవాబిచ్చెను. దీని యభిప్రాయమేమనగా, భీష్మ ద్రోణులు నీ పక్షములోనున్న వారగుటచే, శత్రుపక్షము వారనియు, నీవు రజోగుణదూషితుడవై సాత్వికులగు పాండలవులకు ప్రత్యక్షముగా ద్వేషించు వాడవనియు, మీమీ యిండ్లకు రాకుండ పరమ భాగవతుండగు విదురని సూచించుచు జవాబిచ్చెను. కాబట్టి యాభారతములోనే **విదురాన్నాని బుభుజే శుచీని గుణవంతి చ** అని స్థలాంతరములె చెప్పబడినది. అందువలన నీ శ్రీకృష్ణుని సమాధానము, భగవద్బుద్ధితో చెప్పబడెనని గ్రహింపవలెను.

ఈ సందర్భములో శ్రీరామాయణమందలి యుద్ధకాండలోని సుగ్రీవ వృత్తాంతము, సాక్ష్యమగుచున్నది. ఎట్లనగా, సుగ్రీవుడు, రావణునకు ఛత్ర భంగాది పరిభవ మొనర్చి, రామ సన్నిధికి రాగా, శ్రీరామచంద్రుడు, మిక్కిలి చొచ్చుకొని **త్వయి కించి త్సమాపన్నే కిం కార్యం సీతయా మమ** అని నీకేమైన యెగ్గు గలిగినచో నాకు సీతతో గూడ, నేమి ప్రయోజనము. అనసాను తాపమును ప్రకటించెను గదా. భగవంతునకు, వనదాసుల యందుండు ప్రేమ పిరాట్టి యందు గూడ, నుండదని యా వృత్తాంత తాత్పర్యము. దుర్యోధనుని యైశ్వర్య మదమును సూచించు రాజన్ అను సంబోధనముచే భీష్మ ద్రోణాతిక్రమణమునకును, **మమ ప్రాణా హి పాండవాః** అను వచనముచే విదురునియా స్తత్వమునూ, సూచితములగుట చేతనే వృషలభోజనముగా, విదురాన్న భోజనమును సమ్మతించె ననునది, సందర్భ శూన్యమగును.

పాండవ ప్రియుడగు విదురుని గూర్చి దుర్యోధన నింద

దుర్యోధనుడు, విదురుని జూచి మాకు శత్రువులగు పాండవుల శ్రేయస్సుచే కోరుచుందువు. మమ్ములను నిందించు చుందువు. ఈ విధముగా, శ్రీకృష్ణ పాండవ ప్రియుడవగు నీ స్వభావము. మాకు తెలియక పోలేదు అని నిందించినట్లు భారతము నందు గలదు. అందువలన దుర్యోధనునకు విదురుడు గూడ శత్రుకోటి లోని వాడుగానే తేలినందున పాండవ దృష్టాంతముతో విదురునకు గూడ, తన ప్రాణతుల్యత, శ్రీకృష్ణుడు స్పష్టపరచెనని చెప్పవలసి యున్నది.

ఇంకను, విదురుని గూర్చి ధర్మరాజు, తన తండ్రితో సమానమగు వాడని, భారత సభాపర్వములోని, ఈ క్రింది వచనము వలన స్పష్టమగుచున్నది.

తదా హి సహదగ్దేషు విదురః స పితా మమ ధర్మో నేహేతి కుప్యేత

అని ధర్మరాజు, అనిన వచనములో సపిరామమ అని వ్యవహరించుట స్పష్టమే. ఇంకను, శ్రీకృష్ణుడు, దుర్యోధనుని ప్రశ్న సందర్భములో నందఱును వినుచుండునట్లు,

శుద్ధం భాగవతస్యాన్నం శుద్ధం భాగీరథీ జలం ।
శుద్ధం విష్ణు పదం తీర్థం శుద్ధమేకాదశీ వ్రతమ్ ॥

ఇత్యాదిగా, గంగాజలాదులవలె, భాగవతాన్నము గూడ శుద్ధమని చెప్పియుండెను. ఇందుచే, విదురునకు వృషలత్వమును శ్రీకృష్ణుడంగీకరింపలేదు. మరియు నతని భాగవతత్వమే స్పష్టపరచెను.

ఆళ్వార్లకు జాతి ప్రయుక్త నికృష్టతా ఉ భావము

పై నిరూపణమ వలన భగవద్భక్తులకు, జాతి ప్రయుక్త తరతమ భావ ముండబోదనియు, యుగాంతరములలో నొకే జన్మ యందు మహర్ష్యాది విగ్రహాను గ్రహముల వలన, నికృష్టోత్కృష్టతలు గలిగినట్లును, విశదముగా కలదు. ఈ కలియుగము నందు నవతరించిన ఆళ్వార్లకు, జాతి ప్రయుక్త నికృష్టత యుండబోదని, ఇక నిరూపించెదము. ఆళ్వార్లకు, జాతి ప్రయుక్త నికృష్టత యుండబోదని, ఇక నిరూపించెదము, ఆళ్వార్లలో, నయోనిజులని ప్రసిద్ధి చెందిన పొయ్గై పూదత్తు పేయాళ్వార్లును, ఆండాళును గాక, మిగిలిన వారు, బ్రాహ్మణ క్షత్రియ శూద్ర యవన చండాల జాతులలో గూడ, నవతరించి యుండిరని వారి చరిత్రల వలన స్పష్టమగుచున్నది. అందు భక్తిసార, భట్టనాథ, భక్తాంఘ్రిరేణు మధురకవులను నల్గురును బ్రాహ్మణులు,

కులశేఖరులు, క్షత్రియులు, నమ్మాళ్వార్లు, శూద్రకుల సంభూతులు, తిరుమంగైయాళ్వారు యవనకులోద్భూతులు, తిరుప్పాణాళ్వారు చండాలకుల సంభూతులు, అవి వారి వారి చరిత్రల వలన స్పష్టము. అట్టి ఆళ్వార్లందఱును, జాతి ప్రయుక్తోత్కృష్టతా నికృష్టతలను పాటింపకుండ, శ్రీవైష్ణవోత్తముల చేత పూజింపబడుట నేటికిని ప్రత్యక్ష సిద్ధమై యున్నది. వారికట్టి పూజ్యత గలుగుటకు భగవత్సంబంధము వలనను, విశిష్ట వైష్ణవ గుణములు పుష్కలముగా వారి యందుండుట వలనను, విశిష్ట వైష్ణవ గుణములు పుష్కలముగా వారి యందుండుటవలనను, వచ్చిన విశిష్టత యే కారణమని పూర్వాచార్య సంప్రదాయము. యుగాంతరములలో నొక్కొక్కరికి నొకే జన్మలో, నుత్కృష్ట నికృష్ట జాతి గలుగుటకు, సామాన్యతపశ్శక్తి గల మహర్షుల తపః ప్రభావమే కారణమని చెప్పినప్పుడు, సర్వ శక్తి యగు సర్వేశ్వరుడు సాక్షాత్తుగా కటాక్షించిన, ఆళ్వార్లందరకును, తరతమ భావము లేకుండ ఒకే భక్త జాతి గలుగుటలో సందేహమక్కర లేదు. ఈ యంశము సాక్షాత్తుగా భగవంతుడు లోకములో వ్యక్తపరచిన శ్వపచో ఉపి మహీపాల మద్భక్తే ద్విజాషుధిక అను వచనమే స్పష్టపరచుచున్నది.

విష్ణు భక్తులకపశూద్రాదికరణ న్యాయము వర్తింపదు

నమ్బిళ్లైగారు, తమ కాలక్షేపగోష్ఠిలో వీడుమిన్ ముత్తవుమ్ అను తిరువాయ్మొళి సాయించు సందర్భములో

ఇదుదాన్ వేదాన్త విహితైయాన భక్తియానాలో వెన్నిల్
సర్వేశ్వరనరుళ ఇవర్ పెత్తారాగిఱ ఏత్తమ్పెమ్,
అపశూద్రాధికరణ న్యాయమ్ ప్రసజ్గిక్కుమ్

అని సాయించిరి. దీనిని బట్టి చూడగా, నాళ్వార్ల భక్తి రూపాపన్న జ్ఞానము. భగవంతుని కృపామూలకమే కాని వేదాలతో దితమైనది గాదనియు, నట్లైనచో శూద్రకులజులగు ఆళ్వార్లకు వేదాదికారముండదు గాన, అపశూద్రాదికరణ న్యాయము వలస దోషము ప్రసంగించునని యర్థము తేలుచున్నది. కాబట్టి, యాళ్వార్లకు జాతి ప్రయుక్త ధర్మ, మనువర్తించుచున్నదనక తప్పదు గదా యని శంక కలుగుచున్నది.

దానికి సమాధానమేమనగా, వీడు మిన్మత్తవుమ్ అను తిరువాయ్మొళి, పరోపదేశ రూపముగా సాయించబడినది. అది సర్వాధికారముగా నుండవలెను గాన, శూద్రాదులకు గూడ తిరువాయ్ మొళి అధ్యయనము నందు యోగ్యత గలదు. అప్పుడీ భక్తి వేదాంత విహితమైనదేయైనచో, నపశూద్రాధికరణ న్యాయము శ్రోత విషయములో సంభవింపగలదు. అప్పటి వారి యవస్థ లోక సామాన్యమైనదే గాని, భగవద్భక్త వర్గములో చేరునది గాదు గదా, కాబట్టి ఉద్ధేశ్యులను బట్టి వచ్చెడి దోషమే అపశూద్రాధికరణ న్యాయము ప్రసజ్గిక్కుమ్ అను వాక్యము వలన నంబిళ్ళగారు సూచించిరనియే చెప్పవలెను. ఈ విషయము ఆ తిరువాయ్ మొళి యవతారికలోనే స్పష్టముగా నున్నది. ఎట్లనగా,

తత్వపరమాయుమ్ ఉపాసన పరమాయు
మితే మోక్ష శాస్త్రమ్ తావిరుప్పదు అని యారంభించి
ఆనపిన్పు, తామ్పెత్తత్తైయే పిఱర్కుపదేశిక్కిరా రాగవమైయుమ్

అను నంత వరకు, చేసిన ప్రతిపాదనము. పై యంశమునే ధ్రువపఱచుచున్నది. మఱియు, ఉపాసనపరముగా చెప్పబడిన తిరువాయ్ మొళులన్నిటికిని, ఈ తిరువాయ్ మొళి, సంగ్రహమైయున్నదనియు,

ఈ యాళ్వార్ల భక్తి ప్రపత్తులు, భక్తి ప్రేరితమా, భగవదనుగ్రహ కారితమా, యని వికల్పింపదగినవిగా నుండుననియు నక్కడ చెప్పబడెను. ఎమ్పెరుమానార్లుగూడ, ఆళ్వార్ల భక్తి ప్రపత్తుల తుల్యతను బట్టి యట్లే నిర్వహింపుచు వచ్చి శ్రీభాష్యమును సాయించి ముగించిన పైని భక్తిపరముగానే యీ తిరువాయ్ మొళికి నర్థము సాయించు చుండిరి. అనియు నట్టియెడ ఉభయపరికర్మితే ఇత్యాది యామునాచార్య శ్రీసూక్తి ననుసరించి, కర్మజ్ఞానాను గృహీతమై భక్తి యుండవలెను గదా యని శంకించుకొని, ఆళ్వార్లకు కర్మజ్ఞానముల స్థానమున భగవత్ప్రసాదమే యుండినదని సమర్పించిరనియు ప్రసిద్ధి గలదు. తదనుగుణముగా నమ్బిళ్లగారు, ఈ తిరువాయ్ మొళిలోని ఉపదేశము వేదాంత విహిత భక్తి విషయమై యుండునని శ్రీవైష్ణవ దర్శనస్థుల కభిప్రాయము గలుగునని తలచి ఆళ్వార్లు. తమకు రక్షకమగు మోక్షోపాయమునే యితరులకు సర్వాధికారముగా నుపదేశించు వారై, వేదాంత విహిత భక్తినే యుపదేశించిరనినచో, నదియే ఆళ్వార్లకు గూడ రక్షకము గావలసియుండును. అందువలన, వీరి భక్తి వేదాంత విహితమైనచో నప్పుడు భగవత్ప్రసాద లబ్ధమను గొప్పతనము పోవును. ఇంకను, ఉపదేశ్యులగు లోకుల దృష్ట్యా అపశూద్రాదికరణ న్యాయము గూడ సంభవించును అనెడు భావములో సాయించిరని తెలియదగును.

ఈ విషయము **శాత్వేతవనెతి అను తిరువాయ్మొళి** యవతారికలో స్పష్టము అందిట్లున్నది.

ముతల్ తిరువాయ్మొళియిలే ప్రాప్యత్తై అరుళిచ్చెయ్దార్,
అన్దప్రాప్యత్తుక్కు ప్రాపకమాగ వేదాంతగళిలే భక్తి యెన్షుమ్
ప్రపత్తి యెన్షు మిరణ్డుపాయఙ్గళై విదిత్తదు, అవై యిరణ్డిలుమ్
భక్తి త్రైవర్ణికాధికారమ్ ప్రపత్తి సర్వాధికారమ్,
అదిల్ సర్వాధికారము మాయ్ తమ్తిరువుళ్ళత్తాలే
తమక్కుపాయమాన వఙ్గీకరిత్త ప్రపత్తియై
వీడుమిన్ ముత్త త్తిలే అరుళిచ్చెయ్దార్,
త్రైవర్ణికారమాన భక్తియై పత్తుడై యడియవరి లే అరుళిచ్చెయ్దార్ ఆగ,
విన్ద తిరువాయ్మొళి యిలుమ్ అరులిచ్చెయ్ద భక్తి ప్రపత్తిగళ్
స్వసాధ్యత్తోడే పొరున్దిన పడియై యరుళిచ్చెయ్గిఱార్
శాత్వేతవనెతి కణ్ణన్ కళిలిణై ఎన్ఱిరణ్డుతిరువాయ్మొళిగళిలుమ్

అని నమ్బిళ్లగారు స్పష్టముగా సాయించిరి. కాబట్టి ఆళ్వార్లకు, భక్తి ప్రపత్తులు రెండున సమానోపాయ కోటిలో జేరియున్నవనియు,తమ ఉపాయానుష్ఠానము,వికల్పసహమై,భక్తి ప్రపత్త్యు భయాత్మకముగా నున్నదనియు,పరోపదేశములో యదాధికారముగా నుపదేశించుటలో సర్వోజ్జీవన హేతువగు ప్రపత్తికి, ప్రాధాన్యమిచ్చి, అది ముందు ఉపదేశించి, తరువాత అధికృతాధికారమగు భక్తి నుపదేశించిరని విశదమగుచున్నది.

దీనిని బట్టి ఉపదేశ్యులగు సర్వవర్ణముల వారికిని వేదాంత విహిత భక్తిని ఉపదేశించినచో, అపశూద్రాదికరణ న్యాయము బట్టునని నంబిళ్లగారి తిరువుళ్ళముగా చెప్పుటయే సమంజసమగును. ఆళ్వార్ల విషయములో, భక్తి ప్రపత్తులు రెండును భగవత్ప్రసాదలబ్ధములగుట చేత వచ్చెడి ఔత్కృష్ట్యమునకును భంగము రాదని గ్రహింప వచ్చును.

శ్రీవైష్ణవులకు జాతి నిరూపణ మనర్థము

ఆళ్వార్ల కటాక్షపాత్రులై, పంచసంస్కార సంస్కృతులై, యాళ్వార్ల దివ్య సూక్తి ప్రభావము నెఱిగి తన్నిష్ఠులై యుండు ఏజాతి వారి నైనను, సమాన గౌరవముతో జూచుట ప్రపన్నులగు శ్రీవైష్ణవులకు కర్తవ్యము. అట్లుగాక, వారి యందు జాతి ప్రయుక్త భేదము పాటించుట యపచార హేతువగునని ప్రమాణములు చూపుచున్నవి.

వైష్ణవే జాతి బుద్ధిః భాగవతాపచార న్దానేక విధమ్,

అదిలే ఒన్టు అవర్గల్ పక్కల్ జన్మ నిరూపణమ్

అని చెప్పబడిన యభియుక్తోక్తులిచ్చట ప్రమాణములు, ఇంకను, జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః అను ధర్మశాస్త్ర వచనమును బట్టి, బ్రాహ్మణ శిశువులకు గూడ, నొకటియే జన్మ యందు శూద్రత్వ ద్విజత్వములనెడి జాతుల వినిమయము (మార్పు) శాస్త్ర విహితమైనదిగా నుండగా,

యస్తప్త శ్శంఖ చక్రాభ్యాం విముక్తః పూర్వకిల్బిషైః,

భగవద్భక్తి దీప్తాగ్ని దగ్ధ దుర్జాతి కిల్బిషః

ఇత్యాది విశేష ప్రమాణములను బట్టి సదాచార్య సమాశ్రయణ లబ్ధ సంస్కారులై ప్రపన్నులగు నేజాతి వారికిని జాతి వినిడాయము గల్గుట అనుచితము కాదు. అయితే అట్టి వారు

ఓదియోదు విత్తాదియాయ్‌వరు మన్దనాళ్

అని చెప్పిన విధముగా. సదాచార్య సన్నిధిలో, తిరువాయ్ మొళిని అర్థవత్తుగా నధ్యయనము చేసి తన్నిష్ఠులై, నిరహంకారులై, భగవద్భాగవతాచార్య ప్రవణులై, యుండవలసి మాత్రముండును. అట్లుండు వారిని, వారి వారి జన్మనిబంధనమైన జాతిని నిరూపించ చూచుట, యపచార హేతువగును.

ఇక కొందరు, పంచ సంస్కార రహితులై తిరువాయ్ మొళి, సర్వాధికారి పఠనీయమని తలచి యట్టి సంస్కార రహితులగు శూద్రాద్యనధికారి వర్గము వలన దివ్య ప్రబంధాధ్యాయనము చేసి తామింకొకరికి చెప్ప సాహసించు వారును గలరు. అట్టి వారు జాతి ప్రయుక్త భేదము వదలని వారగుటచే వారిని శూద్రాదులుగానే వ్యవహరింపవలెను. ఇప్పటికిని, దక్షిణదేశము నందు అట్టివారు తిరువాయ్‌మొళిని తెయ్‌వప్పాడల్ అని వ్యవహరించుచు, వానికి వ్యాఖ్యానములు చేయుచుండువారు గలరని ప్రసిద్ధి.

సదాచార్యుల ప్రతిపత్తి విశేషము

వేదాంత విహితమైన భక్తికి నధికారులై యుండినను మన పూర్వాచార్యులగు నాథయామున యతివరాదులందరును,

మాతా పితా యువతయ స్తనయా విభూతిః

సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ ।

ఆద్యస్య నః కులపతే ర్వకులాభిరామం

శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా ॥

అని విన్నవించిన విధముగా తమకు సకల విధ బంధువగా తలంచి యుండు ఆళ్వార్లు, సర్వాధికారముగా నుపదేశించిన ప్రపత్త్యుపాయమునే, రక్షకమని తలంచి తమనాశ్రయించు వారికి గూడ దానినే ఉపదేశించుచు,

తన్నిష్ఠులుగానే యుండు విధమును, గ్రహింప గలిగినచో వారి, యద్వితీయ ప్రతిపత్తి విశదము కాగలదు. అట్టి వారి ప్రతిపత్తిని, తెలిసికొని, స్వచ్ఛమైన చిత్తముగల వారలలో శాత్తిసవర్ అను భేదము లేకుండ అందరకును, ప్రపత్త్యుపాయము కన్న, వ్యతిరిక్తమైన ఉపాయాంతరములందలి యపేక్షయే మాత్రము లేదని సదాచార్య పరుల యభిప్రాయము నెఱింగి శ్రీవైష్ణవాధికారి ప్రవర్తింపవలెను.

కులంతరమ్ అను పాశుర వ్యాఖ్యాన భావము

తిరుమఙ్గైయాళ్వార్లు, తిరుమంత్ర ప్రభావము చెప్పు సందర్భమున సాయించిన

కులమ్ తరుమ్ శెల్వమ్ తన్దిడుమ్

అను పాశురమునకు, పెరియవాచ్చాన్పిళ్లైగారు వ్యాఖ్యానము చేయుచు

జన్మ వృత్తఙ్గళాల్ మతే యనిన్డా నొరుత్తనుక్కు

భగవత్సంబన్దముణ్డానాల్ ఇవత్తాలుయేర్ న్దానొరుత్తన్

యివై యిరణ్డిలు మివనుక్కు ర్తాళ్వుణ్డాగవుమ్

తానుయర్ న్దానాగవుమ్ నిగైత్తిరుక్కవుమ్ కూశ వేణ్డు

మ్పడియాయిత్తు భగవత్ప్రసాద మిరుప్పదు

అనగా పుట్టుక నడత చేత తక్కువగా నున్నవానికి భగవత్సంబంధము కలిగినచో జన్మవృత్తముల చేత, నుత్కృష్టులైన వారు, అట్టి స్వోత్కృష్టమును జూచుకొని తమ కంటె వారిని తక్కువగా తలంచుటయు, సంకోచింపవలసినట్లుండును. భగవత్ప్రసాదము అని సాయించుచు వెంటనే

ఆగిలుమ్ పెణ్ కొడుత్తల్ కొళ్లుదల్ శెయ్‌గిఱారిల్లై

అదుక్కడి జాతి నిబన్ధనమాగై, శ్లాఘెగుణ నిబన్మమ్

భగవత్సంబంధముచే నట్టి వారిని తక్కువగా దలాపగూడకున్ననూ, నట్టి వారికి, పిల్ల నిచ్చుట, వారి వద్ద నుండి పిల్లను స్వీకరించుటయు, ఆచరణలో లేవు. దానికి మూలము, అది జన్మకు సంబంధించిన దాని నిబంధమునముగా వచ్చినది. గొప్పతనము మాత్రము, గుణనిబంధనముగా వచ్చినది అని సాయించిరి. దీనికి పిళ్లైలోకం జీయర్ విపులముగా విచారణ చేసి యక్కడి జాతి పదమునకు బ్రాహ్మణాది జాతి యర్థమనియు కన్యాదానా ఉ దానాదికము ఒకేజాతికి సంబంధించిన శ్రీవైష్ణవులలో నాంధ్ర ద్రావిడ జాతి భేదమును బట్టి యాచరణలో లేనప్పుడు ఇతర జాతులలోని వారితో నట్టి సంబంధము గలుగకుండుట సహజము గాన నది. శ్రుతి స్మృతి విరుద్ధమైన జాతి సౌందర్యము వచ్చునను భావముతో నేర్పడినదనియు, భగవత్సంబంధ రూప గుణమును బట్టి వారి వారి విషయములో జాతి బేధముండబోదనియు నిరూపించిరి. భగవత్సంబంధము, స్పర్శ వేది వలె నికృష్టమైన వస్తువును ఉత్కృష్ట వస్తువుగా చేయుశక్తి కలదనుట సత్యమే, కాని యట్టి దానికి లోహత్వ జాతి పోయి వజ్రత్వాది జాతి సిద్ధింపదు గదా, గౌరవాదిక్యమునూ, బంగారముతో సామ్యమునూ మాత్రమే వచ్చునని వివేకించవలెను.

ప్రపన్న క్షత్రియాదులకు శిఖోపవీతత్యాగావశ్యకతా విషయము

భగవద్భక్తి విశేషము వలన లభించిన భగవత్ప్రసాదమును బట్టి శూద్రునకు, శూద్రత్వమంతరించి విప్రత్వము గలిగిన యెడల, విప్రధర్మమగు శిఖాయజ్ఞోపవీత ధారణమును, యజనయాజనాధ్యయనాధ్యా వన దాన ప్రతిగ్రహములనెడి వచ్చుచున్నది. దానికి సమాధానమేమనగా, శాస్త్రములలో కేవల బ్రాహ్మణ జన్మ గల ప్రపన్నునకే ఆ బ్రాహ్మణ ధర్మములుండవలెననియు, మిగిలిన క్షత్రియాది నిఖిలజాతులకును నవి యుండనక్కర లేదనియు చెప్పబడుటచే, శూద్రాదుల కట్టి యోగ్యత కలుగజాలదు. అట్టి శాస్త్ర వచనము లెవ్వి యనగా, పరాశర సంహిత తృతీయ చతుర్థాధ్యాయములలో

క్షౌరం భవే చ్ఛిఖావర్జం త్రివర్ణానాం తథావిధిః ।
మాసి మాసి గృహస్థానాం శూద్రసన్యాసినాం తథా ॥
యోక్త్రం తద్బ్రహ్మదండం చ నాస్తి సంధ్యా ద్విజోత్తమ

అనగా బ్రాహ్మణులు మొదలగు మూడు వర్ణముల గృహస్థులకును శూద్రులలో ప్రపన్నులకును, ప్రతి నెలకును శిఖను మాత్రము విడచి క్షౌరము విహితమై యున్నది. కాని మౌంజీధారణము దండ ధారణము అను బ్రహ్మచారి యతి ధర్మములును, సంధ్యావందనమును మాత్రము, శూద్ర ప్రపన్నులు చేయరాదు అని భావము,

స్నానం నశుద్ధి ర్దాస్యం స్యాత్పర్వతాం త్రికభేదతః ।
సదా ప్రపన్న శూద్రాణాం సర్వేషాం మోక్ష కాంక్షిణామ్ ॥
మత్సాయుజ్యాది సిద్ధ్యర్థం ద్విజ ధర్మోక్త సద్భవేత్ ॥
శూద్రాదీనాం క్షత్రియాణాం వేదపాఠాదికం నచ ।
షట్కర్మయజనేత్యాది విప్రాణా మస్తి సర్వదా ।
తస్మాత్సర్వ ప్రకారేణ వేదమార్గం సమాచరేత్ ।
శూద్రాదీనాం యజ్ఞసూత్ర శిఖాశ్మశ్ర్వాది వర్జనమ్ నాస్తి సంధ్యా ఉ_ప్యగ్ని కార్యం

అనగా ప్రపన్న శూద్రులకు కేవల స్నానమాత్రమే శుద్ధి హేతువు గాదు. ఆయా శాస్త్రోక్త ప్రకారము. అగ్రజాతుల దాస్యము ఒనరించుటయే శుద్ధికరమై మోక్షప్రదమగును. భగవత్సాయుజ్యమును లభించుటకు బ్రాహ్మణ ప్రపన్నుల యాచరణమంతయు నుండవలెను. కాని వేదాధ్యయనాదులు శూద్ర ప్రపన్నులకును, అధ్యాపనాదులు క్షత్రియ వైశ్య ప్రపన్నులకును నర్హములు కావు. యజనాది షట్కర్మలు కేవల బ్రాహ్మణ ప్రపన్నులకు మాత్రమే విహితమై యుండును. అందువలన వేదబోధిత ధర్మాచరణ మందరును సర్వ విగశీదముల ననుసరింపదగును. శూద్రాదులకు యజ్ఞోపవీత ధారణము, శిఖయు మీసములు గడ్డము అగ్నికార్యములును చేయరానివి యగును. అని యిట్లు వివరముగా చెప్పబడెను.

ఇచ్చట శూద్రాదీనామ్ అని వ్యుత్క్రమముగా చెప్పబడిన దానికి, తాత్పర్యమేమనగా, శూద్రుల కెట్లు వేదాధ్యయనాది షట్కర్మలు శాస్త్ర నిషిద్ధములై, పాతక హేతువులగునో, యట్లే వైశ్య క్షత్రియులకు గూడ తమకు విహితమైన అధ్యయన యజన దాన రూప త్రికర్మలు తప్ప మిగిలినవి నిషిద్ధములని బోధించుటకే యని తెలియవలెను. శ్రీవైష్ణవ ప్రపన్నులగు భగవద్బాహుజాది క్షత్రియ వైశ్య శూద్రులకు భగవత్కైంకర్యమే యభిలషితశ్రీత మగుటచే నిత్య ముక్తులతో పాటు తమరుండుటయే యవసరము గాన వారికి ఇతరములేవియు నపేక్షితములు కావు.

ప్రపన్న బ్రాహ్మణేతరులకుండవలసిన ధర్మములు

బ్రాహ్మణులు మొదలగు వారికి క్షౌర విధియందు కొన్ని నియమములు, ధర్మ శాస్త్ర నిబద్ధములై యున్నవి. బ్రాహ్మణులు శిఖను మాత్రము విడచి మిగిలిన కేశములు గడ్డము మీసములు గూడ క్షౌరము చేయించుకొనుట ధర్మము. (శ్రీవైష్ణవ బ్రాహ్మణ గృహస్థులు సర్వాంగములు క్షౌరమగుట శిష్టాచారము) క్షత్రియాదులకు తత్తద్వర్ణోచితమగు క్లుప్తశిఖ (గేరాలేక జునపాలు)ను, మీసములునూ, మాత్రముంచి గడ్డమును, మాత్రము క్షౌరమగుట ధర్మమైయున్నది. అనగా క్షత్రియులు గేరాను. వైశ్యులు జునపాలును నుంచుకొనుటయూ, వారుభయులునూ, మీసమును మాత్రముంచుకొనుటయూ ఆచారమై యున్నది. శూద్రులు స్త్రీల వలె కేశములన్నియు నుంచికొని, మీసములు గూడ వదలి గడ్డము మాత్రము క్షౌరమగుట, ఆచారముగానున్నది. అట్లుగాక, బ్రాహ్మణేతరులగు ప్రపన్నులందఱును బ్రాహ్మణుల వలె శిఖా మాత్రము నుంచుకొని మిగిలిన దంతయు క్షౌరమగుట. అహంతా సూచకమై యుండునని ఈ క్రింది ప్రమాణము చెప్పుచున్నది. పరాశర సంహిత నాల్గవ అధ్యాయములో

ధృత్వా శిఖాం వైష్ణవో య శ్మశ్రుకృంత సమాచరేత్ ।

స చండాలో భవేత్సత్యం పంక్తి పాఠాది కర్మసు

అని ఇచ్చట వైష్ణవోయః అనునది, బ్రాహ్మణ భిన్న ప్రపన్న వైష్ణవుడని యర్థము చెప్పుకొనవలెను. ఎందుకనగా, ఆపస్తంబుడని యర్థము చెప్పుకొనవలెను. ఎందుకనగా, ఆపస్తంబులు

యథర్షి శిఖాని దధాతి, యథా వైషాం కులధర్మః స్యాత్

అనగా బ్రాహ్మణుడు తన గోత్ర ఋషులెందఱో ఆ సంఖ్యలో గాని, వారి వారి వంశాచారము ననుసరించి గాని, శిఖల నుంచుకొనవలెనని చెప్పి యుండిరి. మరియు, బ్రహ్మచర్యానంతరము గోదాస వ్రతము నాచరించిన తరువాత

శ్మశ్రూణాం ముండనం భవేత్,

మీసము, గడ్డము కూడ, గొరిగించుకొనవలెనని యున్నది. అట్టి బ్రాహ్మణ ధర్మము. ఇతర వర్ణములాచరించినచో నెంత ప్రపన్నులై యున్నను నింద్యులే యగుదురని పై పరాశర సంహితావచన తాత్పర్యముగా యెఱుగవలెను.

ఇక, బ్రాహ్మణేతర శ్రీవైష్ణవులకు **ద్విజధర్మోక్త వద్భజేత్** అను వచనము బ్రాహ్మణులకు వలె, శౌచస్నాన పాన భగవదారాధనలు భగవత్ప్రసాద స్వీకారము భాగవత పరిచర్యయూ మొదలగునవి క్షత్రియాది శ్రీవైష్ణవులకు ఉండవవలెనని మాత్రమే చెప్పును. కాని శ్రౌతస్మార్తాది ధర్మములు కూడ, ద్విజులకువలె నుండవలెనని చెప్పదు. ఇంకను, ద్విజ ధర్మమని చెప్పి క్షత్రియాది వైష్ణవులు, స్వమాతృ పితృ మృత తిథులందు స్వజాతీయులనే నిమంత్రణ మొనర్చుట అధర్మమగును. శ్రీవైష్ణవ క్షత్రియాదులు గూడ

అష్టవర్షా భవేత్కన్యా నవవర్షా తు రోహిణీ ।

దశవర్షా భవే ద్గౌరీ అత ఊర్ధ్వం రజస్వలా ॥

అను వచన ప్రకారము కన్యలకు వివాహ మొనరించు విషయములో, బ్రాహ్మణ ధర్మమగు రజస్వలా వివాహ నిషేధమును పాటించుట ఆవశ్యకమని గూడ ఆ వచనాభిప్రాయముగా గ్రహింపవచ్చును.

ప్రపన్న క్షత్రియ వైశ్యులకు శిఖోపవీత వర్జన విమర్శనము

ఆపస్తంబాది సూత్రములలో

గర్భాష్టమేషు బ్రాహ్మణముపనయీత గర్భైకాదశేషు రాజన్యమ్ గర్భద్వాదశేషువైశ్యమ్

అని చెప్పబడెను. అట్లే ధర్మ శాస్త్రములు గూడ

గర్భాష్టమే తు రుర్వీత బ్రాహ్మణస్యో పనాయనమ్ ।

రాజ్ఞా మేకదశే కార్యం ద్వాదశే తు విశాం స్మృతమ్

అని చెప్పుచున్నది. దీని వలన బ్రాహ్మణులకు వలెనే క్షత్రియ వైశ్యులకు గూడ నుపనయన సంస్కారము. వేదాధ్యయనము సిద్ధమగుచున్నది. అయినప్పుడు క్షత్రియ వైశ్య కులజ ప్రపన్నులకు శిఖాయజ్ఞోపవీత త్యాగమెట్లు శాస్త్ర సమ్మతమగును.

భోజన ఆచమనే స్వాధ్యాయే చ యజ్ఞోపవీతీ స్యాత్

అని గదా ధర్మ శాస్త్రము చెప్పుచున్నది. అనినచో నట్లుగాదు. క్షత్రియ వైశ్యులు ప్రపన్నులై, భగవదేక ప్రవణులైనప్పుడు, శిఖోపవీత త్యాగము విరుద్ధము కాజాలదు. అట్టి వారికి కేవల మోక్షకాంక్ష తప్ప ఇతర పురుషర్థకాంక్ష యుండగూడదుగాన, తన్నిబంధనమైన విశేష లక్షణముగా శిఖోపవీతాది ధారణమనావశ్యకము. ఇక రాజ్య పాలన వాణిజ్యాది త్రివర్గ కాంక్షతో నుండి భగవద్భక్తులు గూడనైన క్షత్రియ వైశ్య జాతులకు, యజ్ఞోపవీత శిఖా శ్మశ్రాది ధారణము ఆవశ్యకమే యగును. అట్లయినచో ప్రపన్న బ్రాహ్మణులకు గూడ శిఖాయజ్ఞోపవీత ధారణమనావశ్యకమగుట యుక్తమగునేమో యని యనరాదు.

పాంచరాత్ర విశిష్ట ధర్మములలో **షట్కర్మయజనేత్యాది విప్రాణా మస్తి సర్వదా** అని చెప్పియుండుట చేత యజనాది షట్కర్మలును ప్రపన్నులగు బ్రాహ్మణులకు అత్యంతావశ్యకములై యుండుట చేత, తదంగములగు శిఖా యజ్ఞోపవీత ధారణములు వారికావశ్యకములే యగును.

విష్ణు భక్తులై యుండియు స్వస్వవర్ణోచిత రాజ్యపాలనాదుల యందు నిరతులగు క్షత్రియ వైశ్యులకు, మీనము క్లుప్త శిఖ ధరించుటయు, యజ్ఞోపవీత ధారణమును, దేహధర్మములగు సంతాన ఆరోగ్య న్యాయార్జి ధన ధాన్యాద్యైశ్వర్య వాంఛ, మొదలగునవి గలిగియుండుటయు విరుద్ధములు కావు. ఇక ప్రపన్న ద్విజులకులని చెప్పబడుచు, మోక్షార్హులగుదురు. అంతకు విరుద్ధముగా ప్రవర్తించువారు, మోక్షదూరులై నరకమును పొందుదురని శాస్త్రములు చెప్పుచున్నవి. ఎట్లనగా,

సంతానారోగ్యవాంఛావాన్ విష్ణుసాయుజ్య హేతవే ।

ఏతద్ద్విజోక్త మార్గేణ అన్నశుద్ధ్యాదికం చరేత్ ॥ అని మొదలుకొని

శూద్రాదీనాం క్షత్రియాణాం రాజ్యదేశాది పాలనే ।

సర్వదా విష్ణుభక్తానాం కేశశ్మశ్రాది ధారణమ్ .....

న్యాయార్జిత ధనేనైవ విష్ణు పూజాదికం చరేత్ ।

అన్యథా యః కరోత్యేవం తస్యాయుశ్శ్రీశ్చ నశ్యతి ॥

స యాతి నరకం ఘోరమ్ .....

తస్యైవ విష్ణు సాయుజ్యం నాస్తి సత్యం చతుర్ముఖ

అని పరాశర సంహిత చెప్పుచున్నది. అట్టి కేవల ప్రపన్న క్షత్రియాదులకును

స్వధర్మనిరత విష్ణు సాయుజ్యం నాస్తి సత్యం చతుర్ముఖ

అని పరాశర సంహిత చెప్పుచున్నది. అట్టి కేవల ప్రపన్న క్షత్రియాదులకును స్వధర్మనిరత విష్ణు భక్తులకు క్షత్రియాదులకును నామములలో భేదముండును. సాక్షాద్భగవదుక్త విశిష్ట ధర్మపరులై శిఖాయజ్ఞోపవీతాయుధాధులను విసర్జించి, నిరహంకారులై, రాజ్యపాలనాదులను త్యజించి, ఆచార్య పరతంత్రులై యుండు క్షత్రియాది త్రైవర్ణికులకు **శాత్తాదవర్** అని నిరూపక నామముండును. అట్లుగాక రాజ్యపాలనాది నిమిత్తముగా శిఖాదులను విడువక వైష్ణవాచార శీలురై న్యాయార్జిత ధనముతో విష్ణు పూజాదులను జరుపుకొను క్షత్రియాదులకు విష్ణుభక్తులు, అని మాత్రమే నిరూపక నామముండును. ఇది సచ్ఛాస్త్ర సమ్మతమైన యంశము.

ప్రసంగ వశమున కులశేఖరులాళ్వార్ల జాతి విచారము

ఇక శ్రీకులశేఖరాళ్వార్లు క్షత్రియులా శూద్రకులజులాయను విషయమును విచారించుచు శ్రీపిళ్లై లోకం జీయర్, కులశేఖరులు రాజ్యపాలనము చేయుచున్నను క్షత్రియకులజులు గారనియు, శూద్ర కులజులేయనియు, నిరూపించుచు,

ఆగైయాలే కులశేఖరర్ త్రైవర్ణిక రెన్నుమదు

ఏతద్దర్శన బహిర్భూత రాగక్కడవదత్తనై అనియు, కులశేఖరాళ్వా రెన్గిఱ తిరునామమ్

ఆద్యస్య నః కులపతే ర్వకుళాభిరామమ్

ఎన్ఱు మాప్పోలే ప్రపన్న శ్రీవైష్ణవకులత్తుక్కు శేఖర రెన్ఱపడి

అనియు సాయించి యుండిరి. కాని రాజనం కులశేఖరమ్ అను ముకుందమాల ప్రారంభ శ్లోకము నందు రాజాన మని జాతినిరూపక పదముతో వ్యవహరించియుండుటచేతను, వారు సాయించిన పెరుమాళ్ తిరుమొళి అవతారికలో పెరియవాచ్చాన్బిళ్ళగారు సర్వస్మాత్పరనాన సర్వేశ్వర నడియాగ పెరుమాళ్ పెత్తదు భక్తి రూపాపన్న జ్ఞానమాగైయాలే అని సాయించుచు,

స్వాతంత్ర్య పిఱప్పే యుడై యరాగై యాలై

మనుష్యర్ నిరోధిప్పార్ పలరు ముణ్డాగైయాలే

అనియు సాయించిరి. దానికి అరుమ్పదములో

రాజావాగైయాలే స్వాతంత్ర్యమ్ పిఱప్పే యుడైరాయ్

అని చెప్పబడెను. పై ప్రమాణ వచనముల ననుసరించి, భక్తి రూపాపన్న జ్ఞానము బ్రాహ్మణాది త్రైవర్ణికాది కృతమగుట చేతను, స్వాతంత్ర్యము జన్మ సిద్ధమగు రాజకులోద్భూతులకే యుండుట సహజమగుట చేతను, కులశేఖరులు, శూద్రకులోద్భూతులు గారనియు, క్షత్రియకులజులే యనియు తలంచవలసియున్నది. ఇంకను, పిళ్లైలోకం జీయర్ పెరుమాళ్ తిరుమొళి తనియన్ల వ్యాఖ్యానములో తమయభిప్రాయమున కనుకూలముగా **ముడివేన్దర్ శికామణియే** అను దానికి

ముడివేన్దర్ శికామణి యావదు మణిమకుడం

తాళిత్తుళఙ్గు నీణ్ముడియరరశర్ అడియిలే వణఙ్గుగైయాలే

అని వివరించియుండిరి. కిరీటాధిపతులగు రాజులకు వందనీయులగు వారు అని యభిప్రాయము తేలుచున్నది. దాని వలన తాము శూద్రకులజులైనను, కిరీటధారులగు రాజులకు సేవ్యులైన వారని, సిద్ధమగుచున్నది, కాని ముడివేన్దరిల్ శికామణి అని యవయవార్థము చెప్పినప్పుడు, కిరీటధారి రాజులకలో శ్రేష్ఠులగు వారు అని యర్థము సరసముగా నుండును. లేనప్పుడు క్లిష్టార్థము చెప్పక తీరదని ప్రాజ్ఞులు తెలసికొందురు గాక.

ద్రావిడ వేదాధ్యయనాధ్యాపననియమము

ద్రావిడ వేదరూపములగు దివ్య ప్రబంధములు సర్వాధికారముగా నుండినను, వానిని ఆచార్యముఖముగా నుపదేశమును పొంది యధ్యయనము చేయవలసి యుండును. అట్లుపదేశమును శాత్తిన వైష్ణవులగు బ్రాహ్మణుల వద్దనే శాత్తాదవైష్ణవులగు క్షత్రియాదులు గ్రహింపనర్హులు గాని, స్వయముగా నుపదేశము చేయుట కర్హులు గారు. దివ్య ప్రబంధములకు గూడ వేదసామ్యముండుట వలన, తదధ్యాపనము అధికృతాధికారమై యుండును. అయితే ఆ దివ్య ప్రబంధములను లోకమునకు ఉపదేశించిన ఆళ్వార్ల యందు ద్విజవైష్ణవేతరులు గూడ నుండిరి గదా. అందువలన, ద్విజేతర శ్రీవైష్ణవులు దివ్య ప్రబంధాధ్యాపన మొనర్చుటలో నేమి దోషముండునని శంకింపగూడదు. ఆళ్వార్ల యందు, భగవద్విశేషాధిష్ఠానముండి తదనుభవ రూపముగా దివ్య ప్రబంధము లవతరించుటచే వారికి, జాతిభేద ప్రయుక్తానర్హత యుండుటకు వీలులేదు. సర్వ వ్యాపియగు విష్ణువు అంతటను నధిష్ఠించి యుండినను, నందులో సామాన్యాధిష్ఠానము విశేషాధిష్ఠానము, అని రెండు భేదములు గలవు.

శ్రీశస్య సర్వాధిష్ఠానం దారువహ్నిన దీరితమ్ ।

విష్ణో ర్విశేషాధిష్ఠానం ఆయః పిండాగ్నివ స్మృతమ్

అనగా సర్వేశ్వరుడు అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః ।

అని శ్రుతి చెప్పినట్లు సర్వ ప్రపంచము నందును వ్యాపించియుండు అధిష్ఠానము, సామాన్యాధిష్ఠానమనబడును. అది, కట్టెలలో నగ్ని అంతర్భవించి బయటికి గానరాకుండునట్లుండును. ఇక, విశేషాధిష్ఠాన మెట్టిదనగా కాలిన ఇనుప ముక్కలో నుండు అగ్నివలె, బయటికి వ్యక్తముగా గన్పట్టున్నదిగా నుండునని చెప్పబడెను. అట్టి యధిష్ఠానములలో సామాన్య జనుల యందు సామాన్యాధిష్ఠానమును, ఆళ్వార్లు మొదలగు పూర్వాచార్యుల యందు విశేషాధిష్ఠానమును, నుండునని తెలియవలెను. కాబట్టియే, యట్టి ఆళ్వారుల మూర్తులను భగవన్మూర్తుల వలె, నారాధించుట జరుగుచున్నది. అందువలన, నట్టి ఆళ్వారుల సామ్యమును, గైకొని శాత్తాదవైష్ణవులకు గూడ అధ్యాపనాధికారముండునని చెప్పగూడదు. శాత్తాద శ్రీవైష్ణవులగు ద్విజేతర వైష్ణవులు, స్వరూపోపాయ పురుషార్థ ప్రతిపాదక మంత్రరత్న రహస్య నిష్ఠులై, అహంకారాది వర్జితులై, యథాశక్తిగా భగవద్భాగవతాచార్య కైంకర్య నిరతులై, యనన్య ప్రయోజనులై, ద్రావిడ వేదాది రహస్య జ్ఞాన పూర్వక తదను సంధాన పరులై, యుండుటయే స్వరూపముగా గలవారై యుండవలెను.

అట్టివారే, **నశూద్రా భగవద్భక్తాః భగవద్భక్తి దీప్తాగ్ని దగ్ధ దుర్జాతి కిల్బిషాః**

అను ప్రమాణములకు లక్ష్యభూతులగుదురు. అట్టి యోగ్యత తమకున్నను, స్వనై చ్యానుసంధాన ముండవలెనే గాని తమనుత్కృష్టులనుగా తలంచుకొనగూడదు. అందువలన, శాత్తిన శ్రీవైష్ణవులగు బ్రాహ్మణుల విషయములో ఆచార్య ప్రతిపత్తి గలిగి తదుపదిష్ట దివ్య ప్రబంధత అర్థాను సంధాన పరులై యే యుండవలెను.

అట్టి వారిని గురించియే పరాశర సంహితలో

ద్విజశుశ్రూషణరతో మధ్య మాంస వివర్జితః ।

స్వకర్మ నిరతోదాస్త శ్శూద్రో న విజితేంద్రియః ॥

అని చెప్పబడెను. దీని వలన ద్విజ శుశ్రూషణ మద్య మాంసవర్జనాది రహితునకు, శూద్రత్వము నశింపదని నిర్ణయమగుచున్నది. వర్ణానాం బ్రాహ్మణో గురుః అని యుండుట చేత శాత్తాద శ్రీవైష్ణవులకు నాచార్య కృతమగు అధ్యాపన మందధికారము లేదని స్పష్టము.

భగవద్విశేషాధిష్ఠితుల వైభవము

వెనుక చెప్పినట్లు, భగవద్విశేషాధిష్ఠితులగు ఆళ్వార్లు, పూర్వాచార్యులును, తత్సదృశులైన సదాచార్యులును,

ఒణ్ శెఙ్గదై వాళాలియాన్ ఒరువ నడియేనుళ్ళానే

శిఱుపులియూర్చల శయనత్తుళ్ళు మెనదుళ్ళత్తుళ్ళు ముఱైవారై

ఇత్యాది దివ్య సూక్తుల ప్రకారము తమలో శ్రియః పతి, విశేషాధిష్ఠితుడై యుండినట్లు తెలసి, యనుభవించి తత్ప్రభావము వలన స్పర్శవేధి సంబంధము వలన సిద్ధమగు బంగారము వలె, విలువనొంది యుండును. అట్టి వారి సంబంధము గలిగి పోనగంశెయ్ద శేదం తరువరేల్ పునిదమన్దే అను శ్రీసూక్తి ప్రకారము వారి భుక్త శేషము (తళిగై ప్రసాదము) ను, పరిగ్రహించి

కాయాన్నస్థలశుద్ధిప్పణ్ణిన పూర్వాచారమ్

అను రీతిని శరీరాదులను పవిత్రముగా చేసికొనుట. ప్రపన్న శ్రీవైష్ణవునకు ధర్మమని తెలియవలెను.

అట్టి లక్షణములు లేని వారును, స్వనైచ్యానుసంధానము నెఱుగనివారును, దివ్య ప్రబంధాధ్యయన మాత్రము చేత తమను ఉత్కృష్ఠులనుగా తలంచుకొనువారును, అట్టి భావము చేతనే బ్రాహ్మణ శ్రీవైష్ణవులకు తాము నమస్కరించునప్పుడు, తమకు వారు ప్రతి నమస్కారము చేయవలెనని, యపేక్షించు వారును, నింద్యులే యగుదురు.

వైష్ణవ జాతి నిరూపణము నిషేదించుటలో విషయ నియమము

వైష్ణవే జాతి బుద్ధిః అనియు అదిలే ఒన్ఱు అవర్గల్ పక్కలిలే జన్మ నిరూపణమ్ అనియు నుందు వచనములను అనుసరించి బ్రాహ్మణాది జాతి నిరూపణము అనియు నుందు వచనములననుసరించి బ్రాహ్మణాది జాతి నిరూపణము, వైష్ణవుల విషయములో భాగవతాపచారముగా చెప్పబడెను. అయితే శాత్తినవర్, శార్తాదవర్ అను భేదమును బట్టి బ్రాహ్మణక్షత్రియాది భేదమును పాటించుట, అపచారహేతువు గదా, యని శంకింప వీలులేదు. వెనుక చెప్పిన రీతిని ప్రపన్న ద్విజ సేవైక తత్పర కరణత్రయులై స్వనైచ్యానుసంధానశీలురై భగవద్భాగవతాచార్య ప్రవణులై యుండు శాత్తాద శ్రీవైష్ణవులగు క్షత్రియాదుల విషయములో తత్తజ్జాతి ప్రయుక్త నికృష్టతను తలంచి వైష్ణవత్వ ప్రతిపత్తిని చేయకుండుటయే. యట్టి యపచార హేతువగునని తెలియవలెను. అట్లుగాక, శ్రీవైష్ణవ మాత్రులనెడి దానిని బట్టి యందరును, భాగవతులుగా నెంచి వారి వారి జన్మ నిరూపణ మొనరించుట, యపచారహేతువగునని తో **దళైతే వైష్ణవాః స్మృతా** అని చెప్పినట్లు, వైష్ణవులలో ననేక విధములుండుట చేత నట్టి వైష్ణవ మాత్రుని యెడల

వైష్ణవో వైష్ణవం దృష్ట్వా దండవత్ప్రణమే ద్భువి

వైష్ణవాంఘ్రిజలా త్పుణ్యాత్ వైష్ణవో చ్ఛిష్టభోజనమ్ వైష్ణవ సంశ్రయాః

ఇత్యాది ప్రమాణోక్త ప్రతిపత్తులన్నియునూ, చేయవలసి వచ్చును. అట్లు చేయుట, వర్ణ సంకర హేతువై దోషావహమగును. అందువలన నట్టి దోషము రాకుండునట్లు వెనుక నిర్ణయింపబడిన ప్రకారము నిరహంకారులై స్వనైచ్యాను సంధానాధ్యాత్మగుణ భూషితులగు శాత్తాద శ్రీవైష్ణవుల పట్ల, జాతి ప్రయుక్త భేదమును చాటించి, నికృష్టులుగా వారిని భావించుట, తగదనుటయే భాగవతాపచార తాత్పర్యము.

నిరహంకారుల పట్ల జన్మ నిరూపణతగదు

భగవద్భక్త్యాది భాగవత లక్షణములు పూర్ణముగా లేనివారైనను, నిరహంకారులుగా నుండు నేజాతి వారికైనను జన్మ ప్రయుక్త విహీనత యుండదనియు, నట్టి వారి వృద్ధానువర్తనమే, వారి దౌర్జాత్యమును పోగొట్టుననియు, ప్రమాణములుండుటచే వారిని అనుపవీత బ్రాహ్మణాదులవలె గౌరవించుట యుక్తము. అట్టి ప్రమాణము లెవ్వి యనగా

కిరాతహూణాంధ్రపుళింద పుల్కసా శ్చాభీర కంకా యవనాః కషాదయః ।

యే ఽ న్యే చ పాపా యదపాశ్రయా శ్రయా శ్శుధ్యన్తి తస్మై ప్రభ విష్ణవే నమః ।

అహో వయం జన్మభృతో ఽ ద్య సమ్యగ్వృద్ధాను వృత్త్యా ఽ పి విలోమజాతాః ।

దోష్కల్యమాదిం విధునోతి శీఘ్రం మహత్తమానా మభిమాన యోగాత్

అనగా కిరాత హూణ పుళిందాది ఆటవికులునూ, నీచజాతులైన వారందఱును, భగవత్సంబంధుల అభిమాన పాత్రులై యున్నచో, జన్మకృతమైన అశుద్ధి వారికుండవోదు. బాగుగా వృద్ధాను వర్తన మొనరించు చుండువారు. విలోమ జాతుల వారైనను వాడి మనసున నుండు దుర్జాతులమైతిమే అను బాధ, దీరి పోయి వారికి జన్మకృత నిహీనత, నశించునని తాత్పర్యము.

అయితే **సంవిదేవ హి భగవతీ విషయ సత్త్వోపగమే న శ్శరణమ్**

అనగా పూజ్యమైన జ్ఞానముండుటను బట్టి యే ఆయా వ్యక్తుల సద్రూపత గ్రహింపబడును. అజ్ఞానమే మనకు శరణము అను వచనమును బట్టి సంపూర్ణ జ్ఞానము గలిగిన వారికే జన్మ నిబంధనమైన దౌర్జాత్యము, నశించును గాని యట్టి జ్ఞానము లేని వారికి కేవలానువర్తన మాత్రము చేత ప్రత్యక్ష దృష్టమగు జాతి నశించి యనుపనీత బ్రాహ్మణాదుల యోగ్యత యెట్లు గలుగును. అనినచో దానికి సమాధానమిట్లు చెప్పవచ్చును. సంవత్తని చెప్పబడు సమ్యఙ్జ్ఞానము, భగవదనుగ్రహ లభ్యమనియు, నట్టిదే ఆళ్వారాదుల యందుండినదనియు, నిదివఱకు చెప్పియుంటిమి. కాబట్టి, ఎట్టి వారి యందరైనను భగవదనుగ్రహము గలిగినచో, వారికి సాత్వికత యేర్పడి, అహంకార రహితులగుదురు. అట్టివారే, వృద్ధానువర్తన చేయబూనుదురు. సంవత్తనగా వేదవిహిత జ్ఞానమని యర్థము. గాన అట్టిది వేదాధికారులగు త్రైవర్ణికులకే లభ్యమగును.

బ్రాహ్మణస్య శరీరం జాయతే

సహి విద్యాత స్తం జనయతిత చ్ఛ్రేష్ఠం జన్మ

జ్ఞాననిష్ఠా జ్ఞానశిఖాజ్ఞాన యజ్ఞోపవీతినః

జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః

ఇత్యాది శ్రుతి స్మృతి వచనములను బట్టి, వేదవిహిత జ్ఞానము లభించుట వలన నది వఱకు జన్మ సిద్ధమగు జాతి, మారి శ్రేష్ఠ జన్మ గల్గునని తెలియుచున్నది. దీని కంతకును భగవదనుగ్రహమే మూలము. అట్టి భగవదను గ్రహము నీచజాతుల వారి యందు గలిగినప్పుడు వారికి, అహంకార వర్జన పూర్వక వృద్ధాను వర్తన మనుభాగ్యము లభించి జన్మ సిద్ధమగు నీచజాతి పోయి, జన్మ సిద్ధ బ్రాహ్మణకుమారుల వంటి యోగ్యత గలుగ గలదు. వేద విహిత జ్ఞానము మాత్రము, వారికుండజాలదని నిష్కర్షము.

దౌర్జాత్యాపగమ ప్రకరణ నిగమనము

శ్రీపిళ్లైలోకం జీయరు, తమ శ్రీవైష్ణవ సమయాచార నిష్కర్షమను మహా గ్రంథము నందు ఐదవ ప్రకరణములో ప్రారంభము నందా ప్రకరణ ప్రమైయమును సంగ్రహించియుండిరి. దానిననుసరించియే ఈ గ్రంథములోని అయిదవ ప్రకరణము ఆరంభము నందు విషయ సంగ్రహము వ్రాయబడెను. ఈ ప్రకరణము భగవద్భక్తుల దౌర్జాత్యాపగమ సమర్థనమును గురించి వ్రాయబడినది. దాని కుపష్టంభకములగు నితర విషయములను నిరూపించిన తరువాత దౌర్జాత్యాపగమ విషయము విపులముగా చర్చించుట జరిగెను. ఇంతటితో నీ ప్రకరణము ముగించవలసి యున్నను, శ్రీపిళ్ళైలోకం జీయర్ వారు, ఇంకను శ్రీవేదాంత దేశికుల విషయములో వైయక్తికముగా (వ్యక్తికి సంబంధించి) కొన్ని దూషణ భూషణములను చేర్చి విపులీకరించి యుండిరి. అదియంతయు నీ ప్రకరణమున కప్రస్తుతమగుటచే, నిది వరకే వెనుకటి ప్రకరణములలో చర్చించి విడచిన విషయములనే చర్విత చర్వణముగా చర్చించి యుండుటచేతను, దానినంతను, నిటవ్రాయలేదు. విజ్ఞులు మన్నింతురు గాక, జిజ్ఞాసువులగువారు, వారి గ్రంథమునందు చదివి తెలిసి కొందురుగాక యని విన్నవించెదను.

శ్రీమతే రమ్యజామాతృ మునీంద్రాయ మహాత్మనే ।
శ్రీరంగవాసినే భూయా న్నిత్యశ్రీ ర్నిత్య మంగళమ్ ॥
శ్రీరామానుజ గోపాల కృపాపాత్రాయ మంగళమ్
శ్రీనారాయణ రామానుజార్య యత్యాఖ్య ధీమతే ॥

ఇట్లు శ్రీవైష్ణవ సిద్ధాంతచార నిర్ణయములో

సిద్ధాంత ప్రతిపాదకమగు మొదటి భాగము ముగిసెను.

భగవద్భక్త దౌర్జాత్యాపగమ ప్రకరణము ముగిసెను.

శ్రీవైష్ణవ సిద్ధాంతాచార నిర్ణయమున ఆచార ప్రతిపాదక

ద్వితీయ భాగము

వర్ణాశ్రమ ధర్మ ప్రతిపాదక ప్రకరణము

వర్ణా శ్రమాచారావశ్యకత

శ్రీవిష్ణుపురాణములో

వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరః పుమాన్ ।

విష్ణు రారాధ్యతే పంథా నాన్య స్తత్తోషకారకః ॥

అని చెప్పబడియున్నందున, శ్రీవైష్ణవుడగువాడు, తన యొక్క జన్మ సిద్ధమగు వర్ణమునకు సంబంధించినట్టియు, తత్తద్వర్ణోక్తాశ్రమములకు సంబంధించినట్టియు, నాచారములను శాస్త్రోక్తముగా నిర్వర్తించుచు, భగవత్ప్రీతిని సంపాదించుకొని తరించుటయే ముఖ్యవిధియై యున్నది. అట్లాచరించు వారి యందే భగవంతునకు ప్రీతి యొదవును. లేనిచో, భగవదాజ్ఞారూపమగు శ్రుతి స్మృతుల నుల్లంఘించువారై, భగవదాగ్రహమునకు బాత్రులు గావలసి వచ్చును. ఎందువలననగా, శ్రుతి స్మృతీ మమైవాజ్ఞా ఇత్యాదిగా సాక్షాద్భగవద్వచన ముండుట వలన, భగవదాజ్ఞాతి క్రమము వలన భగవంతునకు ద్రోహ మొనర్చినవారై, నరకము ననుభవింపవలసి వచ్చును. ఇక, నట్లు వర్ణాశ్రమాచారములను నిర్వర్తించుచు, శ్రుతి స్మృతి పురాణాన్వితమై తత్సదృశ పాంచరాత్ర శాస్త్రానుసారముగా సదాచార రూపమగు పంచసంస్కారాదికముచే సంస్కృతులై, సదాచార్య సమాశ్రయణ పూర్వకముగా ప్రపన్నులైన భగవద్భక్తుల నుద్దేశించి విశేష రూపముగా చెప్పబడిన సశూద్రా భగవద్భక్తాః అనియు స్నానా న్న శుద్ధి ర్ధాస్యం స్యాత్ అనియు

మత్సాయుజ్యాది సిద్ధ్యర్థం ద్విజ ధర్మోక్త వద్భజేత్,

య స్తప్తః శంఖ చక్రాభ్యామ్ భగవద్భక్తి దీప్తాగ్ని

దగ్ధదుర్జాతి కిల్బిషః యస్తు శూద్రోధమే సత్యే ....

తమహం బ్రాహ్మణం మన్యే శూద్రోఽపి మమ భక్త శ్చేత్

.... విప్రోపి మయ్యభక్తశ్చే చ్ఛూద్రా దధమ ఉచ్యతే

ఇత్యాద్యనేక ప్రమాణముల చేత, ప్రపన్న శ్రీవైష్ణవరూపమగు నేకజాతిత్వము, అన్ని వర్ణముల వారికిని లభింపగలదు. అట్లనువర్తింపనివారు, కేవల వర్ణాశ్రమధర్మాచరణమువలన నుత్కృష్టాపకృష్టరూప జాతితరతమ భేదము తప్పదని శ్రీవైష్ణవ సంప్రదాయ సిద్ధము.

ద్విజత్వమునకు ఉపనయన పూర్వక బ్రహ్మచర్య మావశ్యకము

విప్రునకు జన్మసిద్ధమగు బ్రాహ్మణత్వముండినను, వేదోక్త కర్మలనాచరించుటకు ఉపనయన సంస్కార మావశ్యకమనునది

జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజః

అను ప్రమాణము వలన సిద్ధము. ఇచ్చట కర్మణా అనగా ఉపనయన కర్మచేతనే యని అర్థము. యజనాది కర్మలని యర్థము చెప్పదగదు. ప్రథమ వర్ణమున జన్మించిన వారికి షట్కర్మలాచరించుటకు, ఉ

పనయన సంస్కారము ఆవశ్యకము. అప్పుడే వానికి తదర్హ ద్విజత్వము సిద్ధింపగలదు. బ్రహ్మచర్య వ్రతము ననుష్ఠించుటకు ముందుగా, యోగ్యగురు సన్నిధికి చేర్చుటయే ఉపనయన మనబడును. అది

అథ గర్భాష్టమే వర్షే బ్రాహ్మణస్యో పనాయనమ్ ।

జన్మాష్టమే వా కర్తవ్యం తథైవా బ్దేతు పంచమ్ అనియు

అష్టవర్షం బ్రాహ్మణ ముపనయీత తమద్యాపయేత్

గర్భాష్టమేషు బ్రాహ్మణ ముపనయీత అని చెప్పబడినట్లు

గర్భము నందు పిండము చేరినది మొదలు ఎనిమిదవ సంవత్సరము (అనగా జననము నుండి యేడవ సంవత్సరము) నందు గాని, శిశువు యొక్క గ్రహణ శక్తి మందమైనచో జన్మ మొదలు ఎనిమిదవ సంవత్సరము నందు గాని గ్రహణశక్తి తీక్ష్ణముగా నున్నచో నైదవ వర్షము నందే గాని, గురు సన్నిధికి చేర్చబడి సాంగవేదాధ్యయనము, చేయించవలెను. అట్టి వేదాధ్యయన కాలమందు

ఉపవీతం తథా వస్త్రమైణ మేవో త్తరీయకమ్ ।

మేఖలాం చైవ దండం చ ధారయే ద్విథివ ద్విజః ॥

శౌచాదికం సమాచార మాచార్య శ్శిక్షయే ద్వటుమ్ ।

వేద మధ్యా పయేదేసం తస్యార్థం చ నివేదయేత్ ।

మంత్రద్వయం చ సావిత్రీం శిష్య మధ్యాపయేద్గురుః ।

ఆచార్యాధీన వృత్తిస్తు బ్రహ్మచర్య వ్రతం చరేత్ ॥

మౌంజీబంధన మారభ్య శౌచాద్యాచార మాచరేత్

అనగా యజ్ఞోపవీతము కట్టు వస్త్రము, లేడితోలుతో జేయబడిన ఉత్తరీయము, ముంజగడ్డితో బేనబడిన మొలత్రాడునూ, చేతిలో (పాలాశ దండమునూ, వీనిని ఉపవీతుడు ధరింపవలెను. మరియు, గురువుచే నేర్పబడిన శౌచము, (పురీషోత్సర్జనాద్యనంతరము చేయు మృత్తికామార్జనాదికము) స్నానము, సంధ్యావందనము మొదలగునవి చేయుచుండవలెను. ఉపనయన కాలమందే గురువు. వటువునకు

సుప్రజాః ప్రజయాభూయాః సుపతిః పత్యాసు మేధా మేధయా

ఇత్యాది మంత్రములను రెండిటిని దక్షిణ కర్ణములో నుపదేశించి, తరువాత శిష్యుని అభ్యర్థనము పొంది గాయత్రీమంత్రము నుపదేశించి, తరువాత శ్రావణ పూర్ణిమ మొదలుకొని వేదమును పూర్వ పక్షమందును, వేదాంగములను కృష్ణ పక్షమందును, నధ్యయనము చేయింపవలెను. ఇక వటువు, తన యాచార్యుని ఆధీనములో నుండి బ్రహ్మచర్య వ్రతము నాచరింపుచుండవలెను. మౌంజీబంధనము మొదలుకొని శౌచాద్యాచారములకు తప్పక నాచరింపుచుండవలెను. ఇట్లు స్వస్వసూత్రానుగుణముగా (అనగా ఆపస్తంబ, అశ్వలాయనాది ఋషి ప్రణీత, గృహ్యసూత్రములను అనుసరించి) స్నాన సంధ్యాచరణమువలన శరీర పోషణము నొనరించుకొనుచు, వేదాధ్యయనము నిర్విఘ్నముగా సాగించుచు, గురుశుశ్రూషాపరుడై యుండవలెను. ఇదియే బ్రహ్మచర్య నియమము. ఇదియంతయు, భగవత్ప్రీర్థముగా, నొనరించుట వైష్ణవత్వమునకుండు వైలక్షణ్యము.

అధ్యాపకాధ్యేతల లక్షణ నియమములు

అధ్యయనమును చేయించు నధ్యాపకాచార్యుని లక్షణమిట్లు చెప్పబడెను.

ఏమమధ్యాపయేచ్ఛిష్యాన్ వాగ్యత స్సంయతేంద్రియః ।
శనైశ్చ శిక్షయేచ్చైవనచ పారుష్యవా గ్బవేత్ ॥
శయానః ప్రౌఢపాదో వా తథా ఽ భ్యక్త శిరాశ్చ వా ।
నాధ్యాపయే త్తథా శిష్యాన్నచ పర్యంక సంస్థితః ॥

శిష్యునకు వేదాధ్యయనము చేయించు గురువు బహుభాషణము లేకుండా మితభాషియై, ఇంద్రియములను గురువు బహుభాషణము లేకుండ మితభాషియై, ఇంద్రియములను నిగ్రహించుకొని, మెల్లగా త్వరపడకుండ శిష్యునకభ్యసింపచేయవలెను. శిష్యుని పరుషవాక్కులతో (చీవాట్లు) నొప్పింపరాదు. పరుండి కాని, కాలిమీద కాలువేసికొని గాని, తలంటుకొనుచుగాని, యధ్యయనము చేయింపరాదు. శయ్యపై పరుండి చెప్పరాదు. అట్లే శిష్యునిలక్షణము గూడ నిట్లు చెప్పబడినవి.

కృతాంజలి స్స్వస్థమనా గురోరభిముఖః శుచిః ।
అధీయీత తథా శిష్యో వాగ్యతో నియతేంద్రియః ।

గురువునకు అభిముఖముగా గూర్చుండి చేతులసు జోడించుకొని, స్వస్థమైన మనస్సులతో శుచియై వాఙ్నియమము, ఇంద్రియ జయమును గలవాడై, శిష్యుడు గురువువొద్ద అధ్యయనము చేయవలెను అని చెప్పబడినది. ఇంకను శిష్యుడు మిక్కిలి అధ్యయనాసక్తి గలిగి శక్తుడైయున్నచో

వ్రజం స్తిష్ఠ న్నాసీన శ్శయానో రణ్యే గ్రామేవా యావత్తరసం స్వాధ్వాయ మధీయీత అని చెప్పినట్లు, నడచునప్పుడు, నిలబడినప్పుడు, కూర్చుండినప్పుడు, అడవిలో సమిధలకు వెళ్ళినప్పుడు, గ్రామమలకో భిక్షమునకు వెళ్ళినప్పుడునూ, త్వర త్వరగా స్వాధ్యాయమును పఠించుచూనే యుండవలెను. అటుపైని

ఏవమధ్యయన సంకుర్యా త్తర్పయే ద్దేవతాఋషీన్ ।
ప్రతివేదం సమాప్తౌతు శక్త్యా తం పూజయే ద్గురుమ్ ॥
వేదాంగాని పురాణాని ఇతిహాసాంశ్చ శక్తితః ।
శాస్త్రం మన్వాదికం చైవ యథాశక్తి సమభ్యసేత్ ॥
బ్రహ్మచర్యోక్త మార్గేణ సకృద్భోజనమాచరేత్ ॥
విష్ణ్వాలయే వసిత్వా ఽ పి శయీత నియతేంద్రియః ॥
నాలపే ద్విష్ణు విముఖై ర్నచ తై స్సహ సంవసేత్

అని వాసిష్ట స్మృతిలో చెప్పబడినట్లు, అధ్యయనము చేయుచుండునప్పుడు, ఆయాకాండోక్త దేవతలను గూర్చియు, ఆయాకాండ ప్రవర్తకులగు ఋషులను గూర్చియు, ప్రతికాండ సమాప్తి సమయము నందును తర్పణ హోమాదులను చేయుచు, యథాశక్తి స్వాచార్యుని పూజించు చుండవలెను. వైష్ణవ కులోద్భూతుడగు వటువు. వేదాంగములగు శిక్షావ్యాకరణాదులతో పాటు, వైష్ణవపురాణములను, ఇతిహాసములము, మన్వాది ధర్మశాస్త్రములను గూడ, యథా శక్తిగా నధ్యయన మొనర్చవలెను. బ్రహ్మచర్య వ్రతము నందు చెప్పబడిన విధముగా రోజునకు ఒక్క మారే భోజనము ఒనరించుచుండవలెను. విష్ణు దేవాలయములోనే నివాస శయనము

లొనరించుచు, ఇంద్రియ నిగ్రహయుక్తుడై విష్ణువు ద్వేషించు వారితో మాటలాడుట గాని, వారితో కలసి యుండుటగాని చేయకుండ నుండవలెను.

ఇట్లు బ్రహ్మచర్యమును, యథాక్రమముగా నిర్వర్తించుకొని

ఏవం వ్రతం చరే త్స్నాతో విజితాత్మ జితేంద్రియః

యావదాచార్య వాక్యం వై తావత్కాలం సమాచరేత్ ॥

గురవే దక్షిణాం దత్వా యమిచ్ఛేత్తం సమావ్రజేత్ ।

విరక్తః ప్రవ్రజే ద్విద్వా నసురక్తో గృహీ భవేత్ ॥

నైష్ఠికేన వ్రతేనాపి యావజ్జీవం సమాచరేత్ ।

వసేదాచార్య సంకాశే విష్ణావా వైష్ణవేషు వా

అనగా ఆచార్యుని అనుజ్ఞ పర్యంతము, నాచార్య సన్నిధిలో నుండి తరువాత గురుదక్షిణ సమర్పించి, స్నాతక వ్రతము నాచరించుకొనిన పిదప విరక్తుడైనచో సన్యాసమును స్వీకరింపవలెను, లేక సంసార మందనురక్తి గలిగిన వాడగుచో, వివాహమాడి గార్హస్థ్యమును స్వీకరింపవలెను. లేనప్పుడు యావజ్జీవమును, వేదవేదాంగరతుడై యుండగోరినచో, నైష్ఠిక బ్రహ్మచర్యము నవలంభించి, బ్రహ్మచారిగానే యుండవచ్చును. ఆచార్యుని యందు దత్సదృశులగు వైష్ణవుల యందును, శ్రీమహావిష్ణువు నందు వలెనే ప్రతిపత్తి గలిగి యుండవలెను. అని యిట్లు వైష్ణవ బ్రహ్మచారి ధర్మములు శ్రీవాసిష్ట స్మృతిలోను శ్రీపాంచరాత్ర శాస్త్రములో చెప్పబడియున్నది.

గార్హస్థ్యావశ్యతలో హేతువు

బ్రహ్మచర్యమును సక్రమముగా నిర్వర్తించిన తరువాత, రెండవ యాశ్రమముగా గార్హస్థ్యమును స్వీకరించుట ఆవశ్యకమే యగును. ఎందువల్లననగా,

త్రిభి రఋణవా జాయతే .... బ్రహ్మచర్యేణ ఋషిభ్యః

యజ్ఞేన దేవేభ్యః ప్రజయా పితృభ్యః

అని శ్రుతి శ్రుతి ప్రమాణము చెప్పినట్లు తాను జన్మించినప్పుడే, ఋషిఋణము, దేవ ఋణము, పితృఋణము అను మూడు ఋణములను భరించ వలసియుండును. వానిని వరుసగా, బ్రహ్మచర్యము వలన ఋషిఋణమును, గార్హస్థము వలన దేవపితృఋణములను, దీర్చు కొనవలసియుండును. అనగా, ఋషులు తనకు వేదవేదాంగములకు సంరక్షించి యందచేసినందులకు వాటినధ్యయనము చేసి, వారిని తృప్తి పరచవలెను. దేవతలు పశుపుత్ర వృష్ట్యన్నాదులను తన వంశమునకు కలుగచేసి సంరక్షించినందులకు వారికి, యజ్ఞాచరణము వలన, తృప్తిని కలిగింపవలెను. తన వంశములోని పెద్దలు, వంశమును అంతరింపకుండ తన వరకు సంరక్షించుకొని వచ్చినందులకు తాను కూడ వంశమును నిలుపుకొనుటకు సంతానమును పొంది వారిని తృప్తి పరచవలెను. అందువలన బ్రహ్మచర్యాశ్రమములో ఋషిఋణము తీరిన పిదప, దేవ, పిత్రు ఋణములు తీర్చుటకు రెండవదిగా గార్హస్థ్యము ఏర్పడినది.

ఇంకను అపుత్రస్య గతిర్నాస్తి అని చెప్పిన విధముగా పుత్ర సంతానము లేని వానికి సద్గతి యుండదు గాన, గార్హస్థ్యమవశ్యముగా స్వీకరింప దగియున్నది. సర్వోపకారక్షమ మాశ్రమమ్ అని మహాకవి చెప్పినట్లు తాను ఋణములను తీర్చుకొనుటయే గాక, ఇతరులకు గూడ యథాశక్తిగా, నుపకార మొనరించుటకు

ఉపయుక్త మైనది. గార్హస్థ్యము. మరియు, భగవత్పరిచర్యకును వైష్ణవ కులాభివృద్ధికిని గార్హస్థ్య మావశ్యకముగా స్వీకరింప దగియున్నది.

సర్వోపకారక్షమ మాశ్రమమ్ అని మహాకవి చెప్పినట్లు, తాను ఋణములను తీర్చుకొనుటయే గాక ఇతరులకు గూడ యథాశక్తిగా, నుపకారమొనరించుట కుపయుక్తమైనది గార్హస్యము. మరియు భగవత్పరిచర్యకును వైష్ణవ కులాభివృద్ధికిని గార్హస్థ్యమావశ్యకమని,

వాసిష్ఠస్మృతిలో, నాల్గవ అధ్యాయమందు

అథవా పరిచర్యార్థం విష్ణో రేవస్య శార్జ్గిణః ।

వైష్ణవాన్వయ వృద్ధ్యర్థం ఉద్వహే త్స్త్రియ ముత్తమామ్ ॥

అను వచనము చేత చెప్పబడెను. వైష్ణవ జన్మమెత్తిన వానికి, భగవద్భక్తియు, వైష్ణవకుల సమృద్ధియు ననునవి కోరుకొనుట కంటె మిగిలిన ఋషి ఋణాదులు తీర్చుటంత ముఖ్యము కాదు. ఈ విషయము

దేవర్షి భూతాత్మనృణాం పితౄణాం న కింకరో నాయమృణీ చ రాజన్ ।

సర్వాత్మనా యః శరణం శరణ్యం నారాయణం లోకగురుం ప్రపన్నః ॥

అని చెప్పబడు ప్రమాణము వలన సిద్ధమగుచున్నది. కాన గార్హస్థ్యమును అవలంబించుట, జన్మ సాఫల్య హేతువగును.

ప్రపన్న వైష్ణవునకు పరిత్యాజ్యకన్యా వివరణము

ప్రపన్న వైష్ణవుడు భగవత్పరిచర్యలో తనకు సహభాగినిగా కన్యను వివాహమాడి, గృహస్థాశ్రమములో చేరవలెను. అట్లు కన్యను వరించుటలో, పంచ సంస్కారములు మొదలగు వైష్ణవత్వ ప్రాపకార్హతలు లేనట్టి పాషండ మాయిమతాదుల నవలంభించి యుండు బ్రాహ్మణుల కన్యలు గాక పంచసంస్కారాది సదాచార సంపన్నులగు ప్రపన్న శ్రోత్రియ బ్రాహ్మణుల సత్కుల ప్రసూతలగు కన్యలను, విచారించి, పరిగ్రహింపవలెను. ఇదియే విశిష్ట ధర్మ శాస్త్ర విహితము, వాసిష్ఠ స్మృతిలో నాల్గవ అధ్యాయము నందు

పాషండ శాక్త పతిత సముత్పన్నాం వివర్జయేత్ ।

దశ పూరుష విఖ్యాతాం శ్రోత్రియాణాం మహాకులాత్ ।

శీలలక్షణ సంపన్నాం బుద్ధి రూప బలాన్వితామ్ ॥

అనన్య పూర్వికాం కాంతాయ సపిండాం యవీయసీమ్ ।

ఉద్వహేత్తు విధానేన కన్యాం శుభగుణాన్వితామ్

అని చెప్పబడెను. పై వచనముల తాత్పర్యమేమనగా, పాషండ మతస్థులు, శాక్తేయులు, పతితులు, నగునట్టి వారికులమున పుట్టిన కన్యను పరిగ్రహింపక పది తరముల నుండి శ్రోత్రియులై యుండు వారికులముల నుండి మంచి శీలము, ఉత్తమ స్త్రీ లక్షణములు కలిగి బుద్ధి, రూపము, బలముతో గూడి, తత్పూర్వ మెవ్వరికిని వాగ్దత్తగానట్టియు, మనోహరమైనదే తన సపిండుల గోత్రము నందు జనింపనిదై తనకన్న వయస్సులో చిన్నదై యున్న గుణవతియగు కన్యను, ఎంచి వివాహ మాడవలెను అని భావము, హారిత స్మృతిలో గూడ నిట్లే చెప్పబడెను.

శంఖ చక్ర విహీనాంస్తు దేవతాంతర పూజకాన్ ....

అవైష్ణవానాం సంసర్గా ద్వైష్ణవత్వా చ్చ్యుతో భవేత్

పంచ సంస్కార హీనులై, దేవతాంతర పూజన సలుపుచుండువారిని వైష్ణవ బ్రాహ్మణుడు, కన్యా పరిగ్రహము నందు వర్జింపవలెను. అట్టి యవైష్ణవుల సంసర్గ వశమున తన వైష్ణవత్వము నశించును అనియు చెప్పబడెను. ఇంకను

ఏక శయ్యా ఽ సనం పంక్తి ర్భాండం పక్వాన్న మిశ్రణమ్ ।

యాజనాద్యాపనే యౌనం తథైవ సహభోజనమ్ ॥

ప్రోక్తో వైద్యో వైష్ణవ ఉచ్యతే ।

అవిద్యేన న కేనాపి వైద్యః కించి త్సమాచరేత్

ఏక శయ్యపై పరుండుట ఒకే యాసనమునందు గలసి కూర్చుండుట, ఒక పంక్తిలో నిలచుట, ఒకే భాండమును వాడుకొనుట, పక్వాన్నము తన అన్నములో కలిపికొనుట, కన్యను పరిగ్రహించుట, కలసి కూర్చుండి భుజించుట యను నీ తొమ్మిది కృత్యములు, అనర్హులతో గలసి యొనర్జించినచో వర్ణసాంకర్యము కలుగును. కాన వానిని విడువవలెను. ప్రాకృతుడగువాడు, అవిద్యుడనబడును. అనగా బ్రహ్మ విద్యా విహీనుడు అని భావము) అవిద్యుడైన యెట్టి వాని తోను, వైద్యుడగు వాడు, పైని చెప్పిన సంకర హేతు కృత్యములను చేయరాదు. అని విశేష ప్రమాణములు ఉండుట చేత, నిందితులగు అచక్రాంకితులు, అచ్చుద్రోర్ధ్వ పుండ్ర ధారులు, భస్మ దారులు, మొదలగు విప్రుల కన్యను పరిగ్రహించుట, వైష్ణవ ప్రపన్న బ్రాహ్మణులకు తగదు.

కన్యాశుల్కాది పరిగ్రహ హేయత

వెనుక చెప్పబడిన ప్రకారము, ఆచక్రాంకితుల వద్ద నుండి కన్యను పరిగ్రహించుట ఎట్లు నిషిద్ధమో, యట్లే చక్రాంకితులై యోగ్యకుటుంబములోని వారి వద్ద నుండి కూడ శుల్కమిచ్చి కన్యను పరిగ్రహించుట గూడ నిషిద్ధమని శాస్త్రములు చెప్పుచున్నవి. ఎట్లనగా, ల

క్రీతా ద్రవ్యేణ యా నారీ న సా పత్న్యభిధీయతే ।

న సా దై వేన సా పిత్రే దాసీం తాం కాశ్యపో ఽ బ్రవీత్ ॥

అనగా ద్రవ్యమిచ్చికొని వివాహమాడిన స్త్రీ, దేవ, పితృ పూజాదులలో తనతో సరియగు అర్హత గలదిగా నుండదు. ఆ కన్య పత్ని యని యనిపించుకొనదు. ఆ స్త్రీ, దాసీవంటిదై, దేవ పితృకార్యములలో తనకు పనికి రాకుండబోవును. అని కాశ్యపుడు చెప్పెనని తాత్పర్యము. అట్లే

కన్యా విక్రయిణో మూర్ధాః కిల్బిషన్యైవ కారకాః

పతంతి నరకే ఘోరే దహంత్యా సప్తమం కులమ్

కన్యాస్తు జీవనార్థాయ యః శుల్కేన ప్రయచ్ఛతి

తేషాం మూత్ర పురీషేణ సపరత్రో పజీవతి

స కన్యా యాః పితా విద్వాన్ గృహ్ణీయా చ్ఛుల్క మణ్వపి ।

గృహ్ణీయాద్యది లోభేన స్యాన్నరో మాంస విక్రయీ

ఇత్యాది వచనములను బట్టి శుల్కమును గ్రహించి కన్యను ఇచ్చుట, తండ్రికినీ, తగని కార్యమగును. అట్టిది కన్యాజనకునికి పాతక హేతువగును. ఇంకను అన్యోన్య కన్యా వివాహము (తన చెల్లెలిని అన్నకిచ్చి అతని చెల్లెలిని తాను పెండ్లాడుట) కూడ నిందితమని తెలియుచున్నది. అయితే తృతీయాం మాతృతః కన్యాం

తృతీయాం పితృత స్తథా శుల్కేన చోద్వహిష్యంతి విప్రాః పాపాద్దిమోహితాః

తస్యాంజాతశ్చ చండాలో బ్రాహ్మణ్యాదేవ హీయతే అనియు

మాతులస్య సుతా ముూధ్వా మాతృగోత్రాం తథైవచ

అనియు నిత్యాది వచనములను బట్టి శుల్క క్రేతకన్యతో పాటు తన తల్లి వంశములో తనతల్లికి మూడవ తరమగు కన్యను తన తండ్రికులములో పుట్టిన మేనత్త మనుమరాలిని వివాహమాడుట పాపహేతువనియు, అట్లే తన తల్లి అన్నదమ్ముని (మేనమామ) యొక్క కూతురుని తన తల్లి పుట్టిన గోత్రములోని కన్యను వివాహమాడరాదనియు నుండుట చేత అట్టి నిషిద్ధకన్యలను వివాహమాడు ఆంధ్ర ద్రావిడ శ్రీవైష్ణవులకు అనాచారము సిద్ధమని తేలుచున్నది. అనినచో నిచ్చట నిట్లు విచారణ చేయవలసి యున్నది. వివాహము సంతానార్థము కూడ చేసికొనవలసినట్లు శాస్త్రములు చెప్పుచుండుట చేత అట్టి సంతానమునకు హేతువగు స్త్రీ పురుష భీజముల సంయోగములో స్త్రీ భీజము ఆమె రక్తముతో సంబంధించి యుండును. ఆరోగ్యవంతమైన సంతానము కలుగుటకు స్త్రీ రక్తమునకు విభిన్నమైన రక్తము గల పురుషుని శుక్రమే హేతువగునని సర్వ వైద్య శాస్త్రములును అంగీకరించియున్నవి. కాబట్టి అట్టి బీజశుద్ధి కొరకు కొన్ని నియమములను ధర్మ శాస్త్రములలో చెప్పియుండిరి. అట్టి నియమములలోనివే పై వచనములని తెలియవలెను. పురుషునికి తన తల్లి వంశములో మూడవ తరము కన్య (అనగా తల్లి చెల్లెలి మనుమరాలు) కును, తన తండ్రికి మూడవ తరమందలి కన్య (అనగా మేనత్త కూతురి కూతురి) కును స్త్రీ సంబంధమును బట్టి తనలో రక్త స్వభావము మారదు. అందువలన తన రక్తముతో సమాన గుణము కలదగుటచేత సంతానమునకు సరియగు ఆరోగ్యముండ దోచని ఋషుల అభిప్రాయమై యుండును. ఇక మేనమామ కూతురి యందు దాని యొక్క రక్తముతో సమానమైన గుణము కల రక్తమే యుండును. కాబట్టి మాతుల సుతా పరిణయమును మాతృగోత్రజనిత కన్యకా పరిణయమును అత్యంత హేయములు కాజాలవు. ఇట్లే ఆంధ్ర ద్రావిడ శ్రీవైష్ణవులలో నట్టి వివాహములు జరుగుట గలదు. మాతుల సుతోద్వాహము శ్రుత్యాది సమ్మతమని పైపైని వివరింపబడును. అట్టి వివాహము నింద్యము కాజాలదు. అన్యత్ర అంతకు విభిన్న లక్షణములు గల కన్య దొరికినప్పుడు ఋషుల వచనమును మన్నించి అట్టి వివాహమును మానుట యుక్తమే.

ఇప్పటి కాలమందు భిన్న భిన్న దేశములలో నివసించు శ్రీవైష్ణవుల సంఘములు చాలా పరిమితములై యుండుట చేత వారి వారి ఆచార వ్యవహారములు దేశాంతరీయులైనచో తెలియకుఃడుట చేత స్వసంఘములోని కన్యలనే ఎంచుకొని వివాహమాడుట కలదు. అందువలన నొకప్పుడు మాతుల సుతను, మాతృగోత్రజనిత కన్యను వివాహమాడునాచారము నడుచుచున్నది. ఇది నింద్యము కాజాలదు. కాబట్టి కాశ్యపాది ఋషి వచన సిద్ధమగు అనాచారా చరణ పాతకము వీరికుండదని ప్రాజ్ఞులు గ్రహింపవలెను.

కన్యా విక్రయమునకు కారణాంతరములో పరిగ్రాహ్యత

మీద వివరించిన కన్యా శుల్క స్వీకారము ఒక విధముగా శాస్త్ర సమ్మతి యుండుటను బట్టి పూర్తిగా నింధ్యము కాదు. మను స్మృతి పరాశర స్మృతి మొదలగు ధర్మ శాస్త్రములలో

వృద్ధౌచ మాతా పితలౌ భార్యా సాధ్వీ సుతః శిశుః ।

అప్యకార్య శతం కృత్వా భర్తవ్యా మన రబ్రవీత్ అనియు

ఆపత్కాలేతు విప్రస్తు శౌచాచారా న్నచింతయేత్ ।

శుద్ధిం సమాచారే త్పశ్చాదితి ధర్మవిదో విదుః

అనియు చెప్పబడెను. వాని తాత్పర్యమేమనగా తల్లిదండ్రులు ముసలివారై యుండి అశక్తులైనప్పుడును, మిక్కిలి శిశువులుగా నుండిన అవస్థలలోను చేయు అకార్యము లెన్నియైనను నవి నింధ్యములుకావు. ఆపత్కాలమందు బ్రాహ్మణుడు శౌచమును గూర్చియు ఆచారమును గూర్చియు విచారింప నక్కరలేదు. తరువాత శుద్ధిని చేసికొనవచ్చును అని తెలియవలెను. ఇందు తల్లిదండ్రులు వృద్ధులై ధన సంపాదన శక్తి లేవప్పుడు తమ కుమార్తెకు యుక్త వయస్సు వచ్చి వివాహము చేయక తీరని అవస్థలో వివాహకార్యమునకు ఆవశ్యకమైన ధనమును వరుని వద్ద తీసికొనవచ్చినది నింధ్యము కాజాలదని అర్థము స్ఫురించుచున్నది. అదియే అసద్విషయనమని చెప్పబడుచున్నది. ఇక తృతీయాం మాదృతః ఇత్యాది నిషేదములన్నిటి యందును తగిన కన్యక లభింపకుండినప్పుడు వాని నాచరించుట కూడ అసద్విషయముగా గ్రహింపవలెను.

మాతుల సుతా మాతృవంశజా వివాహములు అత్యంతము నింధ్యములు కావని ఇది వరలో వివరించి యుంటిమి. ఇంకను వరునికి కన్యయందుండెడి ఆదరాతిశయము చేతను తల్లిదండ్రులు బీదలై సుతకు తగిన అలంకారములను పెట్టజాలని అవస్థలో ఆనృశంస్యము చేతను, ఆకన్యకిష్టమైన భూషణములను వస్త్రాదులను సంపాదించుటకు తగిన ధనమును వరుడికిచ్చినప్పుడు దానిని కన్యాజనకులు పరిగ్రహించుట కన్యా శుల్కమని చెప్పబడదు. ఈ విషయము

యాసామా దదతే శుల్కం జ్ఞాతయో న సవిక్రయః ।

అర్హణం తత్కుమారీణా మానృశంస్యంతు కేవలమ్ ॥ అను వచనములో

అర్హణం తత్కుమారీణామ్ అనృశంస్యంతు కేవలమ్

అను వాక్యముల వలన కన్యాభూషణాదుల కుపయుక్త ధనమని స్పష్టపరచబడెను.

అనేక సద్వ్యక్తుల ఆచరణమనింధ్యము

సంఘే శక్తిః కలౌయుగ్రై, మహాజనోయేనగతస్సపన్థా

అను వచనములను బట్టి అనేకులగు సత్పురుషులు ఆచరించునది శాస్త్రములలో నిషిద్ధముగా కన్పట్టినను నింధ్యముగా తలంచ వీలులేదు. తఱచుగా సర్వసజ్జనులు ఆచరించిన సమ్మతించిన సాలగ్రామ గోభూ విక్రయములెట్లు నింధ్యములు కావో అట్లే కన్యా విక్రయము మొదలగునవి నింధ్యములుగా తలంచబడలేదు. శాస్త్రములో

అచ్యుతం ప్రతిగృహ్ణాతి దదాత్యచ్యుత మేవవా ।

తావుభౌ పుణ్యకర్మాణై నారకీ క్రయయా విక్రయా ॥

అనగా శ్రీహరిమూర్తి యగు సాలగ్రామమును దానమిచ్చినవారును ప్రతిగ్రహించిన వారును పుణ్యకర్ములనబడుదురు. అట్టి సాలగ్రామమును అమ్మినను కొనినను నరకభాజనులగుదురు అని చెప్పబడిన వచనమును,

గోభూక్రేతా ౨ నుమంతాచ ఉభౌ నరకపాతినౌ

అనగా గోవును భూమిని అమ్మినవాడును దాని కామోదించికొనినవాడును ఇద్దరూ నరకమున బడుదురు అను వచనమును కన్పట్టినను అవి సదాచారములో నుండినందువలన నింధ్యములుగా కన్పట్టలేదు. దారిద్రాది కారణముల చేత చేయబడు సాలగ్రామ గో భూ విక్రయముల వలెనే కన్యా విక్రయమును ప్రతిగ్రహించిన వారి భావములోను ఉచితముగానే దానిని తాము చేయుచున్నట్లుండినచోనది నింధ్యము కాజాలదు.

మాతులసుతాది పరిణయమునకు శ్రుత్యాది సమ్మతి

మేనమామ కూతురు పితృష్వసృసుత (మేనత్త కూతురు) వీరిని వివాహము చేసికొనవచ్చుననుటలో నీ క్రింది ఋగ్వేద శ్రుతి ప్రమాణమగుచున్నది.

ఆయాహీంద్రః పథిభిరీడితేభిర్యజ్ఞమిమన్నో భాగదేయం జుషస్వ ।

తృప్తాంజహుర్మాతులస్యేవ యోషాభాగస్తే పైతృష్వసేయీపపామివ ।

తాత్పర్యముః

ఓ ఇంద్రుడా! ఈ యజ్ఞములో మేమిచ్చుహవిర్భాగమును పరిగ్రహించుటకు మంచి మార్గములో రమ్ము మేమిచ్చు ఈ వసారూపమగు హవిస్సును మేనమామ కూతురిని వలెను మేనత్తకూతురిని వలెను అత్యంత ప్రీతితో పరిగ్రహింపుము అని తెలియుచున్నది. లోక ప్రసిద్ధమైన అనుభవములో నున్న దానినే కదా, దృష్టాంతముగా చెప్పుట శాస్త్ర మర్యాద.

ఇంకను మాతుల సుతా విషయములో జ్యోతి శాస్త్రమునందు వివాహ ప్రకరణమున

వధూవర యోర్దిన గణమాహేంద్రకూటం

సమ్యగ్విచార్య వివాహః కర్తవ్యః అని చెప్పుచు

నశోభ యేన్మాతుల కన్యకాయామ్ అని విశేషించి మాతులసుత విషయములో దినగణ మాహేంద్ర కూటములను విచారింప నక్కరలేదని చెప్పబడెను. ఇక నిషిద్ధ కన్యా వివాహా నంగీకారము కూడ ఋగ్వేదము లో కలదు. ఎట్లనగా, ఓ చిత్సభాయామ్ అను సప్తమ కాండ ఆరవ అధ్యాయ (ఆధ్య) ము నందలి సూక్తములో వివస్వత్పుత్రులగు యమి, యముడు సంవాదము చేసికొనిన సందర్భములో అన్నయగు యముని చెల్లెలగు యమి (యమున) తనను పెండ్లాడమని కోరగా నిరాకరించుచు యముడు

గర్భేహినౌ జనితా దంపతీకర్దేవ స్త్వష్టా సవితా విశ్వరూపః

అనగా మన ఇద్దరికిని జనించిన వారగు సోదరీ సోదరులు గూడ పెండ్లి యాడుట తటస్థించును. అది చాలా గర్హ్యము కాదా! సూర్య వంశమునకు కళంకమగునని చెప్పెను. దీని వలన వెనుక వివరించిన విధముగా స్త్రీ పురుష బీజముల యందలి కారణమగు రక్త భేదమావశ్యకమని తేలుచున్నది. అందువలన మేనత్త కూతురుని వివాహమాడుటంత ప్రహతముగాలేదు. సత్సంతానమునకు స్త్రీ యొక్క రక్త భేదమే కదా ఆవశ్యకము, ఇట్లు వేదచోదితమైనను పితృష్వసేయీ వివాహము ఆచరణలో అరుదై యున్నది. ఇక శ్రుతి విరుద్ధములగు

స్మృత్యాదులకు ప్రామాణ్యముండబోదుగాన వేదచోదిత మాతుల సూతా వివాహమును మాతులన్యసు మూఢ్వా ఇత్యాది స్మృతి వచనములు ప్రమాణములై ప్రతిబంధింపజాలవని తెలియవలెను.

అష్ట విధ వివాహములు

వివాహములు ఎనిమిది విధములని ఈక్రింది వచనము చెప్పుచున్నది.

బ్రాహ్మోదైవ స్తథైవార్షః ప్రాజాపత్య స్తథా ఽ సురః

గాంధర్వోరాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమోమతః

అనగా బ్రాహ్మము దైవము, అర్షము, ప్రాజాపత్యము, ఆసురము, గాంధర్వము, రాక్షసము, పైశాచము అను వాని పేరులు చెప్పబడెను. అందు అసుర గాంధర్వ రాక్షస పైశాచము అని వాని పేరులు చెప్పబడెను. అందు అసుర గాంధర్వ రాక్షస పైశాచములను నాల్గు వివాహములును బ్రాహ్మణులకు నిషిద్ధములు. ఈ నాల్గింటిలో ఒకప్పుడు పితృగోత్రాది సంబంధము కలుగవచ్చును గాన వానిని విడచి బ్రాహ్మాది చతుర్విధ వివాహములనే షట్కర్మనిరతులగు వారాచరింపవలెను. క్షత్రియాదివర్ణములవారు ఎనిమిదివిధములగు వివాహములలో అసురాదులను చేసికొనుటలో నభ్యంతరముండబోదు.

ఈబ్రాహ్మాది వివాహములను గురించి తిరువిరుత్త వ్యాక్యానావతారిక యందు శ్రీనమ్బిళ్ల గారిట్లు వివరించి యుండిరి.

బ్రాహ్మమావదు అభిరూపనాయ్ నృత్త సమ్పన్న నాయిఱుక్కిఱవణై

అలైత్తు సత్కరిత్తు అలఙ్కృతైయాన కన్యయైక్కొడుత్తల్,

ఇదుక్కు అఱవిలై యెన్హుపెయర్ అని ఆరంభించి

పై శాచమావదుసు ప్తై యాదల్ ప్రమత్తై

యాదలే కన్యకైయై రహస్యత్తిలేకూడుకై

ఇదుక్కుప్పెయర్ పేయ్‌నిలై ఎన్హుపెయర్

అను వరకు చెప్పబడెను. పై నిరూపణమునకు తాత్పర్యమేమనగా, బ్రహ్మ వివాహమనగా మంచి రూపము గలవాడై సద్వృత్తము కలవాడగు వరుని పిలచి సత్కరించి అలంకరింపబడిన కన్యను కన్యాదాత స్వయముగా నిచ్చి పెండ్లి చేయుట. దీనికి అఱవిలై పూర్ణదానము అని పేరు. దైవ వివాహమనగా దేవతా యజన రూపమైన యాగములో ఋత్విక్కుడుగా నుండి తృప్తి పరచిన వరుని పిలచి సాలంకృత యగు కన్యనిచ్చి పెండ్లి చేయుట, దీనికి తెయ్‌వమ్ దైవము అని పేరు. ప్రాజాపత్య వివాహమనగా కేవలము ఈ భార్య భర్తలు సంతాన ప్రాప్తిని గార్హస్థ ధర్మములను పొంది యుండవలెనని కన్యాదాత వాక్కుచేత శాసించి వివాహ సంబంధమగు అగ్ని కార్యమును తాను తన యింటనే నిర్వర్తింపచేసి సాలంకృత కన్యాదానము చేయుట. దీనికి ఒప్పు = అర్ష వివాహము అని పేరు.

అర్ష వివాహము అనగా ఒకటి గాని రెండు గాని గోమిధునములతో గూడ సాలంకృత కన్యాదానమును చేయుట. దీనికి పొరుళ్‌గొళ్ = సార్ధక కన్యా వివాహము అని పేరు. ఆసుర వివాహమనగా వరుడు తానే కన్యకకు ఆభరణములను పెట్టి తన శక్తికి తగినరీతిని కన్యాబంధువులకు ధనమిచ్చి పాణిగ్రహణము చేసికొనుట. దీనికి అరుమ్బొరుళ్ విలై = దుర్లభ ధన క్రీత వివాహము అని పేరు. గాంధర్వ వివాహమనగా ఒంటరితనములో

వధూవరులిద్దరును కామమోహముతో కూడి పెండ్లి యాడుట. దీనికి యళోర్ కూట్టమ్ = యాదృచ్ఛిక వివాహము అని పేరు. రాక్షస వివాహమనగా కన్యయొక్క బంధువులను భాదించి వరుడు కన్యను స్వయముగా తీసుకొని పెండ్లియాడుట, దీనికి ఇరాక్కదమ్ = రాక్షసము అనియే పేరు. పైశాచ వివాహమనగా కన్య నిద్రపోవు చుండగా గాని మతి స్థిరము లేక ప్రమత్తగానుండగా గాని రహస్యములో కూడి తీసుకొనిపోయి పెండ్లాడుట.

దీనికి పేయ్నిలై = పైశాచికావసావివాహమని పేరు. అని యిట్లు వివరము తెలియవలెను. మరియు

బ్రాహ్మ వివాహత్తిత్వీలునవన్, ఇరుపత్తొరు కాల్ శుద్ధనాక్కుమ్ ....

మున్నే మూన్టుమ్ పిన్నే మూన్టుమ్ శుద్ధ నాక్కుమ్

అనగా బ్రాహ్మ వివాహము చేసికొనిన వారికి కలిగిన సంతానము తనకు పూర్వతరము వారిని పది మందిని తన తరువాతి తరముల వారిని పది మందిని కలిపి తనలో నిరువది యొక్క తరముల వారిని పాప రహితులను చేయును. దైవ వివాహజనిత సంతాపము తనకు పూర్వుల నేడుతరముల వారిని తరువాతి ఏడు తరముల వారిని తనకు కలిపి పదునేను తరములను పాపవిముక్తులను చేయును. ప్రాజాపత్య వివాహము వలన కలిగిన సంతానము తనకు ముందారు తరములను తన తరువాత నారు తరములను తనతో గూడ పదమూడు పురుషులను పాపవిముక్తులను చేయును. ఆర్ష వివాహమున జనించిన సంతానము తనకు మూడు తరముల పూర్వులను మూడు తరముల తరువాతి వారిని కలిపి తనతో నేడుగురిని పాపవిముక్తులను చేయును అని వివరము తెలుపబడెను. ఇంకను ఆసురాదిగళాననాలుక్కుమ్ .... అతిశయిత పురుషోత్పాదకంగళా మెన్టు శాస్త్రంగళిలే కణ్డు కొళ్లప్పడుమ్ అనగా అసురాది వివాహముల నాలుగింటిలో ఈ విశేష మేదియు లేకుండినను విలక్షణ పురుషులాచరించినచో ఉత్తమమైన సంతానము మాత్రము కలుగునని శాస్త్రములలో కన్పట్టుచున్నది అని వివరింపబడినది.

వివాహములో భర్తృగోత్ర సంక్రాంతి కాలము

పైని చెప్పబడిన వివాహము ఎనిమిది విధములలో బ్రాహ్మణులకు విహితమైన బ్రాహ్మదైవ ఆర్ష ప్రాజాపత్య రూపములగు నాలుగు వివాహముల యందును పాణిగ్రహణమైన తరువాత ప్రధాన హోమమునకు ముందు జరుపబడు సప్తచపద ప్రక్రమణము

ఏకమిషే విష్ణుస్త్వాన్వేతు ఇత్యాది మంత్రోచ్ఛారణ పూర్వకముగా జరిగిన పిమ్మట కన్యకకు పితృగోత్ర నివృత్తియై భర్తృగోత్ర సంప్రాప్తి కలుగును. దీనికి ప్రమాణమే మనగా,

స్వగోత్రా ద్రృశ్యతే నారీ వివాహత్సప్తమేపదే

ఏకత్వం సా గతా భర్తుః పిణ్డే గోత్రేచ సూతకే

అను స్మృతి వచనమే. ఇక ఆసురాది వివాహములను గూడ చేసికొనతగిన క్షత్రియాదులలో గాంధర్వాదులలో సప్తపథ ప్రక్రమణ మొక్కొక్కచోట నుండకపోవుట చేత నట్టి కన్యకకు పితృగోత్ర ప్రచ్యుతి ఉండకపోవచ్చును. కాబట్టి అట్టి వివాహములు బ్రాహ్మణులకు నిషిద్ధములైనవి. అట్లు నియమముండుట చేత బ్రాహ్మణులకు సప్తపద ప్రక్రమణము విధిగా నుండును గాన వారిలో మాతుల సుతోద్వాహము భిన్న గోత్ర జనిత కన్యయగుట చేత నిషిద్ధము కాజాలదు. కాబట్టియే అట్టి వివాహము ద్రావిడాంధ్రాది బ్రాహ్మణులలో ప్రహతమై శ్రుతిస్మృతి సమ్మతమైనది.

భర్తృగోత్ర సంక్రాంత్య భావహేతువు

బ్రాహ్మణులలో గూడ తమకు విహితమగు బ్రాహ్మాది వివాహములలో చోరాగ్ని భయాద్యాపత్తులు ఒక్కొక్క దేశకాల విశేషములను బట్టి కలిగి సప్తపద ప్రక్రమణము జరుగకుండ పోవచ్చును. అందువలన భర్తృగోత్ర సంక్రాంతి కన్యకుండదు గాన పురుషుని తల్లిని స్వపితృగోత్ర ప్రచ్యుతి యుండదు. అప్పుడు మాతులని గోత్రముతో తన తల్లికి ఐక్యముండుట వలన సగోత్ర కన్యా వివాహమగును గాన నది శాస్త్ర విరుద్ధముగా నెంచబడును. అట్టి దానిని బట్టియే మాతులస్యసుతామూధ్వా మాతృగోత్రాం తథైవచ అను నిషేధ శాస్త్రము పుట్టినదని సమన్వయించవలెను. అట్టి హేతువగు సప్తపదప్రక్రమణాభావము లేని స్థలములలో సామాన్యముగా నా నిషేధము ప్రవర్తింపదు. కావుననే మాతులసుతోద్వాహము శిష్ట పరిగృహీతమైనది.

అయితే వరుని తల్లికి చెల్లెలు భిన్న గోత్ర సంక్రాంతురాలగుట చేత ఆమె కుమార్తెను పెండ్లాడుట కభ్యంతరమేమి, అని శంక వచ్చుచున్నది. దానికి సమాధానమేమనగా,

స్నుషా ముఖం దుహితృముఖం కార్యం శ్వశ్రూముఖం తథా ।

స్యాలీ ముఖం ప్రశస్తంస్యాత్స్వసారం మాతరం వినా

అనగా మేనకోడలి వాని కూతురు వావి అత్తవావి అల్లునికి చెల్లెలి వావి గల కన్యలకు వివాహమాడవచ్చును. చెల్లెలు వావి తల్లి వావి గల కన్యలను వివాహమాడరాదు అను శాస్త్ర వచనమును బట్టి తల్లి తోబుట్టువు కూతురు తనకు చెల్లెలి వావి యగును గాన అట్టి వివాహము నాడరాదు.

అవివాహ్యా కన్యా నిరూపణ నిగమనము

పైని చెప్పబడిన విచారమును సలుపక భిన్న గోత్ర జాతయగు మాతులసుతను గూడ వివాహ మాడరాదని నిశ్చయించుట శాస్త్ర పరిశీలనాశూన్యతనే సూచించును. అట్టి వివాహము శాస్త్ర సమ్మతమగుట చేతనే మేనమామ కూతురు బావాః అని మేనత్త కొడుకుని పిలచుటయు, అతడు మరదలా అని పిలుచుటయు అట్లే వరుని తల్లిని అత్తయ్యా అనిన్నీ అత్తగారు, అత్తన్నా, అమ్మంగారు అనిపిలచుటయు లోకములో ప్రహతమై యున్నది. అందు వలన వెనుక చెప్పబడిన కన్యాశుల్కదాన మాతుల మతోద్వాహాదులు తత్తనిమిత్తములను బట్టి నింద్యములు కావనియు పాషండమాయి శాక్తేయ పతితాది కన్యలను వివాహమాడుట శ్రీవైష్ణవ బ్రాహ్మణులకు నిషిద్ధమని తెలసికొనవలెను.

అవైష్ణవ సంబంధ జనితానర్థము

సచ్ఛాస్త్ర విహితమైన పంచసంస్కారాదులు లేక ప్రాకృతులగా నుండు బ్రాహ్మణులతో శరీర సంబంధమును కలుపుకొను వారికి భగవద్భక్తి నశించునని,

మూఢైః పాపరతైః క్రూరై స్సదాగమ పరాఙ్ముఖైః ।

సంబంధాన్ గాచరేద్భక్తిః క్షియతేతైస్తు సంగమైః ॥

అను శాండిల్య స్మృతి వచనము చెప్పుచున్నది. మరియు నా స్మృతి యందే

భగవత్కర్మనిరతైః స్తోత్రపూజాజపాదిభిః ....

భక్తిపూతై స్సదాచారై స్సదాసహవసేద్బుధః

అని శ్రీవైష్ణవ సహవాసము అత్యావశ్యకమని చెప్పబడెను. కాబట్టి శాస్త్ర సమ్మత కన్యను వరించి గృహస్థాశ్రమమును పరిగ్రహించి తదనుగనణమగు స్నానసంధ్యావందనాది సదాచారశీలుడై ఉండువాడే బ్రాహ్మణ శ్రీవైష్ణవుడని వ్యవహరింపబడును. మరియు

సంధ్యావందన పైతృకర్మ నిరతా విప్రాశ్చతే ఽ ప్రాకృతాః

అని సంధ్యావందనాది సత్కర్మనిరతులే బ్రాహ్మణ శ్రీవైష్ణవలగుదురనియు, అంతకు భిన్నమైన చెడుమతములను చెడుకర్మలను అవలంభించి ఉండువారు బ్రాహ్మణులైనను ప్రాకృతులనబడుదురనియు శాస్త్రములలో చెప్పబడెను. కాబట్టి సదాచార నిరతుడై స్నాన సంధ్యా జపా తిథి సత్కారౌపాసనాదుల యందు అసక్తులగుటయే భగవత్ప్రీతి జనకమగును. అంతకు విభిన్న వృత్తి గలవారిని

అస్నాతాలీ మలం బురక్తే ఆజపీ పూయ శోణితమ్ ।
అహుతాశీ క్రిమీన్భుంక్తే అదత్వీ విషమశ్నుతే ॥
ద్వాదశాహమనగ్నిస్తు సంధ్యాహీనో దిన త్రయమ్ ।
చతుర్వేదధరో విప్రః సర్వ శ్శూద్రనమో భవేత్ ॥
ఔపాసన మకుర్వాణ స్త్రియం వా ఽ యో దిగచ్ఛతి ।
స్వమాతృగమనంతలవై ప్రాహుర్బ్రహ్మవిదో జనాః ॥

అని అనేకవిధములుగా శాస్త్రములు నిందించుచున్నవి. కాబట్టి శ్రీవైష్ణవ బ్రాహ్మణుడు సంధ్యాది నిరతుడై యుండవలెను.

వైశ్వదేవ విచారము

శ్రీవైష్ణవ బ్రాహ్మణుడు వెనుక చెప్పిన స్నా సంధ్యాధ్యాచరణముతో పాటు వైశ్వదేవమను నిత్యయజ్ఞము కూడ ఆచరింపవలెనా లేదా అను విషయమును చర్చించెదము.

అకృత్వా వైశ్వ దేవంతు భుఞ్జతేయే బుధాద్విజాః ।
సర్వే తే వృషలాజ్ఞేయాః పతంతి నరకే ఽ శుచౌ ॥
వైశ్వదేవ విహీనాయే ఆతిథ్యైశ్చ బహిష్కృతాః ।
సర్వేతే నరకం యాంతి రాకయోనిం వ్రజంతిచ ॥

అని ఇట్లు వైశ్వదేవ మాచరింపని వారికి ప్రత్యవాయము శాస్త్రములో చెప్పబడినది. కాబట్టి అది ఆచరింపకుండ కేవల స్నాన సంధ్యాధ్యాచరణము చేసినంత మాత్రము చేత బ్రాహ్మణ్యము సిద్ధింపజాలదని తెలియుచున్నది. అట్లు నిత్య సిద్ధమగు వైశ్వదేవము నాచరింపకుండుట ఎట్లు అని విచారింపగా

అకృత్వా వైశ్వదేవంతు యోభుఙ్క్తే ఽ నాపదిద్విజః ।
సమూఢో నరకం యాతి కాలసూత్రమవాక్శిరాః ॥

అను వేదాచార్య వచనమును బట్టి ఆపత్కాల మందు వైశ్వదేవమును మానినను ప్రత్యవాయముండదని తెలియుచున్నది. ఆపత్కాలమందు గూడ సంధ్యాదికమును తనకాప్తుల చేత తన కొరకు ఆచరింపచేసి వారి వలన ధారా పూర్వకముగా ఫలమును స్వీకరింపవలసినట్లు వైశ్వదేవము నింకొకరి చేత నాపత్తులో నాచరింప చేయనవసరము లేదని పై నేదాచార్య వచనతాత్పర్యముగా తోచుచున్నది. అయితే సంధ్యావందనాదులనట్లు

పరుల చేతనైనా చేయించి తీరవలెనని ప్రమాణమున్నదా అనినచో

సాంధ్యం కర్మా గ్ని హోత్రంచ ప్రేత కారయేన్నాన్యథాచరేత్

అని ప్రమాణమున్నది. అనగా సంధ్యావందనము అగ్నిహోత్ర కర్మప్రేతకృత్యము అను వానిని ఆపత్కాల మందు తాను స్నానము మాత్రము చేసి యుండి ఆప్తులచేత చేయించవలెను. మిగిలినట్లు చేయింపనక్కరలేదని తెలియుచున్నది. ఇచ్చట నాపత్తనగా రుగ్ణత మొదలగునవియని తెలియవలెను. అప్పటిలో ప్రత్యక్ష స్నానమాచరింపలేనప్పుడు ప్రోక్షణ స్నానము నాచరింపవచ్చును. ఈ వచనములో

నాన్యదాచరేత్ అను దానికి బ్రహ్మయజ్ఞ వైశ్వదేవాదికమిత్యర్థః

అని తోళప్పరు స్మృతి సంగ్రహములో వ్యాఖ్యానించియుండిరి. కాబట్టి వైశ్వదేవము ఆపత్కాలములో నాచరింపకున్న ప్రత్యవాయముండదు అని తెలియవలెను.

వైశ్వదేవాకరణమున ప్రత్యవాయాభావము

వైశ్వదేవమును అనాపత్తులో నాచరింపవలసియుండినను కూడ భగవంతునికి నివేదన చేసిన తరువాతనే ఆ భగవత్ప్రసాదముతోనే చేయవలసియుండునని ప్రపన్న శ్రీవైష్ణవులకు నియమము కలదు. భగవన్నివేదనమైన తరువాత వైశ్వదేవము చేయక ముందే ఉత్తమాశ్రమియగు యతులు భిక్షమునకు వచ్చియున్నచో వారు, గుమ్మము ముందు నిలచి యుండగా వైశ్వదేవపరుడై యుండక విశిష్టశాస్త్రమునకు విధేయుడై అట్టియతికి భగవత్ప్రసాదమును మాధుకరముగా సమర్పించుటయే వైశ్వదేవతుల్యమగును. అటు పిమ్మట వేఱుగా వైశ్వదేవము చేయనక్కరలేదు. అని స్మృతి సిద్ధము ఎట్లనగా, పరాశర స్మృతిలో వైశ్వదేవ ప్రకరణమున

వైశ్వదేవాకృతం దోషం భిక్షురేకోవ్యపోహతి ।

నభిక్షుకృతం దోషం వైశ్వదేవోవ్యపోహతి

అని చెప్పబడెను. ఈ వచనమునకు వైదిక సార్వభౌములగు తోళప్పరు

తతశ్చ వైశ్యదేవాత్ప్రాగేన భిక్షౌ సమాగతే భిక్షైవ దేవ

వైశ్వదేవాకరణే న ప్రత్యవాయ ఇత్యర్థః

అని స్మృతి సంగ్రహములో నిశ్చయించి చెప్పిరి. అయితే

షడేతేభిక్షుకాస్స్మృతాః అను దానిని బట్టి భిక్షుక శబ్దము మరికొందరి యందు గూడ వర్తించినను యోగరూఢముగా నిచ్చట చతుర్థాశ్రమి బ్రాహ్మణ శ్రీవైష్ణవ యతి యందే వర్తించును అని శాస్త్ర సమ్మతము. అందువలన అట్టి భిక్షుక యతికి భిక్షమును సమర్పించి శేషమును భుజింపని వారికే వైశ్వదేవాచరణావశ్యకత యుండును. అట్టి వారికే తదకరణ ప్రత్యవాయము కూడ నుండును.

ఇచ్చట ప్రపన్న శ్రీవైష్ణవులు తెలియదగిన రహస్యార్థమును వివరించెదము.

ప్రతిదినము ప్రపన్న శ్రీవైష్ణవుడు గృహార్చననుంచుకొని తన్ని వేదిత ప్రసాదమునే స్వీకరించుట శిష్ట సమ్మతమును శాస్త్ర సమ్మతమునునై యున్నది. అట్టి గృహార్చలో భగవద్బింబములతో పాటు యతివర వరవరమునుల బింబములను గూడ నుంచుకొని ఆరాధించుట సుప్రసిద్ధము. అట్లారాధించుటలో భగవన్నివేదనాంతరము వెంటనే వారికి గూడ నివేదనము చేసి తరువాతనే ప్రసాద స్వీకారము చేయుటకలదు. అట్లు ఆరాధించుటలో సర్వోత్తమయతివరుల శేషమే నిత్యము భుజించుట చేత వారికి వైశ్వదేవాచరణావశ్యకత

యుండదు. అకరణే ప్రత్యవాయము ఉండదు. మరియు అట్టియెడ ఇంకొక శ్రీవైష్ణవ యతిభిక్షమునకు వచ్చినను ఆయనకు కూడ సుపాదేయమగు యతివరాది నివేదిత శేషమును భిక్షమునిడవచ్చును. వైశ్వదేవము కట్టిది పనికి రాదని తెలియుట చేత వైశ్వదేవము నాచరింపతగదని వివేకము గ్రహింపవలెను.

వైశ్వదేవ విషయమున దేశిక శ్రీసూక్తి

బ్రాహ్మణోత్తములగు శ్రీవైష్ణవులలో నొక్కొక్క అధికారి భేదమును అనుసరించి ఆచరించు వైశ్వదేవము విభిన్న ప్రకారముగా నుండునని శ్రీవేదాంత దేశికులు సచ్చరితరక్షయను గ్రంథములో తెలిపియుండిరి. అందు వైష్ణవ స్మృతి అను దాని నుండి

వాసుదేవాయ సంకర్షణాయ ప్రద్యుమ్నాయానిరుద్ధాయ

పురుషాయ సత్యాయాచ్యుతాయ వాసుదేవాయేతి

భగవదసాధారణ మంత్రైర్వైశ్వదేవ కరణమ్ వైష్ణవస్య కర్తవ్యమ్

అను ప్రమాణ వచన మివ్వబడినది. దీని భావమిట్లు స్ఫురింపుచున్నది. వాసుదేవాది చతుర్వ్యూహ నామోచ్చారణ పూర్వకముగా గాని వైశ్వదేవ బలిని నిర్వర్తింపవలెను. ఇదియే శ్రీవైష్ణవుల వైశ్వదేవ కరణ విధానము అని, కాబట్టి బ్రాహ్మణ శ్రీవైష్ణవులు వైశ్వదేవము నాచరించుట కూడ భగవన్నామోచ్చారణ పూర్వకముగానే యుండవలెనని విశదమగుచున్నది.

యజ్ఞాకరణ ప్రత్యవాయ విచారము

యస్య వేదశ్చవేదీచ విచ్ఛిద్యేతే త్రిపూరుషమ్ ।

సవైదు ర్బ్రాహ్మణోజ్ఞేయ స్సర్వకర్మ బహిష్కృతః ॥

అనగా నెవనికుల మందు మూడు తరముల నుండి వేదాధ్యయన వైదిక ధర్మాచరణముల విచ్ఛిన్నములగునోవాడు దుర్బ్రాహ్మణుడనబడును. అట్టి వాడు సర్వ కర్మలలోను బహిష్కరింపబడును అనియు,

నాయం లోకో ఽ స్త్యయజ్ఞస్య కథం స్యాత్పరతః సుఖమ్

అనగా యజ్ఞాచరణములేని వానికీలోకమందే పూజ్యత యుండదు. ఇక పరలోక సౌఖ్యము వాని కెక్కడ కల్గును అనియు చెప్పబడుట చేత దౌర్బ్రాహ్మణ్యాదులు కలుగకుండుటకుగాను పిత్రార్జిత ధనము గాని శిష్టజనుల వద్ద యాచించిన ధనము గాని వినియోగించి యజ్ఞాచరణము ఆవశ్యముగా చేయదగును. ఇది సదాచారమైయుండగా బ్రాహ్మణ శ్రీవైష్ణవులు యజ్ఞముల నాచరించుట లేదేమనగా, పిత్రార్జిత ధనమును పరమైకాంతులగు ఋత్విక్కులును పుష్కలముగా నుండినప్పుడు యజ్ఞము నాచరింపవచ్చును. అది గూడ నెట్లాచరింపవలసియుండునో పై గ్రంథములో తెలియగలదు. కాని అంతకు మించి ప్రతిగ్రహాదినా ధన మార్జయేత్ అను విధిని అనుసరించి సంపాదించిన ధనము కేవలము స్వజీవనార్థమే అను వంశము

షణ్ణాంతు కర్మణాం మద్యేత్రీణి కర్మాణి జీవికా ।

యాజనాధ్యాపనే చైవ విశిష్టాచ్చ పరిగ్రహః ॥

అను వచనము వలన సిద్ధము. అట్లు స్వజీవనార్థము సంపాదించిన ద్రవ్యములో మిగిలినచో దానితో యాగమును చేయవచ్చును. అని శాస్త్ర సమ్మతము. ఇంకొక విధముగా యజ్ఞము కొరకే యాచనాదులను చేసి ధనమార్జించుట శాస్త్ర నిషిద్ధము. ఈ విషయము మీమాంసా శాస్త్రము చెప్పుచున్నది. ఎట్లనగా మీమాంస

సూత్రములలో చతుర్ధాధ్యాయ ప్రథమాధికరణములో

తస్మాత్పురుషార్థం ద్రవ్యం సక్రత్వర్థమితి సిద్ధాంతః అని వ్యాఖ్యానింపబడియున్నది. ఇంకను భగవద్ద్రవ్యముతోను రాజ ద్రవ్యముతోను అన్యార్జిత ద్రవ్యముతోను యజ్ఞము నాచరించుట శాస్త్ర విరుద్ధము.

మహాత్ముల యజ్ఞ విశేషములు

అయితే తత్తద్విహితద్రవ్యాభావములో యజ్ఞము నాచరింపకుండుట దౌర్బ్రాహ్మణ్యము నెట్లు కలుగ చేయకుండును. ఇంకను చండాలాత్ప్రతిగృహ్యాపి యజేతావశ్యకైర్మఖైః అని శాస్త్రము చెప్పుచుండగా యజ్ఞమును మానుట యుక్తమా? అని ప్రశ్న వచ్చుచున్నది. దానికి సమాధానమేమనగాః –

యజ్ఞములు ద్రవ్యయజ్ఞాం స్తపోయజ్ఞాన్యోగయజ్ఞాం స్తథాఽ పరే ।

స్వాధ్యాయజ్ఞాన యజ్ఞాంశ్చ సదాకుర్వంతి యోగినః

అను హారిత వచన ప్రకారము ద్రవ్య వ్యయముతో చేయు యజ్ఞము, తపస్సుతో చేయు యజ్ఞము, యోగముతో చేయు యజ్ఞము, యజ్ఞమంత్ర పఠన రూప స్వాధ్యాయముతో చేయు యజ్ఞము, తత్తన్మంత్రార్థ వేదన రూప జ్ఞానముతో చేయబడు యజ్ఞము అని అనేక విధములుగా ఉండును.

అందు గీతలలో **యజ్ఞానాం జప యజ్ఞో ఽ స్మి** అని చెప్పబడిన ప్రకారము అన్నివిధముల యజ్ఞములలోను మంత్ర పఠన రూప జప యజ్ఞము భగవత్స్వరూపమై ప్రధానముగా నుండును. దానిని ఆచరించుట చేత యజ్ఞాచరణ ఫలము కల్గును.

ఇంకను పంచ సంస్కారములలో మంత్రో యాగశ్చ పంచమః అని అయిదవగు యాగ సంస్కారము చెప్పబడును. యాగమనగా దేవపూజనము కదా, శ్రీవైష్ణవులకు సద్వారకాధనము కంటె ఆ ధ్వారకా ధనము ముఖ్యమై అర్హమగునని యిది వఱలో మొదటి భాగములో చెప్పబడెను. అట్టి సాక్షాద్భగవదారాధనము ఉండుట చేత సద్వారకారాధన రూపమగు యజ్ఞాచరణము చేయని దోషముండబోదు కాబట్టి చండాలాత్ప్రతిగృహ్యాపి ఇత్యాది వచనము యజ్ఞార్థ ధనముతో నారంభించిన యజ్ఞము మధ్య విచ్ఛిన్నమగు సందర్భమున అసత్పరిగ్రహము చేసియైనను పూర్తిచేయవలెనని తాత్పర్యము గలదిగా గ్రహింపవలెను. అధవా భగవదారాధన రూపమగు యాగమునకు ధనము లేనప్పుడు చండాలుని వద్ద నైనను ధనమును పరిగ్రహించి భగవదారాధనము సవిచ్ఛిన్నముగా నడుపవలెననియే తాత్పర్యము కలదిగా గ్రహింపవలెను.

అసద్ద్రవ్యకృత యజ్ఞమునకు పాతిత్య హేతుత్వము

శూద్రాదుల వలన పరిగ్రహించినట్టి అన్యాయార్జిత ధనముతోనైనను యజ్ఞము చేసి తీరవలెనని నిశ్చయించుకొని అట్లాచరించిన వారికి పాతిత్యము కలుగునని

చండాలో జాయతే యజ్ఞకరణా చ్ఛూద్రభిక్షితాత్ అని మనుస్మృతియందును,

ధర్మవిద్బ్రాహ్మణ శ్శూద్ర ద్యజ్ఞార్థం నాహరేద్ధనమ్ ।

జాయతే సహిచండాల శ్శూద్రార్థేనేష్ట దేవతః ॥ అని స్మృతి చంద్రిక యందును చెప్పబడెను.

ఇంకను సద్బ్రాహ్మణు డట్టి శూద్ర ధనముతో యజ్ఞమాచరించినచో తనకు పాతిత్యమే కాక యజ్ఞ ఫలము దాతకు చెంది ఉత్తమ గతి పొందునని గూడ

ఉపాదాయ ధనం శూద్రాద్యో గ్ని హోత్ర ముపాచరేత్ ।

దాతా తత్ఫలమాప్నోతి కర్తాచనరకం వ్రజేత్ అని యమస్మృతి యందును.

యే శూద్రాదధి గమ్యార్థ మగ్ని హోత్ర ముపాసతే ।

ఋత్విజస్తేహిశూద్రాణాం బ్రహ్మవాదిషు గర్హితాః ।

తేషాం సతత యుక్తానాం వృషలాద్యుపజీవినామ్ ।

సదామస్తక మాక్రమ్య దాతా దుర్గాణి సంతరేత్

అని మను స్మృతియందును చెప్పబడెను. ఎట్లయినను యజ్ఞము చేయనిచో సద్గతి యుండదని తలచి అసత్పరిగ్రహధనముతో యజ్ఞము చేయరాదని ప్రాజ్ఞులు గ్రహింపవలెను. ఇక **చండాలాత్ప్రతిగృహ్యాపి** అను వచనములో అసత్పరిగ్రహణ ధనము నందు తాత్పర్యము నివ్వక సత్పరిగ్రహధనముతోనే యజ్ఞమాచరింపవలెనను అర్థమును అపి శబ్దమును స్ఫురింపచేయుచున్నది అని గ్రహింపవలెను. ఎందువలన అనగా

దాయప్రాప్తై స్స్వకృష్యావా లబ్దై శ్శిష్ట పరిగ్రహాత్ ।

యజేత శ్రద్ధయా విష్ణుం శ్రేయోర్థీ నాన్యథాయజేత్ ॥

అనగా పిత్రార్జితమైనట్టిగాని శిష్టుల వద్ద పరిగ్రహింపబడినట్టిగాని తనకృషితో కష్టించి సంపాదించి నట్టి గాని సద్ధనముతో శ్రద్ధగా దేవతాంతర్యామియగు విష్ణుని గూర్చి యాగమును చేయవలెనే గాని ఇతర విధముగా ధనమునార్జించి యజ్ఞమును చేయరాదు అని అఖండాదర్శములో స్పష్టముగా చెప్పబడెను. కాన అసత్పరిగ్రహధనములో యజ్ఞము చేయరాదని తేలుచున్నది కదా?

ఇట్లు యజ్ఞము విషయములో చెప్పబడినది నిషేధవాక్యములను చక్కగా విచారించి తనకు అనురూపమైన విధముగానే యజ్ఞాచరణమును సలుపవలెను. అననురూపముగా నుండు విధముగా యజ్ఞమును ఆచరింపకుండినను ప్రత్యవాయముండదని యెఱుగవలెను. అంతియేగాని యజ్ఞాకరణ ప్రత్యవాయ భీతిలో అసత్పరిగృహీత ధనముతో యజ్ఞమును ఆచరించుట అనావశ్యకము.

అవైష్ణవ సహాయకృత యజ్ఞమునకు నిష్ఫలత

న్యాయమైన పిత్రార్జితాది ధనముతో యజ్ఞము నాచరింపునప్పుడు గూడ ఆ వైష్ణవులగు ఋత్విగాదుల సహాయముతో యజ్ఞమును ఆచరించినచో భగవన్ముఖోల్లాసరూపమగు ముఖ్య ఫలముండదు. హారీత స్మృతిలో

అవైష్ణవస్తు విప్రో ఽసౌ చండాలాదధమః స్మృతః ।

నిష్ఫలస్తు భవే త్తస్య హుతమధ్యయనం జపః

అని చెప్పబడినది. అట్లే పరాశర సంహితలో

పాకశ్శయ్యా ఽసనం పంక్తిర్భాండం పక్వాన్న మిశ్రణమ్ ।

యాజనాధ్యాపనేయోని స్తథైవ సహ భోజనమ్ ॥

నవధా సంకరః ప్రోక్తో సకర్తవ్యో ధమైస్సహ

అను వచనములో శ్రీవైష్ణవ యజ్ఞ సంబంధము సంకర హేతువుగా చెప్పబడెను.

ఇంకను **యస్తు నారాయణాదన్యం స్వతంత్రేణ ప్రపూజయేత్ ।**

భవేయుర్నిష్ఫలా స్తస్య యజ్ఞదానాదికాః క్రియాః

అధృత్వా విధి వచ్చక్రం యది కర్మ సమాచరేత్ ।

నిష్ఫల స్తుభవే త్తస్య ఇష్టాపూర్తం ద్విజోత్తమాః ॥

చతుర్వేదీచయో విప్రో వాసుదేవం న వించతి ।

వేదధాతసమాక్రాంతస్స వై బ్రాహ్మణగార్ధభః అని వాసిష్ఠ స్మృతి యందును,

అవైష్ణవాయవిప్రాయ సర్వ వేద విదే ఉ ధవా।

యత్కించిద్దీయతే సర్వం నీతం తద్రాక్షసైః స్మృతమ్ ॥

తస్మాత్తు వైష్ణవేనేవ పూజయేత్సర్వ కర్మసు ।

అవైష్ణవాన్ ద్విజాన్పాపాన్ ప్రయత్నేన వివర్జయేత్

అని హారిత స్మృతి యందును చెప్పబడెను. ఈ వచనముల సంగ్రహాభావమేమనగా ఆ వైష్ణవుడెంత వైదికులైనను వైష్ణవులు వారిని స్వకర్మలలో పరిగ్రహింపరాదు అనియే. కాబట్టి సద్ద్రవ్యముతో పాటు వైష్ణవ ఋత్విగాదులు దొరకిననే యాగము నాచరింపవలెను గాని లేనిచో నాచరింపకుండుటయే శ్రేయము. అట్లు మాని నందు వలన ప్రత్యవాయముండబోదు.

పరమైకాంతులకు పిష్ట పశుయాగ విధి

శ్రీవైష్ణవోత్తములగు పరమైకాంతులు ధర్మలబ్ధ ధనమున్నప్పుడును యజ్ఞాచరణము కర్తవ్యమని వెనుక ప్రతిపాదింపబడెను. అయితే ఆ యజ్ఞము పశువధతో సంబంధించి యుండుటచేత పాపహేతువై కృతయజ్ఞ ఫలమును పొందనిచ్చునా? అని యొక శంక కలుగుచున్నది.

దీనికి మీమాంసలో **నహింస్యాత్సర్వాభూతాని** అను శ్రుతి వచనము వలన **భూత హింస** యనునది నిషిద్ధమైనను **పశునాయజేత** అను విశేష శ్రుతి వచనమును బట్టి **యజ్ఞీయ పశువధ విహితమే** అగుట చేత **తద్భిన్న భూత హింసను నిషేదించుట** యందే మొదటి శ్రుతివాక్యమునకు తాత్పర్యముగా సాధింపబడినది. ఇది యిట్లుండగా మహాభారతములో ఉపరిచర వసు వృత్తాంతము నందు స్వర్గాధి పత్యము నిమిత్తము భవిష్యదింద్రుడు అశ్వమేధములను చేయు చుండునప్పుడు దయామయులగు ఋషి ప్రవరులు జంతు హింసను ఏవగించుచు ఇంద్రునికి భోదింపగా నాతడు మానమోహవశుడై అంగీకరింపకుండినందున వారికి పరస్పరము వివాదము తటస్థించెను. అప్పుడు విహారార్థమై రథముతో భూలోకమునకు వచ్చిన ఉపరిచర వస్తువు వద్ద ఆవివాదము పరిష్కరింపబడుటకు ఋషులు స్థావరములగు నోషధీబీజముల పిష్టముతో పశువును చేసి దానితో యజ్ఞము చేయవచ్చుననియు శక్రుడు సాక్షాత్తుగా జంగమ పశువుతోనే చేయవలెననియు, శక్రుడు సాక్షాత్తుగా జంగమ పశువతోనే చేయవలెననియు వాదింపగా నా ఉపరిచరవసువు శక్రపక్షపాతియై జంగమ పశువుతోన చేయవలెనని తీర్పు చెప్పగా వెంటనే అతనికి అథోలోక ప్రాప్తి సంభవించెననియు చెప్పబడియుండుట చేత ఋషి సమ్మతమగు పిష్టపశు యాగమే ధర్మమని తేలుచున్నది. ఈ విష.ములో వేదాంత దేశికులు గీతాభాష్య తాత్పర్య చంద్రిక యందిట్లు చెప్పిరి.

అత్రో పరిచరాది వృత్తాంతో గ్రాహ్యః యథా ఉపరిచరో
భగవద్ధర్మష్ఠ మాస్థితః కదాచిద్దేవానాం ఋషీణాంచ వివాదే
ధాన్యై ర్యష్టవ్యమితి పిష్టపశువాది మహర్షి విరుద్ధ
మనృత మాభిధాయ నిపతితః అనియు
ఫలార్థినాంతు తత్ఫలమస్థిరం దుఃఖ మిశ్రంచ,
అహింసాత్మకాస్తు యజ్ఞాః విశిష్టాధికారిసాధ్యాః
భగవతో ఽ తి ప్రీణనత్వా దపవర్గ ప్రత్యాసన్నాః
అత ఏవ హ్యుపరి చరాదయ పిష్ట పశుభిః ర్యష్టవంతః

అనియు సాయించి యుండిరి. దీని తాత్పర్యమును బట్టి ప్రత్యక్షపశువధచే సాధ్యమైన స్వర్గాధిఫలములు అస్థిరములును

స్వర్గే ఽ పి పాత భీతస్య క్షయిష్ణోర్నాస్తి నిర్వృతిః

అని చెప్పినట్లు స్వర్గము భవన సమయములో గూడ పాత భయరూప దుఃఖ మిశ్రమై యుండునియు నగుట చేత శ్రుతిచోదిత జ్యోతిష్టోమాదికము భగవదాజ్ఞారూపములై తత్కైంకర్య రూపములుగా నాచరింపవలసినవై అపవర్గ సాధన రూప సాక్షాద్భగవత్ప్రీతి జనకములగుట చేతను భగవదాజ్ఞా రూప సర్వ భూత హింసా నిషేధమును గూడ పాటింపవలసి యుండుట శ్రీవైష్ణవ కర్తవ్యమును గాన సాక్షాజ్జీవ పశువధ చేయకుండ తత్ప్రతికృతియగు పిష్టపశువుతో యాగము చేయుట యుక్తమనియు బోధపడుచున్నది.

అట్లే ఉపరిచర వస్తువు తిరిగి పిష్ట పశు యజ్ఞము నాచరించి తరించెరని గూడ నుదాహరణముగా జూపబడెను. ఆవిధముగానే వేదాంత దేశికులును, వారికి ఆదర్శ భూతులగు పెరియనమ్బి మొదలగు పూర్వాచార్యులును పిష్ట పశుయాగమునే ఆదరించి ఆచరించి యుండిరి. కాబట్టి శ్రీవైష్ణవులు యాగము నాచరింపవలెననిచో పిష్టపశువుతోనే చేయవలెను. ఇంకను ఋష్యాదులు గూడ పిష్టపశుయాగమునే ఆచరించినట్లు మహాభారతమందలి అగస్త్యయాగానుష్టాన వృత్తాంతము అశ్వమేధ పర్వములోని ఎనుబది యొకటవ అధ్యాయములో చెప్పబడినది.

ఇట్టి పిష్ట పశుయాగము వలననే శ్రియఃపతి తనిస్వాపారంభమునందు అవసానమందు సంతృప్తుడగునని గూడ నా భారతము నందే

పశుయజ్ఞైః క దీం హింస్రైస్తాదృశోయష్టు మర్హతి ।
హింసాత్మకైస్తు కింతస్యయజ్ఞై కార్య మహాత్మనః ॥
ప్రస్వాపే చ ప్రబోధేచ పూజితో యేన కేశవః

అని జీవ హింసారూప ప్రత్యక్ష పశువధతో చేయబడు యజ్ఞము వలన శ్రియఃపతికి ప్రీతి యుండడను నంశషము సమర్ధింపబడెను. సిద్ధ పశువనగా నాయా యజ్ఞములలో చెప్పబడిన మేక అశ్వము మొదలగు పశువు యొక్క ఆకారముతో ధాన్యాది పిష్టముతో నొక బొమ్మను నిర్మించి దానికి మంత్ర పూర్వకముగా ప్రాణ ప్రతిష్ఠ చేసి దానినే **విశసనాదిహవిః ప్రధాన పర్యంతము** చేయుకర్మలలో నుపయోగించునదియని తెలియవలెను.

పిష్టపశు విషయములో శ్రుత్యాది విరోధ పరిహారము

భారతేతిహాసములో ఉపరిచర వసు వృత్తాన్త సందర్భములో పిష్ట పశుయాగము యుక్తమని చెప్పబడెను. శ్రుతులలో అగ్నీషోమీయం పశుమాలభేత అని సాక్షాత్తుగా జీవ పశుయాగము విధింపబడెను. దీనికి రెండింటికిని విరోధము రాదా? అని శంక కలుగుచున్నది. దానిక సమాధానమేమనగాః

జ్యోతిష్టోమాది స్వర్గ యాగ విధులలో జీవ పశుయాగమును విధించు శ్రుతులలోనే చాతుర్మాస్యము లనెడి సాక్షాద్భగవత్ప్రీతిజనక యాగములలో **మేషీచ మేషశ్చ భవతః** అను శ్రుతి వలన భగవత్ప్రస్వాప ప్రభోధ సమయములలో పిష్టపశుయాగమే విధింపబడుచున్నది. దీనిని బట్టి కర్మ భేదము అధికారి భేదము అను వాని వశమునకు ఆరాధ్య దేవతా భేదమును బట్టియు రెండు విధములగు యాగములను అవిరుద్ధములగుట చేత పరమైకాంతి యగు వైష్ణవాధికారి స్వారాధ్య భగవత్ప్రీతి కొఱకాచరించు యజ్ఞములో పిష్టపశువుతోనే కర్మ నిర్వృర్తిని చేయుట శ్రుతి విరుద్ధము కాదు అని తేలుచున్నది.

ఇంకను శ్రుతి ప్రమాణమును బట్టి జీవ పశుయాగములో పశువిశసనము చేయునప్పుడు పశువును గురించి పఠించు మంత్రము

నవా ఉపన్మ్రియసే నరిష్యసి దేవాగ్ ఇదేషి పథిభిస్సుగేభిః .... తత్రత్వా దేవస్సవాదధాతు అని యున్నది. ఆ మంత్రము యొక్క అర్థమును బట్టి పశువులోని ఆత్మ అనశ్వరము గాన దానికి యజ్ఞార్థమై శరీరమును ఇచ్చినందున స్వర్గము వచ్చునని తెలియుచున్నది. అనగా యజ్ఞ కర్తకువలెనే ఉత్తమ లోకము వచ్చునని భావము అనగా యజ్ఞ కర్తకువలెనే ఉత్తమలోకము వచ్చునని భావము. పరమైకాంతులగు వారు చేయుయాగము సాక్షాద్భగవత్సన్నిధి ప్రాప్తియే ఫలముగా గలది కదా! పుణ్యకారి చేత నలభ్యమైనది కాదు. విధూత పుణ్యపాపులచే లభింపదగినది. కాబట్టి భారత వచనమునకును శ్రుతి ప్రమాణమునకును విరోధము లేదు.

అయితే కర్మ భేదమును బట్టి వేదములో నొక కర్మ విషయము (చాతుర్మాస్య యాగము) లో పిష్టపశు విధానము చెప్పబడినను అన్ని కర్మలలోను జీవపశుయాగము కాక పిష్టపశు యాగమే శ్రుతి సమ్మతమని యెట్లు నిశ్చయింపగలమనినచో మహాభాగవతుడగు నుపరిచర వసువు బృహస్పతిని ఋత్విక్కునిగా నుంచుకొని యాగము నారంభించి తాను హింసాభీరువుడగుట చేత పిష్టపశువుతోనే యాగమును నిర్వర్తించెననియు, నపుడు ఆయన సమర్పించు హవిర్భాగమును సాక్షాత్తు నారాయణుడే వచ్చి పరిగ్రహించుట తనకు ప్రత్యక్షముగా కనబడగా దానిని బృహస్పతిలో చెప్పగా నాతడు తనకట్లు భగవంతుడు స్వయముగా పరిగ్రహించుట కానరానందుకు కుపితుడై నాకెందుకట్లు కనబడలేదనియు, నేనీయాగములో ఋత్విక్కుగా నుండన నియు ఆగ్రహింపగా

పశుహింసా వారితాచ యజుర్వేదాది మంత్రితః ।
అహంతు వారయే హింసాం ద్రక్ష్యామ్యైకాన్తికో హరిమ్ ॥

అనగా **నహింస్యాత్సర్వా భూతాని** అనునట్టి యజుర్వేదాది మంత్రముల చేత జంగమ పశుహింస నిషేధింప బడినది. నేనును దాని ననుసరించి హింసను మాని పిష్టపశుయాగము చేతను భగవంతుని తృప్తి పఱచితిని. అందువలన నాకు శ్రియఃపతి దర్శనము ప్రత్యేకముగా కలిగినదని జవాబుచెప్పెను అని చెప్పబడెను. ఈ యంశమంతయు భారతములోని శాంతి పర్వములో మోక్షధర్మమగు నారాయణీయమున గలదు.

అది ఏభి స్సమన్వితో రాజన్ అని యారంభించి

ఆరణ్యక పదోద్భూతా భాగా స్తత్ర ప్రకల్పితాః అను వఱకు గల గ్రంథమును పరిశీలించిన స్పష్టమగును.

శ్రుత్యర్థ నిర్ణయమున భారత ప్రాధాన్యము

సాంగ వేదాధ్యయనము చేసి మీమాంసా విచారణ చేసియుండిన వారికి గూడ వేదార్ధమును విశదీకరించుటలో ప్రధానమైన మహాభారతమును పరిశీలించుట అత్యావశ్యకము ఎందువల్లననగా

అవాంతరపానామ వేదాచార్య స్సఉచ్యతే అని చెప్పిన ప్రకారమునకు

యస్య ద్వైపాయనః పుత్రః స్వయం విష్ణు రజాయత అని చెప్పిన ప్రకారమునను సాక్షాన్నారాయణాంశ సంభూతులై విలక్షణ తపోవిశిష్టులై వేదాచార్యులని పేరుపొందిన శ్రీవేదవ్యాసుల చేత వేద సారాంశములు భారతములో విశదముగా తెలుపబడెను. కాబట్టి

భారతశ్శాస్త్ర సారో ఽయమ్ కోహ్యస్యః పుండరీకాక్ష న్మహాభారత కృద్భవేత్

అను వచనములను అనుసరించి సాక్షాద్భగవదంశ సంభూతులైన వేదవ్యాసులు కటాక్షించిన మహాభారతమే శ్రుత్యాది సకల శాస్త్రసారమై యుండుటను బట్టి తత్పరిశీలనము విచక్షణులు చేయవలెను.

అట్లు పరిశీలించినచో పరమ విలక్షణాధికారియైన శ్రీవైష్ణవుడు భగవదనుగ్రహార్థము తానాచరించు నుపాసనమునకు అంగముగా కర్మలను ఆచరించునప్పుడు భగవదభీష్టమగు హింసా భావమునకు అనురూపమైన పిష్ట పశుయాగముచే ఆచరింపవలెనని తెలియగలదు. ఇక సామాన్యమైన ఐహికాముష్మిక పరిమిత ఫలములను కోరిన ప్రాకృత బ్రాహ్మణాదులు జీవ పశుయజ్ఞము నాచరించుటకు అభ్యంతరము లేదు. ఇట్లు విషయ విభాగము చేసి శ్రుతీతిహాస పురాణములకు విరోధము పరిహరింపబడును. అయితే సాక్షాజ్జీవ పశుయాగము భగవద్దాస్య ధర్మమునకు అనురూపము కాదా అనినచో చెప్పెదము. అట్టి జీవ పశుయాగము విషయచపలుడై అర్వాచీన ఫలములను కోరు అధికారికే అనురూపముగా విధింపబడినదను అంశము ప్రమాణ ప్రసిద్ధము శ్రీభాగవతము ఏకాదశ స్కంధమున

లోకే వ్యవాయామిషమద్య సేవా నిత్యాస్తు జన్తో ర్నహి

తత్రచోదనావ్యవస్థితిస్తాసు వివాహ యజ్ఞ సురాగ్రహై రాసు నివృత్తిరిష్టా

అనగా లోకములో మైథున మాంస భక్షణ సురాపాణముల నాచరించు చపలులుందురు.

అట్టి జంతు ప్రాయులకు చపలుల విషయములో ఆయాకృత్యములకు విధివాక్యముల వ్యవస్థ యుండదు.

సపరాదారాన్ గచ్ఛేత్ నసురాం పిభేత్ నహింస్యాత్సరాభూతాని

అను వేదవిధుల నతిక్రమించి వారు అక్రమ సంయోగమును, జంతు హింసారూప పశుయజ్ఞమును, మాదవ సోమపానమును వారు సంకయింపక చేయుదురు. వానిని మానరు. అట్లు చేయుట మంచిది కాదని సత్సంమతము అని ఇట్లు చెప్పబడెను. ఇక సాక్షాద్భగవద్దాస్య ధర్మము నందు తత్పరులైన వారికి

విదుః కృష్ణం బ్రాహ్మణా స్తత్వతో యే తేషాం రాజన్ సర్వయజ్ఞాః సమాప్తాః

అని చెప్పిన రీతిని భగవత్స్వరూప యాధ్యాత్మ జ్ఞానముండును గాన వారాచరించు భగవత్ సృష్టి హేతువగు యజ్ఞాదులలో జీవహింసాప్రధానమైన జీవ పశుయాగము చేయక పిష్ట పశుయాగము చేసినను భగవత్ప్రీతిరూప ఫలము సిద్ధించుటలో సంశయము లేదు.

మరియు సర్వవేదసారమగు నష్టాక్షరీ మంత్రమున కధికారి యగు ముముక్షువనకు అట్టి పశు హింసారూపమైన జీవపశుయాగములు పరిత్యాజ్యములని గూడ శాస్త్రము చెప్పుచున్నది.

స్వదార నిరత శ్శుద్ధో మద్యమాంస వివర్జితః ।

నిత్యం ధర్మరత శ్శాంతో జితాలస్యో జితేంద్రియః ॥

వైష్ణవస్య మనోః సమ్యగధికారీ భవేన్నరః

అని ముముక్షుధర్మములలో చెప్పబడెను. కాబట్టి పరమైకాంతి భిన్నులైన అర్వాచీన ఫలకాములగు ప్రాకృత బ్రాహ్మణులకే జంతు హింసారూపమైన జీవ పశుయాగము విహితమని తెలియవలెను. ఇంకను వైష్ణవస్య మనోస్సమ్యగధికారీ అని చెప్పుట చేత అట్టి అష్టాక్షరీ మంత్రాదికారులగు చాతుర్వర్ణ్య ముముక్షువులకు గూడ నీ వైష్ణవ ధర్మము అన్వయించునని తెలియవలెను. హారీత స్మృత్యుక్త ద్రవ్య యజ్ఞము పిష్ట పశు యజ్ఞమే అని గూడ గ్రహింపవలెను.

ప్రపన్నాచరిత సహజ యజ్ఞ స్వరూపము

ప్రాకృతులై కేవలై హికాముష్మిక పరిమిత ఫలకాములైన ద్విజులు యథా శ్రుత గ్రాహులై జీవత్పశు విశసన పూర్వకముగా యజ్ఞములను ఆచరింతురు. అట్లుకాక ముముక్షువులలో కర్మజ్ఞానాంగక భక్తి నిష్ఠులై

సర్వాపేక్షాచ యజ్ఞాది శ్రుతే రశ్వవత్ అగ్ని హోత్రాదితు తత్కారియైవ తద్దర్శనాత్ సహకారిత్వేనచ

అను బ్రహ్మ సూత్రములను బట్టి భక్తికి సహకారముగా యజ్ఞాదుల నాచరించువారు భగవన్ముఖోల్లాసము కొరకు పిష్టపశు యజ్ఞముల నాచరింతచురు. ముముక్షువులలో కేవల ప్రపత్తి నిష్ఠులు ఆచార్య సమాశ్రయణ పూర్వకముగా పంచసంస్కారములను పొంది నిరుపాధిక యాగ రూపమగు అర్చాబింబారాధనమును చేయుచు భగవన్ముఖోల్లాసమును సంపాదించుకొని దాని వలన మోక్షమును పొందుదురు. అట్టి ప్రపన్నులాచరించు ప్రపత్తి కూడ తురీయోపాయముగాను కర్మ జ్ఞాన భక్తుల కంటె ఉత్తమమగునదిగాను నుండును. ఈ విషయమే ఉపనిషత్తులో **తస్మాన్న్యాస మేషామతిరిక్త మాహుః** అని చెప్పబడెను.

అట్టి తురీయోపాయమగు న్యాసము నందు నిష్ఠులగు వారాచరించు యజ్ఞము పరమవిలక్షణమగు అంతర్యామ్యారాధన రూపమై యుండునని ఆ ఉపనిషత్తులలోనే ఈ ప్రకారము చెప్పబడెను.

తస్యైవం విదుషో యజ్ఞ స్యాత్మా యజమాన శ్శ్రద్ధాపత్నీ శరీరమిధ్మమురో
వేదిర్లోమాని బర్హి ర్వేద శ్శిఖా హృదయం యూపః కామ ఆజ్యం మన్యుః
పశుస్తపోగ్నిశ్శమయితా దక్షిణావాగ్ఘోతా ప్రాణఉద్గాతాచక్షురధ్వర్యు
ర్మనో బ్రహ్మ శ్రోత్ర మగ్నీత్ యావద్ధియతే సాధీక్షా యదశ్నాతి తద్ధవిర్యత్పిబతి
తదస్య సోమపానం యద్రమతే తదుప సదో యత్సంచ రత్యుపవిశత్యుత్తిష్ఠతేచ
సప్రవర్గ్యో యన్ముఖం తదాహవనీయో యదస్య విజ్ఞానం తజ్జుహోతి యత్సాయం
ప్రాతరత్తి తత్సమిధో యత్సాయం ప్రాతర్మాధ్యం దినం చ తాని సవనాని
యే ఉ హోత్రే, తే దర్శపూర్ణ మాసౌ యే అర్ధమాసాశ్చ మాసాశ్చ తే చాతుర్మాస్యాని
యజుతవ స్తేపశుబంధా యేసంవత్సరాశ్చ పరివత్సరాశ్చ తే ఉ హర్గణా స్సర్వ వేద సంవా
ఏతత్సత్రం యన్మరణం తదవభృధ ఏతద్వై జరామర్య మగ్ని హోత్రం య ఏవం విద్వా
సుదగయనే ప్రమీయతే దేవానామేవ మహిమానం గత్వా ఉ ఉ ధిత్యస్య
సాయుజ్యం గచ్ఛత్యథయో దక్షిణే ప్రమీయతే పితృణా మేవ మహీ మాసంగత్వా

చంద్రమసః సాయుజ్యంగచ్ఛతేతౌవై సూర్యాచంద్రమసో ర్మహిమానౌ బ్రాహ్మణో

విద్వానభిజయతి బ్రహ్మణోమహిమానమాప్నోతి తస్మాద్బ్రహ్మణో మహిమాన మిత్యుపనిషత్

అని యున్నది. దీని అర్థమేమనగా బ్రహ్మ జ్ఞాన సంపన్నుడైన న్యాస విద్యానిష్ఠుని అంతర్యామ్యారాధన రూపమగు యజ్ఞమునకు ఆత్మ యజమానుడు, శ్రద్ధయే పత్ని, శరీరము ఇధ్మము (సమిధల కట్ట) వక్ష స్థలము అగ్నియుండు వేదిక, రోమములు బర్హిస్సులు శిఖయే తుడిచెడి దర్భకట్ట (చీపురు కట్ట) హృదయము యూప స్తంభము, కామము హోమీయమగు నెయ్యి, క్రోధమే పశువు, తపస్సే అగ్ని, దక్షిణయే (సామర్థ్యమే).

పశువిశసనము చేయు శమయిత, వాక్కే, హోత, ప్రాణమే, ఉద్గాత చక్షుస్సే అధ్వర్యుడు, మనస్సే బ్రహ్మ, శ్రోత్రమే విసనకఱ్ఱ, ఎంత కాలము జీవించి యుండునో అది దీక్షాకాలము, దేనిని తినునో అదియే హవిస్సు, దేనిని త్రాగునో అదే సోమపానము, తిరుగుట కూర్చుండుట లేచుట అనునదియే ప్రవర్గ్యములు, నోరే అహవనీయాగ్ని స్థానము బుద్ధియే హోత, సాయం ప్రాతః కాలములలో నుపయోగించు దంతకాష్టములే హోమీయ సమిధలు, ప్రాత స్సాయం మధ్యందిన స్నానములే సవనములు, పగలు, రాత్రియే దర్శపూర్ణ మాసములు, పక్షములు నెలలు, చాతుర్మాస్యములు, ఋతువులే పశుబంధములు, సంవత్సర పరివత్సరములే అహర్గణములు, ఈవిధమైన సర్వవేదస మను సత్ర యాగమునకు మరణమే అవబృధము (అవసానము).

ఇట్టి జన్మ మరణములకు సంబంధించిన అగ్నిహోత్ర యాగమును ఎవడు ఆచరించునో వాడు ఉత్తరాయణములో మరణించినచో ఆదిత్యుని సాయుజ్య పూర్వముగా దేవయాగము గుండను, దక్షిణాయనములో మరణించినచో చంద్ర సాయుజ్య పూర్వకముగా పితృయాగముగుండను పోయి భగవత్సాయుద్య సాలోక్యములను పొందును. దీనిని బ్రహ్మ జ్ఞానము కలవాడు తెలిసికొని కార్య సాఫల్యము నందగలడు. దాని వలన పరబ్రహ్మము యొక్క అపహతపాప్మత్వాది మహిమ సిద్ధి కలుగునని తెలియవలెను.

ప్రపన్నులకు సంబంధించిన ఈజరామర్యాగ్ని హోత్రయాగము సర్వవర్ణాశ్రమస్థులకును సంబంధించినదనుటలో సందేహము లేదు. సర్వసాధారణ ప్రపన్న యజ్ఞమనునిది స్వాభావికముగా నుండినను బ్రాహ్మణ ప్రపన్న వైష్ణవులకు గృహార్చారూపమగు అర్చారాధన రూపయాగము విశేషయజ్ఞమని గ్రహింపవలెను. కాబట్టి ప్రపన్న శ్రీవైష్ణవ విప్రునకదియే సాక్షాద్భగవదారాధనమైనదిగాను అంతర్యామ్యారాధన రూపమగు వెనుకటి యజ్ఞము అనుషంగిక భావనరూపమగు ఆరాధనముగాను నుండునని తెలియవలెను. ముఖ్యారాధనము భగవద్బింబారాధనమే అగును.

ప్రపన్నులు పైతృక కర్మననుష్ఠించు విధము

ప్రపన్నుడగు శ్రీవైష్ణవ బ్రాహ్మణుడు పితృశ్రాద్ధములో శ్రీవైష్ణవులనే భోక్తలుగా నిమంత్రించవలెనని హారితస్మృతిలో చెప్పబడెను. ఏకం వా వైష్ణవ విప్రం యః శ్రాద్ధే భోజయిష్యతి, ఆకల్పకోటి పితరః పరితుష్టా భవంతిహి అని అట్లు చేసినందువలననే సంధ్యావందన పైతృకర్మనిరతాః ఇత్యాదిగా చెప్పబడిన శ్రీవైష్ణవ సిద్ధి కలిగి తరింపనగునని తెలియవలెను. అట్టి వారిని గురించియే పెద్దలు

త్వదీయ గంభీర మనోఽనుసారిణః అనియు

తేషాం రాజన్ సర్వయజ్ఞాస్సమాప్తాః అనియు సాయించి యుండిరి.

ప్రపన్నునికి హేయోపాదేయ ద్రవ్యములు

ప్రపన్నులగు బ్రాహ్మణోత్తములు **పాషండాః పతితాః పాపాః** అని ఆరంభించి **ఏవమాద్యమసద్ద్రవ్యం ప్రయత్నేన వివర్జయేత్** అని చెప్పబడిన వచనానుసారముగా పాషండ పతితాదుల వద్ద కేవల ద్రవిడ రూపమగు ధనమును పరిగ్రహింపరాదు. కాని

ధాన్యం వాసాంసి భూమించ సువర్ణం రత్నమేవవా ।

పుష్పాణి ఫలమూలాధ్యం సద్ద్రవ్యం మునిభి స్మృతమ్ ॥

సర్వతః పరిగృహ్ణీయా ద్భూమిం ధాన్యం ఫలాదికమ్ ।

అని చెప్పిన ప్రకారము ధాన్య వస్త్ర భూమ్యాదులను ఎట్టి వారి యొద్దనైనను ప్రతిగ్రహింప వచ్చును. ఇంకను

అసత్పరిగ్రహం హేయం తథా ధర్మస్య విక్రయమ్ ।

అన్యాయోపార్జితం ద్రవ్య మాపద్యపి వివర్జయేత్ ॥

భృత కాధ్యాపనం చైవ నకుర్యాద్వేద విక్రయమ్ ।

విదిత్వైవచ ధర్మాణి ఏవం జీవేత్తు ధార్మికః ॥

అను వచన ప్రకారము చెడు దానములను బట్టుట, ఏవగింపదగిన వృత్తి వలన డబ్బును సంపాదించుట, తాను విద్య చెప్పువాని వద్ద డబ్బు తీసుకొని విద్య చెప్పుట, డబ్బు తీసికొని తానార్జించిన ధర్మమును ధారపోయుట, ప్రజలను అన్యాయము చేసి డబ్బు సంపాదించుట అను వానిని ఆపదలో గూడ చేయరాదు. వేద వేదాంతములను ద్రవ్యము తీసికొని బోధింపరాదు. ఇవి యన్నియు ప్రపన్నునికి నింద్యములు అని గ్రహించి వర్తింపవలెను. అట్టి సద్వృత్తి గల శ్రీవైష్ణవ ప్రపన్నుడే వర్ణాశ్రమాచారవతా అను శ్రీవిష్ణు పురాణ వచన ప్రకారము శ్రియః పతిని సంతోషపెట్టగలడని తెలియవలెను.

ప్రపన్నుడికి వానప్రస్థమనావశ్యకము

ప్రపన్న శ్రీవైష్ణవునికి వానప్రస్థమను తృతీయాశ్రమము అతిగహనమై స్వరూపాననురూపమైనందున దానిని స్వీకరించుట అనవసరమై యుండును. ఎందువలన అనగా

వానప్రస్థో జటీచస్యాత్ సదా శ్మశ్ర్వాదిలోమభృత్ ।

శాకమూల ఫలాశీ స్యా ద్వనస్థ స్సతతం ద్విజః ॥

ఇత్యాది స్మృతి వచనములను బట్టి జడలను మీసము గడ్డములను పెంచుకొని ఎల్లప్పుడు వనములోనే ఉండి కందమూల ఫలములనే భుజింపుచు నడవవలసిన వానప్రస్థాశ్రమము కేవలము వైరాగ్య మాత్ర పోషకమగునే కాని ముముక్షుసాధ్య భగవత్ప్రీతిని సాక్షాత్తుగా సంపాదించలేదు. ఇదియే సత్సంమత సిద్ధాంతము. అయితే ఋష్యాదులు అట్టి వానప్రస్థమును యేలవలంభించిరనగా వారు తపోనిష్ఠాగరిష్ఠులై తపస్సు యందే అధికప్రావణ్యము కలవారుగా నుండుట చేత తత్సహకారిగా వైరాగ్యపోషకమగు తృతీయాశ్రమము నవలంభించిరి. ఈ విషయము శ్రీరామాయణాదులలోని ఋషి వృత్తాంతముల వలస స్పష్టమగును. సాక్షాద్భగవంతుడైన అవతార పురుషుని వదలి తమ తపోభంగమునకు ఆయనను నివారకునిగా కోరిరి కదా. కాబట్టి వారి ఆచరణమును ఆదర్శముగా కొని వాసప్రస్థమున అవలంభించుట ప్రపన్న శ్రీవైష్ణవులగు ముముక్షువులకు అనావశ్యమని తెలియవలెను.

ప్రపన్ననకు వేదచోదితమై స్మృత్యాద్యుపబృంహితమైన చాతురాశ్రమ్యసిద్ధి ప్రపన్నున కెట్లు సిద్ధించుననినచో ప్రపన్నుని వానప్రస్థము విలక్షణమై అనురూపమై యుండునది వేరుగా కలదు. అదియేమనగా **బ్రహ్మవనం బ్రహ్మసవృక్ష ఆసీత్** అని చెప్పబపడిన శ్రుతిని బట్టి బ్రహ్మమే వనము, దాని యందుండుటయే వానప్రస్థము. మరియు **న్యాసమేషాం తపసా మతి రిక్తమాహుః** అని చెప్పిన రీతిన న్యాసరూపత వచ్చే ఆదరింపదగినది. **ప్రవసిత ఇవగేహే వర్తతే యస్సముక్తః** అని చెప్పినరీతిని గృహమందున్నను ప్రవాసములో మున్నట్లుండుటయే వైరాగ్యము యాదృచ్ఛిక లబ్ధమై భగవన్నివేదితమైన ప్రసాదమే కలవి మూలములను మించిన ఆహారము. కేవలము జటాశ్య ప్రధారణాధికమే. ప్రపన్నుల వానప్రస్థ లక్షణము కాదని తెలియవలెను.

ప్రపన్నునికి యత్యాశ్రమావశ్యకత

ఇక వానప్రస్థము వలెనే వైరాగ్యపోషకమగు సన్యాసాశ్రమము కేవలభగవదారాధన శూన్యముకాక తత్రదానమై యుండుట చేత నది ముముక్షువులగు ప్రపన్నులకు అర్హమై యున్నది. తుర్యాశ్రమమునకు మోక్షాశ్రమమునకు వాడుక సర్వ సంమతియై ఉండుట చేత నది ప్రపన్నునికి ముఖ్యమై కూడ నుండును. అయితే ఈ తుర్యాశ్రమమునకు అధికారులెట్టి వారనినచో నైష్ఠిక బ్రహ్మచారులు గృహస్థులు వానప్రస్థులను వారే గాక గృహస్థులలో భార్యావియోగమైన తరువాత విదురులై యుండువారు గూడ నర్హులు. యత్యాశ్రమ స్వీకారమునకు కాలనియమము వయోనియమము లేదు.

యదహ దేవ విరజే త్తదహదేవ ప్రవ్రజేత్ అను వచన ప్రకారము విరక్తి కలిగినంతనే సన్యాసమును స్వీకరింపవచ్చును. యతిధర్మ సముచ్చయములో

అథ యతీనాం ముఖ్య కర్మోచ్యతే తత్రాహ ఉశనాః

బ్రహ్మచార్యుప కుర్వాణో నైష్ఠికో ఉ ప్యపరిస్తథాః

సదారో ఉ ప్య స్తవ దారశ్చ వానప్రస్థ విదాస్మృతాః అని మొదలుకొని

ఇహాముత్రచ భోగేషు విరక్త ప్రవ్రజే ద్విజః

అని చెప్పబడెను. దీని తాత్పర్యము, గురుశుశ్రూషణ వశుడగు బ్రహ్మచారియు, నైష్ఠిక బ్రహ్మచారియు, గృహస్థాశ్రమమందలి భార్యతో గూడి యుండినట్టి గాని భార్యా వియోగమును పొంది విధురావస్థలో నుండినట్టిగాని ద్వితీయాశ్రమియు, వానప్రస్థాశ్రమియు గూడ బహు లౌకిక సుఖములందును ఆముష్మికములగు స్వర్గాది స్థుములందును విరక్తుడై నంతనే తురీయాశ్రమమును స్వీకరింపవచ్చును అని తేలుచున్నది. పై వచనములో బ్రహ్మచారులు రెండు విధములుగాను గృహస్థులు రెండు విధములగాను విభజింపబడి యుండిరి. అందు బ్రహ్మచారి గురుకులము నుండి సమావృతుడై నంతనే విరక్తుడైనచో వెంటనే సన్యాసమును పొందవచ్చును. క్రమముగా ద్వితీయ తృతీయాశ్రమములను పొందుచు తరువాత సన్యాసమును పొందవచ్చును గాని అట్టి నియమము మాత్రము లేదు. ఇక బ్రహ్మచర్య మందే నిష్ఠ కలిగియుండినచో నైష్ఠిక బ్రహ్మ చారియై యుండవచ్చును. అట్టి నైష్ఠిక బ్రహ్మచారి ఆజన్మాంతము మరియొక ఆశ్రమమును పొందరాదను నియమముండినా అని విచారించినపుడు బృహన్నారదీయములో

దీర్ఘకాల బ్రహ్మచర్యం నరమేధాశ్వమేధకౌ ।

ఏతాన్వర్జ్యాన్కలియుగే ధర్మానాహు ర్మనీషిణః ॥

అని దీర్ఘకాల బ్రహ్మచర్య నరమేధాశ్వమేధములు కలియుగములో వర్జింపవలెనని చెప్పబడెను. మరియు బ్రహ్మచర్య నరమేధాశ్వమేధములు కలియుగములో వర్జింపవలెనని చెప్పబడెను. మరియు

బ్రహ్మచర్యవాసో ఉ_ష్టాచత్వారింశద్వర్షాణి అని ఆపస్తంబులు బ్రహ్మచర్యమునకు నలుబది యెనిమిది సంవత్సరములు మాత్రమే కాలనియమము చేసియుండెను. అందువలన నైష్ఠిక బ్రహ్మచారికి గూడ సన్యాస స్వీకారము విరుద్ధమని తేలుచున్నది. అదిగాక గృహస్థాశ్రమములో గూడ సదారవిగతదారులని రెండు భేదములు చెప్పబడి వారిద్దరికిని సన్యాసములో ప్రవేశింప నర్హత యున్నట్లే

అర్థాత్ప్రకరణాల్లింగా దౌచిత్యాదర్థ నిర్ణయః

అను న్యాయమును బట్టి ప్రకరణ బలము చేత గూడ నైష్ఠిక బ్రహ్మచారికి సన్యాసయోగ్యత కలదని తెలియవలెను. వెనక చెప్పిన విధముగా నైష్ఠికుడుగా నుండిపోయిన

బ్రహ్మచారి నవివాహోనసన్యాసః

అను నియమముండుట చేత వివాహముతో పాటు సన్యాసముతోగూడ స్వీకరింపరాదను శాస్త్రముతో విరోధము వచ్చునే అనినచో నైష్ఠిక బ్రహ్మచారి భీష్మాదులవలె పితృమాతృ శుశ్రూషణ రతుడై యుండినప్పుడు గార్హస్థ్యమును గాని సన్యాసమును గాని స్వీకరింపరాదని ఆ నిషేద వచనమున కర్థము చెప్పవలెను.

అట్లు **మాతా పితృశుశ్రుషణెచ్ఛ** తీరిపోయిన పైనిగాని తద్వియోగము కలిగిన పైనిగాని భగవత్పరిచర్య కొరకు సన్యాసమును స్వీకరింపవచ్చును.

ఈవిషయమే **ఇహాముత్రచ భోగేషు విరక్తః ప్రవ్రజేద్ద్విజః** అను వచనము వలన తేలుచున్నదని తెలియవలెను కాన విరోధము లేదు.

కలియుగవర్జ్య పంచక విచారము

గవాలంభంచ యజ్ఞంచ సన్యాసం పలపైతృకమ్ ।

దేవరేణసుతోత్పత్తిం కలౌ పఞ్చ వివర్జయేత్

అని శాస్త్రము చెప్పుచున్న రీతిని అతిధాయాగమ వివాహములలో

అతిథౌగౌః వివాహేగౌః అను విధిని అనుసరించి గోవును చంపి భుజింపచేయుటయు, జీవ పశు వధతో గూడిన యజ్ఞమును, సన్యాసాశ్రమ స్వీకారమును, శ్రాద్ధములలో

శశక శ్శలలీగోధాకూర్మా సశ్రశ్చ పంచమః పంచ పంచ నఖా భక్ష్యాః

అను వచనమును బట్టి బ్రాహ్మణులకు భక్ష్యములుగా నిర్ణయింపబడిన చెవుల పిల్లి, ముండ్ల (ఏదు) పంది, ఉడుము, తాబేలు, మొసలి అను ఐదేసి గోళ్లుగల జంతువుల నైదింటిని భక్ష్యములుగా నుపయోగించుట భక్ష్యములుగా నుపయోగించుట. భర్త వలన సంతాన ప్రాప్తి కలుగని స్త్రీలు మఱది వలన సుతప్రాప్తిని పొందుట అను నైదును కలియుగములో వర్జింపవలెనని శాస్త్రముండగా సన్యాసమును స్వీకరింపవచ్చునని యెట్లు అంగీకరింప తగును అని యొక శంక కలుగుచున్నది. దానికి సమాధానమేమనగా

యావద్వర్ణ విభాగో స్తి యోవద్వేదః ప్రవర్తతే ।

సన్యాసం చాగ్ని హోత్రంచ తావత్కుర్యా త్కలౌయుగే అను విశేష వచనమును బట్టి

కలౌపంచ సహస్రాంతే జాయతే వర్ణ సంకరః అను భవిష్యత్ పురాణ వచనానుసారముగా వర్ణ సంకరము

లేకుండా ఎంతకాలము వర్ణ విభాగము ఉండునో వేదప్రామాణ్య మెంత కాలము చెల్లుచుండునో అంతకాలము సన్యాసము అగ్నిహోత్రములనెడి యాగములను ఆచరణీయములు అని విశేష విధి యుండినందున సన్యాసము యజ్ఞము కలియుగములో గూడ ఆచరణీయములని నిశ్చయింపబడెను. కాబట్టియే శిష్టులగు వారు **గవాలంభ పలపైతృక దేవర సుతోత్పత్తులను** మాత్రము వర్జించి సన్యాస యజ్ఞములను ఆచరింపు చున్నారు. దీనికి పూర్వాచార్యులగు నాథయామున యతివర వరవర మున్యాదుల ఆచరణము ప్రమాణము.

సన్యాసి చతుష్టయ ధర్మ ప్రదర్శనము

సన్యాసాశ్రమము నందు **భిక్షూద్వౌభిక్షుసన్యాసీ వేద సన్యాసిక స్తథా** అను వచన ప్రకారము భిక్షు సన్యాస మనియు వేద సన్యాస మనియు రెండు భేదములు ఒక పక్షమున చెప్పబడెను.

చతుర్విధా భిక్షవస్తు కుచీచక బహూదకౌ ।

హంసః పరమ హంసశ్చ యోయః పశ్చాత్సఉత్తమః అను వచనమును బట్టీ **కుటీచక బహూదక హంస పరమహంస భేదము చేత** నాలుగు విధముల ఒక పక్షమునకు చెప్పబడెను. ఈ నాలుగు భేదములే లోక ప్రసిద్ధములై యున్నవి. ఇందు పూర్వము కంటె ఉత్తరోత్తర భేదముత్తమమని చెప్పబడెను. ఆయా భేదముల యొక్క ఆచార భేదము యతిధర్మ సముచ్చయము నందు వివరింపబడెను. అట్టి నాలుగు విధములగు సన్యాస యతులందును శిఖా యజ్ఞోపవీత దండధారణముల విషయములో కొంత మత భేదము కలదు. దానినిచ్చట చర్చించెదము. సన్యాస చతుష్టయము నందును శిఖా యజ్ఞోపవీత త్యాగము చేయుటయు ఏకదండధారణమును చేయుటయు ఒక పక్షము వారి మతము. అట్లు కాక సన్యాస చతుష్టయము నందును శిఖా యజ్ఞోపవీతములను త్యజింపకుండుటయు త్రిదండధారణమును ఇంకొక పక్షము వారి మతము. వీనిలో రెండవ పక్షమునకే ప్రమాణానుకూల్యము కలదు గాన నదియే శ్రీవైష్ణవ బ్రాహ్మణ యతులు ఆచరించుచున్నారు. శాట్యాయనికోపనిషత్తులో **అథాహ యద్బ్రహ్మ పరమమ్** అని మొదలుకొని

పృథివ్యాం విష్ణులింగినీ గూఢః పరమహంస మాశ్రమం

సమ్ప్రవిశ్య యథో పపత్తి పంచమాత్రాందధానః అనియు

అథ ఖలు సోమ్య కుటీచకో బహూదకో హంసః

పరమ హంస ఇత్యతే పరివ్రాజకా శ్చతుర్విధా భవంతి

తే సర్వే విష్ణు లింగిన శ్శిఖిన ఉపవీతినః శుద్ధచిత్తాః అనియు చెప్పబడెను.

ఇందు విష్ణులింగినః అనుదానికి పంచ సంస్కారములు పొందియుండటు వారని అర్థము. పంచమాత్రాధారణము అనగా

త్రిదండము ఉపవీతంచ వాసః కౌపీన వేష్టనమ్ ।

శక్యం కవచమిత్యేచ ద్బిభృయాద్యావదాయుషమ్

అను వచన ప్రకారము త్రిదండము ఉపవీతము కాషాయవస్త్రము కౌపీనము భిక్షణశిక్యము (జోలె) కవచము (ఊర్ధ్వాంగవేష్ఠన కాషాయము) సన్యాసులు జీవితావసాన పర్యంతము ధరింపవలెనని యుండు పంచమాత్రల ధారణమని అర్థము. ఇచ్చట భిక్షణ శిక్యరూప కవచమని అర్థము గ్రహించిన పంచ సంఖ్య సరిపోవును. ఉపరివేష్ఠన వస్త్రము గూడ వాస శ్శబ్దము చేతనే చెప్పబడునని వివేకము, మరియు

త్రిదండము వైష్ణవం లింగం విప్రాణాం ముక్తి సాధనమ్ ।

నిర్వాణం సర్వ ధర్మాణా మితి వేదానుశాసనమ్ ॥

అను వచన ప్రకారము త్రిదండము విష్ణు చిహ్నమై ముక్తి సాధనమగునని తెలియుచున్నది. సన్యాసులు దండమును ధరించుటలో అంతస్తాత్పర్యమేమనగా పరమాత్మను హస్తావలంబముగా గొని అథః పతనమును వారించుకొంటినను భావమును సూచించుటయే, అయితే అందు ఏకదండ త్రిదండ ధారణ భేదమెట్లు కలిగెనని నచో, అద్వైత సిద్ధాంతములో పరబ్రహ్మ మొక్కటే సత్యమని ఉన్నది గాన అందుకు సూచకముగా నొక్క దండమును ధరించుటాచారమై యున్నది. విశిష్టాద్వైత సిద్ధాంతములో తత్వత్రయమును సత్యమని యున్నది. ఏకముగా కలసి యున్నదనియు నున్నదిగాన త్రిదండ సముదాయమును ధరించుటాచారమై యున్నది. పైని చెప్పిన ప్రమాణ వచనములో త్రిదండం వైష్ణవం లింగం అనిన దానిని బట్టి త్రిదండ ధారణమే వైష్ణవ చిహ్నమని గూడ స్ఫురించుట చేత నదియే తత్వానుకూలమని గూడ తెలియును. ఇక కుటీచకాది సన్యాసి చతుష్టయము నందును పైని చెప్పిన లక్షణములు సమానములుగానే ఉండవలెననియు

చతుర్విదాభిక్షవస్తు స్మృతా స్సామాన్య లింగినః ।

తేషాం పృథక్ పృథఙ్నామ వృత్తిభేదాద్భేదః కృతిః స్మృతౌ

అని హారితస్మృతిలో చెప్పబడెను. ఇక సన్యాసికి క్షౌర ప్రకారములో

రక్షపస్థ శిఖావర్ణం ముండయేత శిరోయతిః

అని చంకలు గుహ్య భాగము శిఖ వీనిని వర్జించి శిరస్సును (గడ్డము మీసములతో) క్షౌరమును యతులు చేయించుకొనవలెనని ప్రమాణము కలదు.

అట్లే **యజ్ఞోపవీత్యుదక కమండలుహస్తః** అని వసిష్ఠ స్మృతిలో యజ్ఞోపవీతమును ఉదక కమండలమును ధరింప వలెనని చెప్పబడెను. పై ప్రమాణములవలన శిఖా యజ్ఞోపవీత త్యాగము శాస్త్ర విరుద్ధమని తేలుచున్నది. ఇంకను

బ్రహ్మ సూత్రం త్రిదండంచ శిఖా వద్భిభృయాత్స్వయమ్ ।

వాహయేదితరేణాథ ప్రాయశ్చిత్తీ భవేద్యతి ॥

అనగా బ్రహ్మ సూత్రమును శిఖను వలెనే త్రిదండమును గూడ నెల్లప్పుడును యతి తానే వహింపవలెను గాని ఇతరుల చేత పట్టించినచో ప్రాయశ్చిత్తార్హుడగును. అను ఈ వాక్యముల వలన శిఖాయజ్ఞోపవీతములు యతులకు సదాధార్యములని స్పష్టమగుచున్నది. త్రిదండమును వదలిచనో కేవల ప్రాయశ్చిత్తమే చెప్పబడెను గాని శిఖా యజ్ఞోపవీత త్యాగములో యతికి చండాలత్వము హీనత కలుగునవి ఈక్రింది వచనము చెప్పుచున్నది.

శిఖాయజ్ఞోపవీతాది కర్మసాధ్యం చయస్త్యజేత్ ।

సజీవన్నేవచండాలో మృతః ఽ శ్వానో భిజాయతే ॥

అని ఇచ్చట కర్మసాధ్యమనగా చౌలోపనయన కర్మల చేత సమంత్రకముగా సాధింపబడినవి శిఖా యజ్ఞోపవీతములని తాత్పర్యము. మరియు కర్మలలో సాధనములగునవి అని అర్థము చెప్పినను ఆచమన జపాదికర్మలలో నవశ్యముగా నుండవలసినవని భావము చెప్పవచ్చును.

భోజన ఆచమనే స్వాధ్యాయేచ యజ్ఞోపవీతీస్యాత్ అని ధర్మశాస్త్రము చెప్పుచున్నది. అటులనే

యదర్శి శిఖానిదధాతి యధావైషాం కులధర్మః స్యాత్

అని గృహ్య సూత్రకారులు ప్రవర ఋషి సూచకము శిఖానివేశమని చెప్పుట చేతను అవి పరిత్యాజ్యములు కాజాలవు. అయితే సన్యాసులకు కర్మత్యాగము విధింపబడినది కదా. అందువలన శిఖాయజ్ఞోపవీతములు త్యజించినను ప్రత్యవాయముండదే అనినచో

కర్మణాం ఫలతస్త్యాగస్స సన్యాస ఉచ్యతే ।

అనాశ్రితః కర్మఫలం కృత్యం కర్మ సమాచరేత్ ॥

అని శాస్త్రములు చెప్పుట చేత సన్యాసులు గూడ తదాశ్రమావిరోధులగు సంధ్యావందనాదులను చేయవలెననియు అట్టివారే సాత్విక సన్యాసులగుదురనియు చెప్పబడుట చేత సన్యాసులు గూడ సంధ్యావందనాదులను విడువరాదు.

త్రిదండి సన్యాసికి గల మహిమ

దత్తాత్రేయ స్మృతిలో

అష్టాక్షరేణ మంత్రేణ నిత్యం నారాయణాత్మనా ।

ఉపాస్యో విష్ణు భావేన విష్ణు రూపీ త్రిదండధృత్ ॥

త్రిదండరూప దృగ్విప్రస్సాక్షాన్నారాయణః స్మృతః ।

యస్తంపూజయతే భక్త్యా విష్ణుస్తేనాభి పూజితః ॥

అని చెప్పబడెను. మరియొక స్మృతి యందు

దేవతా ప్రతిమాం దృష్ట్వా యతిం చైవ త్రిదండినమ్ ।

నమస్కారం నకుర్యాచ్చేత్ ఉపవాసేనశుధ్యతి

అని చెప్పబడెను. ఈ ప్రమాణ వచనములను బట్టి త్రివిధ తత్వ సూచకమగు త్రిదండధారణము వలన త్రివిధతత్వ నిర్వాహకం, త్రిదండ పరిమండితమ్ అని చెప్పబడిన యతిరాజులవలె యతికి విష్ణువత్పూజ్యత్వము ఉండుననియు నారాయణాత్మనా అట్టి త్రిదండి యతులు అష్టాక్షరీ మంత్రముతో (ఓం నమో నారాయణాయ) పూజించి నమస్కరింపదగియుందురనియు తెలియుచున్నది.

శిఖాయజ్ఞోపవీత త్యాగాత్యాగ విచారము

లోకములో యతులకు శిఖాయజ్ఞోపవీత త్యాగము ఆత్యాగము కూడ ఆచరణములో నున్నవి. దానికి ప్రమాణముగా గౌతమ సూత్రములో **ముండశ్శిఖీవా** అనియు,

గాలవస్మృతిలో అథపరివ్రాజకో లింగీ ముండశ్శిఖీవా అనియు,

వసిష్ఠ స్మృతిలో ముండో ౨ పరిగ్రహః అనియు,

పైఠీనసి వచనములో **అప్రతిష్ఠో మునిర్ముండీ** అనియు

బోధాయన సూత్రములో **అరణ్యంగత్వా శిఖీ ముండోవా** అనియు నిట్లు అనేక ప్రమాణములు కనబడుట చేత శిఖాత్యాగాత్యాగములు రెండును నిషిద్ధములు కావని చెప్పవలెననినచో, వెనుక ప్రదర్శించిన అనేక శాస్త్రప్రమాణములను బట్టి శిఖా యజ్ఞోపవీతములు యతికి పరిత్యాజ్యములు కావని తెలియుచుండుట చేత

నీ ప్రమాణములలో కేవల శిఖా త్యాగాత్యాగములను మాత్రము చెప్పుట చేత నీ వచనములను తదవిరోధముగా సమన్వయింపవలెను. ఎట్లనగా, అందు **ముండశ్శిఖీవా** అను వచనములో అను నిపాతమునకు **అనేకార్థక మవ్యయం** అను శాస్త్ర మర్యాదను బట్టి వికల్పార్థకముగా గాక అవధారణార్థకముగా నిశ్చయించి **శిఖ్యేవ ముండః** అని సమన్వయమును చేసి **శిఖా భిన్న శిరోముండనమే** విహితమని చెప్పవలెను. అట్లవదారణార్థము చెప్పినను ముఖ్యార్థ పరిత్యాగము కలిగి లాక్షణికత్వముండదు. నిపాతల కనేకార్థములు తత్తత్ప్రకరణాదుల వలన ముఖ్యముగానే యుండునని నైఘంటుక సమ్మతము. ఇక ముచిర్ముండః అను పైఠీనసీ వచనములో శిఖి శబ్దము లేకున్నను అనేక ప్రమాణసిద్ధమగు శిఖాధారణమును నిషేధింపక వానప్రస్థుల వలె జటాధారణము చేయక శిఖావర్జముగా ముండనమును చేయించుకొనుటయే యతిధర్మముగా నర్థము చెప్పవచ్చును. కాబట్టి శిఖాత్యాగము ప్రబల ప్రమాణ సిద్ధము కాదనియు **తత్సహచరిత యజ్ఞ సూత్ర త్యాగము** కూడ ప్రమాణ సిద్ధము కాదనియు ప్రాజ్ఞులు తెలసికొనవలెను. ఇంకను ముండీ అను శబ్దమునకు శిఖారహిత ముండనము చేయించు కొనువాడని అర్థము రాదు. ముండనమనగా క్షురకర్మకు పేరు. అట్టి ముండనమును శిఖావర్జముగా చేయించుకొని వారికి గూడ **ముండీ** అని వ్యవహారము వచ్చును. అట్లు కానిచో ముండనమనగా కేవల **శిఖా రహిత శిరస్సున కర్థము** చెప్పి **ముండీ** అనగా అట్టి ముండము (బోడిగుండు) కలవాడని అర్థము చెప్పవలెను. అది క్లిష్టార్థమగును. **శ్మశ్రూణాం ముండనభవేత్** ఇత్యాది శాస్త్ర వచనమును బట్టి క్షురకర్మకే ముండనమని వ్యవహారము కలదు. ముండన ముండ శబ్దములు సమానార్థకములుగా లోకములో వ్యవహారము కలదు. **దాసీదండ శ్శిరో ముండః** అని కదా లోక వ్యవహారమున నున్నది. అచ్చట శిరోముండనమే (బుఱ్ఱ గొరిగించుటయే) శిక్ష అని అర్థము చెప్పవలెను కదా, మరియు **ముండినౌ సూక్ష్మ శిఖినౌ యత్యంతే వాసినావుభౌ** అను హారిత వచనములో యతికిని **బ్రహ్మచారికిని ముండినౌ** అని చెప్పబడెను. వెంటనే **సూక్ష్మ శిఖినౌ** అని కూడ చెప్పినందున బ్రహ్మచారికి వలెనే **శిఖావర్జనముండనమే** యతులకు విహితమని తెలియుచున్నది. శిఖావర్జముగా ముండనము చేయించుకొను బ్రహ్మచారులుండబోరు గాన అచ్చట వికల్పమర్థమని చెప్పవీలులేదు. ముండనం వపనం తథా అను నిఘంటు ననుసరించి వపన పర్యాయమగు ముండ శబ్దార్థముగా గ్రహించుట యుక్తమై యుండును.

యతులకు ముండినామ హేతువు

ముండనమును చేయించుకొనువారు ముణ్డీ అని వ్యవహరింపబడినట్లే నాలుగాశ్రమముల వారిలో వానప్రస్థులు తప్ప మిగిలిన వారందరును తత్తద్విహిత కాలములలో ముండనమును చేయించుకొను వారే అయినందున వారందరును ముండిపదవాచ్యులగుదురు. విశేషించి సన్యాసులకు ముండిపదవాచ్యత్వ మెట్లు కలిగెనను శంకకు సమాధానమేమనగా బ్రహ్మచారులకును గృహస్థులకును ముండనము సామాన్యముగా విహితమైయున్నను మాతా పితృ వియోగ సమయదీక్షా గర్భ ధీక్షాది వివాహాబ్దదీక్షా విశేష సమయములలో ముండనము నిషేదింపబడినందున వారికి ముండనము సాపవాదమై యుండును. యతులకు మాత్రమట్టి అపవాద శాస్త్రము లేనందున ఋతౌ ఋతౌ యతీనాంతు అను విధి ననుసరించి తత్తద్విహితకాలములో ముండనము తప్పనిదై యున్నందున వారికి ముండి శబ్దము యోగరూఢమై పంకజాది శబ్దముల వలె వాడబడుచున్నది. ఇతరుల యందు కేవలయౌగికముగా మాత్రమే వాడబడునని తెలియవలెను.

ఏకదండి త్రిదండి పద విషయ విభాగము

ఏకదండీ త్రిదండీవా అను వచనములో ఏకదండధారణము కూడ సన్యాసులకు విహితమైయున్నట్లు కాన వచ్చుచున్నది. అందువలన త్రిదండమాత్ర ధారణమే శాస్త్ర విహితమని యెట్లు నిశ్చయింపనగుననినచో అట్లు కాదు.

నష్టే జల పవిత్రేవా త్రిదండేవా ప్రమాదతః ।

ఏకంతు వైణవం దండం పాలశం భైల్వమేవవా ॥

గృహీత్వాతిచరేత్తావ ద్యా వల్లభ్యం త్రిదండకమ్ ।

అని యతిధర్మసముచ్ఛయములోని హారితవచనమును బట్టి, ఏ యతికైనను నద్యాది స్నానాదులలో గాని మరియే ఇతర సందర్భములలో గాని ప్రమాద వశమున త్రిదండముగాని దాని అగ్రమున బంధించు జల పవిత్రమను వస్త్ర ఖండము గాని అంతరించినచో తిరిగి లక్షలుయుక్తమగు త్రిదండము గాని జలపవిత్రముగాని లభించువరకు ఒక్క వెదురు దండమునో మోదుగ మారేడు దండములనో సన్యాసి ధరింపవలెనని తెలియుట చేత ఏకదండధారణము ఆపద్విషయమనియు త్రిదండ ధారణమే సదా యతులకు విహితమనియు తెలియవలెను. అట్టి ఆపద్విషయమైన ఏకదండధారణ సమయమందు గూడ త్రిదండధారి యతి వలెనే గృహస్థాదులకు వంద్యుడే యతి అగునని పైవచనమునకు భావము.

బ్రాహ్మణ యతులకు శిఖా యజ్ఞోపవీత త్యాగ విధికి భావము

సశిఖం వపనం కృత్వా బహిః సూత్రం త్యజేద్యతిః అని **శిఖాయజ్ఞోపవీత త్యాగము** యతులకు విహితమై యున్నట్లు తోచెడి వచనమునకు అర్ధ నిర్ణయము చేయునప్పుడు కొంత శాస్త్ర సమన్వయమావశ్యకము.

త్రిదండ ముపవీతంచ అని యారంభించుకొని

బిభృయా ద్యావదాయుషమ్ అను ప్రమాణముతోను కక్షోపస్థ శిఖావర్జం ముండయోత శిరో యతిః అను ప్రమాణ వచనముతోను విరోధము లేకుండ

సశిఖం వపనం కృత్వా అను దానికి శిఖతో గూడి యుండునట్లు వపనము చేసికొని అనియు,

బహిస్సూత్రం త్యజేత్ అను దానికి ప్రాతదైన లేదా జీర్ణమైన దానిని పైకి తీసి వైచిన యజ్ఞోపవీతమును విడచివేయవలెననియు అర్ధనిర్ణయమును చేయవలెను. అంతియే కాని శిఖా యజ్ఞోపవీతములను త్యజింపవలెనని అర్థము చేయరాదు. అట్లయినచో

శిఖాహీన యతిం చైవ చండాల మివ సంత్యజేత్

బ్రహ్మ సూత్ర పరిత్యాగా ద్బ్రహ్మచారీ గృహీవనీ ।

పరివ్రాడ్వాపి పతతి తస్మాత్తన్న పరిత్యజేత్ ॥ అను నిషేధ స్మృతులతో విరోధము సంభవించును. **సశిఖం వపనం** అనుచోట క్రియా విశేషణము గాన **సశిఖం యధా భవతి తథా వపనం కృత్వా** అనియే అర్థము చెప్పవలెను. కాని **శిఖయా సహ వపనం కృత్వా** అని అర్థము కాదు. అట్లే **బహి స్సూత్రం త్యజేత్** అనుచోట **బహిర్నీతం సూత్రం** అనియే అర్థము చెప్పవలెను. కాని **సూత్రం బహిః త్యజేత్** అని అన్వయింపకూడదు. అట్లు కాదయ్యా, **సశిఖం వపనం** అను వచనము పరమహంస యతి విషయముగా చెప్పి **కుటీచకాది యతిత్రయమునకే** శిఖా యజ్ఞోపవీత త్యాగ నిషేధములు వర్తించునని నిర్ణయింపవచ్చునే అనినచో, ఆవిధముగా విషయ విభాగము

చేసివ్పుడు శాట్యాయన శ్రుతిలో

పృథివ్యాం విష్ణులింగీ నిగూఢః పారమహం సమాశ్రమం ప్రవిశ్య అని ఆరంభించి
త్రిదండముపవీతంచ భిభృయాద్యావదాయుషమ్ అని చెప్పబడియుండుట చేతను,
తత్ర పరమహంసానామ త్రిదండ జల పవిత్ర శిక్య శిఖా యజ్ఞోపవీతినః
అంతర్వసన బహిర్వసన ధారిణో గ్రామైక రాత్రవాసినో నగర తీర్థావసదేషు
పంచరాత్రం వసంతం: క్షారలవణ వర్జం భిక్షా కాలే శీర్ణ పర్ణ పుటం కృత్వా
బ్రాహ్మణకులాదేవహి భిక్షాం గృహీత్వా .... ఆత్మానం మోక్షయంతే

అని పరమహంసధర్మములను వివరించి చెప్పుటలో పరాశర స్మృతిలో త్రిదండ శిఖా యజ్ఞోపవీతములను ధరించియే యుండవలెనని చెప్పబడుట చేతను పరమహంస విషయముగా శిఖా యజ్ఞోపవీత త్యాగ వచనమును సమన్వయించుటకు వీలు లేదు. అర్థ స్థితి ఇట్లుండ యతులకు త్రిదండ శిఖా యజ్ఞోపవీత త్యాగమును చెప్పు ప్రమాణ వచనములకు అనేకమగు ఇతర ప్రమాణములతో విరోధము లేకుండ వెనుక వివరించినట్లు సమన్వయించి అర్థమును చెప్పవలెను.

తత్త్యాగ నిమిత్తములగు నష్టే జల పవిత్రేవా
శ్వకాక ఖర గోమాయు జంబుకాన్ వానరం తథా ।
చండాలం పతితం స్పృష్ట్వా దండాదౌ ధూషితే యది

అను వచనములనేకములు గలవు. మరియు ఇతిహాస పురాణాదులను పరిశీలించినప్పుడు ఏ యుగములోను సన్యాసులు శిఖా యజ్ఞోపవీతాది త్యాగము చేసినట్లు అందెచ్చటను కానరాదు.

జ్ఞాన శిఖాత్వాది వచన సమన్వయము బ్రహ్మోపనిషత్తులో

జ్ఞాననిష్ఠా జ్ఞానశిఖా జ్ఞాన యజ్ఞోప వీతినః ।
జ్ఞానమేవ పరం తేషాం పవిత్రం జ్ఞానముచ్యతే ।
అగ్నేరివ శిఖానాన్యా యస్య జ్ఞాన మయీా శిఖా ।
సశిఖీత్యుచ్యతే విద్వాన్ నేతరే కేశధారిణః ॥

అని యుండుట చేత కేవల బ్రహ్మ జ్ఞానమే ఆవశ్యకముగాని శిఖా యజ్ఞోపవీతాదులలో అవసరము లేదనియు అగ్నికి శిఖకు యెట్లు అభేదమో అట్లే జ్ఞానరూపుడగు ఆత్మకును జ్ఞానమునకును భేదము లేదనియు శారీరకములగు శిఖా యజ్ఞోపవీతాదులావశ్యకములు కావనియు తెలియుచున్నది అని శంకింపపనిలేదు. అందు చెప్పబడిన జ్ఞానము వర్ణాశ్రమాచార విశిష్టమగు జ్ఞానమే అనియు అందువలన తత్ప్రయుక్త శిఖా యజ్ఞోపవీతాదులు అనావశ్యకములు కావనియు, జ్ఞానశూన్యులై కేవల శిఖాది ధారణమును చేయువారు యుక్తాచరణమును చేయువారు కారనియు పై వాక్యముల కర్థమును చెప్పవలెను. లేనిచో వెనుక నుదహరించిన అనేక తత్త్యాగప్రత్య వాయవచనములతో విరోధము కలుగును. అదికాక యుగాంతర మందలి దత్తాత్రేయాది మహాపురుషుల ఆచరణముతో విరోధించును. వారు శిఖా యజ్ఞోపవీతాది ధారణముతోనే యతులుగా ప్రవర్తించినట్లు పురాణాదుల వలన స్పష్టము.

మరికొన్ని శంకా సమాధానములు

వాగ్దండశ్చ మనో దండః కర్మదండ స్తథా పరః
ఏతైర్దండై స్త్రిదండీ స్యాన్నత్తువైణవిధారిణః

అని మనోవాక్కాయ నియమనమే త్రిదండమనబడును గాని వేణు దండత్రయ ధారణము వలన త్రిదండీత్వము సిద్ధింపదని చెప్పువచనమునకు తాత్పర్యమేమనగా, వాగాదినియమన పూర్వకమగు త్రిదండ ధారణమే యతులకు యుక్తము గాని కేవల గుహ్య వేషార్ధము చేయు త్రిదండ ధారణము నిష్ఫలమనియే, అంతియే కాని త్రిదండత్యాగమునావచనము విధింపదు. అట్లే జ్ఞానశిఖాః ఇత్యాది వచనములకు గూడ జ్ఞాన ప్రాధాన్యమే అర్థము గాని శిఖాది పరిత్యాగమర్థము కాదు.

జ్ఞాన నిష్ఠో విరక్తోవా మద్భక్తో వాఽ నపేక్షకః ।
సలింగా నాశ్రమాం స్త్యక్త్వా చరేదవిధి గోచరః ॥

అను భాగవత వచనములో జ్ఞాన నిష్ఠాదులు కలవాడగు భగవద్భక్తుడు ఆశ్రమ చిహ్నములను వదలి వైచి విధికి వశ్యుడు కాకుండ చరింపవచ్చునని చెప్పబడిన దానికి తాత్పర్యమేమనగా

ఆశ్రమాన్ అను బహువచనము వలన సర్వాశ్రమములు అర్థమైనందున ఆయాశ్రమముల యందలి వారందఱును జ్ఞాననిష్ఠులై యుండి వైరాగ్య సంపన్నులై భగవద్భక్తి కలవారై ఐహికాముష్మిక ఫలాపేక్ష లేనివారై యుండవలెననియు, తద్రహితమైన సర్వాశ్రమచిహ్నములు డాంభికములై త్యాజ్యములగుననియు, అట్టి విశేష రహితమైన కేవల వేద విధులకు వశ్యుడు కాకుండ చరింపవలెననియు తాత్పర్యముగా గ్రహింపవలెను. అనగా తత్తదాశ్రమ ప్రయుక్తఖ్యాతి లాభ పూజాదుల నపేక్షింపకుండ చరింపవలెనని భావము.

దగ్ధాఖిలాది కారత్వా ద్బ్రహ్మ జ్ఞానాగ్నినా మునిః ।
వర్తమానశ్శ్రుతే ర్మూర్ధ్ని నై వస్యాద్వేద కింకరః ॥

అను వచనమునకు వేదమును అతిక్రమించి బ్రహ్మజ్ఞాని యగు ముని వర్తింపవలెనని యర్థము చెప్పకూడదు. మరియెట్లనగా బ్రహ్మ జ్ఞానాభివర్ధకమగు నుపనిషద్భాగము నందాస్థితుడై కేవల కర్మలను చెప్పు పూర్వభాగమునకు వశ్యుడు కాకుండ బ్రహ్మ జ్ఞాని యగు వాడుండవలెననియే అర్థము చెప్పవలెను.

నదండం నశిఖం నయజ్ఞోపవీతయాచ్ఛాదనం చరతి పరమ హంసః

అను శ్రుతి దండాదులు పరిత్యజించి పరమహంస వర్తింపవలెనని అర్థము చెప్పగూడదు. పరమ హంసలు గూడ దండ శిఖా యజ్ఞోపవీత కాషాయములను ధరింపవలెనని కుటీచకాదులతో సమానముగా చెప్పిన విధితో విరోధము కలుగును. కాబట్టి కేవల దండాదులను ఒక్కొక్క దానినే ధరించి పరమహంస చరింపరాదనియు అన్నిటిని సముదితముగా ధరించియే చరింపవలెననియు అర్థము చెప్పవలెను. లేనిచో దండశిఖాది పరిత్యాగము నందు చెప్పబడిన పాతిత్యము సంభవించును. అథవా నదండం నశిఖం ఇత్యాది వచనములో క్రియావిశేషణములుగా కన్పట్టుటచేత లేఖన ప్రమాదముగా గ్రహించి సదండం సశిఖం అని సవరించినచో విరోధముండబోదని చెప్పవచ్చును. **న దండం** అనినప్పుడు అర్థము.

శ్రీవైష్ణవ యతుల వ్రతచర్యలు

కుటీచక బహూదక హంస పరమహంసా

ఇత్యేతే పరివ్రాజకాః చతుర్విధా భవంతి ।

తే సర్వే విష్ణులింగినస్సదా స్వాత్మాన మాత్మనా

బ్రహ్మ భావం భావయంత శ్శుచయః

సర్వధర్మ నిరతా స్త్రైకార్యో పాసన జపశీలా ధ్యానశీలాః

అను శ్రుతి ప్రమాణము వలన చెప్పబడిన చతుర్విధ సన్యాసులును వైష్ణవ లక్షణములగు చక్రాంకణాదుల చేత సంస్కరింపబడి యెల్లప్పుడును తన ఆత్మ పరమాత్మాత్మకమని భావింపుచు పరిశుద్ధులై తత్తదాశ్రమ ధర్మముల యందు నిరతులై త్రికాల సంధ్యావందన గాయత్రీ జప భగవద్ధ్యానముల యందు తత్పరులై యుండవలెను. అట్టి సదాచార నిష్ఠులగు సన్యాసులకు ఆజగరగోవృత్త్యాదులను విధించు వచనములు బంధకములు కాజాలవు. అట్టివన్నియును ప్రాకృత విరక్త సన్యాసులకే చెందును. ఏలననగా, ఆజగర గోవృత్త్యాదుల నవలంభించిన వారికి భిక్షణములోను భోజనములోను నియమము లేదు. పైని చెప్పబడిన శ్రీవైష్ణవ యతి చతుష్టయమునకు

షట్త్రీన్వాపీచ సప్తాష్టౌ నిత్యం భిక్షు ర్గృహాం శ్చరేత్ ।

తదశ్నీయా దనింద్యాన్నం నిస్స్పృహేణైవ చేతసా

అని చెప్పబడిన విధి ప్రకారము శ్రోత్రియుల బ్రహ్మ నిష్ఠులగు గృహస్థుల గృహములు మూడుగాని ఆరు గాని యేడెనిమిది గాని తిరిగి పర్యాప్త భిక్షణము వలన భగవన్నివేదితాన్నము సంపాదించుకొని శరీరధారణ మాత్రము కొరకు నిస్స్పృహులై భుజింపవలెనని నియమము కనబడుచున్నది. మరియు

స్వాచారస్యా పరిత్యాగః స్వప్రభావస్య గోపనమ్ ।

అపరిగ్రహ శీలత్వం పావనాని ప్రచక్షతే

అనగా తురీయాశ్రమాచారములను విడువకుండుట, తమ ప్రభావము నితరులకు తెలియనీయకుండుట, ఎవ్వరి వద్దను ద్రవ్య పరిగ్రహము చేయకుండుట అనునవి పవిత్రతను కలిగించును గాన అట్టి నియమములను యతులు పాటించవలెను. ఇట్లాచరించుట చేత

ఆవిప్లవాయ ధర్మాణాం పాలనాయ కులస్యచ ।

మునీషీ వైదికాచారం మనసా ఉపి నలంఘయేత్ ॥ అనియు

వర్ణా శ్రమాచారవతా అనియు చెప్పబడిన సత్ఫలము సిద్ధించి భగవత్ప్రీతి కలుగునని తెలియవలెను.

చాతుర్వర్ణ్య శ్రీవైష్ణవ వైభవము

భక్తి రష్టవిధా హ్యేషా అని చెప్పిన రీతిని అష్టవిధ భక్తి విశిష్టులగు శ్రీవైష్ణవులు ఏవర్ణము వారైనను అట్టి వారు విప్రశ్రేష్ఠులనియు యతి శ్రేష్ఠులనియు సాక్షాద్భగవద్వాక్యముండుట చేత వారిని ఆదరించుట

స చ పూజ్యో యథా హ్యహమ్ అను వాక్య రీతిని భగవదారాధనము వలె విహితమై యున్నది. కాబట్టియే శ్రీవైష్ణవోత్తములు అట్టి చాతుర్వర్ణ్య శ్రీవైష్ణవావతారములగు ఆళ్వారాచార్య వ్యక్తులను జీవితావస్థలోను అర్చావస్థలోను ఆరాధించుచు వచ్చుచున్నారు. అది వర్ణాశ్రమాచారమునకు విరుద్ధము కాజాలదు.

ఇంకను **మద్భక్త జనవాత్సల్యం పూజాయాం చానుమోదనమ్**

ఇత్యాదిగా చెప్పబడిన అష్టవిధ భక్తియు గలవారి విషయములో

మద్వందనా చ్ఛతగుణం మద్దాసస్యతు వందనమ్ ।

మన్నివేద్యా చ్ఛత గుణం మద్దాసస్య నివేదనమ్

ఇత్యాది భగవద్వాక్య ప్రకారము భగవద్వందన భగవత్ప్రసాద స్వీకరణముల కంటె నెక్కువ మాహాత్మ్యము కలవని తెలియవగును. అట్టివారు జీవద్దశలోను ముక్తిదశలోను కూడ పూజ్యులగుదురు.

వేదాంత జ్ఞానానుష్ఠాన ప్రకారము

వేదాంత జ్ఞానానుష్ఠానముగా సర్వే వేదా స్సర్వ వేద్యా

స్సశాస్త్రా స్సర్వే యజ్ఞా స్సర్వ ఇజ్యాశ్చ కృష్ణః విదుః

కృష్ణ బ్రాహ్మణా స్తత్వతో యే తేషాం రాజన్ సర్వ యజ్ఞా స్సమాప్తాః అనియు

మన్యే భగవతశ్చాపి మాన్యా భాగవతా ఇతి ।

కిమిక్షోరస్తి మాధుర్యం శర్కరా శకలేష్వివ ॥

అనియు మహర్షులు చెప్పిన ప్రకారము భగవద్భాగవత వైభవమును గుర్తెరిగి వేదాంతముల వలన కలిగిన యథార్థ జ్ఞానమును సంపాదించి సమస్త నిత్యనైమిత్తిక కర్మలును సాక్షాద్భగవదారాధన రూపములే అనియు, భగవంతునికి తన ఆరాధన కంటె తన దాసుల నారాధించుట అత్యంత ప్రీతికరమనియు తెలిసికొని ఆవిధముగా భగవద్భాగవతారాధన తత్పరుడై యుండుటయే అని తెలియవలెను.

సచ పూజ్యో యథాహ్యహమ్ మద్వందనా చ్ఛత గుణం

అని కదా భగవద్వాక్య రీతి యున్నది. కాబట్టి సర్వాశ్రములును స్వవర్ణోచిత వైదిక కర్మల నన్నిటిని భగవదాజ్ఞా కైంకర్య రూపముగా నాచరింపుచు అట్లాచరించు భాగవతోత్తముల నారాధించుటయే ఉచితము.

యతి ధర్మ నిగమనము

శ్రీపాంచరాత్ర వైఖానసాది శాస్త్రములలో శిఖీ ముండీ త్రిదండీ ఏకదండీ అని రెండు విధములుగాను యతులకు విధింపబడినట్లుగా కాన్పించినను వానికి అనేక ఇతర ప్రమాణముల వలన సమన్వయముండుట చేత శిఖీ ముండీ అను దానికి శిఖాతిరిక్తముండ సమర్థము గాను, త్రిదండీ ఏకదండీ అను దానికి సర్వదా త్రిదండి గాను, ఆపత్సమయమందు ఏకదండిగాను నుండవలెనని అర్థముగా గ్రహింపవలెను.

అయితే లోకములో శిఖాధారులు త్రిదండదారులు అగు యతుల వలెనే శిఖాత్యాగులై ఏకదండధారులగు యతులు గూడా కలరు గాన శిఖీ ముండీ ఇత్యాది విధికి వికల్పమే అర్థమని తోచుచున్నదే అనినచో అట్లు కాదు. శ్రీవైష్ణవ సిద్ధాంతము ననుసరించిన యతులలో నెవ్వరును శిఖాత్యాగము ఏకదండధారణము చేయువారు లేరు.

అద్వైత సిద్ధాంతానుయాయులు అగు యతులు మాత్రము శిఖాత్యాగము ఏకదండధారణము చేయుదురు. కాని వారి పక్షములో వైకల్పికత్వమే అర్థము చెప్పవలసి యుండుట చేతను సమన్వయముండకపోవుట చేతను యతి సామాన్యమునకు ఏకవిధానము కుదరదు.

ఇంకను ప్రాచీన చరిత్రను బట్టి విచారింపగా కృతాది యుగములలో అట్టి ముండి ఏకదండియగు యతులున్నట్లు ప్రమాణము కానరానందువలనను, కలియుగములో కూడా శంకర, భాస్కర, యాదవ, భాట్ట, ప్రాభాకరులను ఐదుగురు అద్వైతయతులలోను శంకర యాదవులు తప్ప మిగిలిన ముగ్గురును శిఖాత్యాగాదులు చేసినట్లు తెలియకుండుటచేతను, అట్టి శిఖాత్యాగాదులు క్యాచిత్కములని తెలియుచున్నది. శంకరులకు కాశ్మీరమందలి శారదా పీఠములో సరస్వతితో వాదము కలిగి అపజయము వచ్చినందున శిఖాత్యాగాది ప్రతిజ్ఞను అనుసరించి శిఖాత్యాగ బ్రహ్మ సూత్ర త్యాగములు చేయవలసి వచ్చి అట్లు చేసిన పైన దానినే యతి సదాచారముగా శంకరులు పాండిత్య మహిమ చేత సమర్ధించినందున తదనుయాయులగు యాదవాదులా ఆచారము నవలంభించిరని ఉత్తరదేశమందు ఐతిహ్యాము కలదని చెప్పెదరు. అదియెంత వరకు సత్యమో నిశ్చయింపలేము కాని అద్వైత సిద్ధాంతానుసారము దేహ దైహికముల సత్యములని తెలుపుచు దేహ ధర్మములగు శిఖాయజ్ఞోపవీతములను త్యజించుటయు, బ్రహ్మ మొక్కటే సత్యమని సూచించుటకు ఏకదండము నాధారముగా ధరించుటయు జరుగుచుండి యుండినట్లు ఊహింపతగి యున్నది. కాబట్టి శ్రీవైష్ణవ సిద్ధాంతము నందుండు నాలుగాశ్రమముల వారును ఈ ప్రకరణములో నిర్ణయించి తెలుపబడిన సదాచార యుక్తులై భగవద్భాగవతారాధన తత్పరులై యుండవలెననియే శ్రీవైష్ణవాచార నిర్ణయమని తెలియవలెను.

వర్ణాశ్రమాచార ప్రతిపాదక ప్రకరణము ముగిసెను.

ఏడవ ప్రకరణము

శ్రీవైష్ణవ యతిగృహస్థ పరస్పర వందనాది నిర్ణయము

శ్రీవైష్ణవత్వ ప్రధాన లక్షణము

వెనకటి ప్రకరణము నందు చెప్పబడిన ప్రకారము భగవద్భాగవత పరిచర్యారూప ధర్మద్వయముతో గూడి స్వవర్ణోచిత సదాచారానుష్ఠానము నందు నిష్ఠులైన వారే వర్ణాశ్రమాచారవతా అనియు

న చలతి నిజవర్ణ ధర్మతో య స్సమతిరాత్మ సుహృద్వి పక్ష పక్షే।

న హరి నచ హంతి కించి దుచ్చైః స్థితి మననం తమ వేహి విష్ణుభక్తమ్

అనియు చెప్పబడిన శ్రీవైష్ణవత్వ ప్రధాన లక్షణములకు లక్ష్యభూతులగుదురు ఇట్టి వైష్ణవత్వ లక్షణములు కలవారాచరింపవలసిన ప్రధానకృత్యము పరస్పరాభివందనమని శాస్త్రము చెప్పుచున్నది.

యద్దృష్ట్వా వైష్ణవ ఇతి నిశ్చయస్స్యాన్మహామునే

తాదృశం లక్షణం వక్ష్యే వైష్ణవానాం ప్రధానతః ।

వైష్ణకా ద్వౌ యదా సద్య స్సంగతౌ తు పరస్పరమ్ ।

ప్రణామం కురుత స్తత్ర తయో ర్మధ్యే హరిః స్థితః ॥

తస్మాదవశ్యం కర్తవ్యం వైష్ణవానాంతు వందనమ్ ।

అనగా శ్రీవైష్ణవులు వీరని తెలియజేయు ముఖ్యలక్షణము చెప్పెదము. ఎప్పుడెప్పుడిద్దరు శ్రీవైష్ణవులెదురగుదురో అప్పుడు వెంటనే వారిద్దరును ఒకరికొకరు సాష్టాంగ ప్రణామము చేసికొనవలెను. అప్పుడచ్చట వారిద్దరి మధ్యమ శ్రియఃపతి సన్నిహితుడై యుండి ఆ వందనమును తాను స్వీకరించును. కాబట్టి ఆవశ్యకముగా వైష్ణవులు పరస్పరము ప్రణామములను చేసికొనవలెనని తాత్పర్యము.

వందన విధి నిషేధ విషయభాగము

ప్రణమంతం గృహస్థాదిం న పునః ప్రణమేద్యతిః ।

నారాయణేతి ప్రజాయా ప్రణతాయు ర్వివృద్ధయే ॥

నారాయణేతి నబ్రూయా ద్యోయతిః ప్రణతం ప్రతి ।

సచ తం ప్రణతశ్చోభౌ పూతి నరక శాయినౌ ॥

అనగా గృహస్థాదులు తనకు ప్రణామమాచరించినప్పుడు యతి తిరిగి ప్రణామమాచరింపకూడదు. నారాయణ అని మాత్రము ఉచ్చరింపవలెను. అట్లు చేసినచో నమస్కరించిన వారి కాయుర్వృద్ధి కలుగును. యతి తనకు ప్రణామము చేసిన వారిని గూర్చి నారాయణ నామము నుచ్చరింపనిచో తాను యెదటి ప్రణతులు కూడ పాపభాజనులగుదురు అను మహర్షి వచనములను బట్టి యత్యాశ్రమములోని శ్రీవైష్ణవులు వైష్ణవ గృహస్థాదులకు ప్రతి వందనము చేయకయే నారాయణ అని మాత్రము ఉచ్చరింపవలెనని తెలియుచున్నది. అయితే మరి వైష్ణవాద్వౌ ఇత్యాది వచన ప్రకారము ప్రతివందనము వైష్ణవ మాత్రులందరును చేసికొనవలెనను

వచనములతో విరోధము రాదా అని పూర్వపక్షము వచ్చుచున్నది. దీనికి సమాధానమేమనగా, వెనుక చెప్పబడిన పరస్పర ప్రణామ విధిలో విశేషించి వైష్ణవ విషయకముగా చెప్పబడినట్లు స్పష్టముగా నుండుటచేతను యతి తిరిగి ప్రణామము చేయరాదను విధిలో అట్టి వైష్ణవ విషయముగా చెప్పబడినట్లు స్పష్టముగా నుండుటచేతను యతి తిరిగి ప్రణామము చేయరాదను విధిలో అట్టి వైష్ణవ విషయముగా చెప్పబడినట్లు కానరానందు చేతను నీ క్రింది విధముగా విషయ విభాగము చేయవచ్చును. వైష్ణవ యతులు వైష్ణవత్వ లక్షణ పూర్తిగల గృహస్థాదులకు ప్రతి వందనములు చేయవలెననియు, సామాన్య యతులు సామాన్య గృహస్థాదులకు ప్రతి వందనము చేయరాదనియు విషయవిభాగము చేసికొనవలెను. అయితే పరస్పరాభివందన విధి కేవల వైష్ణవ మాత్రులను గూర్చి చెప్పబడినట్లు కనబడుచున్నదే. యతులు ప్రతివందనము చేయరాదని విశ్లేషించి ప్రతివందన నిషేధము యతులను గురించి మాత్రమే చెప్పినట్లు కనబడుచున్నది. కాబట్టి యతి వ్యతిరిక్త శ్రీవైష్ణవులలోనే పరస్పర వందనము కూడుననియు యతుల విషయములో విశేషముగా ప్రతివందనము చేయరాదనియు నిర్ణయించుటయుక్తమగునే అనినచో నట్లు కాదు. శ్రీవైష్ణవత్వ లక్షణములుగా నాలుగాశ్రమముల వారికిని విశిష్ట ధర్మశాస్త్ర వచనముల వలన కొన్ని ధర్మములు సిద్ధమగుట చేతను, అందు వైష్ణవ మాత్రులలో పరస్పర వందన విధి ప్రధానముగా కన్పట్టుటచేతను యతులకు గూడ వైష్ణవత్వ పూర్తి కొరకు వారు గూడ పరస్పరాభివందన ప్రమాణమును అనుసరింపక తప్పదు. శ్రీవైష్ణవత్వ పూర్తికి వర్ణాశ్రమాచార విధులను, భగవద్భాగవత పూజనమను విశేష విధులను సమానముగా అనుసరణీయములై యుండును గాన నట్లాచరించుట యతులకు విధాయకము.

మరికొన్ని అనుపపత్తుల సమన్వయము

సామాన్య శ్రీవైష్ణవ గృహస్థులలోనే తండ్రి కుమారునికి మామగారల్లునికి గురువు శిష్యునికి ప్రతివందనము చేయకుండుట ఆచారమై యున్నది. అట్లే శ్రీవైష్ణవ యతులు కూడ గృహస్థాదులకు ప్రతివందనము చేయరాదనియే పై నిషేధ వచనమునకు అభిప్రాయముగా గ్రహింపవచ్చునే అని యొక శంక కలుగుచున్నది. దానికి సదాచారమును బట్టి సమాధానమేమనగా,

పుత్రకాఇతిహోవాచ శిశుమాంగీరసః కవిః అను మనువచనమును బట్టి భగవద్యాన సంపన్నులగు పుత్రులను పిత్రాదులు గౌరవించెదరని యుండుట చేతను, కూరకులోత్తములగు నడువిల్ తిరువీధిప్పిళ్లై భట్టర్ తమ అన్నగారి చేత వందనము చేయబడుచుండిరని గురుపరంపరా ప్రభావములో చెప్పబడుట చేతను, అట్లే ఆచార్యులు శిష్యులను, మామగార్లు అల్లుళ్లను ఒక్కొక్క కాలములో గౌరవించి నమస్కరించుట పూజించుట నిలిపి గౌరవించుట సదాచారమై యుండుటచేతను శ్రీవైష్ణవ యతులు శ్రీవైష్ణవ గృహస్థాలకు యోగ్యతానుసారముగా ప్రతివందనము చేయవచ్చునని తేలుట తేత పరస్పర వందన నిషేధ వచనములు వైష్ణవేతర యతి విషయములుగానే సమన్వయము చేయుట ఉచితము. అయితే అట్టి ఆచారము లెక్కడ నోక్వాచిత్తముగా నుండినంత మాత్రము చేత సర్వ సమ్మతముగా నాయాచారము నొప్పికొని ఆచరించుట తగునా, అనినచో

యద్యధా చరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరోజనః ।
సయత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥

అను ప్రమాణమును బట్టి శ్రేష్టుల ఆచరణము క్వాచిత్కమైనను దాని అందరు అనువర్తించి ప్రమాణముగా స్వీకరింపతగును ఇంకను దానిపై నొక శంక కలుగుచున్నది. శ్రేష్టులని లోకులంగీకరించిన పాండవులు అయిదుగురును ఒకే ద్రౌపదిని భార్యగా స్వీకరించుటయు, సర్వేశ్వరుడని నిశ్చయింపబడి సర్వశ్రేష్ఠుడగు శ్రీకృష్ణుడు నవనీత చౌర్యాదులు చేయుటయు ప్రమాణముగా స్వీకరించి అట్లందరును ఆచరించుట తగునా, అను దానికి సమాధానమేమనగా, ద్రౌపది తన పూర్వ జన్మలో వరము కోరుకొనునప్పుడు భర్తాభర్తా భర్తా అని మూడు సార్లును, భర్తా భర్తా అని మఱి రెండుసార్లును ఆదరాతిశయము చేత కోరుకొనెనని ప్రమాణ వచనముండుట చేతను, పాండవుల తల్లియగు కుంతి తన పుత్రులు ద్రౌపదీ స్వయంవరమునకు పోవునప్పుడు మీరయిదుగురును అచ్చట లభించిన దానిననుభవింపుడని అనుమతి నిచ్చుట చేతను అట్టి ఆచరణము కేవల పాండవ ద్రౌపదుల యందే పర్యవసితమై ఇతరులకది వర్తింపదని తెలియవలెను. ఇక కృష్ణుని ఆచరణము

అవికారాయ శుద్ధాయ అనియు జన్మ కర్మభ మే దివ్యమ్ అనియు చెప్పబడిన ప్రకారము సాక్షాద్భగవంతుడగు ఆయన చర్యయంతయు భగవదభిప్రాయము చేత విశేష సంకల్పరూపముగా నుండుట చేతనది యంతయు కర్మవశ్యులగు సామాన్యుల కాచరణీయము కాదు. అందుకే శ్రీకృష్ణ చర్యను గూర్చి అభియుక్తులు

స్వాఙ్గాలింగే రతిర్నస్యా దంగనాలింగనే రతిః
యస్యాంగం జగదేకస్య తస్య రాగదయః కుతః ॥

అని చెప్పియుండిరి. పై సమాధానములయందంత తుష్టిలేని వారు వయస్సును బట్టి వచ్చెడి తారతమ్యమును బట్టి వయో ఉ ధికులగు యతులు వయస్సుచేత చిన్న వారి విషయములో ప్రత్యభివాదము చేయక వయో ఉ ధికుల విషయములోనే ప్రత్యభివాదనము చేయుట ఉచితమని గ్రహించవలెను. దీనికి ప్రమాణము ఆపస్తమ్బ ధర్మ సూత్రములలో

దశవర్షం పౌరసఖ్యం పంచవర్షంతు చారిణమ్ ।
త్రివర్షం శ్రోత్రియః పూర్వం హ్యబివాదనమర్హతి ॥

అని ఉన్నది. దీని తాత్పర్యమేమనగా సామాన్య బ్రాహ్మణులు తమకంటె పది సంవత్సరము పెద్దవారుగా నున్నట్లు ఏకత్రవాస సఖ్యము వలన తెలిసికొనియు, బ్రహ్మచారులు అయిదు సంవత్సరము పెద్దవారుగా నున్నట్లు తెలిసికొనియు హరికి ప్రతివందనము చేయవలెను. శ్రోత్రియులలగు వారు మూడు సంవత్సరములు పెద్దవారని తెలిసినంతలోనే ప్రత్యభివాదము చేయవలెను అని తెలియదగును. అట్లు చేయనిచో

ఊర్ధ్వం ప్రాణాహ్యుత్క్రామంతి యూనః స్థవిర
ఆగతే ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ప్రతిపద్యతే ॥

అనియు చెప్పబడినట్లు అట్టివారిక అభివందనము చేయకుండిన వాడు జీవన్మృతావస్థను పొందవలసివచ్చి సర్వకర్మ బహిష్కృతుడగును.

అన్యోన్య వందనహీన యతులు ప్రత్యవాయము

శ్రీవైష్ణవ సిద్ధాంతములో యతి గృహస్థాది సామాన్యముగా పరస్పర వందనము సదాచారమై యుండగా యతులు గృహస్థులకు ప్రతివందనము చేయరాదని తలంచునట్టి యతులు అవంద్యులగు గృహస్థుల గృహముల

యందు భిక్షాపరిగ్రహము వర్జింపవలసి యుండును. ఏలననగా పెద్దలు చిన్నలు అను భేదము పాటింపక పరస్పర వందన గౌరవాదులు చేసికొను గృహస్థాదులు ఆసాదువృత్తము కలవారగుటచేత అభిశస్తులగుచున్నారు. అట్టి వారి యొద్ద భిక్షమును యతులు పరిగ్రహించుట యుక్తము కాదు.

సాధువృత్తేషు బ్రాహ్మణ కులేషు భిక్షాం గృహీత్వా అనియు, **అభికర్త పతిత వర్జమ్** అనియు భిక్షా నియమములలో చెప్పబడినది కదా.

ఇక **సార్వవర్ణికం భైక్ష్యమ్ నాన్నదోషేణ మస్కరీ** అను వచనములు యుగాంతర విషయములుగాని ఈ యుగమును గురించినవి కావు. ఎందువలననగా **బ్రాహ్మణకులేషు భిక్షాం గృహీత్వా** అనియు **ఆవైష్ణవ గృహాన్నేన యతి శ్శూద్రో భవత్సదా** అనియు విశేష వచనముల చేత అవైష్ణవ బ్రాహ్మణుల వద్ద భిక్షమును వైష్ణవ యతులు పరిగ్రహింపరాదనియు నది పాతిత్య హేతువనియు విశేషవచనములుండుట చేత వెనుకటి వచనములకు బాధ కలుగుచున్నది. కాబట్టి అన్యోన్య వందనము యతులకు గృహస్థాదులతో నుండకూడదని **వానప్రస్థ గృహస్థాదీ న్నమస్యేద్యతిః క్వచిత్** అను వచనమును బట్టి తలంచు యతులు సాధువృత్తేషు ఇత్యాది వచనానుసారముగా గృహస్థాదుల వద్ద బిక్షా పరిగ్రహము చేసినందు వలన తన యతిత్వమునకు భంగము కలుగును. వైష్ణవౌ ద్వౌ యదాసద్య స్సంగతౌ తు పరస్పరమ్ ప్రణామం కురుత అను వచన ప్రకారము వైష్ణవ ధర్మమగు అన్యోన్య వందన రూపాచారము ననువర్తింపకుండుటచేత వైష్ణవత్వమునకు భంగము వచ్చును. దాని వలన పాతిత్యావైష్ణవత్వములు అట్టి యతికి సంభవింపక తప్పదని తెలసికొనవలెను.

శ్రీవైష్ణవ పరస్పర వందన విషయ నిష్కర్ష

ఆచార్య వదాచార్య పుత్రే వృత్తిః అను వచనము చొప్పున ఆచార్య పుత్రుడు యోగ్యుడై వయస్సు చేత తన కంటె చిన్నవాడైనను ఆచార్య ప్రతిపత్తిలో ప్రతివందనాదికము చేత గౌరవింపవలసి యున్నది. అచ్చట ఆపస్థంబ వచన ప్రకారము వయస్సును పాటింపనక్కరలేదు. ఇంకను

న పరీక్ష్య వయో వంద్యా నారాయణ పరాయణాః ఇత్యాది విశేషవచనములను బట్టి **నారాయణ పరాయణ్త్వ రూప వైష్ణవత్వము** సర్వ వర్ణా శ్రమ సాధారణమగుట చేత యతి గృహస్థాదుల కందరకును వర్తించును గాన సర్వాశ్రమ సాధారణముగా వయోభేదమును పాటిఇపక పరస్పర వందనము విహితమని తెలియవలెను. దీనిని బట్టి పరస్పరం **ప్రణామం కురుతః వైష్ణవ వైష్ణవం దృష్ట్వా దండవత్ప్రణమే ద్భువి** ఇత్యాది విశేష వచనములను ప్రమాణముగా తీసికొని శ్రీవైష్ణవ యతి గృహస్థాదులు వయోభేదాదులను చూడక పరస్పర వందనమును చేసికొనుటయే వైష్ణవత్వాను రూపమగు ధర్మమని తెలియగలదు.

శ్రీవైష్ణవులలో సేవ్యాసేవ్య విభాగము

వైష్ణవో వైష్ణవం దృష్ట్వా అను వచనప్రకారము వైష్ణవమాత్రుని చూచినంతనే వందనాదికము చేయవలెనని తెలియుచున్నను వైష్ణవత్వ మనునది కేవలము బాహ్య వేషముతో గనబరచువారికి గాక **చిదచిచ్ఛరీక బ్రహ్మ** స్వరూప జ్ఞానము నుండి కేవల దేహమాత్రమునే తానుక తలంచక పరమాత్మాత్మకముగా తలంచు విశిష్ట జ్ఞానవంతులకే సంపూర్ణముగా నుండును గాన అట్టివారిని గురించియే సర్వాశ్రమసాధారణమగు పరస్పర వందనాదికము వ్యవస్థితమై యుండును. తదతిరిక్త వైష్ణవ వేషమాత్రధారుల యందుండజాలదు. శ్రీమద్భాగవతములో

ప్రత్యుద్గమ ప్రశ్రయణాభివాదనం విధీయతే సాధు మిథ స్సుమధ్యమే ।

పాజ్ఞైః పరస్మై పురుషాయ చేతసో గుహాశయాయైవ న దేహమానినే ॥

అనగా ప్రత్యుత్థానము వినీతత్వము నమస్కారము అను పూజా విధులు పరబ్రహ్మ స్వరూపజ్ఞులగు సాధువులు అన్యోన్యము కలయుస్థలమందే చేయతగునని ప్రాజ్ఞులు తలంతురు. హృదయగుహయందు వసించు పరమాత్మ కొరకే అగౌరవములు చెల్లును. గాని కేవల దేహమాత్రము కొరకు కాదని చెప్పబడెను. దీనికి అనురూపముగానే **పరస్పరం ప్రణామం కురుత స్తత్రతయో ర్మధ్యస్థితో హరిః** అను వచనము చెప్పబడెను. కాబట్టి నిష్కృష్టజ్ఞాన సంపన్న శ్రీవైష్ణవులే సేవ్యులనియు, తదతిరిక్త వైష్ణవ వేషమాత్రధారులు సేవ్యులు కారనియు తెలియవలెను.

భగవదభిమత వర్ణాశ్రమాచార నిర్ణయము

గృహస్థాదీ న్నపునః ప్రణమే ద్యతిః అని చెప్పబడిన వచనమును వర్ణాశ్రమాచారవతా అను ప్రమాణమును బట్టి వర్ణాశ్రమాచారములను ముఖ్యముగా పాటించు శ్రీవైష్ణవ యతుల విషయముగాను **పరస్పరం ప్రణామం కురుతః వైష్ణవో వైష్ణవం దృష్ట్వా**, ఇత్యాది వచనములను కేవల వైష్ణవ ధర్మమును పాటించు శ్రీవైష్ణవ యతుల విషయమును సమన్వయము చేయుట వలన నేవిరోధమును నుండబోదని తలంచరాదు.

వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః సిద్ధే తదీయశేషత్వే సర్వార్థాః సంభవంతి హి అను ప్రమాణములను బట్టి భాగవత శేషత్వ పురస్సరమైన వైధిక ధర్మములే భగవత్ప్రీతిజనకములని తెలియుట చేత శ్రీవైష్ణవులకు భగవత్ప్రీతిజనకములగు వర్ణాశ్రమాచరణలే అవశ్యకములని తేలుచున్నట. అట్లాచరింపని ఏ ఆశ్రమస్థులను భగవదభిమతాచార వంతులు కాజాలరు. ప్రత్యుత వింద్యులగుదురని **విప్రా ద్విషడ్గుణ యుతా దరవిందనాభ పాదారవింద విముఖా చ్ఛ్వపచం వరిష్టమ్ విష్ణు భక్తి విహీనస్తు యతిశ్చ శ్వపచాధమః** అను వచనములు చెప్పుచున్నవి. విష్ణువునకు తద్భక్తులు పాదస్థానీయులనియు, విష్ణు భక్తి తదీయపర్యంత పర్యవసితమనియు కదా శ్రీవైష్ణవ సిద్ధాంత సారము. కాబట్టి భగవదారాధన పరులగు సమస్త వర్ణాశ్రమస్థులును భాగవత శేషత్వ పర్యంతాచార యుక్తులై నప్పుడే భగవత్ప్రీతి జనకాచారవంతులగుదురు.

వైష్ణవత్వ వర్ణాశ్రమ ధర్మభేద ప్రతిపత్తిలో అనుపపత్తులు

వైష్ణవత్వము సర్వవర్ణ సాధారణమనియు వర్ణాశ్రమ వ్యవస్థ కేవల బ్రాహ్మణ నిష్ఠమనియు తలంచి గృహస్థాదీ న్ననమేద్యతిః అను వందన నిషేధ వచనము బ్రాహ్మణ వర్ణము నందే వర్తించునని సంకోచము చేసి వైష్ణవో వైష్ణవమ్ ఇత్యాది వచనములు బ్రాహ్మణభిన్నుల యందు వర్తించునని చెప్పినచో యతి గృహస్థాది వ్యవస్థ ప్రథమ వర్ణములోనే యున్నందున దశమీవేధగల ఏకాదశి యతి గృహస్థాదులు ఉపవాసము చేయవలసినదను విధిని బట్టి ఆవిధి ఆశ్రమ భేదము గల బ్రాహ్మణులకే అని సంకోచము కలిగి దశమీ విద్ధైకాదశీ ఉపవాసము కూడ ఆచరణీయము కావలసివచ్చును. అట్టి వచనమేదనగా,

ఏకాదశీ యదా విద్ధా పరతో న వివర్ధతే ।

యతిభి ర్గృహిభిశ్చైవ విద్ధో పోష్యాచ సాతిథిః ॥

అని స్మృతి రత్నాకరములో గలదు. ఇక శ్రీవైష్ణవుల విషయములో **నోపోష్యా వైష్ణవై ర్విద్ధా** అను వచనము ఆచరణీయముగా నున్నది. అయితే ఆచరణములో బ్రాహ్మణ శ్రీవైష్ణవులగు యతి గృహస్థాదులు

విద్ధైకాదశ్యుపవాసము చేయక శుద్ధైకాదశ్యుపవాసముగాని తదభావము నందు శుద్ధ ద్వాదశ్యుపవాసము గాని చేయుచుండుట ఆచారముగా నున్నది. కాబట్టి వైష్ణవత్వ వర్ణాశ్రమాచారములకు భిన్న విషయత్వమును కల్పించి యతి గృహస్థా న్యోన్య వందనము నంగీకరింపని వారు విద్ధైకాదశ్యుపవాసమును గూడ నాచరింప వలసి వచ్చుచున్నది. అందువలన వైష్ణవేతర బ్రాహ్మణ యతి గృహస్థాదులకే పరస్పర వందన నిషేధము వర్తించునని తెలియవలెను.

పరస్పర వందనమున సదాచారము

నాథయామున యతివరాది సమస్త పూర్వాచార్యుల వద్ద నుండియు విశుద్ధైకాదశ్యాదుల వలెనే యతిగృహస్థాద్యన్యోన్య వందనాదులు సదాచారముగా నడచుచున్నది. అట్లాచరింపకుండుట అవైష్ణవత్వాపాదకమై పాతిత్య హేతువగునని తెలియుచున్నది. మరియు నట్టి అవైష్ణవత్వాపాదకమగు గృహస్థాది ప్రతివందన హీన యతులకు నమస్కరించినచో పాతత్యము వచ్చునని అవైష్ణవ నమస్కారాత్పతత్యేవ న సంశయః అని చెప్పబడుచున్నది. నాథ యామునాది పూర్వాచార్యులు యతి గృహస్థాద్యన్యోన్య వందనాదులను ఆచరించుచుండిరను నంశము యతిగృహస్థాద్యన్యోన్య వందనాదులను ఆచరించుచుండిరను నంశము పయిలమ్ శులరొళి అను తిరువాయ్ మొళి మూడవ పాశుర వ్యాఖ్యానములో స్పష్టము.

అందు పిళ్లైయాత్తాన్ ఎన్టురుపోరవల్లనాయిరుప్పార్ అని మొదలుకొని ఎన్టుజీయరైయిట్లు నిర్బందిత్తార్ అను వరకు వాక్యములు భాగవత పరస్పర శేషత్వము దుర్లభమను విషయమును బోధించు ఐతిహ్యము కలదు. ఇంకను తవ దాస్యసుఖైక సంగినామ్ అను శ్రీయామున శ్రీసూక్తిలో గూడ భాగవత శేషత్వము స్పష్టముగా తెలియుచున్నది.

శ్రీవైష్ణవ దర్శనోద్ధారకులగు పరమహంస పరివ్రాజకాచార్యులై వేంచేసియుండు శ్రీయెమ్బెరుమానార్లు స్వాచార్యులగు పెరియనమ్బి తిరుక్కోట్టియార్ నమ్బి, తిరమలై నమ్బి, తిరమలై యాణ్డాన్, తిరవదఙ్గ ప్పెరుమాళరైయర్ మొదలగు గృహస్థాచార్యులను, పట్టిని ప్పెరుమాళ్ మాఱనేరనమ్బి, తిరుక్కచ్చి నమ్బి మొదలగు భాగవతులను నమస్కారాది పూర్వకముగా అనువర్తించి యుండిరి. అని శ్రీవైష్ణవ యతిగృహస్థాల అన్యోన్య వందనాదికము గురుపరంపరా ప్రభావాది గ్రంథముల యందు స్పష్టముగా నుండుట గుర్తింపవలెను. ఆ విధముగానే భట్టరులను నఞ్జీయరు అనువర్తించుటయు జగత్ప్రసిద్ధము.

నమ్బిళ్లై గారిని పిన్బజగరామ్బెరుమాళ్ జీయరనువారు అనువర్తించి వందనము మొదలగు అను వృత్తి నాచరించిన విధము మణవాళమామునుల ఉపదేశరత్తినమాలలో పిన్బజగరామ్బెరుమాళ్ జీయర్ నమ్బిళ్లైక్కాన పడిమైగళ్ శెయ్యన్నిలైయై నన్నెఞ్జె అను పాశురములో సాయించిరి. అట్లే త్వద్దాసదాస గణనా చరమావధౌ యః అని గూడ యతిరాజవింశతిలో భాగవత శేషత్వమును స్పష్టముగా సాయించి యుండిరి.

భాగవత పరస్పర వందనములో దేశికుల ఆశయము

వేదాంతదేశికులు తమచేత రచింపబడిన యతిరాజ సప్తతిలో

అభిగమ్య సమ్యగనఘా స్సుమేధసో యతి చక్రవర్తి పదపద్మ పత్తనమ్ ।

హరిభక్త దాస్య రసికాః పరస్పరం క్రయవిక్రయార్హ దశయా సమిన్ధతే ॥

అనగా పాపరహితులై మంచి జ్ఞానము కల వారు శ్రీహరి యొక్క భక్తుల దాస్యరసము నెఱిగినవారై

యతీశ్వరుల పాదపద్మమనెడి పట్టణములో చేరి పరస్పర వందనాదులనెడి క్రయవిక్రయముల కర్తులై ప్రకాశింపుచున్నారని సాయించి యుండిరి. ఇచ్చట యతిగృహస్థాదుల పరస్పరాభివందన మెట్లు స్పష్టమగుననగా **యతి చక్రవర్తి పదపద్మ పత్తనమ్** అనుట చేత యతివరులకు గూడ సమాశ్రయణియు వెమ్బెరుమానార్లని తోచుట చేత యతివర చరణ పరిసరమను పట్టణము చేరి యతిగృహస్థాదులందఱును పరస్పరము తాము వందనము చేసి ఎదుటివారి వందనములను స్వీకరించుట అను క్రయవిక్రయములను చేసికొనుచున్నారని స్పష్టమగుచున్నది. కాబట్టి అట్టి పరస్పరాభివందన పరులగు యతి గృహస్థాదులే అనఘులను సుమేధస్కులును హరిభక్త దాస్యరసికులును అగుదురని దేశికాభిప్రాయము తేలుచున్నది. దీని వలన పూర్వాచార్యాచరితం కుర్యా దన్యథా పతితో భవేత్ అని చెప్పబడిన రీతిని పూర్వాచార్యాచరితమే కర్తవ్యముగాను అంతకు వ్యతిరిక్తముగా గృహస్థాదీ న్నన మస్యేత్ అను ప్రమాణము నవలంభించి పరస్పరాభివందన తర్జనము యతులకు పాతిత్య హేతువుగా నుండునని ప్రాజ్ఞులు గ్రహింపతగును. ఇంకను దేశిక ప్రోక్తమగు సంకల్ప సూర్యోదయమనెడి వేదాంత ప్రతిపాదక నాటకములో పంచమాంకములో యతివేషధారిణియగు అసూయకు గృహస్థవేషధారియగు దర్పునకును జరిగిన వాదోపవాదములలో ఈ విషయము స్పష్టముగా తెలియుచున్నది. అట్లే ఆ నాటకము నందలి దశమాంకములో వివేక మహారాజు తన చెల్లెలగు విష్ణు భక్తిని గురించి బోధించిన వాక్యములు చూచినపుడు యతిగృహస్థాద్యన్యోన్య వందనాదికము సచ్ఛాస్త్ర సమ్మతమని తెలియగలదు. అందిట్లున్నది.

కిం విజ్ఞానైః కిం తపోదానయజ్ఞైః కింతానైశ్చ త్వత్పరిత్యాగదీనైః

జ్ఞాతుం ద్రష్టుం తత్వతశ్చ ప్రవేష్టుం శక్యం బ్రహ్మ నన్యభాజా త్వయైవ

అను వివేక రాజ వచనములో భగవద్భక్తి హీనులకు విజ్ఞానతపోయజ్ఞాదు లుండిన నేమి ప్రయోజనము? జ్ఞాన దర్శన ప్రాప్తిరూప పరభక్తి పరజ్ఞాన పరమభక్తి రూప భక్తి విశేషమే ప్రధానమని చెప్పబడెను. ఇచ్చట తపస్సనగా **న్యాసస్తప ఇత్యాహు ర్వృద్ధా నిశ్చత దర్శనాః** అనియు

జ్ఞానం త్వేవపరం విద్మ స్సన్యాసం తప ఉత్తమమ్ అనియు

మహాభారత వచనములను బట్టి తెలియుచున్నది. ఏదనగా ప్రపత్తియే అదియే సన్యాసమగును. దీనిని బట్టి తపోనిష్ఠులనగా సన్యాసాశ్రమనిష్ఠులనియు అట్టి వారికి గూడ భగవద్భక్త్యంతర్గత భాగవత వందనాదికమే ప్రధానమనియు దేశికాభిప్రాయము స్పష్టమగుచున్నది.

విషయ విభాగపూర్వక సిద్ధాంత నిర్ధారణము

నాథముని యామున యతివరాదులందఱును తామనుష్ఠించి తమ సంబంధులకందఱకును తమ తరువాత తెలియుటకై స్తోత్రాది రూపముగా తెలియచేసియుండినందున తత్సంబంధులందఱును భాగవత శేషత్వ రూప వైష్ణవ ధర్మమును పాటించి యతిగృహస్థాది సాధారణముగా పరస్పరాభి వందనాదులను చేయుట సదాచారముగా నున్నది. దీనిని బట్టి ఈక్రింది విధముగా నాయా విధి నిషేదవాక్యములకు విషయభాగము చేయబడినది.

వైష్ణవౌ ద్వౌ యదా సద్య స్సంగతౌతు పరస్పరమ్ ప్రణామం కురుతః అనియు

వైష్ణవో వైష్ణవం దృష్ట్వా దండవత్ప్రణమే ద్భువి అనియు

ప్రత్యుద్గమ ప్రశ్రయణాభివాదనం విధీయతే సాధుమిథ స్సుమధ్యమే

అనియు చెప్పబడిన అనేకములగు అన్యోన్యాభివందనాది విధి వాక్యములు శ్రీవైష్ణవ యతుల కనుష్ఠేయములనియు

ప్రణమంతం గృహస్థాదిం న నమస్యేద్యతిః అనియు

వానప్రస్థ గృహస్థాదీ న్న నమస్యేద్యతిః క్వచిత్ అనియు మొదలగు **యతిగృహస్థాద్యన్యోన్య వందన నిషేధ వచనములు** అద్వైతియత్యాదుల నుష్ఠింపవలసినదనియు అధికారి విషయ విభాగము చేసినచో వానికి పరస్పర విరోధముండబోదని వివేకులుగా నుండు పూర్వాచార్యులు సిద్ధాంత పఱచి యుండిరి.

ఈ ప్రకరణమందు చర్చించబడు నితర విషయముల సంగ్రహము

ఇంక నీ ప్రకరణములో సర్వాశ్రయణీయుడగు శ్రియఃపతివలెనే శంఖ చక్రాంకితులగు శ్రీవైష్ణవులును సర్వసేవ్యులగుదురనియు, దాని యందు కలుగు శంకా సమాధానములును, యతి గృహస్థాది పరస్పర సేవ్యత శ్రుతిచోదితమనియు, అట్టి శ్రుతుల కుపబృంహణ వచనములును, యతులకు గృహస్థాదులు ఆచార్యులగునప్పుడు భగవంతుని వలె సేవ్యులనియు, యతులకు భాగవతులు కూడ అనువర్తనీయులనియు, సాధారణ యతుల కంటె అష్టాక్షరీనిష్ఠులగు శ్రీవైష్ణవులే ఉత్కృష్టులనియు, అందుకు ప్రమాణములగు శ్రుతి స్మృతులును యతిధర్మ సముచ్చయ గ్రంధము కేవలము శ్రీవైష్ణవ యతులకే గాక సర్వమత యతులకు సాధారణ ప్రమాణమగుననియు నిరూపింపబడును.

సర్వాశ్రమస్థ శ్రీవైష్ణవులసేవ్యత్వము

యథా సంపూజ్యమానో సౌ శంఖ చక్రధరో హరిః ।

తథైవ విప్రా స్సంపూజ్యా శ్శంఖ చక్రాంకితా యది ॥

అను విశేష వచనమును బట్టి పంచ సంస్కార సంస్కృతులగు శ్రీవైష్ణవ మాత్రులు భగవంతుని వలెనే పూజ్యులని తెలియుట చేత పరస్పర సేవ్యత్వము శ్రీవైష్ణవ మాత్రులు భగవంతుని వలెనే పూజ్యులని తెలియుట చేత పరస్పర సేవ్యత్వము శ్రీవైష్ణవ సర్వాశ్రములకు సిద్ధించుచున్నది. అందు చేతనే యతిగృహస్థాదులు పరస్పర సేవ్యులగుచున్నారు.

దానిపై శంకా సమాధానములు

అయితే అట్టి శంఖ చక్రాంకణములు లేకనే కొన్ని ధర్మ విశేషములను బట్టి శ్రోత్రియుడును వేదాంత జ్ఞానసంపన్నుడును నగు బ్రాహ్మణమాత్రునియందు యతివలెను గురువువలెను, విష్ణువు వలెను ప్రతిపత్తి చేయవలెనని శ్రుతి స్మృతులు చెప్పుచుండుట చేత అట్టివారి విషయములో గూడ విష్ణుని వలె గౌరవము చేయవలసియుండునే. శ్రుతి యెట్టిదందురా.

తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్ అని యున్నది. ఇచ్చట శ్రోత్రియ శబ్దమునకు శ్రుత వేదాన్తః అని శ్రుత ప్రకాశికాచార్యులు వివరించిరి. అట్టి వేదాంత జ్ఞానము కల గురువునే గురురేవ పరం బ్రహ్మ, ఆచార్య స్సహరి స్సాక్షాత్ అను ప్రమాణముల చేత సాక్షాద్విష్ణురూపుడని వివరింపబడెను.

ఇంకను **యతిర్యస్య గృహే భుంక్తే తత్ర భుంక్తే హరి స్స్వయమ్** అను ప్రమాణమును బట్టి సామాన్య యతి గూడ విష్ణువత్పూజ్యుడై యుండునని చెప్పబడెను. ఈ విధముగా వైష్ణవ లక్షణమగు శంఖ చక్ర ధారులగు యత్యాదుల వలెనే తద్ధారణము లేకుండినను శ్రోత్రియులై వేదాంత జ్ఞాన సంపన్నులగు గురుయత్యా దులు

గూడ విష్ణువువలె సేవ్యులని మధ్యస్థులు తలంచెదరే అనినచో శ్రోత్రియులై శ్రుత వేదాంతులగు గురు యత్యాదులు వేదాంత జ్ఞానానురూపమగు అనుష్ఠానము కలవారైనచో అట్టి ప్రతిపత్తికి యోగ్యులగుదురనియు లేనిచో కేవల జ్ఞాన మాత్రము చేత అట్టియోగ్యత ఉండదనియు పాంచరాత్ర పారమేశ్వర సంహితలో నీ విధముగా గలదు.

త్రయ్యంత జ్ఞాన సంపన్నా యథోక్తా చార నిష్ఠితాః ।

తథాతు యోగ్యా విప్రాద్యా స్సమయశ్రవణాదిషు ॥

అని యున్నది. అట్లయినచో ఆవిధముగానే చక్రాంకితులైన ఆశ్రమ చతుష్టయస్థులకు గూడ శ్రీవైష్ణవత్వానురూప జ్ఞానానుష్ఠాన పూర్తి యుండినప్పుడే కదా వారు విష్ణువత్పూజ్యులగుదురు. అని శంక తిరిగి కలుగుచున్నది. దానికి సమాధానమేమనగా,

యథా సంపూజ్యతే శంఖచక్రాంకితా యది అనియు,

త్రయ్యంత జ్ఞాన సంపన్నాః యథోక్తాచార నిష్ఠితాః తదా తు యోగ్యాః ॥

అనియు చెప్పబడిన వచనములను బాగుగా విచారించినప్పుడు శంఖ చక్రాంకణ మాత్రము చేతనే వైష్ణవ మాత్రులు పూజ్యులైనట్లు శ్రుత వేదాంతులైనను తద్ జ్ఞానానురూప నిష్ఠలేనిచో పూజ్యులు కాజారని తెలియగలదు. కాబట్టి ఆచక్రాంకితులకు జ్ఞాన నిష్ఠలుండిననే పూజ్యత కలుగును. వైష్ణవత్వ చిహ్నమగు శంఖ చక్రాంకణము మాత్రము చేతనే పూజ్యత యుండును. ఏలననగా శంఖ చక్రాంకణపరులకు దానితో పాటు జ్ఞానాభివర్ధకమగు మంత్ర సంస్కారమును, అనుష్ఠానరూపమగు యాగసంస్కారమును అనువర్తించియే యుండును. కేవల వేదపఠన మాత్రము వలన **శ్రోత్రియ శ్ఛందోఽ ధీతే** అను వ్యాకరణ శాస్త్రము ననుసరించి వచ్చిన శ్రోత్రియత్వమును వేదాంత శ్రవణాది జన్య జ్ఞానమును గలవారికి స్వానుష్ఠానముండిననే తప్ప అట్టి యోగ్యత రాజాలదని గ్రహింపవలెను.

భగవత్సంబంధ మాత్రము చేతనే జ్ఞానానుష్ఠాన సిద్ధికి నిదర్శనము

శంఖ చక్ర చిహ్నితులై భగవత్సంబంధము కలిగినంతమాత్రము చేతనే భగవంతుని వలె భాగవతులు పూజ్యులగుదురనుటకు ధ్రువునికి పాంచజన్య స్పర్శ కలిగినంత మాత్రముననే భగవద్భక్త్యాదులు అనెడి మహైశ్వర్యము వచ్చిన రీతి నిదర్శనమై యున్నది. కాబట్టియు కేవల వేదాంత జ్ఞానము కలిగిన మాత్రము కంటె శంఖ చక్ర రూప చిహ్నధారణ మాత్రమే స్వతః భగవత్కటాక్ష పాత్రతకు హేతువై దాని వలన సర్వ పూజ్యత సిద్ధింపగలదు.

శ్రీవైష్ణవ యతి గృహస్థాద్యనువర్తనములో శ్రుతి సమ్మతి

శ్రీవైష్ణవులై యుండిన యతి గృహస్థాదులు అన్యోన్య వందనాదికము నాచరించి అనువర్తించుటలో శ్రుతి సమ్మతి గలదని తెలియుచున్నది. **వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థా స్సన్యాస యోగా ద్యతయః శుద్ధ సత్వాః** అను శ్రుతిలో వేదాంత విజ్ఞాన పదము ఈ విషయమును స్పష్టపరచుచున్నది. కేవల వేదాంత జ్ఞానము. వేదాంత విజ్ఞానము అని రెండు భేదములు గలవు. వేదాంత జ్ఞానమనగా భగవన్మాత్ర పర్యవసితమగు భక్తి రూపాపన్న జ్ఞానము. వేదాంత విజ్ఞానము అనగా తద్విశేషమగు భాగవత భక్తి పర్యంత జ్ఞానమనియు చెప్పబడెను.

ఇందు భగవద్భక్తి గూడ గర్భితమై యుండుట చేత వేఱుగా జ్ఞానము చెప్పబడక విజ్ఞాన పదము మాత్రమే శ్రుతిలో ఉపాత్తమై యున్నది. ఇట్టి యర్థమును నిశ్చయించుటకు ఈక్రింది స్మృతి వచన మాధారమై యున్నది.

వృద్ధ పాద్మస్మృతిలో వేదాంతేషు చ సర్వేషు ప్రసిద్ధా భగవద్గుణాః ।

సంప్రదాయో త్ర గహనో దుర్బోధ స్త్వకృతాత్మభిః ॥

అత స్సర్వజనానంద గోవింద గుణ బోధనాత్ ।

స్వాభావిక హరి ప్రేమ నిలయానాం సముద్భవః ॥

అతస్తా నర్చయేత్ప్రాజ్ఞః ప్రణమే త్తానను వ్రజేత్ ।

అని చెప్పబడెను. దీని తాత్పర్య మేమనగా సమస్త వేదాంతముల యందును భగవంతుని కళ్యాణ గుణములు ప్రసిద్ధములుగా నున్నవి. ఇచ్చట నొక సంప్రదాయము గహనమైనది కలదు. అది సామాన్య వేదాంత జ్ఞానము కలవారికి దుర్బోధమై యున్నది. అది యెద్ది యనగా సర్వాత్మలను ఆనందపఱచెడి ఆనందమను విశేష గుణమును తెలియుట వలన స్వాభావికమైన భగవత్ప్రీతికి నిలయులగు భాగవతులుగా జనింతురు. అందు వలన విశేష జ్ఞాన (విజ్ఞాన) సంపన్నుడు. అట్టి భాగవతుల నర్చించి వారికి వందనమాచరించి వారి ననువర్తింపవలెను అని తెలియవలెను. ఇంకను శ్రీమద్భాగవతములో

శ్రుతస్య పుంసాం సుచిర శ్రమస్య నన్వంజసా సూరిభి రీడితోఽర్థః ।

తత్తద్గుణాను స్మరణం ముకున్ద పాదారవిందం హృదయేషు యేషామ్ ॥

అని చెప్పబడెను. ఇచ్చట శ్రుతస్య అని చెప్పబడిన శ్రుతము వేదాంత శ్రవణము, దానిని పరిశీలించుట అనగా దాని విశేషార్థ పరిశీలనము, శ్రవణము. దానిని పరిశీలించుట అనగా దాని విశేషార్థ పరిశీలనము, దానికి ఫలము భగవద్ధ్యానపరులగు భాగవతుల యొక్క జ్ఞాన భక్తి వైరాగ్యములనెడి దివ్య గుణములను గుర్తించి తద్వందనాను వర్తనాది పరులై యుండుటయే. ఇదియే వేదాన్త విజ్ఞాన సునిశ్చితార్థత్వమని తెలియవలెను. దీనిని బట్టి భగవద్భాగవత వైభవ జ్ఞాన సంపన్నులై శ్రీవైష్ణవ గృహస్థాద్యన్యోన్య వందనానువర్తనము గల యతులే శుద్ధసత్వులగు యతులగుదురని తెలియగలదు. బృహదారణ్యకములో

తస్మా ద్బ్రాహ్మణః క్షత్రియ మధస్తా దుపాస్తే అని చెప్పబడెను. దీని తాత్పర్యమును విచారించినప్పుడు ఒక యాగ విశేషము నాచరించిన అసవర్ణుడగు క్షత్రియుడు ఉత్తమజాతి జాతుడగు బ్రాహ్మణునకు సేవ్యుడై ఉపాసింపదగి యుండునని తేలుచున్నది. దానిని పరిశీలించినచో భగవచ్చరణ కమల స్మరణారాధనాది సదాచార నిష్ఠులగు శ్రీవైష్ణవ గృహస్థాది సజాతీయ భాగవతులు వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థులై శుద్ధసత్వులగు యతుల చేత సేవింపదగు ననునది కై ముతిక న్యాయ సిద్ధమగుచున్నది. ఇట్టి విశేషార్థమును గ్రహింపజాలక భాగవతానువర్తనము చేయని వారు భగవంతునికి ప్రాణహంతల వంటి శత్రువులగుదురని ఈక్రింది ప్రమాణము చెప్పుచున్నది.

వేదాః ప్రాణా భగవతో వాసుదేవస్య సర్వదా ।

తదుక్త ధర్మహీనస్తు ప్రాణహంతా భవేద్ధరేః ॥

అనునది, అట్లే భాగవతులు గూడ జ్ఞానీత్వాత్మైవ మే మతమ్ అను గీతా వచనమును బట్టి భగవంతునికి

ఆత్మారాధనము వలన కలిగిన ప్రీతి భాగవతారాధనము వలన కలుగునని తెలియవలెను. ఇట్టి విశేషార్థ కలిగిన ప్రీతి భాగవతారాధనము వలన కలుగునని తెలియవలెను. ఇట్టి విశేషార్థ జ్ఞాన శూన్యులు వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థులు కాజాలారని తెలియవలెను.

పర్వత్రయ నిష్ఠాప్రకారము నందలి ఐతిహ్యము

పర్వత్రయమనగా భగవద్భాగవతాచార్యులని చెప్పబడను. ఇట్టి పర్వత్రయరూప శేషిత్రయమునకు పరతంత్రులై తత్కైంకర్యనిష్ఠులగు వేదాన్తినఞ్జీయరు వంటి వారు మన పూర్వాచార్యులలోనే కలరు. నఞ్జీయరు అను భాగవతులు సాయించిన హితము వలన నీ విషయము స్పష్టముగా తెలియుచున్నది. వారు బోధించిన హితమేమనగా, **సర్వమష్టాక్షరాంతస్థమ్** అనియు **సిద్ధే తదీయ శేషత్వ సర్వార్థా స్సంభవంతి హి** అనియు చెప్పబడిన ప్రకారము భాగవతాచార్య నిష్ఠాపర్యంతమగు భగవన్నిష్ఠనే అనువర్తింపుచుండుడీ అని సాయించిరి. ఈ విషయము నాయ్చ్చియార్తిరుమొళి యందలి కరుప్పూరుం నారమో అను తిరుమొళిలోని రెండవ పాశుర వ్యాఖ్యానములో వ్యక్తముగా చెప్పబడెను. అట్టి ఆచార్య ప్రావణ్యము వేదాంత విజ్ఞానియగు, నఞ్జీరులకుండిన విధము కూడ తిరుమాలై వ్యాఖ్యానములో **పోనగం శెయ్‌దశేడం తరువరేల్** పునదమన్దే అను పాశుర వ్యాఖ్యానములో **ఒరునాళ్ భట్టర్ సుప్రసన్నరాయ్ జీయరుక్కిట్ట ప్రసాదత్తై, నినైప్పదు** అను వాక్యము వలన స్పష్టమగుచున్నది. కాబట్టి యథార్థమైన వేదాంత జ్ఞానము గల యత్యాదులు స్వాచార్యుల విషయముతోను భాగవతమాత్రుల విషయములోను సమాసమాత్రమాత్రమాధిక్య న్యూనతలను విచారింపక వారి విషయములో ప్రత్యుత్థానాభి వందనాదుల నాచరించి ఉజ్జీవింపవలెననియే వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థమగునని తెలియదగును.

శ్రీమదష్టాక్షరార్థ నిష్ఠుల ఆధిక్యము

వ్యాపకానాంతు మంత్రాణాం జ్యాయా నష్టాక్షరో మహాన్ అష్టాక్షరస్య జప్తాతు సాక్షాన్నారాయణః స్మృతః

అని హారీత స్మృతిలో చెప్పబడిన ప్రకారము అవ్యాపకములగు ఇతర విష్ణు మంత్రముల కంటె వ్యాపకములని చెప్పబడు నారాయణాష్టాక్షరి వాసుదేవ ద్వాదశాక్షరి, విష్ణు షడక్షరి అను వానిలో నారాయణాష్టాక్షరి మంత్రమే గొప్పదనియు. అట్టి అష్టాక్షరీ జపము చేయువారు సాక్షాత్తు నారాయణతుల్యులనియు తెలియుచున్నది. ఇంకను నృసింహోత్తరతాపిన్యుపనిషత్తులో **అనుపనీత శతమేక మేకేనోపవీతేన తత్సమమ్** అని ఆరంభించి

తాపనీయోపనిషదధ్యాసకానాం శతమేర మేకేన మంత్రరాజాధ్యాపకేన తత్సమమ్,
తద్వాప ఏతత్పరంధామ మంత్రరాజాధ్యాషదస్య యత్రనగ్నిర్దహతి....
యోగి ధ్యేయం యత్ర గత్వా న నివర్తంతే యోగినః,
తదేకదృచా దృక్త్వా రద్వష్టోః పరమం పదం ... విష్ణోర్యత్పరమ్ పదమ్,
తదేతన్నిష్కామస్య భవతి య ఏవం వేదేత్యుపనిషత్

అను వాక్యములచే మంత్రరాజమగు శ్రీమదష్టాక్షరీ మంత్రాను సంధాన శీలునికి పరమపదము సిద్ధమని చెప్పబడెను. మరియు **యన్వేతం విద్యాత్తస్య దేవా ఆసన్వశే** అను శ్రుతి చేత అష్టాక్షరీవేత్తకు దేవతలు భృతులై యుందురని చెప్పబడెను. వీరిని బట్టి ఇష్టారాజ్యమను రాజానుసంధాన తదర్థానుష్ఠాన శీలులగు సర్వాశ్రమస్థులును శ్రీవైష్ణవులకు పూజ్యులై వంద్యులై యుందురని తేలుచున్నది. ఇంకను కేవలమంత్ర రాజానుసంధాన మేకాక తద్వివరణ రూపద్వయ చరమములను తెలిసికొని తదర్థ తత్వనిధ్యానపరులై యుండు పరమైకాన్తులే శ్రేష్ఠులని

మహాభారతములో

సహోపనిషదాద్వేదాన్యే విప్రాస్సమ్యగాస్థితాః ।

పఠంతి విధిమాస్థాయ యేచాపి యతి ధర్మిణః ॥

తేభ్యో విశిష్టాం జానామి గతి మేకాంతినాం నృణామ్ ॥

అని చెప్పబడెను. ఏకాంతులనగా పైని చెప్పబడిన **వేదవేదాంత తత్సార మంత్రరాజార్థానుష్ఠానశీలులని** తెలియవలెను. అట్టివారే పరమైకాంతులనికూడ చెప్పబడుదురు. కాబట్టి అట్టి పంచసంస్కార పరులగు పరమైకాంతి శ్రీవైష్ణవ బ్రాహ్మణులు సర్వ సంపూజ్యులని తెలసి సర్వాశ్రమస్థులును అట్టి వారికి ప్రత్యుత్థానాభి వందనాదికము నాచరించుట భగవద్వందనాదులతో సమానమగునని తెలియవలెను. అట్లాచరింపని వారు భగవద్భాగవతాపచార పాత్రులగుదురు.

సదాచార్యాపచార దోషము

మొదటి భాగము రెండవ ప్రకరణములో విపులముగా చెప్పబడిన సదాచార్య లక్షణములు గల ఆచార్యుల పట్ల అపచారము చేయుట దోషావహమని శాస్త్రము చెప్పుచున్నది. ఆచార్యాపచారమెట్టిదనా

ఆచార్య స్సహరి స్సాక్షాచ్చరరూపీ న సంశయః ఆచార్యం

మాం విజానీయా న్నావమన్యేత కర్హిచిత్ తస్మై నద్రుహ్యేత్కదాచన

ఇత్యాది ప్రమాణములను బట్టి సాక్షాన్నారాయణుని చరరూపమగు సదాచార్యుని భగవంతునిగా తెలసియు ఆయన నవమానించి ద్రోహము చేయుటయే అని తెలియవలెను. అనగా అట్టి ఆచార్యుని సామాన్య జనునిగా తలంచి తదనువర్తనాదులను చేయకుండుట అని భావము. అట్లు అపచారము చేయు ఏ ఆశ్రమస్థునికైనను గల శాస్త్రజ్ఞానమంతయు

యస్య సాక్షాద్ భగవతి జ్ఞానదీప ప్రదే గురౌ, మర్త్యబుద్ధిః శ్రుతం తస్య సర్వం కుంజర శౌచవత్

అని చెప్పిన విధముగా ఏనుగు యొక్క స్నానము వలె పరిశుద్ధి లేక పంకదూషితమగునని తెలియవలెను. పై వచనములో మర్త్యబుద్ధిః అను దానికి తాను ఉత్తమాశ్రమస్థుడనుగాన దిగువ ఆశ్రమములందలి గృహస్థాదులు తన కంటె నికృష్టులని తలంచి అట్టి ఆచార్యుని విషయమందు వందనాది ప్రతిపత్తిని చేయకుండుటయే అర్థము. అట్టి మర్త్యబుద్ధిని ఆచార్యుని పట్ల కలిగి ఉన్నా వారు **యో గురౌ మానుషం** భావం అని మొదలుకొని ఉభౌ నరకపరాతినౌ అనియు,

మానిడవరెన్డుమ్ కురవైమలర్ మగళ్ తానుగన్దకోలములోకమెన్నుమ్

ఈనమదావెణ్ణిగిన్ట నీశరిరువమగల్ తానుగన్ద కోలములోక మెన్నుమ్

ఈనమదా వెణ్ణిగిన్ట నీశరిరువరుమే యెక్కాలమ్ నణ్ణిడువర్ కీశామ్‌నరగు

అనగా గురువును మనుష్యుడనియు, శ్రియః పతి ఆదరించి అర్చారూపమును లోహ విగ్రహమాత్రమనియు హీనముగా తలంచు నీచులిరువురును ఎప్పుడును అధోలోకమగు నరకమును చెందుదురనియు చెప్పబడినట్లు అనర్థమును పొందెదరు. ఆచార్యుడు వేద వేదాంగాది సకల శాస్త్ర జ్ఞాన పూర్వకమగు అనుష్ఠానము కలిగియుండి వినోదార్థమై ఒక మాటను చెప్పినను అదియే పరమధర్మమని నమ్మి యుండవలెనని వేదశాస్త్ర కధారూఢా జ్ఞాన ఖడ్గధర్మమని నమ్మియుండవలెనని,

వేదశాస్త్ర కథా రూఢా జ్ఞాన ఖడ్గధరా ద్విజాః ।

క్రీడార్థమపి యద్బ్రూయు స్స ధర్మః పరమో మతః ॥

అను శాస్త్రము చెప్పుచున్నది. దీనిని బట్టి స్వరూపానురూపముగా ఆచార్యుడు నియమించు ఆజ్ఞను పాటించి ఆచరింపవలె ననునది కైముతిక న్యాయ సిద్ధము. ఇట్లే ఆచార్యుడు గూడ

సద్వృత్త శ్శాసితాచైవ ముముక్షుః పరమార్థవిత్ ।

ఏవమాదిగుణోపేత ఆచార్య స్సఉదాహృతః ॥

అను ప్రమాణమును బట్టి మంచి నడత గలిగి శిష్యుని శాసించువాడై మోక్షేచ్ఛ కలవాడై శాస్త్ర పరమార్థమును తెలసినవాడై యుండవలెను. అట్లుకాక

లోభాద్వా యదివా మోహచ్ఛిష్యం శాస్తి న యో గురుః ।

నాస్మాత్సంశృణుతే యశ్చ ప్రచ్యుతౌ తావుభావపి ॥

శిష్యం భక్తి సమాయుక్తం న శిక్షయతిచేద్గురుః ।

శిష్యాజ్ఞాన కృతం పాపం గురోర్భవతి నిశ్చయః

అని చెప్పబడిన ప్రమాణములను బట్టి ఆచార్యుడు శిష్యుని వద్ద దృష్ట ప్రయోజనమగు దన్యాద్యపేక్ష చేతను గాని తెలివి తక్కువ వలన గాని శిష్యుని చక్కగా దిద్దుబాటు చేయకున్నను, శిష్యుడెంత భక్తి ప్రపత్తులు కలవాడైనను చక్కని శిక్షణ మివ్వకున్నను గురువు ప్రత్యవాయమును పొందును. అట్లు ప్రత్యవాయపాత్రులు కాకుండ ఆచార్యాంతే వాసులు బాగుగా ప్రవర్తింపవలెను.

ఆచార్యుడు శిష్యుని దిద్దవలసిన విధము

ఇంతవరకు ఈ ప్రకరణములో చెప్పదలచిన ప్రమేయము పూర్తిగా చెప్పబడెను. ఇక ప్రాసంగికముగా కొన్ని అంశములను మాత్రము చెప్పి ఈ ప్రకరణము ముగింపబడును.

ఉత్తమాచార్యుడు శిష్యుని దిద్దుబాటు చేయు విధమెట్లనగా,

యది శిష్యః పతే న్మార్గా త్తం ప్రయత్నేన వారయేత్ ।

శ్రియః పత్యుః పదాంభోజే గురుర్యాచేత తద్ధితమ్ ॥

ప్రసాదయే ద్భగవతా నాత్మనో హి తముద్ధరేత్ ।

తేన సంభాషణాదీని వర్జయేదనివర్తనే ॥

శాసితారం సదాచారే ఇత్యాది వచన ప్రకారము శిష్యుడపమార్గమును బట్టి అవిధేయుడైనప్పుడు ముందు అతి ప్రయత్నముతో నతనిని మళ్లించుటకు ప్రయత్నింపవలెను. అట్లు సాధ్యపడనప్పుడు శ్రియఃపతి చరణపద్మముల సన్నిధిని శిష్యుని బుద్ధి సరిచేయుమని ప్రార్థింప వలెను. ఉట్లు స్వప్రయత్నము చేతను భగవత్సహాయము చేతను గూడ శిష్యుడు వాని ప్రారబ్దవశమున దిద్దుబాటుకాని వాడు అతనితో సంభాషణమును వర్జింపవలెను. అనగా నుపేక్షింపవలెను ఇక శిష్యుడు ఆచార్యుని సన్నిధానములో నుండినప్పుడు ఆచార్యుడు తగిన రీతిగా శాసించి మంచిమార్గములో పెట్టుటయే కాక శిష్యుడు దేశాంతరమందుండినప్పుడు తాను శ్రీముఖలేఖల (ఉత్తరముల) మూలముగా దిద్దుబాటు చేయుటకు గూడ సదాచార్య కృత్యమై యున్నది. అట్టి యెడ దేశాంతరగతుడైన శిష్యుడు తన ఆచార్యులు పంపిన శ్రీముఖమును లంకలోని పిరాట్టి పెరుమాళ్ల చేత

పంపబడిన దివ్యాంగులీయకమును వలె శిరసావహించి ఆచార్యుడుండు దిక్కునకు తిరిగి నమస్కరించి ఆ శ్రీముఖ ప్రకారము యథాశక్తిని ప్రవర్తించి ఉజ్జీవింపవలెను.

నిత్యం గురుముపాసీత తస్యైవాజ్ఞా ప్రతీక్షకః ।

శాసనే స్థిరవృత్తిశ్చ శిష్యస్సన్నిత్యుదీరితః ॥

అని కదా ప్రమాణ వచనము చెప్పుచున్నది. ఇట్లు అన్యోన్యముగా ఆచార్య శిష్యులు ప్రవర్తించి తరించుటయే శాస్త్ర సమ్మతము. ఇది గురుశిష్యులుగా నుండు సర్వాశ్రమస్థులకు సాధారణమైన విధాయక కృత్యమని తెలియదగును.

యతులకు మోక్షైకచింతకత్వము

యస్సదా గురుశుశ్రూషాం గురు సేవాం తథైవచ ।

తథా వైష్ణవసేవాంచ కుర్యాన్మోక్షైకచింతకః ॥

అని పరాశర విశిష్ట ధర్మశాస్త్రములో చెప్పబడిన రీతిని మోక్షైకచింతకులగు యతులు స్వగురుభూతులగు గృహస్థుల విషయములో శుశ్రూషాదులను చేయవలెనని చెప్పబడెను. ఆ వచనములో మోక్షైక చింతకులని సామాన్యముగా చెప్పియుండగా యతులే అని విశేష నిర్ణయమెట్లు చేయవచ్చుననగా, **మోక్షాశ్రమచతుర్థోవై యో భిక్షుః పరికీర్తితః** ఇత్యాది వచనములను బట్టి మోక్షాశ్రమమునగా యత్యా శ్రమమని రూఢమైయున్నది. అందువలన మోక్షైక చింతకః అనగా ప్రధానముగా మోక్షమునే చింతించుయతులే అని చెప్పవలసియుండును. అయితే మోక్ష శబ్దము మాత్రము కలసినందున మోక్షైక చింతకులనగా యతులని అర్థము చెప్పవచ్చునా మోక్షైక చింతకత్వము ముముక్షువులగు నాలుగాశ్రమముల వైష్ణవులకును వర్తించదా, అనినచో **శక్త్యాతు యజ్ఞకృన్మోక్షే మనః కుర్యాత్తు నాన్యథా** అను వచనమునకు వ్యాఖ్యానము చేయుచు విజ్ఞానేశ్వరీయములలో **మోక్షశబ్దేన మోక్షక శ్చతుర్థాశ్రమో లక్ష్యతే** అని చెప్పబడినందున మోక్షము ఫలముగా తలంచి యుండు యతులకు మోక్షైక చింతకత్వము సిద్ధించును. ఇంకను మొదట యాదవ ప్రకాశులని ప్రసిద్ది కలిగి తరువాత రామానుజుల నాశ్రయించి వైష్ణవ యతియై శ్రీగోవింద జీయర్ అని వ్యవహరింపబడిన యతిశ్రేష్ఠులు గూడ చతుర్థాశ్రమము మోక్షధర్మమనియు, ఉత్తమాశ్రములగు యతులు ముముక్షువులనియు **మోక్షవిత్ మోక్షైక కాంక్షిణః మోక్షపరాయణః** అని యిట్లు యతిధర్మ సముచ్చయములో వ్యవహరించిరి.

యతిధర్మ సముచ్చయమును గూర్చిన విచారణము

పైని చెప్పబడిన యాదవప్రకాశులే గోవిందజీయరై ఎంబెరుమానార్ల అనుమతితో రచించిన యతిధర్మ సముచ్ఛయములో శ్రీవైష్ణవ సిద్ధాంతమునకు విరుద్ధముగా యతిగృహస్థాద్యన్యోన్య వందనాది నిషేధ వచనములు వ్రాసియుండిరికదా. ఆ గ్రంధము వైష్ణవుల కెట్లు ప్రమాణముగా గ్రహింపవచ్చునని యొక శంక కలుగుచున్నది. అయితే ఆ గ్రంథము సర్వమత సాధారణముగా రచింపబడిన దగుటచేత ఇతరమతస్థ యత్యాదులు గుడజిహ్వికా న్యాయము చేత నాలుకకు బెల్లమును పూసి ఆవర్జించురీతిని వారు గూడ ఆవర్జింపబడి తమవలెనే పూర్వము శిఖాయజ్ఞోపవీత త్రిదండవిహీనులై యుండు ఇతరాద్వైతియతులు గూడ తద్ధారణాదుల యందు ఆసక్తి కలిగి వైష్ణవ యతులుగా మారుటకు అందు సర్వయతి ధర్మములు అసూయ లేకుండ అవిశేషముగా చెప్పబడినవి. అన్యథా అయినచో ఎమ్బెరుమానార్ల ఆదరణకు విరుద్ధముగా నుండునట్లు ఆ గ్రంథము వారి

ఆనతితో రచించుట యుక్తము కాదు కదా!

అట్లయినచో భస్మ స్నాన త్రిమూర్తి ధ్యానాది వైష్ణవ ధర్మవిరుద్ధములగు విధులు ఆయతి ధర్మ సముచ్ఛయములో చెప్పబడుట జరిగినది. ఎట్లనగా,

ఆగ్నేయం వారుణం బ్రాహ్మమ్ అని ఆరంభించి **ఆగ్నేయం భస్మనా స్నానం** అనియు

బ్రహ్మాణం కేశవం శంభుం ధ్యాయన్ ముచ్యేత బన్ధనాత్ ....

యోగాభ్యాస పరో నిత్య మేవం యో వర్తతే యతిః ।

ప్రాప్త వైరాగ్య సంపన్న స్స యాతి పరమాం గతిమ్

అని చెప్పబడెను. అట్లే వైష్ణవ యతులకు సంబంధించిన ధర్మములు కూడ అందు చెప్పబడెనా? అనినచో నవి గూడ పంచమ పర్వమందిట్లు చెప్పబడెను.

ఈశ్వరో భగవా న్విష్ణుః పరమాత్మా సనాతనః

శాస్తా చరా చరస్యైకో యతీనాం పరమాగతిః

ధ్యాయతే ఽర్చయతే యో ఽన్యం విష్ణులింగముపాశ్రితః ।

కల్పకోటి శతైశ్చాపి న గతి స్తస్య విద్యతే ॥

ఆస్తిక్యం బ్రహ్మ సంస్పర్శః ప్రాణాయామరతి స్తథా ।

త్రైకాల్య మర్చనం విష్ణోః పరమం ముక్తి సాధనమ్ ॥

అని ఇట్లు విపులముగా వైష్ణవ యతి ధర్మములను గూడ వివరించుచు సామాన్య యతి ధర్మములను గూడ వివరించుట చేత యతిధర్మ సముచ్చయము సర్వమత సాధారణమని ప్రాజ్ఞులకు విశదము కాగలదు. దాని వలననే దానికి ప్రామాణ్యము లేకపోదు.

ప్రణామ ప్రకార విమర్శనము

శ్రీవైష్ణవ యతి గృహస్థాదులు పరస్పర వందనము నాచరించునప్పుడు

ప్రదక్షిణత్రయం కృత్వా నమస్కారేణ పంచమమ్

పునః ప్రదక్షిణం కృత్వా పునర్జన్మ నవిందతి ॥

ప్రణామం వైష్ణవం యుగ్మం ..... ప్రదక్షిణ నమస్కారాన్ యుగ్మానేవ సమాచరేత్ ।

అని ప్రదక్షిణము గాని నమస్కారము గాని ఒకమారు గాక రెండు మారులు చేయవలెనని విధి కనబడుచున్నది. అందుచేత వందనము రెండు పర్యాయములే చేయుట యుక్తమని తోచుచున్నది. అందువలన ఏకవందనము శాస్త్ర సమ్మతము కాదేమో అని యొక శంక కలుగుచున్నది. అయితే అట్టి పరస్పర వందనము నాచరించుకొను యతిగృహస్థాది శ్రీవైష్ణవులమధ్య శ్రియః పతి యుండునని వైష్ణవశాస్త్రము చెప్పుచుండుట చేత నా వందనము భగవద్వందనముగా పరిణమించును. **మద్వందనా చ్ఛతగుణం మద్దాసస్య తు వందనమ్** అను భగవద్వచనములో వందన శబ్దమున కేక వచనము వినబడుట చేత బాగవత వందనము ఒకే పర్యాయము చేయుట యుక్తమని తలంచవలసియున్నది.

ఇంకను, **ఏకః కృష్ణ నమస్కారో ముక్తి తీరస్య దేశికః**

ఏకోఽపి కృష్ణే సుకృతః ప్రణామః ద్రశాశ్వమేధాఽవబృధేనతుల్యః

అను ప్రమాణములను బట్టి కూడ సకృద్వందనమే యుక్తమని తోచెడివి. ఇచ్చట ఏకోఽపి అనుచోట అపి శబ్దము అవధారణార్థకమని గ్రహింపవలెను.

ఎందువలన అనగా **త్వదంఘ్రి ముద్ధిశ్య .... సకృత్కృతోంజలిః** అను అభియుక్తుల వచనము సకృద్వందనమునే బోధింపుచున్నది. ప్రణామమనియు వందనమనియు నమస్కారమనియు అంజలికరణమనియు చెప్పబడునవన్నియు స్వరూపానురూప దండవత్ప్రణామమునే బోధించును. కాబట్టి శ్రీవైష్ణవులాచరించు ప్రణామము సకృదేవహి శాస్త్రార్థః అను న్యాయమును బట్టి ఒక పర్యాయమే యుండవలెనని తెలియవలెను. తద్వ్యతిరిక్తులై పంచ దశ ద్వాదశ పర్యాయముల వరకు నుండవచ్చునని తెలియవలెను.

శ్రుతిలో గూడ **నమ స్సకృత్తే ఽస్తు నమస్తే అస్తు భగవతః** ఇత్యాది వాక్యములలో గూడ **సకృద్వన్దనమే** భగవంతుని విషయములో చెప్పబడెను. అట్లయినచో శ్రీవైష్ణవకులోత్తంగులగు రామానుజులు శ్రీవైకుంఠగద్యములో **సమస్త పరివారాయ శ్రీమతే నారాయణాయ నమః ఇతి** ప్రణమ్యోత్థాయ పునః పునః ప్రణమ్య అని సాయించిరే. అది యెట్లు సరిపడునని శంకింపరాదు. వారు సాయించినది పరమపదమందలి నిత్యముక్తులను గురించియై యుండుట చేత **నశాస్త్రం నై వచ క్రమః** అనియు **త్వదీయ గంభీరమనో ఽనుసారిణః** అనియు చెప్పబడిన ప్రకారము నిత్యముక్తులకు అది చెల్లును. విధి వశ్యులగు ముముక్షువులకు అది వర్తింపదని యెఱుగవలెను. అట్టి నిత్యముక్తుల యాచరణము నాశింపుచు ముముక్షువులు శాస్త్ర విహితమగు సకృత్ప్రణామమునే ఆచరింపవలెను.

నమో నమో వాఙ్మనసాతి భూమయే అను శ్రీయామున సూక్తిలోని నమః పదద్వయమునకు అర్థభేదము కలదు. అందొకటి నమస్కార పరము. రెండవది స్వస్వాతంత్ర్య నివృత్తిని బోధించును, కాగా స్వస్వాతంత్ర్య నివృత్తి పూర్వక భగవద్వందనమే అచ్చట పరమ తాత్పర్యముగా గ్రహింపవలెను.

శ్రీవైష్ణవులకుపవాస ప్రకారము

సామాన్యముగా శ్రోత్రియ బ్రాహ్మణాదులు ఏకాదశ్యుపవాసముతో పాటు భానువాసరాదుల యందు గూడ ఉపవాసము చేయుట పరిపాటిగా నున్నది. అట్లే వేదమార్గానుయాయులగు శ్రీవైష్ణవ యతిగృహస్థాదులు గూడ ఆచరించుట యుక్తమగునా? కాదా? అని విచారించినపుడు

పుణ్యా ద్విష్ణు దినాదన్య న్నోపోష్యం వైష్ణవై స్సదా ।
తథా భాగవతాదన్యో నార్చనీయో హి కుత్రచిత్ ॥

అను హారితస్మృతి ననుసరించి ఏకాదశ్యుపవాసము మాత్రమే శ్రీవైష్ణవులకు విహితమని తేలుచున్నది. అయితే శ్రీకృష్ణాష్టమి మొదలగు దినముల యందు వారు ఉపవాసము చేయుట ఆచారమైయున్నదే అనినచో ఆరోజున శ్రీకృష్ణ జనన కాల పర్యంతము నిరాహారముగా నుండి ఉత్సవము నాచరించి **ఉత్సవాంతే చ పారణమ్** అను ప్రమాణమును బట్టి ఉత్సవాంత మందు కాలాతిక్రమణదోషమును పాటింపక వెంటనే భగవత్ప్రసాదమును స్వీకరించుట సదాచారము. ఏకాదశి వలె అరువది గడియలును ఉపవాసము చేయుట లేదు. కాబట్టి శ్రీవైష్ణవ యత్యాదులకు ఏకాదశ్యుపవాసము మాత్రమే సదాచార సిద్ధము.

మరికొన్ని వైష్ణవానుష్ఠానములు

శ్రీవైష్ణవయత్యాదుల పరస్పరాభివాదనము శ్రీపరాంకుశ పరకాలయతి వరాద్యాచార్య శ్రీసూక్తి పరిశీలనము, వానిని అనుకూలులగు వారికి అభ్యసింపచేయుట, తద్విముఖులకుపదేశింపకుండుట, ఆళ్వారాచార్యుల తిరునక్షత్రములందు యథాశక్తిగా ఉత్సవాదులాచరించుట, భగవద్భాగవతాచార్యుల విషయములో యథాశక్తిని కించిత్కరించుట, తదీయారాధనములను చేయుట, అను ధర్మములు అవశ్యముగా శ్రీవైష్ణవులు ఆచరింపవలెను. ఇట్టి నిష్ఠ శ్రీరామానుజాంఘ్రి ప్రవణులగు సదాచార్యుల నాశ్రయించుట చేత లభించును. కాబట్టి ముముక్షువులగు శ్రీవైష్ణవులు సదాచార్యాశ్రయణము చేయవలెను. అట్టి ఆచార్యులు **స్వయమాచరతే యస్తు పరానాచార యత్యపి** అని చెప్పిన రీతిని తామనుష్ఠించి శిష్యుల చేత ననుష్ఠింప చేయుదురు.

ఇంకను ఈ ప్రకరణములో ప్రసంగ సంగత్యా మరికొన్ని అప్రస్తుత విషయములు శ్రీవైష్ణవ సమయాచార నిష్కర్షములో చెప్పబడెను. అవి పునరుక్తములని తలచి విడువబడినవి. జిజ్ఞాసువులు దానినుండి తెలిసికొనవలెను.

ఇట్లు శ్రీవైష్ణవ యతి గృహస్థ పరస్పరాభివందనాది
నిర్ణయ ప్రకరణము ముగిసెను.

ప్రపన్న దినచర్యా ప్రకరణము

విషయ సంగ్రహము

ఇక నీ ప్రకరణములో ప్రపన్నులగు శ్రీవైష్ణవ యతుల యొక్కయు గృహస్థుల యొక్కయు దినచర్యలలో కలికాలమందు యతులు ధరించు కాషాయ కమండల్వాది నిర్ణయము, ఏకభిక్షా ప్రాప్తి వచనముల వివరము, స్వార్థము గాక భగవద్భాగవత కైంకర్య వేదాంత కాలక్షేపాదుల విషయమై ధనధాన్యాది సంగ్రహణ తదనుకూల మఠాధిపత్యములకు శాస్త్రానుకూల్యము, వైష్ణవ గృహస్థాదులు, ఏకాదశీ శ్రాద్ధము నాచరింపరానందుకు ప్రమాణ వచనములు అనువానిని ప్రధానముగా చేసికొని తదనుబంధి విషయములు, శాస్త్రీయ వివాహాదులు స్త్రీలకు సహగమన విచారణము, ప్రపన్న పరిత్యాజ్య విషయములు, భగవదారాధనలో స్త్రీ పురుష ప్రవర్తన విశేషములు ఇత్యాది అనేక విషయములు విపులముగా వివరింపబడును.

యతిధార్య కాషాయ కమండల్వాది విశేషముల వివరణము

యతి ధర్మ సముచ్ఛయములో

ఆవికంత్వాచికం వస్త్రం తూలం స్థూలపటం తథా ।
పరిగృహ్యా యతి స్త్వేతాన్ పతత్యేవ నసంశయః

అనగా రోమసంధమైనట్టియు, నార సంబంధమై నట్టియు, ప్రత్తి నూలు సంబంధమైనట్టియు దళమైన వస్త్రమును యతులు ధరించినచో పతితులగుదురని చెప్పబడుట చేతను, **అథ పరివ్రాడేక శాటీ ప్రవృతః** అను మైత్రాయణ శ్రుతిలో యతులొక్క శాటీ (కాషాయము)నే ధరింపవలెనని చెప్పబడుట చేతను

కౌపీనాచ్ఛాదనార్థం వాసోభిభృయాత్ ప్రహీణ మన్యత్త్యభేత్

అను గౌతమ ధర్మ సూత్రములో గుహ్య స్థానాచ్ఛాదన రూపమగు కౌపీనము పైని కప్పుకొను వస్త్రము తప్ప మిగిలిన వానిని త్యజింపవలెననియు నది గూడ గృహస్థులు వాడుకొని విడచిన (ప్రాత) దానినే వాడుకొనవలెననియు చెప్పబడుట చేతనున్ను,

తస్య ముక్తాచ్ఛాదన విహితం సర్వతః పరిమోక్షమిత్యేకే

అను ఆపస్థంబ ధర్మసూత్రములో ఒకరు కట్టి విడిచిన వస్త్రమునే ఆచ్ఛాదనముగా పరిగ్రహించి మిగిలిన వానిని విడువవలెనని చెప్పబడుట చేతను యతులు కేవల కౌపీన మాత్రము పైని కప్పుకొను వొక నూలు వస్త్రమునే నూతనముగాక గృహస్థధారిత పరిత్యక్తమగు ప్రాత దానినే వాడుకొనవలెనని తెలియుచున్నది. ఈ విధముగా శాస్త్రము చెప్పుచుండగా నూతనమైన కాషాయ వస్త్రములచే కట్టుకొనుటకును గూడ రెండింలటని యతులు ధరించుట శాస్త్ర విరుద్ధమని ఆక్షేపణము వచ్చుచున్నది. దానికి సమాధానమిట్లు చెప్పదగును.

గృహస్థధృత పరిత్యక్త వస్త్రము సామాన్య భిక్షుకులు ధరించుట ప్రత్యక్షసిద్ధము. కాబట్టి పై వచనములు భగవద్భక్తులు కాక ఐహికాపేక్ష విడవకుండిన కేవల భిక్షుకులను గురించియే సమన్వయించును. భాగవత భక్తి పర్యంత భగవద్భక్తి గల శ్రీవైష్ణవ యతులకు అట్టి నియమము లేక నూతన కాషాయదుకూలములు ధరించుటలో అభ్యంతరము లేదని భగవదభిప్రాయము కనబడుచున్నది. ఎట్లనగా, దుర్వాసులు మొదలైన శ్రీవైష్ణవ యతులయిదువేల మంది శ్రీకృష్ణుని సన్నిధికి రాగా వారికి శ్రీకృష్ణ భగవానుడు

భోజయమాన తాన్ సర్వాన్ యతీ న్యతిపరార్చిత ।

చిత్వా ఛ్ఛిత్వాద దేవేశో దుకూలాని మృధూచి సః ॥

వదౌ తేభ్య స్తతా విష్ణుః సర్వేభ్యః

అనగా వారినందరిని భోజనము చేయించి క్రొత్తవై మృదువైన వస్త్రములను వేర్వేరుగా చింపి రెండేసి సమర్పించెనని హరివంశము నందు చెప్పబడెను. ఈ వచనములో యతివరార్చితః దేవదేవశః విష్ణుః అని భగవదసాధారణ నామములనే ఎత్తి చెప్పుట వలన అట్టి యతి ధర్మము భగవదభిమతమనియు, అందునను యతులకు నూతన దుకూల ధారణము భగవదభిమతమనియు తెలియగలదు. అందువలన భగవత్కర స్పర్శము గాని భాగవత కర స్పర్శము గాని కలిగియున్న భగవచ్ఛేష నూతన కాషాయద్వయధారణము. శ్రీవైష్ణవ యతులకు నింద్యము కాదు. అట్లే యతులు ధరింపవలసిన కమండలమును గురించి కూడ కొన్ని అనుపపత్తులు కనబడుచున్నవి. వానికి సమాధానములు నీ క్రింద వివరించెదము.

ప్రపన్న యతులకు లోహపాత్ర ధారణ విధి

యతి సామాన్యమునకు **యతి పాత్రాణి మృద్వేణు ధార్వలాబుమయానిచ**

అను వచన ప్రకారము మట్టిది గాని, వెదురుగొట్టముతో చేయబడినది గాని, కొయ్యతో చేయబడినది గాని, అనప (సొర) కాయతో చేయబడినదిగాని పాత్రయే ఉండవలెనని తెలియుచున్నది. మఱియు

లోహపాత్రేణ యత్పీతం యతీనాం తు జలాదికమ్ ।

సురాపాన సమం తత్స్యా దిత్యాహ భగవాన్మనుః ॥

అను వచనమును బట్టి యతులు లోహపాత్రలోని జలమును పానము చేసినచో సురాపాన తుల్యమగునని చెప్పబడి యుండుట చేత యతులకు లోహమయ కమండలము నిషిద్ధముగా కనబడుచున్నది. ఇంకను శిఖా యజ్ఞోపవీతం చ శౌచార్థమపి కుండికామ్ ।

సర్వదా ధారయే ద్గచ్ఛ న్న్యాసీనో వా౾పి చాశుచిః ॥

కుండికాం రజ్జుసంలగ్నా మన్యథా దూష్యతే యతిః ।

యథాచ సోమ సంయోగాచ్చ మసోమేధ్య ఇష్యతే ।

అపాం తథైవ సంయోగా న్నిత్యమేధ్య కమణ్డలుః ।

తతః శౌచం తతః పానం తత శ్చాచ మనక్రియా ।

తతః సర్వం యతిః కుర్యా న్నిత్యం మేధ్యః కమండలుః ।

గృహీణాం త్రీణి పాత్రాణి యతీనా మేక మేవతు

అను ప్రమాణ వచనమును బట్టి శిఖను యజ్ఞోపవీతమును ఎట్లు యతులు సర్వకాలములయందును వదలక ధరించవలెనో అట్లే కమండలువును గూడ త్రాడుతో కట్టి సర్వదా ధరించుచుండవలెననియు, తాము శుచిగా నున్న సమయమందును అశుచిగా (అనగా మూత్రోత్సర్జనాదుల వలన అపవిత్రముగా) ఉన్న సమయ మందును గూడ కమండలమును చేతిలో నుండి విడువ నక్కర లేదనియు, యజ్ఞములో సోమపానమునకు సాధనమైన అర్వాగ్బి లశ్చమస ఊర్ధ్వ బుధ్నః అని చెప్పబడిన చమసమను పాత్ర సోమ రసము యొక్క సంపర్కము వలన ఎల్లప్పుడు నెట్లు పవిత్రముగానే యుండునో అట్లే ఉదక సంబంధము చేత కమండలము

గూడ సదా శుచిగానే యుండుననియు ఆ ఎల్లప్పుడు నెట్లు పవిత్రముగానే యుండునో అట్లే ఉదక సంబంధము చేత కమండలముగూడ సదా శుచిగానే యుండుననియు, ఆ ఒక్క కమండముతోని ఉదకముతోనే శౌచక్రియ పాన క్రియ, ఆచమనక్రియ అను మూడును చేయవచ్చుననియు, గృహస్థులకు శౌచపానాచమనములకు వేరు వేరు పాత్రలుండవలెను గాని యతుల కట్టి నియమము లేదనియు తెలియుచున్నది. ఇట్లుండగా శ్రీవైష్ణవ యతులు లోహపాత్రలను శౌచాదులకు వాడుట ఎట్లు పొసగునని ఆపత్తి వచ్చుచున్నది. దానికి సమాధానమేమనగా యతి ధర్మ సముచ్చయము ఏడవ పర్వములో

కృతాత్రేతాద్వాపరేషు పాత్ర భోజీ యతి ర్భవేత్ ।

కలౌ పాత్రౌ న భుంజీత కుండికాంచ న ధారయేత్ ॥

అను విశేష వచనముండుట వలన కలియుగములో కుండికా (కమండలు) ధారణము నిషేధింప బడినది. దీనిని బట్టి ఏక కుండి ధారణమును దానితోనే శౌచపానాచమనక్రియాచరణమును తత్సహపఠిత లోహ పాత్రకృత స్నాన పానాదిక వర్జనమును కలియుగములో నిషిద్ధములై యున్నందున పై ఆపత్తికి అవకాశముండదని తెలియవలెను.

యతికి కలివర్జ్యపాత్ర షట్క విచారము

కలికాలములో యతులు కుండికాధారణమును వర్జింపవలసినదిగా పై ప్రమాణము కనబడుచున్నది. కుండిక యనగా ఆస్త్రీ కమండలుః కుండీ అను నిఘంటువును బట్టి కమణ్డలమే అని తెలియగలదు. యతులు ధరించవలసిన కమండలము ఆరు విధములైనదిగా నుండవలెనని

యతిపాత్రాణి మృద్వేణు ధార్వలాబు మయానిచ ।

చందనం నారికేళంచ పాత్రషట్కం విధీయతే ॥

అను వచనము చెప్పుచున్నది. అందువల మృణ్మయ వేణుమయదారుమయ అలాబు చందనమయ నారికేళ కపాలమయ కమండలములే కలికాల వర్జ్యములుగా తెలియుచున్నది.

ప్రసంగ వశమున కలివర్జ్య వివరణము

స్మృతి చంద్రిక యందు

ద్విజస్యా ఝ్ధతు విర్యాతుః శోధిత స్యాపి సంగ్రహః ।

సమదీక్షాచ సర్వేషాం కమండలు విధారణమ్ ॥

యతేస్తు సర్వవర్ణేషు భిక్షాచర్యా విధానతః ।

ఏతాని లోకగుప్త్యర్థం కవేరాదౌ మహాత్మభిః ॥

నివర్తితాని కర్మాణి వ్యవస్థాపూర్వకం బుధైః ॥

ఊదాయాః పునరుద్వాహం జ్యేష్ఠాంశం పలపైతృకమ్ ।

కలౌ పంచవివర్జేత భ్రాతృజాయాం కమణ్డలుమ్ ॥

అని చెప్పబడెను. అనగా బ్రాహ్మణుడు సముద్రయానము చేసినచో ప్రాయశ్చిత్తము చేసియైనను సంఘములో చేర్చుకొనుట, అనేకుల కొక్క పర్యాయము దీక్షనిచ్చుట (ఉపనయనాది), కమండలమును యతులు ధరించుట, సన్యాసి అన్ని జాతుల వద్దను విధానానుసారముగా భిక్షను తీసికొనుట ఇవి లోకరక్షణము కొఱకు

మహాత్ములగు పండితులు కలియుగారంభము నందు వ్యవస్థ చేసి నిషేధించిరి. మఱియు ఒక మాఱు వివాహమైన స్త్రీని తిరిగి యింకొక వరుడు వివాహమాడుట (మారుమనువు, పుత్రులలో పెద్దవానికి పైతృ కథనములో మఱియొక భాగమెక్కువ ఇచ్చుట, మాంస సహితముగా పితృశ్రాద్ధమును చేయుట, అన్న చనిపోయిన తరువాత ఆయన భార్యను తమ్ముడు పరిగ్రహించుట, యతులు కమండలమును ధరించుట అను అయిదును కలియుగమందు వర్జింపవలెను అని తాత్పర్యము. అట్లే

దేవరేణసుతోత్పత్తి ర్ధత్తా కన్యా నదీయతే ।

న యజ్ఞే గోవధః కార్యః కలౌ చ న కమండలుః ॥

అనగా అన్న భార్య మఱిది వలన సంతానమును కనుట, ఒక పర్యాయము ఒకనికి వాగత్తయైన కన్య నింకొకనికి దానము చేయుట. యజ్ఞములో జీవ పశువధచేయుట, యతులు కమండలమును ధరించుట అనునవి కలియుగములో వర్జింపవలెను. అని క్రతువను ఋషి చెప్పెను.

బృహన్నారదీయములో

సముద్రయాత్రా స్వీకారః కమండలు విధారణమ్ ।

మాంసాదనం తథా శ్రాద్ధే వానప్రస్థాశ్రమం తథా ॥

దీర్ఘకాల బ్రహ్మచర్యం నరమేధాశ్వమేధకౌ ।

ఏతాస్వర్జ్యాన్కలియుగే ధర్మమాహుర్మనీషిణః ॥

అనగా సముద్రయానము చేయుట, యతులు కమండలమును ధరించుట, శ్రాద్ధములో మాంసమును పెట్టుట, వానప్రస్థాశ్రమమును స్వీకరించుట, నైష్ఠిక బ్రహ్మచారిగా దీర్ఘకాలముండిపోవుట, నరమేధము అశ్వమేధము చేయుట, ఇవియన్నియు కలియుగము నందు వర్జించుట ధర్మమని పండితులు చెప్పిరి అని చెప్పబడెను. ఈ ప్రమాణములన్నిటి యందును కమండలుధారణము కలికాల వర్జ్యములలో విధిగా చెప్పబడెను. ఈ కమండలు ధారణ నిషేధము బ్రహ్మచర్యాధ్యాశ్రమ త్రయమునకే చెందుని భ్రమింపరాదు. విశేషించి యతులకే అని

యతిస్తు కలౌ యతిః కమండలు...... వివర్జేత

అను విశేష వాక్యములుండుట చేత ఇది యతుల విషయమే అని స్పష్టపడుచున్నది. కమండలువనగా పైని వివరింపబడిన మృన్మయాది షడ్విధ పాత్రములకే అర్థము గాన లోహమయ పాత్ర ధారణము కలివర్జ్యము కాదు.

దానిపై శంకా సమాధానములు

అయితే లోహపాత్రేణ యత్పీతం యతీనాంతు సురాసమమ్ అను వచనము నందు యుగ భేదము చెప్పబడక పోవుటచేతను మృద్దార్వాదిమయ కమండలు ధారణము కలియుగమందు వర్జింపవలసినదిగా చెప్పబడుట చేతను, కలియుగములో యతులు లోహమయమైనట్టి గాని మృద్ధార్వాది మయమైనట్టి గాని కమండలమును వర్జించి అనిందితములగు పోకపట్ట అరటియాకు మొదలైన వానితో చేయబడిన పత్రపుటము (దొప్ప)లనే పరిగ్రహించి శౌచ స్నానాద్యనుకూలమగు నదీ తటాక తీరములందే నివసింపుచు నుండుట యతి ధర్మముగా గ్రహింపవలసియుండునేమో అనినచో అట్లు తలంపరాదు.

మాతాపితృ సహస్రేభ్యో ఉ పి వత్సల తరం శాస్త్రమ్ అనియు

సహ్యా శక్యం శాస్త్రం విదధాతి అనియు పెద్దలగు ప్రామాణికులు చెప్పిన వాక్యములను బట్టి అశక్య విధులను శాస్త్రము బోధింపదు కావున నున్ను,

శౌచేయత్నః సదాకార్యః శౌచమూలోద్విజః స్మృతః ।

శౌచాచార విహీనస్య సమస్తా నిష్ఫలాః క్రియాః

అను వచనము చేత శౌచములో ద్విజుడు అతియత్నముతో మెలగవలెనని చెప్పబడినందున నున్ను శౌచమునకు తగిన పాత్రలను దృఢమైన వానిని ఉపయోగించుటలో శాస్త్రము ప్రతికూలింపదు. నదీతటాకాది తీర వాసము కృచ్ఛ్రసాధ్యము గాన దానిని వత్సలతరమగు శాస్త్రము సమ్మతింపదు.

యతులకు లోహపాత్రానుకూల్యము

కృతత్రేతాద్వాపరేషు పాత్రభోజీ యతిర్భవేత్ ।

కలౌ న పాత్రే భుంజీత కుండికాం చ న ధారయేత్ ॥

అను వచనము చేత కృతాదియుగత్రయము నందు వలె పాత్రభోజనమును కుండికాధారణమును కూడదని చెప్పబడుచున్నది. పాత్ర భోజనమనగా సొరకాయ బొఱ్ఱలో భిక్షము నెత్తి ఆ పాత్రలోనే భుజింప వేసి తరువాత మంత్రపూత జలముతో దానిని కడిగి ఉట్టిలో నుంచి జీవితావసాన పర్యంతము ఆ పాత్రనే ఉ పయోగింపుచుండుట అని తెలియవలెను. ఇందెక్కడను లోహపాత్రను నిషేదింపకుండుట చేత లోహపాత్రేణ యత్సీతం అను వచనము యుగాంతర విషయకమే అని గ్రహింపనగును. ఇట్లు నిశ్చయించిన పైని పారిశేష్య న్యాయము చేత కలియుగమందు యతులు లోహపాత్రము నుపయోగింపవచ్చునని తేలుచున్నది.

పారిశేష్య న్యాయమనగా

ప్రసక్తస్య ప్రతిషేధే అన్యత్రాప్రసంగాచ్ఛిష్యమాణే సంప్రత్యయః పరిశేషః

అనగా నొక విధి వలన ప్రసక్తి కలిగిన దానిని నిషేదించినప్పుడు అప్రసక్తమైన దానియందా నిషేధము ప్రసక్తము కాదు. గనుక ప్రత్యేక విధి సిద్ధము కాని దానిని గ్రహింపవచ్చుననునదియే పారిశేష్యమని మీమాంసా శాస్త్ర ప్రసిద్ధమగు న్యాయమని తెలియవలెను. దీని వలన మృన్మయాది కమండలుషట్కమే యతులకు విహితము గాన కలియుగములో అట్టి కమండలు ధారణము నిషిద్ధమైనంత మాత్రము చేత ప్రత్యేక విధిలేని లోహ కమండల ధారణము పారిశేష్య న్యాయము చేత నిషేధ భాజనము కాక ధార్యమే అని తేలుచున్నది.

స్మృతి సంగ్రహములో

కరే కర్పటకే చైవ త్వాయసే తామ్ర భాజనే ।

భుంజన్యతి ర్నలిప్యేత లిప్యంతే గృహమే దినః ॥

అని చెప్పబడుట చేత యతులు లోహమయ పాత్రమును పాన భోజనములలో నుపయోగింపవచ్చునని తెలియుచున్నది. ఇచ్చటనే భుంజన్ అని యున్నను అబ్భక్ష అని ఉదకపానము చేయు వానిని తినువాడు అని వ్యవహరించిన రీతిని పానము గూడ భుజి క్రియచేత చెప్పబడెనని తెలియవలెను. అయితే యతులు లోహ స్పర్శము చేయగూడదని యున్నందున లోహపాత్రను వాడటం యుక్తమా అనినచో అట్లనరాదు.

కంథాసూచీం ఖనత్రంచ మృదర్థం సంగృహేద్యతి

అను వచనమును బట్టి బొంతను కుట్టుకొనుటకు సూదిని శౌచార్థమై మన్నును త్రవ్వుకొనుటకు బొరిగెను యతి సంగ్రహించి యుంచుకొనవలెనని యుండుటచేత అట్టి లోహ స్పర్శము మాత్రము యతులకు నిషిద్ధమని అందు విశేషము గ్రహింపతగును.

యతులకు ఏకపాత్ర నియమదోషము

నరియే యతులు కలియుగమందు లోహపాత్రను ఆయా ప్రయోజనము కొఱకు ఉపయోగించుకొనవచ్చునని నిర్ణీతమైనది, అట్టియెడ శౌచ స్నాన పానాచమనములకు యతులకు ఏకపాత్ర నియమము శాస్త్ర విహితమై యుండుట చేత శ్రీవైష్ణవ యతులు భగవదారాధనమునకు గూడ ఆ పాత్రనే ఉపయోగింపవలెననా, లేక భిన్న పాత్రముల నుపయోగింపవచ్చునా? అను ప్రశ్న వచ్చుచున్నది. దానికి క్రింద సమాధానము చెప్పెదము. పరాశర సంహితలో

బ్రహ్మచారీ గృహీ సమ్యగ్వానప్రస్థో యతిర్వ్రతీ।
దుర్గంభ దేహయుక్తేన యోర్చయే ద్ధరిమాదరాత్ ॥
సయాతి నరకం ఘోరం కారవం రోమ సంఖ్యయా ॥

అని చెప్పబడెను. అచ్చట దుర్గంధ దేహయుక్తేష అను దానికి పాత్ర అర్థము. పాత్రకు దుర్గంధ యుక్తత్వము. స్వదేహోపయోగము చేత కలుగును. యతి శౌచాది సమస్త దేహ కృత్యములకును ఒకే పాత్రనుపయోగించుట చేత స్వశరీరమాలిన్య ప్రయుక్త దౌర్గంధ్య సంక్రాంతి పాత్రకు కలుగుట సహజము కొందరు యతులు నకుర్యా ద్ధంతధావనమ్ అను సామాన్య పదమును పాటించి **తృణపర్ణై స్సదాకుర్యాత్** అను విశేష వచనమును త్రోసిపుచ్చి దంతధావనమును మాని స్నానాదికము నాచరించుట కలదు. శరీర శుద్ధి కంటె వాక్శుద్ధి హేతువగు దంతశుద్ధి ప్రధానము కాన. అట్టి దుర్గంధదోష సంక్రాంతి పాత్రమునకుండును. గాన దానితో భగవదారాధనము నిషేధింపబడినదని తెలియవలెను.

ఇక గృహిణాం **త్రీణిపాత్రాణి యతీనా మేకమేవతు.... నిత్యమేధ్య కమండలుః**

అను వచనము **బ్రహ్మాణం కేశవం శంభుం ధ్యాయన్ముచ్యేత కిల్బిషత్**

అను వచనము వలెనే అవైష్ణవయతి విషయమున చెప్పబడినదని తెలియవలెను. కాబట్టి భగవదారాధనలో యధోక్త లోహపాత్రను శ్రీవైష్ణవ యతులు వాడవచ్చునని తెలియవలెను.

భగవదారాధన పాత్రలలోహ వివరణము

యతులు కలియుగములో వాడుకొనదగిన కమండలమునకు తామ్రలోహమును ఇతరోపయోగములకు ఆయసమును నుపయోగించుటయు తత్స్పర్శము వలన దోషము లేకుండుటయు ప్రమాణ సిద్ధమై యున్నది. ఇక భగవదారాధనమునకుపయోగించు పాత్రములకు ఏలోజము నుపయోగింపవచ్చునని విచారింపగా యుగాంతరమగు ద్వాపరములో ధర్మరాజు తన గృహములో స్వర్ణ పాత్రలలోనే యతులకు భోజనము నిడినట్లు ఏవం దశ సహస్రాణి యతీనా మూర్ధ్వరేతసామ్ । భుంజంతే రుక్మ పాత్రేషు యుధిష్ఠిర నివేశనే అని చెప్పబడినది. యుగ భేదము లేకుండ యతులు లోహపాత్రముల ఉపాయోగము పారిశేష్య న్యాయసిద్ధము గాన భగవదారాధనలో స్వర్ణ రజిత రూప ఉత్తమ లోహపాత్రలను గూడ నుపయోగించినను తత్స్పర్శదోషము యతుల కుండదు. స్వభోజనమునకే సువర్ణపాత్రలను ధర్మరాజ గృహములో నంగీకరించినట్లుండు నప్పుడు భగవదారాధనము కట్టి ఉత్తమలోహముల నుపయోగించుట నింద్యము కాజాలదని తెలియవలెను.

ఆశ్రమ స్వీకార సమయ స్వీకృత పాత్ర పరిత్యాగ విచారము

యతులకు లోహమయకమండల పరిగ్రహము శాస్త్ర సమ్మతమై యుండగ యత్యాశ్రమ స్వీకార సమయమందు నారికేళమయ (కొబ్బరి) కమండలము పరిగ్రహింపవలెనని చెప్పబడియున్నందున తరువాత తత్పాత్రమును వదలి లోహకమండలమును ధరింపవచ్చునా, అని సంశయము కలుగుచున్నది. దానికి సమాధాన మేమనగా, బ్రహ్మచర్యాశ్రమ స్వీకార సమయమందు

యతయే కాంచనం దద్యాత్తండులం బ్రహ్మచారిణే

దాతా నరక మాప్నోతి భోక్తా కిల్బిష భాగ్భవేత్ ॥

అను వచన ప్రకారము నిషిద్ధమైన తండుల భైక్షము చేయబడున్నది.

త్ర్యహమాషభైక్షమాచరేత్ అను ఆపస్తంబ ఋషి వచనమందుకు ప్రమాణమై యున్నది. తరువాత దానిని వర్జించి **యతిశ్చ బ్రహ్మచారీచ పక్వాన్న స్వామి నావుభౌ** అను వచనప్రకారము పక్వాన్న భైక్ష మాచరించినట్లే యతుల ఆశ్రమ స్వీకార సమయమందు పరిగ్రహించిన నారికేళ పాత్రను వదలి పారిశేష్య న్యాయసిద్ధమగు లోహ కమండలమును పరిగ్రహించుట ఆ యుక్తము కాదు.

యతులకు సువర్ణ రజతాద్యర్థ స్వీకార విచారము

కలికాలమందు యతులు లోహస్పర్శము వలనను తత్పాత్రోపయోగము వలనను ప్రత్యవాయమును పొందరని సిద్ధమైయుండగా సువర్ణ రజతమయ ద్రవ్యమును గూడ పరిగ్రహింపవచ్చునా? అను విచారణ చేసినప్పుడు లోహమయ పాత్రమగు తామ్ర కమండలమును తింత్రిణీదళాది (చింతాకు మొ ॥) స్పర్శము చేత నిర్మలమై మనోనైర్మల్యమునకు గూడ హేతువగుట చేత పరిగ్రహించినను చిత్తభ్రమస్తేయ హింసా ద్యనర్థమూలమగు లోహమయ ద్రవిణము (కాసులు రూపాయలు మొ) ను స్వార్థము కొరకు యతులు పరిగ్రహింపరాదు. ఈ విషయము శ్రీమద్భాగవత ఏకాదశ స్కంధము నందు ఇహ చాత్మోపతాపాయ మృతస్య నరకాయచ అవి ఆరంభించి

ఏతే పంచదశానర్థా హ్యర్థమూలా మతానృణామ్ ।

తస్మాదనర్థమర్థాఖ్యం శ్రేయోర్థీ దూరత స్త్యజేత్ ॥ అని చెప్పబడెను.

ఈ వచనము సర్వాశ్రమ సాధారణముగా నున్నను నీతరాగులగు యతులకు విశేషించి అత్యంత హేయమని తెలియవలసి యుండును.

శిష్ట పరిగ్రహీతములకుపాదేయత

పరాశర సంహితలో

అజాక్షీరాదికం తద్వన్మహిషీ క్షీరమేవచ ।

తన్మాహిషం దధిఘృతం తస్యా స్తక్రాదికం తథా ॥

త్యజేద్గోమాంసవన్నిత్యం అని మొదలుకొని తస్మాన్నిషిద్ధ ద్రవ్యాణి వర్జయే ద్వైష్ణవద్విజః

అనగా మేకపాలు పెరుగు నెయ్యి మొదలైనవియు, గేదెపాలు, వైష్ణవ ద్విజుల మాంసమునువలె వర్జింపవలెను అనుచు చెప్పబడెను. అట్లే హారీత స్మృతిలో గూడ

ఔష్ట్రం మాహిష మాజంచ పశూనాం విడ్భుజామపి ।

తత్తత్ క్షీరాదికం సర్వం ప్రయత్నేన వివర్జయేత్ ॥

అనగా ఒంటె గేదె మేక అను వాని యొక్క పాలు మొదలగునవియు మలమును తినెడి గోవుల యొక్క పాలు మొదలగునవియు వర్జింపవలెను (కొన్ని ఆవులు మనుష్య పురీషమును తినుట కలదు) అని చెప్పబడెను. ఇట్లు నిషేధ వచనములు కనబడుచున్నను మేక గేదె అను వాని పాలు మొదలగునవి శిష్టులచేత పరిగ్రహింప బడుచుండుట చేతను, ఆరోగ్య శాస్త్రానుసారముగా తత్తత్ క్షీరాదుల గుణవిశేషమును బట్టి, వాని ఉపయోగము విహితమై యుండుటచేతను గోక్షీర దధ్యాద్యభావమందు అజాది క్షీరము మొదలగునవి నిషిద్ధములు కావు. అట్లే యతులకు లోహపాత్రోపయోగము శిష్ట పరిగృహీతమై విశేష శాస్త్ర సమ్మతమై యున్నదని గ్రహింపవలెను.

యతుల కర్థార్జనములో విశేషము

యతిధర్మ సముచ్చయములో

స్వర్ణాది సంగ్రహం ధూర్తమాచారాత్ప్రచ్యుతం తథా ।

చండాలమివ వీక్షేత నప్రణామాదికం చరేత్ ॥

అను వచనమును బట్టి స్వర్ణాది సంగ్రహ తత్పరుడును ధూర్త చర్యగలవాడును (స్త్రీ లోలుడు) స్వవిహితాచార వర్జితుడును నగు యతి నింద్యుడనియు నాతనికి ప్రణామాదులను చేయరాదనియు చెప్పబడెను. దీనిలో స్వశరీర పోషణార్థము గాని పూర్వాశ్రమములోని స్వశరీర సంబంధులై యుండిన పితృ మాతృ భ్రాతృ పుత్రాదుల పోషణార్థము గాని స్వర్ణాది సంగ్రహము చేయువారగు యతులు గూడ చేర్చబడినారు. అట్లు అరార్జనము ఆపత్కాలమందు గూడ యతులు చేయరాదు. దాని వలన

త్రిదండ గ్రహణం కృత్వా పుత్రా దిభి స్సంభాషణమపి నకుర్యాత్

అను జమదగ్ని వచనము వలనను

స్వజ్ఞాతి పుత్రమిత్రాదీన్ తత్ప్రశస్తద్విజాదిషు ।

దేశాంతరే పి తాన్ దృష్ట్వా సచ తైస్సహ సంపసేత్ ॥

అను వచనమును బట్టియు పుత్రాది స్వదేహబంధువుల సంబంధమే త్యాజ్యమైయుండగా వారికొరకు అర్థార్జనము యతులకు నిషిద్ధమనునది కైముతిక న్యాయసిద్ధము. అట్లయినప్పుడు యతులు అర్థార్జనమును చేయుట దురాచారమగునా అని శంకింప పనిలేదు. యతులు స్వదేహ బంధువులతో సంబంధ సహవాసములు చేయగూడదని నిషేధమున్నను తల్లిని మాత్రము చూచినప్పుడు ప్రణామమును చేయవలెనని విశేష శాస్త్రముండినట్లే భగవద్భాగవత కైంకర్యార్థము అర్థార్జనము నిషిద్ధము కాజాలదు. దీనికి ప్రమాణమేమనగా, శ్రీపాంచరాత్ర పరాశర సంహిత యందు

ఆచార్య పితృ రక్షాదౌ విష్ణ్వాచార్యాది రక్షణే ।

ప్రపన్నః పరమైకాన్తీ బ్రహ్మచారీ యతి స్సదా ।

ప్రతి గ్రహం రాజసేవాం ధనధాన్యాది సంగ్రహమ్ ।

కృషి గోరక్ష్య వాణిజ్యం గణికం వైద్య ముత్తమమ్ ।

స్మరన్ద్వయార్థ మమలం కుర్యాదౌషధపానవత్ ।

దేవవిప్రాధికారం వై యతీనాం సద్విధిర్భవేత్ ।

వేదాన్త శ్రవణం వాక్యం వాఖ్యేయం వైష్ణవం తథా ।

అనగా ప్రపన్నులై పరమైకాంతులగు గృహస్థులైనను, బ్రహ్మచారులైనను యతులైనను కొన్ని విశేష కార్యముల కొరకు ధనాద్యార్జనము చేయవచ్చును. ఆ కార్యము లెవ్వియనగా ఆచార్యుడు (గృహస్థ బ్రహ్మచారులకైతే) తండ్రి, విష్ణు బింబములు ఆచార్య బింబములు అను వారిని సంరక్షించుటకు వేదవిహితమై ప్రపన్న జనానుష్ఠేయమైన మార్గములో ధనమునార్జింపవచ్చును.

ఇంకను గృహస్థులు రాజసేవ చేసి ధనమును సంపాందించుట ధాన్య సేకరణము చేయుట వ్యవసాయము చేయుట పశువులను పెంచుట వర్తకము గణక కృత్యము (గుమాస్తాగిరీ) వైద్యము అను వృత్తుల నవలంభించుట అను వానిని గూడ ద్వయమంత్రార్ధమును (భగవత్కైంకర్య రూపత్వమును) స్మరింపుచు ఔషదపానము చేసి దేహమును సంరక్షించుకొనినట్లు ధనమును సంపాదింపవచ్చును.

దేవాలయములు శ్రీవైష్ణవ బ్రాహ్మణ మఠాదులు వీని కధికారము వహించి సక్రమముగా నడిపించుట యతులకు సద్విధియే అగుచున్నది. ఇట్లు చేయుచున్నను వేదాంత వాక్య శ్రవణము విష్ణుకథా వ్యాఖ్యాన (ఉపన్యాస)మును చేయుచుండవలెను. అని పైవచనములలో వరుసగా గృహస్థ బ్రహ్మచారి యతులకు కలిపి ఆయావిధులు చెప్పబడినను తత్తదర్హ కార్యములలోను నియతముగా ధనార్జనము చేయవలసి యుండునని వివేకింపవలెను.

యతులకు దేవాలయాధిపత్యమును మఠాధిపత్యమును వైదికోత్తములై వైష్ణవముతోద్ధారకులైన రామానుజాచార్యులే అంగీకరించి అట్లు తమసంబంధులగు కొందరు యతులను శ్రీరంగాది దివ్య స్థలముల ఆదిపత్యమును ఆయా మఠముల ఆధిపత్యమును నిర్వహించునట్లు నియమించి యుండిరి.

కాబట్టి యతులకు దేవాలయాధిపత్యము మఠాధిపత్యము శిష్టపరిగృహీతమై శాస్త్ర సిద్ధమైయున్నవి. గృహస్థులకు మాత్రము అట్టి ఆధిపత్యము దేవద్విజాధికారం తు గృహస్థో నైవకారయేత్ అను శాస్త్రము చేత నిషిద్ధమైయున్నదని తెలియవలెను.

ఇక యతులు భగవదుత్సవాది నిర్వహణార్థమై ధనము కొరత కలిగినప్పుడు ఆపద్విషయముగా తలంచి అన్యమతస్థుల వద్ద నుంచియైనను ధనమును సంపాదించి ఉత్సవాదులను నెరవేర్చవచ్చును. కాని క్రొత్తగా విష్ణు విగ్రహముల స్థాపన విషయములో అట్టి ధనమును స్వీకరింపరాదు. దీనికి ప్రమాణము ఏదనగా,

శైవాదేరపి గృహ్ణీయా ద్ధనమాపత్సు వైష్ణవః ।

విష్ణో స్సంస్థాపనాదౌతు శైవాదే ర్నప్రతిగ్రహేత్ ॥

బ్రహ్మచారీ యతి స్సమ్యక్సర్వదా కమలాసన ।

శుద్ధం ద్రవ్యాదికం సమ్యగార్జయేత్స్వాత్వికేనవా ।

అవైష్ణవద్విజాద్యైస్తు దత్తం సర్వం పరిత్యజేత్

అని పరాశర సంహితలో చెప్పబడెను. మరియు ఎట్టివారును భగవద్భాగవత కైంకర్య నిర్వహణార్థము యుక్త మార్గములో సంపాదించిన ధనమునుగాని ధాన్యాదికమునుగాని స్వార్థమునకు ఉపయోగించుకొనుట నింద్యమై యుండునని ప్రమాణము చెప్పుచున్నది. ఎట్లనగా

విప్రోవా దేశికేంద్రోవా యతయోవా భవంతుతే

భగవత్స్వాపహర్తౄణాం ఖనిత్రై శ్చిద్యతాం శిరః ॥

అని పరాశర సంహితలో చెప్పబడెను.

భగవద్భాగవత కైంకర్య పరులగు యతుల ఔత్కృష్ట్యము

భగవద్భాగవత కైంకర్య నిరతులై యతులు తామే సంపాదించిన ధనధాన్యాదులు భగవదారాధనము, వేదాంత కాలక్షేపము మొదలగు సత్కార్యములకు వినియోగించుచుండుట వలన విష్ణు సాయుజ్యాది సిద్ధి కలిగి సర్వోత్కృష్టులుగా నుందురని ఈక్రింది పరాశర సంహితా వచనము చెప్పుచున్నది.

ధాన్యం పూజాచ విధి వత్సన్యావే సద్విధి ర్భవేత్ ।

సర్వదా విష్ణు కైంకర్యం మనో వాక్కాయకైరపి ॥

దేవ బ్రాహ్మణ సంరక్షా వేదాంతాభ్యసనాదికమ్

ఉక్తమేవం నిదానంచ యతీనాంతు విశేషతః ।

విష్ణుసాయుజ్య సిద్ధ్యర్థం సర్వబంధ విముక్తయే ।

త్రిదండ్యాద్యుక్త మార్గేణ సదా విప్రయతశ్చరేత్ ॥

అనగా సన్యాసాశ్రమమందు భగవద్ధ్యాన పూజాది విధులు సద్విధులనబడును. మనోవాక్కాయముల చేత నిత్యము విష్ణుకైంకర్య రతియు, దేవ బ్రాహ్మణ సంరక్షణమును, వేదాంతాభ్యాసమును అనునవి యతులకు విశేష కర్తవ్యములు. వీని వలన సర్వబంధ విముక్తి పూర్వక విష్ణుసాయుజ్యము సిద్ధించును. ఇట్టి సదాచరణ మెల్లప్పుడు త్రిదండి బ్రాహ్మణ యతికి చెప్పబడిన మార్గములో నడుపుచుండవలెను అని భావము.

పాంచరాత్ర వచన శిష్టాచారముల నిర్దుష్టత

పైన వివరించిన పాంచరాత్ర వచనములు లోభమూలకములనియు, అట్టి ప్రమాణములను బట్టి ఎంబెరుమానార్లు తామనుష్టించి ఇతర యతుల చేత ననుష్ఠింపించిన ఆచారము శిష్టాచారమనుటకు యుక్తము కాజాలదనియు, వారట్లాచరించినను

తేషాం తేజో విశేషణ ప్రత్యవాయో నవిద్యతే

అను రీతిని వారికి ప్రత్యవాయముండకపోయినను ఇప్పటికి యతులట్లు ఆచరించుట యుక్తము కాజాలదనియు ఆక్షేపించు వారికి క్రింది శ్రీరంగమాహాత్మ్య వచనము సమాధానము చెప్పుచున్నది.

మద్భక్తా న్మమవిద్యాంచ శ్రీరంగం ధామ మామకమ్ ।

మత్ప్రణీతంచ మచ్ఛాస్త్రం యే ద్విషంతి విమోహితాః ॥

తేషాం దురాత్మనాం జిహ్వా చ్ఛేదనీయా మహాత్మభిః ।

అని అట్టి రంగనాథుని వచనము ప్రమాణమగుటలో

వర్ణాశ్రమాచార విధిస్త్వమేవ త్వమేవ యజ్ఞం పరమం పదం చ ।

అను ప్రమాణ వచనమే ఆధారము. కాబట్టి పాంచరాత్రోక్తమై యతివరాది శిష్ట పరిగృహీతమైన భగవన్నిలయ మఠాధిపత్యములు నిర్దుష్టములై యత్యాచరణీయములగును.

యతులకు భిక్షాచరణ విషయ విచారము

యతులు భిక్షాగృహీతాన్నము చేతనే ప్రాణధారణము చేయవలెనను నియమము కలదనియు, అట్టి భిక్షాన్నమును గూడ తన శరీర ధారణమునకు సరిపడునంతనే శ్రోత్రియ బ్రాహ్మణ గృహములు మూడుగాని, ఆరుగాని, ఏడుగాని, ఎనిమిది గాని తిరిగి సంపాదించుకొనవలెను. గాని ఒక గృహము నందే చాలినంత భిక్షమును సంపాదించి భుజింపరాదనియు విధులు ఈక్రింది ప్రమాణవచనముల వలన భోదింపబడుచున్నది.

యాత్రా మాత్రం తు గృహ్ణీ యా త్కేవలం ప్రాణధారణమ్ ।

యథా లబ్ధం చ నాశ్నీయా త్క్రమం భుంజీత న క్వచిత్ ॥

అష్టౌ భిక్షా స్సమాదాయ స మునిః పంచ సప్తవా ।

అద్భి స్సంప్రోక్ష్య తత్సర్వం భుంజీత సుసమాహితః ॥

సిద్ధమప్యధికం భిక్షు రాదదానః పతత్యధః ।

యావతోదర పూర్తిః స్యా త్తా వద్గృహ్ణీత భిక్షుకః ।

షట్త్రీన్వాపి చ సప్తాష్టౌ నిత్యం భిక్షుర్గృహం శ్చరేత్ ।

తదిశ్నీయా దనింద్యాన్నం నిస్పృహేణైవ చేతసా ।

ఇత్యాది వచనములు బహుగృహ భిక్షను విధించునవి కలవు. ఇక

ఏక భిక్షాం ప్రకుర్వీత మాన మేకం నిరంతరమ్ ।

శ్వాస యోనిశతం ప్రాప్య విష్టాయాం జాయతే క్రిమిః ॥

పరమాపద మాపన్నో నైకాన్నాశీ యతిర్భవేత్ ।

మ్రియమాణస్తు నా కాన్నం భుంజీతాపి బృహస్పతే ॥

నేచ్ఛే త్కదాచిదేకాన్నం యతిస్చ బ్రహ్మ విచ్ఛుభిః ।

అను అనేక వచనములు ఏకత్ర భిక్షా నిషేధమును తెలుపుచున్నవి. అట్లున్నను అశక్తులగు యతులు ఏకభిక్షను చేయవచ్చునని ఈ క్రింది వచనములు చెప్పుచున్నవి. యతిధర్మ సముచ్ఛయము ఆరవ పర్వమందు

అశక్తో భేషజార్థం వా యతి రేకాన్నభుగ్భవేత్

అనియు బ్రాహ్మణకులే యల్లభతే తద్భుంజీత సాయం ప్రాతః అనియు చెప్పబడెను. నీవి భావమేమనగా యతులు అనేక గృహములకు తిరుగలేని అశక్తావస్థలోను, శరీరము వ్యాధిగ్రస్తమై పథ్యాహార సేవన మవసరమైనప్పటిలోను బ్రాహ్మణ శ్రోత్రియులనేకులు లేని గ్రామమందుండినప్పుడును ఏకగృహ భిక్షను చేయవచ్చుననియు, అట్టి భిక్షము కూడ కాలనియమము పాటింపక సాయం ప్రాతః కాలములయందెప్పుడైనను భిక్షను చేసి భుజింపవచ్చుననియు తెలియుచున్నది. ఇట్లు ఏక భిక్షను చేసి భుజింపవచ్చు ననియు తెలియుచున్నది. ఇట్లు ఏకభిక్షము ఆపద్విషయమనియు సామాన్యముగా యతులకు బహుగృహభిక్షమే నియతమనియు

తేలుచుండగా శ్రీవైష్ణవ యతులు ఏక భిక్షము చేయుట ఆచారము కలదు కదా అది యెట్లు సమర్ధింపదగునని విచారించినచో యతి ధర్మ సముచ్చయములో

మాధుకర మసంక్లప్తం ప్రాక్ప్రణీత మయాచితమ్ ।

తాత్కాలికోప సంపన్నం భైక్షం పంచమిధం స్మృతమ్ ।

అనగా అనేక గృహముల యందు భిక్షము చేయుట మాధుకరము, స్వయముగా పాకము చేసికొనక ఇంక గృహమందు పక్వాన్నమును భిక్షము చేయుట అసంక్లుప్తము. భిక్షాటనమునకు బయలుదేరకముందే శ్రోత్రియ బ్రాహ్మణుల చేత తీసుకొని రాబడినది ప్రాక్ప్రణీతము. తాను యాచింపకుండనే ఆదర పూర్వకముగా తమ యింటికి పిలచి అర్పించినది అయాచితము. అతర్కితముగా తత్కాలమందు లభించినది తాత్కాలికోప సంపన్నము. ఈ ఐదు విధములగు భైక్షమును యతులకు విహితమే అని భావము. ఇందు మొదటిదగు మాధుకరము మాత్రము బహుగృహ సంపాద్యభిక్షముగా నున్నది.

మిగిలిన నాలుగును ఏకగృహ సంపాద్య భిక్షములు గానే కనబడుచున్నవి. కాబట్టి ఏకభిక్షము నిషిద్ధముగా కనబడదు. అదియుగాక ఆ యతి ధర్మ సముచ్చయములోనే

సమర్థస్యా ప్యనుగ్రహా దేవాన్నంచ న దుష్యతి

అను విశ్వామిత్ర వచనమును బట్టి ఐకభిక్షము ఆపద్విషయమందే గాక భిక్షా ప్రదుని యందలి అనుగ్రహము వలన గూడ సమర్థయతులు అయినను ఆచరింపవచ్చునని తెలియుచున్నది. కాబట్టి ఏకభిక్షా నిషేధ వచనములు స్వేచ్ఛాపూర్వకముగా చేయు ఏక భిక్షా విషయకములని గ్రహింపవలెను. గృహస్థుని యందలి అనుగ్రహ మెట్టిదనగా తానాచరించు దేవపితృకార్యములలో తత్సాద్గుణ్యము నపేక్షించి గృహస్థుడు భగవన్నివేదనాంతరము ముందు భిక్షము నిచ్చుట కర్థించినచో నాతని యందలి అనుగ్రహము చేత నాభిక్షమును గ్రహించుట అని తెలియవలెను.

ఏకభిక్షాప్రార్థనావశ్యకతాది నిరూపణము

గృహస్థులైన వారు యతులను తామొక్కరుగానే భిక్షమును సమర్పించుటకు ప్రార్థించుటలో నుండు ఆవశ్యకత ఎట్టిదను విషయములో

అపచన్తం పరిత్యజ్య పచంతం యస్తు భోజయేత్ ।

తచ్ఛ్రాద్ధ మాసురం ప్రోక్తం పితౄణాం నోపగచ్ఛతి ॥

అనగా స్వయముగా పాకము చేసికొను నర్హతలేని యతి తటస్థించి యుండగా అట్టి అర్హత గల ఇతర గృహస్థుని నిమంత్రణము చేసుకొని గృహస్థుడు నిర్వర్తించు శ్రాద్ధము ఆసుర మనిపించుకొనును. అది పితరులను తృప్తి పరచజాలదు అని చెప్పబడినది. అయితే యతులను శ్రాద్ధములో భోజనము చేయింపవచ్చునా, అను ప్రశ్న వచ్చుచున్నది. దానికి హరివంశములో పదునారవ అధ్యాయములో చెప్పబడిన ఈ క్రింది ప్రమాణము సమాధానమిచ్చుచున్నది.

కాంచనం రాజతం పాత్రం దౌహిత్రః కుతపస్తిలాః ।

స్వస్థశ్చ పాపభీరుశ్చ త్రిదండీ యోగ్య ఏవచ ॥

శ్రాద్ధ కర్మణ్యయం శ్రేష్ఠో విధి ర్బ్రహ్మన్ సనాతనః ।

అపదిశ్య పితౄన్యేన గురౌ యత్ప్రతిపాద్యతే ।

దేశ కాల క్రియామంత్ర నిరపేక్షం తదక్షయమ్ ॥

అనగా శ్రాద్ధకర్మను పితరులను నుద్దేశించి ఆచరించునప్పుడు బంగారు పాత్రను లేక వెండిపాత్రను ఉపయోగించుట. పితరులకు దౌహిత్రుడుగా నుండు తన మేనల్లుని భోజనమునకు ఆహ్వానించుట, అపరాహ్ణ కాలమందు భోక్తలను భుజింపచేయుట, నువ్వులను అర్చనాదులకుపయోగించుట, స్వస్థ శరీరము కలిగి పాపభీతి గల యోగ్య త్రిదండి సన్యాసిని నిమంత్రణము చేయుట ఇది శ్రాద్ధ కర్మలో ముఖ్యములై యోగ్యములుగా నుండును. పితృదేవతల నుద్దేశించి యతికి శ్రాద్ధ భోజనమిడినచో దేశము కాలము కర్మాచరణము మంత్రోచ్చారణము అను వాని లోపముతో సంబంధము లేకనే ఆ శ్రాద్ధము అక్షయమగును అని భావము. ఇందులో గురౌ యత్ప్రతిపాద్యతే అను చోట గురు శబ్దమునకు యతి అని అర్థమెట్లు వచ్చుననుచో

యతి ర్గురు ర్ద్విజాతీనాం వర్ణానాం బ్రాహ్మణో గురుః ।

పతిరేవ గురుః స్త్రీణాం సర్వేషాం మీశ్వరో గురుః ॥

అను వచనమును బట్టి బ్రాహ్మణులకు గురువు యతియే అని అర్థము చెప్పవలసియుండును.

శ్రాద్ధకర్మలో శ్రీవైష్ణవాది గృహస్థులు విశ్వేదేవార్థము, పితృదేవార్థము భోక్తులను వేరుగా నిమంత్రించ వలసియుండును. విశేషించి శ్రీవైష్ణవ గృహస్థులు విష్ణువును ఉద్దేశించి మరియొక భోక్తను నిమంత్రించుట శిష్టాచారము. ఇట్లుండగా యతిని ఆ ముగ్గురిలో ఏ స్థానమందు నిమంత్రించి భుజింపజేయవలెనను విషయములో స్మృతి రత్నాకరమున

యతిశ్చ బ్రహ్మచారీచ పక్వాన్న స్వామినా వుభౌ ।

స్థాన ఏవనియోజ్యౌతౌ నిశ్శంకేనాంతరాత్మనా ॥

అనగా యతియు బ్రహ్మచారియు పక్వాన్నమును సమర్పించుటకు యోగ్యులుగా నుందురు, కాని వారినిద్దరిని యుక్త స్థానము నందే నిమంత్రించి భుజింపజేయవలెను అని భావము, ఇచ్చట యుక్తస్థానమనగా

సగోత్రంచ యతించైవ బ్రహ్మచారిణ మేవచ ।

దేవార్థం వరయే త్పూర్వం పిత్రర్థం స కదాచన ॥

అను ప్రమాణమును బట్టి సగోత్రుడు యతి బ్రహ్మచారి అను వారిని విశ్వేదేవ స్థానమందు గాని నిమంత్రింపవలెను. గాని పితృస్థానమందు నిమంత్రింపరాదని యున్నందున పితృస్థానమునందు నిమంత్రింపరాదు. ఈ వచనములో సగోత్రుని గూడ శ్రాద్ధమందు నిమంత్రింపవచ్చునని కనబడుచున్నది. దీనికి ఆధార మేమనగా

సగోత్రే పైతృకం దద్యాత్కన్యాదానంతు వర్జయేత్ అను ప్రమాణ వచనమే.

సగోత్రులనగా నెట్టి వారనగా, తన గోత్రముతో ఏడు తరముల వారు సపిండులు. అతని తరువాత ఏడు తరముల వారు సమానోదకులు. ఆ తరువాత పదునేనవ తరము నుండు సగోత్రులని తెలియవలెను. అట్టి సగోత్రులను పితృ శ్రాద్ధములో నిమంత్రింపవచ్చును. కన్యాదానమును మాత్రము వారికి చేయరాదని పై వచన తాత్పర్యము.

ఈ విధముగా గృహస్థుడు ప్రార్థనా పూర్వకముగా నాహ్వానించి భిక్షను యతులకు సమర్పించినప్పుడు ఏకభిక్షాదోషము యతులకు ఉండబోదని తెలియవలెను. మరియు దేవ పితృాద్దేశముతో చేయబడు శ్రాద్ధమందు భిక్షమును స్వీకరించు యతి తత్కాలమందు అనుగ్రహపూర్వకముగా పరతంత్రుడై యుండుట వలన మంత్ర పూర్వక భిక్షాయాచనము చేయనక్కరలేదని తెలియవలెను.

పిత్రర్థం కల్పితం పూర్వం దేవాద్యర్థ మథాపివా । తత్రభిక్షాం న యాచేత

అను వచనమిచ్చట ప్రమాణము. ఈ ప్రమాణమున కింకొక విధముగా అర్థ నిర్వహనము గూడ కలదు. ఎట్లనగా ప్రపన్న శ్రీవైష్ణవ యతులు అప్రపన్న గృహస్థుల యిండ్ల యందు కేవల పితృ దేవాద్యుద్దేసముతో వచింపబడి భగవన్నివేదనము చేయబడని అన్నాదికమును భిక్షగా స్వీకరింపరాదు. అట్లు స్వీకరించుట వలన ప్రాయశ్చిత్తీ యతి కలుగును అని గూడ చెప్పవచ్చును.

అట్లు కాక **విష్ణోర్నివేదితాన్నేన భిక్షాం భక్ష్యాదికం చరేత్** అను ప్రమాణమును బట్టి భగవన్నివేదిత పదార్థములలో భక్ష్యాదులను గూడ భిక్షలో యతులు స్వీకరించి భుజింపవచ్చును. అని యుండుట చేత శ్రాద్ధములో భక్ష్యాది భోజనము యతులకు నిషిద్ధము కాదు.

నిష్కృష్టాత్మ స్వరూపజ్ఞయత్యనుష్ఠానము

భగవద్భాగవతాచార్య కైంకర్యాది స్వరూపనిష్టగల శ్రీవైష్ణవ యతులు యతి గృహస్థాద్యన్యోన్య ప్రణామాది సదాచార యుక్తులై యుండి తమ యాచార్యులు గృహమందును, అట్టి పూజ్యకోటిలో చేరిన విలక్షణ భాగవతుల గృహమందును శ్రీపాద తీర్థ పరిగ్రహ పూర్వకముగా ఏకభిక్షా స్వీకారమును ప్రార్థనా పూర్వకముగా చేయవలెనని శాస్త్రములు చెప్పుచున్నవి. ఎట్లనగా,

సుదూరమపి గంతవ్యం యత్రభాగవతః స్థితః ।

యాచయేదన్న మమృతం తదభావే జలం పిబేత్ ॥

భాగవత శ్రేష్ఠులు సన్నిహితులుగా లేనప్పుడు దూరమునకు పోయి అయినను వారివద్ద అన్న భిక్షమును అమృతముగా ప్రార్థించి యతులు స్వీకరింపవలెను. అట్లు దొరకనిచో జలపానము మాత్రము చేసి యారకుండవలెను అని భావము. అయితే ఇందులో యతులే అట్లు చేయవలెనని విశేషించి చెప్పబడలేదే ఇది యతిధర్మముగా నెట్లు నిశ్చయింపవచ్చును. అనినచో గృహస్థుల ధర్మములో

అన్నం నప్రతిగృహ్ణీయాత్ప్రాణైః కంఠ గతైరపి ।

అని అన్న ప్రతిగ్రహము నిషేదింపబడినందున అన్న ప్రతిగ్రహ యోద్యత యతి బ్రహ్మచారులకే యుండును. అందు యతులుత్తమాశ్రయులు కావున వారికి ముందీవిధి వర్తించునని తెలియవలెను. కాబట్టి శ్రీవైష్ణవ గృహమందు యోగ్యతను గమనించి యథా యోగ్యముగా గ్రాసమాత్ర భిక్షణమును గాని నిమంత్రణ భోజనమును గాని స్వయముగా ప్రార్థించి ఏకభిక్షారూపముగా స్వాచార్య విలక్షణ భాగవత గృహభోజనము గాని యతులాచరించుట శాస్త్ర సమ్మతమని తెలియవలెను.

ఇంకను యతులు ఒకనాడు భిక్షమును స్వీకరించిన గృహస్థుని యింట మరియొక నాడు స్వీకరింపరాదను నియమము లేదు. అట్టి నియమము గృహస్తులకే చెందును. వారు స్వయముగా కోరి ఒక్కొక్క రొజుకొక్క యింట భుజింపవలెనే గాని వరుసగా కొన్ని దినములు భుజింపరాదు. భోజనమిదు వారి ప్రార్థనమును బట్టి

వారు గూడ కొన్ని దినములు భుజించుట తప్పుకాదు. ఇక యతులకా నియమములేదు. **నాన్న దోషేణ మస్కరీ** అని యుండుట వలన కాలాది దోషము యతుల భిక్షమున కుండదు. అటులనే ఆయావిశేష సమయములందే యతికి భిక్షమునిడవలెనని నియమము గృహస్థులకు గూడలేదు. కాబట్టి శక్తులై ఉండిన గృహస్థులు ప్రార్థించినన్ని దినములు యతులేక భిక్షమును స్వీకరింప వచ్చును అని యతి ధర్మసముచ్చయములో గలదు. అందు ఏడవ పర్వములో

కాలేవాయదివా కాలే యది సూర్యాగతోగృహే।

పితౄనుద్దిశ్యదాతవ్యం పితౄణాం తృప్తి మిచ్ఛతా ॥

అనగా పితరుల అబ్దికాది దినములలో గాని అట్టిది తటస్థింపని కాలమందు గాని యతి భిక్షమునకు స్వగృహమునకు వచ్చినచో తన పితరులు నుద్దేశించి విశేష విధిగా ఏకభిక్షను సమర్పించుట పితృతృప్తి కొరకు గృహస్థ ధర్మము అని భావము. ఈ వచనములో సూరి శబ్ధము

గురుస్సూరీభిక్షురితి ముముక్షుశ్శ్రోత్తమాశ్రమీ

అను కోశవచనము ప్రకారము యతినే చెప్పుచున్నది. ఇంకను యతి పూజనము భగవత్ప్రీతికరమని గూడచ మహాభారతములో

యత్రభిక్షురహం తత్ర వర్తేయం విద్ధి పాండవ ।

పూజితే పూజితో ఉహం వై పూజితాః సర్వాదేవతాః ॥

అను వచనమును చేత చెప్పబడినది. మరియు

బ్రాహ్మణానాంతు కోట్యాం వై యతిరేకో విశిష్యతే ।

సకృద్భుక్తేన యతినా పితృ దేవాః సవాసవాః ।

సర్వే తే తృప్తి మాయాంతి బహువర్షాణి పాండవ ॥

అనగా ఒక యతి కోటి బ్రాహ్మణులతో సమానుడు, అట్టి యతి ఒక్కసారి భుజించినచో పితరులు దేవతలు ఇంద్రుడు అందరును అనేక సంవత్సరములు తృప్తులగుదురు అని గూడ చెప్పబడెను. కాబట్టి శక్తుడగు గృహస్థుడు యతి అర్థించినప్పుడెల్ల భిక్షమునిచ్చుచుండవచ్చును.

యతులకు భోజ్యాభోజ్యాన్న వివరణము

యతులు గృహస్థుల ఆదరాహ్వానము పైని ఏక భిక్షాటనము చేయవచ్చునని ఇది వరలో చెప్పబడెను. అయితే అట్టి భిక్షా భోజనములో గూడ ఈ క్రింది నియమములను పాటింపవలెను. యతి ధర్మ సముచ్ఛయములో చెప్పబడిన

ఆతిథ్య శ్రాద్ధ యజ్ఞేషు దేవ యాత్రోత్సవాదిషు ।

కుతూహలేన సర్వత్ర సగచ్ఛేద్యతిరాత్మవాన్ ॥

అనగా ఆత్మజ్ఞాన సంపన్నుడగు యతి ఏకభిక్షారూపమగు ఆతిధ్యము నందు గాని, శ్రాద్ధమందు గాని యజ్ఞము నందు గాని దేవోత్సవాదుల్లో గాని జిహ్వాచాపలము కొలది కుతూహలముతో వెళ్లకూడదు అను వచనము ప్రకారమును,

వ్రతావిరుద్ధం యద్య స్యతదన్నం భక్షణం భవేత్

ధాతుః ప్రకుప్యతే యేన తదన్నం వర్జయేద్యతి

అనగా యతి తన ఆహార నియమమునకు విరుద్ధము కానట్టియు, శుక్రధాతువునుద్రేకింప జేయనట్టి పదార్థములను భుజింపవలెనను జాబాలి వచన ప్రకారమును యతులు వర్తింపవలెను.

జాబాలి వచనములో చెప్పబడిన నియమములో ధాతు ప్రకోపమును కలిగించు పదార్థమును విడచుట ఎందుకనగా,

అన్నసంగాద్బలందర్పో విషయాసక్తి రేవ కామః క్రోధ స్తథా లోభః పతనం నరకేతతః

అను వచన ప్రకారము ఆహారములోని ధాతూ ద్రేక కర పదార్థ దోషము వలన శరీర బలము పెరిగి గర్వము విషయాసక్తి కోరిక లధికమగుట, అవి తీర్చుకొనుట కాశ, అవి తీరనప్పుడు క్రోధము, తుదకు నరక ప్రాప్తి కలుగును. కాబట్టి

అత్యల్ప మతి శుష్కంచ భైక్షమన్నం సుఖావహమ్ ।
తస్మా త్సర్వ ప్రయత్నేన భైక్షమన్నం చరేద్యతి ॥

అనగా చాలా స్వల్పము గాను ద్రవాహారమధికముగా లేకుండను నుండు భిక్షాన్నమును యతి భక్షింపవలెను. దాని వలన సుఖము కలుగును అని చెప్పబడెను. అన్నము తప్ప పాలు పెరుగు పండ్ల రసములు భిక్షములో యతి భుజింపరాదు. ఈ విషయమే

దధి భిక్షా పయో భిక్షా యేవా యాచిత భోజనాః ।
సర్వేతే భైక్షభిక్షస్య కలాం నార్హంతి షోడశీమ్ ॥

అను ప్రమాణ వచనము చెప్పుచున్నది. ఇట్టి నియమము పాటింపవలసి యున్నను వైష్ణవ యతులు భగవన్నివేదితమగు నట్టి అతి పావనమైన పదార్థములలో పై నియమములను పాటింపక భగవత్ప్రసాదోల్లంఘన దోషము రాకుండ అగ్ర్య భోజనముగా కాక స్వల్ప భిక్షారూపముగా భుజింపవచ్చునని ఈక్రింది ప్రమాణములు చెప్పుచున్నది.

పవిత్రం భగవద్భుక్తం యేసదాహ్యుపభుంజతే ।
భవంత్య రోగాస్సుఖినః పాపదోష వివర్జితాః ॥
బ్రహ్మచారీ గృహస్థోవా వానప్రస్థో ఉ థ భిక్షుకః ।
ప్రాపణం భగవద్భుక్తం భుంజతే చాగ్ర్య భోజనమ్ ॥
శేష భుక్తం ప్రశంసంతి మునయో హరిగోచరాః ।
యువానః ఖలు వాంఛంతి తాంబూలం తరుణీముఖాత్ ॥

అని విజ్ఞానేశ్వరీయములో నుదాహరించిన వాయుపురాణ వచనమును, ఇంకను ఆ విజ్ఞానేశ్వరీయములోనే

గ్రాస మాత్రం భవేద్భిక్షాపుష్కలం తచ్చతుర్గుణమ్ ।
హన్తేతి తచ్చతుర్భిః స్యా దగ్ర్యంతత్త్రిగుణం భవేత్

అని చెప్పబడెను. దాని భావమేమనగా, ఒక గ్రాసము (ముద్ద) భిక్షయనియు నాలుగు గ్రాసములు పుష్కలమనియు నాలుగు పుష్కలములు హస్త అనియు అట్టివి మూడు అగ్ర్యమనియు భోజన ప్రకారములలో భేదము చెప్పబడెను.

దీని వలన అగ్ర్య భోజనమనగా నలువదెనిమిది గ్రాసమాత్రమగు భిక్షారూపముగానే స్వీకరింపవలెను. అగ్ర్యముగా భుజించుట యుక్తము కాదు.

ఏతదాచార సంయుక్తైః ప్రసన్నై ర్వైష్ణవైః కృతమ్ ।

విష్ణో ర్నివేదితాన్నంచ భిక్షాంభక్ష్యాది కంచరేత్ ॥

అవైష్ణవ ద్విజాన్నేన యతి శ్శూద్రో భవేత్సదా ।

అను వచనానుసారముగా సదాచార సంపన్నులగు ప్రపన్న శ్రీవైష్ణవుల చేత పాకము చేయబడి విష్ణువునకు నివేదితమైన అన్న భక్ష్యాదులన్నియు యతులు గ్రాసమాత్రభిక్షారూపముగా భుజింపవలెను. అవైష్ణవులగు బ్రాహ్మణ మాత్రుల వద్ద భిక్షమును స్వీకరించినచో వైష్ణవ యతి శూద్రతుల్యుడగునని తెలియవలెను. అయితే

బ్రాహ్మణ క్షత్రియ నిశాం మధ్యే తద్భైక్షమాచరేత్ ।

తత్రాప్య సంభవే పూర్వాదాదధీ తోత్తరోత్తరాత్

అను వచన ప్రకారము యతులు భిక్షమును బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల వద్ద స్వీకరింపవచ్చుననియు, అందులో బ్రాహ్మణులు లభింపవనిచో క్షత్రియుల వద్దను వారు గూడ లభింపనిచో వైశ్యుల వద్దను స్వీకరింపవలెననియు నున్నందున పై వచనమునకు విరోధము కలుగునే అనినచో దానికి సమాధానము చెప్పెదము.

ప్రాజాపత్యం గృహస్థానాం బ్రాహ్మం సన్యాసినాం స్మృతమ్ ।

అను వచన ప్రకారము చతుర్ముఖ బ్రహ్మ యొక్క స్థానమునకు అర్హులగు ఆ ముముక్షుయతుల గురించి ఈ త్రైవర్ణికుల నుండి భిక్షాపరిగ్రహ విధి పుట్టినది. ముముక్షువులైన వైష్ణవ యతులను గురించి అవైష్ణవ ద్విజాన్నేన అను వచనము పుట్టినదని వివేకమును గ్రహించవలెను. కాబట్టి బ్రహ్మచారీ గృహస్తో వా అను వచన ప్రకారమున్ను, **ఏతదాచార సంయుక్తైః** అను వచన ప్రకారమున్ను దివ్యదేశమందలి శ్రీవైష్ణవ గృహములందు భగవన్నివేదిక ప్రసాదమును మాధూకర ప్రక్రియతో గాని ఏకభిక్షా ప్రక్రియతో గాని శ్రీవైష్ణవ ముముక్షు యతులు భిక్షము నాచరింపవలెను.

ఆశ్రమ చతుష్టయ సాధారణ భోజ్యా భోజ్య నియమము

పైని వివరించిన

యతిభోజన విధులలో బ్రహ్మచారీ గృహస్థోవా వానప్రస్థో ఉ థభిక్షుకః

ఇత్యాది వచనము ఆశ్రమ చతుష్టయ సాధారణముగా కనబడుచున్నది. అట్లయినప్పుడు

అన్నం సప్రతిగృహ్ణీయాత్ప్రాణైః కంఠగతైరపి ।

యత్యన్నం యతినా ప్రేషితం చయత్ ॥

అను వచన ప్రకారము గృహస్థులైన వారు ఎవరి వద్దను అన్నమును ప్రాణావసాన సమయము తటస్థించినను స్వీకరింపరాదనియు, యతులు భిక్షారూపముగా సంపాదించిన దానిలో నుంచి భగవన్నివేదితమై పవిత్ర గృహానీతమైనను ఇతరుల చేత పంపబడినచో దానిని గృహస్థులు స్వీకరింపరాదనియు తెలియుచున్నది కదా. గృహస్థులు ప్రాపణం భగవద్భుక్తం భుంజతే అను వచనమును బట్టి అన్నమును అర్హమైనప్పుడు స్వీకరింపవచ్చునని చెప్పబడినదే. ఈ రెండు విధులకు ఎట్లు సమన్వయము కుదురుననిచో సామాన్యముగా

గృహస్థులు దివ్యదేశమందలి భగవన్నివేదిత ప్రసాద రూపమగు అన్నమును తప్ప సామాన్య గృహముల నుండి అనివేదితాన్నమును స్వీకరింపరాదు. అటులనే యతులు పవిత్రమగు మాధుకర గృహీతాన్నమునైనను ఇతరుల చేత పంపినచో వారి కరస్పర్శ దోషముండును గాన స్వీకరింపరాదని సమన్వయము చేయవలెను. పై వచనములలో **యత్యన్నం యతినా ప్రేషితమ్** అని రెండు విధములుగా చెప్పబడినది. అందు యత్యన్నమనగా యతులు భిక్షారూపముగా సంపాదించిన అన్నమనియు చెప్పవచ్చును. లేక యతి స్వదేహపోషణార్థము భ్రాంతుడై స్వయముగా పాకము చేసిన అన్నము అనియు చెప్పవచ్చును. అటులనే యతినా ప్రేషితమనగా దివ్య దేశ భగవచ్ఛేషరూప ప్రసాదముగాని మాధుకరరూపముగా భిక్షాటనము చేత సంపాదించిన దానిలో నుంచి తీసిగాని యతి పంపినది అని యర్థము చెప్పవచ్చును. కాబట్టి దివ్యదేశ శ్రీవైష్ణవ గృహాధిష్ఠిత భగవత్ప్రసాదము ఆశ్రమ చతుష్టయము వారికిని ప్రార్థనీయమును పరమభోగ్యమునునై శేషభుక్తం ప్రశంసన్నిత అను వచన ప్రకారము శ్రేష్ఠమగును.

యతుల దేహయాత్రాద్వైవిధ్యము

యతులకు స్వదేహయాత్ర కొరకు రెండు విధములుగా నాచరణము చెప్పబడినది. సామాన్యముగా శ్రీవైష్ణవ గృహములందు మాధుకర ప్రక్రియలో మూడు, ఆరు, ఏడు, ఎనిమిది స్థలములలో సంపాదించిన ఆహరముతో దేహయాత్రను జరుపుకొనుటొకటి. భగవన్నివేధితమై తత్తద్గృహస్థ ప్రార్ధనామూలమున సమర్పింపబడిన ఏకభిక్షారూపముగా లభించిన ఆహారముతో దేహయాత్రను గడుపుట ఇంకొకటి. ఇందు మొదటి దానికి ప్రమాణము. షట్త్రీన్వాపి ఇత్యాది వచనము, రెండవదానికి మహాభారతోత్తర భాగమగు హరివంశము నందు చెప్పబడిన ప్రత్యక్షజ్ఞాన సంపన్నాః అని మొదలుకొని

భోజయామాసతా స్సర్వాన్యతీన్యతి పరార్చితః

అను వరకు నుండు వచనములు ప్రమాణములు. ఇందు మొదటిది సామాన్య దేహ యాత్రా ప్రకారము. అదియే యతుల సంతతాచరణీయము. రెండవది తత్తద్విశేష సమయములలో నాచరింపదగినదని వివేకము గ్రహింపవలెను. దీనినే యతిధర్మసముచ్చయములో

అప్రమత్తశ్చరే ద్భైక్షం సాయాహ్నే వాపి లక్షితః।
రహితేభిక్షుకై ర్గ్రామే యాత్రా మాత్ర మలోలుపః॥

అని చెప్పబడెను. దీని అభిప్రాయమేమనగా, జాగ్రత్తగా యతి సాయంకాల పర్యంతము నిరీక్షించియైనను మాధూరక భిక్షము నాచరింపవలెను. అట్లు భిక్షమును సంపాదించుట కదివఅలో భిక్షుక యతులు లేని గ్రామమై భిక్షా ప్రధాన మందహితులుగా నుండని గృహస్థులు కలిగియున్నప్పుడు అనుకూల్యము చొప్పున నానాటికి దేహయాత్రార్థము ఏకభిక్షాప్రక్రియతో నొక గృహస్థుని యింట భిక్షమును స్వీకరింపవచ్చునని తెలియవలెను.

యతులకు భిక్షాచర్యయందలి నియమములు

శ్రోత్రియేషు మహాత్మసుభైక్షం నిత్యం చరేద్యతిః అను ప్రమాణమును బట్టి ఒక గ్రామములో నిత్య. నివాసము ఏర్పరచుకొని యుండు యతి శ్రోత్రియులును మహాత్ములును అగు గృహస్థుల యిండ్ల యందే మాధుకర భిక్షమును గాని ఏకభిక్షమునుగాని అచరింపవలెను. నాన్న దోషేణ మస్కరీ అను విధి సూర్య వత్సంచరేద్యతిః అను వచన ప్రకారము గ్రామైకరాత్రముగా సంచరించు అవైష్ణవ సన్యాసుల విషయమై వర్తించును. కాని గృహస్థ చరిత మెతిగియుండిన ఏక గ్రామస్థ యతులకు వర్తింపదు. ఇంకను

నోత్పన్నా సంతతిః కాచిద్యత్ర స్త్రీ పుంసయోర్గృహే
నాశ్నీయాత్తద్గృహే భిక్షుర్భుక్త్వా చాంద్రాయణం చరేత్ ॥

అను వచనము ఏ గృహస్థుని ఇంట స్త్రీ పురుష రూప సంతాన మేదియు నుండదో ఆ యింట శ్రీవైష్ణవ యతి భిక్షమును స్వీకరింపరాదు. మరియు

దృష్టం భ్రూణహ పాషండైః కుష్టరుగ్ణైరుదక్యయా ।
శ్వషండకాక చండాలై రన్యై ర్వాన్త్యావ సాయిభిః ॥
పశ్యం శ్చేత్తాన్నభిక్షేత భుక్త్వా చాంద్రాయణం చరేత్ ॥
నశిష్య బన్ధు మిత్రాదీన్ భిక్షాం విప్సేత కర్హిచిత్

అనగా యతి తాను భిక్షమును స్వీకరించునప్పుడు ఆ క్షిక్షాన్నమును భ్రూణహత్య చేసిన వారు (గర్భస్థ పిండమును చంపిన వారు) పాషండులు కుష్ట రోగులు రజస్వలలు శునకములు నపుంసకులు కాకులు చండాలులు, ఇతరములైన అంత్యజాతులు వారు చూచినట్లు తాను కని యుఇడి గూడ దానిని పరిగ్రహింపరాదు. అట్లు స్వీకరించినచో చండాలులు ఇతరమైన అంత్యజాతుల వారు చూచినట్లు తాను కనియుండి గూడ దానిని పరిగ్రహింపరాదు. అట్లు స్వీకరించినచో చాంద్రాయణమును చేయవలెను. అటులనే యతి తనకు శిష్యుడైన వాని వద్దను పూర్వా శ్రమములో దేహబంధువు మిత్రుడు అయివున్న వాని వద్దకు భిక్షమును కోరి స్వీకరింపకూడదు. అటులనే

అథది గ్వాసనీం కన్యాం గర్భిణీం మలినాం తథా ।
ప్రమత్తాం రుదితాం క్రుద్ధాం భోక్తుమన్నం సముద్యతామ్ ॥
ముక్త కేశీం సుఖాసీనాం స్వైరిణీం కామచారిణీమ్ ।
సరాగాం విషయాసక్తాం సఖేదాం వ్యాధి పీడితామ్ ॥
నిర్లజ్జాం బంధకీం శ్రాంతాం ప్రేష్యాం క్లీబాం సునిష్ఠురామ్ ।
భిక్షాం భిక్షుర్నభిక్షేత పాయయంతీం శిశుం స్తనమ్ ॥

అనగా ఒక గ్రామములో నివసించు యతి ఆగ్రామమందలి శ్రోత్రియ గృహస్థుడు కార్యాంతరముచే గ్రామాంతరమునకు వెడలియున్నప్పుడు అతని భార్య స్త్రీ యైనను ఆమె వలన భిక్షమును స్వీకరింపవచ్చును. కాని ఆమె ఈ క్రింద చెప్పబడిన దోషయుక్తురాలైనచో నచ్చట భిక్షమును స్వీకరింపరాదు. ఆదోషము లేవనగా తాను భిక్షమునకు వెళ్ళునపుటికి దిగ్వసన (చిన్న గుడ్డ కట్టు కొన్నదై) గా నుండి అందువలన తాను స్వయముగా

సమర్పింపక పెండ్లి కాని కన్యచేత భిక్షమును పంపినదియు, గర్భవతిగా నుండి నదియు, స్నానమాచరింపక మలినముగా నుండినదియు, శరీరమందు స్మారకము లేనిదియు, ఏడ్చుచున్నదియు, కోపముతో నుండినదియు, తాను భోజనమునకు సిద్ధపడుచుండునదియు, తల విరియబోసికొనినదియు, తాను పోవునప్పటికి సుఖాసీనయై యుండినదియు, దుస్స్వతంత్రురాలుగా కన్పట్టినదియు, వ్యభిచారిణియు, తనయందు అనురాగము చూపునదియు, అన్య విషయముల యందాసక్తి కలదియు, విచారముతో గూడినదియు, వ్యాధిచేత పీడింపబడుచుండినదియు, లజ్జలేనిదియు, కులటగా గన్పట్టినదియు, అలసిపోయియున్నదియు, అసలు యజమానురాలు కాక ప్రేష్యురాలుగా నుండినదియు, సంతానము లేనిదియు, నిష్ఠురముగా మాటలాడునదియు, తాను పోవునప్పటికి బిడ్డకు పాలిచ్చుచున్నదియు అయి యుండు స్త్రీ వలన భిక్షమును పరిగ్రహింపరాదని భావము.

భిక్షాన్న భోజన స్థలా స్థలాల నిర్ణయము

యతులు తాము మాధూకర భిక్షము నాచరించి సంపాదించిన భిక్షాన్నమును

గ్రామాన్తేచ వనే రణ్యే తటాకే విజనే నదీ ।
పులినే పుష్కరిణ్యాంచ తదన్నముపభుంజతే ॥

అను యతి ధర్మసముచ్చయ వచనమునుబట్టి గ్రామ బహిర్భాగమందు గాని, తోట యందు గాని, అడవి యందు గాని, తటాక ప్రాంతమందు గాని, నది యొడ్డున గాని, జనసంచారము లేని స్థలమందు భుజింపవలెనని తెలియుచున్నది. ఈ విధి గ్రామైకరాత్రముగా సంచరించి భిక్షాటనము చేయు యతుల విషయములో చెప్పబడినదని తెలియవలెను. అట్టి వారికి విజన ప్రదేశ మాయా స్థలముల యందే లభించునని తాత్పర్యము. అట్లు కాక ఒక గ్రామములోనే దివ్య స్థలము నుండి పవిత్ర ప్రపన్న శ్రీవైష్ణవ గృహములు గల చోట నిత్య నివాసముగా నుండిన శ్రీవైష్ణవ యతులు అట్లు వివిక్త ప్రదేశములను వెదకికొనిపోవక్కర లేదు. తామున్న వివిక్త గృహ (మఠ)మందు గాని దేవలయైక దేశమందు గాని భిక్షాన్నమును భుజింప వచ్చును. పై వచనమునకు యతి భుజించుటకు విజన ప్రదేశ మావశ్యకమనియే తాత్పర్యమై యుండును.

కాబట్టి జన సంచారము గల బహిరంగ ప్రదేశములో యతులు భుజింపరాదు.

ప్రసంగవశము నింకొక అంశమును చెప్పుచున్నాము. సామాన్యముగా ప్రతివాదును శరీరారోగ్యము మానసిక పరిశుద్ధి కోరుచు ఆహారమును భుజింపచున్నప్పుడు ఆహార నిర్హార విహార యోగా స్సదా మనుష్యై ర్విజనే విధేయాః అను మొదలగు ఆరోగ్య విధులను అనుసరించి ఆహారమును భుజించుట మల మూత్ర విసర్జనము స్త్రీ సంయోగము అనునవి నిజన ప్రదేశమందే చేయవలెనని విధి యుండుట చేత విజన ప్రదేశమును చూచుకొనియే చేయవలెను. అట్టి నియమము వలన శరీరారోగ్యమే కాక మానసిక పరిశుద్ధి గూడ సిద్ధించును. దీనిని మూలముగా చేసికొనియే శ్రీవైష్ణవ బ్రాహ్మణులందరును వివిక్త ప్రదేశమందే (స్వబంధు మాత్ర మధ్యమున) ఆహారమును భుజించుట ఆచారముగా బెట్టుకొనిరి. కాబట్టి పరమైకాంతులగు యతులు మానసిక శుద్ధి కొరకు పైనియమమును పాటించుట అత్యావశ్యకమై యుండును.

ఇక దివ్యదేశములలో భగవదాలయముల యందు భగవత్సన్నిధానమున తన్నివేదిత చిత్రాన్న భక్ష్యాదులు శ్రీవైష్ణవ గోష్టిలో దృష్టిదోషమును పాటింపక భుజించుట శ్రీవైష్ణవ బ్రాహ్మణులకు నిషిద్ధము కాదు. దానికి కారణము భగవత్సన్నిధాన మహత్త్వమును తలంచుటయే అని తోచును. ఏమనగా

విష్ణ్వాలయ సమీపస్థాన్ విష్ణు సేవార్థమాగతాన్

చండాలాన్ పతితాన్ శూద్రాన్ స్పృష్ట్వాన స్నానమాచరేత్ ॥

అను విశిష్ట ధర్మశాస్త్ర వచనము చొప్పున విష్ణు సన్నిధి యందు అస్పృశ్య స్పర్శనమే భగవత్ప్రభావము చేత దూష్యము కానప్పుడు అట్టి వారి దృష్టి వలన కలుగు దోషము భగవత్ప్రభావము వలన నుండదని తెలియవలెను.

యతులు భగవత్సన్నిధిలో నైనను వివిక్త ప్రదేశములోనైనను క్షారలవణవర్జమష్టౌ గ్రాసా నేవ భుంజీత అను వచనము ప్రకారమును, **జిహ్వా చాపలయుక్తస్తు సయతిః పతితోభవేత్** అను వచన ప్రకారమును క్షార లవణోద్రిక్త పదార్థములను పరిమితముగానే స్వీకరింపవలెనని తెలియవలెను.

యతుల నివాసాది నిరూపణము

శ్రీవైష్ణవ యతులు కాక సామాన్య యతులుకు ఈ క్రింది నియమములు యతిధర్మ సముచ్చయములో చెప్పబడినది,

ఉదితే ఽ న్యత్ర మధ్యాహ్నే అన్యత్రాస్తమితే రవౌ ।

దృశ్యతేత్వనికే తత్వా త్సూర్య వత్సంగ వర్జితః ॥

అనగా సంగవర్జితులగు యతులు ఒక నివాసము నియతముగా నుండువారు కానందున సూర్యుని వలె ఉదయమొక చోట మధ్యాహ్న మొకచోట సాయంకాలము ఒక చోట గన్పట్టుచుండుననియు,

గ్రామే దినం పురే త్రీణి నగరే పంచ సప్తవా ।

తిష్ఠేదేకత్రవర్షాసు వ్రజేత్ సూర్యోదితేపథి ॥

అనగా సామాన్య యతి చిన్న గ్రామములో నొకరోజు చిన్న పురమందు మూడు రోజులు పెద్ద నగర మందు అయిదేడు రోజులు నివసింప వలెను. వర్షాకాలమందు మాత్రమొక్క చోట నుండవచ్చును. తిరిగి సూర్యదర్శనమైనంతనే దారిని సంచారము చేయవలెను అనియు నుండుట చేత ఆయానియమాను సారముగా సంచరింపు చుండవలెను. అట్లే

నాధ్యేతవ్యం న పక్తవ్యం న శ్రోతవ్యం కథం చ న ।

ఏతైః పూర్వం సునిష్పన్నో యతి ర్భవతి నాన్యథా ॥

నతీర్థవాసీ నిత్యం స్యాన్నోపవాస పరోయతిః ।

స చాధ్యాపన శీలస్స్యాత్ సవ్యాఖ్యాన పరోభవేత్ ॥

పంథానమపి పృచ్ఛేత్తు భిక్షాం దేహీతిచ ద్వయమ్ ।

ఏతదేవ వ్యాహరణం సర్వ మన్యన్నిషిద్యతే ॥

ఆసనం పాత్రలోపశ్చ సంచయ శ్శిష్య సంగ్రహః ।

దివాస్వాపో వృథా జల్పోయతేనాం పతనాని షట్ ॥

ఈ ఆరును యతులకు పతనహేతువులు,అని చెప్పబడినవిధులను గమనించి యతులు వర్తించవలెను మరియు

ఆసనం కటి సూత్రం చ కౌపీనం కటివేష్టనమ్ ।
యజ్ఞోపవీతం కంథాంచ సంగృహ్యాస్య త్పరిత్యజేత్ ॥
శిఖాం యజ్ఞోపవీతం చ శౌచార్థమపికుండికామ్ ।
సర్వదా ధారయేద్గచ్ఛ న్నాసీనో వాపి వా శుచిః॥
త్రిదండాసన పాత్రేదే ర్నవియోగం కథంచన ।
వియోగాత్పతతే భిక్షుః ప్రాయశ్చిత్తం విధీయతే ॥
దివారాత్రం సదైకాకీ తూష్ణీ మాసీత చింతయన్ ।
సంగుప్త వాఙ్మనశ్చక్షుర్గుప్త గుహ్యః కృతాహ్నికః ॥
సుగుప్తం భైక్షమాహృత్య సుగుప్తం భోజనం చరేత్ ।
తైలాభ్యంగః సుమృష్టాన్నం తాంబూలం స్త్రీషు భాషణమ్ ।
దివాస్వాపో వృథాలాపో యతీనాం పతనానిషట్ ॥

అనగా దర్భాసనము మొలత్రాడు కౌపీనం కట్టుకొను కాషాయము యజ్ఞోపవీతము పరుండుటకు బొంత వీనిని యతి ఉంచుకొనవచ్చును. మిగిలిన దైహికోపకరణములు పరిత్యజింపవలెను. అట్లే శిఖా యజ్ఞోపవీతములతో పాటు శౌచక్రియ కొరకు కమండలము అను దానిని తిరుగుచున్నప్పుడు గూడ నెప్పుడు ధరించియే ఉండవలెను. త్రిదండము ధర్భాసనము కమండలమును ఏవిధములోను వదలి యుండరాదు. వానిని విడచినచో ప్రాయశ్చిత్తమును చేసికొనవలసియుండును. రాత్రి పగలు కూడ నొంటరిగానే యుండి హరి చింతనమును చేయుచుండవలెను, మాటలాడరాదు, వాక్కును మనస్సును దృష్టిని ఇతర విషయములలో ప్రసరింపకుండునట్లు సంరక్షించుకొనవలెను. అట్లే గుహ్యమును సంరక్షించుకొనుచుండవలెను.

ఆహ్నిక క్రియలను తప్పక ఆచరింపుచుండవలెను. భిక్షాన్నమును కప్పి పుచ్చి తెచ్చుకొని విజన ప్రదేశమందు భుజింపవలెను. తైలాభ్యంగము, రుచియగు భక్ష్యాదులు, తాంబూలము స్త్రీలతో సంభాషణము పగలు నిద్రపోవుట వృథా భాషణము అను ఆరింటిని పతనహేతువులుగాన వర్జింపవలెను. అని ఈవిధముగా చెప్పబడిన యతి ధర్మ సముచ్చయోక్త వచనముల ప్రకారము సామాన్య యతులు ప్రవర్తింపవలెను.

ఇక ముముక్షువులై విశిష్ట ధర్మశాస్త్ర నిష్ఠులగు నట్టి భగవద్భాగవత శేషత్వ జ్ఞానాద్యన్విత శ్రీవైష్ణవ యతులు పై వచనములలో తమకనురూపమగు ధర్మముల నాచరింపుచు దివ్యదేశ వాసము శ్రీవైష్ణవ గృహముల యందు మధూకర ఏకభిక్షా రూప ద్వివిధ భిక్షాచర్యను చేయుచు విశిష్ట ధర్మ ప్రధానముగా ఆచరింపుచుండవలెను.

భిక్షా పంచక వివరణము భగవత్ప్రసాద మహిమ ఇది వరలో చెప్పిన

మాధుకరమ సంక్లుప్తం ప్రాక్ప్రణీతయయాచితమ్ ।
తాత్కాలిక ముపక్లుప్తం (తాత్కాలికోప సంపన్నం) భైక్షం పంచ విధం స్మృతమ్ ॥

అను భిక్షా పంచక వివరణము నిచ్చుట చేయుదుము. మాధుకరమనగా తుమ్మెద ఆయాపుష్పముల నుండి కొంత కొంత మకరందమును తీసి తెచ్చినట్లు కొన్ని నియత సంఖ్య గల గృహముల నుండి సంపాదించు భిక్షము అసంక్లుప్తమనగా నిదియొక పక్షములో మాధుకరమునకే విశేషణము. దీని వలన ఆయా గృహస్థులు ప్రత్యేకముగా యతి భిక్షము కొరకు విశేషించి సిద్ధపఱుపక యథా క్లుప్తమైనదని అర్థము వచ్చును.

ప్రాక్పణీతమనగా యతి తన అనుష్ఠానమును ముగింపక పూర్వమే గృహస్థుడు వచ్చి యతి నర్థించి విశేష విధిగా నేక భిక్షారూపముగా సమర్పించినది. అయాచితమనగా గృహస్థుని వాకిలి యందు యతి వచ్చి భిక్షాందేహి అని యాచించకుండనే గృహస్థుడు వచ్చి ఈ రోజు భిక్షాందేహి అని యాచించకుండనే గృహస్థుడు వచ్చి ఈ రోజు మాయింటనే తాము భిక్షమును స్వీకరింపవలెనని ప్రార్థించి సమర్పించునది.

ఉపక్లుప్తముగా యతి అశక్తుడై తన మఠములోనే ఉండిపోయినను గృహస్థులు తమంతట తామే తెచ్చి సమర్పించునది. ఇక్కడ తాత్కాలికోప సంపన్నమ్ అని పాఠాంతరము కలదు. ఆ పక్షములో భిక్షా పంచకత్వ సిద్ధి కొరకు అసంక్లుప్తం అనునది మాధుకరమునకు విశేషణముగా చెప్పక ప్రత్యేకించి తాత్కాలిక భిక్షారూపమైన భిక్షమే అని గ్రహింపవలెను.

ఇందలి మాధుకర భిక్షము యతి సామాన్యము విషయమునను, మిగిలిన నాలుగు విధములగు ఏక భిక్షములను శ్రీవైష్ణవ ప్రపన్న యతుల విషయము మాత్రమునను విధింపబడినట్లు వివేకింపవలెను. అందు వలన శ్రీవైష్ణవ యతులకు భగవన్నివేదితమై శిష్ట శ్రీవైష్ణవ గృహస్థ సమర్పితమైన పంచవిధ భిక్షమును పరిగ్రాహ్యమనియు, భగవన్నివేదిత పదార్థము తాంబూలము తరుణీముఖాత్ అనునట్లు వాంఛనీయమును

నపర్యుషిత దోషో స్తి .... మత్ప్రసాదం సుపావనం

అను ప్రమాణమును బట్టి ఆ నివేదిక పదార్థమునకు ఉండెడి దోషములు లేక పావనమగుననియు తెలియదగును.

అవైష్ణవ గృహనివేదితాన్నాదులత్యాజ్యత

స్వతః శ్రీవైష్ణవ కులమందు జన్మించియు అవైష్ణవ సహవాసాదుల చేత వైష్ణవాచార రహితులైన వారు అవైష్ణవులుగానే పరిగణింపబడుదురు. అట్టి గృహస్థుల గృహములందలి అన్నము భగవన్నివేదితమే అయినను ఆ నివేదితాన్నము వలెనే అన్నము భగవన్నివేదితమే అయినను ఆ నివేదితాన్నము వలెనే శ్రీవైష్ణవ యతులు భిక్షారూపముగా పరిగ్రహింప తగదు. కాబట్టి చక్కగా విచారించియే భిక్షా పరిగ్రహము చేయవలెను.

అవైష్ణవకృతం ప్రపన్నో మాంసవత్త్యజేత్

ఇత్యాది ప్రమాణ వచనములను బట్టి ప్రపన్న యతులు అవైష్ణవ కృతములై సమర్పితములైన తక్రాది సకల పదార్థములను పరిత్యజింపవలసి యుండును.

తైలపక్వంచ తక్రంచ శూద్రస్యాపి నదుష్యతి

అను ధర్మశాస్త్ర వచనము సామాన్య గృహస్థాదుల విషయముగా చెప్పబడెనని గ్రహింపవలెను.

మరికొన్ని వైష్ణవత్వ భంజక దోషములు

ప్రసంగవశమున అవైష్ణవ సహవాసాదులతో పాటు మఱికొన్ని గృహస్థావైష్ణవత్వాపాదక దోషముల నిచ్చుట చెప్పెదము. పరాశర సంహితలో

రోగాదౌ ప్రథమర్తౌచ నిషేకాది క్రియాసుచ ।
నవగ్రహ జపం హోమం పూజనం వర్జయేత్సుధీః ॥

అనగా శ్రీవైష్ణవ గృహస్థుడు తన యింట నెవరికైనను శరీరారోగ్యము బాగుండనప్పుడును, కన్యక దుష్టనక్షత్రాదులలో ప్రథమ రజస్వల అయినప్పుడును, నిషేకాది (రజస్వల కాని పడుచుకు ప్రతి సంయోగము చేయించుట మొ) కర్మను చేయించవలసిప్పుడును, నవగ్రహముల నుద్దేశించి జపహోమార్చనాదులను చేయకూడదు. భగవదారాధన రూపమగు వైభవేష్ట్యాదికమునే చేయవలయును. మఱియు

యః కుర్యాత్కామతో వాపి శిశుభి స్సహ భోజనమ్ ।
సజీవన్నేవ చండాల స్సయాతి నరకం ధ్రువమ్ ॥

అనగా శ్రీవైష్ణవ గృహస్థుడు ముద్దుచేత నైనను చిన్న పిల్లలను చేర్చుకొని ఏకపాత్రలో భోజనము చేయరాదు. అట్లు చేసి ప్రత్యవాయత్వమును పొందును. అట్లే

మాయావాదం బౌద్ధశాస్త్రం యోవధే ద్వైష్ణవోత్తమః ।
సయాతి నరకం ఘోరం రౌరవం రోమసంఖ్యయా ॥

అనగా శ్రీవైష్ణవుడు అద్వైత సిద్ధాంతమందలి నాస్తిక వాదమును ఆదర పూర్వకముగా వివరించి చెప్పగూడదు. అట్లు చేసినచో ప్రత్యవాయమును పొందును. అయితే ఆయా సిద్ధాంతములను పరమత ఖండనార్థముగా వివరించుట నిషిద్ధము కాదు. ఉడైయవరులు శ్రీభాష్యమందట్లే కదా వివరించి యుండిరి.

వాణిజ్యం గణకత్వంచ వైద్యం కుర్యాన్న వైష్ణవః ।
ప్రపన్నవృత్త యుక్తో ఽపి సయాతి నరకం ధ్రువమ్ ॥

అనగా శ్రీవైష్ణవుడు ఐచ్ఛికముగా వర్తకము చేయుట, గణకత్వము (గుమాస్తాపని) చేయుట, వైద్య వృత్తిని చేయుట కూడదు. అట్లు చేసిన ప్రత్యపాయము కలుగును. కాని స్వజీవనము గడువని నాడు దానిని చేసినను ప్రత్యవాయముండదు.

మత్తీర్థం మత్ప్రసాదం చ దత్త్వా యోయాచత్ ధనమ్ ।
సజీవన్నేవ చండాల స్సదవై మాతృవిక్రయీ ॥
ఉక్త్వాద వేదమంత్రాదీ న్నిత్య నైమిత్తికాదిషు
విష్ణు గానాదికం త్వత్ప్రాయశ్చిత్తాది కర్మసు ॥
ధనాజీన్యాచతేయో సౌస్వపత్నీ విక్రయీ యథా ।
సయాతి నరకం ఘోరం తస్యాయుశ్శ్రీశ్చ నశ్యతి ॥

అనాగ భగవంతుని తీర్థ ప్రసాదముల నిచ్చి ధనమును కోరినను వేదమంత్రములను నిత్య నైమిత్కాది కర్మలలో విష్ణుచరిత్రలను గానము చేసినందులకును, ధనాదులను యాచించినను, అట్టివారు తమ భార్య నమ్ముకొను వారి వంటి ప్రత్యవాయమును పొందెదరు. అయితే సత్కార పూర్వకముగా ఎదుటివారు సమర్పించు

ధనమును పరిగ్రహింపవచ్చును.

శివభక్తైర్బౌద్ధభక్తై స్సహసంభాషణాదికమ్ ।

..... మాయావాది ద్విజాన్సమ్యగ్దూరతః పరివర్జయేత్ ॥

శివ భక్తులతోను బౌద్ధ భక్తులతోను మాయావాదులతోను సంభాషణ సహవాసాదులను వర్జింపవలెను ఇంకను

ఔపాసన మకుర్వాణః స్త్రియం వాయోఽ ధిగచ్ఛతి ।

స్వమాతృగమనే తుల్యమితి బ్రహ్మవిదో విదుః ॥

నిత్యకర్మయగు ఔపాసనము నాచరింపకుండ స్త్రీతో సంపర్కమును పొందినచో మాతృ గమన దోషమును పొందును.

ఔపాసనే దేవకార్యే పైతృకే ప్రత్యహం తథా । ... ప్రపన్నః పరమైకాంతీ యావనాళాన్నభక్షణాత్ ॥

శ్వానయో నిశతంప్రాప్య విష్ణుభక్తోభవేత్పునః ॥

తస్మా త్సర్వ ప్రయత్నేన క్షుద్ర ధాన్యాని వర్జయేత్ ॥

ఉపోదకీత్రయం సమ్యగ్లషునద్వయమేవచ । ... అలాబుత్రితయం తద్వత్

... ఏతన్నిషిద్ధ ద్రవ్యాణి సర్వదా వర్జయే ద్విజః ।

తద్విజ్ఞానస్య సిద్ధ్యర్థం విష్ణు సాయుజ్య హేతవే ॥

అనగా అగ్ని యందౌపాసన కర్మ చేయుటకును, భగవన్నివేదన కొరకును, పితృకర్మ కొరకును ప్రతి దినము భక్షణము కొరకును ప్రపన్నుడగు పరమైకాంతి జొన్నలు మొదలగు క్షుద్రధాన్యములను వాడుకొనరాదు. అట్లైన ప్రత్యపాయము కలుగును. మట్టు బచ్చలి తీగె బచ్చలి పుల్ల బచ్చలి, వెల్లుల్లి, నీరుల్లి, కొలని ఆనబకాయ, గుండ్రని ఆనబకాయ, పుచ్చకాయ ఇట్టి ధర్మశాస్త్ర నిషిద్ధములను ప్రపన్న ద్విజుడు వర్జింపవలెను. ఏలననగా, బ్రహ్మజ్ఞానము సిద్ధించి భగవత్సాయుజ్యము లభించుటకిని మనోమాలిన్య హేతువులై ప్రతిబంధకములుగా నుండును. ఇంకను ఇట్టి నిషేధ వచనముల నన్నిటిని గమనించి

యావచ్ఛరీరపాతాంతం పుత్రోత్పత్త్యాది కర్మసు ।

ప్రపన్న వృత్తి మేతాం వై ఆచరే ద్వైష్ణవోత్తమః ॥

అని చెప్పినరీతిని వైష్ణవోత్తములు దేహమున్నంత వరకు సామాన్య విశేష సమయములయందు, ఇట్టి ప్రపన్న వృత్తి నాచరింపుచుండవలెను. అట్టి వారి వద్దనే ఏతదాచార సంయుక్తైః విష్ణో ర్నివేదితాన్నే నభిక్షాం భక్ష్యాదికం చరేత్ అని చెప్పిన రీతిని శ్రీవైష్ణవ యతులు భిక్షమును పరిగ్రహింపదగును.

శాస్త్రీయ వివాహాది వివరణము

శ్రీవైష్ణవ గృహస్థులలో గృహ్య సూత్ర విధిని అనుసరించి షోడశకర్మలును వేద మంత్రపఠన పురస్సరముగా యథాకాలములో నాచరించుట శాస్త్ర విహితమై యుండును. పరాశర సంహిత మూడవ అధ్యాయములో

తతః కుర్యాద్వివాహాదీ న్బ్రహ్మమేధాన్తముత్తమమ్ ।

శ్రుతి స్మృతి విధానేన ప్రపన్న స్స్వాచరేత్సదా ॥

అని ఈ విషయమే చెప్పబడెను. అందు వివాహ విషయములో యమవచనమిట్లున్నది.

అష్టవర్షాభవేత్కన్యా నవవర్షాతు రోహిణీ ।

దశవర్షాభవేద్గౌరీ అత ఊర్ధ్వం రజస్వలా ॥

అనగా గృహస్థునకు ఆడపిల్ల జనించినచో ఆమెకు ఎనిమిది సంవత్సరములు వయస్సు వచ్చినప్పుడు కన్య అనబడును. తొమ్మిది సంవత్సరముల వయస్సులో రోహిణి అని చెప్పబడును. పది సంవత్సరముల వయస్సులో గౌరి అనబడును. అటు పిమ్మట పదకొండవ యేడు మొదలు రజస్వల అనబడును అని భావము. ఇట్లు వయోభేదమును బట్టి నామభేదము రెండుకు వచ్చినవనగా గృహస్థుడా పిల్లను ఒక సద్వరునిగా దానము చేయవలెను గాన ఆయా వయస్సులలో దానము చేసినప్పుడు తాను సద్గతిని పొందుటలోను దోషము కలుగుటలోను భేదముండుట చేత నట్లు నామభేదము చెప్పబడును. అట్టి సద్గత్యాది భేదమెట్టిదనగా దానిని గూర్చి బృహస్పతి యిట్లు చెప్పెను.

గౌరీం దదన్నాకపృష్టం వైకుంఠం రోహిణీం దదత్ ।

కన్యాం దద బ్బ్రహ్మలోకం రౌరవంతు రజస్వలామ్ ॥

యస్తాం వివాహయేత్కన్యాం బ్రాహ్మణో మదమోహితః ।

అసంభాష్యో హ్యపాంక్తేయ స్సవిప్రో వృషలీపతిః ॥

అనగా తండ్రి ఆడపిల్లను గౌరీనామము వచ్చిన తరువాత దానము చేసినచో స్వర్గమును పొందును. రోహిణి యను నమము వచ్చిన

కన్యాం దదబ్బ్రహ్మలోకం రౌరవంతు రజస్వలామ్ ॥

యస్తాం వివాహయేత్కన్యాం బ్రాహ్మణో మదమోహితః ।

అసంభాష్యోహ్యపాంక్తేయ స్సవిప్రో వృషలీపతిః ॥

అనగా తండ్రి ఆడపిల్లను గౌరీ నామము వచ్చిన తరువాత దానము చేసినచో స్వర్గమును పొందును. రోహిణి యను నామము వచ్చిన తరువాత దానము చేసినచో వైకుంఠము (కార్య వైకుంఠమను లీలా విభూతిలోని స్థానము) ను పొందును. కన్యయను నామము వచ్చిన తోడనే దానము చేసినచో బ్రహ్మ లోకము (పరమ పదము) ను పొందును. రజస్వల అను నామము వచ్చిన తరువాత దానము చేసినచో రౌరవ నరకము పొందును. మరియు అట్టి రజస్వలను ఏ వరుడు మోహము చేత పరిగ్రహించి వివాహమాడునో వాడు బ్రాహ్మణుడై యుండినను సంభాషణార్హుడు కాడు. పంక్తి భజనములో చేర్చుకొనతగడు. శూద్ర స్త్రీ భర్త వలె వానిని చూడవలెనని భావము. అట్టి రజస్వల నామము కలిగిన స్త్రీని వివాహమాడిన వానికి నిష్కృతి లేదని మనువు చెప్పెను. ఎట్లనగా

వృషలీ పీత శేషస్య నిశ్వాసోపహతస్యచ ।

తస్యాశ్చైవ ప్రసూతస్య నిష్కృతిర్నవిధీయతే ॥

అనగా రజస్వలా నామధారిణియగు స్త్రీ వృషలి (శూద్ర స్త్రీ) వంటిది గాన దానిని వివాహమాడి దాని పీత శేషము (తాంబూల రసాదుల)ను పరిగ్రహించుట చేతను, దాని ఊపిరి గాలిని పీల్చుట చేతను పురుషుడు

పతితుడగును. అట్టి స్త్రీకి జన్మించిన పుత్రునకును ఆ స్త్రీ పతికిని ప్రాయశ్చిత్తమే లేదు అని భావము. మరియు బృహస్పతి యిట్లు చెప్పెను.

ప్రాప్తే వై దశమే వర్షే యః కన్యాం నప్రయచ్ఛతి ।

మాసిమాసిరజస్తస్యాః పితాపిబతి శోణితమ్ ॥

అనగా పదియేండ్లు పిల్లకు వచ్చినను తండ్రి వరునికిచ్చి వివాహము చేయనిచో అట్టి తండ్రి ప్రతి మాసము కూతురికి వెలువడు రజోరక్తమును పానము చేసిన దోషమును పొందును అని భావము. కాబట్టి శ్రీవైష్ణవ గృహస్థుడు తన సద్గతి కొరకును ప్రత్యవాయము రాకుండుటకును కన్యాది త్రివిధ దానమునే చేయవలెను. రజస్వలాదానము చేయరాదు. అట్లు చేసిన గృహస్థుని యింట శ్రీవైష్ణవ యతి శ్రేష్ఠులు భిక్షమును స్వీకరింపకూడదు.

రజస్వలా సూతికా విశ్వస్తల నియమము

శ్రీవైష్ణవులలో పుణ్య స్త్రీలు రజస్వలైనప్పుడు

తాంబూలం దంతకాష్టంచ స్నానమంజన భూషణే ।

స్పర్శనం చైవ సర్వత్ర త్యజేత్ పుష్పవతీ సతీ ॥ వాసిష్ట స్మృతి

హస్తే శ్నీయా స్మృణ్మయేవా హవిర్భుక్ క్షితిశాయినీ ।

రజస్వలా చతుర్థే ఉ హ్ని స్నాతా శుద్ధి మవాప్నుయాత్ ॥ పరాశర స్మృతి

అని విజ్ఞానేశ్వరీయములో నుదహరించినట్లు తాంబూల చర్వణము, పలుదోముకొనుట, స్నానము చేయుట, కాటుక, బొట్టు మొదలగు అలంకరణము, ఇతరులను తాకుట అనునవి మానవలెను. ఆహారము చేతిలో నిడుకొనిగాని మట్టి పాత్రలో నిడుకొనిగాని భుజింపవలెను. అట్టి ఆహరము కూడ క్షారలవణాది వర్జితముగా హవిస్సు (ఘృత ప్లుతాన్నము) ను మాత్రమే భుజింపవలెను. నేలయందే పరుండవలెను. నాల్గవ దినము నందు స్నానము చేసినచో శుద్ధురాలగును.

ఇక సూతికా స్త్రీలు

సూతకాంతే విశేషేణ త్రింశత్ స్నానాదనంతరమ్ ।

ద్వాత్రింశ న్మృత్తికా స్నానం కృత్వా మంత్ర క్రమోత్తమం ।

త్రివారం పంచగవ్యం వైపిభేద్విష్ణుర్పితం తథా ।

ప్రాయేణ సూతక స్త్రీణామేతదేవ విధి ర్భవేత్ ॥

సూతక స్త్రీ స్పర్శనేన చండాల స్పర్శనాదివత్ ।

శిశూనాం మృత్తికా స్నానం భవేదేతద్దినేదినే ॥

అన్యేషాం కిముతత్ప్రోక్తం సూతికా స్పర్శనాదికే ॥

అను వాసిష్ఠస్మృతి ప్రకారము పదకొండవ దినమున పురుడు తీరిన తరువాత ముప్పదియవ దినము వరకు నుండి తరువాత ముప్పది రెండు మృత్తికా స్నానములను మంత్ర క్రమ ప్రకారము చేసి మూడు సారులు (పదకొండు ఇరువది యొకటి ముప్పదియవ దినములందు) పంచగవ్యమును ప్రాశనము చేసి తరువాత భగవత్తీర్థమును స్వీకరింపవలెను. తఱచుగా సూతికా స్త్రీలకీ విధి చెప్పబడెను. సూతికా స్త్రీని

స్పృశించినచో చండాలుని స్పృశించినట్లు చిన్నపిల్లలకు గూడ మృత్తికా స్నానమును చేయింపవలెను. పెద్దవారికిక చెప్పనేల? ఈ విధమైన నియమములు పాటింపవలెను.

విగత భర్తృకలగు వైష్ణవ స్త్రీలు ఈ దిగువ నియమములను పాటింపవలెను.

అభర్తృకాచయానారీ యావత్తుర్యదినే శుచిః।
తా వత్తిష్ఠే న్నిరాహారా భవేద్యది రజస్వలా॥
విధవానాం దుర్భలానాం రజనీలేపనం వినా।
భక్ష్యపానం తథాదత్వా స్నానాదీ స్సూర్వవచ్చరేత్॥

విధవా స్త్రీలు రజస్వలలైనచో మూడు దినములు పై నుండి నాల్గవ దినము స్నానమాచరించు వరకు ఆహారమును వర్జింపవలెను. దుర్భలసైనచో భక్ష్యములన మాత్రము (ఉప్పు, పిండి రొట్టె మొ) తిని నీరు త్రాగవలెను. పసుపు రాసికొనుట తప్ప మిగిలిన స్నాన ప్రక్రియ అంతయు సువాసినుల వలె నాచరింప వలెను (పసుపు స్థానములో గోమయమును వాడుట శిష్టాచారము). ఇంకను విధవా స్త్రీ లీక్రింది విధులను గూడ ననుష్ఠింపవలెను.

వాసిష్ఠ స్మృతి పంచమాధ్యాయములో
మృతేభర్తరి నారీణాం బ్రహ్మచర్యం యథోక్తవత్।
శిరసో ఽ ముండనం కృత్వా సర్వభోగ వివర్జితా॥
ఏకభుక్తాహ్యధః శాయి స్నానం త్రిషవణం చరేత్।
చాంద్రాయణైర్నయేత్కాలం కృచ్ఛైర్వావి జితేంద్రియా॥
నిత్యమభ్యర్చయే ద్దేవం వాసుదేవం సనాతనమ్।
ధ్యాయే జ్జపే న్నమస్కుర్యాత్ కీర్తయేన్నామభిశ్శుభైః॥
ఏవం వృత్త సమాచారా నారాయణా పరాయణా।
సాపి భర్తార ముద్ధృత్య ప్రయాతి పరమాంగతిమ్॥

అనగా స్త్రీలు భర్త మరణించిన తరువాత బ్రహ్మచారి వ్రతము నాచరింపవలెను. శిరోముండనము తప్ప తక్కిన కేశ సంస్కారాది భోగములను మానవలెను. (ఇచ్చట శ్రీవైష్ణవులలో ఆచార భేదము కలదు. వడగలై సంప్రదాయము వారు శిరసః ముండనం అని పద విభాగము చేసి విధవలు శిరోముండనమునకు చేసికొనవలెననియు, సర్వ భోగ వితర్జితా అను దానికి ఇతర శరీర భోగములను వర్జింపవలెను అని చెప్పెదరు. తెన్కలై సంప్రదాయము వారు **బ్రహ్మచర్యం యథోక్తవత్** అను దాని వలన పురుష బ్రహ్మచారులాచరించు వ్రతము నంతను ఆచరింపవలెనను విధి వలన శిరోముండనము కూడ ప్రాప్తమై యుండగా శిరసః అముండనమ్ అని పద విభాగమును చేసి శిరోముండనము తప్ప తక్కిన సర్వభోగములనగా కేశ సంస్కారాదికములను వర్జింపవలెనని అర్థము చేసెదరు. (ఆ విధముగానే వడగలై విధవలు ముండన మాచరించు కొనుట, తెన్కలై విధవలు ముండనము నాచరించుకొనకుండుట ఆచారముగా నున్నది) ఇంకను విధవలు ఏకభుక్తమును అదశ్శయనమును రోజూ మూడు సార్లు స్నానము చేయుట, శరీర కార్శ్యము కొఱకు

చాంద్రాయణము కృచ్ఛ వ్రతములు ఆచరించుట అనునవి చేయుచుండవలెను. ఇంద్రియ జయము కలిగి నిత్యము భగవంతు నారాధింపుచు భగవన్నామ జపము తన్నమస్కారము తన్నామ సంకీర్తనము చేయుచు నారాయణ పరాయణురాలై యుండవలెను. ఈ విధమైన సదాచరణము గల విధవ స్త్రీ తన భర్తనుద్ధరించి తాను గూడ పరమపదము పొందును అని చెప్పబడెను.

మరియు అట్టి విధవలలో తల్లికి తప్ప మిగిలిన వారికి ఎవరును నమస్కారము చేయరాదనియు అమంగళ భూతలై యుందురనియు చెప్పబడెను. ఇంకను స **(అబూ కేశాం విధవాం దృష్ట్వా సచేల స్నానమాచరేత్** అని యొక ప్రమాణము కలదు. (ఇందు కూడ వడకలై, తెన్కలై సంప్రదాయముల వారు అభిప్రాయ భేదము కలిగియున్నారు సకేశాం అను పాఠము ననుసరించు వారు వడకలై వారు. అకేశాం అను పాఠము ననుసరించువారు తెన్కలై వారు అని తెలియుచున్నది.

ఇట్లు స్త్రీ ధర్మములను పాటించు స్త్రీలు గల గృహములందే/ శ్రీవైష్ణవ యతులు భిక్షా పరిగ్రహము చేయవలెను.

స్త్రీల సహగమన విషయములో విచారణ

స్త్రీలు తమ భర్త మరణించిన వెంటనే భర్త యొక్క చితలోనే తాను గూడ ప్రవేశించి మరణించుట సహగమనమని శాస్త్రములు చెప్పుచున్నవి. ఎట్లనగా,

బ్రహ్మఘ్నోవా కృతఘ్నోవా మిత్రఘ్నోవా భవేత్పతిః ।
పునాత్య విధవానారీ తమాదాయమృతాతుయా ॥
యావచ్చాగ్నౌమృతే పత్యౌ స్త్రీనా ఉ త్మానం నదాహయేత్ ।
తావన్న ముచ్యతే నారీ స్త్రీ శరీరాత్కథంచన ॥
మాతృకం పైతృకం వాపి యత్రచైవ ప్రదీయతే ।
కులత్రయం పునాత్యేషా భర్తారం యాను గచ్ఛతి ॥

అనగా బ్రహ్మహత్య కృపఘ్నుత మిత్రఘాతము చేసి మహాపాతకి యైనను భర్త మరణించిన వెంటనే భర్తతో మరణించిన స్త్రీ తనతో పాటు భర్తను పవిత్రుని చేసి ఆతనిని తీసుకొని సద్గతికి పోవును. భర్త మరణించిన తరువాత భార్య అగ్నిలో పడి మరణింపనిచో తన శరీరకృత పాపముల నుండి విముక్తురాలు కాజాలదు. తన పుత్రులు తల్లిదండ్రులకు ఇద్దరికిని కలిపి యొకచోటనే తిలోదక పిండ ప్రదానములు చేసినందు వలన మూడు తరముల వరకు వెనుకటి పురుషులను సహగమనము చేసిన స్త్రీ తరింపచేయగలదు అని భావము. ఈ వచనములెంత వరకు ఆచరణీయములగునని విచారింతము. వెనుక విధవా స్త్రీ ధర్మములలో భర్త మరణించిన తరువాత ఆచరింపవలసిన ధర్మములనేకములు చెప్పబడియుండుట చేత స్త్రీలకు ముముక్షువులై శ్రీవైష్ణవులై యుండినప్పుడు సహగమనము (అనుమరణము) యుక్తముగా తోచదు. అయితే అను మరణ విధికి విషయమెచ్చటనవినచో అముముక్షు స్త్రీల విషయములోనవి సమన్వితములగును. ఇంకను అను మరణము శ్రీవైష్ణవ స్త్రీలకు శ్రుత్యాది విరుద్ధము అను విషయములో విజ్ఞానేశ్వరీ యాను మరణ ప్రకరణములో నిట్లున్నది.

తథాచ శంఖాంగిరసౌః తిస్రఃకోట్యర కోట్యశ్చయానిలోమాని మానుషే ।

తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యా నుగచ్ఛతి ॥
ఇతి ప్రతిపాద్య తయోర వియోగం దర్శయతః అయంచ సర్వాసాం
స్త్రీణాం గర్భిణీనాం బాలపత్యానామా చండాల సాధారణో ధర్మః
భర్తారం యా ను గచ్ఛతీతి అవిశేషావాదానాత్
యానిచ బ్రహ్మణ్యనుగమన నిషేధపరాణి వాక్యాని
మృతానుగమనం నాస్తి బ్రాహ్మణా ద్బృహ్మ శాసనాత్ ।
యాస్త్రీ బ్రాహ్మణ జాతీయా మృతం పతి మనువ్రజేత్ ।
సాస్వర్గమాత్మ ఘాతేన నాత్మానం న పతిం నయేత్ ॥
ఇత్యేవ మాదీని, తాని పృథక్చిత్యధిరోహణ విషయాణి
పృథక్చితిం సమారుహ్య న విప్రా గంతు మర్హతి, ఇతి విశేష స్మరణాత్ అనే
నక్షత్రియాది స్త్రీణాం పృథక్చిత్యనుజ్ఞా గమ్యతే యత్తుకైశ్చిదుక్తం పురుషాణామివ
స్త్రీణామప్యాత్మహననస్య ప్రతి షిద్ధత్వా దతి ప్రవృద్ధ స్వర్గాభిలాషాయాః
ప్రతిషేద శాస్త్రమతి క్రామంత్యా అయమనుగమనోపదేశ శ్యేనవత్,
యథా అతి ప్రవృద్ధ క్రోధాక్రాంతస్య ప్రతిషేద శాస్త్రమతిక్రామతః శ్యేనోపదేశ ఇతి,
తదయుక్తమ్, ఏతావత్ శ్యేనకరణికాయా భావనాయా భావ్యభూత హింసాయా
విధిస్పర్శాభావేన ప్రతిషేద సంస్పర్శాత్, యే ఫల ద్వారేణ శ్యేనస్య అనర్థత్వం వర్ణయన్తి
తేషాం మతే హింసాయా ఏవస్వర్గార్థతయా అను గమన శాస్త్రేణ విధీయమానత్వాత్
ప్రతిషేధ సంస్పర్శా భావాత్ అగ్నీషోమీయవత్ స్పష్టమేవానుగమనస్య శ్యేన వైషమ్యమ్.
యత్తుమతం హింసానామ పరమరణానుకూలో వ్యాపారః శ్యేనశ్చ
పరమరణానుకూల వ్యాపార రూపత్వాద్ధిం నైవ కామాధికారే మరణాంశే రాగతః
ప్రవత్తి సంభవేన విధేర ప్రవర్తకతా ప్రాగ ప్రవృత్తి యుక్త హింసారూపత్వాత్,
శ్యేనవత్, ప్రతిషిద్ధ స్వరూపేణై వానర్థః ఇతి, తత్రాప్యనుగమన శాస్త్రేణ మరణస్యైవ
స్వర్గసాధన తయావిధానాత్, మరణేయద్యపిరాగతః ప్రవృత్తిః తథాపి
మరణానుకూలే వ్యాపారే అగ్నిప్రవేశాదా వితి కర్తవ్యతా కలాపే
విధిత ఏవ ప్రవృత్తి రితి స సషేధస్యావకాశః వాయవ్యగ్గ్ శ్వేతమాలభేత భూతికామః ఇతివత్,
తస్మాత్ స్పష్టమేవాను గమనస్యశ్యేన వైషమ్యమ్
యత్తు తస్మాదుహవాన పురాయుషః స్వః కామీ ప్రేయాత్ ।
ఇతి శ్రుతి విరోధాదనుగమన మయుక్తమితి, తచ్చన, స్వః కామ్యాయుషః ప్రాజ్ఞప్రే
యాదితి స్వర్గ ఫలోద్ధేశ ఆయుషః ప్రాగాయుర్వ్యయోన కర్తవ్యో మోక్షార్థినా తస్మాదాయుః
శేషేసతి నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానేన క్షపితాంతః కరణ కళంకస్య శ్రవణ మననిధి
ధ్యాసనాది సంపత్తౌ సత్యా మాత్మ జ్ఞానేన నిత్య నిరతిశయానంద బ్రహ్మ ప్రాప్తి లక్షణ
మోక్ష సంభవః, తస్మాదనిత్యాల్ప సుఖ స్వర్గార్థ మాయుర్వ్యయోన కర్తవ్య ఇత్యర్థః

అతశ్చ మోక్షమనిచ్ఛంత్యా అనిత్యాల్ప సుఖస్వర్గార్థిన్యా అను గమనం యుక్తమ్ ఇతర కామ్యానుష్ఠానవత్ , ఇతి సర్వమనవద్యమ్ అని సువిపులముగా చర్చింపబడెను. దాని సంగ్రహభావము నీ క్రింద తెలిపెదము. పతి మరణించిన వెంటనే అతనితో గూడ స్త్రీ అను మరణం చేయుట సర్వ వర్ణ సాధారణ ధర్మము, దాని వలన తనకు పతికి గూడ స్వర్గప్రాప్తి కలుగును. అట్టి స్త్రీ గర్భిణియైనను బాలింతరాలైనను ఈ అను మరణములో అడ్డురాదు. పతియొక్క చితాగ్నిలోనే బ్రాహ్మణ స్త్రీ అను మరణము చేయవలెను. ఇతర క్షత్రియాది స్త్రీలు వేరుగా చితియందు మరణింపవచ్చును. అను మరణము ఆత్మహత్య వంటిది గాన పురుషులకు ఆత్మహత్య వలెనే స్త్రీలకనుమరణము నిషిద్ధమగునేమో అని శంకింప పనిలేదు. ఆత్మహత్యా పాతకము కంటె అను మరణ లభ్యమైన ఉత్కృష్ట స్వర్గ ప్రాప్తి ఫలము కలుగునను అధికాశవలన అనుమరణము చేయుట యుక్తమే.

ఈ విషయములో శ్యేనకపోత వృత్తాంతము ప్రమాణము. అది యెట్లనగా, ఇంద్రాగ్నులు డేగ పావురములుగానై ధర్మబోధనము కొరకు శిభి చక్రవర్తి అను రాజు వద్దకు వచ్చి పావురముగా నున్న అగ్ని ఆ రాజును శరణుజొచ్చెను. అప్పుడు దాని మాంసమును తినుటకు డేగ రూపములో వచ్చిన ఇంద్రుడు తన ఆహారముగా నున్న పావురమును ఇచ్చి పుణ్యమును పొందమని ఆరాజును వేడెను. ఆ రాజు దానికి సమ్మతింపక శరణాగత రక్షణము కొరకు తన శరీరము నందలి మాంసమును డేగకిచ్చుటకు సిద్ధపడగా ఆ వేగ ఆత్మహత్య మహాపాతకము కలిగించును. కాన పరార్థముగా నీవాత్మహత్యకు సిద్ధపడకూడదని నంతనే కపోత రూపములో నున్న అగ్ని ఆత్మహత్యాపాతకము కంటె శరణాగత త్రాణము వలన గల్గు స్వర్గ ఫలము దొడ్డది గాన ఈతనికి ఆత్మహత్యా పాతక దోషముండబోదని చెప్పెను.

ఇచ్చుట గమనింపవలసినది కలదు. డేగ క్రోధోద్రేకము చేత పరహింస చేయరాదను శాస్త్రము నతిక్రమించి పావురమును చంపబోయెను. డేగ తన ఆహారార్థమై ఏ విధి శాస్త్రమును అనుసరింపకే హింసకుద్యుక్తమాయెను. గాన పరహింస కూడదను శాస్త్రము దానికి అడ్డురాదు. అని శంకించినచో బుద్ధిపూర్వకమైనను ప్రతిషేద శాస్త్రము చేత పరహింస ప్రతిషేదింపబడుట చేత ఫలద్వారా శ్యేనమునకు అనర్థము తప్పదు. దానిని బట్టి అనుగమనము హింసారూపమైనను స్వర్గరూప ఫలము కలుగునని విధింపబడుట చేత హింసానిషేధ శాస్త్రముతో సంబంధముండబోదు.

ఎట్లనగా అగ్నీషోమేయం పశుమాలభేత అను విధి శాస్త్రము వలని అగ్నీష్టోమీయ పశుహింసకు సహింస్యాత్సర్వాభూతాని అను హింసా నిషేధ శాస్త్రముతో సంబంధములేనట్లే. అందువలన అను గమనం శ్యేన హింసాకాండతో సరిపోలదు. అయితే హింస అనగా పరులను చంపుట కదా! శ్యేనము చేయునది పరులను చంపుటయే కాబట్టి హింస అనక తప్పదు. అను మరణము స్వర్గకామన చేత చేయబడును. గాన రాగ ప్రాప్తమైన ప్రవృత్తియే యున్నది గాన అక్కడ విధి ప్రవర్తకము కాదు. ఇక హింసా రూపమైనదే అను మరణము కూడ నగుచుండుటచేత ప్రతిషేధ శాస్త్రమునకు విషయమై శ్యేన హింసాకాండతో సరిపోలునే అనినచో, అట్లు కాదు. అను మరణ శాస్త్రము చేత మరణమే స్వర్గ సాధనముగా విధింపబడుట చేత మరణము రాగతః ప్రాప్తమైనను మరణమున కనుకూలమగు చితాగ్ని ప్రవేశాదుల యందలి ఇతికర్తవ్యతా (ఈవిధముగానే చేయవలెను) అను కార్యకలాపమందు విధి శాస్త్రము చేతనే ప్రవృత్తి యుండును గాన ఆత్మహత్యా నిషేద

శాస్త్రమునకు అవకాశము లేదు. ఎట్లనగా వాయవ్యంశ్వేమాలభేత అను విధివలెనే. అందువలన అను మరణము శ్యేనకృతహింసతో సరిపోలదు. కాబట్టి అను మరణము స్త్రీలకు నిషిద్ధము కాజాలదు.

ఇక **తస్మాదుహవానపురాయుషః స్వః కామీ ప్రేయాత్** అనగా స్వర్గమును కాంక్షించి ఆయువుండగా మరణమును పొందరాదు అను నిషేద శ్రుతి వాక్యము చేత అల్పాస్థిర ఫలముగా నుండు స్వర్గము కొరకు ఆత్మహత్యరూపమైన అను మరణము అనంత స్థిర ఫలరూపమగు మోక్షమును కోరువారు చేయతగదు. ఆయుశ్శేషము ఉండగా నిత్య నైమిత్తికాది కర్మాచరణము చేత అంతఃకరణ దోషమును పోగొట్టుకొని శ్రవణ మనన నిది ధ్యాసనముల వలన పుష్కల సాధన సంపత్తి కలుగగా ఆత్మజ్ఞానమును సాధించి నిరతి శయానంద రూప బ్రహ్మ ప్రాప్తి రూప మోక్షము లభించుటయే విహితము. దేహ నిబంధనమైన స్త్రీత్యపుంస్త్వాదులు ఆత్మకు అవర్జనీయములైనను మోక్షరూప పురుషార్ధము స్త్రీరష్త్రపురుషోభయ సాధారణమగు ఆత్మకు సంబంధించినది గాన దేహ ప్రయుక్త ధర్మరూప కర్మాచరణములో భేదముండిన నుండవచ్చును గాన విధవయగు స్త్రీ తన ధర్మములగు భగవదారాధన నమస్కారాదులను యథాశాస్త్రముగా నిర్వర్తింపుచు మోక్షసిద్ధిని పొందవచ్చును. యి కాన అను మరణము శ్రుతినిషిద్ధమై ముముక్షు జనాననురూపమైయున్నది. ఈ విధమగు నిష్కర్ష వలన మోక్షార్థి శ్రీవైష్ణవ స్త్రీలకు సహగమనము యుక్తము కాజాలదు. అల్పాస్థిర ఫలారులగు ఇతర సంసారి స్త్రీలకే అను మరణమును బోధించు శాస్త్రము వర్తించును. అని విజ్ఞానులు స్పష్టముగా సిద్దాంత పరచిరి. అయితే

వైష్ణవం పతిమాలింగ్య యాదగ్ధాహవ్య వాహనే ।
సా వైష్ణవ పదం యాతి యత్ర గచ్ఛంతి యోగినః ।

ఇత్యాది వచనముల వలన శ్రీవైష్ణవ స్త్రీకి గూడ భర్తతో అను మరణము వలన విష్ణు పద ప్రాప్తి కలుగునని చెప్పబడుచున్నదే. వైష్ణవ స్త్రీకి అను మరణ మెట్లు నిషిద్ధమగును అనినచో, వెనుక కనబరచపడిన తస్యాదుహవా ఇత్యాది శ్రుతికిని దానికుపబృంహణరూపమగు యాస్త్రీ బ్రాహ్మణ జాతీయా అను స్మృతి వచనమునకును దీనితో విరోధము వచ్చుట చేత ఈ వైష్ణవ స్త్రీ అను మరణ విధి అన్య విషయముగా చెప్పవలెను. ఎట్లనగా వైష్ణవులు

అద్వేషశ్చానుకూలశ్చ దివ్య నామధరస్తథా ।
చక్రాంకీ మంత్రపాఠీచ వైష్ణవ శ్చతతః పరమ్ ॥
శ్రీవైష్ణవః ప్రపన్నశ్చ ఏకాంతీచ పరంతపః
పరమైకాంతి విఖ్యాతోదశైతే వైష్ణవాః స్మృతాః ॥

అను వచన ప్రకారము విష్ణువును ద్వేషింపని వాడు, విష్ణువు యందానుకూల్యము కలవాడు, విష్ణునామమును ధరించువాడు, చక్రాంకణమైన వాడు, అష్టాక్షరిని జపించువాడు, విష్ణువు యందు భక్తి కలవాడు. లక్ష్మీ పురుషకారముతో విష్ణునాశ్రయించు వాడు. ప్రపత్త్యుపాయ నిష్ఠుడు, ఏకాంతి, పరమైకాంతి అని పది విధములుగా నుందురు. వారిలో శ్రీవైష్ణవ ప్రపన్న ఏకాంతి పరమైకాంతులు కాక మిగిలిన ఆరు విధములగు వైష్ణవులకు చెందినది వైష్ణవ స్త్రీ అనుమరణ విధి.

అట్లు అను మరణము చేయు వైష్ణవ స్త్రీ పొందు వైష్ణవ పదము కార్యవైకుంఠమే కాని పరమ పదముకాదు. ఇంకను వామనరూపుడుగా భగవంతుడు అవతరించిన స్వర్గము వైష్ణవ పదమనవచ్చును. కాబట్టి అనుమరణ

విధులన్నియు అర్వాచీన ఫలములనే గాని పరమపద మందలి బ్రహ్మానుభవ రూపమోక్షము నిచ్చునవి కావు. అని ప్రాజ్ఞులు గ్రహింపవలెను.

భగవదర్థమై దేహత్యాగము చేసిన వారికి కలుగు ఫలము

వెనుక చేసిన బుద్ధి పూర్వక ప్రాణత్యాగ విషయమైన విచారణ మట్లుండగా

విష్ణోః శ్రీకార్య ముద్దిశ్య దేహత్యాగం కరోతియః ।
తథా వైకుంఠమాసాద్యముక్తో భవతి మానవః । (పాద్మే)
దేవస్య ధన ధాన్యార్థం భూషణాంబరయోరపి ।
శస్త్రాది సాధనైర్మా ఉన్యైః స్వదేహార్పణ కృద్యది ।
సయాతి వైష్ణవం లోకం పునర్జన్మ నవిందతి ॥ శ్రీవామన పురాణే
రంగేశ కార్య ముద్ధిశ్య దేహత్యాగం కరోతియః ।
తస్య వంశే మృతాస్సర్వే గచ్ఛంతి పరమం పదమ్ ॥

అను అనేక ప్రమాణముల ననుసరించి భగవత్కైంకర్యార్థము ధనధాన్యాదులను సంపాదించు కార్యములలో ఎవ్వడైనను తన శరీరము నందు ఆయుశ్శేషముండగానైనను ప్రాణ త్యాగము శస్త్రాదులచే చేసినచో నాతనికి అతని వంశమునకు గూడ మోక్షము సిద్ధించునని విశేష విధి కనబడుచున్నది. ఈ విషయములో శ్రీతిరుమంగైయాళ్వార్ల చరిత్రాంశము అనుసంధింపతగును.

తిరుమంగైయాళ్వార్లు రంగనాధుని కైంకర్యము నిమిత్తము కొందరు సహచరులతో గూడి చౌర్యము నిమిత్తముగా నొకప్పుడొక ప్రాకృత దేవాలయములో స్వర్ణమయ విగ్రహము కలదని తెలసి ఆ దేవాలయమునకు మార్గము లేక పై నుండి శిఖరమును తొలగించి ఆ రంధ్రములో నుండి తమ యనుచరునొకనిని దింపి ఆ విగ్రహమును తీయించెను. రంధ్రము చిన్నదగుట చేత ఆ అనుచరుడు విగ్రహ లాభము వలన శరీరము ఉబ్బిపోయి తిరిగి ఆ రంధ్రములో నుండి బయటకి రాలేక అందు చిక్కిపోయి యుండగా తెల్లవారు చుండుట చేత అతని శిరమును మాత్రము ఖండించి శరీరమును దేవాలయములో వదలి వెళ్లిపోయిరని చరిత్ర చెప్పుచున్నది. సకల ధర్మవేత్తలగు ఆళ్వార్లే అనుచరుని హత్యకు అంగీకరించి అట్లు చేయుట వలన నందు విశేషమున్నదని గమనింపదగియున్నది. భగవత్కైంకర్యార్థము చేయు ఆత్మహత్యారూపమగు అకాల మరణము సత్ఫలిత ప్రదమే అని గ్రహింపవలెను.

శ్రీవైష్ణవులకు కౌపీన సహిత యుగ్మ వస్త్రధారణావశ్యకత

శ్రీపాంచరాత్ర శాస్త్రములలో పరాశర సంహిత యందు

కౌపీనవస్త్రోత్తరీయం సం శ్వేతం ధారయే ద్ద్విజః ।

అనియు, భారద్వాజ సంహితలో

తామసం వస్త్రమేవంతు రాజసం వసన ద్వయమ్ ।

కౌపీన సహితం యత్తు సాత్వికం మునిభిః స్మృతమ్ ॥ అనియు శాండిల్య స్మతిలో

అంతరాచ్ఛాద్య కౌపీనం వాససీ పరిధాయచ అనియు చెప్పబడెను. మరియు

కుండలోచాంగులీ యేచ మహతీ శుక్ల వాససీ ।

కౌపీనం కటిసూత్రంచ గృహస్థస్య విధీయతే ॥

అని చెప్పబడియుండుట చేత గృహస్థ శ్రీవైష్ణవులు కౌపీనమును కట్టుబట్టను ఉత్తరీయము తెల్లని వానిని ధరింపవలెనని తెలియుచున్నది. అట్టి నియమము నుల్లంఘించి కౌపీనమును మాని గాని ఏక వస్త్ర ధరులై గాని యుండు గృహస్థులు అవైష్ణవులన బడుదురు. యతులు వారి వద్ద నుండి భిక్షమును స్వీకరింపకూడదు. అట్లయినచో

అవచ్ఛ పుచ్ఛకచ్ఛశ్చ ద్వికచ్ఛ కటివేష్టితః ।

కౌపీనకధరశ్చైవ నగ్నాః పంచటవిధాః స్మృతాః అనియు

అపవిత్రకరోనగ్నః నగ్నోనోత్తరవాసనః

నగ్నః కాషాయధారీస్యా న్నగ్నః కౌపీనధారకః ॥

అనియు వచనములుండుట చేత కౌపీన ధారియగు గృహస్థుడు నగ్నుడని చెప్పబడుననియున్నది. కాబట్టి కౌపీనము గృహస్థుకెట్లు ధార్యమగుననియు, అట్టి కౌపీనధారియగు గృహస్థుడు నగ్న సంజ్ఞను పొందును గాన అపవిత్ర కరోనగ్నః ఇత్యాది వచనముల చేత నిత్య నైమిత్తికాదులలో నగ్నుడైయుండరాదని నిషేధముండునే శంకింప పనిలేదు. పైని చెప్పిన అకచ్ఛః ఇత్యాతి పంచవిధ నగ్నులకు నీవిధముగా అర్థము.

అకచ్ఛః	=	కట్టుబట్ట కచ్ఛ దోపుకొనకుండ నుండువారు
పుచ్ఛ కచ్ఛ	=	కట్టుబట్ట కచ్ఛను వెనుకను కొన విడచి దోపుకొనువాడు
ద్వికచ్ఛః	=	కొనలు ముందు వెనుక గూడ వదలి కట్టుకొనువాడు
కటివేష్టితః	=	బ్రహ్మచారి వలె గూడ కట్టు కట్టుకొనిన వాడు
కౌపీనకధరః	=	కేవల కౌపీనమాత్రము ధరించి కట్టుబట్ట లేని వాడు

వీరయిదుగురును నగ్నులనబడుదురు. అని అర్థము చెప్పవలెను. అందువలన బ్రాహ్మణేన త్రీణి వాసాంసి ధార్యాణి, అంతర్వాసో బహిర్వాస ఉత్తరీయంచేతి అని విజ్ఞానేశ్వరీయములో నుండుట చేత కట్టు బట్ట ఉత్తరీయముతో పాటు మూడవదగు అంతర్వసనమగు కౌపీనము కూడ గృహస్థుడు ధరింపవలెను. అతర్వాసస్తు కౌపీనం మల మల్లక మేవచ అను నిఘంటువు వలన అంతర్వసనమని విజ్ఞానేశ్వరీయములో చెప్పిన దానికి కౌపీనమనియే అర్థము. ఇంకను

నవాసోభిస్సహాజస్రం నావిజ్ఞాతం జలాశయే ।

భుక్త్వాతు నాచరేత్స్నానమాతురో న మహానిశి ॥

అను వచనమును బట్టి సచేల స్నానరూప ప్రాయశ్చిత్త స్నానము చేయు నిమిత్తము లేనప్పుడు సచేల స్నానమును, జలాశయములోతు తెలియకుండ నీటిలోదిగి స్నానమును, భోజనమైన వెంటనే స్నానమును, శరీరారోగ్యము లేనిదే స్నానమును, అర్థ రాత్రమందు స్నానమును నిషేధింపబడెను. అందు **నవాసోభిః** అను బహువచనమును బట్టి సచేల స్నానావశ్యకత లేనప్పుడు వస్త్ర త్రయము (కౌపీనము కట్టు బట్ట ఉత్తరీయము) విడచియే జలాశయములో స్నానము చేయవలెనని తోచుచున్నది. అట్లయినచో ననగ్నో జలమావిశేత్ నగ్నః కౌపీనవాససా అను వచనములను బట్టి నగ్నుడై జలములో దిగరాదనియు, కేవలకౌపీన మాత్రధారి

నగ్నుడనిపించుకొనుననియు తెలియుట చేత బట్టలు మూడును విడచి జలాశయములో స్నానము చేయవలెనను విధియెట్లు పొసగుననినచో పొడి బట్టలతో నున్న పాటున స్నానము చేయుట సచేల స్నానమగును. కట్టిన బట్ట ఉత్తరీయము కౌపీనము తడిపిన పైని వానిని ఆచ్ఛాదించుకొని చేయుస్నానము సచేల స్నానము కాదు. ఇట్లే శిష్టావరము కలదు. ఇక కౌపీనం చిత్రవాసశ్చ అనుష్ఠానే గృహీ త్యజేత్ అను వచనమును బట్టి గృహస్థుడు కర్మానుష్ఠాన సమయమందు కౌపీనమును చిత్రవస్త్రము ధరింపరాదని తెలియుచున్నది. అందువల కౌపీనము కర్మానుష్ఠాన సమయమందు ధరించుట అనాచారమేమో అనినచో **కౌపీనయోత్రోత్తరీయం సుశ్వేతం ధారయేత్** అనియు నరక ముల్బణం వాసో నవీలంచ ప్రశస్యతే అనియు నుండుట చేత **కౌపీనం చిత్రవాసశ్చ** అనుచోట కౌపీనము కొఱకు రంగు వస్త్రమును ఉపయోగింపరాదని అర్థము చెప్పవలెను. అట్లే **దశాహీనం మలాక్తంచ వర్జయేదంబరం బుధః** అను వచనము ప్రకారము బద్దెలేనిదియే మలినమైనదియునగు వస్త్రములను గృహస్థుడు ధరింపరాదు.

పవిత్రధారణ విషయములో వైష్ణవుల విధి

ఆ పవిత్రకలోనగ్నః అను వచనములో చెప్పబడిన ప్రత్యవాయ శాస్త్రము శ్రీవైష్ణవ యతి గృహస్థాదులు దర్భ పవిత్రమును (సువర్ణ నిర్మిత పవిత్రపు ఉంగరమును గాని) ఎల్లప్పుడు కుడి చేతి అనామిక యందు ధరించి యుండవలెనని బోధింపుచున్నది. ఇక ఆచారములో సంతతము అట్టి ధర్భ పవిత్రమును కరమందు ధరించుట లేదు. ఆయా కర్మాచరణములోనే విశేషించి
పవిత్ర పాణి స్సంకల్ప్య ఇత్యాది విశేష వచనములను బట్టి పవిత్రమును ధరించుటాచారమై యున్నది. అయితే సర్వదా పవిత్రపాణిగా నుండవలెనా అని ప్రశ్న వచ్చుచున్నది.. దానికి సమాధానమేమనగా

చరణం పవిత్రం వితతం పురాణం తేన పవిత్రేణ శుద్ధేన పూతాః

ఇత్యాది శ్రుతి వచనముల చేత పవిత్రమగు (అనగా పునీతుని చేయునదియగు) చక్రమును శ్రీవైష్ణవులు భుజమందు ధరించి యుండుట చేత సదాపవిత్రకరులే యగుదురు. గాన సర్వదా దర్భకృత పవిత్రమును ధరించియే యుండవలెనను నిర్బంధము లేదు.

చక్రం పవిత్రం చరణం అను వేదపరిబాష చొప్పున పవిత్రమనినను చరణమనినను చక్రమనినను ఒకే అర్థము కలిగియుండును. కాబట్టి అసాధారణ పవిత్రధారులగు శ్రీవైష్ణవులు సాధారణ దర్భకృత పవిత్ర కరులుగా లేకుండినను ప్రత్యవాయము లేదు. ఆయా నైమిత్తికాది కర్మలలో అట్టి దర్భ పవిత్రమును ధరించుట అభ్యుదయ హేతువగును. ఈ విధముగానే కౌపీన ధారణ విషయములో కొందరు యథార్థమును గ్రహింపజాలక నగ్నః కౌపీన ధారకః అను వచనమునకు కౌపీనమును ధరించిన వాడు నగున్నడనబడునని అర్థము చేసి కౌపీనధారణమును మానుదురు. కేవలకౌపీన మాత్రమును ధరించి కట్టుబట్ట ఉత్తరీయము లేని వాడు నగ్నుడగునని ఆ వచనమునకు యథార్థమగు అర్థమని వారు గ్రహింపజాలరు.

ఏకాదశీ శ్రాద్ధ విషయ విచారము

శ్రీవైష్ణవులు ఏకాదశి రోజున శ్రాద్దము నాచరించుట లేదు. బ్రాహ్మణ మాత్రులు ఏకాదశీ శ్రాద్ధమును చేయుటాచారము కలదు. వారి ఆయాచరణకు మృతాహస్సమతిక్రమ్య చండాలః కోటి జన్మసు అను వచనమును

ప్రమాణముగా స్వీకరించెదరు. ఐతే శ్రీవైష్ణవ బ్రాహ్మణుల ఆచరణకు అనుకూల ప్రమాణములున్నవా, అనినచో ఉన్నవని సమాధానము చెప్పవచ్చును. అవియేవనగా,

పితుర్ధశాహమధ్యేతం సంప్రాప్తే హరి వాసరే ।

పిండదానం సకుర్వీత నతిలోదక సత్క్రియామ్ ॥

ఆమేనవా హిరణ్యేన శ్రాద్ధమేకాదశీ దినే ।ల

కుర్వన్నరకమాప్నోతి యావదాభూత సంప్లవమ్ ॥

సూతకాదౌ యథాశ్రాద్ధం సూతకాంతే విధీయతే ।

తథై వైకాదశీ శ్రాద్దం ద్వాదశ్యామేవ కారయేత్ ॥

అను కపింజల సంహిత వచన ప్రకారము తండ్రి మొదలగు వారు చనిపోయిన పదిరోజుల లోను ఏకాదశి వచ్చినచో ఆ రోజు పింద దాన తిలోదకాదులు చేయరాదు అనియు, ఆమశ్రాద్ధముగాని హిరణ్య శ్రాద్ధము గాని ఏకాదశి నాడు చేసినచో కల్పాన్తము వరకు నరకము కలుగుననియు, పురుడు మైల వచ్చినచో నెట్లు శ్రాద్ధమును శుద్ధి దినమున జరుపుకొనుట ఆచారమో అట్లే ఏకాదశీ రోజున వచ్చిన శ్రాద్ధమును ద్వాదశినాడే ఆచరింపవలెననియు తెలియుచున్నది. ఇంకను పాంచరాత్రము నందు

ఏకాదశ్యాంతు యః శ్రాద్ధం కుర్యాన్మోహేన పద్మజః ।

రేతో మూత్ర పురీషాణి సపితృభ్యః ప్రయచ్ఛతి ॥

ఏకాదశీం పరిత్యజ్య ద్వాదశ్యామేవ వైద్విజః ।

కుర్చాచ్ఛ్రాద్ధాదికం కర్మప్రత్యబ్ధం పద్మ సంభవ ॥

యేకుర్వంతి మహీపాల శ్రాద్ధమేకాదిశీ దినే ।

త్రయస్తే నరకం యాంతి దాతా భోక్తా విధాయక ॥

అను వచనముల చొప్పున ఏకాదశీ శ్రాద్ధమును తెలియక ఆచరించినచో పితరులకు ఏహ్య పదార్థము నిడినట్లగుననియు, ఏకాదశిని విడచి ద్వాదశినాడే శ్రాద్ధమును ప్రతి సంవత్సరమును చేయవలెననియు, ఏకాదశి నాడు శ్రాద్ధమును ఆచరించినచో కర్త భోక్త మంత్రము చెప్పినవాడు కూడ నరకమును పొందెదరు అనియు చెప్పబడెను. హారితస్మృతిలో

పితృ శ్రాద్ధం నకుర్వీత ఏకాదశ్యాం ద్విజోత్తమః ।

ద్వాదశ్యామేవ కుర్వీత నోపవాసదినే క్వచిత్ ॥

ఏకాదశీ దినే ప్రాప్తే మాతా పిత్రో ర్మృతే హని।

తద్దినంతు పరిత్యజ్య ద్వాదశ్యా మేవకారయేత్ ।

అని చెప్పబడెను. పై పాంచరాత్ర విశిష్ట ధర్మశాస్త్రాను సారముగా శ్రీవైష్ణవులు ఏకాదశీ శ్రాద్ధము నాచరించుటలేదని తెలియవలెను.

అట్లయినచో మృతాహస్సమతిక్రమ్య అను వచనమునకు గతియేమి ? అని ప్రశ్నింప తగదు. చండాల జన్మ మెత్తినను ఆ జన్మలో కూడ సంస్కార వశమున భగవద్భక్తి యుండి దాని వలన నాటికైనను భగవత్ప్రాప్తి యోగ్యత ఉండవచ్చును గానీ ఏకాదశీ శ్రాద్ధమాచరించినచో కల్పాంతము వరకు నరకము తప్పదనుట చేత ఏనాటికిని భగవత్ప్రాప్తి యోగ్యత ఉండబోదు. కాబట్టి శ్రీవైష్ణవ ద్విజులు సామాన్య శాస్త్రమును వదలి విశిష్ట

ధర్మశాస్త్ర వచనములను అనుసరించుట కర్తవ్యము. మరియు మృతాహస్సమతిక్రమ్య అను వచనమునకు విశిష్ట ధర్మశాస్త్రా విరోధముగా ఏకాదశీ భిన్న దినములలో సకాలమున శ్రాద్ధమాచరింపనప్పుడు కలుగు ప్రత్యవాయ బోధకముగా అర్థమును చెప్పవచ్చును. కాని విశిష్ట వచనములకు అట్లు సమన్వయము కుదరదు. కాబట్టియే శ్రీవైష్ణవ దర్శన మూర్ధన్యులగు నాదయామునయతి పరాద్యభియుక్తులు సామాన్య ధర్మశాస్త్ర వచనముల కంటె శ్రీభగవన్ముఖోదిత పాంచరాత్ర విశిష్ట శాస్త్ర వచనములకు అధిక ప్రామాణ్యమును ఇచ్చి ఏకాదశీ శ్రాద్ధాదులను త్యజించి యుండిరి.

తిథి త్రయైకాదశికి గూడ త్యాజ్యత

ఏకాదశి ఉపవాస దినము గాన శ్రాద్ధ కర్మనానాడు చేయరాదని నోపవాసదినేక్వచిత్ అను హారిత వచనము చెప్పుట చేత శ్రాద్ధము చేయకుండుట ప్రాప్తమై యున్నది. ఇక ఏకాదశ్యుపవాస విషయమీ సందర్భములో విచారింపవలెను. ఏకాదశికి పూర్వ దిన మందు దశమీ తిథి తెల్లవారుగట్ల నాలుగు గడియల రాత్రి యుండు వరకు అను వర్తించియుండినచో దశమీ విద్దైకాశియని చెప్పబను. అట్టి ఏకాదశినాడు ఉపవాసము చేయుట వైష్ణవాచారములో లేదు. అట్లే ఉదయమునకు స్వల్ప దశమి యుండి తరువాత ఏకాదశియు ఆ తెల్లవార కట్ల ఏ కొన్ని గడియలలో ద్వాదశికూడా కలసియుండినచో నది తిథి (దిన) త్రయైకాదశి అనబడును. అట్టి యేకాదశి కూడ ఉపవాస యోగ్యము కాదని ఈక్రింది పాద్మసంహితా వచనము చెప్పుచున్నది.

తిథిత్రయముతే దేవి ద్వాదశ్యాం సముపోషయేత్ ।
తత్రక్రతు శతం పుణ్యం త్రయోదశ్యాంతు పారణాత్ ॥
మరియు దశమ్యేకాదశీ యత్ర నవమీ మిశ్రితాయది ।
ఉపోష్యా ద్వాదశీ తత్రయదీచ్ఛేచ్ఛరమాంగతిమ్ ॥

అనగా దశమీ ఏకాదశీ ద్వాదశీ తిథులు మూడును ఒకనాడు కలసి ఉండునప్పుడు ద్వాదశి యందే ఉపవాసము చేయవలెను. అట్లు చేసినచో క్రతు శతఫలము కలుగును. అట్టి యెడ త్రయోదశి నాడు పారణ చేయవచ్చును. అట్లే నవమి దశమి ఏకాదశి కలసి యుండునప్పుడు (తెల్లవారు కట్ల వరకు దశమి యుండి ఆ తరువాత ఏకాదశి, ఉదయము నవమి కలసిన దినత్రయము) ఏకాదశీ సంబంధము లేకున్నను ద్వాదశి నాడే ఉపవాసము చేయవలెను. త్రయోదశినాడు పారణము చేయవలెను అని భావము ఇంకను పాంచరాత్ర శాస్త్రము నందు

నవమీ శేష సంయుక్తాం దశమీవేధ వర్జితాం ।
తథై వైకాదశీం త్యక్త్వా ద్వాదశీం సముపోషయేత్ ।
తిథిత్రయే ఒపి సంగ్రాహ్యా ద్వాదశీ మునిసత్తమ ।
ఏకాదశీ న సంగ్రాహ్యా కదాచిత్తద్దినత్రయే ॥

అనగా నవమి శేషముతో దశమి నాడు దినత్రయము వచ్చినను దశమీ వేధ (తెల్లవారికట్ల నాల్గు గడియలుండు వరకు దశమి యుండిన దినముతో గూడినను ఆ ఏకాదశియందుపరవాసము చేయక ద్వాదశినాడే ఉపవాసము చేయవలెను. ఇట్టి దినత్రయైకాదశి ఉపవాస దినముగా గ్రహింపరాదని చెప్పబడెను. కాబట్టి దిన త్రయైకాదశి అనునవి ఉపవాస దినములుగా నుండవు కాన ఆ రోజున ఏకాదశియైనను శ్రాద్ధకర్మ నాచరింపవచ్చును. ఉపవాసార్హమైన ద్వాదశీ తిథియందు కర్తవ్యమైన శ్రాద్ధమును ఆరోజు మాని త్రయోదశి రోజున జరుపుకొనవలెను. ఇది శ్రీవైష్ణవ సంప్రదాయము.

సర్వకర్మలలో నూర్ధ్వపుండ్రధారణావశ్యకత

నిత్య నైమిత్తిక శ్రాద్ధాది కర్మలలో వైష్ణవ ద్విజుడు ఊర్ధ్వపుండ్రధారణ మొనర్చియే భగవన్నివేదిత పదార్థములతో పాటుగా ఆయాకర్మలను ఆచరింపవలెను. ఈ విషయములో వేదవ్యాసులిట్లు చెప్పిరి. ఎట్లనగా

శ్రాద్ధం దానం జపం హోమం స్వాధ్యాయం పితృతర్పణమ్ ।
భస్మీ భవతి తత్సర్వం ఊర్ధ్వ పుండ్రం వినాకృతమ్ ॥
ఊర్ధ్వ పుండ్ర విహీనస్తు యః శ్రాద్ధం కురుతే ద్విజః ।
సర్వంతద్రాక్షసై ర్నీతం నరకం చ సగచ్ఛతి ॥
ఊర్ధ్వ పుండ్రాది హీనంతు యచ్ఛ్రాద్ధే భోజనయే ద్ద్విజం ।
అశ్నంతి పితరస్తస్య విణ్మూత్రం నాత్ర సంశయః ॥
తస్మాద్ద్వైసతతం ధార్యమూర్ధ్వ పుండ్రం ద్విజన్మనా ॥ అని చెప్పబడెను. అట్లే
విష్ణవే కల్పితం చాన్నం దద్యాద్భక్తేభ్య ఏవహి ।
వైశ్వదేవం తతః కుర్యా చ్ఛ్రాద్ధ కర్మాదికం తథా ॥

అని పరాశరులు చెప్పిరి. అందువలన సమస్త కర్మలలోను ఊర్ధ్వపుండ్రధారులై యుండియే వైష్ణవ ద్విజులు ఆచరణము చేయుటయు భగవన్నివేదిత పదార్థముతోనే శ్రాద్ధమును ఆచరించుటయు విధియై యున్నది. పై ప్రమాణములలో సామాన్యముగా ద్విజమాత్రనకే ఊర్ధ్వ పుండ్ర ధారణము చెప్పబడినందుననే కాబోలును అద్వైత ద్విజులు కూడ స్వస్వ కర్మలలో జలోర్ధ్వ పుండ్రమునే ధరించెదరు. కాని తిర్యక్పుండ్రమును ధరింపరు.

శ్రీకృష్ణాష్టమీ విషయ విధానము

ఏకాదశికి దశమీ వేధ వలెనే శ్రీకృష్ణాష్టమికి సప్తమీ వేధయు రోహిణికి కృత్తికా వేధయు నుండరాదని విశిష్ట ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. ఎట్లనగా పాంచరాత్ర బ్రహ్మ సంహితలో

జయంతీ ద్వివిధా ప్రోక్తా శుద్ధా విద్ధా చ నారద ।
విద్ధాతు సప్తమీ యుక్త శుద్ధాతు నవమీయుతా ॥
రోహిణీ కృత్తికా యుక్తా విద్ధా శుద్ధా పరాన్వితా ॥
చంద్రోదయే ష్టమీ బ్రహ్మన్ పరస్మిన్ దినసేయది ।
తదాష్టమీం పూర్వ విద్ధాం సముక్షాం వా పరిత్యజేత్ ॥

అని చెప్పబడెను. పై వచనముల అభిప్రాయమేమనగా శ్రీకృష్ణ జయంతి విద్ధ అనియు శుద్ధ అనియు రెండు విధములు. అష్టమి ఉదయము సప్తమితో కలసియుండినచో శుద్ధాష్టమి యగును. అటులనే అష్టమి రోజున రోహిణీ నక్షత్రము ఉదయము కృత్తికతో కలసి యుండిన విద్ధ రోహిణి అనబడును. రోహిణి రాత్రికి మృగశిరతో కలసియుండిన శుద్ధరోహిణి అనబడును. మఱియు సూర్యోదయముకు తరువాత సప్తమీ శేషముండినను పరదినమున అష్టమి రాత్రి చంద్రోదయము వఱకు ఉండినను పూర్వమందలి అష్టమి విద్ధాష్టమి పరమందలి అష్టమి శుద్ధాష్టమియగును. ఇట్లు వచ్చునపుడు విద్ధాష్టమిని విద్ధరోహిణిని వదలి శుద్ధాష్టమిని శుద్ధరోహిణినే నిష్కాములగు శ్రీవైష్ణవులు శ్రీకృష్ణజయంతిని జరుపవలెను. విద్ధ తిథి నక్షత్రములు పరిత్యాజ్యములు.

ఇచ్చుట శ్రీవైష్ణవులలోనే కొంత ఆచరణ భేదము కలదు. సకామ ద్విజులలో వలెనే వైఖానస శ్రీవైష్ణవ దివ్య స్థలములలో సప్తమీ వేధ అష్టమికి ఉన్నను కృత్తికా వేధరోహిణికున్నను అష్టమినాడు రాత్రి చంద్రోదయ సమయమునకు అష్టమి తిథియుండినచో నారోజే శ్రీకృష్ణజయంతిని జరుపుట ఆచారమై యున్నది. నిష్కామ వైష్ణవులతో పాటు పాంచరాత్ర దివ్య స్థలములలో విద్ధాష్టమీ రోహిణులు విడచి శుద్ధాష్టమీ రోహిణులనే పరిగ్రహించి శ్రీకృష్ణ జయంతిన జరుపుటాచారమై యున్నది. విష్ణుస్థలములలోనే ఇట్టి ఆచార భేదము కలుగుటకు ప్రమాణమేమైన గలదా? అని విచారించినచో

బుధవారయుతా విద్ధా జయంతి పుణ్యవర్ధనీ ।

అన్యవారయుతాం విద్ధాం న గృహ్ణీ యాత్కదాచన ॥ అనియు

సర్వేషుచ పురాణేషు బుధవారః శుభః స్మృతః ।

బుధవారయుతే కృష్ణో జజ్ఞే తస్మాద్విశిష్యతే ॥

అనియు విశేష వచనములను బట్టి విద్ధాష్టమీ రోహిణులుండినను ఆ దినము బుధవారము కలసి చంద్రోదయ సమయమున అష్టమి యుండినచో జయంతిని ఆ రోజు జరుపవచ్చునని తెలియుచున్నది. దీని వలన వైఖానస స్థలములలో బుధవారముతో చేరిన విద్ధాష్టమి పరిగ్రాహ్యమైనట్లు కనబడుచున్నది. దీనికి కారణము శ్రీకృష్ణ పరమాత్మ అష్టమి రోహిణులతో గలసిన బుధవారమందు అవతరించిరట, అందువలన తిథి వార నక్షత్రములు మూడును చేరిన దినము విశిష్టమగును. గాన ఆనాడాచరించుట యుక్తమని వైఖానస శ్రీవైష్ణవాభిప్రాయమై యుండును. బుధవారము చేరనప్పుడు వారు గూడ విద్ధలను పాటించుటావశ్యకమని తోచుచున్నది. ఇక పాంచరాత్ర స్థలములలో

పుత్ర సంతాన మారోగ్యం సౌభాగ్యమతులం భవేత్ ।

ఇహ ధర్మరతో భూత్వామృతో వైకుంఠ మాప్నుయాత్ ॥

అను పాంచరాత్ర వచనమును బట్టి ఐహిక ఫలములతో గూడిన విద్ధాష్టమ్యాదులను పరిత్యజించి కేవల భగవత్ప్రీతి కొరకు అవిద్ధాష్టమి రోహిణులనే పరిగ్రహింపబడుచున్నారని తెలియుచున్నది. పై ప్రమైణములను బట్టి వైఖానస వైష్ణవులు బుధవారముతో చేరినట్టి చంద్రోదయ పర్యంత వ్యాప్తాష్టమినే పరిగ్రహింపవలెననియు అన్యవారములతో చేరినప్పుడు విద్ధాష్టమిని గ్రహింపరాదనియు తేలుచున్నది. మఱియు

శుద్ధాష్టమీం వినా వాపి శుద్ధరక్షస్యాప్యభావతః ।

మృగేణ చ దశమ్యా చ యుక్తో పోష్యైవ సద్విజైః ॥

అను పాంచరాత్ర వచన ప్రకారము శుద్ధాష్టమి శుద్ధ రోహిణి సందర్భింపని యెడల దశమి తిథియందు గాని మృగశిర నక్షత్రమందు గాని శ్రీకృష్ణ జయంతీ ప్రయుక్తోపవాసాదికము నాచరింపవలెనని తెలియుచున్నది. అట్లే శ్రీవైష్ణవాచారము నడచుచున్నది.

శ్రీకృష్ణ జయంతీ పారణకాల విచారము

సామాన్యముగా నుపవాస వ్రతము నాచరించువారు ఆ వ్రతాంతమందు భగవదారాధన పూర్వకముగా ప్రసాద స్వీకరాము అనెడి పారణము జరుపవలసియున్నది.

అట్లే ఏకాదశ్యుపవాస వ్రతమాచరింపబడుచున్నది. అట్లాచరించుటలో ఏకాదశిపూర్తిగా ఉపవాసము చేయవలసియున్నది గాన ద్వాదశి నాడు ఉదయము పారణ చేయవలసి యుండెను. ఇక శ్రీకృష్ణ జయంతీ దినమున శ్రీకృష్ణావతారము వరకు ఉపవాసము చేయవలసినట్లు విధియుండుట చేత అంత వరకు భోజనము మాని శ్రీకృష్ణ జన్మోత్సవము జరుపుట ఆచారమై యున్నది. అట్టి ఉత్సవము శ్రీకృష్ణావతార లగ్నమగు వృషభలగ్నమందు జరుపవలసియున్నది. ఏమనగా

తిథిరేక గుణాప్రోక్త నక్షత్రంతు చతుర్గుణమ్ ।
వార మష్టగుణం ప్రోక్తం లగ్నం లక్షగుణం భవేత్ ॥

అను జ్యోతిశ్శాస్త్ర వచన ప్రకారము లగ్నమునకు గుణాధిక్యము చెప్పబడెను. అందువలన సుమారుగా పంద్రెండు గడియల రాత్రి తరువాతనే ఉత్సవము జరుపవలెనని తేలుచున్నది. ఇక ఉత్సవాంతే చ పారణమ్ అను విధి ప్రకారము ఉత్సవాంతమందు భగవత్ప్రసాద స్వీకార రూప పారణము చేయవలసి యుండును. అయితే ఉత్సవాంతమగునప్పటికి రాత్రి భోజనార్హ కాలము అతిక్రమించుట చేత గృహస్థులును, రాత్రి భోజనము నిషేధింపబడిన యతులును అట్టి సమయములో పారణ చేయవచ్చునా అను శంక కలుగుచున్నది. దానికి పాంచరాత్రమున అనంత సంహితలో నిట్లు సమాధానము కనబడుచున్నది.

యతీనాం వైష్ణవానాం చ ద్విజానాం నియతాత్మనామ్ ।
విహితం సాత్వికానాం చ రాత్రావే వహి పారణమ్ ॥

అనగా యతులు వైష్ణవ గృహస్థులు గూడ సాత్విక వైష్ణవులైనవారు రాత్రి కాలమందే పారణము చేయుట విహితమని తాత్పర్యము. కాబట్టి కృష్ణాష్టమి రోజున అర్ధరాత్రమైనను వెంటనే శ్రీవైష్ణవులందఱును భగవన్నివేదిత ప్రసాద స్వీకార రూపమగు పారణము చేయవలసియే యుండును.

అన్న శ్రాద్ధములో పితృదేవతార్హాన్నము

యః శ్రాద్ధకాలే హరిభుక్త శేషం దదాతి భక్త్యా పితృ దేవతానామ్

అను వచనము చొప్పున విష్ణు నివేదితాన్నముతో పితృ శ్రాద్ధము నాచరింపవలెనని తెలియుచున్నది. అందు కొందరు వైష్ణవ బ్రువులు భ్రమపడి హరిభుక్త శేషమ్ అను దానికి కేవల పత్నీ విశిష్ట విష్ణు దేవ నివేదితమునే గాని నిత్య సూరి దివ్య సూరి సహితముగా విష్ణువునకు నివేదించిన అన్నమును వినియోగింప రాదని తలచి ఆనాడు కేవల శ్రీవిశిష్ట హరికి మాత్రమే నివేదించి నిత్య సూరి దివ్యసూరులకు నివేదింప కుండుట కలదు. అయితే అది భ్రమ మూలమే అని తెలియదగును. ఏమనగా, హరిభుక్త శేషమ్ అనగా ఎట్లు హరితో పాటు తత్పత్నులు గూడ నంతర్భూతలుగా గ్రహింపవలెనో అట్లే తద్భక్తులగు నిత్యసూరి దివ్యసూరులు గూడ నంతర్భూతులగుదురు. దీనికేమి ప్రమాణమనగా

అన్నాద్యంపురతోన్యస్తం దర్శనాద్గృహ్యతేమయా ।
రసాన్ధానస్య జిహ్వాయామశ్నామిక మలోద్భవ ॥

అను భగవద్వచనము ప్రమాణము. దీని భావమేమనగా శ్రీహరి తనముందుంచబడిన అన్నాదులను దృష్టి చేత ముందు చూచి తృప్తి నందుననియు తరువాత తద్దాసులగు నిత్యసూర్యాది భాగవతుల నివేదనైన పిమ్మటనే వారి జిహ్వల ద్వారా తద్రసమును ఆస్వాదించుననియు తెలియుచున్నది. ఇచ్చట దాసస్య అను పదము కేవల మనుష్య మాత్రులకే అర్థమివ్వదు. దాస సామాన్యమగు నిత్యసూర్యాది దాసవర్గమునే చెప్పును అని వివేకింపవలెను. కాబట్టి భగవద్దాసగ్రగణ్యులగు నిత్యసూరి దివ్యసూరి గణ నివేదితమైన అన్నమే సంపూర్ణ హరిభుక్త శేషమగును. కండ్లతో చూచి తృప్తి నందినంత మాత్రము చేత భుక్త శేషము కాజాలదని తెలియవలెను. దానితోనే పితృశ్రాద్ధమును జరుపుట శ్రీవైష్ణవ సంప్రదాయ సిద్ధమని తెలియవలెను.

శుభాశుభములలో వైష్ణవ గృహములలో ద్రావిడ దివ్య ప్రబంధాధ్యయన విధి

శ్రీవైష్ణవ గృహస్థుల యిండ్లలో వివాహాది శుభములు, పిత్రాది మరణ ప్రయుక్తా శుభములు తటస్థించినప్పుడు ద్రావిడ దివ్య ప్రబంధాధ్యయనము చేయవలెనని శాస్త్రము చెప్పుచున్నది.

ఉత్సవాదౌ ద్విజాదీనామాశౌచాంతే తథైవచ ।
అద్యేతవ్యం ద్విజవరై రాద్యంగీతి సహస్రకమ్ ॥
అశుభాంతే విశేషేణ ద్రామిడ బ్రహ్మసంహితా ।
అధ్యేతవ్యాద్విజవరై రాశౌచాషు వినాశినీ ॥

అనగా వివాహాద్యుత్సవారంభమందు శ్రీవైష్ణవులు దివ్య ప్రబంధ ప్రధానమగు తిరువాయ్ మొళిని అధ్యయనము చేయించవలెను. అట్లే పిత్రాది మరణాశుభము తటస్థించినప్పుడు అశౌచానంతర దినమందు నాలాయిర దివ్యప్రబందాధ్యయనమును చేయించవలెను.

అట్లే పిత్రాది మరణాశుభము తటస్థించినప్పుడు అశౌచానంతర దినమందు నాలాయిర దివ్య ప్రబంధాధ్యయనమును చేయింపవలెను. అట్లాచరించినచో అశౌచపాపాదులు తొలగి పోవును అని భావము. ఇట్లే శిష్ట శ్రీవైష్ణవ గృహస్థులు ఆచరించుట ప్రసిద్ధము. ఇట్టి శ్రీవైష్ణవాచారాములను పాటించు శ్రీవైష్ణవ గృహస్థుల యింటనే శ్రీవైష్ణవ యతులు భైక్షమునాచరింపవలెను.

ఆళ్వార్లకు భగవత్సంబంధ మూలత్వ వివరణము

ప్రసంగ వశమున మరికొన్ని విషయములిచ్చుట చెప్పబడెను. అందు ఆళ్వార్లు వారి దివ్య ప్రబంధములు శ్రీవైష్ణవులకు ప్రాదేయతను పొందుటకు సిద్ధోపాయ నిర్ణయమను మూడవ ప్రకరణములోని వివరించిన ప్రకారము ఆళ్వార్లు ఆర్త ప్రపన్నులై యుండుటయే కారణమైయున్నది. అందువలననే వారి దివ్య ప్రబంధములకు గూడ నుపాదేయత కల్గినది. అయితే ఆళ్వార్లు ప్రపన్నులగుటకు వారికి పంచ సంస్కారములు జరిగియుండవలెను. అట్లు వారికి పంచ సంస్కారములు జరిగినట్లు ప్రమాణము గలదా అనినచో అట్టి ప్రమాణము పాంచరాత్ర శాస్త్రమునకు గారుడ పురాణమునను గలదు.

శ్రీశానముమత్యా చార్తానాం సేనేశః స్వానుకంపయా ।
చక్రాది ధారణం కుర్యాత్ యేషాంతే సద్గురూత్తమా ॥
భవంతి హి జగత్సేవ్యాః స్వస్వ మాతాపితాయథా ॥

అనగా శ్రియః పతి ఆజ్ఞవలనను తన కృప వలనను శ్రీసేనాపతియగు విష్వక్సేనులు ఈ లోకములోని ఆర్త ప్రపన్నులైన వారికి చక్రాది ధారణమును చేయించును. అట్టి వారు గురూత్తములై తల్లిదండ్రులవలె శిష్యకోటిని చూచి జగత్సేవ్యులై యుందురని చెప్పబడెను. ఈ ప్రమాణముననుసరించియే శ్రీయామునాచార్యులు తమ స్తోత్ర రత్నములో మాతాపితాయువతయః అను శ్లోకమును నమ్మాళ్వార్లను గురించి సాయించిరి. ఇట్లు ఆళ్వార్లకు భగవత్సంబంధమునకు మూలమగు పంచసంస్కారములు కలిగియుండుటచేతనే గురుపరంపరలో శ్రీశఠమాంచ చమూపతిం శఠరిపుం అని ఆళ్వార్లకాచార్యులుగా సేనేశులననుసంధించుట జరుగుచున్నది. య కొందరు ఆళ్వార్ల సమకాలములో నుండిన మధురకవి యాళ్వార్లు ఆళ్వార్ల శ్రీపాద తీర్థాద్యన్వయము కల్గియుండిరని తెలియదు. తరువాత వారి ముక్తావస్థలో అర్చాబింబము యొక్క శ్రీపాద తీర్థాద్యన్వయము కలిగియుండిరి అని చెప్పుదురు. అది ప్రామాణికము కాదు. ఏమనగా **శ్రీమధురకవులు తమ కణ్ణినుణ్ శిరుత్తామ్బు** అను దివ్య ప్రబంధములో పై పాంచరాత్ర వచన ప్రకారము **అన్నైయాయత్తనాయ్** అను పాశురముమ సాయించిరి. స్వస్వమాతాపితాయథా అని కదా పాంచరాత్ర ప్రమాణమున్నది.

ఇంకను **మేవినేన వన్పొన్నడిమెయ్మ్మైయే** అని గూడ ఆళ్వార్లు ముముక్షు అవస్థలోనే వారి శ్రీపాదములను ఆశ్రయించి తత్తీర్థ పరిగ్రహాదికము చేసినట్లు సాయించిరి. తరువాత ఆళ్వార్ల ముక్త్య నంతరము నాథయామునాద్యస్మద్గురు పరంపరలోని వారు ఆళ్వార్ల అర్చాబింబము నాశ్రయించి తచ్ఛ్రీపాదతీర్థాది పరిగ్రహము చేయుచువచ్చిరి అని చరిత్రల వలన తెలియుచున్నది.

శ్రీఉడైయవరుల తిరువచ్చి నంబి తిరువడి ప్రతిపత్తి

శ్రీఉడైయవరులు శ్రీకాంచీపూర్ణులనెడి తృతీయ వర్ణజులైన ఆచార్యులను **సుదూరమపి గంతవ్యం యత్ర భాగవతః స్థితః** అనునట్లు అనునట్లు ప్రయత్న పూర్వకముగా వెళ్లి ఆశ్రయించి వారిననువర్తించి కాంచీ వరద రాజులను ప్రత్యక్ష పరచుకొని మాటలాడెడి ఆ ఆచార్యుల వలన వరదరాజుల స్వాభిప్రాయరూపమగు షడ్వార్తలను లభించి యుండిరి. శ్రీకాంచీపూర్ణులు మాత్రము ఉడైయవరులు ప్రార్థనానుసారము ఆచార్యత్వము నంగీకరింపక శ్రీపాదతీర్థ తళిగై ప్రసాదముల నివ్వలేదు. దానికి మూలమేమనగా తమకు సాక్షాదాచార్యులైన పెరియ నమ్బిగారును పరమాచార్యులైన యామునాచార్యులును నమ్మాళ్వార్లను గూడ శ్రీఉడైయవరుల వైభవమును వెల్లడి చేసియుండుటయే.

అదెట్లనగా అళవందారుల నియమము పైని కాంచీపురమునకు పెరియనంబిగారు వేం చేసి యెంబెరుమానార్ల ననువర్తించి సంస్కారములను కటాక్షించి ఎంబెరుమానార్ల ననువర్తించి సంస్కారములను కటాక్షించి ఎంబెరుమానార్ల వైభవమును అందరు తెలిసికొనునట్లు వెల్లడించి యుండిరి.

అట్లే యామునాచార్యులు **అముదల్వనివన్** అను ఆళ్వార్ల శ్రీసూక్తికి యెమ్బెరుమానార్లే లక్ష్యమని కాలక్షేపములో సాయించిరి.

నమ్మాళ్వార్లు కూడ **కలియుంకెడుజ్గణ్డుకొణ్మిన్** అను పాశురములో ఉడైయవరుల ప్రభావమునే భావిగా వెల్లడి చేసిరి. ఈ విధముగా ఉపదేశ పరంపరాప్రాప్తమైన ఉడైయవరుల వైభవమును పెరియనమ్బిగారి వలన వినియుండుట చేతనే కాంచీ పూర్ణులు ఉడైయవరుల ప్రార్థన నంగీకరింపలేదు.

ఆ విషయమునే వరవరమునులు తమ ఆర్తి ప్రబంధములో **శఙ్కర భార్కర** ఇత్యాది పాశురములో స్పష్టపరచియుండిరి. **వెఙ్గలియిఙ్గిని వీఱు నమక్కివైయెన్ఱు మిగత్తళర్‌నాళ్** అని సాయించిరి అనగా క్రూరమగు కలియుగము ఈ లోకమందిక మనవీర్యము చెల్లనేరదని మిక్కిలి తల్లడపడురోజు శ్రీఉడైయవరుల అవతార దినమే అని భావము.

నమ్మాళ్వార్ల శ్రీసూక్తిలోని **కలియుంకెడుమ్** అను వాక్యమున కిది వివరణముగా నున్నది కదా!

శ్రీకాంచీపూర్ణ యతివరులిద్దరి అవతార రహస్యమ్

శ్రీకాంచీపూర్ణ వింశతి అను స్తోత్రములో

దేవరాజ పదాంభోజే దివ్యస్వాంతం శఠద్విషః ।

పునర్వ్యక్తి భజేకాంచీపూర్ణం ముని పురందరమ్ ॥

అనగా దేవరాజ భక్తులగుట చేత నమ్మాళ్వార్లే తిరిగి అవతారమును పొందిన వారు కాంచీపూర్ణులని చెప్పబడెను., అట్లు చెప్పి

శఠజిద్దేవరాద్భక్తి శాలీ మంజుక విస్స్వయమ్ ।

రామానుజోభూత్తం వందే శ్రీకాంచీ పూర్ణవిద్వరమ్ ॥

అనగా శఠకోపుల యందు దేవరాజుల యందును భక్తి కల మధుర కవుల పునరవతారమైన రామానుజులగా నుండి దేవరాజుల శఠకోపుల పునః కైంకర్యమును చేసిరని చెప్పబడెను.

శఠజన్ముని దేవరాజు భక్తులే అగుటకు వారి దివ్య ప్రబంధములలో **“ఇమైయోర్‌తలైవా”** **“అమరర్గళదిపది”**, **“ఇమైయోర్తలైవన్”**, **“విణ్ణోర్ నాయకన్”**,**“తేవప్పిరాన్ ”**,**“తెయ్‌వత్తుక్కరశు”**, **“తేయ్‌వనాయకన్”** ఇత్యాదిగా అనేకచోట్ల దేవరాజులనే తలంచుచుండుట తార్కాణము. అట్టి దేవరాజభక్తులే అగు కాంచీపూర్ణులు నమ్మాళ్వార్ల పునరవతారమని చెప్పుటకు సందేహము లేదు. అటులనే **“తేవపిరానుదై కరియకోలత్తిరువురుక్కాణ్బన్‌నాన్”** అని సాయించిన మధురకవుల పునరవతారము దేవరాజార్చనరతులగు నట్టియు **“విగ్రహశ్రీశఠారాతిః”** అని చెప్పినట్లు **“తేవరాజుల కరియకోలముం”** (నల్లని దివ్య దేహము) అగు శఠారాతి అవతారమగు కాంచీపూర్ణుల యందాసక్త చేతస్కులైనట్టియు రామానుజులని చెప్పుటకు ఆటంకము లేదు. కనుకనే దేవరాజార్చన రతులై శఠజిదృణమోచకులై యుండిన రామానుజుల శఠార్య పరావతారమగు కాంచీపూర్ణుల నాశ్రయించిరి. అందువల్లనే అభియుక్తులు

కాంచీపూర్ణం స్తుమో యేన శఠకోపాత్మ నాశ్రితమ్

దేవేశం వీక్షితుంజజ్ఞే యతీం ద్రోమధురః కవిః అని సాయించి యుండిరి.

శ్రీపాద తీర్థాది పరిగ్రహ యోగ్యాచార్య నిర్ణయము

ఆర్త ప్రపన్నులగు ఆళ్వార్ల శ్రీపాదతీర్థాదికమును మధుర కవులు పరిగ్రహించినట్లు దృప్త ప్రపన్నులగు స్వాచార్యుల వద్ద గూడ సచ్ఛిష్యుడు శ్రీపాదతీర్థాద్యాన్వయము కలిగి యుండవలెను.

అయితే అట్టి దృప్త ప్రపన్న లక్షణములు ఆచార్యుని యందు అవశ్యకముగా మాత్రముండవలెను. దృప్త ప్రపన్నుడగు ఆచార్యుడు అర్థ కామాతురం క్రూరమ్ అని మొదలుకొని

ఏతాదృశ ప్రపన్నాంశ్చ వైష్ణవాన్ సర్వదా త్యజేత్ ॥

అను పాంచరాత్ర వచనము చొప్పున అర్థకామపరుడు క్రూరుడునైనవాడుగాను ఇంకను చెడుగుణములు కలవాడుగాను ఉండకూడదు. అంతకు వ్యతిరిక్తమైన సల్లక్షణములు కలిగియుండవలెను అని తెలియుచున్నది. అట్టి దోషయుక్తులగు ఆచార్యులే లోకములో నుండుట చేత అట్టి వారిని పరిత్యజించి దుర్లక్షణములు లేని ఆచార్యునే ఆశ్రయించి వారి వద్దనే శ్రీపాదతీర్థాది పరిగ్రహాన్వయమును సచ్ఛిష్యుడు పొందవలెను.

శ్రీవైష్ణవత్వ భంజకములగు మఱికొన్ని ఆచరణములు

శ్రీవైష్ణవోత్తములు ప్రాకృత బంధువులగు పుత్రాదుల మరణమందు అత్యంత శోకము పొందరాదు.

పుత్రదార వియోగాద్రై శోకం కుర్వీత బాంధవైః ।

ప్రపన్నః పరమైకాంతీ సర్వకర్మ బహిష్కృతః ॥

అని పాంచరాత్ర శాస్త్రము చెప్పుచున్నది. మరియు విషహరము వ్యాధి విమోచనము పిశాచోచ్చాటనము మొదలగు క్షుద్రమంత్రములను ఉపాసన చేయకూడదు.

విషనిర్హరణం చైవ పిశాచాది విమోచనమ్ ।

సమస్త వ్యాధి హరణం క్షుద్ర మంత్రం న సంగ్రహేత్ ॥

అని పాంచరాత్ర వచనము కలదు. అట్లే మన్మథ వికారమును కలిగించు ఉద్యానవనముల యందును శివ బౌద్ధాధ్యాలయ ప్రాంతముల యందును సంచరింపుచు అచ్చట నుండు పుష్పఫలాదులను శ్రీవైష్ణవుడు భగవదారాధనకు తెచ్చి ఉపయోగింపరాదు.

మనసిజ ప్రసంగ సల్లాపాన్ పరిహాసాది వర్జయేత్ ।

శైవ బౌద్ధస్కందాది స్థానాని న విశేత్క్వచిత్ ॥

వర్జయేత్తత్సమీపస్థ జల పుష్ప ఫలాధికమ్ ॥ అని మొదలుకొని

నార్చయేన్న ప్రణమే త్తత్తీర్థ సేవాదికం త్యజేత్

అను వఱకు శాస్త్రము చెప్పుచున్నది. కాబట్టి పైని వివరించిన పుష్పాద్యాహరణముతో పాటు తత్తత్ప్రదేశములకు వెళ్ళుట గూడ శ్రీవైష్ణవుడు వర్జింపవలెను.

ప్రపన్న వైష్ణవులకు పరిత్యాజ్యమైన పదార్థములు

ప్రపన్న శ్రీవైష్ణవులు పానీయం పాయసం భక్ష్యం ఘృతం లవణ మేవచ ।

హస్త దత్తం సగృహ్ణీయాత్ .... తామ్రేణ సంయుతంగవ్యం క్షీరంచ లవణాన్వితం ।

ఘృతంచ లవణైర్మిశ్రం ప్రయత్నేన వివర్జయేత్ ॥

అనిర్దశాహం గోక్షీరం అవత్సాయాంతథైవచ ।

ఔష్ట్రం మాహిష మాజంచ పశూనాం విద్భుజామపి ॥

అతీతం చ తథా తక్రం కరనిర్మదితం దధి ।

ఏతాదృశాన్యశుద్ధాని వర్జయేద్బ్రాహ్మణోత్తమః ॥

గృహ్ణీయాద్రాశిమద్యస్థం శాకమూలఫలాధికమ్ ।

... అలాబూత్రితయం తద్వన్మాహిషం క్షీరమేవచ ॥

తన్మాహిషం దధిఘృతం తస్యాస్త్ర క్రాదికం త్యజేత్ ।

తత్వ జ్ఞానస్య సిద్ధ్యర్థం విష్ణు సాయుజ్య సిద్ధయే ॥

ఏతన్నిషిద్ధ ద్రవ్యాణి సర్వదావర్జయేత్సుదీః ॥

అనగా తత్వజ్ఞాన సిద్ధి కలిగి విష్ణు సాయుజ్యమును పొందుటకీ క్రింది నిషిద్ధ పదార్ధములను వర్జింపవలెను. చేతిలో పోసిన నీరును గాని పాయసమును గాని భక్ష్యములను గాని నేతిని గాని ఉప్పును గాని చేతితో పట్టి ఉపయోగింపరాదు. రాగి పాత్రలో నుంచిన ఆవుపాలు మొదలగు గవ్యములను, ఉప్పు కలిపిన పాలను ఉప్పు కలిపిన నేతిని ప్రయత్న పూర్వకముగా వర్జింపవలెను. ఆవు ఈనిన పది రోజులలో దాని పాలను, పెయ్యచచ్చిన ఆవుపాలను, ఒంటె, గేదె, మేక, మలమును తినెడి ఆవు వీని పాలను, మరునాటికి నిలవయున్న చల్లను, చేతితో చిలకిన పెరుగును వర్జింపవలెను. ఇక నొకపోకగా విక్రయార్ధముంచిన కూరలు, దుంపలు, పండ్లు మొదలగు వానిని గ్రహింపవచ్చును.

కాని ప్రత్యేకము ఎత్తి ఇచ్చిన వానిని గ్రహింపరాదు. గుండ్రనిది కోలనిది చేదుది అగు సొరకాయలను వర్జింపవలెను. గేదెపాలు, పెరుగు, వెన్న, నెయ్యి, మజ్జిగ మొదలైనవి వర్జింపవలెను. అని తాత్పర్యము, వీని ఉపయోగము వలన మనస్సునకు నైర్మల్యము తగ్గుటయు, శరీరారోగ్యమునకు భంగము కలుగుటయు తటస్థించుట చేత తత్వ జ్ఞానమునకు భంగము కలిగి దాని వలన సద్గతికి ఆటంకము వచ్చును. మఱియు

ఉద్ధృత్య వామహస్తేన తోయం వక్త్రేణ యః పిబేత్ ॥

ససురాం వై పిబేద్వ్యక్తం సద్యః పతతి రౌరవే ॥

భుంజానో దక్షిణం హస్తం న సంయుజ్యా త్కదాచన ।

ఉద్ధృత్య వామహస్తేన తృషార్తః సలిలం పిబేత్ ॥

అనగా సామాన్యముగా వట్టి సమయములలో ఎడమచేతితో జలపాత్రను పట్టుకొని జలమును త్రాగకూడదు. అట్టి జలమును స్వీకరించిన మద్యపానముతో సమమగును. మఱియు పాతిత్యమును కలిగించును, కాని భోజన సమయమందు దప్పిక కలిగినచో నెడమచేతితో పాత్రను పట్టుకొని త్రాగవచ్చును. అప్పుడు కుడిచేతి సహాయమును చేసికొనరాదు. అట్లనే

శబ్దేనాపోశనం పీత్వా శబ్దేన దధిపాయసే ।

శబ్దేనాన్యరసం క్షీరం పీత్వైవ పతితో భవేత్ ॥

అనగా ఆపోశనోదకమును పెరుగును పాయసమును ఇంకను చారు, పులుసు, మజ్జిగ మొదలగు ద్రవ పదార్ధములను పాలను చప్పుడగునట్లు జుఱ్ఱరాదు. అది పాతిత్య హేతువుగాన వర్జింపవలెను.

గృహస్థునకు భార్యతో సహ శయనాదులలో నియమములు

గృహస్థుడగు బ్రాహ్మణమాత్రుడు ఈక్రింది విధముగా గార్హస్థ్య ధర్మమును నిర్వర్తింపవలెను.

తతస్స్వోచిత కార్యైశ్చ కుర్యా చ్ఛయనముత్తమమ్ ।

... తాంతు స్వలంకృతాం క్షౌమాంగచ్ఛేద్యుగ్మాసు రాత్రిషు ।

షోడశైవ నిశాస్తా సా మాద్యాస్తి స్రస్తు వర్జయేత్ ॥

పర్వసు బ్రహ్మచర్యేషు తథాశ్రాద్ధదినేషుచ

వ్రతోపవాస దివసే సూతకే మృతకే తథా ॥

శుభలగ్నే శుభదినే చంద్ర తారా బలాన్వితే

సకృద్గచ్ఛేత్ స్త్రియం మౌనీ పుత్రదారాభివీక్షణః ॥

అనగా స్త్రీ ఋతుమతి అయిన తరువాత మొదటి మూడు దినములు విడచి నాల్గవ దినము మొదలు పదునాఱవ దినము వరకు పండ్రెండు రాత్రులలో భర్త యథాక్రమమైన ఔపాసనాది నిత్యకర్మలను నిర్వర్తించుకొని రాత్రి అలంకరించుకొని క్షౌమవస్త్రమును ధరించి యుండు భార్యను పుత్రార్థియై సరి దినములు (4-6-8-10-12-14-16) రాత్రులందు ఒక్కమారే కూడవలెను. అందునను పర్వదినములు. బ్రహ్మచర్యము నాచరింపవలసిన దినములు, తల్లిదండ్రుల శ్రాద్ధ దినములు, వ్రతోపవాస దినములు, పురుడు మైల వచ్చిన దినములు అను వానిలో స్త్రీ సంయోగమును నియమిత దినములలో గూడ వర్జింపవలెను. ప్రథమ రజస్వల అయిన తరువాత ప్రథమ సంగమ దినమందు శుభలగ్నమును శుభదినమును చంద్ర తారాబలములను సరిగా చూచి అప్పుడే గర్భాదానమును చేసికొనవలెను. ఇక స్త్రీతో సంయోగించిన తరువాత భార్యతో నేకశయ్యయందు పరుండు విషయములో పరాశర సంహిత ఇట్లు చెప్పుచున్నది.

స్త్రీణాం తత్పురుషాణాంచ పుత్రోత్పత్త్యర్థ సంగమే ।

ద్వాత్రింశ స్మృత్తికాశ్చాపి భగేలింగేతు షోడశ ॥

కరయోః పాదయోస్తద్వత్కుర్యాద్గండూషణం దశ ।

త్యక్త్వా తత్కాల వస్త్రాణి హ్యుష్ణతో యేనవా తథా ॥

స్నానం కుర్యాత్ ... ధృత్వాచ శుద్ధ వస్త్రాణి చోర్ధ్వ పుండ్రాదికం తతః ।

పశ్చాచ్చందన తాంబూలం హరిశేషం స్రగాదికం ॥

పరిగ్రాహ్యంచ రాత్రౌతు పూర్వాధ్యాసితా సనాదికమ్ ॥

ఆచ్ఛాధ్య పస్త్రైస్తత్రైవ రాత్రి శేషం నయేత్సుధీః ॥

పూర్వోక్త భావ మమలం ప్రత్యహం వైష్ణవశ్చరేత్ ।

అనగా స్త్రీయును పురుషుడును పుత్రార్థులై సంయోగమును పొందినప్పుడు సంయోగ సమనంతరము స్త్రీ తన గుహ్యావయవమందు ముప్పది రెండు సారులు మృత్తికతో కడుగుకొనవలెను. పురుషుడు తన లింగము నందు పదునాఱుసారులు మృత్తికతో కడుగకొనవలెను.

అట్లే చేతులు కాళ్లయందు గూడ పురీషోత్సర్జనము నందు వలెనే మృత్తికలనిడుకొని కడుగుకొనవలెను. తరువాత పది గండూషములు (ఆరు, పదిసారులు పుక్కిలించి ఉమియుట) చేయవలెను.

అప్పుడది వఱుకు కట్టుకొనిన వస్త్రములు విడిచివేసి శీతకాలమైనను వేడినీటితో నైనను శిరస్స్నానము పురుషులు, కంఠ స్నానము స్త్రీలు చేయవలెను.

తరువాత శుద్ధ వస్త్రములను ధరించి ఊర్ధ్వపుండ్రములును స్త్రీపురుష విహిత ప్రక్రియలతో ధరించి తరువాత భగవచ్ఛేషములగు చందన తాంబూల స్రగాదికములను స్వీకరించి అది వఱకు వేసిన ఆసన శయనాదుల యందలి ఆచ్ఛాదనములను తీసివేసి క్రొత్త వస్త్రములను పరచి తెల్లవారు వఱకు అందుభయులును శయనింపవలెను అని భావము. వెనుక చెప్పబడిన నియమముల నన్నిటిని ప్రతి సంయోగార్హ రాత్రియందును జరుపుకొనుచుండవలెను. అంతకు వ్యతిరిక్తముగా ప్రవర్తించువారు పశుతుల్యులగుదురని యెఱుగవలెను. మృత్తికతో కడుగుకొనవలెను. పురుషుడు తన లింగము నందు పదునాఱు సారులు మృత్తికతో కడుగుకొనవలెను. అట్లే చేతులు కాళ్ల యందు గూడ పురీషోత్సర్జనము నందు వలెనే మృత్తికలనిడుకొని కడుగుకొనవలెను. తరువాత పది గండూషములు (ఆరు, పదిసారులు పుక్కిలించి ఉమియుట) చేయవలెను. అప్పుడది వఱకు కట్టుకొనిన వస్త్రములు విడిచివేసి శీతకాలమైనను వేడినిటితోనైనను శిరస్స్నానము పురుషులు, కంఠ స్నానము స్త్రీలు చేయవలెను. తరువాత శుద్ధ వస్త్రములు ధరించి ఊర్ధ్వపుండ్రములను (స్త్రీ, పురుష విహిత ప్రక్రియలతో) ధరించి తరువాత భగవవచ్ఛషములగు చందన తాంబూల స్రగాదికములను స్వీకరించి అది వఱకు వేసిన ఆసన శయనాదుల యందలి ఆచ్ఛాదనములను తీసివేసి క్రొత్త వస్త్రములను పరచి తెల్ల వారు వరకు అందుభయులును శయనింపవలెను అని భావము. వెనుక చెప్పబడిన నియమముల నన్నిటిని ప్రతి సంయోగార్హ రాత్రియందును జరుపుకొనుచుండవలెను. అంతకు వ్యతిరిక్తముగా ప్రవర్తించువారు పశుతుల్యులగుదురని యెఱుగవలెను.

దశవిధ విప్రభాగము అందలి విశేషము

దేవో మునిర్ద్విజో రాజా వైశ్య శూద్రో బిడాలకః ।
పశుర్మ్లేచ్ఛ శ్చ చండాలో దశవిప్రాః ప్రకీర్తితాః ॥

అని ఒక వచనము కలదు. దాని తాత్పర్యమేమనగా దేవతలు మునులు, బ్రాహ్మణులు, రాజులు, వైశ్యులు, శూద్రులు, పిల్లలు, పశువులు, మ్లేచ్ఛులు, చండాలులు అని పదివిధములుగా విప్రులుందురని తెలియుచున్నది. అందు దేవముని, బ్రాహ్మణులు తప్ప క్షత్రియాది సప్తవిధ విప్రులు అని చెప్పినవారు బ్రాహ్మణులై యుండియు ఆయా వ్యక్తుల వ్యాపారములను చేయుచుండువారని గ్రహింపవలెను. దీనికి కొన్ని ప్రమాణములు కలవు. మహాభారతములో భీష్ములు ధర్మరాజునకిట్లు చెప్పిరి.

ఐశ్వర్యం కామయేచ్చాపి సామిషార్థశ్చ భారత ।
నిగ్రహానుగ్రహరతస్తాన్ద్విజాన్ క్షత్రియాన్విదుః ॥
అశ్వారోహ గజారోహో రథినో ఉథ పదాతయః ।
ఏతే వైశ్య సమారాజన్ బ్రాహ్మణానాం భవత్యుత ॥
జన్మకర్మ విహీనాయే ... ఏతే శూద్ర సమారాజన్ బ్రాహ్మణానాం భవత్యుత ॥

అనగా ఐశ్వర్య కామియై మాంస భోజనమును కోరి పరులను నిగ్రహించుటకు, అనుగ్రహించుటకును ఉద్యుక్తుడగు బ్రాహ్మణుడు క్షత్రియ విప్రుడనిపించుకొనును. అశ్వాధ్యారోహణములు గల చతురంగ బలములలో చేరిన బ్రాహ్మణుడు వైశ్య విప్రుడనిపించుకొనును. కర్మలను యథాక్రమముగా నాచరింపక మరికొన్ని శూద్ర

వృత్తుల నవలంభించిన బ్రాహ్మణుడు శూద్ర విప్రుడనిపించుకొనును అని భావము అట్లే నిషిద్ధ స్థలములను పాటింపక భుజించువాడు బిడాల విప్రుడు. గమ్యాగమ్య వ్యవస్థను పాటింపక స్త్రీ సంయోగమును చేయువాడు పశు విప్రుడు. బ్రాహ్మణ ధర్మమగు శ్మశ్రుముండనాదికమును వర్జించి మ్లేచ్ఛ ధర్మముల నవలంభించువాడు మ్లేచ్ఛ విప్రుడు, కృత్యాకృత్య విచారము లేక చెప్పులు కుట్టుట మొదలగు చండాల ధర్మముల నాచరించువాడు చండాల విప్రుడు అని వివరము తెలియవలెను. అట్లు కాక దేవముని బ్రాహ్మణ ధర్మములగు పరిశుద్ధి తపము నిత్య నైమిత్తికాచరణము గలవారు దేవ విప్రులనియు, బ్రాహ్మణ విప్రులనియు చెప్పబడుదురు. మఱియు దేవ ధర్మముగా ఆశ్రిత పక్షపాతమనియు ముని ధర్మమనగా విరక్తత అని గూడ చెప్పవచ్చును. కాబట్టియే అనింద్యేషుచ విప్రేషు చరేద్భైక్షమతంద్రితః అని యతి ధర్మములలో చెప్పబడెను. అనింద్య విప్రులనగా దేవముని బ్రాహ్మణ విప్రులని భావము.

దురుక్తి దుర్వృత్తి గల ద్విజుల నింద్యత

బ్రాహ్మణుడై యుండియు వాగ్దోషము వలనను వృత్తిదోషము వలనను పాతిత్యమును పొందును. వాగ్దోషమెట్టి దనగా శ్రీ భారతము అశ్వమేధ పర్వములో

బ్రాహ్మణం స్వయమాహూయ భిక్షార్థం వృత్తి కర్శితమ్ ।
బ్రూయాన్నాస్తీతి యః పశ్చా త్తమాహు ర్బ్రహ్మ ఘాతుకమ్ ।
ప్రవృత్తాం చ శ్రుతిం సమ్యక్శాస్త్రం వా మునిభిః కృతమ్ ।
ధూషయత్య నభిజ్ఞో యస్తం విద్యాద్బ్రహ్మ ఘాతుకమ్ ॥

అనగా భిక్షావృత్తితో జీవించుచుండు బ్రాహ్మణుని భిక్షార్థము తనయింటికి రమ్మని పిలచి తరువాత లేదు పొమ్మను వాడును, శ్రుతులను, మునులు రచించిన శాస్త్రములను తెలివతక్కువ చేత నిందించువాడును బ్రహ్మహత్యాపాతకమును పొందునని చెప్పబడెను. అట్టి వాగ్దోషముగల బ్రాహ్మణుడు పతితుడగును. అటులనే వృత్తిదోషమును గురించి అచ్చటనే

గోకులస్యతృషార్తస్య జలాంతే వసుదాధిప ।
ఉత్పాదయతి యో విఘ్నం తమాహు ర్బ్రహ్మ ఘాతుకమ్ ॥
ఇక్షుదండ సహస్రాణా మేకై కేనయుధిష్ఠిర ।
బ్రహ్మహత్యా మవాప్నోతి బ్రాహ్మణస్త్విక్షుపీడకః ॥
తస్మాన్న పీడయేదిక్షుం యంత్రచక్రే ద్విజోత్తమః ॥
క్రీత్వావా ప్రతిగృహీత్వావా న విక్రేయాద్విజాతిభిః ।
భోజనాభ్యంజనాద్ధానాదో ఽ స్యత్తు కురుతేతివైః ॥
క్రిమిర్భూత్వాతు విష్ఠాయాం పితృభిస్సహమజ్జతి ।
తిలాన్యః పీడయేద్విప్రో యంత్ర చక్రే స్వయం నృపః ।
స ఏవ బ్రహ్మహామోహాన్నరకం యాతి రౌరవమ్ ॥

అనగా దప్పితో ఆవుల మంద నీటి యొద్దునకు వచ్చినప్పుడు వానిని నీరు త్రాగకుండ మళ్ళించి వేసినను, చెఱకు కఱ్ఱలను స్వయముగా గానుగలో నుంచి రసము పిండినను, భోజనాద్యంజన దానములకు తప్పు నువ్వులనుకటని గాని దానము పట్టిగాని అమ్ముట, నూనెనుపయోగించుట, స్వయముగా గానుగలో నూనెవాడుట అనునవి బ్రాహ్మణుడు చేసినచో పతితుడగును. నరకమును గూడ పొందునని చెప్పబడెను. కాబట్టి అట్టి దురుక్తి దుర్వృత్తులను సదా బ్రాహ్మణుడు వర్జింపవలెను.

సర్వేచ వేదాస్సహషడ్బిరంగై స్సాంఖ్యం పురాణం చ కులే చ జన్మ ।

నైతాని సర్వాణి గతిర్భవంతి శీలవ్యవేతస్య నృపః ద్విజస్య ॥

అనగా బ్రాహ్మణుడెంత సాంగవేదాధ్యయన శీలుడైనను శాస్త్ర పురాణాది వేత్త అయినను సద్వృత్తి లేనిచో వానికి సద్గతి యుండదని గూడ నచ్చటనే చెప్పబడెను. ఇంకను ప్రపన్నుడగు వైష్ణవ బ్రాహ్మణుడు స్వభార్యా పుత్రాదుల యందు మమతను విడువవలెను. జీవులందఱును భగవద్విభూత్యంతర్గతులను భావము కలిగియుండవలెను. అని ఈక్రింది ప్రమాణములు చెప్పుచున్నవి.

స్త్రీణాం స్త్రీ సంగినాం చైవ సంసర్గం వర్జయే త్సుధీః ।

తస్మాత్సర్వాత్మనా విద్వాన్విషయాన్విషవత్త్యజేత్ ॥

కర్తవ్యా శేషతాబుద్ధి ర్నాత్మన స్తనయాదిషు ।

విష్ణోర్విభూతి భూతేషు మమతాం వర్జయేత్సుధీః ।

ఏవం సద్గుణ సంపన్నా మహాభాగవత ప్రియాః ॥

అర్థ పంచక స్వరూపము తత్త్వాష్ట

శాస్త్రములలో అర్థపంచక స్వరూపమిట్లు చెప్పబడెను.

ప్రాప్యస్య బ్రహ్మణోరూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః ।

ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తే స్తథా ప్రాప్తి విరోధిచ ॥

వదంతి సకలావేదా స్సేతిహాస పురాణకాః ।

మునయశ్చ మహాత్మానో వేద వేదాంత వేదినః ॥

అనగా ప్రాప్యుడగు బ్రహ్మ యొక్క స్వరూపము, ఆయనను పొందువాడగు జీవుని యొక్క స్వరూపము, జీవుడు బ్రహ్మను పొందుటకు ఉపాయము యొక్క స్వరూపము, అట్లు పొందిన తరువాత అనుభవించు ఫలము యొక్క స్వరూపము. బ్రహ్మను జీవుడు పొందుటలో మధ్య ప్రతి బంధకమగు విరోధి స్వరూపము అను వానిని వేదములు, ఇతిహాసములు, పురాణములు తద్వేత్తలగు మునులను వివరించి యుండిరి అని భావము. ఇట్టి అర్థ పంచకము యొక్క యథార్థ స్వరూపమును తెలసికొనుటయే ముముక్షు జన కర్తవ్యము. అందు మొదటిదగు బ్రహ్మ స్వరూపము కేవల బ్రహ్మము నందు మాత్రమే పర్యవసింపక తదీయ పర్యంతము తెలియదగినదై యుండును అని ఈక్రింది ప్రమాణము చెప్పుచున్నది.

అర్చా తదీయ శేషత్వం కృపా భగవతః పరా ముఖోల్లాసేన

అనగా పరబ్రహ్మ యొక్క పరవ్యూహ విభవాంతర్యామ్యర్చలలో అర్చవలెనే తదీయులగు భాగవతుల విషయములో హరికి ఎక్కువ ముఖోల్లాసముండును గాన వారి విషయములో శేషత్వమును పాటింపవలెను. అట్టి వారి విషయములో ముఖోల్లాసము కలిగి హరికి విశేష కటాక్షముండునని భావము.

ఇట్టి కాష్ఠారూపమైన భగవత్స్వరూప జ్ఞానము కలుగుటకు అష్టాక్షరీ మంత్రోదిత నవవిధ సంబంధములను తెలిసికొనుటయే కర్తవ్యమని తెలియుచున్నది. ఆ నవవిద సంబంధములేవి యనగా

పితాచ రక్షక శ్శేషీ భర్త జ్ఞేయో రమాపతిః ।

స్వామ్యాధారో మమాత్మాచ భోక్తా చాద్య మసూదితః ॥

అనగా శ్రీమదష్టాక్షరీ మంత్రము చేత భగవంతుడు జీవునకు తండ్రి, రక్షకుడు, శేషి, భర్త, జ్ఞేయుడు, స్వామి, ఆధార భూతుడు, ఆత్మ, భోక్త అను తొమ్మిది విధములగు సంబంధములు కలిగియుండునని బోధింపబడునని చెప్పబడినదని భావము. అట్టి నవవిధ సంబంధములను తెలిసికొనిన జీవుడు భగవంతుని విషయములలో నాలుగు విధములైన దాస్యములను చేయవలెను. అవి యెవ్వి యనగా భర్తగా నుండు హరికి భార్యగాను, పితగా నుండు హరికి పుత్రుడుగాను, స్వామిగా నుండు హరికి భృత్యుడుగాను, ఆచార్యుడుగా నుండు హరికి శిష్యుడుగాను నుండవలెను. అదియే హరికి ప్రీతికరమని యీ క్రింది ప్రమాణము చెప్పుచున్నది.

ప్రపన్నానాం యథా సమ్యగ్విష్ణో ర్దాస్యం చతుర్విధమ్ ।

పతి భార్యాది సంబంధం పితృ పుత్రాదికం తథా

స్వామి భృత్యాది సంబంధం శిష్యాచార్యాధికం తథా॥

ఏత చ్చతుర్విధం దాస్యం విష్ణోః ప్రీతికరం సదా ॥

అని ఈ విధముగా అర్థపంచక కాష్ఠ నెఱిగి భగవంతుని విషయములోను భాగవతుల విషయములోను చతుర్విధ దాస్యములనాచరించు ప్రపన్న శ్రీవైష్ణవుడే యతులకు భిక్షా దానమందర్హుడని తెలియవలెను.

భగవద్భాగవతారాధనార్థ ద్రవ్యములు

ఇక ప్రపన్న శ్రీవైష్ణవుడు భగవద్భాగవతారాధనమున కర్హమైన విధముగా ద్రవ్యము నార్జించి భగవదారాధన పూర్వకముగా భాగవతారాధనమునకు దానిని వినియోగింపవలెను. అట్టి అర్హ ద్రవ్యమును గూర్చి వాసిష్ఠ స్మృతిలో

వృత్త్యర్థ మాచరే త్పశ్చా ద్యథాలాభమతంద్రితః ।

వైష్ణవేభ్యో నృపేభ్యశ్చ స్వయమేవార్జయే న్మహీమ్ ।

పిత్రార్జితేన వా కుర్యా త్స్వస్య వృద్ధి ఫలోదయమ్ ।

కృషిణావా పి జీవేత పరాశర మతేఽ పి వా ॥

కృషికర్మణ్య శక్తస్తు విప్రేభ్యో లంబయేద్ధనం

పాషండ పతితాదిభ్యః కదాచిన్నైవ యాచయేత్ ॥

ముష్టిమాత్రంతు థామం వా యాచయే త్సద్గృహే గృహీ ।

తదభావే శిలోఞ్ఛేన జీనన్భుఖ్యా ద్విజోత్తమః ॥

నా న్యాయే నార్జయే ద్ద్రవ్యం పరమాపద్గతో ఽ పి వా।

అనగా విష్ణుభక్తులగు రాజుల వద్ద దాన రూపముగా భూమిని ఆర్జించుట, ఆ విధముగానే తన తండ్రి తాతలు, అర్జించిన దానిని వినియోగించుకొనుట, భూమిని తాము స్వయముగా కృషి నాచరించి దాని ఫలమును ఉపయోగించుకొనుట, అట్లు కృషిని చేయలేనప్పుడు బ్రాహ్మణుల వద్ద ధనమును యాచించుట, సత్పురుషుల గృహమందు ముష్టి మాత్రముగా బియ్యమును యాచించుట, అదియు లభింపనప్పుడు వ్యవసాయదారులు చేసిన వ్యవసాయ సస్యములో దిగువ రాలిపోయిన వెన్నులను గాని గింజలను గాని ఏరి తెచ్చికొనుట అను సద్వృత్తుల చేత సంపాదించిన ద్రవ్యమునే భగవద్భాగవతారాధనములో వినియోగింపవలెను. కాని పాషండ పతితాదుల వద్ద నేనాడును యాచించి ద్రవ్యమును సంపాదింపరాదు అని చెప్పబడెను. ఈ ప్రమాణములో పరమాపద్గతోపివా అని చెప్పబడుట చేత

అప్యకార్య శతం కృత్వా భర్తవ్యామనురబ్రవీత్

అను మను వచన ప్రకారము కుటుంబ భరణమున కెన్ని అకార్యములనైనను చేయవచ్చునను సామాన్య వచనము ప్రపన్నులు పాటింపరాదని తెలియుచున్నది. ఇంకను

ధాన్యం వాసాంసి భూమించ సువర్ణం రత్నమేవచ ।

పుష్పాణి ఫల మూలాధ్యం సద్ద్రవ్యం మునిభి స్మృతమ్ ॥

సర్వతః పరిగృహ్ణీయా ద్భూమిం ధాన్యం ఫలాదికమ్

అను వచనముల ప్రకారము ధాన్యము, వస్త్రము, భూమి, బంగారము,రత్నములు, పూలు, పండ్లు, దుంపలు మొదలగునవి సద్ద్రవ్యములనబడును. అట్టి సద్ద్రవ్యములను విష్ణుభక్తులగు నన్ని వర్ణముల వారి వద్దను శ్రీవైష్ణవ ద్విజుడు గ్రహింపవచ్చును. అయితే అట్టి వారు (దాతలు) విష్ణుభక్తులై యే యుండవలెను. ఏమనగా

అసత్ప్రతిగ్రహం స్తేయ మాపద్యపి వివర్జయేత్ ॥

అను వచన ప్రకారము అసత్పురుషుల వద్ద ప్రతిగ్రహము దొంగతనము వలె ఆపత్కాలమందు గూడ చేయరాదను నిషేధము కలదు కనుక అసత్పురుషులగు పాషండ పతితాదుల వద్ద ప్రతిగ్రహింపరాదని తెలియవలెను. అటులనే అశనాచ్ఛాదనములకు లోపము లేనప్పుడు బ్రాహ్మణ శ్రీవైష్ణవుడు అర్థాతురుడై ద్రవ్యార్జనము చేయరాదని శాస్త్రములు చెప్పుచున్నవి.

అత్యుష్ణా త్సఘృతా దన్నా దచ్ఛిద్రాచ్చైవ వాససః ।

నేతర ప్రేష్య భావాత్తు భూయ ఇచ్ఛే త్సతత్యథః ॥

అసంతోష్టో ద్విజో నష్టః అనగా ఆపూటకు పండుకొను అన్నము అభిఘారమునకు నెయ్యి, చినిగిపోని వస్త్రము ఉండినప్పుడంతకంటె నెక్కువ కాశపడి ఇతరుల వద్ద నౌఖరీ చేసి ద్రవ్యార్జనము చేయు అసంతుష్ట ద్విజులు పతితులై నష్టపోదురని భావము.

శ్రీవైష్ణవులుకు పాకశుద్ధ్యావశ్యకత

శ్రీవైష్ణవ బ్రాహ్మణులలో భగవద్భాగవత నివేదనార్థము సిద్ధము చేయు పదార్థముల యొక్కయు వానిని సిద్ధపఱచు వారి యొక్కయు తత్పరికరముల యొక్కయు శుద్ధ్యాదులీ క్రింద వివరించెదము. పాకము శ్రీవైష్ణవ సువాసినీ స్త్రీలే ఆచరింపవలెను. వారి ఆచరణ మీక్రింది వచనానుసారముగా నుండవలెను. ఎట్లనగా,

భర్తుః పురాస్తా దుత్థాయ కృత శౌచక్రియా విధిః ।
దంతధావన పూర్వతంతు కంఠ స్నానం సమాచరేత్ ॥
హరితా సహితేనైవ స్నాత్వా శుద్ధాంబరావృతా ।
శ్రీశం సత్వా గురు న్నత్వా పశ్చా త్కర్మి సమాచరేత్ ॥
ఆత్మానం సమలంకృత్య చింతయే న్మధు సూదనమ్ ।
శోభయే చ్ఛుద్ధ భూభాగే వ్రీహి ముద్గ తిలాదికాన్ ॥
కాక పశ్వాది భూతానా మప్రాప్యే సంవృతాంబరే ॥
ఉపలిప్త శుచౌదేశే శుద్ధై శ్శూర్పాది సాధనైః ॥
వ్రీహి ముద్గా దివం సర్వ మవహన్యుః కులాంగనాః ।
అస్పృశంత్యో నిజం దేహం అజల్పంత్య స్తథా స్త్రియః ॥
అవహన్యుః శుభకరం గాయంత్యో మధుసూదనమ్ ।
అవహంత్య శ్రమాంబూని జీర్ణ వస్త్రేణ మార్జ్యచ ॥ **ఇతి మార్కండేయ**

అనగా సువాసినీ స్త్రీలు తమ భర్తల కంటె ముందు మేల్కొని లేచి మలమూత్రాది విసర్జన శౌచక్రియ చేసికొని దంతధావనము చేసికొని పసుపు రాసికొని కంఠస్నాన మాచరించి శుద్ధవస్త్రమును ధరించి ఊర్ధ్వపుండ్ర రూప తిలకాదుల నిడికొని భగవంతునికి ఆచార్యునికి మానసిక వందనమాచరించి తరువాత గోమయముతో నలికి శుద్ధపఱచబడిన భూభాగమందు కాకులు, పశువులు మొదలైనవి స్పృశింపరాని సావరణ ప్రదేశమందు ధాన్యము, పెసలు, నువ్వులు మొదలైన వానిని పరిశుద్ధమైన చేటతో బాగుచేసి వానిని హరినామగానముతో తన వంటి సువాసినులతో కలసి దంపవలెను. అట్లు దంపుచుండునప్పుడు తమ శరీరములను చేతితో తాకరాదు. బహుభాషణములను చేయక భగవత్కీర్తసములను గానము చేయుచుండవలెను. శరీరమునకు చెమట పట్టినచో కట్టుబట్టతో తుడిచికొనక వేఱుగా నుండు గుడ్డతో తుడుచుకొనవలెను. అని భావము కల ఈ వచనములు మార్కండేయ పురాణమునందు చెప్పబడెను. తరువాత

గృహ భాండాదికం సర్వం వాగ్యతా నియతేంద్రియా ।
సంశోధయే త్ప్రతి దినం యజ్ఞార్థం పరమాత్మనః ॥

.... ననిదధ్యాదారనాళ ఘటం తస్మిన్ మహానసే ।
ఆరనాళస్య యత్కుంభం త్యజేన్మద్య ఘటం యథా ॥
కేశనాంరంజనార్థం వానస్పృశేదారనాళకమ్ ।
మాషముద్గాది చూర్ణం వాతక్రంజాంబీర మేవచ ॥
తింత్రిన్యాశ్చ కషాయం వా కేశరంజన మాచరేత్ ।
ఊర్ధ్వం మాసాత్త్యజేత్సర్వాన్ మృద్భాండాన్వైష్ణవోత్తమాః । పరాశరః
మృణ్మయేషునతేష్వేవ శక్తాచేత్పాచయేద్ధవిః ।
పక్షాదూర్ధ్వం న కర్తవ్య మృణ్మ యే పాచన క్రియాః ॥ శాండిల్య

అనగా గృహమును భాండాదికమును ప్రతిదనము వాజ్నియమముతోను ఇంద్రియ జయముతోను కూడి భగవన్నామోచ్చారణ పూర్వకముగా శోధింపుచుండవలెను. ఆ విధముగా శోధించిన స్థలమందే శోధించిన పాత్రలతోనే భగవన్నివేదనార్హ పదార్థములను వచింపవలెను.

తళియ (వంట) చేయు గృహములో తరవాణి కుండను మధ్య భాండము వలె నెప్పుడును ఉంచరాదు. మఱియు స్త్రీలు కేశములను శోధించుకని స్నానము చేయుటకెప్పుడును తరవాణి వాడకూడదు. అట్లు శోధించుకొనుటకు మినపపిండి, పెసరపిండి (వరి పిండి కలిపినది) మజ్జిగ, నిమ్మరసము, చింతాకు కషాయము వీనినుపయోగించుకొనవలెను. ఇక పాకాదులకు ఉపయోగించు కుండలను నెలదాటగనే పరిహరింపవలెను. తిరిగి క్రొత్త వానితోనే పాకము చేయవలెను.

అట్లు కుండలతో పాకము చేయుటకు శక్తురాలు కానిచో లోహపాత్రలతో పాకము చేయవచ్చును.

అంభ స్త్రి వారం వస్త్రేణ శోధయిత్వా ఘటాంతరే ।
కుశైనైవ పవిత్రేణ తండులాన్నిర్వపేచ్ఛుభాన్ ।
అంతర్ధాయకుశాం స్తత్ర మంత్రరత్న మనుస్మృతేః ॥
పాచయేత్స పవిత్రేణ వాగ్యతా నియతేంద్రియా ।
.... విష్ణ్వగ్నౌ యదివాయోగ్య గృహాగ్నౌ పచన క్రియా ।
కుండ మధ్యే తథాలక్ష్మీం సర్వాభరణ భూషితామ్ ॥
లక్ష్మీనారాయణం ధ్యాత్వా సర్వ లక్షణ లక్షితమ్ ।
చతుర్బాహుం విశాలాక్షం కోమలం పీత వాససమ్ ॥
శంఖ చక్ర గదా పద్మై స్చతుర్భిః కృత లక్షణమ్ ।
... ఏవం ధ్యాత్వా సమభ్యర్చ్య కుండమధ్యే విశేషతః ।
యాజ్ఞీయైర్విమలైః కాష్ఠైః వ్యజనేన ప్రదీపయేత్ ॥
యాజ్ఞీయై శ్చతృణైర్వాపి గోశకృత్పిండకై శ్శుభైః ।
అగ్నౌ ప్రజ్వలికే సమ్యక్పాచయే దోద న్నాదికమ్ ।
చింతయంతీ పరాత్మానాం జపంతీ శరణాగతిమ్ ॥

అనగా నీళ్లను మూడుసార్లు వేఱు వేఱు ఘటములలోనికి గుడ్డతో వడియ గట్టి ఆ నీటిలో కుశ పవిత్రము నుంచి దానితో ద్వయో చ్ఛారణ పూర్వకముగా బియ్యమును కడుగవలెను. అట్టి పవిత్రమైన జలముతో పాక క్రియ చేయవలెను. పాక సమయమందు వాఙ్నియమము, ఇంద్రియ నియమము కలిగియుండవలెను. అట్లు పాకము చేయుటకు హోమకుండాగ్నిని కాని శ్రోత్రియుల ఇండ్లలోని అగ్నిని గాని ఉపయోగింపవలెను. అగ్నిని ప్రజ్వలింప చేయునప్పుడు పొయ్యిలో లక్ష్మీనారాయణులను సర్వలక్షణోపేతులనుగా ధ్యానించి మనస్సుతో అర్చించి ఈక్రింద చెప్పబోవు అర్హమైన కట్టెలను శోధించి వానితోను తృణములతోను గోమయ పిండములతోను అగ్నిని విసనకఱ్ఱ గాలితో రగల్చి బాగుగా మండిన తరువాత ఓదనాదులను పాకము చేయవలెను. అట్టి సమయములో ఇతరాసక్తులు మాని పరమాత్మను ధ్యానింపుచు మంత్రరత్నము (ద్వయము) ను అనుసంధింపు చుండవలెను. మఱియు

వస్త్రం కేశం శరీరం వా స్పృష్ట్వా ప్రక్షాళయేత్కరమ్ ।
నాసోదకం నేత్ర వారి స్వేదాంబూని తథైవచ ।
న స్పృశే జీర్ణ వస్త్రేణ మార్జయే చ్ఛోధయేత్కరమ్ ॥

వాకము చేయుచుండునప్పుడు తాను కట్టుకొనిన బట్టను గాని జుత్తును గాని శరీరమునుగాని ముట్టుకొనినచో వెంటనే చేతులు కడుగుకొనవలెను. ముక్కులోని నీరు, కన్నీరు, చెమటనీరు వీనిని చేతితో తాకక చినిగిన గుడ్డతో తుడుచుకొని చేతులు కడుగుకొనవలెను. ఇక పాకము చేయు పదార్థం

అసురంస్యా ద్విదగ్ధం యదపక్వం రౌద్రమేవ చ ।
దైవం శుశ్రితమే వాతః కర్తవ్యం సుశ్రితం హవిః ॥
పౌషీ ద్రవ్యస్య శుద్ధి సార శుద్ధిస్తు దైవికీ ।

అనగా మాడినచో ఆసుర మనబడును. సరిగా నుడకనితో రౌద్రమనబడును. చక్కగా పాకమైన దైవమనబడును. కాబట్టి దైవపాకముగా సిద్ధము చేయవలెను. ఏ వస్తువైనను శుద్ధినందవలెననిన నెండలో నుంచవలెను. పాకము శుద్ధముగా నుండవలెననినచో సమ్యక్పాకముగా నుండవలెను. తరువాత

పాకస్థానం గృహం సర్వం విమృజ్యాభ్యుక్ష్య వారిణా ।
ఆచ్ఛాద్య వస్త్రమన్యచ్ఛ సమాచామేత్కుటుంబినీ ॥
ప్రవిశ్య భగవద్గేహం దీపం ప్రజ్వాల్య గేహినీ ।
కాంక్షంతీ భర్తురాయానం తిష్ఠేచ్ఛ పరిచారికా ॥

పాకము చేసిన స్థలమును పాకగృహమును (దేవ గృహమును) తుడిచి నీళ్లు చల్లి తానింకొక వస్త్రమును ధరించి ఆచమనము చేసి భగవదారాధన గృహములో ప్రవేశించి భగవత్సన్నిధిని దీపమును వెలిగించి భర్త రాక కెదురు చూచుచు నచ్చటనే పరిచర్యార్థము కనిపెట్టి ఉండవలెను.

ఇక యజ్ఞార్థం తు పచేదన్నం నాత్మార్థంతు కదాచన

అని చెప్పబడుట వలన పాకము చేసిన పదార్థములు భగవన్నివేదన కొరకే గాని తాము తినుట కాని తలంచరాదు. పాకము చేయుటకు అర్హమైన కట్టెలను గూర్చి ప్రసంగ వశమున చెప్పెదము,

పాలాశఖాదిరాశ్వత్థ వైకంకత సమీవటాః ।
వైణ్వోదుంబర భైల్వాశ్చ యజ్ఞవృక్షాః ప్రకీర్తితాః ॥
అమేధ్యగంధకాష్టాని కంటకాన్ విస్ఫులింగకాన్ ।
అంతః ప్రాణ్యుపపన్నాని సోచ్ఛిష్టాని వివర్జయేత్ ॥
కేశ కీటాది సంయుక్తాన్యమేధ్య స్పర్శనానిచ ।
విభీతకం తథాశిగ్రుం కార్పాసైరండకం తథా ॥
ఏవమాదీని కాష్టాని నవహ్నౌ వినియోజయేత్ ।
మహిష్యశ్వఖరోష్ట్రాది పశ్వాదీనాం తు వర్జయేత్ ।
శుష్కం గవ్యం కరీషంతు శుద్ధ యగ్నౌ ప్రదీప్తయేత్ ॥

అనగా మోదుగ, చండ్ర, రావి, తుమ్మ, జమ్మి, మఱ్ఱి, వెదురు (మేడి), మారేడు వీని కఱ్ఱలను భగవదర్హ్వ ప్రసాద పాకమునకు ఉపయోగించవలెను. చెడుకంపు వచ్చెడి కఱ్ఱలను ముండ్ల కంపలను మిణుగురులు లేచెడి చిట్ల మొదలగు కఱ్ఱలను, కొఱకంచులను (కొంతకాల్చి ఆర్పిన కొరువులన) వర్జింపవలెను. అట్లే తల వెంట్రుకలు పురుగులు చుట్టుకొని యుండు కఱ్ఱలను అపవిత్ర పదార్ధములంటి యుండు కఱ్ఱలను తాడి, మునగ, ప్రత్తి, ఆముదము వీని కఱ్ఱలను పాకార్ధముకు ఉపయోగింపరాదు. గేదె, గుఱ్ఱము, గాడిద, ఒంటె మొదలగు వాని పేడలను ఉపయోగింపక కేవలము ఆవుపేడతో పెట్టబడిన పిడకలనుపయోగింప వచ్చును. భగవన్నివేదనార్థము అర్హములగు పదార్ధముల వివరము చెప్పెదము.

విష్ణోర్నివేదనార్థాయ పాతయోదోద నాదికమ్ ।
స్నిగ్ధం పథ్యం తథా శుభ్రం రుచ్యం దివ్యం మనోహరమ్ ॥
మరీచలవణాజ్యామ్ల గుడసూపాది సంయుతమ్ ।
పాచయేచ్ఛాకమూలాది భక్ష్యం శుద్ధం మనోహరమ్ ॥
కదళీకారవేల్లీచ పటోలీ బృహతీ ద్వయమ్ ।
ఉపాదేయానిశాతాని పవిత్రాణి నివేదయేత్ ॥

అనగా మృదువై స్నేహయుక్తమై ఆరోగ్యకరమై పరిశుద్ధమై రుచికలిగి దేవార్హమై మనోహరమగు నీ క్రింది పదార్ధములచే భగవన్నివేదనకు ఉపయోగింపవలెను. మిరియము, ఉప్పు, నెయ్యి, పులుసు, బెల్లము పప్పులు వీనిని ఉపయోగింపవలెను. వీనితోనే కూరలు, భక్ష్యములు, మనోహరముగా శుచిగా పాకమొనర్చవలెను. వీనితోనే కూరలు భక్ష్యములు మనోహరముగు శుచిగా పాకమొనర్చవలెను. అరటి, కాకర, పొట్ల, పణత పొట్ల, పెద్ద ములక, వాకుడు, ములక, ఇట్టి ఆరోగ్యము రుచి నిచ్చు కూరలను ఉపయోగింపవలెను. ఇక నిషిద్ధ శాకాదులెవ్వియనగా

శూనకం తిలపిష్టం చ లశునం కాక తుండకం ।
తథైవ మూలకంశైగ్ర్యం సంత్యజే ద్వైష్ణవోత్తమః ।
అభక్ష్యాణి నిషిద్ధాని సర్వాలాభేపి వర్జేయేత్ ।
కేశకీటాదిభిర్జుష్టం విదగ్ధం మిశ్రితంతువాః ।
శాకౌదనాదికం సర్వం సర్వదా పరివర్జయేత్ ॥

అనగా పుట్టకొక్కు (కుక్క గొడుగు), తెలికపిండి, ఉల్లిపాయలు, కాకి గొండ, ముల్లంగి దుంప, మునగకాడలు వీనిని వైష్ణవులు త్యజింపవలెను). ఇంకను ధర్మశాస్త్రములలో భక్షింపరానివిగా చెప్పబడినవి గూడ నేమి లేని సమయమందు గూడ వర్జింపవలెను. తల వెంఱ్రుకలు, పురుగులు వీనితో చేరినవి, మాడిపోయినవి, రెండు, మూడు కలిపి వండినవి వర్జింపవలెను. ఇంకను

అత్యుష్ణమతి రూక్షం చ శుష్కం పర్యుషితం తథా ।

ముఖవాయుహతం ఘ్రాతం రజోదూషణకాన్వితమ్ ॥

మృత్పాషాణ శకృద్భిశ్చ దూషితం ననివేదయేత్ ।

మండూక కాక శునక బిడాలాద్యైశ్చ జంతుభిః ।

స్పృష్టం దృష్టం హవిశ్చైవ దేవాయన నివేదయేత్ ॥

అనగా మిక్కిలి వేడిదిగాను ఏమియు జిడ్డులేనిది గను ఎండిపోయినదిగను తొలినాటి నిలవయున్నదిగను నోటితో నూదినదిగను వాసన చూచినదిగను, బుగ్గి మొదలగునవి చేరినదిగను మన్ను రాళ్ళు జంతువుల నిష్టలు వీని చేత ధూషితమైనదిగను, కప్పలు, కాకులు, కుక్కలు, పిల్లులు మొదలగు అపవిత్ర జంతువులు స్పృశించినట్టి చూచినట్టిదిగా నుండునదియునగు పదార్థమును భగవంతునికి నివేదన చేయరాదు. ఇక భగవన్నివేదనార్హ పదార్థములను చెప్పెదము.

హవిష్యం వ్యంజనై ర్యుక్తం హృద్యముష్ణం సమర్పయేత్ ।

నైవేద్యం సూపదధ్యన్నం పాయసాపూప సంయుతమ్ ।

ఫలైశ్చ భక్ష్య భోజ్యైశ్చ పానకైర్వ్యంజనై స్సహ ॥

గవాజ్యం చ దధిక్షీరం శర్కరాంతు నివేదయేత్ ।

గవ్యాదికస్యాభావేతు వర్జయేదితరత్పయః ॥

ఔష్ట్రం మాహిషమాజం చ పశూనాం విద్భుర్ఘామపి ।

తత్తత్ క్షీరాదికం సర్వం ప్రయత్నేన వివర్జయేత్ ॥

అనగా భగవనివేదనార్హమైన ఘృత సహితాన్నము వ్యంజనములు హృద్యములై సుఖోష్ణములై యుండు వానినే భగవంతునికి నివేదింపవలెను. పప్పు, పెరుగు, వీనితో గూడిన అన్నము (పొంగలి, దద్యోదనము) పాయసము, అప్పములు, పండ్లు, పిండి వంటలు, పానకము, కూరలు, పచ్చడులు, ఆవుపాలు, పెరుగు, నెయ్యి,పంచదార వీనిని నివేదింపవచ్చును. ఆవుపాలు మొదలగునవి లభింపనప్పుడు గేదె, ఒంటె, మేక మొదలగు వాని పాలు మొదలగునవి నివేదింపరాదు. అతి వేడిగా నుండు పాలు మొదలగు వానిని నివేదింపరాదు. ఇట్లు నియమములను పాటించి సమకూర్చి నివేదించిన పదార్థములను భాగవతులతో గలసి భుజింపవలెను. భగవంతునికి తన ఆరాధనము కంటె తన దాసుల ఆరాధనమే మిక్కిలి ప్రియమగునని **మత్పూజనా త్ప్రియతమం మద్భక్తానాం నివేదనమ్** అను భగవద్వచనము వలన స్పష్టము.

ఈ విధముగా పాకాదికమును సనియమముగా శ్రీవైష్ణవ గృహస్థులు ఆచరింపవలెను. అట్టి వారి గృహమందే యతులు భిక్షము నాచరింపవలెను.

శ్రీవైష్ణవుల తిరువారాధన ప్రకారము

శ్రీవైష్ణవ గృహస్థులు ప్రతిదినము భగవదారాధనమును చేసికొనవలెను. అందుకు పూర్వము స్వాచరణమును గూడ నియమానుసారము నడుపుకొనుచుండవలెను. ఆ విధాన మీక్రింద ప్రమాణ వచనములతో నిరూపించెదము. వాసిష్ఠ స్మృతిలో నిట్లు చెప్పబడెను.

శృణుధ్వం మునయ స్సర్వే హరేః పూజా విధిం పరమ్ ।
నిత్య మారాధనం చాదౌ వక్ష్యామి మునిసత్తమాః ॥
బ్రాహ్మే మూహుర్తే చోత్థాయముఖం ప్రక్షాళ్య వాగ్యతః ।
ఆచమ్య ప్రయతో భూత్వా జపేద్గురు పరమ్పరామ్ ॥
యోగ ధ్యాన విధానేన ధ్యాయే ద్విష్ణు మతంద్రితః ।
మనసా మంత్ర రత్నేన సంపూజ్య చ వినమ్య చ ॥
సంకీర్త్య నామభిర్దివ్యైః స్తుత్వా స్తుతిభిరేవ చ॥
గచ్ఛేద్గ్రామాద్బహిః పశ్చాద్వాగ్యతో నియతేంద్రియః ॥
నైర్ఋత్యాం పశ్చిమే నాథ శుద్ధదేశే చ నిర్జనే ।
న చ సస్యసమాయుక్తే న హాలోత్థచితే తథా ॥
విణ్మూత్రం విసృజే త్తత్ర కుర్యాచ్ఛౌచం విధానతః ।

అనగా ప్రతి వైష్ణవుడును గృహస్థుడై ఉండిన వాడు నాలుగు గడియల రాత్రియుండగా అంతకు పూర్వమే నిద్రమేల్కొని మౌనముతో ముఖమును నోటిని కడుగుకొని గండూషము చేసి ఆచమనమొనర్చి గురుపరంపరాను సంధాన పూర్వకముగా హృదయమందు శ్రియఃపతిని ధ్యానించి మంత్ర రత్నాను సంధాన పూర్వకముగా పూజించి స్తోత్రము చేసి తరువాత మౌనముతో గ్రామమునకు నైఋతి మూల లేక పశ్చిమ దిక్కు వైపు విజన ప్రదేశమునకు చని అచ్చట సస్యములు గాని దున్నిన ప్రదేశము గాని కాకుండు శుద్ధ ప్రదేశములో మలమూత్రోత్సర్జనము నాచరించి తరువాత ప్రక్షాళనము మృత్తికాది శౌచము యథా శాస్త్రముగా చేసికొనవలెను. తరువాతను

వక్త్ర జిహ్వాది శుద్ధ్యర్థం నిత్య నైమిత్తికాదిషు ।
త్రింశ ద్గండూషణం కుర్యా ద్వక్త్రం సంశోధ్య సద్ద్విజః ॥
ఆచమ్య పూర్వవత్ పశ్చాత్స పవిత్రకరో ఽ పి చ।
నదీ తటాక వాప్యాదౌ తతః స్నానం సమాచరేత్ ॥
అఘమర్షణ సూక్తేన పుంసూక్తేన హరిం స్మరన్ ।
మూలేన మంత్ర రత్నేన స్నానం కుర్యాదతంద్రితః ॥
ఉత్తీర్య పీడయేద్వస్త్రం పునరాచమనం చరేత్ ।
సోత్తరీయం సకౌపీనం వస్త్రం యోత్రంతంతుధారయేత్ ॥

ఆచమ్య ధారయేత్పుంద్రాన్మృదా శుభ్రేణ సద్విజః ।

సంధ్యాముపాస్య విధి వజ్జప్త్వాజప్యంతు పూర్వవత్ ॥

తర్పయేన్మంత్ర రాజేన శక్త్యాదేవం జనార్ధనమ్ ।

అనృశంస్యేన భావేన దేవాదీనపి తర్పయేత్ ॥

అనగా దంతధావన మొనర్చి జిహ్వానిర్లేఖనము చేసికొని ముప్పది పర్యాయములు గండూషము చేయవలెను. వెంటనే ఆచమనము చేసి చేత దర్భపవిత్రమును ధరించి నదియందు గాని తటాకమందు గాని వవి యందు గాని ధృత వస్త్రములను ముందు తడిపి వానితో కటిభాగము నాచ్ఛాదించుకొని నీటిలో దిగి అఘమర్షణ పురుష సూక్త మూలమంత్రముల ననుసంధింపుచు హరిని ద్యానింపుచు స్నానమాచరింపవలెను. పిదప నొడ్డునకు వచ్చి తడిబట్టలను పిండి శరీరమును తుడుచుకొని ఆచమనము చేసి కౌపీనము కట్టుబట్ట ఉత్తరీయమును శుద్ధమైన పొడివానిని యథాక్రమముగా ధరించి ఆచమనము చేసి శ్వేత మృదూర్ధ్వపుండ్రములను యథాస్థానముల యందు ధరించి సంధ్యావందనము నాచరించి మూలమంత్ర జపమును చేసి అష్టాక్షరితోనే యథాశక్తిగా శ్రియఃపతికి తర్పణమొనర్పవలెను. పిమ్మట ఆనృశంస్య బుద్ధితో దేవ పితృఋషి తర్పణము చేయవలెను. అటుపైని

పుష్పాణ్యాదాయ పూజార్థ మారామేవాప్యరణ్యకే ।

ఉపాదేయాని పుష్పాణి పూజార్థం గృహమావిశేత్ ॥

ప్రక్షాళ్య పాదౌ హస్తౌ చ సమ్యగా చ మనం చరేత్ ॥

యాగభూమిం ప్రవిశ్యాద్భిః సంప్రోక్ష్యాత్తం చ విన్యసేత్ ॥

ఉపవిష్టో గృహేరమ్యే రంగవల్ల్యాది శోభితే ।

ప్రదీపైర్ధృత సంపూర్ణై శుభైర్ధీపైర్విరాజితే ॥

సుపుష్ప మంటపే తస్మిన్నర్చయేత్పీఠకం శుభమ్ ।

అనగా వెనుక చెప్పబడిన ప్రకారము అర్హమైన తోటలోగాని చిన్న అడివిలో గాని దేవార్హ పుష్పములను కోసి తీసికొని

వస్త్రానీతం కరానీతం ధరణ్యాపతితం తథా ।

కృమిజుష్టం కేషజుష్టం పుష్పం యత్నే వర్జయేత్ ॥

అను నియమానుసారముగా బట్టలో గాని చేతిలో గాని ఉంచికొనక ప్రత్యేకపు పుష్పభాజనము (సజ్జ) లో నుంచి తెచ్చి గృహములో ప్రవేశించి పాద ప్రక్షాళనము, హస్త ప్రక్షాళనము చేసికొని ఆచమనము చేసి భగవదారాధన గృహమున ప్రవేశించి అది వఱకే తన గృహిణి చేత వెలిగింపబడిన ఘృత దీపములు వేయబడిన ముగ్గులు మొదలైనవి గల ప్రదేశమున నీళ్ళు చల్లి తాను తెచ్చిన పుష్పాదికముంచి పుష్పమంటపమందలి భగవత్పీఠము నర్చింపవలెను. ఆ పైని

తస్మిన్నివేశయే ద్దేవ మర్చయేద్రమయా సహ ।

ప్రతిమాయా ఆభావేతు పూజాం విష్ణోః ప్రకల్పయేత్ ॥

సాలగ్రామశిలాయాంతు ధ్యాయేత్పూర్వోక్త విగ్రహమ్ ।
పూజయిత్వా గురూన్పూర్వం పశ్చాద్దేవం సమర్చయేత్ ॥
అనంత భోగ పర్యంకే ఫణారత్న సమన్వితే ।
తత్రాసీనం శ్రియాసార్థం నీళా భూమి సమన్వితమ్ ॥
సూర్యకోటి ప్రతీకాశం పీతాంబరధరం హరిమ్ ।
నైవేద్యంచ తతోదద్యాత్ప్రాతఃకాలే సమాహితః ।
నైవేద్య శేషం సర్వేభ్యో వైష్ణవేభ్య సమర్పయేత్ ॥

అనగా ఆ పీఠమందు శ్రీసహిత భగవత్ప్రతిమను వేంచేపు చేసి తిరువారాధనము చేయవలెను. ఒకప్పుడు తన గృహమందు ప్రతిమలు లేనిచో సాలగ్రామములనే వేంచేయించి వాని యందే శ్రీ శ్రియః పతులను ధ్యానింపవలెను. అంతకు పూర్వము స్వాచార్యులను మనస్సులో నారాధించి తరువాతనే అనంత భోగి శయనాసీనుడై శ్రీభూ నీళలతో గూడి సూర్యకోటి ప్రకాశముతో పీతాంబరయుక్తుడై యుండినట్లు ధ్యానించి అర్ఘ్యాది సమస్తోపచారములను మూలమంత్రోచ్చారణ పూర్వకముగా సమర్పించి ప్రాతః కాలోచిత ఫలాది నైవేద్యము సమర్పించి మంగళాశాసనమొనర్చి ఆ ప్రసాదమును అచ్చట తటస్థించి యుండిన శ్రీవైష్ణవులకు అర్పింపవలెను. తరువాత

ఏవం ప్రాతస్సమారాధ్య దేవం నారాయణం హరిమ్ ।
అథ మధ్యం దినం సూర్యే గతే స్నానం సమాచరేత్ ॥
ఏవమభ్యర్చయే ద్దేవం పూర్వోక్త వధినైవతు ।
సకర్పూరం చ తాంబూలం పుష్పమాలాం సమర్పయేత్ ॥
మంగళా శాసనం కృత్వా కర్మశేషం సమాపయేత్ ।
విశిష్టా వైష్ణవా విప్రా గృహం ప్రత్యాగతా యది ॥
భోజయేదన్న పానాద్యైరతి థీన్వైష్ణవ ద్విజః ।
విష్ణోర్నైవేద్య శేషేణ పంక్తి యోగ్యై స్సమాదరాత్ ॥
తత్తద్యోగ్య స్థలే సమ్యగతిథీనపి భోజయేత్ ।
భిక్షాందద్యాత్ప్రయత్నేన యతయే బ్రహ్మ చారిణే ॥
విష్ణ్వర్పితంతు భుంజీయా త్తీర్థ ప్రాశన పూర్వకమ్ ।
కాష్ఠేన జలగంధూషై ర్వక్త్రం సంశోదయేత్తతః ॥
ద్విరాచమ్య విధానేన సుఖాసీనః స్మరేద్ధరిమ్

అనగా ఇట్లు ప్రాతః కాలారాధన నెరవేర్చుకొని సూర్యుడు మధ్యాకాశమునకు వచ్చిన తరువాత తిరిగి స్నానమాచరించి వెనకటివలెనే భగవదారాధనము చేసి పక్వాన్న నైవేద్యమును సమర్పించి కర్పూర తాంబూలమును సమర్పించి మంగళాశాసనమును చేసి భగవద్బింబములను యథాస్థానమందు వేంచేయించి మాధ్యాహ్నిక సంధ్యాదికర్మ శేషమును నిర్వర్తించుకొని యతులుగాని బ్రహ్మచారులుగాని భిక్షమునకు వచ్చుటకు ప్రతీక్షించి వారికి భిక్షమును సమర్పించి తరువాత అతిథులుగా వచ్చిన శ్రీవైష్ణవులనాదరించి అందు పంక్తి

యోగ్యులైన వారిని స్వపంక్తియందును మిగిలిన వారిని తత్తదుచిత స్థలములయందును కూర్చుండ చేసి తనతో పాటు భోజనములను చేయించవలెను. అందు ముందు పెరుమాళ్ల తీర్థమును స్వీకరించి తరువాత భోజనమును చేయవలెను. భోజనమైన తరువాత నోటిలో పండ్ల సందులను చిక్కికొనిన ఆహారలేశములను పుల్లతో శోధించికొని నీటితో పుక్కిళించి ఉమిసి హస్త పాద ప్రక్షాళన మొనర్చుకొని రెండు సారులు ఆచమనము చేసి సుఖముగా కూర్చుండి శ్రీహరిని స్మరింపవలెను. అటు పిమ్మట

అస్తగతే దినకరే సంధ్యాం కుర్వీత పూర్వవత్ ।
తతస్సంపూజయే ద్దేవం పూర్వవత్సు సమాహితః ॥
క్షీరాజ్య శర్కరోపేతం నైవేద్యం చ సమర్పయేత్ ।
తతస్తుత్వా నమస్కృత్య శయ్యాయాం వినివేశయత్ ॥
మంగళా శాసనం కుర్యాత్సాయం హోమం సమాచరేత్ ।
అతిథీం స్తర్పయిత్వా ఽథ స్వయం భుంజీత పూర్వవత్ ॥
అన్యత్ర దేవాయ తనాచ్ఛయీత నియాతాత్మవాన్ ।
ఏవమారాధయే ద్దేవం ప్రతినిత్యమతంద్రితః ॥
త్రికాలమేకకాలం వా మధ్యాహ్నే చ విశేషతః ।
ద్విజాతయేయజేయుస్తం విష్ణు సాయుజ్య హేతవే ॥

అనగా సూర్యుడస్తమింపగనే సంధ్యావందన మాచరించి భగవదారాధనమును వెనుక వలెనే ఆచరించి పాలు, నేయి, పంచదార చేర్చి నైవేద్యము సమర్పించి శయ్యాసనమున భగవంతుని వేంచేయించి మంగళా శాసనము చేసి తరువాత సాయమౌపాసన హోమమొనర్చి అతిథులను పూర్వము వలెనే ఆదరించి తాను భుజించి భగవంతుడు వేంచేసి యుండు గృహమును గాక వేఱు గృహములో పరుండవలెను. ఇట్లే నిత్యమును శ్రీవైష్ణవ గృహస్థుడు భగవదారాధనమును జరుపుచుండవలెను. మూడు కాలముల యందారాధనమును చేయుట కశక్తుడగువాడు మధ్యాహ్నము మాత్రమైనను భగవదారాధనమును చేసికొనుచు భగవత్సాయుజ్య సిద్ధిని పొందవలెను.

ఈవిధముగా సదాచార నిష్ఠులగు శ్రీవైష్ణవోత్తముల గృహమందే

ఏతదాచార సంయుక్తైః ప్రపన్నై ర్వైష్ణవైః కృతమ్ ।
విష్ణోర్నివేదితాన్నంతు భిక్షాం భక్ష్యాదికం చరేత్ ॥

అని చెప్పిన ప్రకారము యతులు భిక్షా గ్రహణము చేయవలెను. అట్టి సదాచార సంపన్నులు కాని వారి గృహములందు భిక్షమును పరిగ్రహింపరాదు.

ప్రపన్న దినచర్యా నిర్ణయ ప్రకరణము ముగిసెను.

భగవత్ప్రసాద యోగ్యా యోగ్య నిర్ణయ ప్రకరణము

పంచకాల పరాయణత్వ వివరణము

సుదూరమపి గంతవ్యం యత్ర శ్రీవైష్ణవోద్విజః

అని చెప్పిన ప్రకారము యత్యాదులు భిక్షాది పరిగ్రహము చేయుట కర్హులగు శ్రీవైష్ణవ ద్విజులెంత దూరములో నున్నను వెళ్లవలెనని విధికనబడుచున్నది. అట్టి శ్రీవైష్ణవులు పంచకాల పరాయణులై యుండవలెనని శాస్త్రములు చెప్పుచున్నవి. ఆ పంచకాలములెవ్వియని విచారింపగా

అభిగమనము పాదనం ఇజ్యా స్వాధ్యాయ మన్వహం యోగమ్ ।
అనుసందధధచ్ఛిద్రం భగవతి భక్తః పరం పదం యాతి ॥
ఆద్యం కార్మాంత గమనాదుపానంతతః పరమ్ ।
ఇచ్యాచ పశ్చాత్స్వాధ్యాయం తతో యోగం తతః పరమ్
పంచైతే విషయాస్తేషాం కాలాః పంచైవతే మతాః ।
పంచకాల పరాస్సర్వే సర్వేతే భగవన్మయాః ॥
నాన్యం యజేత ధ్యాయేత నాన్యం నారాయణాన్నరః ।
తేయాంతి వైష్ణం స్థానం పునరావృత్తి వర్జితమ్ ॥

అనగా ప్రతిదినము మొదట తన శరీర కృత్యములను స్నాన సంధ్యాది పర్యంతము నెరవేర్చుట మొదటికాలము. తురువాత భగవదరాధనమున కుపయుక్తమగు పదార్థములను (పుష్ప జలాదులను) సంగ్రహించుకొనుట రెండవ కాలము. భగవదారాధనమును సక్రమముగా నెరవేర్చుకొనుట మూడవ కాలము. బ్రహ్మ యజ్ఞ రూపమగు స్వాధ్యాయాధ్యయనము చేయునది నాల్గవ కాలము. ఇతర విషయ చింతనము మాని కొంతకాలము భగవంతుని మనస్సులో ధ్యానించుట అయిదవ కాలము. ఈ అయిదు కాలములను శ్రీవైష్ణవుడు ప్రతిదినము నిద్రలేచినది మొదలు భోజనాత్పూర్వము నెరవేర్చుకొనుచుండవలెను. ఇదియే పంచకాల పరాయణత్వము. ఇట్లు ప్రవర్తింపుచు నారాయణుని తప్ప ఇతర దేవతల నారాధింపక నుండిన వారికి పరమ పదము నిశ్చయముగా లభింపగలదని పై ప్రమాణములు చెప్పుచున్నవి.

భగవత్ప్రసాదమునకు యోగ్యాయోగ్యులు

పైని చెప్పిన ప్రకారము పంచకాల పరాయణులై యుండు శ్రీవైష్ణవులు భగవంతునికి నివేదించిన ప్రసాదమును అయోగ్యులగు వారికివ్వరాదని భగవచ్ఛాస్త్రము చెప్పుచున్నది.

రక్షణీయం మహత్తేభ్యస్తద్ధానం విష్ణుయోజకైః ।
ప్రాయశ్చిత్తీ భవేద్ధాతాహ్య పాత్రే వినియోజనాత్ ॥

అనగా గొప్ప ప్రభావము గల భగవన్నివేదిత ప్రాసాదమును భగవత్పూజకులగు శ్రీవైష్ణవులు అయోగ్యులకు ఇవ్వకుండ రక్షించుకొనచుండవలెను. లేనిచో ప్రాయశ్చిత్తమున కర్హులగుదురని తాత్పర్యము మరియు

భగవదుక్త మన్నాద్య మయోగ్యేభ్యో నయోజయేత్ ।
అయోగ్య యోజనాదేవ యోగ్య చాప్య నియోజనాత్ ।

భగవద్భక్తి యుక్తో ఒ పి ప్రాయశ్చిత్తీ భవేద్ద్విజః ॥ అని శాండిల్య స్మృతియు

మంత్ర పూతం హినైవేద్యం నిషిద్ధానాం దదాతియః ।

సిద్ధో ఒ పియాతి పాతిత్యం ఆరురుక్షుర్విఃకిం పునః అని పౌష్కర సంహితయు

మత్సమర్పిత శేషంతు అన్యేషాం వినియుజ్యతే ।

మద్భక్తో యది భుంజీతమమైవాజ్ఞాతి లంఘనకృత్ ॥

అని పాంచరాత్ర భగవద్వచనమును చెప్పుచున్నది. ఇక అట్టి అయోగ్యులెవ్వరు అని విచారించినప్పుడు సామాన్యముగా పాషండులు, శైవులు మొదలైవ వారని తోచుచున్నది. అయినను అంతకంటె లోతుగా విచారించి చూచినప్పుడు

తత్స్వర్ణ రూప్య తామ్రైర్వాపాత్రైః కాంస్యాయసై స్తథా ।

భిక్షాం దత్వా సధర్మో స్తి గృహీత్వా నరకం వ్రజేత్ ॥

అను యతిధర్మ సముచ్చయ వచనమును పాటించి భగవత్ప్రసాదమును భిక్షనిడు పాత్రము వద్ద నుండి విచారణ చేయు యతులు గూడ భగవత్ప్రసాదాయోగ్య కోటిలో చేరుదురని తెలియుచున్నది. భగవత్ప్రసాదమును సుపావనముగా తలంచి పరిగ్రహించువారే యోగ్యులని తేలుచున్నది.

భగవత్ప్రసాదమునకు పావనత్వముల

భగవత్ప్రసాదము ఎట్టి పాత్రలో నుంచినను (అనగా స్వర్ణాది పాత్రలలో) సుపావనమనియు అట్టి పాత్ర విచారణ పాపహేతువనియు, నీ క్రింది భగవచ్ఛాస్త్ర వచనము చెప్పుచున్నది.

పాత్రే ఒ పాత్రే త్యాగమాత్రాస్మద్భుక్త స్యకణస్యవా ।

అపిమద్భక్తి యుక్తో పి చిరంపతితి రౌరవే ॥

అనగా భగవద్భుక్త శేషమగు ప్రసాదమొక కణమైనను అయోగ్య పాత్రమందున్నదని విడచినచో నెంత భగవద్భక్తి కలవాడైనను రౌరవ నరకములో చిరకాలము పడియుండునని భావము. ఇక భగవత్ప్రసాదమునకు పర్యుషిత దోషము లేదనియు ప్రతిగ్రహదోషము లేదనియు (అనగా గృహదోషము లేదనియు ప్రతిగ్రహదోషము లేదనియు (అనగా గృహస్థులు అన్నమును ప్రతిగ్రహింపరాదను నిషేధము లేదని భావము).

అది చాలా పావనమైనదనియు నీ క్రింద ప్రమాణములు చెప్పుచున్నవి.

"న పర్యుషిత దోషో ఒ స్తి" "న ప్రతి గ్రహదోషో ఒ స్తి" మత్ప్రసాదం సుపావనమ్ అనియు

శేషభుక్తం ప్రశంసంతి మునయో హరి గోచరాః అనియు ఆవచనములున్నవి.

భగవన్నివేదన సమయములో నిషిద్ధ దృష్టి దోషము

అసద్దృష్టిం పరిహరే దచ్యుతస్య నివేదనే ।

అవైష్ణవానాం దృష్టిం చ భోజనే వైష్ణవస్త్యజేత్ ॥

అనగా భగవన్నివేదన చేయు సమయమందు అసత్పురుషులు అవైష్ణవులు చూడకుండునట్లు జాగ్రత్త పడవలెను. అట్లే వైష్ణవులు తమ భోజన సమయమునందు గూడ ఇతరులు చూడకుండ జాగ్రత్త పడవలెను. అని భగవచ్ఛాస్త్రము చెప్పుచున్నది. ఇచ్చట అసత్పురుషులనగా పంచ సంస్కారరహితులగు వారనియు,

అవైష్ణవులనగా పంచ సంస్కార సహితులైనను భాగవత పర్యంత భగవద్భక్తి లేకుండి తత్తీర్థ ప్రసాద వైభవము నెఱుగని వారనియు వివేకమును గ్రహింపవలెను.

భగవత్ప్రసాద నిరాకరణ మందలి దోషము

భగవన్నివేదిత పదార్థమును అజ్ఞానముచేత నిరాకరింపకూడదనియు అట్లు నిరాకరించినచో నిహరపములకు చెడుదురనియు నీ క్రింది శాండిల్య స్మృతి వచనము చెప్పుచున్నది.

భగవద్భుక్త మన్నాద్య మజ్ఞానాద్యో ఽ వ మన్యతే ।

ఇహని శ్రీకతాం ప్రాప్య జాయతే స పురీషభుక్ ॥

అని భగవన్నివేదిత పదార్థము నవమానించుట అనగా పాత్రదోషము నెంచుటయు, నిర్హేతుక కృపవలన శ్రీవైష్ణవులిచ్చిన దానిని తాను భుజింపక అమ్ముకొనుటయు అని తెలియవలెను.

ఇక శ్రీవైష్ణవ యతులు గూడ తమకు భిక్షము నిచ్చు పాత్రలకు లోహబుద్ధిని పెట్టుకొని నిరాకరింపరాదు. ఏమనగా విలక్షణ శ్రీవైష్ణవ గృహములలో

పశుపుత్రాదికం సర్వం గృహోపకరణాని చ ।

అంకయేచ్ఛంఖ చక్రాభ్యాం నామ కుర్యాచ్చ వైష్ణవమ్ ॥

అను విధి ననుసరించి గృహోపకరణములగు పాత్రాదులు గూడ శంఖ చక్ర చిహ్నితములై యుండును గాన నవియన్నియు పవిత్రమైనవియే అగును.

భగవత్ప్రసాద మహిమ

శాండిల్య స్మృతిలో

పవిత్రం భగవద్భుక్తం యే సదాహ్యుపభుంజతే ।

భవంత్యరోగాః సుఖినః పాపదోష వివర్జితాః ॥

అనగా పవిత్రమగు భగవత్ప్రసాదమును స్వీకరించినచో ఆరోగ్యము సుఖము కలిగి పాపరహితులగుదురని చెప్పబడెను.పరాశర సంహితలో గూడ పాపవిరహితులగుదురని చెప్పబడెను. పరాశర సంహితలో గూడ

విష్ణోర్నివేదితం శుద్ధం పావనానాం చ పావనమ్ ।

ప్రాపణం దుర్లభం భోజ్యం న త్యాజ్యం స్యాత్కదాచన ॥

అనగా భగవన్నివేదితమై అందువలన పరిశుద్ధముగాను పావముగాను నుండి సద్గతిని పొందించు అన్నాదికమును ఎన్నడును త్యజింపకూడదు అని చెప్పబడెను. కాబట్టి భగవత్ప్రసాదమును నిరాకరింపకూడదు. పాత్రదోషాదికములు దానికుండవు.

ఇక అట్టి పావనమైన భగవత్ప్రసాదము గూడ దానినుచ్చు వారి స్పర్శ దోషమువల్లను నైమిత్తిక (కాక

మార్జారాది స్పర్శ నిమిత్తమైన) దోషము వల్లను చెడవచ్చును. ఇచ్చువారు మాయిశైవ శూద్రాదులైనప్పుడును, వెనుక చెప్పిన కాకాది స్పర్శయే కాక చీపిరిగుడ్డలు, తల వెంట్రుకలు, బూడిదె పురుగులు మొదలైనవియు చేరియున్నప్పుడు కూడ అట్టి భగవత్ప్రసాదనమును భుజింపక పుచ్చుకొని పవిత్రమైన జలములో విసర్జింపవలెను.

భగవత్ప్రసాద దానార్హానర్హ వివరణము

శ్రీవైష్ణవ గృహమందు సనియమముగా భగవన్నివేదనము చేయబడిన పదార్థమును భగవద్భక్తి యుక్తులగు వారికే ఇవ్వవలెను. కాని భగవద్భక్తి హీనుల కివ్వరాదు. ఈ విషయములో అనేక ప్రమాణ వచనములు కలవు. పాద్మ పురాణములో

భగవద్భక్తి హీనస్య నైవేద్యం విషముచ్యతే ।
భగవద్భక్తి యుక్తస్య తదేవత్వమృతాయతే ॥

అని చెప్పబడెను. పాంచరాత్ర భగవత దేవత్వ మృతాయతే అని చెప్పబడెను. పాంచరాత్ర భగవత దేవత్వ మృతాయతే అని చెప్పబడెను. పాంచరాత్ర భగవచ్ఛాస్త్రములో

ప్రాయశ్చిత్తీ భవేద్ధాతా అపాత్రే ప్రతిపాదనాత్ ।
తత్పునర్వైష్ణవే మార్గే వర్ణ్యతే వ్యత్యయేనతు ॥

అని చెప్పబడెను. వైష్ణవే మార్గే అనగా విష్ణుభక్తుల యందు సమర్పించు విధములో అని భావము. పరాశర సంహితలో

భుంజతామేధతే చ శ్రీ స్త్యజతాం పరిహీయతే ।
వ్రతోపవాస తులిత మశనం తస్య పావనమ్ ॥

అనగా భగవన్నివేదిత పదార్థమును ఆదరముతో భుజించినచో లక్ష్మీవృద్ధి నందును, అనాదరముతో విడచినచో లక్ష్మీ తొలగిపోవును. మరియు వ్రతములు ఉపవాసములు చేయుట వలన కలుగు ఫలము భగవత్ప్రసాద స్వీకారమును చేసినచో కలుగునని భావము. ఇట్టి ఆదర భావము కలవారికే భగవత్ప్రసాదము నివ్వవలెను. వరాహపురాణములో

విష్ణోర్ధాతవ్య ముచ్ఛిష్టం నాభక్తాయ కదాచన ।
దాతా ప్రతిగృహీతాచాప్యుభౌ నరకపాతినౌ ॥

అని చెప్పబడెను. ఇందు భగవద్భక్తుడు కాని వానికి భగవత్ప్రసాదము నిచ్చినచో ఇచ్చిన వానికి గూడ పాతిత్యము చెప్పబడెను. భగవద్భక్తులు కారని తెలియుటకు పాత్రాది విచారణ చేయుటయే తార్కాణముగా గ్రహింపవలెను.

ఆతిథ్య విచారము

అతిథులనగా **నతిష్ఠతీత్యతిథి** అను వ్యుత్పత్తి చేత తాత్కాలికముగా భోజనకాలమునకు తటస్థించి వెంటనే వెడలిపోవువారు, అట్టి వారిని గూర్చి యెట్లు ప్రవర్తింపవలెనను విషయములో నిట్లు ప్రమాణము కనబడుచున్నది.

చోరోవాయది చండాలో విప్రఘ్నః పితృఘాతుకః ।

వైశ్వదేవేతు సంప్రాప్తే సో ఽ తిథి స్సర్వ సంగ్రహః ॥

తత్ర స్థితం హరిం జ్ఞాత్వా పూజయేద విచారయన్ ।

అనగా దొంగవాడైనను చండాలుడైనను (తెలిసి గూడ) తాను వైశ్వదేవమును చేయునప్పుడు తటస్థించినచో అట్టి వారిని సంగ్రహించి వారి యందు గూడ శ్రీహరియున్నాడని తలచికొని పూజించి విచారణ లేకుండ భోజనమునిడవలెను. అని భావము. దీనిని బట్టి అతిథి యొక్క గుణదోషములు పరిశీలింపకూడదని తెలియుచున్నది. ఇక వైష్ణవ ధర్మములను చెప్పు ప్రమాణములలో

అవైష్ణవస్తుయో విప్రః సర్వ కర్మయుతో ఽ పివా ।

సపాషండీతి విజ్ఞేయ సర్వకర్మసుగర్హితః ॥

అను వచన ప్రకారము అవైష్ణవుడగు విప్రుడు ఎంత గొప్పవాడైనను పాషండుడుగానే తలంచి సర్వ కర్మలయందును వానిని వర్జింపవలెనని తెలియుచున్నది. ఇచ్చట అవైష్ణవుడగనగా విష్ణు భక్తుడు కాని వాడు అని కదా అర్థము. విష్ణుభక్తుడు భగవత్కైంకర్యార్థము గాక స్వార్థము చౌర్యము చేయడు. చండాలుడై యుండియు భగవత్కీర్తనాదుల యందాసక్తి కలిగియుండును. బ్రహ్మహత్యాదుల నాచరింపడు. అట్టి యోగ్యతను పరిశీలించి గాని వారికాతిథ్యము నివ్వరాదని తేలుచున్నది. కాబట్టి పై సామాన్య వచనములు అవైష్ణవ ద్విజులకు మాత్రమే వర్తించునని వివేకింపవలెను.

శ్రీవైష్ణవ బ్రాహ్మణులు విప్ర శ్రీవైష్ణవులగు అతిథులను స్వయముగా నాదరింపవలెనని వాసిష్ఠ స్మృతి చెప్పుచున్నది.

విశిష్టా వైష్ణవా విప్రా గృహం ప్రత్యాగతాయది ।

ప్రత్యుద్గచ్ఛేత్ప్రణమ్యాశు పూజయేత్తాన్విశేషతః ॥

.... భోజయేదన్నపానాద్యై రతిథీ న్వైష్ణవోత్తమః ॥

అని ఇచ్చట విప్ర శబ్దమునకు యతులు గూడ అర్థము కావచ్చును. ఎందువలననగా మహాభారతములో దుర్వాసుని గూర్చి శ్రీకృష్ణుడు

ప్రత్యక్షజ్ఞాన సంయుక్తా యూయం సర్వే యతీశ్వరాః । ఏతేతే యతయో విప్రాః

అని చెప్పెను. దానిని బట్టి యతులకు విప్రులని గూడ పేరు గలదని యూహింపవలెను. కాబట్టి శ్రీవైష్ణవ బ్రాహ్మణ గృహస్థుడు తన యింటికి తాత్కాలికముగా వచ్చిన ప్రతినిధులగు చాతురాశ్రమ్య చాతుర్వర్ణ్యము వారిని గూడ యోగ్యతను పరిశీలించి అతిథి సత్కారమును సలుపవలెను. అయోగ్యులకు మాత్రము తన వద్ద నుండు భగవన్నివేదిత పదార్థమునివ్వకూడదు. అట్టి అతిథి సత్కారము నెఱిగి చేయుచు

శమదమ నియతాత్మా సర్వభూతాను కంపీ

విషయ సుఖ విరక్తో జ్ఞాన వృత్తః ప్రశాంతః।

అని యతని యతాన్నో నైవ హృష్టోనరుష్టః

ప్రవసిత ఇవగేహే వర్తనేతేయస్సముక్తః ॥

అను రీతిని సద్గుణ సంపన్నుడై భూతదయ కలిగి విషయాసక్తి రహితుడై భగవద్ జ్ఞాన సంపన్నుడై భక్ష్యా భక్ష్యాన్నములను గమనింపుచు అతిహర్షము అతికోపము లేక ప్రయాణములో నచ్చటచ్చట బసలలో నుండు వాని వలె అసంగుడై యుండిన గృహస్థుడే ముక్త తుల్యుడని గృహస్థ ధర్మములు చెప్పబడినవి.

సామాన్యా తిథుల సత్కార ప్రకారము

భగవత్ప్రసాద మహిమను గుర్తింపజాలని యతులు మొదలగు అతిథులకు భగవన్నివేదిత ప్రసాదమును కాక ఫలాదులను మాత్రము ఇచ్చి తృప్తి పరచవలెను. హారితస్మృతిలో నిట్లు చెప్పబడెను.

పాషండ పతితాద్యాశ్చ క్షుధార్తాగృహమాగతాః ।
నైవ దద్యాత్తుపక్వాన్నం ఆమ మేవ ప్రదాపయేత్ ॥

అని ఈ విధముగా భగవన్నివేదిత పక్వాన్నమును ఇవ్వకూడని వారిలో యతులను గూడ చేర్చుట యెట్లు పొసగు ననినచే ఆద్యపదము చేత చేర్చనగును. అట్టి పక్వాన్న నర్హయతులెవరనగా భగవత్ప్రసాద మహిమ నెఱుగక లోహ పాత్రాది విచారణము చేయువారని తెలియవలెను. అట్టి వారే భగవత్ప్రసాద మహిమను గుర్తి పంక పాత్రాది విచారణ చేయుదురు. అట్లు చేసి భగవత్ప్రసాదమని తలంచక పరిత్యజింతురు. వారి దృష్ట్వా చూచినచో పాషండాదులే మెరుగు, ఆకలి బాధ చేత పారవేయక భుజింతురు. ఈ విషయములో **కొల్లికావలర్ దాసర్** అను వారి యొక్క పూర్వావస్థా చరిత్రము తార్కాణము. కాబట్టి

భగవద్భుక్త మన్నాద్యం అయోగ్యేభ్యోదాపయేత్ ।
శునామివ పురోడాశం న నీచేషు ప్రదీయతే ॥

అను ప్రమాణమును బట్టి యాగములోని పురోడాశమును శునకముల కిడినట్లే భగవన్నివేదిత ప్రసాదమును తన్మహిమ నెఱుగని వారికిడుట అగునని తెలియవలెను.

భగవత్ప్రసాద భాగవతని దకుల నీచక

మన్నామ స్మరణాత్సర్వం విలయంయాతి పాతకమ్ ।
మదన్నమద్భక్త జన నిందయాతు కృతం వినా॥

అని పాంచరాత్ర భగవద్వచనము కలదు. దీని భావమేమనగా, నాయొక్క నామమును స్మరించి నంత మాత్రము చేత సమస్త పాతకములు నశించును, కాని నా ప్రసాదమును నా భక్తులను నిందించినందు వలన కలుగు పాతకము మాత్రము నశింపదు అని భావము. అయితే అట్టి నిందను చేయువారిలో ప్రధానులు భగవత్ప్రసాదము నిడిన లోహపాత్రాది విచారణమును చేయునట్టియు శ్రీవైష్ణవ గృహస్థులు ప్రతివందనా నర్హులని తలంచునట్టియు సామాన్య యతులే అని తెలియవలెను. ఇందు మొదటిదగు భగవత్ప్రసాద నిందను గూర్చి వెనుక ప్రమాణములు చూపబడెను. ఇంక రెండవదగు భగవద్భక్త నిందకు పాతిత్య హేతుత్వ మిట్లు చెప్పబడెను.

వర్ణరూపాశ్రమావాస పూర్వ వృత్త నిరూపణమ్ ।
శ్రీవైష్ణవస్య తత్వేన మహాపాపసమం స్మృతమ్ ॥

అనగా శ్రీవైష్ణవునికి బ్రాహ్మణాది వర్ణము శరీర రూపము ఆశ్రమము నివాసము పూర్వచరితము వీనిని నిరూపించుచు అతనిని తక్కువగా జూచుట వలన పంచ మహాపాతక సమమగు మహాపాపము

కలుగునని తాత్పర్యము. ఇట్టి నిరూపణము చేయుట ద్వయార్థమును చక్కగా నెఱుగని వానికే కలుగును. అట్టివారు యతులైనను జ్ఞానవంతులైనను పూజార్హులు కారని ఈ క్రింది ప్రమాణము చెప్పుచున్నది.

కులజోవా తపస్వీవా .... యతిర్వాజ్ఞానవానపి ।

ద్వయాధికారీ యో న స్యాత్తం ప్రయత్నేన వర్జయేత్ ॥

అట్టి యతులు చూచుచుండగా భుజించుటయు,అట్టి వారికివ్వగా మిగిలిన దానిని భుజించుటయు, వినాశ హేతువులని ఈ క్రింది ప్రమాణము చెప్పుచున్నది.

నాస్తికైః పతితైర్దృష్టం న స్పృశేన్నచ భక్షయేత్ ।

భక్షణాదేవ నశ్యంతి జ్ఞాన భక్తి సుతాదయః ॥ అని ప్రమాణ వచనము.

శ్రీవైష్ణవైకాన్తి పరమైకాన్తి స్వరూపము

శ్రీవైష్ణవ గృహస్థాదులలో శ్రీవైష్ణవులనియు, ఏకాంతులనియు, పరమైకాంతులనియు భేదము కలదు. వారి వివరములు హారిత స్మృతిలో నిట్లు చెప్పబడెను.

యస్తూపాయ తయాకృత్యం నిత్యనైమిత్తికాదికమ్ ।

సత్కృత్యం కురుతే విష్ణోర్వైష్ణవస్స ఉదీరితః ॥

విష్ణో రాజ్ఞతయాయస్తు సత్కృత్యం కురుతే బుధః ॥

స ఏకాంతీతి మునిభిః ప్రోచ్యతే వైష్ణవోత్తమః ॥

యస్తుభోగ తయా విష్ణో స్సత్కృత్యం కురుతే సదా ।

సభవేత్పరమైకాన్తీ మహాభాగవతోత్తమః ॥

అనగా భగవత్సన్నిధి ప్రాప్తి రూప మోక్షమునకు ఉపాయముగా నిత్య నైమిత్తికాది సత్కర్మల నాచరించు వారి శ్రీవైష్ణవులనబడుదురు. భగవదాజ్ఞారూపములు గాన నిత్య నైమిత్తికాది కర్మలాచరింపదగునని తలచి వానిని ఆచరించు వారు ఏకాంతులనబడుదురు. నిత్య నైమిత్తికాదులు భగవత్కైంకర్య రూపములగుట చేత తమకు అత్యంత ప్రియములని దలంచి వానినాచరించువారు పరమైకాంతులనబడుదురు అని భావము. అట్టి మూడు విధముల వారును

వర్జనీయమకృత్యం తు సర్వేషాం కరణైస్త్రిభిః ।

అకామతస్తు సంప్రాప్తం ప్రాయశ్చిత్తాద్వినశ్యతి ॥

అకృత్యం వైష్ణవః పాప బుద్ధ్యా శాస్త్ర విరోధతః ।

ఏకాన్తీ పరమైకాన్తీచ రుచ్యభావాచ్చ సంత్యజేత్ ॥

అనగా అకృత్యములను త్రికరణముల చేతను వర్జింపవలెను. తప్పని సరిగా ఇచ్ఛలేకుండినను తటస్థించిన అకృత్యములకు ప్రాయశ్చిత్తముతో వినాశము కలుగును. ఇక వైష్ణవుడచు అకృత్యము పాపహేతువని తలచి మానవలెను. ఏకాంతి భగవదాజ్ఞారూప శాస్త్రమునకు విరుద్ధమని మానవలెను. పరమైకాన్తి ప్రీతి లేకుండుట చేత మానవలెను. మఱియు

వైష్ణవః పాప సంభూతం కులమేకం పరిత్యజేత్ ।

మహాపాతకీ సంయుక్తా మేకాన్తీ గ్రామముత్సృజేత్ ॥

అనగా శ్రీవైష్ణవుడు పాపాచరణము కలిగిన ఒక కుటుంబమును మాత్రము వదలివేయవలెను. ఏకాంతి పాపాచరణము చేయు కుటుంబమున్న గ్రామమును వదలి పెట్టవలెను. పరమైకాంతి అట్టి దేశమునే విడచి పెట్టవలెను అని భావము.

ఇక విష్వక్సేన సంహితలో

ఏకాన్తి ధర్మస్సంగ్రాహ్యో వైష్ణవానామశేషతః ।

భగవత్కర్మ నిరతో భగవద్భక్తి సంయుతః ॥

త్రైకాల్య మర్చనం కుర్యాన్మూలమంత్రేణ శక్తితః ।

అవైష్ణవానదృత్య వైష్ణవానేన సంశ్రయేత్ ॥

అనగా వైష్ణవ మాత్రులందఱును ఏకాన్తి ధర్మమగు భగవదాజ్ఞా కైంకర్య రూపముగా నిత్యనైమిత్తికాది కర్మల నాచరింపుచు భగవత్కైంకర్య రూపముగా నిత్య నైమిత్తికాది కర్మలను ఆచరింపుచు భగవత్కైంకర్యములో భక్తియుక్తులై ప్రవర్తింపుచు మూడు కాలముల యందును మూలమంత్రోచ్చారణ పూర్వకముగా యథాశక్తిని భగవదారాధనమును చేయుచు అవైష్ణవుల సంపర్కమును విడచి వైష్ణవగోష్ఠితోనే కాలము గడపవలెనని చెప్పబడెను.

వైష్ణవానురూప వర్ణాశ్రమ కర్మలు

పైని వివరించిన శ్రీవైష్ణవైకాన్తి పరమైకాంతులకు తత్తదభిసంధి రూపముగా నాచరించు నిత్యనైమిత్తికాది కర్మలు గూడ సదాచార్య సంమతములై యుండవలెను. అని హారితస్మృతిలో చెప్పబడెను. ఎట్లనగా,

స్నానతర్పణ హోమార్చా జపాద్యా వివిధాః క్రియాః ।

వైశిష్ట్యే నగురోర్జ్ఞాత్వా యథాశక్త్యా సమాచరేత్ ॥

అని కాబట్టి అట్లు తనకు తోచిన విధముగా ఇతరుల వలె యధేష్టముగా స్నానతర్పణాదుల నాచరింపక సదాచార్య సదుపదేశ రీతిగా సమస్త కర్మల నాచరింపుచు భగవత్కైంకర్య నిరతులగు మహాభాగవతులుండు ప్రదేశమే పరమ పదము వలె శ్రేష్ఠమై యుండును.

మహాభాగవతా యత్ర వసంతి విమలా శ్శుభాః ।

తద్దేశోమంగళ ప్రోక్తో యథావిష్ణు పదం శుభమ్ ॥

అను ప్రమాణ మీ విషయమునే చెప్పుచున్నది. ఈ విషయములో భగవద్వచన మిట్లున్నది.

యే ఉ నన్యమనసః శుద్ధాయేదాస్యైక మనోరథాః ।

తేషాం మే హృదయం స్థానం వైకుంఠాత్పరమం మతమ్ ॥

అనగా ఎవ్వరు నన్ను తప్ప ఇతరదైవములను మనసునందుంచుకొనరో శుద్ధభావముతో నాదాస్య మందు తలంపు కలిగియుందురో అట్టి వారి హృదయమే విష్ణువునగు నాకు వైకుంఠము కంటె గొప్పదగు స్థానమని నా యభిప్రాయమని తాత్పర్యము.

ప్రకారాంతర వైష్ణవాది తారతమ్యము

ఇది వఱలో వైష్ణవై కాన్తి పరమైకాన్తి భేదము చేత మూడు విధముల శ్రీవైష్ణవులు వారి ఆచరణములు చెప్పబడెను. ప్రకారాంతము చేత వారి భేదము నాలుగు విధములుగా నీ క్రింది ప్రమాణములు చెప్పుచున్నది.

శ్రీవైష్ణవ స్సాధ్య భక్త్యా భక్త్యుపాయాత్స వైష్ణవః ।

ప్రపత్తి వైభవాభిజ్ఞః ప్రపన్నః పరికీర్తితః ।
ఏకాన్తీచ వినిశ్చిత్య దేవతా విషయాంతరైః ।
భక్త్యుపాయం సమం కృష్ణ ప్రాప్తౌ కృష్ణైక సాధనః ।
ఏకాన్తీ వ్యపదేష్టవ్యో నైవగ్రామకులాదిభిః ।
విష్ణునావ్యపదేష్టవ్యః తస్యసర్వం సఏవహి ॥
దేవతాంతర శబ్దాది భక్తి కృష్ణాఖ్య హేతుషు ।
సామకృత్వపరమైకాంతీ హరౌ స్వామీతి బుద్ధిమాన్ ॥

అనగా వైష్ణవుడు శ్రీవైష్ణవుడు, ప్రపన్నుడు ఏకాంతి, పరమైకాంతి అని వైష్ణవ భేదములు గలవు. అందు భక్తిని సాధనముగా నమ్మి ఆచరించు వాడు వైష్ణవుడు. భక్తిని సాధ్యరూపముగా నమ్మినవాడు శ్రీవైష్ణవుడు శరణాగతి రూప ప్రపత్తి వైభవము నెఱిగిన వాడు ప్రపన్నుడు. దేవతాంతర విషయాంతరముల వలెనే భక్త్యాద్యుపాయములను తలంచి విడచినేని సిద్ధసాధన రూపుడగు కృష్ణుని సాధనముగా పట్టిన వాడు ఏకాంతి యనబడును. దేవతాంతరములను శబ్దాది విషయములను భక్తిని ప్రపత్తిని సిద్ధసాధన రూపుడగు శ్రీకృష్ణుని గూడ తుల్యముగా తలంచ అత్యంత పారతంత్ర్యమును పాటించి సాధన విముఖుడై తన సొత్తగు నీచేతని స్వామియగు సర్వేశ్వరుడై పరిగ్రహించునని నిస్పృహబుద్ధితో నుండువాడు పరమైకాంతి అనబడును. అందు సిద్ధ సాధన నిష్ఠుడగు ఏకాంతి తన కులమును గ్రామాదులను చెప్పుకొనక విష్ణుదాసుడని మాత్రమే వ్యవహరింపబడుచుండును. ఎందువలననగా నాతనికి సర్వమును శ్రీహరియే కదా అని భావము.

విలక్షణ వైష్ణవాదుల చిత్తశుద్ధి ప్రకారము

పరమ విలక్షణులై యుండు శ్రీవైష్ణవ ప్రపన్నాదుల మనోనైర్మల్య మెట్లుండుననగా శాండిల్య స్మృతిలో నిట్లు చెప్పబడెను.

పరదార పరద్రవ్య పరహింసాను చింతనమ్ ।
వైరానుచింతనమ్ ద్వేషమలభ్యార్థాను చింతనమ్ ॥
సుదూరం బహుదా ధ్యానం భోక్తవ్యమితి చింతనమ్ ।
అసత్కథానుస్మరణ మసత్కార్య నిరూపణమ్ ।
ఇత్యాది దోష రూపాణి హిత్వా కర్మాణి నిశ్చలమ్ ।
భగవత్కర్మ సిద్ధ్యర్థవ్యా వృత్తి ర్భగవత్పరా ।
అనిషణ్ణమనాయాస మహంకార వివర్జితమ్ ।
అసద్విషయ సక్తానామింద్రియాణా మహర్నిశమ్ ।
దమనం సర్వయత్నేన బాహ్యేరంభ వినిస్పృహమ్ ।
సర్వదా భగవద్ జ్ఞాన సంసర్గ విగత జ్వరమ్ ॥
భగవద్భక్త సద్వాక్య గంగా జల పవిత్రితమ్ ॥
సదర్థ గ్రాహకం సూక్ష్మ జ్ఞాన రూప విచారకమ్ ।

సమర్ధమప్రదృష్యలంచ హృష్టంతుష్ట మసంగి చ ।

ఏవమాది గుణోపేతం నిర్మలం మన ఉచ్యతే ॥

అనగా పరదారల విషయమునను పరద్రవ్య విషయమునను పరహింస విషయమునను బుద్ధి పెట్టుకొన కుండుటయు, ఇతరులతో వైరము నెల్లప్పుడు చేయకుండుటయు, ద్వేషము లేకుండుటయు అందరాని ధనము నాశింపకుండుటయు, చాలా విషయములలో నెల్లప్పుడు తలంపు లేకుండుటయు, ప్రతిదానిని అనుభవింపవలెనని కోర్కెలు లేకుండుటయు, చెడ్డమాటలను వినకుండుటయు, చెడ్డపనులు చేయువారిని నిందించుటయే పనిగానుండ కుండుటయు, నిత్యకర్మాచరణ మందాసక్తియు, భగవత్కైంకర్య విషయకమై ఆసక్తియు, భగవంతుని యందే ప్రీతియు, ఇతరాసక్తిని పెట్టుకొనకుండుటయు, ఆయాసము పడకుండుటయు, అహంకారము లేకుండటయు, ఆసద్విషయములందు పరుగెత్తు ఇంద్రియములను రాత్రింబగళ్ళు మరలించు చుండుటయు, బాహ్యవిషయముల యందు నిస్పృహయు, ఎల్లప్పుడు భగవద్ జ్ఞానము నందాసక్తియు, అసత్సంసర్గము లేనందు వలన పరితాపపడుకుండుటయు, భగవద్భక్తులు చెప్పెడి సద్వాక్యములను గంగాజలము గ్రోలి పవిత్రతను సంపాదించుటయు, మంచి అర్ధము నిచ్చు జ్ఞానమందాసక్తియు, బలమును కాపాడుకొనుటయు, చలనము లేకుండుటయు, హర్షతోషములు కలిగియుండుటయు, దేనియందును సంగము లేకుండుటయు అను ఇట్టి లక్షణములు గల మనస్సే నిర్మలమనబడును. ఈవిధమగు మనోనైర్మల్యము కలిగియుండుటయే విలక్షణ ప్రపన్న శ్రీవైష్ణవ లక్షణము. ఇట్టి మనోనైర్మల్యము వలన **మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః** అని చెప్పిన రీతిని ఆత్మ సంస్కార బద్ధమై యుండక మోక్షమును పొందగలదు. అట్టి ప్రపన్నులే యతులకు భిక్షాదాన యోగ్యులగుదురు.

విలక్షణ భిక్షా లాభమున యతుల కర్తవ్యము

పైని చెప్పబడిన విధమున మనోనైర్మల్యము గల శ్రీవైష్ణవ ప్రపన్న గృహములందే శ్రీవైష్ణవ యతులు మాధుకరాదులు నిర్వర్తింపవలెను గాన అట్టి గృహములు సిద్దించుట చాలా అరుదుగా నుండును. కాబట్టి శ్రీవైష్ణవ కులనాధులగు పరాంకుశ పరకాల యతి వరాదుల దివ్యమూర్తులధిష్ఠించి యుండు గృహములందును, వారాదరించిన దివ్య దేశములందును, ఆళ్వారాచార్యుల కైంకర్య నిష్ఠులగు చతుర్థాశ్రమి యతివీరుల మఠములయందును స్వాచార్యతుల్యులగు శ్రీవైష్ణవోత్తముల గృహముల యందును లభించెడి భగవత్ప్రసాదము నాదరించి మాధుకరాదులను గాని అగ్ర్యభోజనమును గాని లభించిన విధముగా స్వీకరించుటయే శాస్త్ర సమ్మతము. అయితే యతిధర్మ సముచ్చయములో

అపిచాస్యకుతోదానం దత్వాచాస్యకుతః ఫలమ్ ।

దాతా ప్రతిగృహీతాచ నరకం ప్రతిపద్యతే ॥ అనియు

యత్యన్నం యతి పాత్రస్థం ..... భుక్త్వా చాంద్రాయణం చరేత్

అనియు యతులగు వారింకొక యతులకు అన్న భిక్షమిడినచో నరకమును ప్రాయశ్చిత్తీ యతయు నుభయయుతులకు కలుగునని స్పష్టముగా చెప్పబడియుండగా మఠాధిపతులగు యతుల వద్ద సామాన్య యతులు భిక్షాపరిగ్రహము చేయవచ్చునని యెట్లంగీకరింపనగు ననినచో భగవద్భాగవత కైంకర్యార్థముగా పారమార్థిక భగవన్ముఖోల్లాసము కొఱకు లభించిన మఠాధిపత్యము గల యతివరుల విషయములోను వారివద్ద

భిక్షా పరిగ్రహము చేసిన యతుల విషయములోను పైవచనములు ప్రమాణములు కాజాలవు. ఏమనగా శ్రీపాంచరాత్ర శాస్త్రములో

మాఠపత్యం యతిః కుర్యాద్విష్ణు ధర్మాభివృద్ధయే ।

విష్ణోర్నిత్యోత్సవార్థాయ వేదాంత స్థాపనాయచ ॥

అన్యథా యః కరోత్యేవం సయాతి నరకం ధ్రువమ్

అని విశేష విధితో మఠాధిపత్యము యతుల కంగీకరింపబడుట చేత అట్టి యతులు భాగవతారాధన రూపముగాను భగవన్ముఖోల్లాసార్ధముగాను చేయు యతి భిక్షా ప్రదానము తత్ప్రతిగ్రహము దోషమనిపించు కొనవు. ఇక స్వార్ధము స్వకీయుల పోషణార్ధము సంపాదించుకొనిన మఠాధిపత్యమే పై యతిధర్మసముచ్చయ వచనముల చేత నిషేధింపబడినది అని వివేకమును గ్రహింపవలెను. కనుక అట్టి నిస్వార్ధ మఠాధిపత్యము గల యతివరుల వద్ద భిక్షా పరిగ్రహము దివ్యదేశ భగవత్ప్రసాద పరిగ్రహము వలెనే యతులకు నింధ్యము కాదు. అట్లయినచో యత్యన్నం యతి పాత్రస్థం అను నిషేద వచనమును బట్టి యతుల వద్దను యతిపాత్రయందుండు అన్నమును ఇతర యతులు పరిగ్రహింపరాదని తెలియుచున్నది కదా. యతుల వద్ద ఇతర యతులు భిక్షాపరిగ్రహము చేయుట నిషిద్ధము కాదా! అనినచో ఆ నిషేధ వచనములో చెప్పబడిన యత్యన్నమను దానికి యతులు అనావత్తులో గూడ స్వయముగా పాకమొనర్చుకొనిన అన్నమనియు, యతి పాత్రస్థమనగా యతుల ఉచ్ఛిష్ట పాత్ర స్పర్శము చేత విలక్షణ మఠాధిపతియై యుండిన యతి అన్య భాగవత పాచితమై భగవన్నివేదితమై పవిత్రమైన ప్రసాదమును భిక్షగా నిడవచ్చును. అన్యయతులు దానిని పరిగ్రహింపనూ వచ్చునని తెలియవలెను.

త్యాజ్యోపాదేయ విషయ పరిజ్ఞానావశ్యకత

విహితస్యాననుష్ఠానాన్నిందితస్యచ సేవనాత్ ।

అనిగ్రహ చ్చేంద్రియాణాం నరః పతన మృచ్ఛతి ॥

అను యాజ్ఞవల్క్య స్మృతి వచనమును బట్టి శాస్త్రముల చేత విధింపబడిన వానిని మానుట వలనను నిషిద్ధములుగా నుండు వానిని ఆచరించుటయు గూడ పాతిత్యహేతువగుచున్నది. కాబట్టి

వైష్ణవో వైష్ణవం దృష్ట్వా దండవత్ప్రణమేద్భువి ।   భుఞ్జతే చాగ్ర్య భోజనమ్

ఇత్యాది విహిత ధర్మములను యతులైనను పాటించి ఆచరింపవలెను. అట్లే

కలౌనపాత్రే భుంజీత కలౌ యతిః కుండికాంచ .... నధారయేత్

కలౌ యతిః కమండలుం వివర్జేత

ఇత్యాది నిషేధవచోనోక్తములను వర్జింపవలెను. మఱియు యతిధర్మ సముచ్ఛయములోని

అన్య ధర్మాన్పరిత్యజ్యయతి ధర్మాస్సమాచరేత్ ।

యతిధర్మాత్పరిభ్రష్టో న ధర్మఫల మశ్నుతే ॥

అను ప్రమాణము చొప్పున సర్వాశ్రమ సాధారణ ధర్మములను విడచియైనను కేవలయతి ధర్మములను యతులాదరించి ఆచరింపవలెను. అనునది సామాన్య యతివిషయముగా చెప్పబడిననియు

మత్కర్మకృన్మత్పరమో మామేవైష్యతి శాశ్వతమ్ ।

అన్యధర్మరతో మర్త్యో భ్రష్టో గచ్ఛత్యథోగతిమ్

అనెడి శ్రీరంగమాహాత్మ్యోక్త ప్రమాణమును బట్టి శ్రీవైష్ణవ యతుల విషయములో వర్తింపరాదనియు గ్రహింపవలెను. అయితే ధర్మశాస్త్ర వచనములను అనాదరించుట యెట్లు అని శంకింపరాదు.

వర్ణాశ్రమావిరుద్ధం యస్మన్వాద్యుక్త మశేషతః ।

స్వాధికార విరుద్ధంచేచ్ఛాస్త్రోక్త మపినాచరేత్ ॥

అనియెడి ప్రపన్న పారిజాత వచన ప్రకారము మన్వాదులు చెప్పిన ధర్మములైనను శ్రీవైష్ణవులు తమ అధికారమునకనుగుణములు కాని వానిని ఆచరింపనక్కరలేదని తెలియుట చేత అట్టి ధర్మానాచరణము తప్పుకాదని తెలియవలెను. ఈవిషయము యతిధర్మసముచ్చయములోనే ఏడవ పర్వమందు

సర్వధర్మాన్పరిత్యజ్య మోక్షధర్మం సమాచరేత్ ।

మోక్షధర్మాత్పరిభ్రష్ట స్సంసారం ప్రతిపద్యతే

అను వచనములతో అంగీకరింపబడెను వైష్ణవ వైభవము

నాహం విప్రో.... నోవావర్ణీనచ గృహపతిర్నో

వనస్థోయతిర్వా ....నరహరితనోర్దా సదా సస్యదాసః ॥

అను వచనాదుల వలన పూర్వమే వివరింపబడెను. ఇక శ్రీవైష్ణవ యతులకు గూడ భగవచ్ఛేషత్వము భాగవత పర్యంతమై యుండుట చేత భగవద్వందనాదులవలె భాగవత వందనాదులు విశేష ధర్మములై యుండును. ఇదియే

సర్వధర్మాన్పరిత్యజ్య మోక్షధర్మం సమాచరేత్ అను ప్రమాణ వచనము చేత సమర్థింపబడెను. యతులకుండు తుర్యాస్రమమును మోక్షప్రధానమైనందున మోక్షాశ్రమమని గూడ వాడిరి. మిగిలిన మూడాస్రమముల వారికిని ముముక్షత్వముండినను అశుభ శుభాది విశేష సమయములలో భగవత్కైంకర్యమునకు విచ్ఛేదము కలుగుట స్వాభావికమై యుండును గాని యత్యాశ్రమము నందట్టి నిర్బంధము లేదు గాన యత్యాశ్రమమునకే మోక్షాశ్రమమని రూఢి కలిగినది.

సర్వాతిశాయి నిష్కృష్టార్థ ప్రదర్శన పూర్వక నిగమనము

శ్రీవైష్ణవ సిద్ధాంతమును అనుసరించి మోక్షమనగా జననమరణాద్యంత్యంత దుఃఖమిశ్రమగు ప్రకృతి సంబంధ విమోచన పూర్వకముగా భగవదనుభవయోగ్య స్థానమగు పరమపదమును పొందుటయే ముఖ్యార్థముగా కలిగియున్నది. అట్టి మోక్షమునకు హేతువు భగవద్భాగవతాచార్య శేషత్వానురూపకైంకర్యమే అయియున్నది. ఈ అర్థమునే శాండిల్య స్మృతిలో విశేషించి ప్రతిపాదింపబడినది. ఆ వచనములుః

సర్వేషామేవ దర్మాణాముత్తమో వైష్ణవో విధిః ।

రక్షతే భగవాన్విష్ణుర్భక్తానాత్మ శరీరవత్ ॥

రహస్యమేతద్విజ్ఞానం .... అన్యాని సర్వ శాస్త్రాణి మోహనాని క్రియా స్తథా ।

భ్రమంతి సర్వభూతాని నానుగచ్ఛంతి సత్పదమ్ ॥

అని ఇట్లు చెప్పబడినవి. ఇంకను ఇట్టి ప్రమాణములు ఆనేకములు గలవు. వీని కన్నిటికినీ మూలమగు

శ్రుతి వచనము వేదాన్త విజ్ఞాన సునిశ్చితార్థాః అనునదియే. దీని అర్థమిదివఱలో విశదీకరింపబడెను.

ఇట్టి శ్రుతి ప్రమాణమునే సర్వ వేదాంత సారముగా నిర్ణయించి

రహస్యమే తద్విజ్ఞానం భక్తానాం హితమేవచ ।

అప్రమాణమ భక్తానాం సారం సర్వాగమేషుచ ॥

అని శాండిల్య మహర్షి నిష్కర్షము చేసియుండెను. విజ్ఞానమనగా విశేషార్థ జ్ఞానమని ఋషి తాత్పర్యము. అట్టి విశేషార్థ జ్ఞానమెట్టిదనగా విశిష్ట పరమధర్మ శాస్త్రముల వలన నుపబృంహితమగు విశేషార్థ జ్ఞానమే. అట్టి సత్సంమత ధర్మములు భగవద్భాగవత సామాన్యముగా శ్రీవైష్ణవ యతి గృహస్థాదులు భగవద్వందనముతో పాటు భాగవత పరిస్పరాభివందనము, భగవద్భాగవత శేష ప్రసాద పరిగ్రహము, విశేషించి యతులు అభినవ కాషాయములను ధరింపకుండుట, శౌచ స్నానాదులకు లోహపాత్ర పరిగ్రహము, భగవద్భాగవత గృహ మాధుకరాది పరిగ్రహము, భగవత్కైంకర్య వేదాంత కాలక్షేపాదుల కనుకూలముగా మఠాధిపత్యము, అనునవియే అని తెలియవలెను.

ఇట్టి ధర్మాచరణము ప్రపన్నాగ్రేసరులగు నాథయామున యతివరాది పూర్వాచార్యులు శ్రీరంగాది దివ్య దేశములలో తాము చేసియు తమ శిష్యపారంపర్యముగా ననుష్ఠింపచేసియు నుండినదే అగుచున్నది. అదియే తదభిమానాంత ర్భూతులగు నిఖిలాశ్రమ చతుష్టయము వారును ఆచరింపదగియున్నది. ఈ విషయము సువ్యక్తముగా తెలియుట కింద వివరింపబడినది.

ఇట్లు భగవత్ప్రసాద యోగ్యాయోగ్య నిర్ణయమును

ప్రసాద మహిమ ప్రకరణము ముగిసెను.

శిష్టాచార ప్రాధాన్య నిరూపణ ప్రకరణము

శిష్టాచారమునకు ప్రమాణశ్రేష్ఠ్యము

వెనుకటి ప్రకరణము చివరను అస్మత్పూర్వాచార్యుల అనుష్ఠానమే ప్రమాణమగుచున్నదని చెప్పబడెను. దాని కేమి ప్రమాణ వచనము కలదనగా ఆపస్థంబ ధర్మసూత్రములలో

ధర్మజ్ఞ సమయః ప్రమాణం వేదాశ్చ అను సూత్రమే ప్రమాణము. అందు ధర్మజ్ఞులనగా వేదశాస్త్ర సూక్ష్మ సూక్ష్మ చోదిత ధర్మములను సాకల్యముగా పరిశీలించినవారు. అట్టి వారు ఆచరణమే ప్రథమ ప్రమాణ మనియు తరువాత సాంగోప బృంహణ వేదములు ప్రమాణములగుచున్నవని ఆ సూత్రమునకర్థము. ఏమనగా అట్టి విచారణము చేసి పరిశీలించుటలో అభియుక్తుల కుండు శక్తి స్థూలదర్శులమగు నస్మదాదులకుండబోదు. కాబట్టి అట్టివారి ఆచరణకు ప్రబల ప్రమాణ్యమివ్వబడినది. ఈ విషయములో వేదార్థ నిర్ణయము రెండు విధములనియు అందు సుచరితమగు శిష్ఠుల ఆచరణము మొదటిదనియు అస్మదాది స్థూలదర్శులు తెలసికొనగలిగినది రెండవదనియు అందు మొదటిదే ఆచరణీయమనియు రెండవది పరిత్యాజ్యమనియు యాన్యస్మాకగ్ సుచరితాని తాని త్వయోపాస్యాని నో ఇతరాణి అను శిక్షోపనిషద్వాక్యమే చెప్పుచున్నది.

శాస్త్ర జ్ఞానం ఇతరాణి అను శిక్షోపనిషద్వాక్యమే చెప్పుచున్నది.

శాస్త్ర జ్ఞానం బహుక్లేశం బుద్ధేశ్చలన కారణమ్ ।

ఉపదేశాద్ధరింబుద్ధ్వా విరమేత్సర్వ కర్మసు ॥

అను వచనములో శాస్త్ర సాకల్యజ్ఞానము సామాన్యులకలవడకపోవుటయే గాక బుద్ధిని చలింపజేయు ననియు అందువలన పెద్దల యొక్క ఉపదేశము వల్లనే భగవత్తత్వ జ్ఞానమును పొంది స్వప్రయత్నమును విడువవలెనని చెప్పబడెను. ఇంకను ఈక్రింది ప్రమాణములన్నియు ఈ విషయమునే బలపరచుచున్నవి. పరాశర స్మృతిలో

శాఖాంగోత్రంచ సూత్రంచ సమయాచారమేవచ ।

పూర్వైరాచరితం కుర్యాదన్యథా పతితోభవేత్ ॥ అనియు శ్రీరామాయణములో

ధర్మార్థ కామతత్వజ్ఞ స్మృతిమాన్ప్రతిభానవాన్ ।

లౌకికే సమయాచారే కృతకల్పో విశారదః ॥ అనియు శ్రీవిష్ణుధర్మములో

బ్రహ్మచారీ గృహస్థోవా వానప్రస్థో థభిక్షుకః ।

శంఖ చక్రధరాస్సర్వే సమయవ్రతనిష్ఠితాః ॥ అనియు మహాభారతమునందు

తర్కే ఉ ప్రతిష్ఠా శ్రుతయో విభిన్నాముని ప్రణీతాః స్మృతయో పిభిన్నాః ।

ధర్మస్య తత్వం నిహితం గుహాయాం మహాజనో యేనగతస్సపంథాః ॥

అనియు చెప్పబడియున్నవి పరిశీలింపదగును.

శిష్టాచార ప్రామాణ్యములో సర్వ వైదిక సమ్మతి

వేదాంతార్థ వేత్తలలో అగ్రగణ్యులగు మన పూర్వాచార్యుల శ్రీసూక్తులు గూడ నీవిషయమునే చెప్పుచున్నవి. ఎట్లనగా ప్రఖ్యాత **దైవపరమార్థవిదాం మతై శ్చనై వాసుర ప్రకృతయః ప్రభవంతి బోద్ధుమ్** అనగా దైవపరమార్థము నెఱిగి ప్రఖ్యాతులై యుండువారి మతములను సామాన్యమగు అసుర ప్రకృతి కలవారు తెలసికొనజాలరు అనియు,

పూర్వుల శ్లాఘ్యమైన నిష్ఠనే మనసా నీవాశ్రయింపుము అనియు పెద్దల శ్రీసూక్తులు. మరియు పై మహాభారత వచనమునే వివరింపుచు అభియుక్తులిట్లు చెప్పియుండిరి.

తర్కేన ప్రతితిష్ఠతి ప్రభవతి త్రయ్యాపి వైయాకులీ ।
క్షోభం యాంతిమిథః క్షతాఋషి గిరః క్షుద్రోక్తయః కిం పునః ।
ఇత్థం తత్త్వ వినిశ్చయో నిధిరివక్షిప్తో గుహాభ్యంతరే ।
పంథానస్తు మహాజనస్య నిపుణః ప్రత్యంచ మభ్యంచతి ॥

అనగా న్యాయశాస్త్రానుమతమగు అనుమాన రచనకు ఒక హద్దులేదు. ఇక వేదములు పరిశీలింపబోతే అవి అత్యంత దురవగాహములై చాలా వ్యాకులపఱచును. పోనిమ్ము అట్టి వేదములకుపబృంహణములగు ఋషి వచనములను పరిశీలించి తెలిసికొందమనినచో వానిలో నొక దానికొకటి విరుద్ధములుగా కనబడుచుండును. ఇక సామాన్యులవాక్కులు వేదార్థమును నిర్ణయించుటలో నెట్లు సహకరింపగలవు. ఈవిధముగా తత్త్వ నిశ్చయము నిధివలె నిగూఢమైయున్నది. కాబట్టి వేదవిదగ్రేసరులగు మహాజనులు ఏ మార్గము ననుసరించిరో అట్లే తత్వమును తెలిసికొనవలెనని భావము. కాబట్టి ధర్మజ్ఞులగు ప్రాచీనాచార్యుల ఆచరణమే ముఖ్య ప్రమాణమని తేలుచున్నది. మన ప్రాచీనాచార్యులగు పరమవైదికాగ్రగణ్యులైన నాథయామున యతివరాదులే విధముగా నాచరించిరో అదియే మనకు ముఖ్య ప్రమాణమగుచున్నది.

సాధవః క్షీణపాపాస్తు సచ్ఛబ్దస్యాభిదేయకాః ।
తేషామాచరణం యత్తు సదాచరస్స ఉచ్యతే ॥

అనగా ప్రక్షీణపావులగు సాధువులే సత్పదమునకు అర్థభూతులు. వారి ఆచరణమే సదాచార మనుబడునని పెద్దల శ్రీసూక్తి చెప్పుచున్నది.

అజ్ఞుల ఆక్షేపణలకు పరిహారము

పై శిష్టాచార ప్రామాణ్యము విషయమమైన సాకల్యజ్ఞానము లేనికొందఱు నాథయామునాది ప్రఖ్యాతులు ఆదరించి అనుష్ఠించి ఇతరులచేత అనుష్ఠింపజేసిన విశేషశాస్త్రోక్తములగు బ్రహ్మవద్గృహస్థయత్యాదుల అన్యో వందన – ఏకమాధుకర గ్రహణ మాతపత్యాదులను విశేషశాస్త్రవిధుల నెఱుగక

తేషాం తేజో విశేషేణ ప్రత్యవాయోనవిద్యతే

అను సామాన్య వచనమును బట్టి అట్టి వారాచరించినను వారి తేజో విశేషము చేత వారికి ప్రత్యవాయముండక పోయినను అట్లు మనము ఆచరింపరాదని ఆక్షేపింతురు. దానికి వారు ఆ వచన వ్యాఖ్యయగు ఉజ్జ్వలను పరిశీలింపకుండుటయే కారణము. ఆ వ్యాఖ్యలో మాతృఘాతుకాదులగు పరశు రామాదులను గురించి ఆ వచనము చెప్పబడినట్లు స్పష్టముగా వ్రాయబడెను. అట్టి వచనమును తెచ్చి

పరమపావనచరితులగు నాథయామునాథుల సదాచార విషయములో అన్వయింపబోవుట వారి ఆజ్ఞతా విలసితమే అగునని తెలియవలెను.

అయితే తేషాం తేజో విశేషేణ అను వచనమునకు సర్వసామాన్యముగా అకృత్యాచరణము చేసిన వారందరును విషయభూతులుగా గ్రహింపవలసియుండగా మాతృఘాతుకాది విశేష విషయమందే తాత్పర్యముగా చెప్పుట సరికాదు అనినచో ఉజ్జ్వలలో

జామదగ్న్యేన రామేణ పితృవచనాదవిచారేణ మాతుశ్శిర శ్ఛిన్నమ్ ।

అని విశేషించి వివరింపబడుటచేత నట్లు నిశ్చయించి చెప్పవచ్చును. మఱియు

దృష్టో ధర్మవ్యతిక్రమస్సాహసంచ పూర్వేషమ్

అను ఆపస్థంబ ధర్మసూత్ర వాక్యమునకు వ్యాఖ్యానము చేయుచు ఉజ్జ్వలలో ఆధర్మ వ్యతిక్రమ సాహసాదులిట్టివని విశేషించి చూపబడెను. ఎట్లనగా

ప్రజాపతిశ్చస్వాందుహితరం భరద్వాజో వ్యక్తభార్యాయై జగ్మతుః వసిష్ఠ శ్చణ్డాలీ మక్షమాల్యామ్

అనగా చతుర్ముఖ బ్రహ్మ తన కుమార్తె (సరస్వతి) ను కూడెను. భరద్వాజుడు వ్యక్తురాలు కాని భార్యను కూడెను. వసిష్ఠుడు అక్షమాల్య (అరుంధతి) అను చండాల కన్యను పెండ్లాడెను అని యిట్లారంభించి చంద్రుడు గురు భార్యను, ఇంద్రుడు ఋషి బార్య (అహల్య) నుగూడిరి. అని చెప్పుచు అట్టి వెనుకటి వారి ఆచరణమును బట్టి తరువాతి వారును అట్టి ధర్మవ్యతిక్రమము నాచరింపకుండుటకై తేషాంతేజోవిశేషేణ అనియు, తదన్వీక్ష్య ప్రయుంజానః సీదత్యవరః అనియు నిర్ణయము చేయబడెను. ఇంకను సాహసంచ మహతామ్ అను వాక్యమునకు తంత్రవార్తికములో గూడ **ప్రజాపతీంద్ర వసిష్ఠ విశ్వామిత్రా యుధిష్ఠిర కృష్ణద్వైపాయన... బహూనా మన్యత మానాంచ** అని వివరణము చేయబడెను.

బహూనా మద్యతమానాం అను దానిని వివరింపుచు

దాక్షిణాత్యానాం మిత్రస్వజనోచ్ఛిష్ట భోజన సర్వ వర్ణ పరస్పర దృష్ట తాంబూలాదనతదత్యయా నాచమన నిర్ణేజ కరాధౌత గర్ధభారూఢ వస్త్ర పరిధాన బ్రహ్మహత్యాతి రిక్త మహాపాతక కరణాని ఉభయేషామితి స్థూలాని ప్రతిపురుషజాతి కులావస్థిత సూక్ష్మ ధర్మన్యతిక్రమణాని సంభవంతీతి నైవజాతీయ మిశ్ర సదాచారస్య ధర్మత్వాధ్యవసాయ సంభవః అనగా దాక్షిణాత్య బ్రాహ్మణులు తమ మిత్రుల యొక్కయు స్వజనము యొక్కయు ఉచ్ఛిష్టము (ఎంగిలి) భుజించుటయు, అన్ని వర్ణముల వారితో గలసి వారు చూచుచుండగా తాంబూల చర్వణము చేయకుండుటయు, చాకలి వాళ్ళుతికి గాడిదెల మీద వైచి తెచ్చిన బట్టలను తడుపకుండ ధరించుటయు, బ్రహ్మ హత్య తప్ప మిగిలిన **సురాపానస్తేయ గుర్వంగనాగమనముల** నాచరించుటయు, ఇట్టి స్థూలానాచారములే కాక ప్రతి పురుష నియతముగా చేయు సూక్ష్మమగు జాతి కుల నిబంధన వ్యతిక్రమము లెన్నో సంభవించుచున్నవి. కాబట్టి అట్టి పూర్వాధునాతనాచారములను ధర్మముతనుగా నిశ్చయించుట తగదు అని చెప్పబడెను. ఇట్లు అతివిశదముగా ధర్మవ్యతిక్రమ సాహసాదులు వివరింపబడియుండగా పరమ వైదికోత్తములగు నాథ యామునాద్యాచార్య శ్రేష్ఠుల ఆచరణముల విషయమే ఎత్తబడకుండుట వలన వారి విషయములో తేషాం తేజో విశేషేణ అను వచనమును సమన్వయింపబోవుట అతిసాహసమనక తప్పదు.

మహాత్ముల చర్యాసూక్తుల మహిమ

పరమ వైదికులగు మహాత్ములు ఏయే విధముగా అనుష్ఠితురో అదే సదాచారమనియు, సచ్ఛాస్త్ర పరిశీలకుల కంత కంటె విరుద్ధమైన ధర్మముల యందు మనస్సు పొందదనియు, అట్టి మహాత్ములు వేదాది సచ్ఛాస్త్రష్టానములు కలవారై వారికిష్టమైనదిగా నుండు ధర్మమునెద్దానిని చెప్పెదరో అదియే సకల శ్రుతి స్మృతీతిహాస పురాణ సిద్ధాంతమనియు సదృష్టాంతముగా తంత్రవార్తికములో నిర్ణయించి చెప్పబడెను. ఎట్లనగా,

యోహిసదాచారః పుణ్యబుద్ధ్యా క్రియతే సధర్మాదర్శత్వం ప్రతిపద్యతే
వైదికానాంతు ధర్మధీ సంస్కృతాత్మనామాత్మ తుష్టే ప్రమాణత్వం సిద్ధమ్
ధర్మ ప్రసిద్ధయే బహుకాలాభ్యస్త వేద తదర్థజ్ఞానాహిత సంస్కారాణాం
వేదనియత మార్గాను సారి ప్రతిభానాం నోన్మార్గేణ ప్రతిభానం సంభవతీత్యా శ్రిత్యోచ్యతే
యదేవకించానూచానో భ్యూహతి అర్థంతద్భవతి
వైదిక వాసనాజనితత్వాద్వేద ఏవ భవతి తథాహి
యథారుమాయాం లవణాకరేవామే రౌయథైవోజ్జ్వల రుక్మభూమౌ ।
యజ్జాయతే తన్మయమేవతత్స్యాత్తథా భవేద్వేద విదాత్మతుష్టిః
బహుదినాభ్యస్త ధర్మవ్యాప్తాత్మనోహి నకథంచిద్ధర్మకరణ
రూపాత్మతుష్టి రన్యత్రసంభవతీతి ధర్మత్వే నాను జ్ఞాయతే
యద్వా శిష్టాత్మతుష్టీనాం వచనాదేవ ధర్మతాః
పుణ్యకృద్ధానవత్తస్మాదాచారేష్వ పిసాతథే ॥
యథావావరదానాదౌ దేవతారాథనోద్భవే ।
.... యథా చ యాంభువం కశ్చిదధ్యావసతి పుణ్యకృత్ ।
తత్సంపర్క పవిత్రత్వా త్సేష్యతే పుణ్యకారణామ్ ॥
తథాచారాత్మతుష్ట్యాది ధర్మం ధర్మమయాత్మనామ్ ।
వేదోక్తమితి నిశ్చిత్య గ్రాహ్యం ధర్మబుభుత్సుభిః ॥

అని విపులముగా వివరింపబడెను. దాని సంగ్రహభావమును తెలిపెదము. ఏ సదాచారము పుణ్య బుద్ధితో చేయబడునో అది ధర్మమున కాదర్శ ప్రాయమగుచున్నది. వేద ధర్మతులయి ధర్మబుద్ధిచే సంస్కృతులైన వారికి ఆత్మతుష్టి కలిగినదే ప్రమాణమగును. ధర్మమును తెలిసికొనుటకు చిరకాలము వేదముల అర్థమునభ్యసించి అజ్ఞానము వలన కలిగిన సంస్కారము కలవారే వేద నిర్ణీతమైన మార్గమును అనుసరించిన నవనవోన్నిషిత ప్రజ్ఞ కలవారు అడ్డు వారిని బోవు జ్ఞానము కలిగియుందురని నిశ్చయించియే వంశపారంపర్య జ్ఞానము గల వారేది యూహింతురో అది ఋషి వచనము వలె ప్రమాణమగునని చెప్పెదరు. వారు చెప్పినది వైదిక వాసన వలన చెప్పబడుట చేత వేదతుల్యమే అగును ఏమనగా, ఉప్పు పట్ల యందును ఉప్పు సముద్రమందును పుట్టునవి లవణమయములైనవి గానే ఉండును. ఉజ్జ్వలమైన మేరు పర్వత స్వర్ణభూముల యందు పుట్టినవి స్వర్ణ మయములాగనే ఉండును. అట్లే వేద వేత్తల బుద్ధికి తోచిన వాని వలె మలినములుగా నుండవు. చాలా కాసము నుండి అభ్యసింపబడిన ధర్మస్వరూపము చేత నిండియున్న మనస్సు కల వానికి

చెడ్డ ధర్మముల యందు తుష్టికలుగనేరదు. అందువలన వారాచరించునది ధర్మముగా నంగీకరింపబడెను. శిష్టులగు వారికి సంతుష్టికరముగా నుండునవి వారి వచనము చేతనే ధర్మములగును. ఎట్లనగా పుణ్య వృత్తులు ఎట్లు ధ్యానించిననట్లే ఫలము కలుగును కదా. అట్లే ఆచారమందు గూడనని తెలియదగును. దేవతలు ఆరాధింప బడినందువలన వరదానాదులెట్లు కలుగునో అట్లే మహాత్ముల భావన వలన ఆచరణకు ఫలము కల్గును. పుణ్యము చేసిన వాడెట్లు తత్తత్పుణ్యానుగుణమైన లోకము నందు నివసించునో అట్లే శిష్టుల సంపర్కము వలన పవిత్రమైన ఆ ఆచరణమే పుణ్యమునకు కారణమై పుణ్యలోకావాప్తిని కల్గించును. ఆ విధముగా సాధువుల ఆచారమందును ఆత్మ తుష్టియందును ధర్మముండును. ధర్మాత్ములగు శిష్టుల యొక్క ధర్మమే వేదోక్తమని నిశ్చయించి ధర్మము నెఱుగగోరు వారు దానినే గ్రహింపవలెను అని భావము. ఇందు సదాచరణ సూక్తులకు కల మహిమలో ఉదాహరణముగా అన్వయ వ్యతిరేకములతో రుమాలవణార్ణవజనితత్వము మేరు సువర్ణ భూజనితత్వములను అసదాచరణ సదాచరణములకు భేదముండుటలో వివరింపబడెను. అందువలన సకల వేదవేదాంతాది శాస్త్ర ప్రతిపాదిత జ్ఞానానుష్ఠానములు కలిగి సకల ధర్మ పరిశీలకులై తదనుష్ఠాన పూర్ణులై బ్రహ్మ విదుత్తములగు శ్రీనాధయామున యతివరాదులగు అస్మదాచార్యుల చేత అనుష్ఠింపబడి బోధింపబడిన విశేష ధర్మముల యందు విప్రతిపత్తిని పెట్టుకొని వాదించు వారి వాక్యములు గ్రాహ్యములు కావు.

దృష్టా దృష్టపరుల ఆచరణకుండు గ్రాహ్యాగ్రాహ్యతలు

అదృష్టమునే నమ్మి సాధువులై యుండు వారి ఆచరణము వైదికులు గ్రహింపతగియుండుననియు శిష్టులైయుండియు నొకప్పుడు కామ క్రోధాదులకు వశులై స్వశరీర రక్షణ సుఖాదుల యందాసక్తులై దాని వలన అర్థార్జనదాలు యందు నిరతులై యుండువారు ఏవైన కొన్ని ఆచరణములు సలిపినచో వాని యందు వైదికుల కాదరముండకూడదనియు తంత్ర వార్తికములోనే చెప్పబడెను. ఎట్లనగా

దృష్ట కారణహీనాని యాని కర్మాణి సాధుభిః ।
ప్రయుక్తాని ప్రతీయంతే ధర్మత్వే నైవ తాన్యపి ॥
ధర్మత్వే వాప్రపన్నాని శిష్టైః యానిచకానిచిత్ వైదికైః
కర్తృసామాన్యాత్తేషాం ధర్మస్సమీక్ష్యతే ॥
శరీర స్థితయేయాని సుఖార్థం వా ప్రయుంజతే ।
అర్థార్థం వానతేష్వస్తి శిష్టానామేవ ధర్మధీః ॥

అని చెప్పబడెను. అట్లే ఆపస్థంబ ధర్మములలో గూడ

నేమం లౌకిక మర్థం పురస్కృత్య ధర్మాంశ్చరేత్ నిష్ఫలాహ్యాభ్యుదయే భవంతి అని చెప్పబడెను. ఇట్టి శాస్త్ర సమ్మతి యుండుటను బట్టియే

వేదో ఖిలో ధర్మమూలం స్మృతిశీలే చ తద్విదామ్ ।
ఆచారశ్చైవ సాధూనాం మనసస్తుష్టిరేవచ ॥

అనగా వేదమంతయు ధర్మమునకు మూలమైయున్నది. స్మృతులును వేదవేత్తలగు వారి సచ్చరితమును అట్లే ధర్మమునకు మూలములు. అట్లే సాధువులగు వారి ఆచరణమును ఆ యాచరణమందు మనస్తుష్టియు గూడ ధర్మమునకు మూలములు అని చెప్పబడెను. దీనిని బట్టియే

యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరోజనః,

ప్రఖ్యాతదైవపరమార్థ విదాం మతైశ్చ

పూరువర్గళ్ శీర్తనివై తన్నైనెంజేశేర్

అను ప్రమాణ వచనములు పుట్టినవి. ఇంకను శ్రుతి స్మృత్యాదుల యొక్క యథార్థజ్ఞానము ఇట్టిదని నిశ్చయించుట దుర్లభము గాన తదర్థ జ్ఞానము కలిగి తదనుకూలానుష్ఠానము గల పెద్దలయొక్క ఆచరణమునే ఆస్తికులగువారు అందఱును పరిగ్రహింపవలెననియు వారే యేధర్మములను గర్హింతురో వానిని అధర్మములుగానే తలంచవలెననియు ఆపస్థంబ ధర్మసూత్రములో చెప్పబడెను. ఎట్లనగా **యత్త్వార్యాః క్రియమాణం ప్రశంసన్తి సధర్మోయద్గర్హన్తేసో ఒ ధర్మః** అని అస్మత్పూర్వాచార్యులకాచార్యత్వ పూర్తి

ఆచార్య లక్షణము ఆపస్థంబ ధర్మములలో నిట్లు చెప్పబడెను.

సర్వజన పదేష్వేకాన్త మాహిత మార్యాణాం

వృత్తం సమ్యగ్వినీతానాం వృద్ధానా మాత్మవతా

మలోలుపానా మదాంభికానాం వృత్త సాదృశ్యం భజేత అని,

దీనికి హరదత్తుడు వ్యాఖ్యానము చేయుచు ఉజ్జ్వలలో చెప్పిన దానికనువాదమిది.

శ్రుతి స్మృతులు ప్రత్యక్షముగా కానరాకుండినప్పుడు శిష్టాచారము వలన ధర్మమును తెలిసికొని ఆచరింపవలెనని చెప్పుచున్నారు. అని యారంభించి సమ్యగ్వినీతానామ్ = ఆచార్య ధీనులై వినయ సంపన్నులైనవారు, వృద్ధానాం = పరిణతమైన వయస్సుకలవారు, ఆత్మవతాం = విజితేంద్రియులు, అలోలుపానాం = లుబ్ధులు కాని వారు, అదాంభికానాం = ధర్మము తమకే తెలియునని డాబుచేయనివారు. ఇట్టి ఆచార్యుల యొక్క సర్వ గ్రామముల యందు ఒకే విధమైన అనుమతి కలిగిన అనుష్ఠానమేది కలదో దానినే అవలంబింపవలెనని వివరించెను. ఇట్టి సదాచార్య లక్షణము అస్మత్పూర్వాచార్యులగు నాథయామున యతివరాదుల యందే పూర్ణముగా నున్నది. ఈ విషయమున

"ఋషింజుషామహే" "భూయోనమో ఒ పరిమిత"

"యత్పదాంభోరుహధ్యాన " "యోనిత్యమచ్యుత పదాంబుజ",

"వందే వేదాంత కర్పూర", "శ్రీవత్సచిహ్నమిశ్రేభ్యః" "నిరవధిక నిగమాంత "

ఇత్యాదిగా వారి వారి ప్రభావములు వ్యక్తమగు వచనములే తార్కాణములై యున్నవి.

పూర్వాచార్యుల సదాచార ప్రచారము

అందువలన అట్టి సదాచార్యత్వ పూర్తిగల అస్మత్పూర్వాచార్యులు భగవద్గుణానుభవైక పరులై తత్కైంకర్యరతులై యుండి సర్వోజ్జీవనార్థము తామాచరించి బోధించిన శ్రీవైష్ణవ బ్రహ్మవేత్తలగు గృహస్థ యత్యాద్యన్యోన్యాభివందన బహువిధమాధుకర వృత్తి మఠాధిపత్యములను ధర్మములు నేటివఱకు తచ్ఛిష్య పారంపర్యముగా నడుచుచున్నవి. ఇవియన్నియు వైదికోత్తమ గోష్ఠినిష్ఠులగు శ్రీవైష్ణవ యతిగృహస్థాదులకందఱికిని పరిగ్రాహ్యలములనుటలో సందేహమక్కరలేదు. ఇంకను ఈ విషయములో

యే నైవ పితరోయాతా యేనయాతాః పితామహాః ।

పితామహైరాచరితం తథైవ ప్రపితామహైః ॥

అవశ్యం పితురాచారం పుత్రస్తమనువర్తతే

అని మనువు సమ్మతినిచ్చి యున్నాడు. పితురాచారమనగా సాత్విక స్మృతి పురాణోపబృంహిత శ్రుతి సమ్మతమైన పిత్రాచారమని అభిప్రాయము. పితృపితామహాదులిచ్చట దేహబంధువులగు తండ్రి, తాతలను అర్థము కాదు. సదాచార్య పరంపరలోని ఆచార్య పరమాచార్యాదులే అని తెలియవలెను. అట్లే పుత్రః అనగా దేహ సంబంధియగు పుత్రుడర్థము కాదు.

సహి విద్యా వస్తం జనయతి, తచ్ఛ్రేష్ఠం జన్మ అని చెప్పిన రీతిని శిష్యరూప పుత్రుడని అభిప్రాయము కాబట్టి **ధర్మజ్ఞ సమయః ప్రమాణం వేదాశ్చ** అని విశిష్టాచారమునకు అభ్యర్హిత ప్రామాణ్యమివ్వబడినది.

యతుల నిర్యాణానంతర ఖననాదికముల విచారణము

యతి ధర్మ సముచ్చయము పదునొకండవ పర్వమందు

బ్రహ్మనిష్ఠేమృతే తస్మిన్ఖనేత్పుత్రో ఽథవాగృహీ ।
తస్యతేనైవ కర్తవ్యో నారాయణ బలిస్తథా ॥
నవహ్నిర్నోదక శ్రాద్ధం నాపి బ్రాహ్మణ తర్పణమ్ ।
సర్వం నారాయణోద్ధిష్ఠ మేకోద్ధిష్టవదాచరేత్ ॥ (వృద్ధయాజ్ఞవల్క్యః)
కర్మనిష్ఠేతుసన్యస్తే పితుర్యుపరతేసుతైః ।
దహనం తస్య కర్తవ్యం శ్రాద్ధ పిండోదక క్రియాః ॥
... శ్రాద్ధం నారాయణార్పణమ్ ।
బలిమేకాదశే న్యేషాం కుర్యాద్దర్శేస పిండతామ్ ॥ (మనుః)

అనగా బ్రహ్మనిష్ఠుడగా శ్రీవైష్ణవ సన్యాసి నిర్యాణ మొందిన తరువాత ఆ యతికి పూర్వాశ్రమములోటన కుమారుడుండిన అతడుగాని లేనిచో మఱియొక గృహస్థుడు గాని ఖనన సంస్కారమును చేయవలెను. తరువాత నాతడే నారాయణబలి అను వైష్ణవారాధనమును చేయవలెను. శ్రాద్ధవిధిలో చెప్పబడిన అగ్నిహోత్రహోమము గాని ఉదక దానాదులు గాని బ్రాహ్మణ భోజనమును గాని చేయనక్కర లేదు. సర్వము శ్రీమన్నారాయణోద్దేశముగా ఏకోద్ధిష్ట విధానము వలె చేయవలెను అని వృద్ధ యాజ్ఞవల్క్య స్మృతిలో గలదు. ఇక కర్మనిష్ఠుడైన సన్యాసికి కుమారులు దహన సంస్కారమును చేసి శ్రాద్ధ ప్రక్రియతో పిండోదక క్రియల నాచరింపవలెను పదకొండవ నాడు నారాయణార్పణ రూపముగా నేకోద్ధిష్ట ప్రక్రియతో శ్రాద్ధము చేసి అమావాస్య నాడు సాపిండ్యమును చేయవలెను. అని మనువు చేత చెప్పబడెను. అని యున్నది. సామాన్యముగా మృతులైన వారికి వారి కళేబరమును ఖననము చేయుట (ప్రాతి వేయుట), దహనము చేయుట (కాల్చుట), త్యాగము చేయుట (ప్రాతి వేయుట) అను మూడు విధానములు లోకములో నున్నవి. అందు దహన సంస్కారము ఎక్కువ మందికి జరుగుచున్నది. ఖననమునకు కూడ కొంత శైవాదులలో ప్రచారము కలదు. త్యాగము నీచముగా తలంచబడుచున్నది. అద్వైత యతుల కళేబరమును నదులలో పారవేయుట కలదు. ఇకపై ప్రమాణ వచనములను బట్టియు ఆచారమును బట్టియు శ్రీవైష్ణవ సన్యాసుల కళేబరమును ఖననము చేయుటయే ప్రహతముగా నున్నది. శ్రీవైష్ణవ యతులు ఆశ్రమోచిత నిత్యకర్మలను భగవదాజ్ఞా కైంకర్య రూపముగా నాచరించుట శిష్టాచార సిద్ధము అయితే అట్టి యతులకు అగ్నితో దహన సంస్కారమునే మనువచనానుసారము

ఈక్రింది విధానము చొప్పున చేయవలసి యుండునని తోచుచున్నది.

అథపుత్రో గృహస్థోవా యతి సంస్కార మాచరేత్ ।

అగ్ని ముత్పాద్య …… ఖాత్వావ్యాహృతిర్భూమిం దండాయామ ప్రమాణకమ్ ।

…. యాజ్ఞికైర్ధారుభి స్తత్ర చితాంకృత్వా శుభై స్తథా ।

దేహం ప్రక్షాళ్య సావిత్ర్యా చితాయాం తం వినిక్షిపేత్ ॥

అగ్నినా చ దహేత్తేన నాస్తి కర్మోదకాదికమ్ ।

గచ్ఛంత మను గచ్ఛంతి వహంతి చ దహంతి చ ॥

స్నాన మాత్రేణ శుద్ధాస్యు రశ్వమేధ ఫలం లభేత్ ॥

తస్యయే భాంధవా స్తేషాం సద్య సద్య శ్శౌచం విధీయతే । (వృద్ధయాజ్ఞవల్క్య)

అనగా మృతి నందిన సన్యాసికి పూర్వాశ్రమ పుత్రుడు గాని ఇతర గృహస్థుడు గాని అగ్ని సంస్కార మాచరించుటకు ముందు మథనాగ్నిని సిద్ధము చేసి సంస్కార భూమి యందు వ్యాహృతి (ఓం భూర్భువస్సువః) జప పూర్వకముగా దండ ప్రమాణము (రెండు గజములు) వెలుపు పొడవున గోతిని త్రవ్వి అందు యజ్ఞార్హములగు చంద్ర, మోదుగు మొదలగు కట్టెలతో చితిని పేర్చి మృతదేహమును గాయత్రీ మంత్రముతో స్నానము చేయించి ఆ చితిమీద నుంచి పూర్వము సిద్ధపరచిన మథనాగ్నితో దహింపవలెను. పైతృకర్మాదిక మేమియు చేయనక్కరలేదు. ఇక మృత కళేబరము వెంట వచ్చినవారును, వహించిన వారును, దహించిన వారును గూడ స్నాన మాత్రము చేతనే శుద్ధులగుదురు. వారికశ్వమేధ ఫలము కలుగును. ఇక సన్యాసి యొక్క పూర్వాశ్రమ సపిండాది బంధువులకు గూడ వెంటనే స్నానము వలన శుద్ధికలుగును. అశౌచముండదు, అని ఈ ప్రకారము వివరింపబడి యుండెను. శ్రీవైష్ణవ యతులకు పై విధముగా అగ్ని సంస్కారమే విహితమని తోచినను బ్రహ్మ నిష్ఠేమృతే, ఇత్యాది వృద్ధయాజ్ఞవల్క్య వచనానుసారముగా ఖనన సంస్కారమే ఆచరింబడుచుండుటకు సకల ధర్మజ్ఞులగు శ్రీనాథ యామునాది పూర్వాచార్యుల ఆచరణమే మూలము. పూర్వాచార్యుల అభిసంధియేమనగా కుటీచకాది చతుర్విధ యతులును కర్మ బ్రహ్మ నిష్ఠులే, అయినను వారాచరించు ఆశ్రమోచిత కర్మము బ్రహ్మ నిష్ఠకంగముగా భగవదాజ్ఞా కైంకర్య రూపమే. కాబట్టి వారు కర్మనిష్ఠులు కాజాలరు. బ్రహ్మ నిష్ఠులే అగుదురనియే. కాబట్టి అట్టి శిష్టాచార ప్రకారము నేటి వఱకును అటులనే ఖనన సంస్కారమే జరుపబడుచున్నది. ధర్మజ్ఞ సమయః ప్రమాణం అని కదా శాస్త్రము, ఇక మను వచనానుసారముగా చేయు దహన సంస్కారము కుటీచకాదులకుండు కర్మాచరణ భేదముననుసరించి ఇతర యతుల విషయమని తెలియవలెను.

శ్రీవైష్ణవ యతి మరణమున కర్తవ్యము

పైని వివరించిన కర్మ బ్రహ్మోభయ నిష్ఠులగు శ్రీవైష్ణవ యతులు నిర్యాణమును పొందినప్పుడు స్పర్శ దోష సూతకాదులు లేవని యీ క్రింది ప్రమాణ వచనము చెప్పుచున్నది.

భిక్షో ప్రాణ వియుక్తస్య ద్రష్టూణాంచానుయాయినా।

మహాపాపాని నశ్యంతి విష్ణు సందర్శనాద్యథా ॥

న సూతకాగ్ని సంస్కారః నార్ద్ర వస్త్ర జలాదయః ।

నైకోదిష్టం షోడశాని న సాపిండ్యం న మాసికమ్ ।

యతీనాం మరణే ప్రాప్తే స్పృష్ఠా త్స్పృష్టిర్నవిద్యతే ।

ఆశాచ బుద్ధ్యా యః స్నాతి స మూఢో నరకం వ్రజేత్ ॥

జ్ఞాతి పుత్ర కళత్రాణాం యతీనాం మరణే సతి ।

నా శౌచం నోదకం కార్యం స్నానమప్యాచరేన్నతు ॥

అనగా యతి మరణించినచో ఆ మృత శరీరమును చూచిన వారికిని ఆ శరీరముననుగమించిన వారికిని (మృత దేహముతో వెళ్లినవారికి) పావనమగు విష్ణుదర్శనాను గమనముల చేత వలె పాపములు పోవును. యతి మరణములో పూర్వాశ్రమ జ్ఞాతులకు సూతకముండదు. మృతదేహమునకు దహస సంస్కార మక్కర లేదు. వాసోదకాదులు ఏకోదిష్ట షోడశ సాపిండ్య శ్రాద్ధములవసరము లేదు. స్పృష్ట స్పర్శ (ముట్టుకొనిన వారిని తాకుట) వలని దోషము లేదు. అట్లు తాకినందుకు అశౌచము కలిగెనని స్నానమాచరించు మూఢునికి నరకము కలుగును. యతి యొక్క పూర్వాశ్రమ జ్ఞాతులకు పుత్ర కళత్రాదులకు యతి మరణము వలని అశౌచముండదు. ఉదక దానము చేయనక్కర లేదు. పరోక్షములో స్నానము కూడ చేయనక్కరలేదు అని తాత్పర్యము ఇక యతి యొక్క మృతదేహమును స్పృశించిన వారికి సద్య స్స్నానము వలననే శుద్ధికలుగునని ఈ క్రింది ప్రమాణము చెప్పుచున్నది.

యేవహంతి మహాత్మానం దృష్ట్వా స్పృష్ట్వా ద్విజాతయః ।

జలావగాహనా త్తేషాం సద్యశ్శౌచం విధీయతే ॥

ఖనన్వహస్పృశం శ్చాపి సంస్కుర్వన్ శుద్ధి మృచ్ఛతి ।

స్నాన మాత్రేణ అనగా యతి మృత దేహమును వహించినను ఖననమొనర్చినను స్పృశించినను చూచినను సంస్కార మొనర్చినను అట్టి వారు స్నానమాత్రము చేతనే శుద్ధులగుదురని భావము. అయినను అట్టి స్నానము యొక్క అవసరానవసరములు శాస్త్రములో రెండు విధములుగాను చెప్పబడినను భగవంతుని రథోత్సవానంతరము చేయు అవబృథ స్నానము వలె జంగమ శ్రీవిమానరూపమగు యతివరుల చరమ దేహమును స్పృశించుట మొదలగునవి చేసిన తరువాత చేయు స్నానము సకల ఫల ప్రదముగా నుండి ఆచరింపవలసినదని శ్రీవైష్ణవ సంప్రదాయము.

యతి సామాన్యమున కపర కర్మ భేదము

యతులకు ఖనన సంస్కార మందలి లవణ పూరణాది సంసారవిధిలో

పుత్రోవా న్యోవా శిష్యోవా అని చెప్పబడెను. అనగా పూర్వాశ్రమ పుత్రుడుగాని ఇతర గృహస్థుడు గాని శిష్యుడు గాని ఆ సంస్కారమును చేయవలెనని తాత్పర్యము. అయితచే అట్టి సంస్కర్తలు శ్రీనారాయణ బలికి పూర్వదినమందు ఏకాహ శ్రాద్ధము చేయవలెనను విధి కనబడుచున్నది.కాని అట్టి ఏకాహము పుత్ర భిన్నులగు వారు చేయనక్కర లేదు అని శాస్త్రము చెప్పుచున్నది. ఎట్లనగా

అహన్యేకాదశేప్రాప్తే పార్వణంతు విధీయతే ।

సపిండీకరణం తేషాం సకార్యంతు సుతేనవై ॥

దశాహేతు వ్యతిక్రాంతే పుత్రః కుర్యాత్తు పార్వణమ్ ।

ప్రత్యబ్దం పార్వణం కుర్యాదేష ధర్మ స్సనాతనః

పూర్వాశ్రమస్యచైకాహే గోత్ర నామాది పూర్వకమ్ ।

స్వగృహ్యోక్త విధానేన పుత్రః కుర్యాత్తు పారణమ్ ॥

అని యిట్లు పూర్వాశ్రమ పుత్రుని విషయములో చెప్పబడెను.

ఇక ఏకోద్దిష్టం న కర్తవ్యం న్యాసినాంతు కథంచన ।

నైకోద్దిష్టం షోడశం చ న సాపిండ్యం న మాసికమ్ ॥

అని పుత్రభిన్న గృహస్థ శిష్యాదుల విషయముగా శౌనక వచనమును సమన్వయించవలెను. లేనిచో విరోధము వచ్చును, మఱియు పుత్రులు ఏకాహము శ్రీనారాయణ బలి ఆచరించునప్పుడు ఆత్మాం తరాత్మ పరమాత్మా అను క్రమముతో త్రయోదశ యతులను గూర్చి **అముష్యయతే ర్నారాయణస్య** అనియే భోక్తృ వరణాదికము నాచరింపవలెను.

అహన్యేకాదశే ప్రాప్తే పార్వణంతు విధీయతే ।

సర్వం నారాయణోద్దేశ్య మేకోద్దిష్టవదాచరేత్ ॥

అను వచన మిందు ప్రమాణమైయున్నది.

విదేశస్థ యత్యాది మరణ శ్రవణానంతర కర్మానుష్ఠాన ప్రకారము

దేశాంతరే మృతానాం చ హతానామన్య సాధనైః ।

జీవ శ్రాద్ధ కృతానాం చ నైష్ఠికానాం తథైవ చ ॥

యతీనాం యోగినాం చైవ అన్యేషాం మోక్షకాంక్షిణామ్ ।

పుణ్యపాప క్షయార్థాయ ద్వాదశే ఽహని కారయేత్ ॥

సంవత్సరాత్పరం కుర్యా చ్చండాలా ద్యైర్హతస్య చ ।

ద్వాదశ్యాం శ్రవణే వాపి పంచమ్యాం చైవ పర్వణి ॥

పితుః స్వస్యగురోః కుర్యాన్నారాయణ బలిం శుభమ్ ।

తత్తిథిం శిష్య పుత్రాభ్యా మజ్ఞాతం మార్గశీర్షకే

ద్వాదశ్యాం శుక్లపక్షేతు స కుర్యాత్ప్రథమాబ్దికమ్ (సకుర్యాదాబ్ధికంపరమ్)

పుత్రోదేశాన్తరే శ్రుత్వా సిద్ధివార్తాంపితుర్యతే ।

స్నాయాద్వపన పూర్వంతు నాశౌచం నోదక క్రియా ॥

నారాయణ బలిం కుర్యాద్ద్వాదశ్యాం తదనంతరం ।

న మాసికం నోదకుంభమబ్దాంతే పార్వణం చరేత్ ॥

అని శౌనకీయ వచనములు గలవు దీని భావము. గృహస్థులగు వారును యతులును, నైష్ఠిక బ్రహ్మచారులును, యోగులు (వానప్రస్థులు) ఇంకను మోక్షార్థులగు ఆచార్యాదులును విదేశమందు మరణించినట్లు వినినను, శస్త్రాది సాధనముల చేత హత్యగావింపబడినట్లు వినినన అట్టిచ వారికిని, అది వరకే విదేశ గమనము చేసి వార్త తెలియక కాలాతిక్రమణ మగుట చేత శ్రాద్ధకర్మలు చేసి వేయబడి యుండి తిరిగి వారి మృతిని వినిన పితరులకును పుణ్య పాపక్షయము కొఱకు పుత్ర శిష్యాదులు మృతి వార్త తెలసిన పండ్రెండవ నాడు శ్రాద్ధ కర్మ నాచరింపవలెను. చండాలాదుల చేత చంపబడిన వారికి ఒక సంవత్సరము గడచిన పైని

శ్రాద్ధము చేయవలెను. ఇక యతులను గురించి పూర్వాశ్రమ సుతుడు గాని శిష్యుడు గాని ద్వాదశి యందైనను శ్రవణ నక్షత్రమందైనను పంచమి యందైనను పర్వదినమందైనను నారాయణ బలి నాచరింపవలెను. మృత తిథి తెలియనప్పుడు మార్గశీర్ష శుక్ల ద్వాదశి యందు ప్రథమాబ్ధికమును చేయవలెను. పుత్రుడు తండ్రి యగు యతి దేశాంతరములో మరణించిన వార్తను వినిన వెంటనే క్షౌరమయి స్నానము చేయవలెను. అశౌచ ముఃడదు. ఉదక దానాదులు చేయనక్కర లేదు. తదనంతర ద్వాదశి నాడు నారాయణ బలిని మాత్రము చేయవలెను. మాసికములు ఉదకుంభ శ్రాద్ధము వత్సరాంతమున పార్వణ క్రియ ఇవియేవియు చేయనక్కరలేదు అని తెలియుచున్నది. ఈ విధి యంతయు ఆచార్యుని విషయములో శిష్యునకు గూడ సమానమే. ఆచార్యుని విషయములో శిష్యుడు తిథిని జరిగించునప్పుడు పార్వణ విధానముతో గాని సంకల్ప విధానముతో గాని చేయక కేవల భగవద్భాగవత సమారాధన రూపముగా నాచరింపవలెను. పుత్రః కుర్యాత్తు పార్వణమ్, ప్రత్యబ్దం పార్వణం కుర్యాత్ అనియే విధియుండుట చేత శిష్యునకది వర్తింపదని తెలియవలెను.

శ్రీవైష్ణవ గృహస్థ యత్యాదుల వైలక్షణ్యము

శ్రీవైష్ణవులగు గృహస్థుల మృతియందు పుత్రుడు వృషోత్సర్జనము చేయవలెనను సామాన్య విధియు, శ్రీవైష్ణవ యతులు ఇతరులకు ప్రతి ప్రణామము చేయకూడదను విధియు అనేక విశిష్ట ప్రమాణముల చేత ప్రతి హతములగుటచే నవి అనాచరణీయములని తెలియవలెను. అనగా శ్రీవైష్ణవ గృహస్థుల మృతిలో వృషోత్సర్జనము చేయకూడదు. అట్లే శ్రీవైష్ణవ యతులు గృహస్థాదులకు ప్రతి ప్రణామము చేయవలెను. అట్లే పైని వివరింపబడిన సామాన్య విధులన్నియును శ్రీవైష్ణవుల విషయములో వర్తింపవు. ఇంకను శంఖ చక్రాది లాంచితుడై భగవత్ప్రపన్నుడగు శ్రీవైష్ణవునకు రథ్యాంగణాది మృతియు, దౌష్కుల్య సంబంధమును మొదలగు వాని వలన కలుగు దోషములుండబోవని ఈ క్రింది ప్రమాణములు చెప్పుచున్నవి.

యస్తప్తశ్శంఖ చక్రాభ్యాం సయాతి పరమాం గతిమ్ ।
రథ్యాంగణే మూత్రపురీష మధ్యే చండాల వేశ్మస్యథవాశ్మశానే ।
కృత ప్రయత్నో ఽ ప్యకృత ప్రయత్నో దేహవసానే లభతే చ ముక్తిమ్ ॥
దౌష్కుల్య మాధిం విధునోతి శీఘ్రం మహత్తమానా మభిధానయోగాత్ ॥   ఇత్యాదులు

యతులకు పుత్రాదుల యందలి ప్రతిపత్తి

సామాన్యముగా యతులు
త్రిదండ గ్రహణం కృత్వాయః పుత్రజ్ఞాతి బంధుభిః ।
స్నేహాత్సంభాషణాత్కారం సయతిన్నరకం వ్రజేత్ ॥
సర్వ సంగ పరిత్యాగం కృత్వా పుత్రాదిభిస్సహ ।
కుతూహలేన యో భుంజన్ సయతిః పతితో భవేత్ ॥
సన్యాసధర్మ మాశ్రిత్య పునర్మోహాద్ధనాదికం ।
సంపాద్య దత్వా పుత్రాది బంధుభ్యః పతితో భవేత్ ॥
సర్వధర్మన్పరిత్యజ్యయతి ధర్మం సమాచరేత్ ।
యతి ధర్మాత్పరిభ్రష్ట స్సయతి న్నారకీ భవేత్ ॥

ఇత్యాది మహర్షి వచనములను అనుసరించి పుత్ర బంధ్వాదులతో సంభాషణాది కృత్యములను ఆచరింపరాదని నియమము కనబడుచున్నది. అయినను భగవద్ జ్ఞాన భక్త్యాది సద్గుణ సంపన్నుడై యుండు పుత్ర బంధ్వాదుల విషయములో శ్రీవైష్ణవ యతులు భగవదీయత్వ ప్రతిపత్తి చేసి సంభాషణాదులను వర్జింపనక్కరలేదు. అని విశేష ప్రమాణములుండుట చేత నానియమములు పాటింపనక్కర లేదు.

కణపురం కైతొళుం పిళ్లైయై పిళ్లైయెన్నెణ్ణి పెఱువరే అని కదా ఆళ్వార్ల శ్రీసూక్తి క్రమము. అయితే అట్టి భగవదీయత్వ బుద్ధితో కాక దేహ సంబందమును పురస్కరించుకొని పుత్రాదుల నాదరించుట మాత్రము తగదు. ఇట్లే అస్మత్పూర్వా చార్యుల అనుష్ఠానము కలదు.

యతుల త్రిదండ నిర్మాణాది ప్రకారము

ప్రసంగ వశమున యతుల త్రిదండ నిర్మాణాధికము చెప్పదము. పరమ విలక్షణులగు శ్రీవైష్ణవ యతులు వెనుక వివరింపబడిన యావత్సదాచారములను పరిశీలనా పూర్వకముగా గుర్తెరిగి తమ ఆచరణమును నడిపించుకొనవలసియున్నది. అందు త్రిదండధారణమొక పరమ విలక్షణ ధర్మము. అట్లు వారు ధరింప వలసిన త్రిదండము యొక్క లక్షణ మిట్లుండవలెను.

దండంతు వైణవం సౌమ్యం సత్వచం సమ పర్వకమ్ ॥
పుణ్యస్థాన సముత్పన్నం నానా కల్మష వర్జితమ్
అదగ్ధమహతం కీటైః పర్వగ్రంథి విరాజితమ్ ।
స్వయం భూతం తమేదిన్యాం శాఖావర్ణ మృజుం శుభమ్ ॥
నాసాదఘ్నం శిరస్తుల్యం కర్ణాంతం వాధరేద్యతిః ।
త్రిదండే న తు బధ్నీయాత్కౌపీనం కటివేష్టనమ్ ॥
విష్ణు రూపం త్రిదండాఖ్యం గృహ్ణీయాన్మోక్షదాయకమ్ ।
త్రిదండ గ్రహణా ద్విప్రో ముక్తో భవతి నాన్యథా ॥
సదారగ్రహనాద్బద్ధో నత్రిదండో మిముక్తిదః । పాంచరాత్రే

అనగా త్రిదండమునకు వెదురుకఱ్ఱ యుండవలెను. అది పొక్కులు లేనిదై పై తొక్క గీసివేయబడియుండవలెను. కణుపుల సమ పరిమాణములో నుండవలెను. నదీ తీరమందు గాని పర్వతముల యందు గాని స్వయముగా మొలచి ఎట్టి కల్మషము లేక నిప్పుతో కాలక పురుగులు తొలవక నుండవలెను. సరియగు గ్రంథులతో గూడి చిలువలు వలువలు లేక వంకర లేకుండ నుండవలెను. అట్టి వెదురులతో (అంగుష్ఠ పరిమితి వలమునకు మించకుండు వానితో) యతి తన ముక్కు వఱకు గాని చెవి వఱకు గాని శిరస్సు వఱకు గాని పొడవుగలవిగానుండు మూడు దండములతో నిర్మించుకొనవలెను. త్రిదండమునకు కౌపీనము గాని కట్టుబట్టి గాని తగులనీయరాదు. శ్రీవిష్ణు రూపమై తత్వ త్రయ సూచకమగు త్రిదండమును యతులు మోక్షసాధనముగా ధరింపవలెను. త్రిదండమును ధరించిననే యతికి ముక్తి కలదు. లేనిచో లేదు. గృహస్తుడు ధర్మపత్నిని కలిగి యున్నందున నెట్లు బద్ధుడు కాజాలడో అట్లే యతి త్రిదండమును ధరించినచో ముక్తి లేనివాడుగా నుండబోడు అని చెప్పబడెను.

ఇంకను మూడు దండములకును బంధించవలసినట్టి సూత్రముల వర్ణ విభాగాదులను శాస్త్రములలో గుర్తించి శ్వేత రక్త నీల తంతువులను వాడవలెను. దండాగ్రమందు జలపవిత్రమనబడు చిన్న వస్త్ర ఖండము నెల్లప్పుడు బంధించి యుంచుకొనవలెను.

ఇట్లు శాస్త్రోక్త విధిననుసరించిన త్రిదండమును యతులు శిఖాయజ్ఞోపవీతములతో పాటు యావచ్ఛరీర పాతముగా వదలియుండకూడదని తెలియవలెను.

శ్రీరామానుజుల సర్వయత్యాదర్శత

పశుర్మనుష్యః పక్షీవాయే చ వైష్ణవ సంశ్రయాః । అనియు

యం యం స్పృశతి పాణిభ్యాం యంయం పశ్యతి చక్షుషా ॥

అనియు చెప్పబడిన విధముగా వైష్ణవ సంబంధము సర్వసముత్తారకము. అట్టి వైష్ణవులలో ఉత్తమోత్తములైన సదాచార్య పదమునకు ముఖ్యాదర్శ భూతులై యుండువారు శ్రీమద్రామానుజాచార్యులు అని ఇదివఱలో సదాచార్య నిర్ణయ ప్రకరణములో విపులముగా వివరింపబడి యుండెను. వారియాచరణమే నిఖిల శ్రీవైష్ణవులకు యతులకు ఆదర్శ ప్రాయమై యుండునను నంశము తచ్ఛిష్య ప్రశిష్య పరంపరగా శ్రీవరవరమునుల వఱకును ప్రసిద్ధము. కాబట్టి శ్రీరామానుజాచార్యుల ఆచరణమే సర్వయతులును అలవరచుకొని త్రిదండధారణాది సకల శ్రీవైష్ణవ యతిధర్మములను పాటింపుచుండవలెను.

శ్రీవైష్ణవయావద్ధర్మములలో వైదాంత ద్వయసారజ్ఞులై యుండు శ్రీయతిపతుల ఆచారమే శ్రీవైష్ణవులకందఱకును శిష్టాచారముగా నాదరింపదగినదని తత్సంబంధులందఱును తెలిసికొని ఆచరించి ఉజ్జీవింపవలెను. ఇదియే శ్రీవైష్ణవ సిద్ధాంతాచారముల నిర్ణయము.

శిష్టాచార ప్రామాణ్య నిర్ణయ ప్రకరణము ముగిసెను.

శ్రీమతే రమ్యజామాతృ మునీంద్రాయ మహాత్మనే ।
శ్రీరంగవాసినే భూయా న్నిత్యశ్రీ ర్నిత్య మంగళమ్ ॥
శ్రీరామానుజ గోపాల కృపాపాత్రాయ మంగళమ్
శ్రీనారాయణ రామానుజార్య యత్యాఖ్య ధీమతే ॥
శ్రీరామక్రతు నిర్వాహ చతురాయ మహాత్మనే
నారాయణాఖ్య యతయే నిత్య శ్రీర్నిత్యమంగళమ్ ॥

ఇట్లు శ్రీవైష్ణవ సిద్ధాంతచార నిర్ణయమున
ఆచార ప్రతిపాదకమగు రెండవ భాగము ముగిసెను.
✡ సర్వము సంపూర్ణము ✡
శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ